రామమోహన గ్రంథమాల ౧౯

బాపూజీ

ఆత్మకథ

తెలుగు పద్యము

అభినవ తిక్కన

తుమ్మల సీతారామమూర్తి చౌదరి

ప్రకాశకులు

రామమోహన గ్రంథమాల

యనమలకుదురు, విజయవాడ

రు ౧/-

మనవి

నేను ౧౯౨౦ నుండియు నోపినంతవఱకు బాపూజీ యడుగు జాడలలోఁ బయనించుచుంటిని. నాఁటంగోలెఁ గ్రమవికాసము నందుచున్న నా సాహితీ సామర్థ్యములను మహాత్ముని యాశయములకే యంకితముచేసితిని. 'ఆత్మార్పణ' మను కావ్యమును ఖండకావ్యములు మఱికొన్నియు నేతదనుభూతి జనితముల యని నుడువందగు.

౧౯౨౭ లో నా మిత్రుఁడు శ్రీ పోలిసెట్టి ఆదినారాయణగుప్త యానాఁడు వెలువడుచున్న గాంధిగారి యాత్మకథను నా దృష్టికిఁ దెచ్చి 'దీనిని బద్యరూపమున రచియించి నీ కవితాశక్తిని సార్థకపఱచుకొనుట లెస్సగదా' యని నన్నుఁ బ్రోత్సహించెను. అది నా తలకు మించిన పనియని యప్పటికి జంకితిని. కాని గుప్త వాక్కులు నామనస్సులో మాఱుమ్రోఁగుచునేయుండెను.

౧౯౩౨ అక్టోబరు రెండవ తేదిని నా కాణయాచియగు 'కావూరు'లో మహాత్ముని జన్మదినోత్సవమునఁ బాల్గొంటిని. ఆ పవిత్రదినముననే యీ రచనకు వన్నరంతర్వాణి ప్రేరించెను. నాఁడే కావ్యమునకు శ్రీకారముచుట్టితిని. ౭-౨-౩౪ తో మొదటిపాలు పూర్తిచేసితిని. కాని మహాత్మునివంటి వాఁడొఁచి తూఁచి వ్రాసికొన్న యాత్మకథను బద్యరూపమునఁ దీర్చుట దుశ్శక మనిపించినది. ఒకవేళ నెట్లో కృతకృత్యుఁడనైనను నా పడిన ప్రయాస మీ గద్యయుగమున లోకమున కెంతదనుక నుపకరించునా యని లోలోన మథనపడితిని. కలమాఁపితిని. సరియ. వ్రాసినదాని నేమిచేయవలయును? ౧౯౩౬ లో నచ్చొత్తించి ప్రజలయెదుట నిడితిని. తెలుఁగునాఁడు నాకృషిని గడుంగడు మన్నించెను. శ్రీరామలింగారెడ్డిగారివంటి విద్వద్విమర్శకు లయాచితముగా నాకృతిని బ్రశంసించుచు వ్రాసినలేఖ నానిరుత్సాహమును బటాపంచము చేసెను. వెంటవెంటనే ఆంధ్ర - మద్రాసు - అన్నామలై విశ్వవిద్యాలయము లీ కబ్బము నాదరించుటయు నాసంతృప్తికి హేతువయ్యెను. మఱియు ౧౯౩౯ లో నెల్లూరి వర్ధమాన సమాజపక్షమున మాన్యశ్రీ తిక్కవరపు రామిరెడ్డిగా రీకృతికి జరిపిన సత్కారముతో నా యానందము మిన్నుముట్టెను.

ఎట్లయిన నాత్మకథను సంపూర్తిచేయవలయునని యపుడు తీర్మానించుకొంటిని. కాని యనారోగ్యస్థితింబట్టి ముందడుగు వేయలేకపోయితిని.

ఇట్లుండఁగా ౧౯౪౭ లో నా కప్పికట్లయందు జరిగిన సమ్మానము నా కర్తవ్యమును గంటిమెదుటఁ బెట్టెను.

అప్పుడే మన్మిత్రులు శ్రీ నారు నాగనార్యకవిగారు వచ్చి యేది యెట్లున్నను నీవు బాపూచరిత్ర సాగించుట యవశ్యకర్తవ్యమని నొక్కిచెప్పుటయ కాక మరల నారంభము చేయించి మఱి వెళ్ళిరి. పట్టుదలతోఁ దొమ్మిదినెలలు పనిచేసితిని. దాదాపు రెండవ మూఁడవ భాగములు ముగిసెను. అంతలో జగమెఱింగిన తెగులుగొంటనైతిని. రచన మూలఁబడెను.

కాలము గడచుచున్నది. మూఁడు నాల్గేండ్ల మీఁదట శరీరమించుక చక్కఁబడియెను. దీనికీదోడు ౧౯౪౯ లో 'నిడుబ్రోలు' నం దఖిలాంధ్ర ప్రజాపక్షమున నా కవితా సరస్వతి కపూర్వ సమ్మానములు కనకాభిషేకాదులు జరుగుటతో నే నేనుఁగు నెక్కితిని. ఆనాఁడు 'గౌరవ మిచ్చి పుచ్చుకొనఁగాఁ దగినట్టిదియాట' నీకృతిని బాపూజీ నమ్మిన బంటునకు ఎర్నేని సుబ్రహ్మణ్యముగారి కా నిందుకొల్లులో నుడుగర కావించి కృతార్థుఁడ నైతిని. పదంపడి శేషించిన గ్రంథముం దీర్ప నడుముకట్టితిని. స్వాతంత్ర్య పర్వమగు ౨౬-౧-౫౧ తో నొడ్డెక్కితిని. ౨-౧౦-౩౨ మొదలిడిన యీ కావ్యమున కీనాఁటికి శాంతిపాఠము జరిగెను. ఈచేఁత కింత దీర్ఘకాలము చెల్లినను నిందు నా శ్రమించిన దినములు ౫౫౪ మాత్రమ.

ఈ కృతి సంపూర్తి కింత విలంబనము జరుగుటలో నేను గొంత బాధపడినను దానికి మించిన యానందమును సైత మిప్పు డనుభవించుచున్నాఁడను. మొదటి యూఁపులోనే యిది ముగిసినచోఁ గాలక్రమమునఁ బెరిఁగిన నా కవితా సంస్కారమున కిందుఁ దావుండెడిది కాదుగదా! నా కృతులన్నింట నుత్తమము, పవిత్రము నైన యీ కావ్యము నా సారస్వతానుభూతికి, నా తెనుఁగుఁదనమునకు మూఁదలగా రూపెత్తుట నా భాగ్యమని తలంతును.

ఈ నా రచనకు నాదరువైనకృతి పూజనీయులు వేలూరి శివరామశాస్త్రిగా రనువదించిన యాత్మకథ. ఇతరభాషానువాదములు కొంతవట్టు నా కుపకరించినను శ్రీ శాస్త్రిగారికే మిగుల ఋణపడితిని. వారికి వినయ పూర్వక ధన్యవాదము లర్పించు కొనుట నా కనిష్ఠ కర్తవ్యము.

ఇఁక మాననీయులు, విద్వత్సార్వభౌములు కట్టమంచి రామలింగారెడ్డిగారు— వీరి యాదరాభిమానములు నా పాలివి కానిచోఁ డీ కృతి యిట్లు సర్వాంగీణ శోభతో వెలువడునది కాదేమొ!

అది నా యదృష్టము - వీరు ౫-౨-౫౧ పీఠికను బంపిరి. ౧౨-౨-౫౧ తమ ఛాయాపటము నంపిరి.

అది నా దురదృష్టము - వీని నాకుఁ గల్గిన యుల్లాస రేఖలు చివురుదొడుగు చుండఁగనే వీరు దివంగతులైరి. నా కైనదేమి వేదనఁగూర్చిరి. సుఖదుఃఖాదిక ద్వంద్వము లెంత బలీయములు!

రెడ్డిగారు పరిపూర్ణులు. సమగ్రాకృతివహించిన నాకృతింజూడమి వీరి కొరకొరంత కాదు. ఆ నష్టియంతయు నాయది.

ఎందరెందరో మిత్రులు నా కనేకవిధములఁ గావించిన తోడ్పాటుతో నే నీ సముద్రము నీఁదఁగల్గితిని. వారి కందఱకును గృతజ్ఞతాపూర్వక వందనము లర్పించుకొందును.

విశ్వశ్రేయమున కీ నా యలంతికాన్క బాసటయై తెనుఁగుతల్లి కొక పూజాపుష్పమై నన్ను ధన్యుని గావించుఁగాక!

అప్పికట్ల
౧—౩—౫౧

వినీతుఁడు
తుమ్మల సీతారామమూర్తి చౌదరి

గ్రంథకర్త చిరునామా :—

అభినవతిక్కన

తుమ్మల సీతారామమూర్తి చౌదరి

అప్పికట్ల

via బాపట్ల, గుంటూరుజిల్లా.



తిలకరచన

భాషతో సమన్వయించిగాని భావ ముండదు. భావమును భాషయు నిరంతర సంయుక్తములు. కవి కాళిదా సన్నట్లు సర్వదా సమ్మిళితములు. "వాగర్థా విప సంపృక్తౌ" - మఱియు నొకవిశేషము. ఒకప్పుడు స్వచ్ఛందముగా ప్రభవిల్లిన భావమును కాలాంతరమున వేఱువిధమైన భాషచే ప్రదర్శింపఁ బూనుట యవివేకము. అవి నిరంత రైక్యమును జెందిన యేకప్రకృతి. పునశ్చరణసాధ్యమేకాని వేఱుపదములచేతను వేఱువిధములచేతను ప్రయోగింప సాధ్యము కాదు. అనఁగా ఆదిమమును అఖండమును నైనస్వారస్యము చెడనిరీతిని.

తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు ౧౯౩౬ వ సంవత్సరమున మహాత్ముఁడైన గాంధిగారి స్వీయచరిత్రమును తెనుఁగునఁ బద్యరూపమునఁ గొంతభాగమును బరివర్తించి ప్రచురించిరి. నేఁ డా మహనీయచరిత్రమును పూరించియున్నారు. ఈ సంపూర్ణమైన గ్రంథమునకు పీఠిక వ్రాయవలసినదిగ నన్ను కోరిరి. ఇట్టికోరిక లాజ్ఞలతో సమానములు. విషయము లోకోత్తరము. కవిత్వము అప్రతిమానము. కావున సమర్థత చాలకున్నను ఉల్లంఘింప నేరక యంగీకరింప వలసినవాఁడ నైతిని.

ఇరువదవ శతాబ్దపు టాదిని ఉత్తమశ్రేణికిఁ జెందిన యాంగ్లగ్రంథకారులలో మార్లీప్రభువుగా రొకరు. వారియాదేశ మే మనఁగా ఇట్టిసందర్భములందు మొట్టమొదట స్ఫురించిన భావములనే ఆభాషలోనే తెలుపుటయ సరియైన పద్ధతి యని. ఆ భాషాభావములకు తర్జుమాలను సృష్టించుట అకృత్రిమత్వమునకును పరిపూర్ణసరసత్వమునకును భంగ మాపాదించుట. కావున పూర్వము వ్రాసిన నా యామోద లేఖలు పత్త్రములు మొదలైనవానినుండి వాక్యములను సంగ్రహించి యీపీఠికను గూర్చి కవియొక్కకంఠమునకుఁ బుష్పహారముగ సమర్పింతును. అనుగ్రహించి కైకొందురు గాక !

౧౯౩౭ వ యేప్రిల్ నెల రెండవ తేదిని అప్పటికిఁ బ్రచురింపఁబడిన ఆత్మకథాభాగము చదివి తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారి కీరీతిని వ్రాసినాఁడను.

"తమచే రచియింపఁబడిన 'ఆత్మకథను' జదివి ఆశ్చర్యమును ఆనందమును జెందితిని. విషయము గాంధిమహాత్ముని స్వీయచరిత్రము. లోకారాధ్యమైనది, సర్వజ నాదరణీయమును సేవ్యమును. తమశైలి యించుమించు ఆంధ్ర మహాభారత ప్రతిబింబము. ఇంతకంటె నెక్కువగాఁ జెప్పుటకు సాధ్యముకాదు. అవసరమును లేదు.

పూర్వమట్లు నేను ప్రకృతము తఱచుగ గ్రంథములఁ జదువుటలేదు. కాలము కఱవు. శక్తియు తఱుగుడు స్థితిలో వ్రాలినది. అవధానము నానా ముఖములఁ బ్రవర్తిల్లఁ జేసితి నేని ముఖ్యకార్యములకు ముప్పు వాటిల్లును. కానఁ బంపినపుస్తకముల నన్నింటిని జదువుట నాకు సులభముగాని గుణముగాని కానేరదు. అట్లున్నప్పటికిని మీగ్రంథము – దానియొక్క ఆకర్షణశక్తిచేత – నన్ను వదలనిచ్చినది కాదు. చదివి యానందించునట్లు చేసినది.

మీరు ధన్యులరు. మాతృభాషయొక్క సుకృతముల ఫల మనఁదగిన కావ్యమును, పూజనీయ మైన విషయశోభితమును త దనుగుణమైన రీతిని వ్రాసి స్థిరయశస్సు గాంచిన కవులని మిమ్ము అయాచితముగఁ బ్రశంసించి నా కుతూహలమును తమకు నివేదించుచున్నాను.”

౧౯౪౯ వ సంవత్సరమున వీరికి ఆంధ్రులు కనకాభిషేకాది సమ్మానములు చేసి తమకృతజ్ఞతను సార్థకపఱుచుకొని కృతకృత్యులైరి. ఆ మహోత్సవమునకు అధ్యక్షుఁడనై ప్రసంగింపవలసిన భాగ్యము, భారము నాయదిగా నుండెను. కాని కాయమునకు సంబంధించిన కారణములచేత ఈయశస్సు నాకు లభింపదాయె. అయినను నాయందు వారికిని ఆంధ్రులకును గల అవ్యాజాభిమానముచేత నాయుపన్యాసమైనను బంపవలసిన దని కోరి, దానిన అధ్యక్షోపన్యాస మని స్వీకరించి ప్రకటించిరి. ఆప్రకటనను ఈ పీఠికయందు పొందించుటకంటె నితరవిధముల నాభావములను ప్రచురముచేయలేను. అనఁగా న్యూనత లేనివిధమున.

“శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారియెడ నాకు గౌరవాభిమానము లెక్కువ. వారియొక్కకృతిని గాంధీగారి యాత్మకథను జదివినప్పుడు నాకుఁగల్గిన యానందాశ్చర్యములకు మేరలేదు. అప్పుడు వారితో నాకుఁ బరిచయము సున్న. వారిపేరైన విన్నవాఁడను గాను. అయిననేమి ? “నిక్కమైన మంచినీలము” చూపుతోడన హృదయము నాకర్షించును. స్వయంప్రకాశమున్నచోట దూతికలేల ? ఒకరు చెప్పి చూపవలయునా ? “కనులుండినఁ గాంత సొగసు కనఁబడదొక్కో” అట్టివస్తువుల యెడను, వ్యక్తులయెడను మెప్పు స్వాయంభవము.

గాంధీగారి యాత్మకథను జదివినవెంటనే శ్రీ చౌదరిగారికి నాయొక్క మహదామోదమును దెలుపుచు లేఖ వ్రాసితిని. వా రడిగికాదు. ఒకరి ప్రేరేపణ మీఁదఁ గాదు. అనివార్యమైన స్వేచ్ఛమై.

నాఁటినుండి నేఁటివఱకు వారికవిత్వమునెడ నాకు నుండు గౌరవభావమును, దానినుండి నేఁబడయు హృదయాహ్లాదమును దినదిన ప్రవర్ధమానము లగుచున్నవి. పరిమితిలేదు. అమితత్వదోషమును లేదు. కొనసాగుచున్నదిగాని కొనసంటలేదు.

నిజమైన కవిత్వముయొక్క గుణములలో నిది యొకటి. ఎన్నిమార్లు చదివినను విసుగు పుట్టదు. క్రొత్తక్రొత్త రసములు స్ఫురించును. ఎంతదినిన నాకలి తీఱదు. రోయింపు పుట్టదు. ఇంకను దినఁగోరుదుము.

వీరి గ్రంథములయందెల్ల నాత్మకథ యగ్రగణ్యము. తక్కినయవి సామాన్యములు కావు. కాని వానియందలి విషయములు గాంధిగారిజీవితముతోఁ దులఁదూఁగఁజాలినంత గొప్పవికావని నాయభిప్రాయము. శైలికిఁ దగినట్లు విషయ ముండవలయును. లేనిచో నది పదాడంబర ప్రకటన మగును. విషయమునకుఁదగినట్లు శైలి యుండవలయును. లేనిచో జీవముండినను నాకృతిసౌందర్య ముండదు. రసవంతము కానేరదు. ఆకర్షింపదు. ఆత్మకథయందు రచన మనోహరము. గాథ లోకోత్తరము. ఇంతప్రశస్తముగ రెండును దక్కినగ్రంథములలో నలవడెనో లేదో నేను దృఢముగఁ జెప్పఁజాలను. దేశభక్తి, ఆంధ్రాభ్యుదయరక్తి, పితృపూజ – యివన్నియు మనజీవితమున నఖండములైన జ్యోతులు! వానివెలుఁగుచే మనల నావరించియుండు తమము కొంతకుఁగొంత విరియును. అయినను వీనికిని మించిన యితివృత్తములు లేకపోలేదు. యావన్మానవుల యాత్మలను బరవశములఁజేసి హృదయము నగలించి మనసులకు నిశ్చైతన్య మొసంగెడు కావ్యములు, భారత రామాయణముల వంటివి పుట్టవా యిఁక ముందు? హైందవభావనాశక్తి యడుగంటి యింకిపోలేదు. దేశమునకు స్వాతంత్ర పరిపాలనా భాగ్యము సంభవించినది. ఈ గొప్పదశకుఁ దగినట్టి వీరకావ్యములను వ్రాయఁజాలిన వారలలో సీతారామమూర్తి యున్నాఁడా? లేఁడా? ఉన్నాఁడని నానమ్మిక. నానమ్మిక వమ్ముచేయఁడనియు నావిశ్వాసము. సీతారామా! విశ్వాసఘాతుకుఁడవు కాకుము.

మనచౌదరి యతిప్రాసములకై భంగపాటుచెంది తలగోఁకికొనుచు బలాత్కారపదప్రయోగములుచేసి, యర్థము ననుసరించి పదములు వాడక, పదములఁబట్టి యర్థమును వంపులుపెట్టి వంకఁజేయు నీరసుఁడుగాఁడు. భావ మనర్గళముగఁ బ్రవహించుచుండాన వ్రాయుమహాసీయుఁడు. యతి పదాదియందేకాక మధ్యముననుగూనను వ్రాలును. ప్రాసమునకు, యతికి నై పద్యముయొక్క నడక నిలిచి దాఁటవలసిన యిబ్బందిలేదు. అర్థమునుబట్టి పదములు, పదములలో లీనమైనరీతిని యతిప్రాసములు ననాయాసముగ, నప్రయత్నముగ, స్వచ్ఛందముగ వచ్చిచేరుచుండును. ఈ సిద్ధియందుఁ బ్రసిద్ధుఁడు తిక్కన. ఈవర్గమునఁ దిక్కన్నతో సజాతీయుఁడైనవాఁడు మనచౌదరి. ఈనఁగా సరిసమానుఁడని యతిశయోక్తిఁ బలికి యపాయము దేను. ఆవర్గమున సగ్రాసనత్వము లేకున్నను ఆసనత్వము కలవాఁడని నామనవి.

నన్నయ సాంస్కృతిక దీర్ఘసమాసముల వెదచల్లినాఁడు భారతములో. కాని యవి యన్వయసౌకర్యమున నర్థసౌలభ్యమున సాధారణమైన పదములకంటె నేమాత్రము కఠినములు కావు. మఱి యవన్నియు శ్రావ్యములు; సరళములు; పామరులకు సయితము సులభవేద్యములు కాఁగలవి. మనచౌదరియు నిట్టిసమాసముల రచించుటయందును నిజముగ భారతీయుఁడ! నన్నయయందుఁ బోలెఁ బేరునకు మాత్రము సాంస్కృతికములు: నిజమున కాంధ్రములు; కవితాకళలో నద్భుతానందముల సమకూర్చునంశములలో నిది యొకటి. ఎఱ్ఱనయుఁ, దిక్కనయు నన్నయ్యకు నీడుజోడులే యీ మహత్తరశక్తిని. వారువ్రాసిన దండలకు నర్థముగుటకొఱకు, అందఱిమనసులు కరఁగుటకునై. ఆ సంప్రదాయము నుద్ధరించిన యాధునికుఁడు సీతారామమూర్తి"

ఇప్పుడు గాంధిగారి స్వీయచరిత్రమును పూరించి ప్రకటింప నున్నారు మన తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు. బ్రిటిష్‌వారి పరిపాలనాయుగమునకంటె నిప్పుడింకను గొప్పగ దేశసేవను నిర్వర్తింపవలసిన బాధ్యత మనది. తప్పితిమా యిప్పుడు లభించిన స్వాతంత్ర్యము శాశ్వతముగా నిలువఁజాలదు. మనకు శత్రులోపము లేదు. ఎప్పుడు నుండఁబోదు. బహిశ్శత్రువులు వాకిటనే యున్నారు. అంతశ్శత్రువు లింటిలోనే యున్నారు. ప్రజలు భావపీడితులు. నిరుత్సాహమును గల్గించు హేతువు లనేకము లున్నవి. అధైర్యపడిన లాభము లేదు. ఐకమత్యమునకు, పరస్పరోపకారమునకు, దేశసేవకు, ధైర్యప్రకటనకు నిదియ సమయము. స్వరాజ్యము వచ్చిననాఁడె రాజ్యముయొక్క విస్తీర్ణత తగ్గవలసివచ్చెను. కష్టముచేత వచ్చినది స్వాతంత్ర్యము, నష్టముతోఁగూడ. ఇఁక ముందైనను ఏనష్టమును గలుగకయుండునట్లు కష్టపడవలసినది మనధర్మము. ఇట్టి మహోత్సాహములకు, మహనీయమైనకార్యదీక్షకుఁ బురికొల్పుగ్రంథములలో నీయాత్మకథకు మించినది ఈదేశమున, ఈకాలమున మఱియొండు లేదు. సరస్వత్యారాధనతోడ దేశారాధనమును జేసి శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి ద్విగుణీకృత కృతకృత్యుఁడైనాఁడు. మనకు రెండింతలు మేలు చేసినాఁడు. కావున వారియెడ మనకు కొండంత గౌరవము, కృతజ్ఞతయు నుండుట సహజము.

తుమ్మల సీతారామమూర్తి మహాత్మునియొక్క ఆస్థానకవి. ఈస్థానము శాశ్వతము.

విశ్వవిద్యాలయము
మైసూరు
౫-౨-౧౯౫౧

కట్టమంచి రామలింగారెడ్డి
అపరాధ్యఁడు

లఘు టీక

ఆడితి - కమీషను
ఆడితి బొక్కసము - బ్యాంకి
అవరోధ మర్యాద - ఘోషాపద్ధతి
ఆవిరిపడవ - స్టీంలాంచి
ఉల్ల - నమోపస్థితం దెల్పునది
ఏను - సూర్యబింబము
కట్టు - కఠినము, పూర్ణము
కొనుక - తప్పక
కుతి - లాలస
కుప్పవాడు - పాకీవాడు
కృతమెఱుంగుట - కృతజ్ఞత
కెంగడలి - ఎఱ్ఱసముద్రము (రెడ్ సీ)
గావంచా - అంగవస్త్రము
గోడగది - అల్మరా
చంపు - చంపుట, హింస
జగాపాడిపట్టు - హైకోర్టు
డెక్కు - ఓడపైభాగము
తగవరి - న్యాయాధికారి
తగవాటరి } ప్లీడరు
తగవాడువాడు } ప్లీడరు
తీన్కతియా - 3/20 వంతు పంట నూరక భూస్వామికిచ్చువద్ధతి
తీర్పునెలవు - కోర్టు
ధర్మదాత - న్యాయాధికారి
నచ్చు - రుచించు
నాప - అసమర్థుఁడు
నిత్యవృత్తము - దినచర్య
నుడితీర్పు - వ్యాకరణము
నెఱపాడిపట్టు - హైకోర్టు
పాడిపట్టు - కోర్టు
పాడిపల్కరి - వకీలు
పెగ్గడనము - మంత్రిత్వము (ఒజ్జనమువలె)
బృహన్నాళిక - ఫిరంగి
మకరార్కము - సంక్రాంతి
రాకరాముల పట్టిక - అటెండెన్సు రిజిస్టరు
లఘునాళిక - తుపాకి
వాణిజ్యకోశము - బ్యాంకి
శార్మణ్యము - జర్మనీ
శాస్త్రగురుపట్టము - ఎం. ఎ. డిగ్రి
శివమూర్తి - శివలింగము
సవి - అని (ఇత్యర్థకము)

శాసనములంబట్టి దేశవాచియగు 'నాడు' 'నాఁడు' గావ్రాసితి.

నేటాలు, ఆఫ్రికా - ఇవి దక్షిణాఫ్రికాకును వాడితిని.

హిందువులు, హైందవులు - ఇవి భారతీయులకును వాడితిని.

విషయ సూచిక

రెండవ భాగము

మూఁడవ భాగము

నాల్గవ భాగము

ఐదవ భాగము

ప్ర కా శ కు లు

శ్రీ సీతారామమూర్తి చౌదరిగారికిని మాకును గలచెల్మి యీనాఁటిది కాదు. దైవానుగ్రహమున నిది యవిచ్ఛిన్నముగా సాగుచున్నది. వీరి రాష్ట్ర గానాది కృతుల నింతకుమున్నె ప్రచురించితిమి. నేఁడు వీరి యుత్తమోత్తమ కావ్యమగు ఆత్మకథను వెలువ రించు భాగ్యముకూడ మాకుఁ గల్గించిన చౌదరిగారి యౌదార్యము మఱవఁజాలము.

వె ల గ పూఁ డి దా న య్య చౌ ద రి

ప్రా : రామమోహన గ్రంథమాల

ఆ త్మ క థ



కృ తి ప తి

శ్రీ యెర్నేని సుబ్రహ్మణ్యము గారు

నెమకి నెమకి కంటి నీలో సబగస్మృతీ
యోగిలక్షణంబు లూర్జితంబు
లన్న! నీకుఁ గబ్బ మర్పించి యిది మను
తండ్రి కిడినయట్లు తనివిగంటి.

అర్చన

శా. ఈపూజాప్రసవంబు నందుకొనవోయీ! సూనృతాహింస లీ
రూపుం గైకొనివచ్చె నార్తజనతా రోచిష్ణుతా కాంక్షమై
బాపూజీ మనవేల్పు దీని నిచటన్ బండించె విశ్వప్రజా
పాపచ్ఛేదకమైన పంట యిది సుబ్రహ్మణ్యా! నీపాలురా!

మ. అసదాచారులు శాత్రవుల్ పశుబలాహంకార మేపార నల్
దెసలం జేర్చిననాఁడు దేశికుని గాంధిన్ గూడి సత్యాగ్రహం
బసిగాఁ గైకొని దండిరంగమున శౌర్యజ్యోతివై జాతిమా
నసమున్ దోఁచిన మేటిమానిసికి నన్నా! నీకు జోహారువుల్.

శా. ఏదో పొంగొకనాఁడు రేఁగి ప్రజకై యే వీసమో డయ్యువా
రీదేశంబున నెందఱో కలరు కానీ! జీవితంబెల్ల సే
వాదీక్షన్ నడిపించుపుణ్యులు కృపావారాన్నిధుల్ కానరా
రే దేశంబునఁ జూచినం బలువు రో యెన్నేని! యుష్మాదృశుల్.

ఉ. ఈచతురబ్ధి ముద్రితమహిన్ మతిసేయవు, నాకభోగముల్
నాఁచికొనందలంప, వపునర్భవ మొల్ల, వనంత దుఃఖ రే
ఖాంచితమైన లోకము సుఖింపఁ గోరుదు వెల్లకాల, మీ
నీ చరితమ్ము వెన్నెలలు నించెనురా! హరిదంతరంబులన్.

ఉ. మీ గుడివాడసీమ నిరమిత్రుని బుద్ధుని ధర్మదుందుభుల్
మ్రోఁగిననాఁడు నెవ్వగల మున్గినపేదల ముక్తికై సుఖ
త్యాగ మొనర్చి చన్న శుచితాఖని భిక్షుకరా జొకండు ప్రే
మాగమమూర్తి వెండియు బయల్పడెరా భవదాకృతిం గృతీ!

శా॥ ఓ సత్యాగ్రహీ! నీ జగద్ధితగుణ వ్యూహమ్ము నాలించుచో
నీ సౌజన్యము గాంచుచో నెడఁదలో నిండారు నా సాధు సే
వాసంసక్తికి లోఁగి పావనకథావాసద్వచోవైభవం
బీ సత్కావ్యము నీకొసంగితిని నా యాకాంక్ష మన్నింపవే!

మ. ఎప్పుడో వెల్గులుసూచె దీనితొలుపా, లేదెవ్వఁడో యడ్డమై
యపుడా సృష్టి నిరంకితమ్ము గనె ముద్రాగారముం జేరె నీ
కిపు డీ సత్కృతి నింతశిష్టసభలో నీగల్గు యోగంబు నా
కుపభోగ్యమ్ముగ సుగంధ సన్మతిని మేగో యెట్లు సైరింపుదున్.

ఉ. ఈ జగమందు సత్యము, నహింసయు నిల్చిన యంతవట్టు గాం
ధీరాజులు, మన్మసిద్ధు లపరాజితవైభవశీలు నాంధ్ర భూ
భూజనయిత్రి భారతము నిల్చిన నిల్చిన యంతవట్టు నీ
పూజకునైన పుష్పమిది పొల్చును నిల్చు నుదాత్తశీలురన్.

గీ. విత్తముఁ గొల్చుకొన సమర్పించుఁగాని
విత్తముం గొల్చుకొనఁ గృతుల్ వెట్టఁడీతఁ
డుత్తలంపడకుము వీని కుపద సేమి
నుత్తలంపట యేల కవ్యుత్తములకు.

చ. అది పదిమంది మెచ్చు పథమా యనిచూడక సందుగొందులన్
బ్రిదికెడివారి భాగ్యములు పండినవా సమలోకప్త గాంచనుల్
సదమల ధర్మసేవకులు సంపదపున్ నలియై కృశించిరా
ముదిరిన మోహముల్ పరమ మూర్ఖులకున్ విడిచాని మయ్యనుల్.

ఉ. గౌరవ మిచ్చిపుచ్చుకొనఁగాఁ దగినట్టిది యాట లోకస్వ
వారుచిరాత్మ! నీకు ననవద్యునకున్ మునుమున్న మల్లికా
హారమువైచి కబ్బమిడి యా వెనుకం గనకాభిషేక స
త్కారము లందుకొందుఁ గవితా కమనీయ తపః ఫలమ్ముగన్.

కృత్యాది

ఉ. ఎవ్వనికోల్మి భద్రముల కెల్ల నిదాన, ముదారతామయుం
డెవ్వఁడు సర్వలోకముల నేలు మహఃపరిపూర్ణమూర్తియై
నెవ్వఁడు వాఙ్మనఃక్రియల కేర్పడరానిమహాత్ముఁ, డాద్యుఁడై
యెవ్వఁడెసంగు, సత్యమన నెవ్వఁడు వాని భజింతు నిచ్చలున్.

శా. వీరుల్ త్యాగులు దేశభక్తులు జగద్విఖ్యాతకీర్తి ప్రభా
శ్రీరోచిష్ణులు బుద్ధ శంకర శివాజీ గాంధి గంగాధరా
న్సారీ ముఖ్యులు పుత్త్రులై జననికిన్ జన్మించి రగ్గౌరవా
ధారన్ భారతమాత నెంతుఁ జరితార్థత్వంబు నర్థించుచున్. ౨

సీ. భారతంబును బల్క పనిఁ బూని తిక్కన్న, పసిఁడిగంటము కేలఁ బట్టినాఁడు
వేదభాష్యముఁ జెప్ప వేడ్క విద్యారణ్యుఁ, డోంకారమును వ్రాయుచున్నాఁడు
దిగ్జయాపేక్ష సంధిల్ల రాయలు విజృంభించి దుందుభి మొరయించునాఁడు
సంఘసంస్కరణ దీక్షాకంకణంబును, రెడ్డివేమన్న ధరించునాఁడు

తే. వారల కొసంగినట్టి దీవనల నిచ్చి, వారలం గన్నకంట నింపారఁ గాంచి
యాదరింపఁగదమ్మ ని న్నాశ్రయించి, యంజలి ఘటించుచున్నాఁడ నాంధ్రజనని!

శా. ఏశక్తుల్ తనకున్ననేమి పురుషుం డెబ్భంగి రాణించు నీ
యాశీర్వాదబలంబు లేనియెడ నంబా! యుష్మదీయార్చనా
పైశారద్యము గోరువాఁ డితఁడు నీవాత్సల్యసంపత్తిలో
లేశం బీతని కిమ్ము పాలు; కవితాలీలారతీ! భారతీ! ౪

ఉ. ఈవిధి నాంధ్రవాణి భజియింపఁగ నాకు నెవండు ముందరన్
ద్రోవల నెల్లఁ జూపి కడుఁ దోడ్పడె నగ్గురువర్యు సాహితీ
శేవధిఁ దత్త్వవిన్నికరశేఖరు భూరియశోవిభాసి మా
బావను గొల్తు "జాస్తి" కులపావనుఁ జల్లయసుబ్బయాఖ్యునిన్. ౫

శా. ఏకశ్లోకరహస్యబోధనముచే నెవ్వాఁడు శిష్యున్ సుధీ
లోకాగ్రేసరుఁ జేయు నవ్విబుధుఁ గొల్తున్ వేంకటప్పార్యు న
స్తోకశ్లోకమయూఖ రాజదఖిలాంశున్ రామగాథామృతా
ఖ్యాకగ్రంథమతల్లి కాజనకు మద్గైర్వాణ భాషాగురున్. ౬

తే. శబ్దశాస్త్రాది లక్షణ సంప్రదాయ, మెవ్వఁ దెలిఁగించె నాకు నయ్యుద్ధచరితుఁ
బ్రస్తుతించెదఁ బుంభావపద్మజాత, రమణి దుప్పూరి వేంకటరమణశాస్త్రి. ౭

సీ. కాళిదాసకవీంద్రు గణుతించి శబ్దశా,సను మెచ్చి నన్నచోడని భజించి
మఱిఁ బాల్కురికి సోముఁ గదియించి తిక్కయ,జ్వను వేఁడి శ్రీనాథు సన్నుతించి
మొల్ల కంజలిపట్టి మూర్తిసత్కవిఁ గొల్చి, యల చేమకూర వెంకన్నఁ బొగడి
చిన్నయసూరి నర్చించి వీరేశలిం,గార్యు వేదముశాస్త్రి నభినుతించి

తే. ఘనులు తిర్పతివేంకటకవుల కెరఁగి, విశ్వనాథకులాధ్యు భావించి కట్ట
మంచి రామలింగారెడ్డిమహిమ నెంచి, తలఁతు సూతపురాణకర్తను జయేచ్ఛ. ౮

శా. ఆతంకం బెడపడ్డ సాహితిని హృద్యంబై రసాధారమౌ
కైతన్నేరిచి పండితుల్ కవులు సుంకంబిచ్చి మన్నింప వి
ఖ్యాతిన్ సూరపనేని వంశమణియై కన్పట్టు మన్మిత్రునిన్
సీతారామకవిన్ దలంతు గుణరాశిన్ జౌటపల్ల్యాశ్రయున్. ౯

క. అల్లల్ల నన్నుఁ దెల్పుచు, గిల్లుచుఁ గృతిపూర్తిఁ గని సుఖించుట కెదలోఁ
బెల్లారటపడు నా మేనల్లున్ నరసార్యు మెత్తు నంచితచరితున్. ౧౦

తే. పండితశ్రేణి వేలుపు బాసమీఁది, తగులమునఁ జేసి తెల్గును దెగడునాఁడు
మాతృభాషను మన్నించి మనిపి నట్టి, వారి కర్పింతు మన్నమోనాకశతము. ౧౧

గీ. మధురతాపూర్ణకావ్యనిర్మాణచణుఁడు, నేలవేల్పైననేమి చండాలుఁడైన
నేమి పూజ్యుండపో యతఁ డెల్లవారి, కప్పకవి యీర్ష్యమై నదో సెప్పెఁగాని.

ఉ. ఇంచుక నేర్పులేక సుకవీంద్రులకున్ బ్రజలిచ్చు మన్ననల్
గాంచఁగ నోర్పులేక కలకాలము కుందుచు వేఁడియూర్పులన్
నించెడు కింకవీశులకు నేరము లెన్నక భావిజన్మమం
దంచితమైన కైత నిడవమ్మ! నమస్య లివే సరస్వతీ! ౧౩

వ. ఇట్లిష్టదేవతానమస్కృతియు గురుస్తుతియుఁ బురాతనాద్యతన కవిపుంగవ
బహూకృతియుఁ గుకవినిరాకృతియుం జలిపి విశ్వశ్రేయోనిదానమగు నొక్క
కబ్బము విరచింపఁ గృతనిశ్చయుండనై మున్ముందు శిష్టసంప్రదాయమ్మును
గొనియాడి యించుక మద్వంశానువర్ణనం బొనర్తు. ౧౪

క. ధాత్రిన్ వెలసెను బూతచ,రిత్రం బగివీఁగ శౌర్యరింఖణహేతు
క్షాత్రం బౌదార్యరమా, మిత్రంబై రాచకొల మమేయప్రభలన్. ౧౫

తే. అమ్మహాకులవృక్షరాజమ్మువలనఁ, బెక్కుశాఖలు రూపెత్తి పిక్కటిల్లఁ
దెలుఁగుదేశమ్మునకుఁ జాఁగి దీర్ఘమగుచుఁ, గమ్మ యను పేరికొమ్మ యందమ్ముగులికె.

సీ. కుటిలశాత్రవకోటి గుండియల్ విదళించి, కడిమి చూపినవారు కమ్మవారు
చతురబ్ధివలయిత క్షితినెల్లఁ బాలించి, గణుతికెక్కినవారు కమ్మవారు
పారతంత్ర్యము పటాపంచము సేయఁ గంకణము గట్టినవారు కమ్మవారు
నిరతదానత్యాగ నిరతులై దీనార్థిగణము నేలినవారు కమ్మవారు
తే. కవితలన్నేర్పు గన్నారు కమ్మవారు, ఘనయశంబును గొన్నారు కమ్మవారు
కలిమికి న్నెలవైనారు కమ్మవారు, కరము చాఁపకయున్నారు కమ్మవారు. ౧౭

క. తెలుఁగుంబుడమికి వెలుఁగుం, గలిగించిన వీరు లోరుగంటి మహీనా
థులు శ్రీ ప్రతాపరుద్రాదులు వెలసిరి కమ్మవంశతోయధివిధులై. ౧౮

క. ఆకమ్మకులమ్మునయం, దాకాశధునీ సుధాకరానంతనిభ
శ్లోకుఁడు రిపుభీకర ధాటీకుఁడొగిం బుట్టెఁ బేరు "టీకన్న" యనన్. ౧౯

వ. అతండు "తుమ్మల" యను గృహనామంబునం బరఁగి ౨౦

ఆ. పెమ్మసానికులుఁడు తిమ్మభూజానికి, గండికోటనేలు దండిమగని
కాప్తుఁడై యమాత్యుఁడై దళవాయిమై, వన్నెకెక్కె సాటివారు మెచ్చ. ౨౧

క. తజ్జన్మఫలం బనఁగా, సజ్జనసంభావ్యశీలసంపన్నిధియౌ
నోజ్జయ్యవోడమె నతనికి, విజ్జెను దత్కీర్తి సురగవీసమ్మితమై. ౨౨

తే. అతనికిం గల్గె నయ్యవారప్పయనెడి, నందనుండు దయాధర్మ కందమగుట
నయ్యవారయ్యె నెల్లర కమ్మమహాత్ముఁ, డోజ్జకొడు కయ్యవారౌట యుచితమకద.

క. జనియించె నతని కన్నయ, కనదాచారుం డతండు గనె ముత్తయ్యన్
వినయాశ్రయుఁ డతనికి నా, త్తనయుఁడు రమణాభిధుండు తనయుండయ్యెన్. ౨౪

క. ఆరమణయచౌదరి సా, ధ్వీరత్నము కిచ్చమాంబఁ బెండ్లాడి గుణా
ధారుని శూరుని బుధమం, దారుని శేషయ్యఁగనె ముదం బెసలారన్. ౨౫

క. అతిమాత్ర పూత చరితాం, చితయగు సుబ్బమ్మవలన శేషాఖ్యునకున్
సుతు లుదయించిరి వేంకట,పతి సీతారామనామ భాస్వరులగుచున్. ౨౬

క. అం దగ్రజుండు శారద, కంద పురందరక రీందుకర సురతటినీ
మందారహీరలవలీ, కుందసమాస్పందకీర్తిఁ గొని రాణించెన్. ౨౭

క. భాసురగుణసంపద లక్ష్మీసతికిం దుల్యయగుచు మించు మహాల
క్ష్మీసతి కయ్యనఘుఁడు పతియైసల్పె గృహస్థధర్మ మార్యులు మెచ్చన్. ౨౮

తే. సన్నుతాచారులైన తజ్జంపతులకుఁ, బ్రాగ్భవార్జితసుకృతమ్ముపంట యనఁగఁ
బుట్టి రిద్దఱుకొమరు లప్పుత్త్రులందుఁ, బెద్దయై బాపయాఖ్యుండు తద్దవెలసె. ౨౯

క. తదనుజుఁడై కమ్మకులాం,బుధి శీతమయూఖుఁడై ప్రభూతమనీషా
స్పదుఁడై నైతికపదవీ, సదవీయసియైనబుద్ధి నారయ నెగడెన్. ౩౦

సీ. నిత్యసత్యాలాపనియతిపై ననురక్తి, సెందినాఁడు జయంబు నందినాఁడు
పరవిత్త మది తృణప్రాయంబ యని విశ్వ,సించినాఁడు తిరస్కరించినాఁడు
దీనార్థిలోకమ్ముఁ దిలకించి కన్నీరు,కార్చినాఁ డండకుఁ జేర్చినాఁడు
మొగమోట దిగఁద్రావి తగవుసెప్పెడినేర్పు, గాంచినాఁడు యశంబు పెంచినాఁడు
తే. కష్టమున్ సుఖమున్ దుల్యదృష్టితోడఁ, జూచినాఁ డొక్క త్రాసులోఁ దూఁచినాఁడు
నాఁడు నేఁడును బుధులుకొండాడు నడత, నివ్వటిల్లిన నారయ్య కెవ్వరీడు. ౩౧

చ. చదువకయున్న నేమి బుధసత్తము లుబ్బఁగ నర్థభావసం
పద వికసింప భాగవతభారతముల్ వివరించు, హృద్యముల్
తదమలకావ్యపద్యములు ధారణ కగ్గముచేసి వేనవేల్
చదువు నతండు తచ్ఛ్రవణసాహితి దుశ్శక మెట్టివారికిన్. ౩౨

క. గోవిందచరణసేవా, హేవాక నిరస్త దానవేశ్వరసుతుఁడై
జీవన్ముక్తుండై సుజ, నావళి కతఁ డొజ్జబంతియై మానణిల్లెన్. ౩౩

ఆ. పున్నములకోటూరు నన్నపనేని వం, శాబ్ధిసోము లక్ష్మయార్యుతనయ
చెంచమాంబ వినుతశీల గుణాలవాల, నారయాఖ్యు నింతియై గ్రహించె. ౩౪

శా. ఔదార్యం బది చెల్మికత్తెగ మగం డారాధ్య దైవమ్ముగాఁ
బేదల్ బిడ్డలుగా ఋతోక్తి నగగాఁ బెంపొంది విద్వత్ప్రశం
సాధౌరేయము శాశ్వతం బుభయవంశఖ్యాతికిన్ దానలం
బై దీపించిన చెంచమాంబచరితం బాదర్శ మిల్లాండ్రకున్. ౩౫

తే. ధన్యజీవనులైన తద్దంపతులకు నగ్రసుతుఁడై జనించినాఁ డంకినీఁడు
పిమ్మటన్ బ్లవమార్గశీర్షమ్మునందుఁ, బుట్టితి న్నేను రెండవపట్టి నగుచు. ౩౬

క. జనులెల్ల రామతింతురు, నను "సీతారామమూర్తి" నాఁ దగు పేరన్;
అనవద్యచరిత వనితా, జనతామణి యన్నపూర్ణ సతియగు నాకున్. ౩౭

వ. ఇట్టి నేను గురుశుశ్రూషాదులఁ బరిలబ్ధంబైన విజ్ఞానము నూతఁగాఁగొని బాల్య
ముందొట్టి కబ్బంబులు పెక్కులు నిర్మించియు నంతం దనివోక పెంపేఁడు నద్దియో
నొక్క మహాకావ్యంబు రచియింప వేడ్కపడి ౩౮

సీ. ఏపల్లె దీపించు రేపల్లెసీమలోఁ, బాఁడిపంటల కాటపట్టనంగ
నేపల్లె నిజదేశహితకార్యనిరతులౌ, కాంగ్రెస్సుయోధులఁగని రహించు
నేపల్లె పరధర్మ మాఁపంగ నెలకొల్పె, జాతీయవిద్యానికేతనంబు
నేపల్లె గాంధీ దయాపూరసిక్తమై, యనవద్యమయ్యె నయ్యనఘురాశి

తే. నెందు గాంధిశిలాస్తంభ మెత్తఁబడియె, నెచటఁ దుమ్మల బసవయ ప్రచురదాన
మానితంబైన "వినయాశ్రమంబు" వెలసె, మీరు నేపల్లెపేరు "కావూ" రనంగ.

వ. నా కాణయాచియైన తజ్జనపదంబున "విశ్వాసందేశం" బను పవిత్రక్షేత్రమునం బరఁగు గాంధిశిలాస్తంభంపు టరఁగుపై నమ్మహాత్ముని చతుష్షష్టితమ జన్మదినోత్సవసమయము (౨-౧౦-౩౨) నం దాసీనుండనై సమాహిత చిత్తంబున నితివృత్తముం గూర్చి యేకతం బాడు నవసరమ్మున ౪౦

సీ. ఎవని పుట్టువు మహాకవిగేయవిఖ్యాతి, సంధించె హైందవసంఘమునకు
నెవని రూపంబులో రవణించె నద్వైతీ, యంబు సనాతనం బార్ష తేజ
మెవని సేవాత్యాగసవనంబు భారతమాతృదాస్యముఁ దూల్చు మంత్రమయ్యె
నెవని ధర్మంబు సర్వవసుంధరాప్రజా, సంతానమునకు మేల్బంతి యయ్యె
తే. విశ్వమానవకల్యాణ విధివిధాత, యాతఁడే యంచు జయపెట్టె నెవని జగతి
యట్టిగుణకంధి గాంధిమహాత్ముచరిత, నాతలంపున మెఱసెఁ బుష్పంబు విరిసె. ౪౧

ఉ. అంతటఁ బెన్నిధింగనిన యర్థివలెం బులకాంకితుండనై
యెంతయుఁబొంగి గాంధిరచియించిన యాత్మకథన్ దెలుంగులో
మంతున కెక్కఁ బద్యమయమార్గమునన్ వచియింతునంచు నే
సంతనకట్టితిన్ జనని శారదకున్ గిడిగిళ్ళుపెట్టితిన్. ౪౨

సీ. ఏసూరినో పేరినో సుబ్బినో నిల్పి, పచ్చిసింగారంబు పల్కుకంటె
హేతువాదమ్మున కింతనిల్వఁగలేక, బూతులబుంగలై జాతివైర
ములకు మతద్వేషముల కుపాధ్యాయులై, యౌదార్యమునకు దవ్వగుచు నీతి
రతుల కెంతయు రోఁత రాఁజేయునట్టి పు, రాణమ్ములన్ బూని వ్రాయుకంటెఁ
తే. గాసులకు దాసుఁడగుచు ముక్కిడిని బొగడి, కల్లకైతల నల్లుటకంటె నిట్టి
గుణగరిష్ఠుల దేశభక్తులచరిత్ర, చెప్పుట జగద్ధితంబైన చేఁత గాదె. ౪౩

క. శివరామశాస్త్రి విద్వత్కవిసింహము దీని మధురగద్యాకృతిలో
సవరించెఁగదా యిప్పని, కవసరమేమీ యటంచు నాడకుఁ డార్యుల్. ౪౪

ఉ. ఎల్లరు గద్యమే చదువ నిచ్ఛవహింపరు పద్యమన్న సం
ధిల్లును వేడ్క పెక్కురకుఁ; దెల్గుకవిత్వచరిత్రఁ జూచినన్
దొల్లిటినుండి పద్యపుఁగృతుల్ ప్రజలన్ దనియించి గౌరవా
భ్యుల్లసితంబులై వెలయుచున్నవిధం బది తెల్లమయ్యెడిన్. ౪౫

క. పద్యంబు సర్వకవితల, కాద్యంబై గానబద్ధమై శ్రుతిహితమై
హృద్యంబై నియతం బన,వద్యంబై లెస్స తోడువడు ధారణకున్. ౪౬

క. "అనువాదంబకదా ఘా", మ్మని పెదవిఱ విఱువఁబోకుఁ; డయ్యది యసదౌ
పనిగా; దందును బద్యం, బునఁ బల్కుట దెప్పరంబు బుధుఁ డిది యెఱుఁగున్.

క. తెలుఁగునకు స్వస్తి సెప్పిన, తెలుఁగుకవిత్వంబు వల్కఁ దియ్యము నాకున్
గలుగద మా తిక్కన య, జ్వాలు త్రొక్కిన త్రోవ కేను సమ్మతిపడెదన్. ౧౦

ఆ. పుత్తె కొక్కబుద్ధి పుట్టు జిహ్వకునొక్క, రుచి జనించు నంట రూఢి యైన
సరసులెల్ల మెచ్చ మెఱయింతుఁ గవితలోఁ, గమ్మఁదనము మత్కులమ్మునవల.

ఆ. తప్పులేని కైత సెప్పెదనని గుండె, పైని జేయివైచి పలుకఁజాలు
కవి యెవండు బుధులు కారుణ్యమూర్తులై, యుంట నాటనాగుచుండుఁగాని. ౨౦

ఆత్మకథ

ప్రస్తావన

తే. నాలుగై దేడులకు మున్ను నాదు చెలిమి, కాండ్రియొత్తడిచే నాత్మకథ లిఖింపఁ
బూనిపదిపంక్తులను వ్రాయులోన జరుగఁ, దొడఁగెబొంబాయినగరాన దుండగములు.

క. ఈయంతరాయమున నా,వ్రాయసము నిరుద్ధమాయెఁ బదపడి మూరిం
బోయిన ఘటనల కతమున, నా నెరవడబందిగమున నడుగిడినాఁడన్. ౨

గీ. అందు జయరామదాసమహాశయుండు, నపుడు గలఁ; డాతఁ డితరకార్యమ్ములెల్ల
నాఁపి తొలుతొల్త రచియింపుఁ డాత్మచరిత, మని ననుం గోరె నాదర మగ్గలింప.

క. ఇది యదను కాదు నాకిటఁ, జదువం దమిగలదు కొన్ని సద్గ్రంథము; ల
య్యది తీఱుదనుక నితరం, బెదియుం బొనరింప నేర నిద్ధచరిత్రా! ౩

క. అని యతనికిఁ దెల్పితి; నాఁ,డొనగూడినశిక్ష యెల్లయును బందియలో
ననుభూతమైన నచటన, తనకథ తప్పక రచించి తనిసని యుందున్. ౪

తే. కాని మత్ప్రతనక్రియ కాకమున్న, దొరతనమువారు వెలికి నన్ ద్రోసివైచి
రేతదాతంకమునఁ జేసి యీచరిత్ర,మయితి కాదయ్యె నెరవాడయందుఁ బలుక. ౫

వ. ఆనందస్వామి యీనాఁ డా హెచ్చరికం గదలవైచె – దక్షిణాఫ్రికా సత్యా
గ్రహచరిత్ర మే నింతకుము న్నావిష్కరించియుంటిఁ – గాన నిపు డాత్మకథం
గూర్చి నవజీవనపత్రికకుఁ బంప నుబలాటపడితి – న ద్దాని నెల్ల నొకయూఁపునంద
సంతరించి గ్రంథాకృతిని వెల్వరించుట లగ్గని స్వామి వక్కాణించె–నట్లు సేయం
దగు వీలు నాకుం గఱవుకదా – కావుటంజేసి యే నమ్మనీషిం గని ౬

గీ. వారమున నొక్కఘట్టము వ్రాయనేర్తు, బరువు లెన్నేనికల వెట్లు పరువులిడుదు
నెఱుఁగవో ప్రతిసప్తాహ మే నొకింత, వ్రాసి నవజీవనకు నంపవలయు ననుట. ౭

గీ. ఈరచన మాత్మకథమైన నేమి యనుడు, నస్మదాశయ మానందుఁ డర్థ మనియె
నవలఁ గల మందుకొనుడు నయ్యది యెఱింగి, మిత్త్రుఁ డొకఁ డిట్లువల్కెఁ బవిత్రబుద్ధి.

తే. ఆత్మకథ నుగ్గడించు సాహస మదేల, యిట్టినడవడి ప్రాచ్యులం దెపుడు లేదు
వలతు రీబాట పడమటివారు వారి,త్రోవ లీకొన్న కొందఱుతూర్పువారు. ౧౦

వ. ఇది యుచితంబని తలంతురుగాక ! – నేఁ డేమి వాక్రువ్వనేర్తురు ? ౧౧

సీ. ఇది ధర్మమని మీర లిపుడు నమ్మినదాని, నెల్లి వర్జ్యమ్ముగా నెంచవచ్చు
నేటిసిద్ధాంతంబు పాటించి యొనరించు,పనుల రావచ్చు మార్పాటు రేపు
పెక్కండ్రు మీపల్కు నెక్కుడు మన్నించి, తమనడవళ్ళ దత్సమ్మతముగ
సవరించుకొనుచుంట సత్యమాటను వార,లిద్దాన జెడుదారి కేగవచ్చు ౧౨
గీ. నిట్టి హేతువులంబట్టి యిపుడు పూని,నాత్మకథ సంతరించుట నాపదగదె
యనుడు నప్పల్కు నొరసి మన్మనమునందు,గొంతకొంత విచారించికొంట వలసె.

వ. అయినను ౧౩

సీ. అస్మత్కథన పల్కనభిరుచి లేదు నా, కెడపక యేను సూనృతముగురిచి
కడగి సల్పిన ప్రయోగంబులె నేడు బాహిరపుచ్చ బూనితి, నీప్రయోగ
ములు నాదుజీవనమ్మున నిండియుంటచే, నవ్వాని దెల్పిన నవియ మామ
కీనజీవనకథాకృతిని వహించు; నీ,రచనలో బ్రత్యక్షరమ్మునందు
గీ. నా ప్రయోగచరిత్రంబ నాటుకొన్న,జేత యిది లెస్సయని విశ్వసింతు; జగము
నెదుట నీశోధనములెల్ల నిడితినేని, కొంతమేల్ దాని కౌనని యెంతునేను. ౧౪

వ. అది పొగడుకొంట యైన నగుగాక – మఱియు రాజకీయ రంగమున నాసల్పిన ప్రయోగముల నీదేశంబ యననేల నాగరకప్రపంచ మెల్ల నే డెఱుంగు – వీని దెస నాచూపునంగల గౌరవ మత్యల్పము–యివి నా కార్జించిపెట్టిన దగుటంజేసి 'మహాత్మ' బిరుదమున కాపాటివిలువయు నొసంగ – నా కిది పెక్కువిడుత లత్యంతసంతాపహేతు వాయె – దీన నే నుబ్బితబ్బిబ్బైన నిముస మొక్కటియు లేద – కానియాధ్యాత్మికరంగమున గావించిన మత్ప్రయోగముల నావిష్కరించుట కే నెంతయు నుత్సహింతు – నివి యనన్యవిదితంబులు – వీనంజేసియ నాకు రాజకీయరంగమున దగుపాటవం బొదవె – నీయవి సర్వథా యాధ్యాత్మికము లగునయేని వీని వివరించుట న్వినయము విస్తరిల్లుటకు గాక తుళ్ళింతకు దా వెక్కడ ? – మఱియు ౧౫

క. నా పూర్వజీవనము దెస,జూపు న్నిగిడించి తఱచి చూచినకొలదిక్
జూపట్ట దొడంగెడి నాలోపంబులె వేలు లక్షలుగ దెల్లముల్లై. ౧౬

ఆ. ఆత్మదర్శనంబు నర్థించి పరమేశు, జూడ దలచి ముక్తిసుఖము వలచి
చేసినాడ నెల్లచేతల నీముప్ప, దేండ్లనుండి దీక్ష యిగుర్చుచుండ. ౧౭

క. ఇందులకే నామనుగడ, యందలి కర్జంబులెల్ల నాచరితము; ల
స్పందగతి రాజకీయము, లం దూగుట కైన నీతలంపులె కతముల్. ౧౮

గీ. మానిసికి నొక్కనికి సాధ్యమైనకృత్య, మెల్లరకు సాధ్య మగునని యేఁ దలంతు
నట్లగుట మత్ప్రయోగంబు లాచరింప, నైతి లాఁతివార లెఱుంగనట్టిరీతి. ౧౯

గీ. ఎల్లరకు నీప్రయోగముల్ తెల్లమగుట, కూడదని పల్కుచుందురు కొంద ఱిలను
గాని యిద్దాన నాధ్యాత్మికప్రభావ, మూన మగునంచు నే నించుకేని నమ్మ. ౨౦

వ. తనకును దన్ను సృజించినవానికిని మాత్రమ వేద్యంబులగు నంశములు కొన్ని యుండు - నవి యొండొరుల కెఱిఁగింపరాని వగుట తెల్లమ - నా వెలువరించు ప్రయోగములు తాదృశములు కావు - కాని యవి యాధ్యాత్మికము - లొండె నైతికము - లేలనా మతసారము నీతి యనందగు - నీకృతిం బెద్దలయట్లు పిన్నలేని గ్రహింపఁదగు నంశంబుల చేరు - నేను వాని నావేశరహితము వినమ్రము నగు హృదయమ్ముతో నుడువ నేర్తునేని యితరసాధకుల పురోగమనమున కిం దించుక పాథేయము లభించు - వెండియు ౨౧

సీ. మత్ప్రయోగములు సమగ్రతాబద్ధంబు, లని వచింపఁగఁజాల, నద్వితీయ
నైపుణి దీపింప నడుపు నిజప్రయో, గావళి * ప్రకృతి రహస్యవేది
యతఁడు తజ్జాతంబులగు మాఱుపాటులే, యంత్యసిద్ధాంతంబు లని వచింపఁ
డవ్వాని యాథార్థ్యమందు సందేహమ్ము, తనకు లేకున్నను దాఁ దటస్థ
తే. భావమే పూనుఁగాని తత్పండితుం డ,హంత సూపింపఁ డొకవేళ నైన సుంత
మత్ప్రయోగంబులన్నియుఁ దత్ప్రయోగ, మార్గమున నుండుననుట సమంజసంబు.

తే. ననుఁ గడుం బరికించుకొంటిని సమస్త, భావములఁ గూర్చి యవధానపటిమ వెలయఁ
దీవ్రపరిశోధన మొనర్చితిని సతంబు, నైన నివియె సిద్ధాంతంబు లనుట కొల్ల. ౨౩

వ. ఏ నొకటి నొక్క వక్కాణింతు - నా కివి సంపూర్ణసత్యములుగాఁ గన్పించు - నప్పటికిఁ జరమసిద్ధాంతములుగాఁ దోఁచు - నట్లు కానినాఁ డేను వీని నాదరువు గావించి యేపనియుం జేయనేర - నడుగడుగునం దిది గ్రాహ్య మిది యగ్రాహ్య మని నిర్ణయించుచు గ్రాహ్యంబు నాదరించితి - లాఁతిదానిం ద్రోసితి - నీచేఁత యొందనుక నాబుద్ధికి నంతరాత్మకుం దనివి నాపాదించు నందనుక నామూల సిద్ధాంతముల నంటిపట్టుకొని యుందు. ౨౪

ఆ. తత్త్వముల వెలార్పఁ దలఁచితినేని యీ, కృతి రచింప నిచ్చగింపఁ గాని
వాని ననుసరించి వాటిల్లినట్టి కా, ర్యములచరితఁ దెల్ప నాసపడితి. ౨౫

గీ. అట్లగుట నిల్పినాఁడ సత్యప్రయోగ, చరిత మనునామ మీసర్గజాలమునకు
వెండి సత్యభిన్నములని విశ్వసించు, బ్రహ్మచర్యాదులున్ దీని బలసియుండు.

---

* సైన్టిస్టు.

వ. కాని సత్యంబ నాకు సర్వోత్కృష్టసిద్ధాంతము-దాన నితరసిద్ధాంతము లెన్నని యిమిడియుండు - సత్యంబన వాక్సత్యమ కాదు - మఱి భావసత్యమును - నది యూహ కందెడి సాలంబసత్యమ కాదు - పరిపూర్ణసత్యము - సనాతనతత్త్వము- సాక్షాత్పరబ్రహ్మ - మీశ్వరున కసంఖ్యాక నిర్వచనము లుండె - నవి నన్ను భయవిస్మయంబులఁ దోఁగించు - నొక్కొక్కయెడ ముగ్ధుం బొనరించుఁ - గాని యే నతఁడు సత్యస్వరూపుఁడనియ యారాధింతు-వానినింతదనుకఁ గన నైతిఁ -గాని

క. శోధించుచుంటి నే నీ,శోధనమున విడుతు నెల్లసుఖముల మఱి స
మ్మోదమున వేల్తు నేత, త్సాధనయజ్ఞమున నాదుసంహననంబున్. ౨౮

వ. అయిన నెందనుక నీ పరిపూర్ణసత్యము నందఁజాల నందనుక నాబుద్ధికి గోచరించు సాలంబసత్యము నాశ్రయింపక తప్ప - దంతవఱ కీ సత్యమ నాకుఁ దారిఁజూపు దివ్వెయై నన్నుఁగాపాడు కేడెమై యుండు-నీ తెరువునం బోక యసిధారావ్రతముం బోనిది - కాని న న్నదియ వేగిరమ్ముగా గంతవ్యస్థానమునకుఁ జేర్చు - నదియ నాకుసరళము-దాని నంటిపట్టుకొని పయనించుటంజేసి నా కొండంతతప్పు లణువు లుగాఁదోఁచెడి - నేలయన నీదారి వనటలబారిం బడనీక న న్నేలె - నా కగపడు వెల్గుంబట్టి యేను ముందడుగు వైచితి-మత్ప్రోగమనమునసంపూర్ణసత్యమూర్తి యీశ్వరుని మేలిమెఱుఁగులు పెక్కుసా ర్లేను లీలగాఁ గంటి. ౨౯

గీ. జగతి నీశ్వరుఁ డొకరుండె సత్యమనియుఁ, దక్కినట్టిది యెల్ల హుళక్కి యనియుఁ
నహరహంబును రేకెత్తు నస్మదీయ, చిత్తమునఁ బ్రత్యయంబు విచిత్రరీతి. ౩౦

మం. ఆసమై నవజీవనాదిపత్రికలఁ,బఠియించుచున్న నాప్రజ లెల్లవారు
నేరీతి నామది నీనమ్మకంబు, కొనసాగెనో కనుగొందురుగాక
నాప్రయోగమ్ముల నాప్రత్యయముల, నవ్వారు పాలివారగుదురుగాక. ౩౧

క. నా కగ్గమైనకార్యం, బేకుఱ్ఱనికైన సాధ్యమేయగు నంచున్
వాకొనఁ దగుకారణము ల, నేకంబులు నాఁడునాఁటి కెచ్చుచునుండెన్. ౩౨

వ. సత్యాన్వేషణమునకు వలయు నుపకరణములం దెంతబెడిద ముండు నంత నవళ మున్ వెలయు - నవి యహంయువున కసాధ్యములుగాఁ దోఁపవచ్చుఁ - గాని యమాయికుఁడగు బాలునకు సుసాధములు-సత్యసాధకుఁ డణువుకంటె నణఁగి మణఁగి యుండం జను - మానిసియడుగు క్రిందం బడి యణఁగు వడంగు - దానం ద్రొక్కుడువడఁ దగ్గవానిఁగా సత్యశోధకుఁడు త న్నెఱుంగవలయు - నపుడ వానికి సత్యజ్యోతి యగపడు - నిది వసిష్ఠ విశ్వామిత్ర సంభాషణమునం దెల్లమి యగుఁ - గ్రైస్తవ మహమ్మదీయ ధర్మములు సైత మిద్దాని సమర్థించు - మఱియు ౩౩

తే. నా రచింపఁగఁబోవు గ్రంథమ్మునందు, నెచటనే నహంతాగంధ మించుకంత
సోఁకునట్లైన మత్పరిశోధనమున, వెలితి కలదంచుఁ జదువరి తెలియుఁ గాక!

సీ. అట్టిచో నాకంటి కగపడు సత్యంపు,రుచి మరీచిక యంట యుచిత; మూర్వి
మాదృశుల్ పెక్కండ్రు మరణమ్ముపాలైన, నెల్లకాలము సత్య మిదియ జయము
గాంచి విరాజిల్లుఁగాక తప్పు లొనర్చు, నస్మాదృశున్ మర్త్య నరయుపట్ల
నెవ్వరే నొకవీసమేని సత్యమువిల్వ, నణఁపకుందురుగాక! యస్మదీయ
గీ. కృతి యిది ప్రమాణమని యెవ్వరేని నమ్మ,కుండెదరుగాక! మత్ప్రయోగోత్తరంబు
తెలివిడిగ నెంచి ప్రజ స్వబుద్ధిని బలంబు, ననుసరించి ప్రయోగంబు లరయుఁగాక!

వ. ఈమేర కాత్మకథకుఁ జెందిన యుదాహరణములు తప్పక తోడ్పడు నని నా నమ్మిక – యేలయన నాతప్పులను దాఁపక తక్కువచేయక చదువరుల కెఱుక సేయఁ దలంచితి – సత్యాగ్రహశాస్త్ర ప్రయోగముల నావిష్కరించుటయ కాని నామంచితనముం జాటుట నా కభిమతము కాదు – న న్నేను బరికించుతఱి సత్యంబువోలె బెట్టిదుండ నగుట కంగవింతు – నితరులునైత మట్ల యుంట యేను వలతుఁ – దదీయప్రమాణము ననుసరించి నాకొలఁది నెఱింగి సూరదాసున ట్లెలుఁగెత్తి ౩౬

ఆ. కలఁడె నన్ను దొరయఁగల కుటిలాత్ముండు, దుష్టజనుఁడు లౌల్యదూషితుండు
నెవఁ డొసంగె నాకు నిమ్మని నతనిన, మఱవఁగల కృతఘ్నమౌళి నైతి. ౩౭

వ. అని వక్కాణింతు – నేలయన ౩౮

క. నాయూర్పుల కన్నింటికి, నాయకుఁ డెవఁ డెతని కేను నందనుఁడ జగ
ద్ధేయున కాపరమేశున, కాయయ్యకు నఖిలతాపహర్తకు నకటా! ౩౯

తే. ఇందనుకఁ జాలదూరమునంద యుంటి, ననువిచారంబు రేపవల్ ననుఁ గలంచు
నిందులకు నావికారంబులే కతమ్ము,లని యెఱింగియు నాఁగలేనైతి వీని. ౪౦

క. ఈపీఠిక నింతటితో, నాఁపెద వాస్తవికగాథ నవ్వలిసర్గన్
జేపట్టువాఁడఁ బాఠకు,లోపికమైఁ జదువుఁ డీప్రయోగచరిత్రన్. ౪౧

సాబర్మత్యాశ్రమము
౨౬–౧౧–౧౯౨౫

మోహనదాస్ కరంచంద్ గాంధీ

ఆత్మకథ

ప్రథమ భాగము

౧ జన్మాదికము

క. కలదుగదా! భరతోర్వీ, తిలకం బగు ఘూర్జరాఖ్యదేశము దానన్
దులలేని పేరుపెంపులఁ, జెలువొందుం "గతియవాడు" సిరికిం గుదురై.

తే. అందు గాంధికుటుంబమం దవతరించు, వైశ్యు లాదిని జిల్లరవర్తకంబు
నాశ్రయించిరి కాని తదన్వయంబు, మంత్రితాసిద్ధి వెలసెఁ గ్రమక్రమమున. ౨

ఉ. ఉత్తమచందుగాంధి యన నొప్పెడి నాదుపితామహుండు ధీ
మత్తరహింప మంత్రిపదమందితుఁడై యల "పోరుబంద"రం
దుత్తములెల్ల మెచ్చ నృపు నూర్జితభక్తిని గొల్చెఁ గాని దు
శ్చిత్తులకుట్రచే నతఁడు సేరె జునాఘడు కొల్వు సేతకున్. ౩

క. ఆసంస్థాన ప్రభునకుఁ, జేసె జొహా రాతఁ డెడమచేత, నప్పుడు "నీ
కీసరణి చెల్లునా యిది, దోసముగాదంచుఁ బల్కుదురొకో సభ్యుల్". ౪

తే. అని యొకఁడు వల్క దక్షిణహస్త మర్పి, తం బితఃపూర్వమం దె బందరున కింక
లాఁతివెర వెద్ది నా కంచు నాతఁ డనియె, నిరుపమానం బహో! వాని నియమశుద్ధి.

క. ఆతని కైదవసుతుఁడై, పూతాత్ముఁడు నాదుతండ్రి పొడమె నతఁడు వి
ఖ్యాతమనీషాబలవి, జ్ఞాతాఖిలరాజ్యతంత్రచతురుం డయ్యెన్. ౬

సీ. జనులెల్లరును గరంచందుగాంధి యటన్న, పేరఁ బిల్వ నతండు పెంపుమీఱి
నెఱపె నుద్యోగంబు నెఱమంత్రియై పోరు, బందరుసంస్థానమందు నిలిచి
క్రాలె రాజస్థానిక న్యాయసభయందు, సభ్యుఁడై సదమలాచారగరిమ
నది రాజులకును దదన్వవాయులకును, దగవు దిద్దంజాలు ధర్మసంస్థ

తే. రాజకోటకు వాంకనేర్ రాజ్యమునకుఁ, బ్రెగడయై కొంతకాలంబు నెగడి యతఁడు
కాలగతి నందువఱ కుపకారవేత, నంబు గొనె రాజకోటభూనాథువలన. ౭

తే. అతఁడు భార్యావియోగార్తి కతనఁ బెండ్లి, యాడె నాలుగుమార్లు; గుణాఢ్యకుం దు
రీయజాయకుఁ బుత్తలీబాయి కేను, బ్రభవమందితిఁ గడగొట్టుపట్టి నగుచు. ౮

తే. అమలసత్యవ్రతుండు కులాభిమాని, శూరుఁ డౌదార్యమూర్తి నిస్తులితధర్మ
రతుఁడు లంచం బెఱుంగని నుతగుణాఢ్యుఁ, డన జగతిఁ గీర్తి కెక్కె నాయనుఁగుఁదండ్రి.

తే. నలువదేఁడులు కడచన్న నాఁ డతండు, సిద్ధపడె నాలుగవభార్యఁ జేట్టఁబట్ట
నట్లగుటఁ గొంతవిషయపరాయణత్వ, మంటుకొనియుండె నాతని కంట దగదె. ౧౦

సీ. రాజకోట సహాయ రాజకీయప్రతి,నిధి యొకం డొకమాఱు నిజనరేంద్రుఁ
దూలనాడఁ దొడంగ దోస మియ్యది యంచు, నాతండ్రి వారించి నీతు లాడ
నాగ్రహమంది యయ్యధికారి "పొరపాటు, మన్నింపుఁ డని బలిమాలు" మనిన
నతఁ డియ్యకొనక బంధితుఁడయ్యె నటులయ్యు, లొంగకుండుటను వెఱంగు నంది

తే. ప్రతినిధి మదీయజనకనిర్బంధశిక్షఁ, దొలఁచె వ్రీడాభరం బెదం గలఁచివైవ
నల్లవో! యేమి చెప్పెద నాదుతండ్రి, మాననీయసంస్థానాభిమానగరిమ. ౧౧

క. ధనసంచయేచ్ఛ సుంతయుఁ, గనిపింపదు నాదుతండ్రికడ నట్లగుటన్
దినఁ దొడుగ మాకు శేషిం, చిన దెంతయు నలఁతియంచుఁ జెప్పన్వలయున్. ౧౨

క. చదువల్పమైన నాతఁడు, కుదిరిన లోకానుభూతి గొప్పదియగుటన్
విదళించె గట్టిచిక్కులఁ, జదు రేర్పడ వేలకొలఁది జనముల నేలన్. ౧౩

చ. మతమునయం దతండు బహుమాత్రము శిక్షణ మందఁడయ్యెఁ గా
ని తఱచు కోవెల ల్గని మనీషు లొనర్చు మతప్రసంగముల్
సతతము నాలకించి సువిచార మొనర్చుటఁ జేసి యందుఁ బాం
డితి గడియించె గీతను బఠించె నతం డల వార్ధకంబునన్. ౧౪

క. చిత్తమ్మున మజ్జననియు, నుత్తమసతి యన్న భావ మొదవెను నాకున్
బత్తియుఁ బ్రపత్తియును రే, కెత్తఁగ నగ్గరిత దేవు నెపుడుం దలఁచున్. ౧౫

క. ఆయమ్మ దేవతార్చన, సేయక బోనంబు నెపుడుఁ జేయద మఱియున్
బాయక విష్ణ్వాలయమున, కేయెడనే ననుదినంబు నేగుచునుండున్. ౧౬

వ. నామెఱిఁగినంతవట్టు చాతుర్మాస్యము నామె విడువదయ్యె-నయ్యమ్మ కఠినదీక్షా
రక్షితంబులగు వ్రతంబులు సతంబు నిరంతరాయముగా నాచరించు-నెట్టి
యిక్కట్టు ముట్టడించినను దాఁబట్టిన నోము నుజ్జగించుట మజ్జనని యెఱుంగని
కర్జంబు-చాంద్రాయణము నెఱపుతఱి నాకెకుఁ దెవులు సోఁకుటయు నయ్యామ
యమ్మున కామె నేమంబు నేమాత్రయుం జెఱుప నయితిగామియు నెఱుంగదు-
రెండుమూఁడు కఠినోపవాసమ్ము లా సాధ్వీమతల్లికకు నల్లేరుపై బండినడకం
బోని-వామెకుఁ జాతుర్మాస్యలయం దేకభుక్తంబ నియమ-మంతం దనివోక
యొకదాన నయ్యమ్మ వాసరోపవాసంబు నాసించె-గొండొకదాన భానుసంద

ర్శనంబైనఁ గాని బోనంబు ముట్ట నను కట్టడిఁజేసికొనె-నపుడు నాసైదోడులం గూడి వేఁడివెలుంగు కాన నయ్యెనని మాయమ్మకు న్విను‌చుట కేను మిన్ను మానికంబుపైఁ గన్ను నిలిపియుండువాఁడ-నడిజడికారునం బ్రాయికంబుగా నంబుజ బాంధవుఁడు కంటంబడమి యెల్లరకుం దెల్లంబ యాకస్మికంబుగా లోకబాంధ వుఁడు దర్శనం బొసఁగుడు నే మొక్కి-గంతునం బోయి య య్యుదంత మమ్మకు నివేదించువార-మా సుశీల పరుగుపరుగున వచ్చి నీలోనన భాస్కరుఁడు మేఘ చ్ఛన్నుఁడగుడు నామె "పోనిండు నేఁడు నాయారగించుట భగవానున కసమ్మ తము కాఁబోలు"నని వేసుకమై నాడి యింటిపనులఁ జక్కదిద్ద నరుగు-వెండియు

క. కానంబడు వ్యవహార, జ్ఞానము మాతల్లియం దఖండమ్ముగ సం
స్థానస్థవిశేషంబు ల, నూనముగాఁ దెలియు నామె కురుమతి యగుటన్. ౧౮

ఉ. అంతిపురంబునం గల కులాంగన లెల్లరు నామె తెల్వి క
త్యంతము సంతసింతు రప్పుడప్పుడు బాల్యముచల్వ నేను నా
చెంతకుఁ దల్లి వెంటఁబడి చేరితి నాజనయిత్రికిన్ ధరా
కాంతునితల్లికిన్ జరుగు కమ్మనిముచ్చట గుర్తు నేఁటికిన్. ౧౯

తే. రత్న రుచి హ స్తి పంకజారాతి సంఖ్య, నలరు క్రైస్తవశకనిబద్ధాబ్దమందు
దశమమాసద్వితీయమై తనరునాఁట, జననమందినవాఁడ నీ జంపతులకు. ౨౦

సీ. పరిభవమందిన పోరుబందరుపురమంద, నాకుజ్జ్ఞతనమెల్ల నడిచిపోయెఁ
బల్లెకూటమునకుఁ బంపిన దృశ్యంబు, కన్నులఁ గట్టిన ట్లున్న దిపుడు
నెక్కము ల్వల్లించు టెంతేని చిక్కయ్యె, నెంతపాడినఁ దల కెక్కవయ్యెఁ
దోడివిద్యార్థులతోఁ గూడి నాఁడు మా,యొజ్జల దూషించు టొకటితప్ప

తే. నభ్యసించిన దిసుమంత యైన నేఁడు, కానరాదయ్యె నిటులై నకతనఁజేసి.
నాకు నిశితబుద్ధియు ధారణాబలంబుఁ, బూజ్యమని సెప్ప టెంతయుఁ బోలకున్నె.

* * *

౨ బాల్యము

తే. బందరు దివాణమును మంత్రిపదము పీడి, న్యాయసభయందు సభ్యమర్యాద వడసి
నాకు నేడేండ్లవయ సున్ననాఁడు చేరె, రాజకోటకు నాతండ్రి తేజు వెలయ. ౧

తే. అతఁడు న న్నప్పురంబునం దలరునొక్క, ప్రాథమికపాఠశాలకుఁ బంపె నందు
నాపఠించిన విద్య నెన్నంగఁదగు వి,శేష మొండేని లేద యోజించిచూడ. ౨

వ. అంతఁ గ్రమక్రమంబున నే నున్నతపాఠశాలకుం జేరితి - నప్పటికి నాకుఁ
బండ్రెండేఁడుల యీడుండు - నక్కాలంబున ౩

క. బొంకాడి యెఱుఁగ నెన్నఁడు, జంకుదు సిగ్గరకుఁడగుట సంఘమునఁ గదియన్
బొంకపుఁబొత్తమ్ములుగా, కింకెవ్వరు లేరు నాకు నించిన మిత్రుల్. ౪

ఆ. ప్రక్కనున్న వానిపలుకను దిలకించి, నకలువ్రాయు టెఱుఁగ నొకదినంబు
గురుఁడు దీని మప్పు దొరఁకొనెఁ గాని నే, లొంగనైతి నిట్టి దొంగపనికి. ౫

ఆ. ఇట్టిదుర్గుణంబు లెన్నని తద్గుణ, వంటియుంట వింటిఁ గంటిఁ గాని
యతని దెస మదీయమగు వినయంబు లొంఁ. జిన్నమంతయేని సడలదయ్యె. ౬

క. గురువుల యాదేశంబుల, శిరమున ధరియింతుఁగాని చిత్తమ్మునఁ ద
చ్చరితంబులఁ దర్కించుట, యెఱుంగ నేనాఁడు నాకు నిది సహజమగున్. ౭

ఆ. కన్నుఁబ్రాము లెఱుఁగ నెన్నండు నొజ్జల, నీతిమాలి గురులచేత నొక్క
మాటపడుట నాదు మతమునకున్ దప్పు, పట్టువడియె నాకు నిట్టి నడత. ౮

వ. కావుటంజేసి లాఁతిపొత్తంబుల దెసకుఁ జిత్తముంజననీక పాఠ్యగ్రంథములనిరంత
రము వల్లించువాఁడ-నిట్లయ్యు నొక్కతఱి మజ్జనకసంపాదితంబు పితృభక్తిబోధ
కంబు నగు శ్రవణచరిత్రం బను నాటకంబుపై నాకన్ను పడియె-నంత సద్దానిఁ
దుదముట్ట నవధానంబుమెయిం జదివితి-నయ్యవసరంబునంద బొమ్మలాటకాండ్రు
కొందఱు మామందిరమునకు వచ్చి ౯

క. నేత్రోత్సవకరములఁ బలు, చిత్రంబులఁ జూపి రందుఁ జేఁకుమునళ్ళన్
మాతృపితలఁ గావడి నిడి, యాత్రకుఁ గొనిపోవు శ్రవణునాకృతిఁ గంటిన్. ౧౦

క. ఈ చిత్తరు వాపొత్తము, నాచిత్తమునందు పెద్ద నాటుకొనియె సా
రాచారుఁ డక్కుమారుఁడు, తోఁచెను నా కొజబంతితో నెన యగుచున్. ౧౧

చ. అతఁడు కథావశిష్టుఁడయినట్టితఱిన్ దలిదండ్రు లార్తిమై
సుతుని దలంచుచుం గడుపు చుమ్మలువాఱఁగ నేడ్చుగీత మ
చ్యుతమయి నా స్మృతి న్నిలిచె శోకము పైకొనుమాడ్కి నన్నుఁదత్
కృతికరఁగించె దాని గురుఁడిచ్చిన జంత్రముమీఁదఁ బాడితిన్. ౧౨

మ. సరిగా నత్తరుణంబునం దల హరిశ్చంద్రావనీపాల స
చ్చరితం బాడిరనట్టువుల్; సరభసోత్సాహంబు దీపింప మ
ద్గురునాజ్ఞం గొని దానిఁ గంటి; నది గుంగుర్వెట్టెడిన్ శ్రోత్రగ
హ్వరమం దిప్పటికేని; దోఁచె నది నాభావంబు నవ్వెత్తుగన్. ౧౩

ఆ. ఆప్రదర్శనంబు ననిశంబుఁ దిలకింప, నిచ్చ వొడమెఁ గాని యెన్నిసార్లు
జనకుఁ డాజ్ఞ నిచ్చు స్వాతంత్ర్య మేపాటి, కలదు నాకు దానిఁ గాంచు టెట్లు. ౧౪

తే. అని తలఁచి వేఱొకం డుపాయంబు లేమి, నాహృదయరంగమందె తన్నాటకంబుఁ
గోటిమార్లు ప్రదర్శించికొంటి నేన, నిరుపమానందసామ్రాజ్యనేత నగుచు. ౧౫

క. నిత్యంబు హరిశ్చంద్రు, స్తుత్యపథం బూని గుణనిధుల్ జయపెట్టన్
సత్యంబు పల్కు జనులె, న్నత్యము గనరాదె యని మనంబున నెంతున్. ౧౬

క. ఆ యనఘునిగతి సత్యముఁ, బాయక తద్ధర్మమూర్తిభంగి విపత్తుల్
మాయించుటొ ప్పనుసభి, ప్రాయము నన్నావరించె బంధుర మగుచున్. ౧౭

క. ప్రత్యక్షరంబుఁ దత్కథ, సత్యము సత్యం బటంచు స్వాంతములోనన్
బ్రత్యయము గల్గె నలజడి, యత్యంతం బగుఁ దలంచునంతన దానిన్. ౧౮

మం. ఇపుడు లోకజ్ఞాన మెచ్చిన కొలఁదిఁ, దర్కించి తర్కించి తలఁచినకొలఁదిఁ
జరిత కందఁడు హరిశ్చంద్రుఁ డటంచుఁ, దోరంబుగా నాకుఁ దోఁచుచున్నయది
శ్రవణుండు నల హరిశ్చంద్రభూవిభుఁడుఁ. జంతింపఁ దనకు సజీవసత్యముల
తన్నాటకంబు లిత్తఱిఁ బఠించినను, వెనుకటివలె నే ద్రవింతు నిక్కువము. ౧౯

* * *

౩ బాల్య వివాహము

ఆ. ఈ వివాహఘట్ట మావిష్కరింపక, మఱుఁగు సేఁత నాదు మదికి నింపు;
కాని దీన నిట్టి గరళంపుముద్దల, మెక్కవలయు నేను బెక్కుమార్లు. ౧

క. పొగడఁదగుకతల నిటఁ బలు,వగల న్గొనియాడి చెడ్డవాని న్వీడ వీ
లగునే నిజమున కే నూ,డిగముం బొనరింతు నేని డిందనిబత్తిన్. ౨

క. పదుమూఁడువత్సరంబుల, యదనన్ నాపెండ్లి జరిగె నని కబ్బమునం
గదియించుట సంతాపా,స్పదమగు విధి యయ్యె నేమిపల్కుదు నింకన్. ౩

వ. నేఁడు నాకాపుగడకు సగ్గంబై నాఁటినాయీడుగల్గి వెల్గొందు కుఱ్ఱలం జూచు
తఱి నావివాహవృత్తాంతము తలఁపునం బొడ నాదుర్దశ కెంతయుఁ జింతిల్లి యేత
దనర్థంబునకు దవ్వైన యవ్వారి నవ్వారిగాఁ గొనియాడు చుండుఁ గొండిక నాఁట
జరిగిన నాపెండిలి స్సమర్థింప నెట్టి నైతిక విధియుం గానరాదయ్యె—వెండియు ౪

సీ. క్షత్రియవాడులోఁ గలవు ప్రధానంబు, పెండిలియనుపేర రెండు విధులు
తొలుతొల్తఁ బిల్లల తలిదండ్రు లుద్వాహమునకునై కావించికొనెడి నియమ
మాద్యసంస్కార, మయ్యది దురతిక్రమం, బగుఁ; గాని పెండిలి ముగియులోనఁ
గుఱ్ఱవాఁ డుసురులఁ గోల్పోయినఁ గుమారి, వైనవ్యదుర్గ్రహావశ్య కాద

తే. తఱచుగా నీప్రధానగాథల నెఱుంగు, పిల్ల లుండెరు; నాకేట్టి వింత లంతు
ముగిసెనంట మూఁడు మార్లందు మొదటిపాప లిద్ద ఱసందుగొట్టియో మెగిరిరంట.

తే. నాతృతీయప్రధానంబునాఁటి కేడు,వత్సరమ్ముల వయ సున్నవాఁడఁగాని
దానిఁగూరిచి నాతోడఁ దల్లిదండ్రు,లెఱుక గావించిరో లేదొ గుఱుతు సున్న.

సీ. ముగ్వుర మన్నదమ్ముల మేము; జరిగె నిం,తకుమున్న పెద్దయన్నకును పెండ్లి
నాద్వితీయాగ్రజునకును నాపెదతండ్రి, సుతునకు నాకు నౌత్సుక్య మలర
నొకముహూర్తమునంద యుద్వాహ మొనరింప, నిశ్చితమయ్యె; నీ నిర్ణయమున
మా మంచిచెడ్డల మదినెంచఁ బనిలేదు, మాసమ్మతియు నసమ్మతియు నరయు

తే. నక్కఱయు లేదు పెద్దల; కంద వారి, కానుకూల్యము నల్పవ్యయంబు నొదవు
టొక్కటే చాలు నితరంబు నూహసేయ, రెంత సాహస మీకర్జ మెంచి చూడ.

క. హైందవసంసారమ్ముల,యందు వివాహంబటన్న నంతంతలతో
డం దీఱ దిచ్చువారలు, నందెడువా రడఁగిపోదు రక్కార్యమునన్. ౮

క. అర్థమ్మును గాలమ్ము ని,రర్థకముగ వెచ్చపెట్టి యాడంబరముల్
వర్ధిల్లఁజేయ నుభయులు, వ్యర్థస్పర్ధాసమాశ్రయులు గాంచ నహా! ౯

క. విందుల వింతల మేళము,లం దాళమ్ములను బట్టలం బొంతల న
న్నందగు నగనాణెమ్ములఁ, గ్రిందుగ సమకూర్తు రహముకల్ చెలరేఁగఁగ. ౧౦

ఉ. శ్రోత్రలు మేల్ బలారె! యనుచు న్దలలూఁపిన నిస్సియంచు బల్
రోఁతవెలార్చినం గనక యొప్పుచు గొంతులు చీలునట్లు సం
గీతము పాడి రోగములకింకరులై పొరుగిండ్లవారికిన్
యాతన దెచ్చిపెట్టెద రహర్నిశము న్మఱికొంద ఱత్తఱిన్. ౧౧

క. కిమ్మనక భరింతురు పా,ర్శ్వమ్ములఁ గలవార లీ యసహ్యమ్మును వా
రు మ్ముం దీ యల్లరి నా,గమ్మును గావింపవలయుఁ గావున నవురా! ౧౨

తే. వెచ్చమా తగ్గు విభవమా హెచ్చవచ్చు,ననుచు మాపెద్దవారెల్ల దరసి యరసి
యేకవారంబ యీపీడనెల్లఁ బాఱఁ,ద్రోల నెంచిరి చెలులు బందుగులు మెచ్చ.

వ. అదియుంగాక మజ్జనకుండును దదగ్రజుండును జరాభార పీడితులగుటయు, వారు
నెఱవేర్పందగిన శుభారంభంబు లింతకు వెలిగా నన్యంబులు కానరామియు,

ముదిమిబ్రదిమియం దెల్లరకుఁ దమపిల్లల ముద్దుముచ్చటలం దిలకించు నుబలాటంబు వొడముట సాజంబగుటయు, మా వివాహంబు లొక్క-మాఱు నడచుటకుఁ గారణంబులయ్యెఁ-బూర్వోక్తప్రకారంబున వైవాహికకృత్యంబులు దిద్దం గతిపయమాసమ్ములు చెల్లె-నీసందడిఁ గాంచి నే నాగామి విశేషమ్ములఁ బసిపట్టి

ఆ॥ ఆట లాడికొందు నప్పిల్లతోఁ గూడి, యందలంబు లెక్కి- విందుఁ గాట
మంచిదుస్తులఁ ధరించి కులుకుచుందు, ననుచు నుబ్బినాఁడ నగ్గలముగ. ౧౫

ఆ. రాజకోట విడిచి రంగదానందతు, రంగమంబు నెక్కి- చెంగలించి
యగ్రజున్కుఁ గూడి యరిగితి మామాత్మ, భూమియైన తత్ *సుదామపురికి. ౧౬

సీ. ఒకయయ్యచెంత సేవకుఁడౌట మాతండ్రి, కలవిగాదయ్యె మ మ్మనుగమింప
నెట్టెటో సెలవు నొక్కింత నార్జించి తాఁ, బయనమయ్యెను పోరుబందరునకు
దారిలో శకటంబు తలక్రిందులై కూల, నతనిమేనెల్ల నుగ్గయ్యె నకట!
క్షతగాత్రుఁడైన మజ్జనకుఁ జూచినయంత, మాసంబరంబెల్ల నోసరిల్లె

ఆ. నిట్టిచెట్ట మమ్ము ముట్టడివైచిన, నాఁగదయ్యెఁ బరిణయప్రయత్న
మేను బెండ్లివేడ్కలోన మునింగి చిం, తింపనైతిఁ దండ్రితీపుమోపు. ౧౭

క. తలిదండ్రులదెస నాకుం, గల దెంతయు భక్తి; దానికంటె లవంబున్
వెలితిపడఁబోదు భోగం, బులపైఁ గల రక్తి; యుక్తముగ నూహింపన్. ౧౮

ఆ. ఇంక నెఱుఁగనైతి నే సుఖమంతయు, నీఁగి కన్నవారి కెల్లవగలఁ
దగుసపర్య సేత ధర్మవు లన్నింటఁ, బ్రథమగణ్య మన్నపాడి తెఱఁగు. ౧౯

తే. మామకీనంబు నింద్యమై మలయుభోగ, తృష్ణకున్ బుద్ధి సెప్ప వర్తిల్లె నొకటి
యదిమనశ్శల్యమై నాఁడు మొదలు నన్నుఁ, గరము వేధించు ముందుతత్కథవచింతు.

క. ఓరీ! కోటియుపాయము, లారసి పన్నెదవుగాక! యకలంకంబౌ
వైరాగ్యము లేకుండిన, నేరవు త్యాగంబు వడయ నీ వెన్నఁటికిన్. ౨౧

వ. అని నిష్కులానందుఁడు రచించిన గీతంబును బాడునప్పుడు వినునప్పుడుం దలఁపునం బాటి తద్దుర్విషయంబు నన్ను లజ్జావశుం జేయుచుండు-నది యట్లుండె. ౨౨

క. నలఁగియు గాయమ్ములతోఁ, గలఁగియు నగుమోము పెట్టి కావించెను బెం
డిలితంతునెల్ల జనకుం, డల దృశ్యము కనులఁ గట్టినట్టుల యుండున్. ౨౩

తే. చిఱుతపాయంబునం బెండ్లి సేయుకతన, మజ్జనకు నిట్లు తీవ్రవిమర్శ సేయ
సాహసింతు నటంచు నాఁ దూహపడితి, నోటు? సకలంబు నా కపు డొప్పియుండె.

* పోరుబందరు.

ఆ. పెండ్లియరుగు నెక్కి పిల్లయు నేనుం గూ, ర్చున్న తెఱంగు నాఁడు సన్నకల్లు
త్రొక్కినట్టిజాడ మఱుక్కనంబొసెమ్మ, గ్రోలు లీల మఱపురాలఁ బాపదా. ౨౫

క. మా యాలుమగలు సంస్కృతి, సేయన్ దొరఁకొన్నభంగి చిత్రమువోలెన్
నాయెట్టయెదుట నుక్కిం, బాయక యీనాఁటికేని భాసిలుచుండున్. ౨౬

సీ. ఆ తొలిరేయి నోహో! తూర్పుపడమరల్, గుర్తింప నేరని కుఱ్ఱజంట
మొనసి సంసారసముద్రగర్భమ్మునం, దు నమాంతముగ నొక్కదూఁకు దూఁకె
నారేయికర్తవ్యమంతయు నాకు మా, వదినె బోధించెఁ బావనగుణాఢ్య
నాకొమ్మకెవ్వ రా పోకడ ల్మప్పిరో, యిసుమంతయేని నా కెఱుకపడద
ఆ. యెఱుఁగ వేడనైతి నెన్నఁడు ముందైనఁ, గోరనలయునన్నకోర్కి లేను
మాకు సిగ్గు నిరుపమాన, మన్యోన్యము, భావలోకసిద్ధి యబ్బ దెపుడు. ౨౭

క. అమ్మగువతోడ నే నిఁక, నెమ్మెయి మాటాడు టాదవు నెయ్యది వక్తవ్యమ్ము వధూనీసాహో, య్యమ్మ న్ననుఁ జేర్పదయ్యె సతిదూరంబున్. ౨౮

వ. అప్పట్ల నిక్కముగా నెట్టి శిక్షయు నక్కఱకు రానేరదద్దానిగూర్చి నాకింతయేనావశ్యకము లేకుండఁజేయఁ బురాభవసంస్కారంబు లెంతయు సమర్థంబులు కావుటంజేసి కాలక్రమంబున మాకుఁ బరిచయము వర్ధిల్లి శంకాతంకంబు లెఱుఁగని సల్లాపములు బలియఁజొచ్చె. ౨౯

తే. హెచ్చులొచ్చులు లేక మాయీడు తుల్యమైన నేమాయె నించుకయేని మసల
కేను జాగింప దొరఁకొంటి నింతిమీఁద, దొర యెఱుంగని గరునంపుటాగితనంబు.

* * *

౪ యాజమాన్యము

శా. నాకుం బెండిలియైనకాలమున నానానీతులంగూర్చి సు
శ్లోకుల్ వ్రాసెడు పత్రికల్ వెలసి వచ్చున్ స్వల్పమూల్యంబునన్
సాకల్యంబుగ వాని నేఁ జదివితిన్ సంప్రాప్తమైనప్పుడం
నేకస్త్రీవ్రతచర్య ధర్మములలో నెచ్చంచుఁ బల్కంబడెన్. ౧

క. అది ముద్రవోలె నామది, నదికెన్ మఱి సత్యదాస్య మస్మద్వ్రతమై
కుదురుకొనియుండుటన్ బర, సుదతీస్నేహము నభఃప్రసూనసమ నాకున్. ౨

వ. వెండియు నేకపత్నీవ్రతంబును ద్యజించుటయు నవ్వయసునందు నాకసాధ్యంమైన నవ్విచారంబు నా కొరిడుచెట్టకుం గతమయ్యెనెట్లన ౩

తే. ఏకపత్నీవ్రతంబు నేనిట్లు నెఱప, నానెలంత పాతివ్రత్య మూనవలదె
యని తలంచితి నియ్యాశ మట్టె పెరిఁగి, యువిదపై నాకు సందియం బొదవఁజేసె.

క. ఆయమచిత్తం బెఱుఁగఁగ, నాయధికారంబు నేర్పునంజూపితి దో
షాయత్తచరిత్రిఁగ మజ్జాయను శంకింపఁదగిన సడిలేకున్నన్. ౫

క. నాక న్నంతయు నచ్చెలి, పోకడపై నుండు నెల్లపుడు; సందేహ
వ్యాకులితచిత్తులకు నేలా కావలెఁ గార్యకారణాన్వయ మిస్సీ ! ౬

క. ఇరుగిండ్లకుఁ బొరుగిండ్లకు, నరుగం దగ దస్మదాజ్ఞ నందక నీ వం
చలలేకయ శాసించితి, గరిత ; నిదియ బీజమయ్యెఁ గలహంబునకున్. ౭

చ. ఇది యొక బందిపై వెలసె నింతికి, నిట్టికడిందికర్జముల్
ముదితసహింపదయ్యెఁ, దనముచ్చట పెచ్చినచోటికేగ నా
మదలఁదొలంగె, నట్లగుట ముమ్మరమయ్యె మదీయకోప, మా
సుదతిస్వతంత్రతాగరిమ సుస్థిరమయ్యె, నిఁకేమి సెప్పుదున్. ౮

వ. నాఁడు క్రొంగ్రొత్తకాఁపురంబులు గడపు మాకు నొండొరుల ముచ్చటలు నిప్పచ్చరంబయ్యె. ౯

ఆ. నిక్క మరయ నాదు నిర్బంధచర్యల, సరకుగొనక తలఁపుజాడఁ బట్టి
పొలఁతి మెలఁగు టెట్లు పోలని చేతయా, నరక నెఱపఁదగునె దొరతనంబు. ౧౦

క. ఊరేగింపులఁ జూడకు, పేరంటంబులకుఁ బోకు ప్రేముడికత్తెన్
దారుకొనఁబోకు గుడికిం, జేరకు మను చట్ట మే సుశీల భరించున్. ౧౧

క. నాసతి నే శాసించిన, నాసతి నా కానయిచ్చు టర్హంబకదా
యీసత్యమ్ము నెఱుంగక, చేసితి మగపెత్తనంబు చేడియమీఁదన్. ౧౨

వ. చదువరులు మాజీవితంబెల్ల నిట్టి సందడికయ్యంబులకు వియ్యంబు నూపెనని యూహింపకుందురుగాక-నిష్క-ళంకమగు పేర్మియ లేమయెడ నావిధించు నిర్బంధమునకు మూలంబు-నాయిల్లాలి నెల్లపొలఁతులకు నొజ్జబంతిం జేయవలయు నను నాస నాకు మిక్కుటంబు-కాన ౧౩

ఆ. నిప్పువంటి నడత నేరిచి నాకన్న, దెల్ల నెఱిఁగి పనుల నిచ్చలందు
నాకు వేఱుగాక నారాణి రాణింప, వలయు నన్న కోర్కి బలిసె నాకు. ౧౪

సీ. కస్తూరిబాయి కీ కాంక్ష యున్నదొ లేదొ, యించుక యేని నే నెఱుఁగనైతి
వ్రాలైన నెఱుఁగ దవ్వనిత, మాయామర్మ, వతిగాదు, స్వాతంత్ర్యవాంఛఁ బెంచు

నభినివేశం బున్నయతివ. మితాలాప, చదువు లేమికైన విచారపడదు
చదువుకై నాసల్పుజతనంబు గని యైన, విద్యాభిలాష చూపింపఁబోదు
తే. నాకుమాత్రము తద్వాంఛ ననయఁజాగె, నాకెయే నాదుప్రేమకిల్లై తనర్చెఁ
గాన నమ్మానినియు నవ్విధాన నన్నుఁ, జూడవలెనన్న కోర్కె నన్వీడదయ్యె. ౧౫

క. మా కన్యోన్యప్రేమము, లేకున్నను నిత్యనిర్వ్యాలీకప్రణయం
బేకాశనైన నుంటన్, నాకోరికె తీవ్రవేదనకు దవ్వయ్యెన్. ౧౬

సీ. భార్యానురాగం బపారమై నెలకొంట, బడినైన నాకదే గొడవ రేఁగి
దినకరుం డపరాంబుధిని బ్రుంగు టెప్పుడో, కాసంతచీఁకటి క్రమ్ము టెప్పుడో
యడరి లేజవరాలికడ వ్రాలు టెప్పుడో, మించుఁబోఁడిని గుస్తరించు టెప్పుడో
చెలువచిన్నారిచూపులఁ గాంచు టెప్పుడో, జిలిబిలిసరసముల్ చిమ్ము టెప్పుడో
తే. యని నలంగితి దుర్భరమావియోగ, మవసరం బున్న లేకున్న నవియు నివియుఁ
గల్లవొల్లులు వల్కె వాల్గంటి కేను, తప్పవడనీయ సద్దమరేయినటుకు. ౧౭

తే. మితి యెఱుంగక యిటు పొలమేర దాఁటి, మారిఁబోయిన నాలౌల్యమునకు దోడు
నాకుఁ గర్తవ్యకాంక్షయు లేకయున్న, నెట్టిచెట్టకు నగ్గమై యెద్దునొక్కొ. ౧౮

పం. బికారినై దురంతరోగపీడ సుక్కి యుందునో
యకాలమృత్యుఘోరవక్త్రమందుఁ జిక్కియుందునో
యిఁకెట్టిసంచరచ్ఛవత్వ మేపుసూపఁగాఁ బ్రపం
చకం బిసీ యటంచు రోయ స్రగ్గిమగ్గి యుందునో. ౧౯

వ. కాని ప్రతిదినంబును గాల్యకృత్యములు విధిగా నిర్వహించుటయు స్వప్నమందేని దబ్బఱలాడకుంటయు నాముఖ్యవ్రతంబులు_కాన నన్నుఁ బెక్కుమాఱు లీరెండవ నియమంబ యుద్ధరించె - నది యట్లుండె. ౨౦

తే. పొదల నుత్కంఠ భార్యకుం జదువు నేర్ప, నేమిలాభంబు భోగేచ్ఛ యించుకేని
కాలము ననుగ్రహింప దక్కమలనేత్రి, కిచ్ఛయా లేదు నెఱనేర్చు టెట్లు దీని. ౨౧

క. పై పెచ్చు రాత్రులం దే,నీపని సాగింపవలయు నెవ్విధిఁ బెద్దల్-
దాపున మాటాడుదు నే, నోపఁగదా వారిచెంత నుంటకు నైనన్. ౨౨

తే. నాఁడు నేఁడును గత్తియవాడునందు, నువిద కవరోధ మర్యాద యున్నకతన
జవ్వనంబునఁ గస్తూరి చదువుజతన్న, మక్కఱకు రాక మివుల వమ్మయ్యెనకట. ౨౩

తే. [illegible]ంచిన కామాంధ మంతరించి, సుంత యెఱుక సమీపించు నంతలోన
లోకయాత్రా సమారంభ లోలబుద్ధి, వాఁడమి యవకాశ మింతేని వడయనైతి.

క. గురుకడఁ జదివించుటకై, నెఱపిన జతనంబు సెడియె నేలఁత తుదకు ను
త్తరము లిఖించుటకును గు,జ్జరాతిపాత్రంబుఁ జదువ శక్తి గడించెన్. ౨౫

క. ఆ యున్మత్తప్రేమకు, నీయకొనక యుందునేని యీనాఁడు సుధీ
గేయంబగు వైదుష్యం; బాయమకుం గుదిరియుండు నని యూహింతున్. ౨౬

క. ఆమె కపుడున్న విద్యా, వైముఖ్యముఁ బాపి యుండువాఁడ విశుద్ధ
ప్రేమకు నజయ్యకార్యం, బీమహి లేదంచుఁ దలఁతు నేఁ జిత్తమునన్, ౨౭

క. లాలసబారిం బడు న,న్నేలె నొకం డంటిఁ దొల్లి; యింకను నుడువన్
బోలిన విశేష మున్నది, యాలింపుఁడు విన్నవింతు నద్దాని నిటన్. ౨౮

క. నమ్మిందెను బలుదృష్టాం, తమ్ములు న; న్నవఁడు విమలతరనిష్ఠామో
గమ్ము విడునం డతని దై,వమ్ము కటాక్షించుఁ దుది కవశ్యం బనుచున్. ౨౯

వ. ఎట్టులన హిందూసంఘమునం దతిబాల్యవివాహదురాచారం బున్నను, దాన జనించు నుపద్రవంబుఁ గొంతవట్టు తొలఁగింప జననీజనకులు నూతనవధూవరులకుం దఱచు వియోగంబ సమకూర్తు- రయ్యాచారంబు మాయందును బ్రయుక్తంబయ్యెఁ- బరిణయానంతరము చెల్లిన వత్సరంబు లైదింట మా జంట కూడియున్న కాలంబు మూఁడేండ్లకు మించనేరదు- మా కలయికయుం దైదాఱు మాసమ్ములు నిండియు నిండకమున్న పుట్టినింటివారు కస్తూరిబాయి కాహ్వాన మంపెడివా- రప్పిలుపు లప్పుడు నాకుఁ దీవ్రవేదనాజనకంబులై యుండెడివి- కాని మా యాలుమగల నవియ బ్రిదికించె ననుట నిక్కువంబు- వెండియు 30

ఆ. చదువుకొఱకు నేను బదునెన్మిదవయేఁటఁ, జేరినాఁడ నాంగ్లసీమ కదియ
మాకు దీర్ఘవిరహ మంతరిమై నేర్పె వి,యోగసహనశక్తి నుభయులకును. 31

ఆ. ఇంగలాండు విడిచి యింటికిఁ జేరిన, పిదప నైన మాకుఁ గుదురదాయె
నాఱునెలలకొలఁది మీఱినకాలంబు, విషయసౌఖ్య మనుభవించు వీలు. 32

వ. ఏలనా నక్కాలమునఁ దాసులోని దారంబువోలె రాజకోటకున్ బొంబాయికిఁ దఱచు పేరెమ్ములువాఱుట నాకుఁ దప్పనిపనియయ్యె. 33

ఆ. అవల దక్షిణంపు టాఫ్రికా పయనంబు, కూడివచ్చె దానితోడ నాకు
విషయసౌఖ్యవార్ధి వీచీపరంపరా, హతులఁ గడచు భాగ్య మగ్గపడియె. 34

* * *

౫ ఉన్నత విద్యాభ్యాసము

తే. పరిణయమునాఁటి కున్నతపాఠశాలఁ, జేరితి నటంచు మున్నె భాషించియుంటి
నేను నాయన్నలిద్దఱు దానియంద, చదువుచున్నార మయ్యవసరమునందు. ౧

క. రెండవయన్నకు నాకున్, బెండిలితో నొక్కయేఁటివిద్య నశించెన్
వెండియు నయ్యగ్రజుఁ డెన్నండును విద్యాలయంబునకుఁ జనఁడయ్యెన్. ౨

క. హైందవసంసారమ్ముల, యం దెందఱు కుఱ్ఱవార లకటా నేఁడీ
చందంపు దుర్దశ న్వగఁ, బొందుచునున్నారొ దైవమునకే తెలియున్. 3

వ. మదీయవిద్యావ్యాసంగముమాత్రము తదనంతరము నిరంతరాయముగాఁ జాగు
చుండెఁ - బాఠశాలయందు మందబుద్ధి యను మచ్చ నాకు లేదయ్యె - నొజ్జలకు
నాదెసఁ గూర్మి మిక్కుటంబు - వారు నావిద్యాశీలంబులఁ గూర్చి తలిదండ్రు
లకుఁ బంపు కిల్లాకు నందెన్నఁడును జెడ్డవ్రాఁత కానంబడదాయె - నంతియ కాక
యే నాయాయి కక్ష్యలయం దదృష్టవశంబునం జేసి బహుమానమ్ముల విద్యార్థి
వేతనమ్ములఁ బడయఁగల్గితి- నాబుద్ధివైశద్యముపట్ల నాకుఁ దృప్తి లేకుంట నిట్టి
సమ్మానంబులు ప్రాప్తించు తఱి నబ్బురపడుచుండువాఁడ - నిట్లుండియు ౪

క. శీలమ్మునయం దన్యుఁడు, వ్రేలుమడఁచి చూప నెట్టివీలును గలుగం
జాలని లీలఁ గడుంగడు, మేలుకొని చరింతుఁ బ్రతినిమేషమునందున్. ౫

క. నలుపంతి దోసఁగు పోసఁగిన, జలజల నా కశ్రుజలము జాల్కొను నిఁక నొ
జ్జలు నను శిక్షార్హునిగాఁ, దలఁచినతఱిఁ గల్గుసిగ్గు తరమే నుడువన్. ౬

ఆ. ఒక్కమాఱు నన్ను నొజ్జలు దండింప, నపుడు శిక్ష కడలనైతిఁ గాని
దండ్యమైనయంత తప్పుసల్పితినంచుఁ, బ్రజ తలంచు ననియ పనవినాఁడ. ౭

క. ఒండగు తరగతియందో, రెండవ తరగతినొ యిది జరిగె నిట్టిద వే
ఱొం డేడవతరగతియం, దుండినతఱి జరిగె నప్పు డొజ్జలలోనన్. ౮

వ. ప్రధానమై గిమీ యనునతండు వెలయు - నయ్యయ్యవారు ౯

క. అంతేవాసులదెసఁ దా, నెంతే నాదరముచూపు నెల్లప్పుడుఁ గా
సంతయు నేమము దాఁటఁడు, మంతు గనిన శిక్షకుండు మాబడిలోనన్. ౧౦

క. ఆయన మాకు శరీర, వ్యాయామంబును గ్రికెట్టునాట విధించెన్
నాయిచ్చ వీని మెచ్చదు, వాయని బిడియంబు గల్గువాఁడను గానన్. ౧౧

వ. మఱియు దేహపరిశ్రమంబునకును జదువునకును సంబంధ మావంతయు గానరా
దని యత్తఱి నాకొక దురభిప్రాయం బత్తియుండెఁ-గాని విద్యావిధానమునందు
మానసికశిక్ష కెంత ప్రాధాన్యముండు నంత శారీరకశిక్షకును వలయు నను
నర్థంబు నేఁ డెఱిఁగితి-నది యట్లుండె. ౧౨

క. అందందుఁ బచ్చబయళ్ళుల, యందుఁ గడున్ దవ్వు నడుచు టది యుత్తమమం
చుం దెలిసి నిత్యజీవిత, మందుఁ బ్రయోగించినాఁడ న మ్మరియాదన్. ౧౩

వ. దానంజేసి పాఠశాలయందలి వ్యాయామంబు వదలుట నా కనర్థదాయకము
గాదయ్యె-నడకయ నాకు వలయు దేహదార్ఢ్యమును బ్రసాదించె-మఱియు ౧౪

క. మాయయ్యకుఁ బరిచర్యలు, సేయుతలం పెక్కుడగుటచేతన దేహ
వ్యాయామ వాంఛ తొలఁగం, ద్రోయవలసివచ్చె నాకు దుర్వ్యాసముగన్. ౧౫

క. విడుదల గంటం గొట్టుడు, బడి విడి శరవేగ మడరఁ బర్వెత్తి కడుం
గడు బత్తిం బరిచర్యలు, నడుపుదుఁ దండ్రికి ముదమ్ము నాట్యము సేయన్. ౧౬

ఆ. అయ్యకూడిగంబు నాచరించెడిపట్ల, నన్ను నడ్డగించుచున్నదాని
వదలనిం డటంటె వ్యాయామ శిక్షను, వినఁడ గురుఁడు నాదు విన్నపంబు. ౧౭

ఆ. మందవాసరమ్ము మాపటి వేళ నా,కపుడు తప్పదాయె నాటలాట
దాపరించె నొక్కతఱి ఘోరజీమూత, పటలకబళితాభ్ర భాగమగుచు. ౧౮

తే. చెంతలేదయ్యె గడియార, మంతుపట్ట, దాయెఁ గాలంబు, కనుఁబ్రామె నబ్దనిచయ
మట్టె బడిఁజేర నందొక పిట్టయేని, గంటఁబడదయ్యె నపరాధ మంటుకొనియె. ౧౯

వ. మఱుసటిదినంబునఁ బ్రధానాధ్యాపకుఁడు రాకరాముల పట్టికం బరికించి యోయీ
నిన్నటి సాయంసమయమునం దీ వేల రావైతి వని నన్నడుగ నేఁ గలరూపెల్ల వెల్ల
డించితి– నతఁడు మద్వచనంబు విశ్వసింపక నాకార్థికశిక్షగా రెండణాలువిధించె–
నయ్యవసరమునం దేను ౨౦

క. వచ్చెఁగదా కల్లరి యను, మచ్చ యటం చడలు సెంది మద్గురువునకున్
నచ్చునటు లేమి పల్కుదు, నిచ్చో నాచరణయోగ్య మెయ్యది నాకున్. ౨౧

క. అని వగచి సత్యమును న,మ్మినవాఁ డెవఁడేని ప్రీతినిమేషంబుఁ బరా
కునకుం గరంబు దవ్వె, యునికి వలయు నం చెఱింగి యూఱటగంటిన్. ౨౨

క. చదువుతఱి నేమఱిల్లుట, కిదియే మొదలయ్యెఁ దుదయు నిదియే యయ్యెన్
బదపడి నిక్కమెఱుంగుట, సదయుండై గురుఁడు సొమ్మొసఁగి మన్నించెన్. ౨౩

తే. అంత నాతండ్రికోర్కెపై నయ్యవారు, సెలవొసంగిరి వ్యాయామశిక్ష విడువ
నాకు నీపనిపై నిచ్చ లేకయున్న, నట్ట మింతేని రాదయ్యె నడకయుంట. ౨౪

వ. కాని వ్రాయసము చదువునం దొకపాలు కాఁజాల దనువెడఁగుఁదన మొండు నా
కపు డుండుటంజేసి యద్దాన నా కొదవిన కీడు మిక్కుటంబు-పిమ్మట దానిం దొలఁ
గింప నాపడిన పాట్లెల్ల వమ్మయ్యె — నందందుఁ గొందఱ యందముచిందు వ్రాలం
గాంచినతఱి నాకు లజ్జ పైకొని పశ్చాత్తాప మనుభూతమయ్యె — జిఱుతపాయంబు
నాఁటి యీలోటు సవరింప నావల నా వశంబు కాదయ్యె — వంకరటింకర వ్రాఁత
యసమగ్రమగు విద్యకు గుర్తని యే నూహింతు. ౨౫

ఆ. ముద్దుగుల్కు నాణిముత్యాలపోలిక, వ్రాలు వ్రాయునేర్పు వడయుకొఱకు
నన్నుఁజూచి యెల్ల పిన్నలు శ్రద్ధవహింతురుగాక కడు రహింతురుగాక. ౨౬

వ. అదియట్లుండె. ౨౭

సీ. పేరుకొంటినిగదా! పెండ్లిసంబరముతోఁ, దుదముట్టె నొకయేఁటి చదువటంచు
నీ లోటు సవరింప నాలోచన మొనర్చి, పైతరగతికి నన్ బంపి రొజ్జ
లరయేఁటితోఁ దృతీయమ్ము పూర్తిగొనర్చి, పిదప నాల్గవకక్ష్య గుదురుకొంటి
నద్దానఁ బాఠంబులం దనేకంబు ల, ధ్యాపనం బొనరింతు రాంగ్లమంద

తే. యగుట నుక్కిరిబిక్కిరి యయ్యె నాకు, నింత పేరాస వలదంచుఁ జింతచేసి
వెండియుఁ దృతీయకక్ష్యకే వెడల నిచ్చ, పడియు నవమానభీతి వెల్వడకయుంటి.

క. అదిగాక మత్పరిశ్రమ, మది నమ్మకదా గురుండు మాఱిచె న న్ని
ట్లిది యెన్నక వెన్నిచ్చిన, దదీయహృదయంబు నోవదా పలువగలన్. ౨౯

వ. అని భయంపడి నాల్గవతరగతియంద నిలిచితి-నందు బోధించు రేఖాగణితము నా
బుద్ధి కందక న న్నెంతయు నలయించెఁ - గాని క్రమక్రమంబునఁ బదిపండ్రెండు
పాఠములు ముగియుడు దాన నాకభిరుచి యెక్కుడయ్యెఁ- బ్రయత్నసాధ్యములు
గాని ప్రాప్యంబు లుండనేరవు కదా యని నేనప్పుడెఱింగితి- మరియు ౩౦

ఉ. ఎంతయు నాసతోడ వరియించిన సంస్కృతభాష నాకు నా
వంతయు లొంగదయ్యె నదియట్టిద నిత్యము కంఠపాఠముం
జింతన యున్నఁగాని యది చిక్కద! యాఱవకక్ష్యకేగి గ
త్యంతరమెద్ది యంచు భయమంది కడుంగడుఁ దల్లడిల్లితిన్. ౩౧

తే. సాటివారలు పారసీ చాల సులభ, మగ్గురుఁడు కుఱ్ఱవాండ్రఁ బెల్లాదరించు
ననుచు మెత్తురుగాన నయ్యది తలంచి, సంస్కృతాధ్యయనమునకు స్వస్తిచెప్పి.

మం. పారసీకక్ష్యలోపలఁ జేరుచుండ, నది సూచి నాసంస్కృతాధ్యాపకుండు
కడుఁ గొందలం బంది కలఁగి యావెన్క, ననుఁ బిల్వఁబంచి యెంతయు నాదరించి
యింతవెఱ్ఱి వటంచు నెపుడు నిన్నెఱుఁగఁ, గర్తవ్య మెద్దియో గ్రహియింపవైతి

నీ జాతిపే రేమి నీమతం బేది, నీకులం బెయ్యది నీతండ్రి యెవ్వఁ
డించుక తలపోయుమీ చిత్తమందు, నీజాతికెల్ల వన్నియ నిచ్చుభాష
నీ మతాధారమై నెగడినభాష, చదువక విడుతువో సంస్కృతభాష
చిక్కగా నున్న నాచెంతను రమ్ము, చక్కఁగా బోధింతు సంతోష మడరఁ
గష్టంబు కలదంచుఁ గలఁగుండు వడకు, చదివినకొలఁది నుత్సాహంబు హెచ్చు. ౩౩

క. అనవుడు సిగ్గిల్లితి న,య్యనఘుని వాత్సల్య పూర మవిలంఘ్యంబై
నెనువెంటన పార్సీ చదు,వును మానితిఁ జనితి వేలుపుంబల్కునకున్. ౩౪

ఆ. ఇపుడు నామనంబు కృష్ణశంకరసూరి, సలిపినట్టి మేలు సంస్మరించు
నపుడు సంస్కృతంబు నాపాటియేని ప, ఠించు టెంతొ యుపకరించె నాకు. ౩౫

వ. అయ్యాధారమునం జేసి మనశాస్త్రార్థముల నించుక యెఱింగి సంతసించుచున్నాఁడ-
నందుఁ గూలంకషంబగు పాండిత్యము లేమికి నా కెంతయు విచారంబు వొడము-
హైందవ బాలికా బాలకు లెల్లరు గీర్వాణభాషను దప్పక నేర్వవలయునని
నాయాశయమ్ము - మఱియు భారతదేశమునం దున్నతవిద్యావిధానంబున దేశ
భాషయు హిందీ సంస్కృతంబులుం బారసియు నరబ్బియు నాంగ్లమ్మును
బాఠ్యము లగునట్లొనర్చుట యవశ్యాచరణీయమని నాతలంపు- మఱియు ౩౬

తే. ఇన్ని బాసలఁ బఠియించు టెట్లటంచు, జంకఁ బనియుండ దొక్కభాషను సమగ్ర
పాండితి గడించినం బెఱబాసలెల్లఁ, గరతలామలకంబులౌఁ గాదె మనకు. ౩౭

క. పరభాషఁ జరిత్రాదులఁ, గఱచెడి దురవస్థ చనినఁ గడు సులభం బ
త్తెఱఁగునఁ బఠించు; టది నిర్భరమగు నుత్సాహమునకుఁ బాదై వెలయున్. ౩౮ ✓

***

ఉ దుర్వార్త - ౧

తే. కొలఁదిమంది సఖుల్ బడిఁ గలరు నాకు, నెన్నఁదగినట్టివార లం దిరువు రుందు
రం దొకనిచెల్మి కొన్నాళ్ల కంతరించె, దాన నానేర మించుకంతైనఁ గాన. ౧

ఉ. రెండవవానిమైత్రి విపరీతఫలంబు నొసంగి యాత్మకున్
బుండయిపోయె, సంస్కరణబుద్ధి నొనర్చితి వానిచెల్మి, నా
తండు మదగ్రజన్ముఁడును దద్దయు మిత్రులు, వానిలోపముల్
కొండొక నేనెఱింగియును గోరితి నాతనితోడి నెయ్యమున్. ౨

వ. అతఁడు నమ్మఁదగినవాఁ డనునభిప్రాయము నాకుంటయ దీనికిమూలంబు— మా సంగాతముం దిలకించి "యీదుస్సహవాసంబు నీకేల"యని మాపెద్దలు నన్నెచ్చరించుడు వారి యానతిం దలఁదాల్చుటయ నాస్వభావం బైనను "మీతలంపు సహేతుకంబ—కాని యతనిం జక్కదిద్దుటయ నాయొనర్చు చెలిమికిం గత — మతండు తనలోపంబుల సవరించుకొన్న నెన్నిక కెక్కఁగలఁడు — మీవిచారంబు దూరంబు సేయుఁ—" డని వారికి నచ్చఁబల్కి యథాపూర్వముంటి. ౩

క. పదపడి యయ్యది ఘోరా, పదలకుఁ గుదురయ్యె సంతుపట్టెఁ బ్రమాదం
బదియెల్ల; నెల్ల మీఱుట, చదురే సంస్కరణకార్య సరణులనైనన్. ౪

వ. నిక్కపుంజెల్మి యాత్మీయము నాఁదగు—నదిలోకమునందరిది—సమశీలుర మైత్రియ రాణించు—నిల్చు—నెచ్చెలుల గుణదోషము లొండొరులపైఁ బ్రాఁకుట తప్పదందు — నగుటంజేసి నెయ్యమున సంస్కరణమునకుం గల యవకాశమించుక యనఁజెల్లు — మానవుఁడు మంచికంటెమున్ను చెడ్డ నిచ్చగించుఁ— గాన నతిమైత్రి వలదని నాతలంపు — భగవన్మైత్రిగలవాఁ డేకాకిగానుండవలయు—నొండె లోక మెల్లం దనమిత్రమగునట్లు యత్నింపవలయు— నీ నావిచార మనుచితముకావచ్చుఁ గాని గాఢస్నేహముపొంటె నాకావించిన కృషియంతయు నాఱడివోయె. ౫

క. ఆతనికిన్ నాకును సంగాతం బభివృద్ధినందు కాలమ్మున నో
హో! తరఁగవోలె నెల్లర, చేతమ్ముల సంస్క్రియేచ్ఛ చెలఁగుచునుండెన్. ౬

వ. అయ్యవసరంబున నాచెలిమికాఁ డొకనాఁడు నన్నుఁ జేరి ౭

క. వింతు నొక వార్త, యొజ్జలు, మంతనమునఁ గల్లు ద్రావి మాంసము నాహా
రింతురు కొందఱు నావుడు, వింతయుఁ జింతయును నాకు వెగ్గలమయ్యెన్. ౮

వ. అంత నిట్టి యభోజ్యస్వీకరణంబునకుఁ గతం బెద్ది యని నే నుడువుడు నతండిట్లనియె.

సీ. పలలంబుఁ దినమి దౌర్బల్య మపారమై, యేఁజెల్ల! మనజాతి యేప్రమాసె
మాంసభుక్కులుగాన మనపైని జోడన, దీయుచున్నా రాంగిలేయు లిప్పు
డెఱుఁగవే నాచేవ నెఱచి మెక్కుటఁ జేసి, లభియించె నా కిట్టి లావుకలిమి
పొలసుదిండులమేనఁ బుట్టనేరవు సుమీ, రోఁతఁ బుట్టించు కుర్పులుఁ గణంతు

ఆ. లరయ వెఱ్ఱిపప్పులై మనయొజ్జలు, మాంసభక్షణంబు మరగిరోటు
కండ నమలు మీవు కన్పడు నద్దాని, మహిమ నీకు రిత్తమాట లేల. ౧౦

క. అని పల్కి నన్ను మాంసా, శనుఁ జేయ నతండు పెక్కుసారులు యత్నిం
చెను సోదాహరణమ్ముగ, వినిపించెఁ దదీయవాదవిషయములెల్లన్. ౧౧

తే. అంతకుం బూర్వమంద నాయగ్రజుండు. వీని పన్నినవలం జిక్కెఁగాన నతఁడు
నాదుచెలికాని వాదంబునకును బ్రిక్క, తాళమును వైచి తత్సమర్థనముచేసె. ౧౨

క. వారిద్దఱున్ దృఢిష్ఠులు, ధీరులు బలవంతులగుచు దీపింతురు దు
ర్వారగతిం జరియింతురు, వారణ మశకాంతరంబు వారికి నాకున్. ౧౩

వ. అందు నానెచ్చెలికాఁడు ౧౪

సీ. ఎంత దవ్వైనఁ బర్వెత్తు వేసట లేక, బాణవేగమున భూభాగ మదురవ
నెత్తు దూఁకుటయందు నెడవు లంఘించుటఁ, దలపోయ నతని కతండ సాటి
యెన్ని దెబ్బలనైన వెన్నీక భరియించు, నాటలన్నింట జయంబు గాంచు
నతనినిర్వక్రపరాక్రమక్రమముఁ గన్గొన్నయంత వితాకు గొంటి నేను
తే. బిదప నీపాటిజెట్టినై పొదలవలయు, నన్న యభిలాష నాకు మెండయ్యె నపుడు
జతన మొనరింప నిదియు దుస్సాధ మగునె, యనెడు విశ్వాస ముదయించె
నాత్మయందు. ౧౫

ఆ. మఱియు వలసినంత పిఱికితనంబు నాకుండె దయ్యమనిన నురగమనిన
బ్రుచ్చు లనిన నడలు ముమ్మరమై నన్నుఁ, దల్లడిల్లఁ జేయు నెల్లగతుల. ౧౬

సీ. చీఁకటి యన్నచో నాకెంతయును భీతి, నిశల ముంగిలి దాఁటనేర నెపుడు
నొకవంకఁ జోరు లింకొకచక్కటిం బాము, లొండొక్కదెస బూచిపిండు నిండి
న న్గబళింపనున్న విధానఁ గన్పట్టుఁ, గావున నే నంధకారమందుఁ
బవ్వళించుట యసంభవము శయ్యామందిరంబున దీపంబు గాలవలయు
తే. నాభయంబుల నీజవ్వనంబునందుఁ, జెంత నిదురించు నింతికిఁ జెప్పు టెట్లు
ధీరత న్నను పొ చు న త్తెఱవమిన్న, యని యెఱుంగుదుఁ గాన న న్నలము లజ్జ.

క. చెలికాఁ డెఱుంగు నాకుం, గల భీరుత్వంబు నతఁడు గాముల నమ్మ
జిలువల నాడించెద దొం, గలఁ దోలెద నే నటంచుఁ గడిమి న్దెలుపున్. ౧౮

వ. ఈ సాహసంబునకెల్ల నామిషాహారంబ నిదానంబని నుడువం బనిలేదు-మఱియుఁ
దత్కాలంబున విద్యార్థు లెల్లరు నుల్లాసంబుమెయి నర్మదకవి రచియించిన ౧౯

తే. ఆంగిలేయుని జూడురా! హైందవులను, నాపలను జేసి కులుకుచున్నాఁడు నేఁడు
హేతువు నెఱుంగు దే యతం డెఱచిదిండి, యైదుమూరలపొడ వుండు నట్టికతన.

వ. అను గీతముం బాడుచుండు వాఁరియ్యది తన కర్తవ్యము నెల్ల నిర్వహించి
ధన్యతఁ గాంచె-దీనికి నేనుం గైవసమైతి.

ఆ. క్రవ్యభక్షణంబు కర్తవ్య మనియు న, న్నది బలాఢ్యుఁ జేయు ననియు దాని
నెల్లవారుఁ దిన్నఁ దెల్లవారిం దోల, వచ్చు ననియుఁ దలఁపు లెచ్చె నాకు. ౨౨

క. అరసియరసి లగ్న మొకం, డెఱిచిరి భుజియింప నిశ్చయించితి నదియున్
బెఱ లెఱుఁగకుండు సరణిన్, జరుగవలయు వైష్ణవంబు నామత మగుటన్. ౨౩

సీ. అందు నాతలిదండ్రు లచ్చంపువైష్ణవుల్, గుడి కెల్లనాఁడు నేగుదురు విధిగ
మానాఁడికర్ జైనమతము పైకొనియుఁడు, నెల్లచో నది రాజ్య మేలుచుండు
జైన వైష్ణవ మత సంప్రదాయమ్ములఁ, బల్లలంబు పేరైనఁ బలుకఁబోల
దేదేశమందైన నేమతంబుననైన, మాంసనిషేధ మామాత్ర లేద

తే. యస్మదీయకుటుంబమం దలరుచున్న, సంస్క్రియారూప మిట్లుండ సాహసించి
నంజుడుందిను టెట్లంచునా యెడంద, హెచ్చెను భయంబు తర్కముల్ పెచ్చుమీఱె.

క. జననీజనకులయెడ నా, కనూనమగు భక్తి యున్నయది; మత్పలలా
శనవృత్తాంతము విన్నం, తన వారలు చత్తురనియు నాకుఁ దెలియున్. ౨౫

తే. అపుడు సత్యాభిరతియు నన్నంటియుంటఁ, బలలభక్షణమునకు లోపడ్డనాఁడు
గల్లలనుబల్కి పితరులఁ గన్నుఁబ్రామ, నడుముగట్టవలయునంచు నాకుఁ దెలియు.

వ. నాదృష్టి యంతయు సంస్కారదీక్షపైఁ దిరపడియుంట వీని సరకుసేయనైతి -
బలవిక్రమంబు లందగోరియ యే నిమ్మాంసభక్షణము నాసించితిఁగాని జిహ్వా
చాపల్యమ్మునఁ గాదనుట నిక్కవంబు. ౨౭

తే. చెలిమికాండ్రును నేను నిప్పొలసు మెక్కి, తెల్లవారల నోడించి దేశమాత
బన్నములనెల్లఁ దొలగింపవచ్చు నన్న, యిచ్చయే దీని సేవింప హేతువయ్యె.

వ. ఈ సంస్కరణపుంధిక్క యిట్లు న న్నంధునిఁ జేయుటం జేసి

తే. తల్లిదండ్రులయెఱుకకు దవ్వొనర్చి, యిది రహస్యంబుగా నుంచు టించుకేని
సత్యదూరంబు గాదని స్వాంతమందు, విశ్వసించితి దేశాభివృద్ధిఁ గోరి. ౩౦

* * *

౨ దుర్వార్త - ౧

తే. వచ్చె నిర్ణీతదివస మెవ్వనితరంబు, నాఁటినాయునికినెల్ల వర్ణన మొనర్ప
నొక్క దెస సంస్క్రియోత్సాహముబ్బుచుండె, నొక్క దెస దొంగపనికి సిగ్గొదవుచుండె.

ఆ. ఏకతంబుఁ గోరి స్నేహజెలికానితో, నెనసి వెదకి యొక్కయేటిదరికిఁ
జేరి కంటి నాదుజీవితమ్మున మొట్ట, మొదలుగాఁగఁ బొలసుముక్క లచట. ౧

సీ. కల్లు రొట్టెయు నందుఁ గలదెయ్యదియు నాకు, రుచియింపదయ్యె బల్ రోఁతపుట్టె
బెడిదమై తోలుకై వడి నుండె మాంస మ,ద్దాని మెక్కుట యసాధ్యంబ యయ్యె
నోకరింత జనించి డోఁకు వచ్చుటఁజేసి, పరిహరించితిని దద్భక్షణంబు
నా రేయి నాకు నావఁత నిద్దుర లేక, దుస్స్వప్నములు పెక్కు దొడరి కలఁచె
ఆ. గన్న మాఁతవడుడు గర్భమునందు "మే,మే" యటంచు నొక్క మేఁక యఱచు
నంత భయము వచ్చు సంతాపమూ హెచ్చు, నాయవస్థ యిట్టు లాయె నపుడు.

వ. అయినను మాంసభక్షణంబు మాను టెట్లని యూహించి వెండియు రెండింతలు
ధైర్యంబుఁ దెచ్చుకొనుచుంటి - నంత ౪

క. మఱునాఁటినుండి నెయ్యుఁడు, తరసంబును జేర్చి పలువిధమ్ములవంటల్
కరము చవిపుట్టునట్టులు, విరచింపఁ దొడంగెఁ బాకవిద్యాప్రౌఢిన్. ౫

ఉ. ఈయెర పాఱె రొట్టెపయి నేవముజాతెను మేఁకఁగూర్చి య
య్యో యనిపల్వరించు టెటులో పరువెత్తెఁ గరంబు రుచ్యమై
పాయనికోర్కెఁ బెంచెఁ బలపాకము లీకరణిన్ గతించెఁ బో
హోయన మొక్కఁ డీ చెయిద మన్యు లెఱుంగ రొకించుకంతయున్. ౬

తే. అపరిమితమూల్యసంప్రాప్య మైనకతన, మాంసభక్షణ మిరుమూఁడుమార్లు జరిగె
నాకడ ధనంబులేకున్న నన్నుఁ జెఱుప, వలయు వెచ్చంబు నోర్చె సావాసకాఁడు.
ఆ. వానికేని సొమ్ము వచ్చెడు నవకాశ, మల్పమగుట విందు లప్పుడపుడు
నూటి కొక్కనాఁడు కోటికి నొక్కనాఁ, డారగించుచుండువార మేము. ౮
తే. పొలసు మెక్కిననాఁ డన్నముం ద్యజింతు, నింక నద్దానితోఁ బని యేమి నాకు
నమ్మ ప్రొల్మాలి తేమని యడుగఁ దిండి, యఱుగ లేదయ్యెనని నెపంబాడువాఁడ.

క. ముందరకాళ్ళకు నే నిటు, బంధంబులు వేయుతఱి నపారం బగు చిం
తం దగిలి తల్లికే క,ల్లం దెలుపుచు నుంటి "నన్నలా" యని వగతున్. ౧౦

క. ఇది తెలిసెనేని పితరుల, హృదయమ్ములు వగులు నంచు నెఱుఁగుదుఁ గానన్
మది కియ్యది గాలంబై, తుదలేని విచారజలధిఁ దోఁగించె నన్నున్. ౧౧

మం. మాంసభక్షణమును మరగి యద్దాని, హైందవులం దెల్ల వ్యాపింపఁజేసి
పరజాతి యేల్బడి భరతోర్వినుండి, పాఱఁద్రోలుట మేలిపనియైన నిట్లు
తల్లిదండ్రుల కసత్యములు సెప్పుటయుఁ, గడఁగి వారల నిట్లు కన్నుఁబ్రొముటయు
నెఱచి మానుటకంటె నెగ్గగుం గాన. నవ్వారిబొందిలోఁ బ్రాణంబు లుండ
నామిషంబును మెక్కుటది కానిచేతఁ, దదనంతరము నిరాతంకపద్ధతిని

జాటుమాటులు లేక సాగింపవచ్చు, నంతియ కాని యయ్యెద నబ్బుదనుక
మాంసంబు దిన నంచు మది నిశ్చయించి, యనుఁగున కివ్విషయంబెల్ల వినిచి
తిరుగ నంజుడుతిండి దెసకుఁ బోనైతి. ౧౨

వ. తమబిడ్డ లిద్దఱు పొలసుదిండు లైన వార్త మా జననీ జనకుల కెన్నఁడును శ్రుతి గోచరము గాదయ్యె - వారితోఁ గల్ల లాడఁ జన దన్న సద్విచారము వొడముటంజేసియ నేను మాంసభక్షణము విడిచితిఁ - గాని నాచెలికాని పొందుమాత్ర ముజ్జగింపనైతి - లాఁతివారలఁ జిక్కి దిద్దవలయు నన్న యుబలాటంబ నాకెంతయుఁ జెట్టఁగూర్చె - దీని నెఱుఁగువివేకంబు నాకపు డణుమాత్రయు లేదయ్యె. ౧౩

ఆ. దైవవశతఁజేసి యావంతలోపలఁ, దొలఁగెఁ గాని వాని చెలిమి నన్నుఁ
ద్రోసి యుండు నకట దుర్వ్యభిచార కూపంబునందుఁ బాపభవనమందు, ౧౪

చ. అతఁ డొకనాఁడు నన్ను వెలయాలి గృహమ్మునఁ జేర్చి యెల్లప
ద్ధతులను మప్పి లోపలికిఁ దాఁ బనిచెన్ దురితోగ్రదేవతా
శితతరదంష్ట్రికల్ - నడుమఁ జిక్కితిఁగాని మదీయదుష్కృతి
ప్రతిఘటనం బొనర్చి భగవానుఁడు నన్మనిపెన్ గృపామతిన్. ౧౫

సీ. ఆపాపకందర మం దేమి సెప్పుదుఁ, గన్నులఁ జీకటుల్ గ్రమ్ముకొనియె
మందునకే నొక్కమాట వెల్వడదయ్యెఁ, జెమరుచే నొడలెల్లఁ జెమ్మగిల్లెఁ
గంపమ్ము హెచ్చె నగ్గలమయ్యె గగ్గోలు, సెజ్జపై బోగపుంజెలువకెలన
నధివసించితిఁగాని యంకిళ్ళు బిగువయ్యె, నాకొమ్మ తడ వోర్వలేక తిట్టి
తే. నెట్టి వాకిలి సూపె నప్పట్టునందు, వచ్చె నాపుంస్త్వమున కయో మచ్చ యనుచు
సిగ్గువడి తల్లి! వసుమతీ! శీఘ్రముగను, దారి నొసఁగుము నా కంచుఁ దల్లడిలితి.

క. అటులయ్యును నన్నియు,త్కటదుర్దశనుండి తొలఁచి కాచిన ఘటనా
ఘటనావిశారదునకుఁ, బటుభక్తిన్ మ్రొక్కుచుంటిఁ బరమేశునకున్. ౧౬

అ. దాపరించె నాపదలు మఱి నాల్గు నా,బ్రతుకునందు; వాని నతికరింపఁ
బౌరుషంబుకంటె భాగ్యంబ తద్దయుఁ, దోడుపడియె మేలు కూడునట్లు. ౧౭

వ. న్యాయైకదృష్టిని విమర్శించిన నివియెల్లఁ దప్పిదమ్ములయగు - నేల యన నిందు విషయాసక్తికిఁ గొఱంత కానరాదు - తలఁపుసేఁతలు రెండును గుణదోషంబుల సమప్రాధాన్యంబు వహించుఁగదా! - కాని లౌకికదృష్టిం గేవలక్రియల యెన్నికకు వచ్చుఁ - గాన నీచూపునఁ జూచునపుడు మాత్రమ నేను నిర్దోషినయ్యెద - నయ్యదియట్లుండె. ౧౮

మం. భగవదనుగ్రహాబల ముండునేని, గర్తలా వారికిఁ గారయితలకుఁ
దలఁగుఁ జెట్ట లోకొక్క తతియందుఁ గొన్ని, తలఁగినవిమ్మటం దగినవివేక
మొదవుడు మానవుఁ డుల్లంబునందుఁ దనకు, రాఁగల కీడు దప్పించినట్టి
సర్వేశుదయను సంస్మరణంబు సేయు, నరుఁడు విశ్వప్రియత్నం బొనర్చియును
వికృతికిం బాలాట విశ్రుతం బెందు, నట్టుల యీశ్వరుఁ డడ్డమై దాని
మరలించి ప్రోచుట మనకుఁ దెల్లంబ! యియ్యది సకలంబు నెట్లు సిద్ధించు?
జనునకు నేపాటి స్వాతంత్ర్య ముండుఁ, బరతంత్రతదశ యెంతవఱ కంటియుండుఁ
బౌరుషం బది యెంతవట్టు ఫలించు? నీశ్వరానుగ్రహం బెట్టిచోఁ గలుగు?
నివ్విషయంబెల్ల నేనాఁటికైన, నూహకు నందఁబో దుర్వి నెవ్వనికి. ౨౦

వ. ఇఁకఁ బ్రికృతాంశమునం జొత్తము-నాయనుఁగు నన్నిట్టి దుర్దశకుఁ బాల్పఱిచినను నే నతని దుస్సహావాసంబు నింకను విడనైతి-నాతనిదెస నాయూహింపని లోపములఁ గొన్నింటిఁ బ్రత్యక్షముగ నీక్షించుదనుకఁ దత్సాహచర్యంబునం జేసి నా సల్పిన దుష్కార్యంబులు మఱికొన్ని గలవు-వానిం గాలోచితమ్ముగా మున్ముందు వివరింతు-నందొకటి మాత్ర మిపుడ యావిష్కార్యమగుట నప్పనికిం గడఁగెద.

తే. పొలఁతుకకు నాకు నెడఁదలఁ బొరపు వుట్ట, నితనిపొత్తొకహేతువై వెతలఁ గుడిపె
మగువదెసనాకుఁ గామానుమానములుస,మంబులై యుండునంటిఁ బూర్వంబునంద.

క. అ య్యనుమానాగ్నిని నా,నెయ్యుఁడు దరికొల్పె నతఁడు నిజ మాడు నటం
చెయ్యెడఁ దలంతుఁ గానన్, దొయ్యలికిం గూర్చినాఁడ దుర్భరహింసన్. ౨౩

క. ఈరీతివెతల హైందవ, నారీమణి గాక లాఁతినాతి భరింపన్
నేర దటు లౌటఁ జేసి తు, మారూపం బని తలంతు మది నమ్మగువన్. ౨౪

వ. ధర్మపత్ని నిట్లు బాధించిన నన్ను నేనెన్నఁడు క్షమించుకొననైతి-నట్లు గావించుటయు నా కసాధ్యమగు కృత్యంబ- మఱియు ౨౫

ఆ. హేతు వింత లేకయే సంశయించినఁ, దొలఁగవచ్చు బంటు కొలువునుండి
సుతుఁడు తండ్రిమొగము సూడకపోవచ్చు, ననుఁగు చెలిమి వీడి యరుగవచ్చు.

తే. కాని నిష్కారణంబుగా గరిత విభుని, చేత శంకితయై యేమి సేయనేర్చు
నకట ! యటుగాక తా సంశయంబువడియు, మగనిదెసఁ జూపలే దెట్టి తెగువనేని.

ఆ. దొడ్డయింటివారిబిడ్డ హైందవకాంత, రచ్చ కెక్కి పెండ్లియుచ్చ ద్రెంపఁ
గడఁగ, దాశ్రయంబు కా దాపెకుం జట్ట,మకట యోర్వరాని దాకెన్నిల్లు ౨౮

క. ఇట్టు దురవస్థ లంటం, గట్టితి నవివేకవశతఁ గాంతకు నే నా
కట్టిఁడిచేఁతల నకటా, యెట్టులు మఱవంగలాఁడ నీజన్మమునన్. ౨౯

సీ. సవిశేషముగ నహింస నెఱింగినంతని, య్యనుమానభూతంబు ననుఁ దొఱంగె
బ్రహ్మచర్యప్రభావంబు నప్పు డెఱింగి, ఘటదాసి కాదు హో! కాంతమగని
కని, సహచారిణి యని, సహధర్మిణి, యని, భర్తృకష్టసౌఖ్యంబులందు
నాపెఁ బా లున్న దని, స్వాతంత్ర్యతయందు, నాలుమగల్ తుల్యు లనియుఁ దెలిసి
ఆ. కొనితి నాఁటిమొఱకుఁదనముఁ గాఠిన్యంబు, నంధమైత్రి నిప్పు డరసికొన్న
నలుక హెచ్చు, దుఃఖ మాఁగదు లజ్జయుఁ, జిందులాడు నేమి సెప్పువాఁడ. ౩౦

* * *

౮ దొంగతనము - ప్రాయశ్చిత్తము

క. ఏ నెఱచి మెక్కినపుడును, దానికి మును కొన్నికొన్ని తప్పుంజేయువుల్
నానెఱపినట్టి వున్నవి, వాని న్వివరించి పలుక వలతును దీనన్. ౧
క. చుట్టను ద్రావుటకై నా, చుట్టం బొకరుండు నేనుఁ జూచితి మొకనాఁ
డెట్టిఫలంబును దానన్, బట్టువడంజాల దన్న పాడి నెఱిఁగియున్. ౨
వ. ఈయభ్యాసంబు మాపితృవ్యునకుం గల - దతఁడు ధూమపానమొనర్చుటం జూడ
మాకును సిగరెట్లతో నలఁతియలంతిమొయిళ్ల నిర్మింప నుత్సాహంబువొడమె
నంత నేము ౩
క. కొనుటకు రొక్కము లేమిన్, బినతండ్రి కాల్చి పీల్చి విసిచినచుట్టల్-
తునుకల నేఱి రహస్య, మ్మునఁ గాల్పఁ దొడంగితిమి ప్రమోదము హెచ్చన్. ౪
తే. ఇచ్చవచ్చినవేళలం దెల్ల మాకుఁ, జిక్కవయ్యె నయ్యెంగిలిముక్కలైనఁ
జిక్కినన్ బొగ హెచ్చువచ్చెడిదిగామి, ఫలముసున్నయయ్యెను వ్రతభంగమైన.
తే. అట్లగుట సేవకులసొమ్ము ననువుమీఱ, ముచ్చిలించి బీడీలను దెచ్చి కాల్పఁ
గడఁగితిమి కాని పెద్దలకంటి కెడము, సేయు టెంతయు నిబ్బందిగూడె వాని. ౬
తే. కడచె నొకకొంతకాల మిక్కరణి నంత, నలఁతియలఁతిరంధ్రమ్ముల నలరుకొన్ని
కాడలం గాల్చితిమి కాని కలుగదయ్యె, నందు సంతృప్తి మాకు నావంతయేని. ౭
తే. అంత మా యస్వాతంత్ర్యత నరసి వగచి, యేటి కీ బ్రదు కెన్నినా ళ్ళిట్టు లేద్వాఁ
గల మిసీ యని యూహించి కట్టకడకు, నాత్మహత్యయె కర్తవ్య మని తెగించి. ౮
క. ఉమ్మెత్తవిత్తులందు వి, షమ్మందు నటం చెఱింగి సవిధస్థార
ణ్యమ్మునకుం జని తద్బీజమ్ముల నార్జించి సందెజాము కదియుదున్. ౯

క. చేరితి మల్లల్లన కే,దారేశ్వరుగుడికి భక్తితాత్పర్యములన్
గోరి భజించితి మా సు,గ్గారమణుని దీపధూప కైంకర్యములన్. ౧౦

వ. తదనంతర మొక మాఱుమూలకుఁ జని రెండు మూఁడు గింజలం గొఱికుడు ౧౧

తే. వెంటనే చంపునోక్షో యీ విత్తనంబు. తడవు యాతన గూర్చుచోఁ దాళుటెట్లు
చచ్చిపోయినచో నేమి వచ్చు ఫలము, పారతంత్ర్యముతో నైన బ్రతుకఁదగదె.

క. అను నూహ లగ్గలంబై, తునిమె ధృతిన్ మృతి యటన్న దుర్భరమగుచున్
బెనఁగొనె భయంబు కంపం, బనూనమై మమ్ముఁ గలఁచె నలమెం జెమటల్. ౧౩

ఆ. అంతఁ జిత్తశాంతి నందఁదలంచి నా, విందుఁ గూడి రామమందిరమున
కరిగినాఁడ నందు సావధానమ్ముగా, శ్రీనివాసుభజనఁ జేసినాఁడ. ౧౪

తే. తన్నుఁదాఁ జంపుకొనుటన్నఁదలఁపువోలెఁ, గడుఁ జులుకనైనకార్యంబు గాదటంచు
నాకు నమ్మిక యేర్పడె నాఁటఁగోలె, నెవఁడువరియించుమరణంబునిచ్చతోడ. ౧౫

సీ. అది సుత యెవ్వఁడే నాత్మహత్య యొనర్చు, కొండు నే నని పల్కు నుండనేర
దావంతలక్ష్యమే నప్పల్కుపైని నా,కయ్యది యనుభూత మైనకతనఁ
గీడులో మే లన్న జాడ నాజతనంబు, సిగరెట్ల కొకనమస్కృతి యొనర్ప
సాయంపడియె ధూమపాయితావాంఛ నా, కవ్వల నుదయింపదయ్యె మఱియు

తే. నది కడుంగడు హేయ మైనట్టిచేత, రోగముల కాలవాల మనారకము
దానికై యింత కుతియేలదైవమా!జ, నంబులకటంచు నే నబ్బురంబువడుదు, ౧౬

వ. ఇటఁ బ్రికృతమ్మునకు వత్తము—ధూమపానార్థము నా యొనర్చిన యీ ధన
చౌర్యము నాపదుమూఁడవయేటఁ బ్రివర్తిల్లె- నవ్వల రెండేండ్లు కడచుడు ౧౭

క. నాసోదరుఁ డొకఁడు దుర, భ్యాసమ్ములఁ జిక్కి ఋణముపాలయి మిపులన్
గాసివడ నేను నాతఁడు, నీసేగిం గడచుమార్గ మెయ్యదియంచున్. ౧౮

ఆ. అరసి తుట్టతుదకు నాతనిచేతి బం, గారుమురుగు సుంత కత్తిరింప
నిశ్చయించి వెంటనే పని ముగియించి, తీర్చితిమి ఋణంబు మార్చి దాని. ౧౯

తే. అవల నీచేతపై రోఁత యావహిల్లఁ, దగదు తగ దీక నిట్టివర్తన మటంచు
నిశ్చయించి నే గురునకీ నింద్యవార్తఁ, దెలిపి మన్నింపుఁ డని వేఁడఁదలఁచికొంటి.

తే. జనకుఁ డీమాట విన్న రోషంబు నంది, తిట్టికొట్టు నటన్న సందియములేదు
సుతుల నాతఁడు వాత్సల్యశూన్యుఁ డగుచుఁ,బట్టి బాధించిమొఱుఁగఁ డెప్పట్లనైన.

క. ఇక్కథ విని యుల్లంబు చి,వుక్కురు మన నాతఁ డెంత వొగులునో యను బీ
తొక్కండ నన్నుఁ బెనఁగొనె, నక్కట సాధ్యైర్యసార మంతట నడఁగెన్. ౨౨

వ. ఐన నియ్యపరాధము జనకునకు నివేదించినఁగాని చిత్తశుద్ధి సిద్ధింప దని యెట్ట
కేలకు సాహసంపడియు నివ్విషయంబుఁ బితృసమ్ముఖమున వా విచ్చి పలుకనోడి

క. ఒకచిన్న కాగితముపై, సకలంబు లిఖించి మదపచారంబున కిం
చుకయు న్వగవక తగుశి, క్షకూర్పవే! తండ్రి! యింకఁ జౌర్యము సలుపన్. ౨౪

ఆ. అనియు నందు వ్రాసి యాకమ్మ నాపాద, మస్తకంబుఁ గంపమగ్నమై త
నర్పు నర్పణంబొనర్చితి మంచము, పట్టియున్న జనకు పాణిసీమ. ౨౫

ఉ. అంత నతండు లేఖము సమస్తముఁ గన్గొని యాణిముత్తెపుం
దొంతరకైవడిన్ విడిచెఁ దోడన యశ్రుకణంబు, లేమి వి
న్నింతుఁ, దదంబుపూరములు నిండి తొలంకఁ గరస్థలేఖ, నొ
క్కింతవిచారముద్రి ధరియించెగురుండు నిమీలితాక్షుఁడై. ౨౬

క. పిదప నతం డప్పత్రముఁ, జిదురిపలు గావించె నతనిచిత్తమ్మునయం
దొదవినవేదనఁ గన్గొని, తుదలేని విచారజలధిఁ దోఁగితి నేనున్. ౨౭

క. ఆదృశ్యము మఱపునకున్, రా దెన్నటికిని; జిత్రరచనావిద్యా
వైదుష్యము నా కుండిన,చో దానిన్ దిద్ది తీర్చి చూపెడివాఁడన్. ౨౮

సీ. పితృపాదలోచనచ్యుతవిశుద్ధప్రేమ, రసపూర్ణ బాష్పధారాస్రవంతి
పూత మొనర్చె నాచేతమ్ము నౌర మత్కలుషపంకము నెల్లఁ గడిగివైచె
నాప్రేమమాహాత్మ్య మనుభవించినవాని, కొక్కనికే వేద్య మూహసేయ
ననురాగబాణోపహతి చవిసూచిన, వానికే తెలియు నద్దానిమహిమ
తే. మనిగదా మాన్యులు కవీంద్రు లాడి రిదియు, నా కహింసాప్రబోధమై నన్ను మేలు
కొలిపె నానాఁడు పుత్త్రవత్సలతకంటె, నన్య మెద్దియుఁ గానరాదయ్యె దీన. ౨౯

వ. నేఁడు మాత్ర మది కేవల మహింసయని సువ్యక్తమయ్యె - నేనాఁడది విశ్వంబు
నెల్లఁ దన కౌఁగిటికిం జేర్చు నానాఁడ తదీయ సంస్పర్శము నందిన ప్రతివస్తువు
నకు న్నేలిమార్పు వాటిల్లు-దానిశక్తికి మేర లేదని వాక్రుత్తు. 3౦

మం. తండ్రి యిత్తఱి నింత తాలిమి సూపు, నని యెంచనైతి నత్యాశ్చర్యజనక
మై వన్నెకెక్కిన యతనిస్థైర్యణకుఁ, జర్చింప నాదు దోషపరిగ్రహంబ
కారణమై నాకుఁ గన్పించుచుండు, నీ నేర మిఁకఁ జేయ నిదె బుద్ధి వచ్చె
నని బాసచేసి నిజాపరాధంబు, దండనగావింపఁ దగు నధికారి
ముం దొప్పుకొనుటయే మొదటిపాచితము, నే నిట్టికార్యంబు నెఱపుటం జేసి
యితని మన్గడపట్ల నిఁక భయంబుండ,దని నన్నుఁగూర్చి నాయయ్య భావించె
నాతఁడు మఱియు నాయందున్న ముద్దు, తద్దగావించెఁ బెద్దయు సంతసించె. 3౧

***

౯ పితృనిర్యాణము – నామహావమానము

క. పదునాఱేడుల వయసు,న్నది నా కీనాఁడు; నేఁడు నాతండ్రి వ్యథా
పదమునకు భగందర మను,గదమునకుం జిక్కెఁ బూర్వకర్మమువలనన్. ౧

సీ. నాతల్లియును నేను బ్రాఁతబం టొకరుండు, నయ్యకుఁ బ్రథమగణ్యంబు లైన
యూడిగంబును సల్పుచుండెడివార మం, దే నౌషధంబుల నిచ్చుచుంట
మందులు నూఱుట మఱి కట్టు కట్టుట, మున్నగు నూడిగమ్ముల నొనర్తు
నల్లరాత్రులఁ దండ్రి కేఁ బాదసంవాహ,నక్రియ నిచ్చమై నడిపి యిఁకను
తే. చాలునని వార లానయొసంగినపుడొ, నిదురకుం జిక్కినప్పుడో వదలువాఁడ
నయనుగొల్చుటయన నాకుఁ బ్రియతమంబు, నాకునొకనాఁడునిందుఁ బరాకు లేదు.

తే. నిత్యకృత్యంబులకుఁ జెల్ల నిలువ యుండు, సమయమును బాఠశాలకు జనకసేవ
కును విభాగించి యెపుడేని గురుఁడు ముదల,నిచ్చుచో మాపట వయాళి కేగువాఁడ.

క. ఆ సమయం దే సరిగా, నాసతికిం జాలు నిలిచె నా కవ్విషయం
బీసమయమ్మునఁ దలఁచిన, వే సిగ్గు జనించు రెండువిధముల దళమై. ౪

వ. నేను విద్యార్థినయ్యు బ్రహ్మచర్యమునకుఁ దిలోదకంబులు సమర్పించుటయు నాధర్మమగు విద్యావ్యాసంగము కంటెను బై పెచ్చు చిన్ననాఁటినుండియు శ్రవణునిశీలము నా కాదర్శమగుట నాపరమధర్మంబైన పితృసపర్యకంటెను మిక్కుటముగా భోగములకుఁ గొలువుసల్పుటయు నయ్యిరుతెఱంగుల లజ్జకుఁ గారణంబులయ్యె – నక్కాలంబున ౫

క. కరములు జనకుని పదపం, కరుహంబుల నుండ సెజ్జగదిపై నెద తాఁ
గర మాస నిలుచు భాస్కర, కరతాపం బడఁగు టాదిగ నిసీ తనకున్. ౬

క. మత మాయు ర్వేదము నం,చితలోకజ్ఞానము న్నిషేధించుతఱిన్
గతి దప్పి లతాంగీసం, గతికిం గుతుకంబు సూపఁ గడఁగితి నకటా. ౭

క. తన సేవనుండి జనకుఁడు, నను వీడుటకై నిరీక్షణము సల్పుచు న
ప్పని దీఱుడు నుపొంగుచుఁ, జనువాఁడం బడుకగదికి శరవేగమునన్. ౮

సీ. అవుడ పితృవ్యాధి యగ్గలం బగుచుండె, జరిగె నానాఁటఁ బెక్కురచికిత్స
యవల నాంగ్లేయవైద్యము ప్రయుక్తంబయ్యె, గుణ మించు కేని చేకూరదయ్యె
నింక శస్త్రచికిత్సయే శరణ్యం బని, తలఁచి బొంబాయిపత్తనము సేరి
కోఁతవైద్యమునందు ఖ్యాతి గాంచినభిష,క్కేఖరు నాశ్రయించితిమి కాని

తే. "వలదు వల దీచికిత్స యీవయసునం" దటంచు మాయింటివెజ్జువారించె నతఁడు
గట్టివాఁ డౌట నాతనిపట్టు గెలువ,నుఱలివచ్చితి మింటికి మఱుదినంబ. ౯

ఆ. మాకుటుంబవైద్యుఁ డీకొన్నచోఁ దండ్రి, పుండు, బాధ తొలఁగియుండుఁగాని
యీశ్వరేచ్ఛ భిన్న మెవనికి మరణంబు, తఱియు వేళ మేలివెరవు దోఁచు. ౧౦

క. పదపడి మజ్జనకునకున్, పుదిరెను వ్రణబాధ దేహమును శుష్కించెన్
బ్రిదుకుపయి శంక పొడమెను, జెదరెను ధైర్యంబు పలుకుఁజేవయు సడలెన్.

ఆ. పడుకయంద యెల్లపనులు ముగించు దుస్థితిజనించెఁ గాని చిట్టచివర
గడియవఱకు నాతఁ డొప్పఁబడకుండె న,క్కార్యమునకు నెంతకష్టమైన. ౧౨

వ. వైష్ణవమతమ్మున బహిశ్శుద్ధినిగూర్చి కట్టుచట్టంబు లుంటయ దీనికిఁ గారణం–బట్టి శుచియు వాంఛనీయంబ – కాని ౧౩

సీ. అణుమాత్రమును రోగి యాయాస మందక, పాన్పు మాలిన్యంబుపాలు గాక
పరిశుద్ధి కావంతకొఱఁత వాటిల్లక, యుండుచందంబునఁ బండియున్న
శయనంబునంద మజ్జనకృత్య మాదియౌ, నక్కఱలం దీర్చునట్టి వెరవు
బోధించె భారతభూమికి నాంగ్లేయ, వైద్యశాస్త్రం బిట్టి వర్ణనీయ
తే. శుద్ధి వైష్ణవమతధర్మసూత్రకోటి,యందు నంతర్గతంబుగా నలరుచుండుఁ
గాని నాతండ్రి సలుపు నిక్కపుదినచర్య, నెంతయును వింత పొడమ నగ్గింతునపుడు.

మధ్యా. బెడిదంబగు తెవులు రేఁగి పెనఁగొనఁ దనయన్న యిట్లు
కడలేని యిడుమలం గుడుచుకథ విని నా పిన్నతండ్రి
యడలొంది పోర్బందరుపురి నప్పుడ తా వీడనాడి
వడివడిపయనంబు లడర వచ్చెను దత్సేవ సలుప. ౧౪

తే. అన్న సెజ్జకుఁ బజ్జ నాపిన్నతండ్రి, కోర్కిమెయిఁ బవల్ నాల్గుజా ల్గూరుచుండి
రేయి మమ్ములనెల్ల నిద్రింపనంపి, యత్తమిల్లుచు నుండు నమ్మేత్తకెలన. ౧౫

తే. ఇంతలోఁ గాళరాత్రి తా నేగుదెంచె, నిదియ పో కర్మచండ్రిన కిజ్జగానఁ
దుట్టతుదిరే యటం చూహ తట్టదయ్యె, మా కనారతమై భీతిమాత్ర ముండె.

క. అది నిసిఁ బండ్రెండవగడె కదిసినసమయంబు తండ్రికా ళ్లొత్తుచు నే
నెదిరించు నిదురతోడం, గదనం బొనరించుచుంటిఁ గడిమి వెలుంగన్. ౧౭

తే. నాయవస్థను దిలకించి నాపితృవ్యుఁ, డే నిచట నుండుఁ బవళింపు మీవు వెడలి
యని వచించుడు నానందమున మునింగి, సెజ్జగది కొక్కపెట్టునఁ జేరినాఁడ. ౧౮

క. పాపము! నిద్రావశమై, నాపై దలి శయ్య నుండె నవలా నప్పుడే
లేపితి నే నట నుండఁగ, నేపగిదింగూర్కు నాప్ర గేశుణ నిశలన్. ౨౦

ఆ. అవలఁ గడచిపోయె నైదారు నిముసంబు, లంత భృత్యుఁ డొక్కఁ డరుగుదెంచి
చాల జబ్బులోన జనకుఁ డున్నాఁడు లెం,డనుచుఁ బల్కెఁ దలుపు నట్టె తట్టి. ౨౧

ఆ. చాల జబ్బులోన జనకుఁ డున్నాఁ డని, మున్నె తెలియుఁగానఁ దన్నిమేష
మందుఁ "జాలజ" బ్బటం చన నర్థవి, శేషమొండు తోఁచెఁ జిత్తమందు. ౨౨

తే. అంత నే సెజ్జపై నుండి యపుడ దూఁకి, యెట్టు లున్నది జనకున కేమి జరిగె
ననవుడు నెలుంగు రాల్పడనాతఁడయ్య,గారు మనలోకమునువీడినార లనియె. ౨౩

సీ. దుర్భరదుర్దాంతదుఃఖంబు లజ్జయు, మూరిఁబోవుచు నన్ను ముట్టడింప
నంతట గురుఁ డుండునట్టిపట్టున కేగి, యసుఱువాసిన తండ్రియొడలిఁ గాంచి
కామాంధకారంబు కనులఁ గప్పకయున్నఁ, బశువృత్తి కేను లోఁబడకయున్నఁ
దుదినిమేషంబునందును బితృమరణవే,దనఁ బాలు వడసియుండునుగదా య
తే. టంచుఁ జింతించినాఁడ నే నయ్యకాళ్ళు, పట్టుచుండ నతండు నాపాణియంద
జీవ మూడ్చియుండునుగాని చిన్నతండ్రి, కైవసంబయ్యె నట్టిభాగ్యంబు తుదకు. ౨౪

క. అతఁ డగ్రజుదెస నెప్పుడు, నతులంబగు భక్తి సూపు నట్టిఁడు గానన్
జతపడె నయ్యనఘునకీ, గతి నంతిమసేవ సల్పఁగల భాగ్య మహో. ౨౫

తే. మరణవేదన కెంతయు న్మలసిమలసి, నిలువ దియ్యెడ లేక నంచుఁ దెలిసిగురుఁడు
సైఁగఁజేసి కలమ్మును గాగితమ్ము, నందికొని సిద్ధమొనరింపుఁ డని లిఖించె ౨౬

క. తనసందిటఁ గల తాయె, త్తును గుత్తుక నున్న హైమతులసీదామం
బును దీసివైచె నవ్వలి, క్షణమున లేఁడయ్యె నతఁడు జగమం దకటా. ౨౭

తే. ఒక్కదెసఁ దండ్రి యమబాధస్రుక్కుచుండ, నొక్కదెసనేమరుల్గొంటినువిదపైని
మాయురేయిది మాయని మచ్చయగుచు, నన్నుబాధించుచుండుననారతంబు. ౨౮

సీ. మూఁడగునధ్యాయమును సంతరించుచు, మున్ను సూచించిన బన్న మిదియ
మెలఁకువమై నేను మెలఁగంగఁ దగువేళ, విషయసక్తుండనై వెలయుకతన
మాతరపితలపై మహనీయమగుభక్తి, నాకుండినను దాని నడుపుకొఱకు
జంకుగొంకులు లేక సర్వస్వ మర్పింపఁ, జాలియుండిన నది చాల వెలితి
తే. వడియ యున్న దటంచు నేర్పడియె నిట్టి, నేర మేనాఁటి కేని మన్నింపరాని
దగుట నేనేకపత్నీవ్రతావలంబి,నయ్యుఁ గామాంధుఁడనటంచునాత్మ నెంతు. ౨౯

వ. పెద్దకాలము శ్రమించియుఁ బెక్కుగండములం గడచియు నీలోపంబు రూపు
మాపఁ గల్గితి — వెండియు

ఆ. నరముఁ బోనికూన నాచాన కిత్తురు, గానఁ బుట్టి మూఁడునాల్గునాళ్ల
కసువులను దొఱంగ నంతియ కాక వే, ఱొండుభంగి జరుగునోటు వగవ.

వ. నా తెలివిడి గుర్తించి పరిణీతు లెల్లరుం గన్ను దెఱతురు గాక! ౩౭

* * *

౧౦ మతములలో స్వల్పప్రవేశము

క. ఆఱవయేఁ డాదిగఁ బదు, నాఱవయబ్దంబుదనుక నటు విద్యావ్యా
పారమ్ము నెఱపి పెక్కులు, నేరిచితి న్విషయముల మనీషుల కరుణన్. ౧

వ. కాని మతసంబంధిప్రబోధంబు నాకిసుమంతయేని పాఠశాలయందు లభింపదయ్యె-
నద్దానిఁగూర్చి నాపరిసరమ్ముల నించించుక యెఱుఁగుచుంటి - మతంబన నాత్మ
సాక్షాత్కారంబనియొండె నాత్మజ్ఞానం బనియొండె నా యాశయమ్ము. ౨

ఆ. ఏను వైష్ణవుండఁ గాన విష్ణ్వాలయ, మునకుఁ బెక్కుమార్లు చనెడివాఁడఁ
గాని దాన నిచ్చ కల్గద! కడు నస,హ్యంబు వొడమె దానిడంబ మరయ. ౩

క. అట నీతివిరుద్ధము లగు, ఘటన ల్గల వనియుఁ దెలిసెఁ గావున నే న
చ్చటు త్రొక్కుట విరమించితి, నిటు దేవాలయము నాకు నించకపోయెన్. ౪

తే. అట్లగుట నాకు విష్ణ్వాలయంబువలనఁ, బట్టువడినట్టి లగ్గు కన్పట్టదయ్యెఁ
గాని కోవెల నాకు నీలేని దాని, నొసఁగె మాయింట వసియించుముసలిదాది. ౫

తే. అమ్మగువ రంభ యను పేర నలరుచుండుఁ గరము వాత్సల్యమున నన్ను గారవించు
నాకెపై నాకు విశ్వాస మగ్గలంబు, విస్మృతికి రాదు నేఁడు నవ్వాలఁదిచరిత. ౬

క. భూత ప్రేతము లన నేఁ,గాతరతం జెందుచుంటఁ గని తత్సతి సీ
భీతిన్ బోకార్పఁగ వి, ఖ్యాతం బగు రామనామ మహౌషధ మనియెన్. ౭

క. అనవుడు నాభయబాధం, దునుమాడ జపంబు సేయఁదొడఁగితి నతిపా
వనరామనామమంత్రం, బనూనవిశ్వాసపూర్ణ మగుచిత్తమునన్. ౮

వ. అయ్యది పెద్దకాలంబుమాత్రము కొనసాగదయ్యె - నట్లయ్యు లేఁబాయమ్మున
మన్మానసక్షేత్రము నాశ్రయించిన యవ్విత్తనము రిత్త కాదయ్యె-నీనాఁడు రామ
నామంబు నాకప్రతిహతం బగు నోషధి యగుటకు నాఁడు మా రంభ నాటిన
బీజంబ కతంబు నాఁడగు. ౯

సీ. అపుడ రామచరిత్ర నతిభక్తిం బఠియించు,ఘనుండు నాపెదతండ్రితనయుం డొకండు
నా చిన్నయన్నకు నాకును నేర్పించె, రామరక్షాస్తోత్ర మేము దానిం
గంఠస్థ మొనరించి కడంకమై మజ్జన, పర మెల్లరేపులం బఠనసేయం
బూనితి మిప్పార్విక్ - పోరుబందరు వీడి, యల రాజకోటయం దడుగు మోపు

ఆ. సరికి సడలె దీనిం జలుపుటయందుం బ్ర, త్యయము కుదురకున్న నాదినుండి
భ్రాతృగౌరవంబుం బ్రస్ఫుటోచ్చారణా, హంకృతియుం గతంబు లగుచు వచ్చె.

క. బందరులో మజ్జనకుండు, మందుం దినువేళ నెల్ల మాపుల నమృత
స్యందిని రామచరిత్ర న, మందానందానుభూతిమై వినుచుండున్. ౧౧

తే. ఠాణంగన్న లాధామహారాజ సూరి, రామచరణారవింద చింతామరంద
పానపరిమత్తచిత్తుం డప్పట్టునందు, వక్త యయ్యె బిల్వేశ్వరావాసవాసి. ౧౨

మం. అతండు కుష్ఠవ్యాధి కగ్గమై తొల్లి, యౌషధసేవనం బాసింపంబోక
బిల్వేశనిర్మాల్యబిల్వపత్రముల, గాయంబులకుం గట్టి కడుభక్తితోడ
రాత్రిందివమ్ముక్ శ్రీరామనామంబు, జపియించి దుర్వ్యాధిజయ మందె నంట;
యిది నిజంబో కాదో యెటులైన నేమి, నాకు నిచ్చరితపై నమ్మకం బొదవె.

క. మృదుమధురస్వరసంపద, పొదల నతం డతులభక్తిపూరితుండై చౌ
పదముల ద్విపదలం బాడుచుం, బదార్థముం దెల్పు హర్షపరవశుం డగుచున్. ౧౪

తే. అతనితోపాటు శ్రోతృసంతతియు నోడలు,మఱచు నవ్వినుకలియె రామాయణంబు
మీందం గల్గించె నాకు నత్యాదరంబుం, బదియుమూండేండు లుండు నప్పటివయస్సు.

తే. భక్తిపూరిత కావ్యప్రపంచమందు, దివ్యకవితాకళాసముద్దీపితంబు
తులసిదాసకృత బు నిస్తులితమంచు, విశ్వసింతు నిపుడు రామవిభుచరిత్ర. ౧౬

వ. తదనంతర మేము కతిపయమాసమ్ములకు రాజకోటకుం జేరితి- మందు హరివాసర
ములం దెల్ల భాగవతశ్రవణమ్ముక్ ప్రవర్తిల్లుటంజేసి తదాకర్ణనకుతూహలాయత్త
చిత్తుండనై యే నప్పుడప్పు డప్పురాణగోష్ఠికిం జనితిం - గాని పౌరాణికుండు
రచ్చకు మెచ్చుపోడము వడువున వాకుృచ్చువాండు గాండయ్యె- నప్పొత్తము
బత్తికిం దావలంబని యిత్తఱి నెఱింగినాండ- నద్దాని నాతల్లి బాసం జదివి పారవ
శ్యంబు నందితి - వెండియు ౧౭

క. వారణనగరమ్ముక్న ము,వ్వారము లే నుపవసించువడి * నంతర్వా
ణీరత్న మదనమోహనుం, డారమణీయార్థకల్ప నాగారమునన్. ౧౮

---

* వాణీనాం శాస్త్రవాచాం రత్నం వాణీరత్నం వేదాంతశాస్త్రమిత్యర్థః - అంతర్గతం వాణీరత్నం యస్యసః అంతర్వాణీరత్నః ఔపనిషద జ్ఞానవానితి తాత్పర్యం.

క. భాగవతంబున నయ్యయి, భాగంబుల వినిచి నన్నపారం బగు ము
త్సాగరమునఁ దోఁగించె మ,నోగతసంతాపరాశి నుగ్గొనరించెన్. ౧౯

సీ. అత్తఱి మదనమోహనుఁబోని భక్తా,వతంసంబు భాగవతమును జిన్న
తనమందె వినిపింప వినఁగల భాగ్యమ్ము, గల్గిన నాకు నక్కాలమందె
యద్దానిపై గాట మగు నాదరంబు సి,ద్ధించుఁగదా యని యెంచినాఁడ
నపు డుద్భవించు శుభాశుభసంస్కా,రములు సుస్థిరంబులై నిలుచుఁగాన
ఆ. భాగవతమునట్టి భవ్యకావ్యంబుల,బాల్యదశను వినుటఁ బడయనైతి
నే! యటంచు నాకు నెల్లవేళల విచా,రంబు వొడము మానసంబునందు. ౨౦

వ. అయినను. ౨౧

తే. అఖిలమతసంప్రదాయమ్ములందు నాకుఁ, గుదిరె సమదృష్టి యలరాజకోటలోన
నందు హిందూమతమ్మునయందు మిగులఁ, బాదుకొనిపోయె నాదరభావగరిమ.

క. అచ్చట నాతలిదండ్రులు, నిచ్చలుఁ జనుచుండు రామనిలయంబునకున్
జిచ్చుకను వెల్పుగుడికిం, బొచ్చెంబెడయైన భక్తి బొంపిరివోవన్. ౨౩

క. నను వార లనుదినంబును, గొనిపోవుచు నుండువారు కోవెల కేనున్
జననీజనకులతోఁ బ్రా,ర్థనగీతులఁ బాడువాఁడఁ దద్దయు వేడ్కన్. ౨౪

క. వెండియు జైనగురు ల్గురు, దండకు వేంచేసి పెక్కుధర్మంబులపై
మెండుగఁ జర్చల నెఱపుచు, నుండెడివా రపుడు శ్రోత లోపహో యసఁగెన్.

సీ. కలరు మత్పితకు మిత్రులు పెక్కురు మహమ్మ,దీయులు పార్సీలు ధీరమతులు
తమధర్మములఁగూర్చి తగురీతిఁ బలుమాఱు, వచియించుచుండెడివారు వారు
వినుచుండు నవధానమును బేర్మిపేర్మియు, వెలయ నాతండ్రి తద్విషయమెల్ల
నతని కేఁ బరిచర్య లాచరించుచునుంట, నాలించువాఁడ నయ్యయిచర్చ
తే. లిట్టిలాభంబులన్నియు నెనసి మతము, లన్నిటం దుల్యగౌరవ మంకురింపఁ
జేసినవి నాకు వృద్ధోపసేవనంబు, వలన సిద్ధింపఁజాలనిఫలము గలదె. ౨౬

వ. అయ్యదన నాకొక క్రైస్తవమతపరిచయంబు శేషించియుండె - నత్తరుణం
మునం దేతన్మత ప్రచారకులు కొందఱు మాపాఠశాలచెంతకుఁ జేరి ౨౭

క. హిందువుల వారివేల్పుల, నిందించుచుఁ బల్కుచుండ నే డెందమునం
దందుల కెంతయు నేవం, బందితిఁ దన్మతమునం దనాదర మొదవన్. ౨౮

మ. అపుడ వేరందిన హైందవుఁ డొకఁడు, క్రైస్తవమతదీక్షఁ గైకొనె నని యు
నవల గోమాంస మాహారించుటయును, నింద్యమౌ మధుపాననియతిఁ గొంటయును

దన వేషభాషలఁ దలఁగించుటయును, నాతని కనివార్యమై యబ్బె ననియుఁ
గోటలం బేటల గోల హెచ్చయ్యె, నదివినుడుఁ జివుక్కు రనియె నామనసు.

తే. ఆఁబోలసుఁ దింట మద్యంబు నానుచుంట, వేసమునయందు బాసపై వెగటుగొంట
నెద్ది శాసించు నది మతంబే యటంచుఁ, దలఁచితిం గోపతాపము ల్కలఁతపెట్ట.

క. ఈనడుమంత్రపుఁగ్రైస్తవుఁ, డే నెరసో పరిగణించి హిందూమతవి
జ్ఞానమ్ముల నిందింపఁగఁ, బూనినవాఁ డనియుఁ గర్ణపుటములఁ దాఁకెన్. ౩౧

వ. ఇప్పరిస్థితులెల్లఁ గ్రైస్తవమతంబుపై నాకు రోఁతఁబుట్టింప హేతువు లయ్యెఁ-
దక్కినమతమ్ములందు నాకుఁ దుల్యాదరంబు వొడమెనని నొడివినంతమాత్ర నీశ్వ
రునియందుఁ దిరంబులగు శ్రద్ధాభక్తులు జనియించె ననంబోలదు-వెండియు ౩౨

తే. మనురచితధర్మశాస్త్రంబు జనకపుస్త, కాలయస్థంబు గన్గొంటి నపుడు దానఁ
దనరు స్పృష్ట్యాదిచర్యలఁ దఱచిచూడ, నీశ్వరునిమీఁది నాశ్రద్ధ హెచ్చదయ్యె.

క. ఇంచుక నాస్తిక్యముఁ బ్రో, స్తించెను నా కపుడు నామదిం గల శంకల్
వించితిఁ జదువరి యని పే, ర్గాంచిన పినతండ్రిపట్టికడఁ దగు భంగిన్. ౩౪

తే. అతఁడు నాసందియమ్ముల నడఁపఁబోక, తగవు నీకిట్టిప్రశ్నలిత్తరుణమందు
వయసు హెచ్చినవేళ సర్వంబునీక, యెఱుకపడుఁజుమ్ము పొమ్మంచుఁ గఱదలాడ.

ఆ. మిన్నకుంటిఁగాని నన్నుఁ బీడించుట, మానదయ్యెఁ దదనుమానరాశి
మఱియుఁ జోద్యమయ్యె మనువు భోజ్యాభోజ్య, విధులనిర్ణయించువిధముఁగన్న

వ. అందు లోకాచారవిరుద్ధముగా మాంసభక్షణము నంగీకరించు ధర్మసూత్రములు
కొన్ని కానంబడియెఁ-గాని ౩౭

తే. విద్యయు వివేకశక్తియు వృద్ధియైన, నీడు ముదిరిన, ననుభూతి యెక్కుడైన
నప్పుడ యీసంశయములెల్ల నడఁగిపోవు,నని తలఁచియూరకుంటి నయ్యవసరమున.

అ. ఇట్టు లపుడు మను వహింసాప్రబోధ మెు, నర్పకుంట మున్ను నాయొనర్చు
తరసభక్షణంబు తద్ధర్మశాస్త్రస, మ్మతమ కా యటంచు మదికిఁ దోఁచె. ౩౯

తే. సర్పమత్కుణ ముఖ జంతుసముదయంబు, హతమొనర్చుట నీతిసమ్మతమ యంచుఁ
దోఁచుటం గొన్నినల్లులఁబీచమడఁచి, నాఁడ నక్కటికె స్వీడనాడి యపుడు. ౪౦

వ. ఐనను జగత్తునకు నీతి మూల మనియు నద్దానికి సత్యంబు మొదటియాదరు వనియు
న్నాయుల్లమున దృఢవిశ్వాసంబు పాదుకొనియెఁ - గాన సత్యంబ నాకు వలయు
నర్థంబు-దానిగొప్పతనము నిరంతరము నాదృష్టిం బుట్టినందు-వెండియు సత్యముం
గూర్చి నా కావించులక్షణంబును విస్తరిల్లెడి-నదియునుంగాక ౪౧

సీ. సలిలంబు నీకు నీఁగలిగినవానికి, నిష్టమృష్టాన్నంబు నిడఁగదయ్య
కేల్మోడ్పు నిడువానికిన్ భక్తిసంయుక్తిఁ, జాఁగిలి జోహారు సలుపవయ్య
తృణకణం బేని నీ కిచ్చుపుణ్యాత్మున, కపరంజినాణె మీయంగదయ్య
కడగండ్ల నీకుఁ దోడ్పడెడివానికి నీశ, రీరమేఁ గోసి యర్పింపవయ్య
తే. యిచ్చుచోనొండుదశగుణంబిచ్చుటొప్పుఁ, గీడు గూర్చిన మేలు గల్గించుటలవు
చిత్తవాక్కర్మశుద్ధిమైఁజేయు వీని, నెవ్వఁ డాతండ గెల్చుఁబో! యిజ్జగంబు. ౪౨
తే. అనెడు గుజరాతినీతిపద్యం బొకండు, నామనంబునఁ దద్దయు నాటుకొనియె
నందుఁ గీడొనర్చినమేలునాచరింపు, మన్నసూక్తిజీవనసూత్రమయ్యెనాకు. ౪౩

* * *

౧౧ సీమకుఁ బ్రయాణసన్నాహము

క. పదునెన్మిదివందలయె, న్బదియేడవయేఁట జయము వడసితి నే నిం
పొదవఁ బ్రవేశపరీక్షను, బిదపఁ గళాశాల కేగఁ బ్రియపడినాఁడన్. ౧

వ. అంత భావనగరమ్మునఁ గల శ్యామలదాసకళాశాలకుఁ జేరి యందుఁ జదువం దొడఁగితిఁ - గాని యచ్చటి యుపన్యాసములు తల కెక్కమి నాకు నుక్కిరి బిక్కిరి యయ్యె - నిందు నాచార్యులలోపము రవంతయుఁ గానరాదు - వారి కెంతేని ప్రసిద్ధిగలదు - నా కసుగాయతనంబ దీని కెల్ల నిదానంబు నాఁజెల్లు - నిట్లు బహుప్రయాసమ్మునఁ గాలంబు నీడ్చుచు నర్ధవార్షికవిశ్రాంతిదినమ్ములు గడప నింటికిం బోయితి - నయ్యవసరంబున మాకుటుంబమునకుఁ బ్రాఁజెలికాఁడును హితుఁడును విప్రుండును జదువరియు లౌకికజ్ఞానపూర్ణుఁడునగు మావుజీదవే యనునతఁడొకనాఁడు మా నెలవునకు వచ్చె - నితనిని మేము జోషి యనియుం బల్చువారము.

తే. అతఁడు నాతల్లితోడఁ బెద్దన్నతోడ, మాకుశలవార్తలం గూర్చి మాటలాడు
వేళ నాకళాశాలాప్రవేశ మెఱిఁగి, యిట్లు వచియించె నాదర ముట్టిపడఁగ. ౩

మ. తలక్రిందయ్యెను గాల మిప్డు తగువిద్యల్ నేర్వలేకున్న మీ
రలు మీపూర్వులకై వడిం బ్రెగడలై రాజేంద్రులందన్ని యు
జ్జ్వలకీర్తిం గనఁజాల రితఁ డయినన్ సద్విద్య నార్జించి వా
రలవాసి న్నిలఁబెట్టు చందమున మీరల్ యత్నముం జేయుఁడీ ౪

సీ. ఇతఁడు పట్టపరీక్షఁ గృతకృత్యుఁ డగుట కిం,కను నాలుగైదేండ్లు గడవవలయు
నపుడైన నొకచిన్న యధికారముం ద్రిక్కఁ, బ్రెగ్గడపదవి నార్జింపఁజాలఁ

డెన్నినాళ్లో పట్టు మన్నందనుండు కేవలరాముపలె న్యాయవాది యగుట
కానాఁటి కెందఱో న్యాయవాదు లమాత్యతాసిద్ధికై ప్రయత్నం బొనర్తు
తే. ర ట్లగుట వీని సీమకు నంపు టొప్పు, నచట బారిష్ట రగు టనాయాస మందు
రింటికిం జేరవచ్చుమూఁడేండ్లలోన, వెచ్చమున కొకనాలైదువేలు చాలు. ౫

తే. పిలిచియిత్తురు బారిష్టరుల కమాత్య,పదవి నెందేని ధారణీపతులు పేర్మిఁ
దడవు సేయక మోహనదాసునంపుఁ, డాంగ్లభూమికి నాహర్ష మతిశయిల్ల. ౬

తే. మత్సుతున కచ్చటం బెక్కుమంది నెయ్యు,రున్నవారు ప్రసిద్ధిని గన్నవారు
వారి కతఁ డిచ్చు నెఱుకకై వలయు కమ్మ, లితని కిబ్బంది కలుగదొక్కింతయేని. ౭

క. అతఁ డి ట్లని నే నాతని, హితమ్ము నికొన్నయట్ల యెంచి కృపాము
ద్రితదృష్టి నన్నుఁ గన్గొని, కుతూహలము లేదె సీమకుం జన నీకున్. ౮

తే. అనుడు నుప్పొంగి సంతోషవనధి మ్రుంగి, యింతకంటెను స్పృహణీయ మెద్ది కలదు
సిద్ధముగ నుంటి నింగ్లాండు చేరి చదువ, నెంత రయముగ నంపిన నంత లగ్గు. ౯

వ. అని పల్కి త్వరితమ్ముగాఁ బరీక్షలయం దాటితేఱుట కష్టసాధ్యము – కాన వైద్యశాస్త్రముపై నామనంబు తవిలియున్నది – దానిం జదువ సమ్మతింతురే యని నేను వారిం గోరుడు మదగ్రజుఁ డిట్లనియె. ౧౦

మం. ఎఱుఁగవే మనతండ్రి యెన్నెనిమార్లు, వైద్యం బటన్న నేవంబును గనుట
మనకో వైష్ణవమతమునం దుంట, మనకుఁ బీన్గులఁగోఁత మర్యాదయగునె
యని వార లపుడప్పు డాడుచు నుంట, నిన్నుఁ గూర్చియె సుమీ నిక్కంబు నరయ
న్యాయశాస్త్రంబు నీ వభ్యసించుటయు, జనకపాదులకు నిష్టంబైన చేఁత. ౧౧

తే. అనుడు జోషియు నప్పల్కు లనువదించి, యితరశాస్త్రంబులం గోర్కె యేల నీకు
న్యాయశాస్త్రంబ నిన్ను జేగీయమాన, చరితుఁ గావించు మదుపదేశంబు వినుమ.

వ. ఇట్లు బోధించి యప్పొఱుడు మాయమ్మకడ సెలవునంది నిజనివాసమునకుం జనియె నంత ౧౩.

సీ. ఆశాలతాజాల మస్మన్మనోవీథి, నల్లిబిల్లిగ నట్టె యల్లుకొనుడు
నిర్మింపఁ బూనితి నిరుపమశిల్పసం, పద పెంపు దీపింప బయలిమేడ
లర్థంబు తగినంత యలవడు టెట్లొకో, ఖండాంతరముల కేకాకిఁ జేసి
యీతమ్ముఁగుఱ్ఱ నేరీతిఁ బంపుదు నొకో, యనుచింత మున్గె నాయగ్రజుండు
ఆ. నన్ను విడువలేక నాతల్లి నిర్మల,ప్రేమమూర్తి యార్తిఁ బెల్లువగచి
మద్విదేశయాత్ర మానింప నొకయుక్తి,పన్ని యిట్టు లనియె నన్నుఁ గూర్చి. ౧౪

క. అన్నా కలఁడు గదా మీ, పిన్నయ్య కుటుంబమునకుఁ బెద్ద యతఁడు ము
న్మ్మ న్నిందుఁ దదంగీకృతి, గొన్నక్ మన మెల్ల నరసికొందము పిదపన్. ౧౫

వ. నావుడు నాయన్న యిట్లనియె. ౧౬

సీ. పరికింపఁ బోరుబందరు నరేంద్రునిచెంత, మన కించుకంత స్వామ్యంబు గలదు
నేఁ డచ్చటం గార్యనిర్వాహక పదంబు, నందు లేలీ యనునతఁడు వెలయు
నతనికి మనపట్ల నాదరం బధికంబు, మఱియుఁ బితృవ్య నమ్మానసీయుఁ
డెంతేని మన్నించు నిపుడు నీవిద్యకై, యొడయఁడు కొంతసా మ్మొసఁగునట్టు
తే. లతఁడు తోడ్పడవచ్చు నం చనుడు నాకు, నచ్చె నప్పలుకు లుత్సాహ మెచ్చిపోయె
నపుడ పయనంబు గట్టి నాలైదునాళ్ళ, కేగితిని బందరున కొంటె నెక్కి సుక్రిక్కి.

ఆ. అంతఁ బిన్నతండ్రిచెంతకుఁ జేరి సాష్టాంగవందనంబు నాచరించి
విషయమెల్ల విన్నవించుడు శ్రద్ధమై, నరసి యాతఁ డిట్టు లానతిచ్చె. ౧౭

తే. భారతీయుఁడు నిజమతాచారసరణి, విడువ కింగ్లాండునం దుంట కడు నసాధ్య
మేమిభేదము గాన్పించు నిపుడు వెలయు, నల్లబారిష్టరునకును దెల్లదొరకు. ౧౮

క. అతఁ డశనమ్ము దేశ విధి, ప్రతిషేధము లుఱఁడు ధూమపానంబు న నా
రతముగఁ గావించును సి,బ్బితి మాలి ధరించు నాంగ్లవేషము నిస్సీ. ౨౦

వ. మనకుటుంబ మిట్టిమనుగడకు దూరమైయుంట యెంతయు నుచితంబు - మఱియు

తే. అచిరకాలమునం దీర్ఘయాత్ర కేగ, నుంటి నే నిఁకఁ బెక్కునా ళ్ళుంట కల్ల
కాటికిం గాళ్ళు సాఁచి యేకరణిఁ గడలి, పయన మంగీకరింతు నిప్పట్టునందు. ౨౨

తే. ఐన నీపోక కే విఘ్న మాచరింప, నొల్ల నిత్తఱి నీకు నీతల్లి యొసఁగు
సమ్మతియె ముఖ్య మామె కిష్టంబ యైన, నీవు గ్రక్కునఁ బోగ యోడ నెక్కవోయి.

క. ఏ నడ్డ మాడ నని య, మ్మానినికి న్విన్నవింపుమా తత్సతి నీ
కాన యొసంగిన నేనుం, బూని శుభాశీషము లొసఁగి పుచ్చెదఁ జుమ్మా. ౨౪

సీ. అనవుడు నుప్పొంగి యంతియ చాలు నో, యనఘ! మజ్జనయిత్రియాజ్ఞ వడయ
నీఁక యత్న మొనరింతు నింకను మీ రొక్క, సాయ మొనర్పఁ డీసమయమందు
నాసీమపయనంబునకు లేలి దొర కొంత, యార్థికసాహాయ్య మాచరించు
గతిఁ బరిచయపత్ర మతనిపేర నొకండు, దయసేయుఁ డో పిన్నతండ్రి! యనిన
ఆ. నే లిఖించు టెట్లు నీవ విన్నప మొన, రించుకొమ్మ తండు మంచివాఁడ
మనకుటుంబ మన్న మన్నన సూపు సాయం బొనర్పవచ్చు నర్హభంగి. ౨౫

వ. అని పల్కి యతడు నన్ను మిన్నకయ పంపె - నీపాటిమేలొనర్ప నాపితృవ్యుఁ డేల నిరాకరించెనో చెప్పఁజాల - గాని తాను దూష్యం బని విశ్వసించు ఖండాంతరప్రయాణమునకుఁ బ్రత్యక్షసాహాయ్య మాచరించుట యుచితంబు గాదని యతఁడు వెన్నాడి యుండు నని నాతలంపు. ౨౬

క. అంతట నే లేలీ దొర, చెంతకుఁ జని వంగివంగి చేసి ప్రణామం
బెంతయు మెలఁకువఁ బూని హృ,దంతర్గతవాంఛితంబు నాతనితోడన్. ౨౭

తే. మనవి సేయుడు నే మణుమాత్రమేని, వోడుపడ మిప్డు పట్టభద్రుండ నైన
వెనుక మముఁ జూడ రమ్ము పొమ్మనియె నాతఁ,డట్టి నిల్వ్రాన నీ త్రైతి నపుడు నేను.

ఆ. ఆస లెల్ల నిట్లు వీసరవోవ న,చ్చోటు వాసి రాజకోట సొచ్చి
జోషికి న్మదగ్రజునకును దల్లికిఁ, దెలిపితిం బ్రయాణఫలిత మెల్ల. ౨౯

క. అత్తఱి జోషి ననుం గని, చిత్తమ్మునఁ దత్తరమ్ము సెందక యెం దే
విత్తమ్ము నప్పుగాఁ గొని, యుత్తమకార్యంబు దీని నొనరుచు టొప్పున్. 30

క. నాపుడు ఋణంబు ప్రణము గదా! వల దీచేఁత యస్మదగ్రాంగి విభూ
షావిసర మమ్మి పడమటి, దీవికిఁ బోఁదగదె యంచుఁ దెలిపితి నేనున్. 3౧

తే. అంతదూరంబు వో నేటి కనుజ! నాదు, సర్వశక్తులఁ జూపి విశ్వప్రయత్న
మాచరించి సిద్ధ మొనర్తు నర్థ మని స,మగ్ర మగు ప్రేమఁ బలికె మదగ్రజుండు.

తే. అతఁడు ప్రేమించు నన్నుఁ దా సుతునివోలె, నతనియౌదార్యసంపత్తి కవధి సున్న
యతనియెడ నాకు నిస్సీమమైనభక్తి, యతనిదెస నాకు విశ్వాస మగ్గలంబు. 33

సీ. మజ్జనయిత్రికి మాత్ర మాశాస్యంబు, కాదయ్యె నింకను నాదుపయన
మాంగ్లదేశమ్మున కరిగినవారెల్లు, భ్రష్టు లయ్యెద రెల్లవగల నంచు
నామె కొక్కఁడు సెప్పె నంజక గోమాంస,మారగింతు ర టంచు నాడె నొకఁడు
మదిర ద్రావక యున్న బ్రదుకలే రనె నొకం,డేమేమొ బోధించె నింక నొకరుఁ

తే. డిట్టికత లామె చిత్తము నట్టె కలఁత,పెట్ట నాయమ్మ పట్టె! నీ వెట్టు లెల్ల
చెట్టలకుఁ బుట్టినిల్లైన సీమ నుందు, విట్టలం బగుకీర్తి నట్టేటఁ గలిపి. 3౪

క. అని నన్నుఁ బృచ్ఛ సేయుడు, జననీ! నీ కేల యిట్టిశంకలు ఋజువ
ర్తన మించు కేనియు న్విడ,నని శపథ మొనర్తు నమ్మవా నాపలుకుల్. 3౫

క, ఏదే నపాయ మున్నన్, గా దని వారించుఁ గాని కామక పొమ్మం
చాదేశింతురె మనగురు, పాదు లొడంబడుదు రొక్క భ్రాతలు సెపుమా. 3౬

ఉ. నాపుడుఁ దల్లి పల్కెఁ బ్రియనందన! నీహృదయంబు దూష్యపుం
ద్రోవలఁ ద్రొక్కఁ దం చెఱుఁగుదుం జుమి నేఁ; నటులయ్యు దూరపుం

దీవుల నున్నవేళ దురతిక్రమమై పరధర్మ మంటి ని
న్నేవిధినీడ్చునో! చెడుగునెంచి శుభంబుగణించుటొప్పగున్. ౩౭

వ. ఇప్పట్లఁ గింకర్తవ్యతామూఢనై యే నున్నదాన – నా సందియమ్ముల బేచరజీ స్వామికి విన్నవింతుఁగాక – యని పల్కి మత్కులజుండును జైనసాధువునై మాక్షేమంబు నిచ్చలు నిచ్చగించు నక్కర్మందిం జేరి తన భావమ్ముల నెల్ల వెల్లడింప నతఁడు నాపోకకు ననుకూలుండై యామె కిట్లనియె. ౩౮

తే. సత్యశీలుఁడితండు సంశయము లేదు, కాన నిత్తఱి మూఁడు వాగ్దానములను
వీనివలన గ్రహించి యవ్వెనుక సీమ, కంపఁదగు నట్టులైన భయంబు రాదు, ౩౯

వ. ఇట్లు పల్కి నాచేత ౪౦

తే. మాంసమును మెక్క మద్యంబు మరగ నొల్ల, నంగనను దాఁకననియతం డప్పుడు మూఁడు
బాసలాడించె నవ్వల నా సవిత్రి, సమ్మతిం జూపె మత్ప్రయాణమ్ము పట్ల. ౪౧

సీ. పదపడి నా సీమపయనంపు ముచ్చటల్, తెల్ల మయ్యెను వీట నెల్లరకును
నను వీడుకొల్ప నున్నతపాఠశాలలో, నడిచెను సమ్మేళనం బొకండు
తత్సభ న్నాదు కృతజ్ఞత సూచింపఁ, గూర్చితిఁ గొన్ని పల్కులు శ్రమించి
చదువఁ బూనినయంతఁ దుదలేని భయము న, గ్గలమైన కంపమ్ము నలముకొనియె
తే. నవల నెయ్యము దియ్యమ్ము నతిశయిల్లఁ, బెద్ద లొసఁగెడి దీవనల్ పెక్కు వడసి
యాదరంబున నగ్రజుఁ డనుగమింపఁ, బయనముం గట్టినాఁడ బొంబాయిపురికి. ౪౨

* * *

౧౨ జాతిబహిష్కారము

సీ. అస్మజ్జననిపన్ను నంది దీవన పొంది, పసిబిడ్డ నెడఁబాసి పడఁతి విడిచి
నవనవోత్సాహంబు నటియింప బొంబాయి, నగరంబునకుఁ జేరినాఁడ నేను
దత్రత్యులై మించు మిత్రు లియ్యది గ్రీష్మ, సమయంబు భారతజలధి యిప్పు
డల్లకల్లోలంబు నతిభయంకరము నై, యుండెడి హేమంత మొదవుదనుక
ఆ. సాగరప్రయాణ మాఁగుఁ డటంచు నా, యన్నతోడఁ బల్క నాతఁ డచటఁ
దనదు మిత్రునింట నను డించి మాబావ, కప్పగించె మత్ప్రయాణధనము. ౧

వ. పెండియు నాకు వలయుసాయమెల్లఁ గావింపఁ దన నెచ్చెలులం గోరి తా రాజకోటకుఁ జని తనకొల్వునం జేరె – నంత ౨

ఆ. పొద్దు వోవదయ్యె బొంబాయిలో నాకు,గడియ వత్సరంబుకరణిఁ దోఁచెఁ
బవలు రేయి సీమపయనంపుసుద్దులే, పలవరింత లాయెఁ బలువిధాల. ౩

తే. ఇంతలో మత్కులంబువా-రేను సీమ, కేగుటం గూర్చి చర్చించి యిది నిషిద్ధ
కృత్య మని యెంచి నన్ను బహిష్కరింప,నిశ్చయించిరి రోసంబు నిట్టవోడువ. ౪

క. వా రందుల కొకరచ్చం, గూరిచి ననుఁ బిల్వ జంకుగొంకుల నెదకున్
దూర మ్మొనర్చి తత్సభఁ,జేరితి న త్తెగువ యెట్లు సిద్ధించినదో ౫

వ. పదంపడి మజ్జనకునకుఁ జెలికాఁడును మాకు నెడబందుగుఁడును మా"మోధు" వైశ్యకులంబునకుఁ బెద్దయు నగు సెట్టి నా కిట్లనియె. ౬

మం. సీమకుం బయనంబు సేయంగ నీవు, నిశ్చయించితి వంచు నే మెఱింగితిమి
మనకులక్రమసిద్ధమర్యాద నరయఁ, గడలిపై నేగుట కానికార్యంబు
నిజధర్మసంరక్ష నెఱవు టచ్చోట, దుశ్శకం బని చెప్పుదురు పెద్దలెల్ల
దొరలతోడం గూడి దుర్భోజనంబు,నారగించుట తప్పు దందు రద్దీవి
నిట్టిదుష్కార్యంబు నె ట్లాచరింతు, వుజ్జగింపుము నీదురుద్యోగబుద్ధి. ౭

చ. అనవుడు సీమ కేగుట రవంతయు దూష్యముగాదు విద్దియ౯
బనివడి యభ్యసించుటకై నమ్ముఁగట్టితి నేను మాంసముం
దిననని కల్లుద్రావనని దీక్షమెయి న్సమయం బొనర్చితి౯
జననిసమక్షమం; దదియ సాఁదు ననుం బరభూమి నెంతయు౯, ౮

మ. అని నేఁ బల్కిన సెట్టి యిట్టు లనెఁ గుఱ్ఱా! సీమకుం జేరినం
తన నీదీక్షలు నీప్రమాణములు నీధర్మంబులు౯ జాఱు; నా
కును నీతండ్రికి నున్నతియ్యు మది నీకుం దెల్లమే కానఁ గై
కొనుమా మద్వచనంబు మేలుకొనుమా కొంచెమ్ము తర్కింపుమా. ౯

వ. అనుటయు నే నతని కివ్విధిం బల్కితి. ౧౦

తే. ఆర్య ! తత్స్నేహమెల్ల నా కవగతంబ, గురుసమానుల మీరు నా కరసిచూడ
నట్టు లయ్యును మన్నిర్ణయంబు,నిపుడు,విడువఁజాలను నా కొండు వెరవు సున్న. ౧౧

తే. కలఁడు నాతండ్రికిం జెలికాఁడు హితుఁడు, పండితుఁడు నై విరాజిల్లుపాఱుఁ డొకఁడు
సమ్మతించె నతండు దోసమ్ము వీస,మేని లే దంచు నాసీమపై నమందు. ౧౨

ఆ. మఱియు నాలుకొనియె మన్మాత భ్రాతయు, నియ్యకొనియె ననుడు నింత యేల
సంఘశాసనంబు సమ్మతి నొదలఁ, దాల్పవా యటం చతండు కసరె. ౧౩

తే. అంత నాకిఁక లేదు గత్యంతరంబు, వీఁకమై నేను సీమకుఁ బోక మానఁ
గులమువా రిపుడిందుఁ బాల్గొనుట తగదు, పట్టువిడిమీర లెఱుఁగు శ్రీ పాడికొఱుఁగు.

క. అని నేను త్తరమొసఁగుడు, మునిఁగి యతం డతులరోషమునఁ బలువగలన్
నను దిట్టుచుఁ గనుఁగొనలం, గనదగ్నికణంబు లురలఁ గన్గొనెఁ గొలువున్. ౧౫

ఆ. వీనిఁ గులమునుండి వెలివెట్టితి న్నేఁడు, పూని యెట్టిసాయ మేని వీని
కాచరించువాని కపరాధశిక్ష స, పాదరూప్య మంచుఁ బనుపు నిడియె. ౧౬

సీ. అవ్వల నేను రవ్వంతేని జంకక, సెలవుఁ గైకొని పెద్దసెట్టిచెంత
బసఁ జేరి యేతత్స్వభావిశేషమ్ములు, విన్న వెన్నిచ్చునో యన్న యంచుఁ
జింతసేయుచు నుండ నంతలోఁ గులము బ, హిష్కరించును గాక యించుకేని
భయము సెందకు మీవు పయనంబు మానకు, మని కమ్మ నతఁ డంపె సది యదృష్ట
ఆ. మంత నాకు నెక్కుడయ్యె నారాట మిం, కేల జాల మనుచు నెంచుచుంటి
నపుడ సీమ కొక్కఁ డరుగుచున్నాఁడు బా, రిష్ట రగుట కని యెఱిఁగినాఁడ. ౧౭

తే. అంత నగ్రజునెయ్యుర కయ్యెదంత, మొఱుక సేయుడు విడువకు మిట్టికోడు
ననుచు నా రియ్యకొని రంత నవధిలేమిఁ, దంతియిచ్చితి నన్న కాతండు నొప్పె,

క. పిమ్మట మాబావను సా, మిమ్మంటి నతండు కులబహిష్కరణత్రా
సమ్మనయుండు మునింగి ధ, న మ్మొసఁగం జాల ననియె ననిచినచింతన్. ౧౯

వ. అంత నయ్యంతరాయమున కే నెంతయుఁ గలంగి మత్కుటుంబమిత్రు నొక్కని డాసి నాసీమపయనమునకు వలయురొక్కము నొసంగి యవ్వేన్క నద్దాని మాయన్న కడం గైకొనుఁడని వేఁడ నయ్యయ్య నన్ను సంప్రాప్తవిత్తునిఁ జేయుటయ కాక తద్దయుఁ బ్రోత్సహించి నాజతనంబు నగ్గించి నాసమర్పించు కృతజ్ఞతం బడసెనే నవ్వలఁ దగుధనము వెచ్చించి నాకాప్రయాణ పత్రము విలిచి గ్రాసవాసముల నవరించుకొంటి - నంత నాకుఁ దోడై వచ్చు జనఘుడు న్యాయవాది త్ర్యంబకరాయిమజముదా రుండుగదియంద మన్మిత్రులు నా కొక సెజ్జ గైకొని నన్నతని కెఱుక పఱిచి యతఁడు నాయెడ నొసంగునభయదానమ్ముఁ బరిగ్రహించి- తమ్మజముదారు వయోజ్ఞానములం బెద్దయైనవాఁ - డేను లోకానుభవమెఱుంగని యష్టాదశవర్షంబుల కసుగాయనై యుంటి - నివ్విధంబున ౨౦

తే. వసుగజైకార్య కుముదినీబంధు సంఖ్య, వసుధ నెసఁగు క్రీస్తవశకవత్సరమున
నవమమాసతురీయదినమ్మునందు, బయలువెడలితి నేను బొంబాయి విడిచి. ౨౧

* * *

౧౩ తుదకు సీమ

తే. ఎల్లరకు సంబురాశిపై నేగువేళఁ, బాడమునొకరింతలు నాకుఁ బుట్టవయ్యెఁ
గాని యారాట మధికంబు గాఁదొడంగె, నల్లనల్లన గాలంబు సెల్లుకొలఁది. ౧

సీ. పైకొనె మొగమోట నాకు నుగ్రాణింపు,నధికారితోడ మాటాడఁబోవ
నలవాటులేని కార్యం బౌట నాంగ్లేయ,భాష నే నొకపల్కుఁ బల్కఁజాల
నొక్కమజందారు త్రిక్క మాగదినున్న, తెరువరులెల్లరుం దెల్లదొరల
వారితోఁ బలుకాడ నేరనైతిని వారి,కొసఁగలేనైతిఁ బ్రత్యుత్తరంబు
ఆ. నలఁతివాక్యమేని వెలలించుటకు మున్ను,గొణఁగవలయు లోనఁ గొన్నిసారు
లేమిసెప్పువాఁడ నే నప్పు డుచ్చులోఁ, బడి తపించు పులుఁగు పగిది నుంటి. ౨

సీ. భోజనశాలకుఁ బోదునా యన్నఁ గత్తులు గరిటెలు వాడువల నెఱుంగఁ
బోలసుపా తెడయైనభోజ్య మెయ్యది యంచు, నడుగుదునా యన్న నళుకుపుట్టుఁ
బదిమందితోఁ గూడి ముదమార నన్నంబు, భుజియింతునా యన్నఁ బొడము లజ్జ
మెల్లరయాచార మీకొందునా యన్నఁ, దల్లి కిచ్చినబాస తన్నుచుండు
తే. నిట్టిచిక్కులు పెక్కులు ముట్టడింప, నోడపై నెక్కుసమయానఁ గూడఁ దెచ్చి
కొన్నపండ్లను జిఱుదిండ్లఁ గొద నడంచు,కొనుచు నుంటిని గదియంద కూరుచుండి.

క. ఈ యడ్డంకులు త్ర్యంబక, రాయికి నిసుమంత గానరావయ్యె సతం
డేయెండకు నాగొడుగుఁగ, వేయు దొరలఁ గూడి మాడి వేడుకఁ దిరుగున్. ౪

వ. అతఁడు నాసిగ్గరితనంబు నుపలక్షించి. ౫

సీ. ఇంత సిగ్గేల నీ కెల్లరతోఁ గూడి, సల్లాప మొనరింప శంక యేల
న్యాయవాదిపదంబు నర్థించువారెల్ల,వాచాలురై యుంట వలయు మివుల
గుణదోషముల లెక్కగొనక సంభాషింపు, మవకాశ మొదవుచో నాంగ్లమంద
పెఱబాసలోఁ దప్పు దొరలకుండువిధాన.వచియించు టరిది యెవ్వారికైన
తే. ననుచు నన్నెచ్చరింప నయ్యాదియు నాడు,వెఱపు నడఁగింపదయ్యె నిక్కరణినుండ
నక్కటికతోడ నాంగ్లేయుఁ డొక్కరుండు,తివిరి మాటలలోనికి దింపె నన్ను. ౬

ఆ. ఎచటి కేగువాఁడ వెయ్యది కార్య మ్మా,హార మెద్ది నీకు నద్దిరయ్య
యింతబిడియ మేల యేటి కీయరవాయి,రమ్ము సాపడంగ మమ్ముఁ గూడి.
వ. అని పల్కి యతఁ డాహ్వానంబు ముట్టఁ దగ దను నా కట్టడకుఁ బెద్ద నవ్వి కెంగడలి
న్నేమము పయనంబుసేయుతఱిఁ జెలికారంబు వెలయ నిట్లనియె. ౭

ఆ. వినుము నీదుదీక్ష బిస్కట్ సముద్రింబుఁ, జేరనంతవట్టు చెల్లుఁ గాని
యవల నిల్వఁజాల దాంగ్లదేశమ్మున చలికి బ్రతుకఁ గలవె పొలసు విడచి. ౯

క. నావలె నిను సారాయిం, దౌషధమనితి నోటు మద్యపానస్పృహ సం
భావించి మాంసముం దిని, జీవమ్ములు నిల్పుకొమ్ము చెప్పకుము కుతర్కా. ౧౦

వ. అనుటయు

క. మీ యుపదేశమ్మనకుఁ, వేయినతుల్ కాని యిల్లు విడచెడివేళన్
మాయమ్మచెంత నామిష, మేయెడ భుజియింప నని యిచ్చితి బాసన్. ౧౨

క. అప్పా! నంజుడు నమలక, తప్పనిచో నీమ కొంకణిందం గిడి నఁ
జప్పన నింటికిఁ జేరుదు, నొప్పుకొన నాఁటిశపథ ముల్లంఘింపన్. ౧౩

వ. ఇట్లు నే నతనికి విన్నవించితి. ౧౪

సీ. ఇంతలో మానౌక యీఁగె బిస్కెవార్ధి, నపుడు నమాంసాహార మంతు నొకఁ
యక్కఱ పొడసూపదయ్యె నించుకయేని, దాని కేంతయును సంతసము నంది
జనయిత్రివాంఛితం బనుసరించి తదాంగ్లమిత్రు నర్థించి యామిషము నాశిం
గింపలే దిత్తఁ డన్న కిల్లాకు వడసి కొన్నాళు లద్దానిఁ బ్రాణంబువోలె
ఆ. రక్షసేసి మాంసభక్షకులుం గొంద, ఱిట్లె సలుపుచుంట యెఱిఁగి పిదప
దానిమీఁదికాంక్షఁ దలఁగితి నాపల్క, నమ్మనపుడ దెట్లు నన్నుఁ జోచ్చు. ౧౫

వ. ఇటఁ బ్రకృతమునకు వృత్త- మంత మానౌకక్రమక్రమంబున లండనునగరమ్ము
సేరుడు నేనును ద్ర్యంబకరాయియు విక్టోరియాభోజనశాలకేగి యందువిడిసితిమి-
నే నంతకు మున్న ప్రాణజీవన మెహతా, దలపతిరాంశుక్లా, రంజిత్‌సింహ
మహారాజు, దాదాభాయి నౌరోజీలపేర మన్మిత్రు లొసంగినపరిచయలేఖలఁ
బట్టి భిషగ్వరుఁడగు మెహతాకు నారాక నెఱిఁగించుచుఁదంతిపంపితిఁ- గాన నతఁ
డయ్యన్నవిక్రయశాలకు వచ్చిన న్నెంతయు గారవించి వలయు సందేశము
లొసఁగె- నచటిభోజ్యములందు నాకొకటియు నించదయ్యెఁ - గాని వెచ్చముం
జూడ గుండియలు పగులసాగె - నవ్వల మే మద్దానిఁ బరిత్యజించి కొండొక
యుద్దెగదిం జేరితి - మంత నాకు ౧౬

ఆ. మనసునందు సతము మాతృదేశముపైని, దల్లిపైని బెంగ తద్దయయ్యె
నిదుర పట్టనీక నిలయపరిస్థితుల్, తలఁపునందుఁ బాఱి కలఁతపెట్టె. ౧౭

క. నాకడగం డస్యునితో, వాకొనరానట్టివయ్యె వాకొన్న నెవం
డీకష్టంబుల డెంపి యోకార్యంగలఁడి వెట్లు పోవును దవ్వై. ౧౮

మం. అచటియాచారాదు లన్నియు నాకు,సరిక్రొత్తనై పెల్లు సంకటపెట్టఁ
గడుజాగరూకతఁ గాలంబు గడపు,టనివార్య మయ్యె నయ్యాదియును గాక
యాకుబువ్వప్రతిజ్ఞ నావంతయేని,పాయక దీక్షమైఁ బాలింప వలయు
నిఁకఁ దినుబండంబు లిష్టము ల్గావ,యటు నూయి యిటు గోయి యాయె నామనికి
యింగ్లండులో నుంట కే నేరనైతి,మాతృదేశమునకు మరలలేనైతి
నీ మూఁడువర్షంబు లెట్టెటో నిల్వు,మని ప్రబోధించె నాదగుసంతరాత్మ. ౧౯

* * *

౧౪ నా య భి రు చి

క. మోహాతా మఱియొక పరి మద్,గృహమున కేతెంచి తత్పరిస్థితుల నెఱిం
గి హాసించి యిట్టినిలుకడ,స్పృహణీయము గా దటంచుఁ బెదవి న్విఱిచెన్. ౧
వ. వెండియు నతండు ౨
క. ఒంటరివై నీ వీగది,నుంటన్ ఫల మేమి యేతదుర్వికిఁ జమువుం
గొంటక వచ్చితి మైనను,గంటయు నక్కఱయె యిందుఁ గలనడవళ్లన్. 3
తే. ఎవ్వరికుటుంబమందైన నెనసి యున్నఁ, గాని చిక్కకు తత్పరిజ్ఞాన మెల్ల
నందు వర్తింపఁ దగునేర్పు నభ్యసింప,వలయు మున్ముందు హితులైనవారిఁ జేరి. ౪
క. నాయనుఁ గొక్కఁడు కలం,డాయనకడ నిల్వు మిప్పు డని పల్కెడు నే
నీయకొని తద్గృహమునకుఁ, బోయితి నన్నతఁడు మిత్రుపోలికఁ జూచెన్. ౫
ఆ. మఱియుఁ దెల్లవారిమర్యాద లెఱిఁగించి,యాంగ్లభాష మాటలాడఁ జేసి
జంకుగొంకు లెల్ల సవరించెఁ గాని నా,కొంట దయ్యె నతనియింటివంట. ౬
సీ. త్యాజ్యంబు లగుఁ గొన్నిభోజ్యముల్ చవిలేమి,నిష్టమైనపదార్థమేని మగుడ
నర్థింప సిగ్గు దా నడ్డమై కరము నన్,బాధింపఁ దొడఁగు నిప్పగిది ననుది
నం బుపవాసకల్పం బయ్యె మద్భుక్తి; యెఱచి మెక్కు మటంచు నెల్లనాఁడుఁ
జెలికాఁడు వాదంబు సేయుచు నుండు నా,దురవస్థఁ దిలకించి పరితపించి
ఆ. యవల నాప్రమాణ మతనికిఁ దెల్పి నే,మిన్నకుండువాఁడఁ గొన్నివాస
రమ్ము లిట్లు గడవ నమ్మిత్రునకును దు,ర్భరమ యయ్యె నాదునర్తనంబు. ౭
వ. ఒక్కనాఁ డతడు నన్గాంచి
తే. ఈవు మతోస్సోదరుండవై తేని దఱిమి,యుందు ని న్నెన్నఁడో శంక నందఁబోక
యిట్టివెడఁగుఁదనంబు నీ కెట్లు లొదవె,నవ్వారే బుద్ధిమంతు లీనడత విన్న...

తే. ఇచటియక్కఱ లించు కే నెఱుఁగ లేక, చదువుగంద మెఱుంగని జననిచెంత
నాచరించినబాసకై యడల తేల, యెట్లు బాధించు నది దాని కేమివిలువ. ౧౦

తే. అది ప్రమాణంబ కాదు న్యాయంబు ననుసరించియునుబాసగానదియెంచఁబడదద
దానికిం గట్టువడుట యజ్ఞాన మిట్టి, పట్టుదల యున్న నిచట లాభంబు సున్న. ౧౧

తే. మున్ను నీ వామిషంబును దిన్నయట్లు, నది రుచించినయట్లు నాడెదవు బళిర
కోరి యక్కఱలేనిచో నారగించి, యున్నచో నొల్ల నందు వేమాయి నెచ్చెలీ! ౧౨

క. ఇది నీదురదృష్టం బని, మది నెంచెద ననియె నేనుమాత్రము నీతో
వదలుకొననైతి నించిన, పదార్థముల నిల్పుచుంటిఁ బ్రాణము నోపలక్. ౧౩

క. ఎఱిచి స్నుతిచియ మా కిద్దఱకుఁ దినదినము చర్చ తఱచుగ జరుగన్
దొరఁకొనె నాతి తర్కము, పెరుఁగుకొలఁది నేను బిఱ్ఱబిగియుచు నుందున్. ౧౪

క. అనుదినమును రక్షణకై, వినుతించుచు నుంటి విశ్వపతి నట్లు ఫలియున్
బనుపడుచు నుండె నీ ప్రీఁతి నొనర్పం బ్రిత్యయంబు కారణ మయ్యెన్. ౧౫

వ. అదియుం దొల్లి మాదాసి యగు రంభ గుప్పినబీజంబ— యిట్లుండ నొకనాఁడు నాచెలికాఁడు బెంథమను నతఁడురచియించినవస్తూపయోగసిద్ధాంతమను గ్రంథమును జదువ మొదలిడె— నందలిభాష నాకు దురవగాహం బగుట నతండు తద్విశేషంబుల నెల్ల నెఱుకసేయఁ దొడంగె—నంత నే నతని కిట్లంటి. ౧౬

సీ. నెచ్చెలీ! నన్ను మన్నింపు నాకు నగమ్య, విషయంబు లిట్టి వామిషము దినుట
యావశ్యక మటంచు నంగీకరించెదఁ, గాని నాశపథంబు మాన నొల్ల
నద్దానిగుఱిచి వాదాడ వాదమునందు, ని న్నోర్వలే నంట నిక్కువంబు
మొఱ కనియో జగామొండివాఁ డనియొ భావించి న న్విడువు ముద్వేల మైన

ఆ. నెనరు సూపు నిన్ను నే మఱవంజాల, నస్మదీయసుఖము నభిలషించి
విడువ కిట్లు నీవు నొడువుచున్నాఁడ వం, చే నెఱుంగ నోటు హితనతంస. ౧౭

ఆ. ఐన విడువనోప నూనినసమయంబు, బాస బాసయేకదా సతంబు
దాని నతకరింపఁ దగదు సుమా నీకు, నెఱుకవడనిధర్మ మెద్ది గలదు ౧౮

క. ఇవ్విధిఁ బల్కుడు నెయ్యుఁడు, నివ్వెఱఁగుం జెంది బళిర నీ నీతి కిక
నివ్వాదం బొనరింపను, జువ్వె! భవన్నియమశుద్ధి సుశ్లాఘ్య మనన్. ౧౯

క. అందుల కే నెంతయు ముద, మందితిఁ బలలంబుఁగూర్చి యతఁ డవ్వలఁ ద
ర్కం దెచ్చుట విడిచియు నెద, యందున్ నను గుఱిచి సేయు ననిశము చింతన్.

ఆ. తాను నతఁడు చుట్ట సేవించు మద్యంబు, వాని నభ్యసింప వలయు ననఁడు
మఱియు వాని నెపుడు మరగకు మని నన్ను, హెచ్చరించు నెయ్య మచ్చుపడఁగ.

క. ఆమిషమ్ముఁ దిన కుండిన, నామేను కృశించు ననియు నా కటులైనన్
సీమనివాసం బొంటక, బాముల నిడుననియు బెంగపడు నతఁ డెపుడున్. ౨౨

వ. ఇటు లమ్మిత్రునింట నా కొకమాసంబు సెల్లె - నతని మనికిపట్టు రిచ్మండులోఁ గలదు - కాన లండనునకు నారమున కొండు రెండువారములకు మించి పోవ నయితి కామి నత్తావున కనతిదూరమునం దెయ్యే నొకసంసారమున నన్ను నిల్పు టావశ్యకం బని మెహతా, శుక్లా లూహించి వెస్టుకెన్సింగ్టను నందొక యాంగ్ల హైందవకుటుంబమున నాకు వసతిఁ గల్గించి - రయ్యింటి యామె విశ్వస్త - నా నియమము మాయమ్మకుం దెల్పి తదనుమతిఁ బడసి నే నచ్చోట విడిసితి-నంత ౨౩

ఆ. రుచికి దూర మగుట నచటియాహారంబు, నించదయ్యె నాకు నించు కేని
నిండి నాదులజ్జయుండె యథాపూర్వ, మిడుమ లడఁగవయ్యె నింతవట్టు. ౨౪

తే. ఆమెకుం గూఁతు లిద్ద అయ్యాబల లార, గించుతఱి వలదని నివారించుకొలఁది
వేయుదురు నాకుఁ జెఱియొక వేఁడిరొట్టెఁ, దెలియరై రింక నొక రెండు వలయునంచు.

క. మది కొదవె నిప్పటికి నె, మ్మది; విద్యా శ్రమము సక్రమంబుగ నింకన్
మొదలిడనైతిని బత్రిక, చదువం దొరఁకొంటి నొక్క-సంగాతి యిడన్. ౨౬

క. ఒకగంట చాలు నప్పని, కిఁకఁ జాగించితిని నగర మెల్లను జూడన్
బ్రికటనఫలకంబుల నో, పికమైః గనుచుంటి సకలవీధులయందున్. ౨౭

వ. నాప్రియాస ఫలితముగా నొక్క-వాడయందు శాకాహారవిపణి దృగ్గోచరం బగుడు నందుల కెంతయుఁ బొంగి యద్దాని ముంగిట నమ్మ శాకాహారసిద్ధాంత మను గ్రంథమ్మను సాల్టు విరచితంబును గొని లోనికిఁ జని రుచ్యములగు భోజ్యంబు లాప్యాయనంబుగ నారగించితి - వెండియు

సీ. ఆంగ్లదేశమ్మునం దడుగుమోపిన వెన్క-, గడుపారఁ గుడుచు టప్పుడ లభించె
ననుఁ బ్రోవ భగవానుఁ డనురాగమున వచ్చి, నటులుండె నాశాల యరసి చూడ
సాల్టుపుస్తక మంతఁ జదివితిం దుదదాఁక, సంతసం బెంతే నొసంగె నద్ది
నాఁటినుండియు నే మనఃపూర్వకమ్ము శా, కాహారి నైతి నం చనఁగఁ జెల్లు

గీ. జననిసన్నిధి శపథంబు సలిపినట్టి, దినము నా కప్పు డానందజనకమయ్యె
నిర్విచారంబుగా నీమ నిల్వవచ్చు, నెన్నినాళ్లేని యను ధైర్య మెచ్చిపోయె, ౨౯

తే. ఆప్రతిజ్ఞను సత్యంబు నాదరించి, యెఱచిఁ దాత్కా-లికమ్ముగాఁ గొఱుకకున్న
భావికాలమునం దేను భయము విడిచి, సంతసమ్మునఁ బొల సారగింతుననియు. ౩౦

క. హైందవు లెల్లరు నామిష, ముం దినఁగా వలయు ననియు మునుకొని సంఘం
బం దియ్యశనము వ్యాప్తిని, జెందం దగుబోధనమ్ము సేయుదు ననియున్. ౩౧

తే. తొలుత నెంచితిఁగాని యత్తలఁపు దూర, మయ్యె నీనాఁడు నే నిప్పు డారగించు
నాకుబువ్వ జగమ్మునయందు నెల్లి, విరియఁ జేయుటయే నాకు వేడ్క యయ్యె.

* * *

౧౫ ఆంగ్ల వేషము

సీ. కొనలొత్తఁ దొడఁగె నాకుంబువ్వ దెస నాకు, నాఁటి కెపుడలో నమ్మకంబు
చదువఁజొచ్చితిని భోజనముఁ గూర్చి రచింపఁ బడినపొత్తముల సంబరము గదుర
బోధించె నవి క్రీస్తుమున్నుగు మహనీయు, లెల్ల శాకాహారులే యటంచుఁ
దెలిపె శాకాహారదీక్షితుల్ పూర్ణాయు, రారోగ్యసంపన్ను లగుదు రనియుఁ
తే. బిదప భోజ్యపరీక్ష నాబ్రదుకునందు, ముఖ్యమగు కృత్య మయ్యె మున్ముందు దీని
మొదలుపెట్టుట యారోగ్యమునకె యైన, నవల ధర్మసృష్టియె హేతువయ్యె నంత.

క. ఈపగిది నేను గాల, క్షేప మ్మొనరింప నాదు చెలికి మదన్న
వ్యాపారజనిత మగు సం, తాపము రూపడఁగ దయ్యెఁ దా లవ మేనిన్. ౨

సీ. ఆమిషాహారంబు నారగింపక యున్న, దేహపాటవ మొగి దరలు ననియుఁ
దెల్లవారలఁ గూడి తిరుగక యున్నచోఁ, జడబుద్ధినై యేను జెడుదు ననియు
నాకుబువ్వను మెచ్చునట్టివారితలఁ గిన్న, విపరీతములు సంభవించు ననియు
నాహారపరిశోధనార్థినై మెలఁగుచోఁ, భువి నిరర్థకుఁడనై పోదు ననియు
ఆ. న్నాతఁ డూహచేసి నాతత్త్వమును మార్ప, యుక్తి యొకటి పన్ని యొక్కరేయి
నాటకంబు చూడ నను రమ్మటంచు నన, నతని వెంట వేడ్క నరిగినాఁడ. ౩

క. ఎరకొఱ కత్తటి మునుముం, దరువుర మొకపూటకూటియిలు సేరితి మ
య్యిరవు నరపాలభవనము, కరణి విరాజిల్లు శిల్పకళ కాశ్రయమై. ౪

వ. అందు నాగరకు లనేకులు మెసవుచుందురు - గాన నటకు నన్నుం గొనిపోయిన నవినయ భయంబునం జేసి భోజన మధ్యమున నేనెట్టి సందియములనేని వెలువరింపఁజాల నని నామిత్రుఁ డూహించి యీపన్నుగడం బన్నె - నంతఁ బెక్కండ్రు నడుమ నే నొకబల్లముం దుపవిష్టుల మగుడుఁ బ్రథమభోజ్యంబుగా సూపను పదార్థంబు మాకొసంగఁ బడియె - నయ్యది శాకాహార మగునో కాదో యను సంశయంబు నన్నుఁ బీడింప నద్దాని గుఱిచి నేస్తకాని నడుగనొల్లక మెల్లన వడ్డన సేయువానిం జేరితి - నయ్యవసరంబున ౫

క. అద్దాని నెఱిఁగి మిత్రుఁడు, గద్దించుచు నతనిఁ బల్వఁగత మే మన నేఁ
దద్దయు వెనుకాడుచుఁ గల, సుద్ది న్వినిపింప నతఁడు చుఱచుఱఁ గనుచున్. ౬

తే. నిమిషమే నిట్టిసంఘాన నీవు నిలువ,నర్హుఁడవు గావు వలయుమర్యాద నెఱుఁగ
వేని వేవేగ నొండొక్కయెడకు నడిచి,నడిచి వాకిట నారాకకొఱకు నిలుము. ౭

ఆ. అనుడు సంతసించి యచ్చోటి నెడఁబాసి, పొంత నున్న పూకుబుచ్చ బసకు
దాసినాఁడ వేళతప్పుట నది మూఁయఁ,బడియె నార నాయభాగ్యమహిమ. ౮

ఆ. నాఁటిరేయి నాకుఁ బాటిల్లె నుపవాస, మంత నేము నాటకావలోక
నాభిలాషఁ జనితి మవ్వల నాతఁడిగ్గ్,గాఁడవ నెన్నఁడేని దడవ డయ్యె. ౯

ఆ. ఇదియ మాకుఁ దుట్టదుదిజగడము దీనఁ,బొడమదయ్యె నెట్టిపొంపు మాకు
నెయ్యుఁ డిట్లు సలుపఁ దియ్యంబ హేతువు, గాన వాని మిగుల గారవింతు. ౧౦

వ. తలఁపు సేఁతల మా కెంతయంతర మున్నను నతఁడు నా హితుఁడగుటం జేసి సర్వదా వాని గౌరవించువాఁడ-నంత నే నామిషమును ద్యజించినను దక్కంగల మర్యాదలం దాంగ్లేయసంఘసంప్రదాయములు చక్కఁగా ననుసరింప నేర్తునని సంగడీనికిఁ దెల్లముసేయనెంచి మునుముందు వలయుదుస్తుల న్వ్రాలిచి వేషము సవరించి పాపట సంస్కరించి నాట్యమును బరాసుబాసను గఱచినం దప్ప నాగరకత పూర్ణతం జెందదని విని వ్యయప్రయాసముల కోర్చి యొక శిక్షాశాల నాశ్రయించి కొన్ని నాళ్ళు నృత్యము నభ్యసించితి-నందలి తాళగతిం దెలియ నే నశక్తుండ నగుటఁ దత్సిద్ధికయి గోఁచిపాత్రికొఱకుఁ గొండంత సంసార మన్నట్లు ఫిడేలు నభ్యసించు నవస్థ నాకుఁ బాటిల్లె-వెండియు వక్తృతాపద్ధతి నెఱుంగ నొండొక యొజ్జను సేవింపఁ దొడఁగితి-నగ్గురుఁడు జెల్లను నతండు గూర్చిన యాదర్శవక్త యను గ్రంథమును బఠనీయముగా నియమించె-నందలి యుపన్యాసము నొకదానిఁ జదువ దొరఁకొంటి-నింతలో నా బెల్ మహాశయుఁడు నాశ్రవఃకుహరమున ఘంటానాదము సల్పుడు నే మేలుకాంచి ౧౧

మం. ఆ జీవితాంత మియ్యాంగ్లదేశమున, నే నుంట కల్ల యింకేల యీ బెడఁద
యరుగుదెంచితిని విద్యార్థినై యిటకుఁ,దత్సమార్జనమె కర్తవ్యంబు నాకు. ౧౨

తే. ఇటు విచారించి నైశంబ నటన గీత,వాగ్మితాభ్యాసముల కెల్ల స్వస్తి చెప్పి
గురుల మన్నింపుఁ డని పేర్మి మెఱయ వేఁడి,యవల నిక్కపువిద్యార్థి నైతి నేను.

తే. నృత్యగీతాదికాసక్తి రెండుమూఁడు,మాసములె నిల్చి పిదప నన్నాఁచెఁ గాని
వేసమునయందుఁ బొడమిన వెఱ్ఱివలపు,విడువదయ్యెను బెక్కేండ్లుగడచుదనుక.

* * *

౧౬. మార్పులు

తే. ఆటలకు లొంగి పాటల కాస చెంది, యిచ్చవచ్చినటుల్ చరియించినాఁడ
నంచుఁ బాలకులార! మీ రెంచవలదు, తప్పుదారికిఁ జననైతి నప్పుడేని.

తే ఏ నపుడు వెచ్చపెట్టిన యెల్లకాసు, నకు విసువులేక లెక్క వ్రాసికొనువాఁడ
ననుదినంబును శయనించునవసరమున, నిలువ సరిచూచుచుందు నిర్ణిద్రమతిని. ౨

వ. ఆయభ్యాసము నాకిప్పటికిం గలదు- పెక్కుమేళ్ళ కియ్యదినిదానం బయ్యె - లక్షల కొలఁదిధర్మాదాయము పలుతెఱంగుల వెచ్చించు నా కెన్నఁడేని యెట్టిలెక్క చిక్కులుం బొసఁగవయ్యె - నియ్యాచారము యువలెల్లరు గుర్తించి నిత్యజీవితంబునఁ బ్రయోగింతురయేని వారలు న్నావలె శుభంబు లందనేర్తురు - మఱియు

క. వెచ్చపులెక్కల ననుదిన, మిచ్చమెయిన్ వ్రాయుకతన నే వ్యయము కడున్
హెచ్చెడి నని గుర్తించితిఁ, గ్రిచ్చఱ నెంచితిని సగముకర్చును మాన్పన్. ౪

సీ. పదపడి పద్దులం బరిశీలనముసేయ, నగపడె బండిబాడిగలు మిగుల
మఱియు నే నొకకుటుంబమునందు నుంటచే, విందులవెచ్చము నిక్కటిల్లె
నీవ్యయమ్ములఁ ద్యజియించుట సుకరంబు, కాదొకో యనుబుద్ధిగల్గె నంత
నక్కుటుంబము వీడి యద్దెగదుల్ రెంటిఁ, గైకొనినాఁడ నగ్గదులు నాదు

ఆ. కర్జమున్నయెడకుఁ గడుదాపునం దుంట, నటకుఁ గాలినడక నరుగుచుందుఁ
గాన దీన బాడిగలు తగ్గెఁ దీఱిక, హెచ్చె దేహదార్ఢ్య మినుమడించె. ౫

మ. బారిస్టరుపరీక్ష పాఠ్యముల్ చదువ, సమయంబు కొంతయు సరిపోవుకతన
మిగిలినకాల మెమ్మెయిఁ బుచ్చు టొప్పు, ననుచింత యపుడున స్ఖలముటం జేసి
యాంగ్లభాషాజ్ఞాన మస దన్నవంత, యెంతయు న న్నెరియించుచుండుటయుఁ
బట్టభద్రుఁడ నైనపదపడి వచ్చి, ననుఁ జూడు మని లేలి నాఁడు పల్కుటయుఁ
దలపోసి యెద్దియేఁ దగినపరీక్ష, కింకొక్క దానికి నిక్కాలమెల్ల
నుపయోగపఱుచుట యుక్తం బటంచు, నెంచి మన్మిత్రున కియ్యూహఁ దెలుప
నిచ్ఛమై నతఁడు నీ కెల్ల చందముల, మెట్రిక్యులేషను మే లా పరీక్ష
యుత్తమపాఠ్యంబు లున్నవి దానఁ, గల్గించుఁ దగినలోకజ్ఞానమద్ది
యలఁతివెచ్చము చాలు నద్దానిఁ జదువ, ననుడు నే వేడ్కమై నంగీకరించి
పఠనీయ పుస్తకపట్టికం జూడ, దుస్సాధ మిది యంచుఁ దోఁచె వెండియును
దాన లాటినుభాషఁ దప్పక చదువ, వలయు నవ్వాణి యెవ్వడువున వచ్చు
నని యేను సంశయ మంద వయస్యుఁ, డేల నీ విటు సంశయింతు మిత్రుంబ!

లాటి నెఱుంగ కేలాగున ఫలము,వడయం గలరు న్యాయవాదులౌ వార
లభ్యాస నేర్చినయట్టివారలకు,న్యాయశాస్త్రం బర్థ మగును దెల్లముగ
మఱియు నద్దాన రోమను న్యాయశిక్ష,కొసంగుపృచ్ఛాపత్రి ముండెడిం జువ్వో
యయ్యది కైవసం బైనవారలకు,నాంగ్లంబు పాణితలామలకంబ
యని పల్కనచ్చె నా కతనిబోధనము. ౮

క. పిదప బరీక్షాపఠనము,నొదలిడి సమయంబు నొకనిముస మేని వృథా
నదలక చదివితిం గనువా,రదిరా! యని కంపితోత్తమాంగులు కాంగన్. ౯

వ. ఇతఃపూర్వంబ పరాసుబాసతో నాకుం గొంతపరిచయము కలదు - కాని దాని
నాధునికభాషకు మాఱుగా స్వీకరించితి - నప్పటికిం బరీక్ష కైదుమాసముల మేర
యుండె - నింతయల్పకాలమునంద యిట్టినూత్నభాషల నితరవిషయమ్ములం
దెలియం దగినబుద్ధిబలంబు నాకుం గలవగుటం బరీక్షయం దోటమి యొదవె -
లాటినులోం దగునంకములు రామి యయ్యనర్థమునకు మూలం బాయె - నంత

క. అపజయమునకు నిరుత్సా,హపడక మగుడం బరీక్ష కత్యంతాస
క్తిపరీతచిత్తమునం బూ,ని పఠింపం దొడంగినాండ నెయ్యురు మెచ్చన్. ౧౦

తే. హెచ్చిపోయెం బరీక్షలవెచ్చ మపుడు,దాని నవరించుకొఱకు నిత్యవ్యయంబు
మరలం గొండొక తగ్గింప మదిం దలంచి,యొక్కగదియంద కాంపుర ముంటి నొదిగి.

ఆ. పూంటకూటియింటిబోనము వర్జించి,సంతరించుకొంటి సొంతవంట
నట్లుచేత నేంబదఱువది రూప్యముల్, కలిసివచ్చె మాసకాలమునకు. ౧౨

సీ. మితమైనవెచ్చంబుమెయి డంబ మెఱుంగని,బ్రతుకు సాగించుటకతన మిగుల
నవకాశ మొదవె నా కపుడు విద్యల నేర్వ,దాన రెండవమాఱు తత్పరీక్ష
విజయంబు గల్గె నివ్విధి మితవ్యయ మూని,యుంట నేం గడగండ్లం గంటి నంచుం
బాఠకజను లూహపడకుందు రిగావుత,మది నాదు లోవెలిబ్రదుకులకును

ఆ. గలుగంజేసెం బొత్తు ఘటియించె రాబడి,కగ్గమైనవెచ్చ మతులసత్య
మయము జేసె నామనువు గడ నిర్భరా, నందసాగరమున నన్నుం దోంచె. ౧౩

* * *

౧౭ భక్ష్య పరిశీలనము

క. పరిశోధనమ్మ నెఱపన్,దొరకొన్నకొలంది నాకుం దోంచెను బహిరం
తరధర్మము లింకను సం,స్కరణ మ్మొనరింపం దగు దశ స్థల వనుచున్. ౧

ఆ. కాఁపురంబునందుఁ గిర్చులయందు సంస్కారణముం బొసర్పఁ గడఁగినప్పుడ
పూనినాఁడ నేను భోజ్యంబులందును, వలయునట్టి మాఱుపుల నొనర్ప. ౨

సీ. అవగతమయ్యె నా కాకుబువ్వను మెచ్చు, గ్రంథము ల్గూర్చిన వా ర్లెల్లఁ
బ్రకృతిశాస్త్రవిరుద్ధపద్ధతు ల్వీడనాడి, యారోగ్యలక్షణం బనుసరించి
మతధర్మముల సమంచితబుద్ధి మన్నించి, చేతకు ననువైన రీతు లెఱిఁగి
లోఁతుగాఁ జర్చించియే తమపొత్తముల్, విరచించినా రన్నవిషయ మప్పుడు
ఆ. ధరణి మానవుండు తక్కిన ప్రాణుల, కంటె వలఁతియైన కతన సత్తఁడు
చంపఁదగదు వాని సంరక్షఁ గావింప, వలయు నంచు వారు వ్రాసి రంద. ౩

వ. అదియునుంగాక మనుజుఁడు లాంతి మాసిసి కెట్లు తోడ్పడు నట్లు తక్కుంగల జంతు
లకు సైతము సాయంపడు టావశ్యకమనియు నరుండు మోసప్రుట మనుటకు కాస
జహ్వాతృప్తికిం గాదనియు మానవున కతనిశరీర నిర్మాణంబు ననుసరించి చూడఁ
బక్వాహారంబు త్యాజ్యంబనియు నాయుర్వేదముంబట్టి యూరఁగాయ లుప్పుఁ
బచ్చడులు తాలింపులు మున్నగునవి వర్జ్యంబు లనియు నెల్లరకు నాకుబువ్వ
చేరికలోని దనియుఁ జౌక యనియుఁ దద్గ్రంథకర్తలు సవిమర్శము నిర్ణయించి –
రియ్యంశములెల్ల నా యనుభూతికి లోనయ్యె – వెండియు వారిలోఁ బెక్కం
డ్రామిషము నండములం బయస్సును నిషేధించి తాము నట్ల ప్రవర్తిల్లిరి – వారి
వ్రాఁతలు న న్నెంతయు నలరించె – నంత

ఆ. ఆకుబోన మమ్ము నంగళ్ళలోన నీ, కట్టుపాట్ల నెల్ల గౌరవించు
ప్రజలఁ గలిసికొన్న వాఁడ నాయందుఁ బెన్నాదరంబు సూపి రప్పుడు వారు. ౪

సీ. నల్లవో! శాకాశనప్రచారక సంఘ, మును సీమ నొక్కండు దనరు వార
పత్రిక నొకదానిఁ బ్రచురించు నయ్యది, దాన సభ్యత్వంబు దక్కె నాకు
నల్పకాలమునంద య:దితిఁ గార్యస, భాసభ్యతాగౌరవంబు నందు
దీక్షమై శాకభుక్తిని బాలనము సేయు, వారు పల్వురు మిత్రులైరి పిదప
ఆ. భక్ష్యవస్తువితతిఁ బరిశోధన మొనర్పఁ, బూని యప్పుడ మాతృభూమివలన
వచ్చినట్టినిలువపచ్చళ్ళఁ జిఱుదిండ్ల, మానినాఁడ నిచ్చ మాఱుకతన. ౫

తే. మున్ను సంభార మన్నది సున్న యగుటఁ, జప్పఁగా నున్న బచ్చలిశాక మిప్పుడు
కమ్మఁగా నుంట నాలుకగాద చవికి, నాత్మయె ప్రధానముగురంగ మనుచుఁ దోఁచె.

వ. అయ్యవసరమునం దార్థికచింత నాయుల్లమునం బాదుకొనియుండె – నయ్యెడఁ
గొందఱు టీ కాఫీ లారోగ్య నాశకంబు లని వానిం ద్యజించి కోకో ద్రావుచుంట
యెఱిఁగి భుజించుట జీవయాత్రకు మాత్రంబ యని తలంచి నేను నట్ల చేయం
దొడఁగితి – వెండియు ౬

మం. శాకాన్నవిక్రియశాలకు నేగి,యిచ్చవచ్చినవస్తు లెల్లను మెక్కి-
విపరీతముగ సొమ్ము వెచ్చింపఁ బోక,పరిమితవ్యయదీక్షఁ బాటించు టాది
నిత్యంబు నాఁడు పెన్నిల భక్ష్యముల,నియమంబునైనఁ గాని నే నారగింపఁ
గడఁగినవాఁడ నక్కాలానఁ బిండి,గలభక్ష్యముల ముట్టకయ కొన్నినాళ్ళు
కడపితి మఱికొంతకాలంబు రొట్టె,పండ్లు భుజించితిఁ బదపడి గ్రుడ్లు
జున్ను పా లారగించుట దొరఁకొంటి,గుర్తింపఁ దగిన దిక్కానశోధనంబు. ౯

తే. అపుడుసంస్కర్తయొక్కరుఁడండములభు,జించుచోఁ బెక్కుమేళ్ళు ప్రాప్తించుననియు
నది మెఱచితిండిలోఁ జేర దనియుఁ దెలుప,నచ్చె నాతనివాదంబు నాదుమదికి. ౧౦

క. అంతట నండము జీవ,జ్జంతువు కానేర దంచు సామాన్యముగా
స్వాంతమునయందుఁ దోఁచుడు,సంతసమున దాని మెక్కఁజాగినవాఁడన్. ౧౧

వ. పరామనం దొడరిన యిక్కడుపును బదునైదుదివసంబులుమాత్రమె మెసవి యంత నియ్యది యకార్యమని యెఱింగితి - నాముగ్న సల్పినశపథంబునకు నేఁడు నూతనార్థ వివరణ మొనర్చుట నీతికి విరుద్ధంబు - గ్రుడ్లును బలలంబులోనివ యని మజ్జననియభిప్రాయం బగుట నిక్కంబు - కాన నిబ్బాసయందలి పరమార్థంబు నామదికి గోచరించిన మఱునిముసంబ యండములం దినుట మాని యాహారపరిశీలనమ్మును సైత ముజ్జగించితి - మఱియు ౧౨

సీ. ఆంగ్లదేశమ్మునం దామిషంబును గూర్చి,కనుఁగొంటి మూఁడులక్షణము లొకటఁ
బసుపక్షిపలలంబ పలల మిమ్మతమువా,రైన శాకాహారు లండములను
జేపల నారగించెదరు వే ఱొకదాన,నెల్లప్రాణులమాంస మెఱచి; దీన
నారగింపఁగవచ్చు నండము లొండొక,దాన సర్వప్రాణితరస మండ

ఆ. ములును బాలు పెరుఁగు మున్నగునవియు గ్రాహ్యములు మాంసగణమునందు,నట్టు
లగుట నాకుబువ్వయంగళ్ళఁ బెక్కుభ,క్ష్యముల గ్రుడ్డుకలియుననుచుఁదోఁచె. ౧౩

తే. కావుభం జేసి యచటిభక్ష్యముల మెసవు,వేళలం దెల్ల నవ్వానిమూల మడిగి
యండములు చేరకున్న భోజ్యములు విలిచి,యారగించెడివాఁడ నే ననుదినంబు.

వ. దీనం జేసి యిష్టంబు లగు భక్ష్యములు పెక్కింటిని విడువ వలసెఁ - గాని నాయొనర్చినబాసను దీక్షమై రక్షించుచుంట నియ్యది నా కసంతృప్తి గూర్పదయ్యె - మఱియు ౧౪

తే. ఎంత తెల్లమై తనబాస మెసఁగుచున్న,నాత్మచరితావిరుద్ధమై యలరుపోల్కి
దానికి న్నూతన్న నూతనార్థములు వెల్లడించెదరు కొంద ఱితత్ప్రపంచమందు.

క. కల రిట్టివారు లక్షలు,గలవారలయందు లేమిగలవారలయం
దలస్వార్థప్రియతయ వారలకన్నులు గప్పు నద్దిరా యే మందున్. ౧౫

తే. కొయ్యజంకులు వీడి వా గ్గోడమీఁది, పిల్లివాటముగా విజ్ఞు లెల్ల రోయఁ
బలికి యాత్మవంచనమును జలిపికొని జ,గమ్ము దైవమ్ము వంచింపఁ గడఁగుచుంద్రు.

తే. బాసచేసినమనుజుఁ డబ్బాస నెవ్వఁ,డాచరింపఁగఁజేసె నయ్యతనియర్థ
మనుసరించుట సంశ్లాఘ్య మైనమార్గ,మని వచింతురు ధర్మజ్ఞు లైనబుధులు. ౧౯

క. రెండర్థంబులకును వీ,లుండిన దుర్బలునినుడికి నోడఁబడఁ దగు నీ
రెండు తెఱంగులఁ దొఱఁగిన,నిండుగ బెనఁకువలు పాడి నెఱి పొడవడఁగున్. ౨౦

వ. సత్యవ్రతునకుం గొల్వొసల్పువాఁడు మొదటిమార్గంబు ద్రొక్కుటయ వాంఛించు- నాతఁడు నూతన వ్యాఖ్యానములకొఱకు సూరిజనమ్ముల నెన్నఁడు నారాధింప నొల్లఁడు- పలలముం గూర్చి యుత్తమసరణి ననుసరించి చూడ నాతల్లి యూహించిన లక్షణంబ నాకు శిరోధార్యంబు-కాని యన్యం బవశ్యపరిహార్యంబ-వెండియు ౨౧

మం. నాసల్పుపరిశోధనమ్ము సర్వమ్ము,నార్థికదృష్టి నయ్యారోగ్యదృష్టి
ననుసరించియ సాగె నాంగ్లదేశమున,నవ్వల నిక్కార్య మాఫ్రికాయందు
నాచరించితిని ధర్మైక మా దృష్టి,ముందు వాకు ప్రిత్తు నమ్మచ్చుట నెల్ల
నెటులైన దీనికి నింగ్లాండునంద,జరిగె బీజావాపసంస్కార మెల్ల. ౨౨

ఆ. మాంసభక్షణంబ మంచి దటంచు నేఁ,బెక్కునాళ్ళు నమ్మి పిదప శాక
భోక్తనైతిఁ గానఁ బూర్ణాభిమానంబు, పొడమె నాకు నాకుబువ్వపట్ల. ౨౩

తే. తడవులం బట్టి యొక్కమతమ్మునందు, వెలయునాతని కంటె నవీనముగను
దానిఁ బూనినవాని కద్దాన మిపుల,నాదరముకల్గునంట సత్యమ్ము గాదె. ౨౪

వ. ఏతదభిమానఫలితమ్ముగా నావసించు పేఁటయందే నొక శాకాహారిగోష్ఠి నెలకొల్పి దానికి శాకాహారపత్రికాసంపాదకు లగు నోల్డుఫీల్డుగారి నధ్యక్షులఁ జేసి నేఁ గార్యదర్శిపదవి స్వీకరించితి - నయ్యది కొంతకాలము శ్లాఘనీయమ్ముగాఁ జాగెను నే నవ్వాడ వీడి వేఱొక్కదెసకుం బోవుట వాటిల్లుటం జేసి కతిపయ మాసమ్ములలోన పొడవడంగె - నైనను ౨౫

తే. వినయపూరిత మిప్పాటియనుభవంబ, కొన్నిసంఘముల న్నెలకొల్పి వాని
వ్యాపనీయమ్ము లొనరింప నర్హమైన, చాకచక్యము నాకు నొసంగఁ గల్గె. ౨౬

* * *

౧౮ బిడియము నాడాలు

సీ. శాకభోజనసమాజమునందు నేఁ గార్యసంఘసభ్యుఁడనై యెసంగుకతన
వెడలుచుందును సమావేశంబు లన్నిటి,కైన ప్రధానంబు నా కిచటఁ దప్ప
దధ్యక్షుఁ డిది కూడ దని పెక్కుసార్లు నక్క,మమత దీపింపఁ దా మందలించెఁ
గొలువులో మాటాడవలయునన్కోర్కి నా,కెంతయుఁ గల దైన నేమిలాభ
ఆ. ముల్లమందుఁ బొడమ నుత్సాహమ్ములం దగు,వట్టిబాసయందుఁ బెట్టఁజాల
మొదలుకొన్నవిషయమును దప్పి యప్రకృ,తాంశచర్చలోని కరుగువాఁడ. ౧

ఆ. కడచె నిట్లు కొంతకాల మవ్వల నొక్క,సారి ముఖ్యవిషయచర్చ యొకండు
ప్రాపరించె సమితిఁ; దత్సభయందుఁ బ్రా,ల్గొనమి ధర్మదూరమనుచుఁ దోఁచె. ౨

క. రచ్చకు నేగియు భావం,బచ్చుపడువిధాన మాటలాడక యిస్సీ
యుచ్చముగ మూఁగసమ్మతి,నిచ్చుట భీరుత్వ మంచు నెంచితి నెడఁదన్. ౩

వ. తత్సభకు నయోవ్యాపారిసంఘనాయకుఁ డగు హిల్సను నతఁ డధ్యక్షుఁ – డాతఁడు నీతివాదియనం దగు – నాయన యొనర్చు నార్థికసాహాయ్యంబుపైన తత్సంఘ మాధారంపడి యుండె–సామాజికులు పెక్కండ్రతనికనుసన్నల మెలఁగుచుందు– రాకుబువ్వ దెస నిండుగౌరవంబుగల యల్లిన్సనను నతఁడుం బాలకసంఘమున వెలయు – నప్పడ యంకురించిన సంతాననిరోధోద్యమం బతని కభిమానపాత్ర మగుడు నతఁ డద్దానిఁగూర్చి కార్మికులకు బోధింపఁ దొడఁగె – నిట్టి యాచారంబు నీతిదుర్నియమంబునకు వేరుపర్వంబోని దని హిల్సుతలంపు – శాకాహార సమాజము నైతికసేవ సయిత మాచరింపవలయు నని యతని యాశయము – కాన విపరీత భావభరితుడగునల్లిన్సను తత్సంఘమునం దుంట చెట్టకుఁ బట్టుఁగొమ్మని యయ్యధ్యక్షునిభావంబు – కావుటంజేసి యల్లిన్సనుసభ్యతను రద్దుపఱుపవలయు నను నిర్ణయము సభం బ్రతిపాదిత మయ్యె – నంత ౪

తే. తద్విచారంబు నాదుచిత్తమును దిగువ,మంచిచెడ్డల నే విమర్శించి కనుడు
జన్మశాసనవాదియాశయము లెల్ల,నత్యుపద్రవకారు లటంచుఁ దోఁచె. ౫

తే. హిల్సు తా నీతివాదియై యెసఁగుకతన,నాతఁ డల్లిన్సనునకుఁ బ్రత్యర్థియగుట
ధర్మ మని తోఁచె నాతఁ డౌదార్యభరితుఁ, డగుట మన్నింతు నతని నేనగ్గలముగ.

మం. ఐనను నీతియం దాశయభేద, మున్నంతమాత్రాన నొకనిసభ్యతను
రద్దు సేయుట నీతిరహితకృత్యంబ,యని బోధచేసె నాదగునంతరాత్మ

సంఘమ్ములక్ష్యంబు శాకభోజనము, నెరయుటకై ప్రియత్నించుటే కాని
యింకెట్టినయమార్గమేని విస్తృతము, గావింపఁ బూనుట కాదట్టు లగుట
నీతింగుఱిచి యెట్టినియమంబు లున్న, శాకభక్షణమును జల్పువా రెల్ల
నర్హు లేతత్సంఘమం దిమ్ముకొనఁగ, ననుచు భావించితి నంతరంగమున. ౭

తే. సాంఘికులు కొంద ఱేతదంశమునఁ దగవు, నెంచి నాతోడ నేకీభవించి రైన
నేన యిమ్ములు మాటాడ నెంచినాఁడఁ, గాని కలవయ్యెఁ దాల్మి తత్కాలమందు.

వ. కావున నాపల్కనెంచినపల్కుల నెల్ల నొకపత్రముపై లిఖించికొని సభకుఁ జేరి
యదియుం బఠింపఁజాలక రచ్చపెద్దను దాని నందిచ్చుడు నతఁడొకసభ్యునిచే దానిఁ
జదివించె - నంత నల్లిన్నపక్షంబునకె యోటమి వాటిల్లెఁ - బ్రథమప్రియత్నము
నంద నా కపజయంబు సిద్ధించె - నైనను నాయాశయము ధర్మ్యంబకదా యనుతనివి
నా కెంతయుఁ గల్గెఁ - దదనంతరము నేను నా సభ్యతం ద్యజించినయ ట్లించుక
జ్ఞప్తికలదు - సీమయం దున్నకాలమెల్ల నిట్టి పిఱికిభరముతోన కడచె - నీలజ్జ
సభలయంద కాక చెలికాండ్రి మనికిపట్టులందును నన్నుఁ బీడించు - వెండియు ౮

తే. వెంటనరు నాఁ జెలంగెడిపీటి కొక్క, నాఁడు త్ర్యంబకరాయితోఁ గూడి చనితి
నచట మ మ్మొకసభలోన నాకుబువ్వఁ, గూర్చి భాషింపుఁ డని చెలుల్ గోరి రపుడు,

తే. వ్రాసితి న్నేను దగు నుపన్యాస మొండు, దాని సభలోనఁ జదువంగఁ బూనునంతఁ
గంపముదయించెఁ జెమ్మటల్ గ్రమ్మెఁ గనులు, పచ్చఁబడె నాకు గాద్గద్య మెచ్చిపోయె.

క. పదపడి తత్పత్రిముఁ గొని, చదివె మజుందా; రతండుఁ జన్వు లుట్టిపడన్
మృదుతామాధుర్యగుణా, స్పదశక్తి నుపన్యసించెఁ బ్రీత్యేకముగన్. ౧౨

క. మొరయించి రంత సభ్యులు, కరతాళమ్ముల ముదం బఖండమ్ముగ; న
త్తఱి నేమి సెప్పుదు నరుణ్, వరియించెను లజ్జ దుర్నివారం బగుచున్. ౧౩

సీ. అవల విద్యాభ్యాస మది పూర్తి గావించి, మాతృదేశమునకు మఱలు వేళ
నాకుదిండిని మెక్కనట్టినెయ్యురకెల్ల, విందుఁ జేసితి; నాంగ్లవిషయమందు
నాటపాటలతోడ నార్భాటములతోడ, వాఙ్ముఖంబులతోడ వఱలు నద్ది
పాశ్చాత్య్య లోకవిద్యపగిది నేతత్ క్రియన్, గారవించుచునుందు; నాయొనర్చు
ఆ. నల్లిందునందుఁ గలవు వినోదముల్, దాన మత్కృతజ్ఞతను వెలార్ప
మొదలుకొంటిఁ గాని మొదటివాక్యమ్ముపై, వెకల దయ్యె నొక్కనుడియు నదిర!
తే. ఎల్లరకు నవ్వు లుదుఁ బల్లవింప, హాస్యరస మూర నే మాటలాడ నెంచి
నంతసమ్మున వాపిచ్చునంతలోన, యూస లడుగంట నగతాళి కగ్గమైతి. ౧౪

ఆ. తుదకుఁ "దాము కరుణతోడుత వేంచేసి,నందులకు ననేక వందనంబు"
లనుచుఁ దున్ంచివైచి యవ్వల నవమాన,భార మడరఁ గూలఁబడినవాఁడ. ౧౬

మం. ననుఁబాయదయ్యో నెన్నండు నీలజ్జ,యడఁగె నయ్యది దక్షిణాఫ్రికాఁ గొంత
యంతియ కాక నే నవిలంబితముగ,భాషింపలేనైతిఁ బదుగురలోన
నప్పుడప్పుడు గేలి నందుచే తప్పు,నీసిగ్గుచేత నా కెట్టిలోపంబు
సమకూరదయ్యో నీ సంకోచ మప్డు,కడుఁ గొందలమ్మును గల్గించెఁ గాని
యానందదాయకం బయ్యె నాకిప్డు,మితశబ్దములు వాడు మెలఁకువ దీనఁ
గుదిరె వెండియుఁ గోరుకుల నడ్డగింపఁ,గలబలం బధికంబుగా నేనుపడియె
నర్థశూన్యం బైనయట్టిశబ్దంబు,నే నెన్నఁడుఁ వచియింప లిఖింప
నని పల్కనేర్తు భయం బింతలేక.నాపల్కులో లేఖనమ్ములో నెప్డు
దోస మొక్కటియేని దొరలిన జ్ఞెలుఁగ నీరీతి దురవస్థ లెన్నియో తొలఁగె
సదుపయుక్తంబయ్యె సమయం బదెల్ల,నిజమునకుం గొల్వు నెఱపునాతనికి
నావశ్యకంబు మానాశ్రయం బనుచు,నెఱిఁగించె నాకు నెంతే ననుభూతి
యెఱిఁగియే నెఱు,గకయే నప్పు డప్పు,డతిశయోక్తికిఁ బూని యందు నిక్కమ్ముఁ
గప్పిపుచ్చుచు నుంద్రు గద పెక్కమంది,యిదినశింపఁగమాన మెంతయున్ వలయు
నర్థశూన్యంబు లైనట్టిశబ్దములఁ,బలుకఁ డెన్నఁడు మితభాషియౌ నరుఁడు
పరిషత్తులందు నుపన్యసించుటకు,గుఱిక్కిళ్లుమ్రింగుచు గోష్ఠినాయకుల
నవకాశ మొసఁగుఁ డయ్యా! కొంచె మనుచు,వేధించువారలు వెలితి యైనట్టి
సమితి కాన్పించునే సామాన్యదశల,నెట్ట కేలకు నాజ్ఞ నెనసినవ క్క
ప్రాయికమ్ముగఁ గాలపరిమితి నిమ్ము,వెండియు వ్యవధికై విజ్ఞప్తి సేయు
నాన తీకున్నను నట్లె మాటాడు,సమయమ్ము వ్యర్థమ్ముసలుపు లే కాక
యితఁ డొనర్చెడి జగద్ధిత మింక నెద్ది, నాబిడియంబపో నాకు డా లయ్యె
ననుఁ బరిపక్వం బొనర్చె నాసిగ్గె,చెలియయ్యె సత్యసంసేవ నాకదియ. ౧౭

***

౧౯ అసత్య వ్రణము

తే. ఆంగ్ల దేశమ్మునందు విద్యార్థిమాత్రు, లెల్లరును బ్రహ్మచారు లై యెసఁగుచుంద్రు
చదువునకుఁ బెండిలికిని జుక్కెదు రటంచు.వార లుత్సాహపడరు వివాహమునకు.

క. మున్ను మనసంఘ మెంతయు, నున్నిద్రదశన్ వెలుంగుచున్నప్పుడు వి
ద్యన్నేర్చువానిఁ బిల్చిరి, పన్నుగ నల బ్రహ్మచారి పదమున లోకుల్. ౧

క. దురదృష్టవశంబున ని, త్తరుణంబునయందు గోచిఁదాల్చుచుఁ గాళ్లల
గఱచెడుబుడుతల కకటా!, పరిణయములు సాగుచుండు భారతమందున్. ౩

వ. ఆంగ్లదేశమున బాల్యవివాహ మనుపదంబు నెఱిఁగినవా రొక్కరుం గానరామికి లజ్జవడి నాఁ డానాఁడిక న్నివసించు హైందవవిద్యార్థులు పెక్కండ్రు పరిణీతు లయ్యు నవివాహితుల మనియ నుడువుచుండువార — లియ్యసత్యభాషణంబునకు వేఱొండు హేతువుం గలదు. ౪

క. తరుణులు పరిణీతులు త,ద్ధరణి వివాహంబుగాని తరుణులతోడన్
బెరసి వసియింప నంగీ,కరింప రెవ్వారు నది యకార్యం బనుచున్. ౫

సీ. తమకాఁపురముసేయుతావులం దాత్మీయ,పరిణయగాథలు బయలుపడిన
నాయిండ్ల లేజవరాండ్రతోడం గూడి,కలికెడి భాగ్యంబు గోలుపోనౌదు
మని విచారముసల్పి హైందవవిద్యార్థు,లియ్యసత్యము పల్కి నియ్యకొనఁగ-
రద్దివి గోవాళ్లే యర్ధాంగులను నిర్ణయించుకోవలయు మే లెంచిచూచి
ఆ. దానఁ గన్యతల్లిదండ్రు లీచేతల,కొప్పుకోలు సూపుచుండు రెందుఁ
గానరాదు పాయికమ్ముగ నిట్టికూఁడికలయందు దోస మొకటియేని. ౬

వ. కాన సీమయం దవివాహితు లగు యువతీయువలు కూడిమాడి చెలఁగుట సాజంబ యయ్యెఁ గాని ౭

క. భారతవిద్యార్థులు తెల,వారలకు నిసర్గ మగుచు వఱలెడు నిర్వ్యా
చారమున కగ్గపడిరే, దీఱని చెట్టలు జనించితీరక యున్నే. ౮

క. వెస హైందవయువజను లీ,వ్యసనమునకుఁ జిక్కి కన్య లగు నాంగ్లబిస
ప్రసవాక్షులసంగతికై, యసత్యజీవనము జరుప నాసించి రహో! ౯

ఆ. నావివాహ మయ్యె నందనుని నమ్మద్దు, మురువు లడర నెత్తి ముసిసికొంటి
నైన నేమి నేను నవ్వాగురం జిక్కి,యచట బ్రహ్మచారినైతి నపుడు. ౧౦

క. పాటిల్లద మోదము నా,కీటక్కరి బ్రతుకువలన నిసుమంతయు; నా
గాటంపులజ్జయే న,క్కటటం బడనీక సాఁకె నిత్తఱి నన్నున్. ౧౧

ఆ. నానచే ననూనమైన మానమ్ములో, నేను మునిఁగియుండ నెనరువెలయ
లీల ముచ్చటించి లీల నాతోడ నే,యువతి కలసిమెలసి యుంట వలదు? ౧౨

తే. [illegible] నానిల్లునింటిపుగువ,తనయ కన్యావతంస ముత్సాహ మడర
[illegible] వచ్చెడి నీ కనుదినంబుఁ,బిలిచికొనిపోవునాచార మలరుచుండు. ౧౩

తే. అత్తరుణి [illegible] నాఁ డంతికమున ,బ్రకృతిసౌందర్యరాశియై పరిఢవిల్లు
కొండకుం గొనిపోవ నాకును వేడుంగు,వాడముక్కై వడి మున్నాడి నడుచుదాఁడఁగా,

వ. అయ్యువతి నాతోడ నయ్యాయివిషయంబుల ముచ్చటించుచు నన్ను వేవేగ
లాగుకొనిపోవుచుండె - నడుమనడుమ నొక్కొక్కమాఱు నే నెద్దియో వక్కా
ణించుచుఁ గడ కౌననియో కాదనియో బళిరా యనియో లెస్సయనియో
మెల్లన పల్కుచుంటి - నజ్జవ్వని విహంగివోలె జివ్వునఁ జనుచుండ వెండియు
నిలు సేరు టెప్పటికో యని నేను జిచ్చవడం దొడఁగితి-నిత్తెఱంగున మే మగ్గిరి
శిఖరంబు నారోహించి కొంతతడ వందు నిలిచి యంత నవరోహింప సాగితి -
మత్తరుణామునం దయ్యబలారత్న మున్నత పాదుకాధారిణియయ్యు ధనుర్విముక్త
నారాచంబువోలెఁ గ్రిందికి వచ్చుచుండ నే నసువుల నఱచేత నిడికొని తల్లడం
పడుచుంటి - నంతియకాక యాకన్నియ నాకంగారు నెచటఁ గన్గొనునో యను
సిగ్గు నా మొగంబున జిందులు ద్రొక్కుచుండె-నయ్యవసరంబున ౧౭

తే. వెనుదిరిగి నన్నుఁ గాంచియవ్వేలఁది నవ్వి, యిట్లుర మ్మట్లుదిగు భయంబేల యూఁత
గొనుము వలసిన నన్నటం చనుడు నేను, దొప్పదోఁగితి నవమానతోయరాశి.

తే. ఒక్కచో బందియాఁడి పేళ్లొకట దేకి, కొన్ని తావులఁ గూర్చుండి కొట్టుకొనుచు
నెటులొ ధన్యోస్మి యనుకొంచు నిలకు జేర, నెంతయుం గేళిచేసె నయ్యింతినన్ను.

వ. ఎల్లయెడల నిట్లు తప్పించుకొనుట సాధ్యము కానేరదు- దయామయుఁ డగు నీశ్వ
రుఁడు నా యీవ్రణంబును మాన్పఁ దలంచె - నెట్లన ౧౮

సీ. ఆరోగ్యనిలయమై యలరు "బ్రైటన్"నామ, జనపదంబున కొక్కసారి వెడలి
యన్నవిక్రియశాలయందలి భక్ష్యముల్ - వయినంబు "ఫ్రెంచి"లో వ్రాసియుంట
నబ్బాస రాకయే నతిముఱిపడుచుండఁ, దత్రత్యవృద్ధపతితంతు వోర్తు
నాయవస్థ నెఱింగి ననుఁ గూర్మిమైఁ బల్కరించి నీ వేటి కీరీతిఁ గలఁత

ఆ. పడెద వనఁ బరాసుబాస రాదయ్యె నా, కేను శాకభోక్త నిందు భోజ్య
మెద్దియో యెఱుంగ కిబ్బంగి గగ్గోలు, పాలఁ బడితి నంచుఁ బలికినాఁడ. ౧౯

క. అంతట నయ్యమ వివరణ, మంతయు నీ కెఱుకపఱుతు నని భోజ్యపదా
ర్థాంతరము లెల్లఁ దెల్పెడు, సంతస మెసలార నపుడు సాపడినాఁడన్. ౨౦

ఆ. ఇటుల మాకు మొదటియెఱుక పొసంగె న, య్యదియ నేస్తమయ్యె నంత నంత;
నవల సీమనున్నయన్నాళ్లు, నవ్వెన్క, నైనఁ దొలఁగ దయ్యె నల్లచెలిమి. ౨౧

క. మఱి లండనునం గల తన, యిరవునకుం గుర్తుసెప్పి యెడయక ప్రతిభా
స్కరవాసరమున విందున, కరుదెమ్మని నన్నుఁ గోరె నయ్యమ పేర్మిన్. ౨౨

వ. అదియునుంగాక పండువు లాదిగాఁగల వేడుకదినంబు లొదవునపుడును న న్నాతి
థ్యమున కాహ్వానింపసాగె - నేను నందులకుఁ గృతజ్ఞతమై నియ్యకొని యయ్యాయి
దినంబుల వెడలుచుంటి - నంత ౨౩

ఆ. విందులందు నాదుమందాక్షమును బాసి, దొరలనెంచి యన్యనాటి మంచి
కన్నియలకు నన్నుఁ గాన్పించి వారితో, ముచ్చటించు నీలు నిచ్చె నాకు.   ౨౪

తే. సరససల్లాపముల నిట్లు నెఱపుకొనుటకుఁ, గలదు ప్రత్యేకముగ నొక్కకన్య యచట
నాపడుచుతోడ నేను మాటాడు వేళ, వెడలు మక్కువఁ బొఱిఁగి యాన్యపక్షవారి.

ఆ. పలుకుపొం దెఱింగి భాషింపఁ జాలమిఁ, గేరడంబు లాడ నేరకున్కి
వ్యంగ్యభరితవాక్యభంగులే నెఱుఁగమి, నించ దయ్యె నాకు నిద్దితోలుత.   ౨౬

క. ఆవల నవ్వేలఁదుక తగు, త్రోవలు చూపింపఁ దత్కుతూహల మంతన్
ధైర్యాత నెల్ల వేళల, భావం బూటాడె నాదివారముకోలన్.   ౨౭

వ. ఇట్లు లప్పడుచుతోడి ముచ్చటల కిచ్చవడి యవకాశంబు వచ్చినప్పు డెల్ల నచ్చెలియ చెంతకుఁ జొచ్చుట కుత్సహించితి – నత్తాటి నమ్ముదుసలి యక్కన్న దెస నా కెంతయు నాసగొలుప నారంభించుడు మస్మత్సంధింప నియ్యమ్మ కెద్దియో యభిలాష ముండునని తలఁచి శంకాసాగరమునఁ గ్రుంకులిడి "కట్టా! యెట్టిచెట్ట వాటిల్లె – మొట్టమొదటన నావివాహగాథం దెలిపికొన్న నిట్టిసమావేశము నీప్సి సంఘటింప కుండుఁగదా! – గతమునకు వగచినం గల్గు మేలెయ్యది – యికనైనం ద్వరపడి యీనేరము సవరించుకొంట కర్తవ్యము – నిక్కంబు నివేదించుటయ నా కెల్లభంగుల నిపుడు లెస్స – యని తలంచి యాయమ్మ కిట్లు కమ్మ పంపికొంటి.

క. అంబరో! బ్రిటనులో మన, కుం బరిచయ మొదవు టాది కొమరునివలె న
న్నుం బ్రేమించితి వెల్లవి, ధంబుల నను సంస్కరింపఁ దలపోసి తహా,   ౨౮

తే. నాకు నిపుడు వివాహం బొనర్ప మీర, లెంచినార లటంచు నూహించుచుంటి
మీకు మది నట్టిముచ్చట లేకయున్నఁ, బూని కూర్తురె పడుచులపొందు నిట్లు.

క. మీకరుణ కే ననర్హుఁడ, నా కెపుడో పెండ్లి జరిగినది కర్జంబుల్
పాకము దప్పకమునుపే, యీకథ మీ కెఱుకసేత హితమౌను గదా.   ౩౦

క. నాకుం బెండిలి యగుటయు, కాక కుమారుండు నొకఁడు కల్గెను ముందే
మీ కివ్విషయము దెల్పుట, నాకృత్యము కాని మానినాఁడను దాసిన్.   ౩౧

తే. ఇచట భారతవిద్యార్థు లెల్లఁ దమకుఁ, బెండ్లి కాలే దని వచించువిధము నెఱిఁగి
కల్లలాడితి నేను నక్కరణిఁ దొల్లి, యిప్పు డయ్యది యెగ్గటం బెఱుకపడియె.   ౩౨

ఆ. ఇంతదాఁక మీకు నివ్వార్త దెలుపమి, కేను మిగులఁ జింత నెనయుచుంటి
నైన నేఁడు నిక్కమాడు ధైర్యము నీకుఁ, డాసఁగెఁగాన వేడ్క నొందుచుంటి.   ౩౪

ఆ. నీతిబాహ్యమైన చేతల నయ్యెంతి, చెంత నింతవఱకుఁ జేసి యెఱుఁగ
నిం దసత్య మించుకేనియు లేద మ, న్నింపరొక్కొ నన్ను నెయ్యమలర.   ౩౫

మ. ఈ లేఖను౦ బఠియించిన వెనుక,నోతల్లి! నేను మీ రోసఁగువిందునకుఁ
జాతుర్యుఁడఁ గానంచు భావింతు రేని,యయ్యది నే దోస మని నిర్ణయింప
నిన్నాళ్ళనుండి నా వెంట మీ రూపు,మమతే నక్కటికంబు మఱచిపోనేర
నేనాఁటికిని వానిఋణ మీఁగఁజాల, నన్నిఁక మీ విందునకును బాత్రునిగ
నెంచెదరేని యే నెల్ల చందముల,నప్పాత్రతం గొనియాడి సౌఖ్యంబు
లెప్పటివలె నంది యెంతు నద్దాని,భవదమలప్రేమభావాంక మనుచు. ౩౬

వ. ఈ వ్రాయసంబు నీరీతి సంతరింప నే నెన్నిగంటలు తంటాలు వడితినో చదువరు
లెఱుంగుదురుగాక!- యీరచన ముగియులోపల నెన్నిచిత్తు లవతరించెనో వేఱ
చెప్పనేల - కాని యీవక్కణతో నాభార మెల్ల దూరమయ్యె - నయ్యమ్మ
దానిం గన్నవెంటన యిట్లు ప్రత్యుత్తరంబు నంపె. ౩౭

ఆ. చాటుమాటు విడిచి సకలంబు విశదంబు,గాఁగ నీవు పంపు కమ్మవచ్చెఁ
బడుచు నేను దానిఁ బొడఁగాంచి కడుపుబ్బు,నటులు నవ్వుకొంటి మయ్య గాంధి!

తే. నీ వచించినబాంకు మన్నింప నర్హ,మిపుడు నిజమాడి తది యెంతయేని లెస్స
వెనుకటివిధాన నినుఁ బిల్తు విందుకొఱకు, రమ్ము రేపటిభానువారమ్ము విడక. ౩౯

ఆ. ఎదురుసూచుచుందు మేము నీకొఱకు నీ,పెండ్లిసుద్దులెల్ల వెల్లడించి
మాకు విందువేడ్క చేకూర్పు; మనచెల్మి,చెడదు దీనఁ బెక్కునుడువు లేల. ౪౦

వ. ఏ నిట్టిలేఖకు నెంతయు సంతసించి యథాపూర్వ మా నారీమణిగారవంబును
జూఱలాడుచుంటి - మఱియు ౪౧

తే. పూని బాం కనుపుంటి నిప్పొల్కి మాల,ముట్టగాఁ గ త్తిరించితి; నట్టు వెనుక
నాదు పెండ్లిసుద్ది నన్నందు నిక్క,మాడుటకు నేను వెక్కుముం దాడితెఱుఁగ. ౪౨

* * *

౨౦ మతపరిచితి

సీ. ఆంగ్లదేశమ్మునయందు నావసియించు,కాలమునం బెండ్లిగానివార
లన్నదమ్ములును దివ్యజ్ఞానసామాజికులు నగువార లిద్దరు వయస్య
లబ్బిరి నాకు; వా "రాల్డ్సు"పండితు,గీతానువాదంబుఁ బ్రీతి వెలయఁ
జదువుచుఁ దమతోడఁ గదిసి వేలుపునుడిఁ,దనరుగీతఁ బఠింప నన్నుఁ బిలిచి

ఆ. రేను దల్లిబాసనేని దానిం జదు,వమికిఁ గరము లజ్జఁ బల్లటిల్లి
సంగడీండ్రతోడ సంకోచ మడర నా,విషయ మెల్ల నపుడు వించినాఁడ. ౧

వ. అంత జేజేలబాసం గల నాచోఱవ కొంచియమని యెఱింగియు నయ్యాంగ్లాను
వాదంబు మూలమున కెందెందు వేఱయ్యె నయ్యది కనుంగొనంగల బలిమికిం
గొఱంత లేదని యూహించి యచ్చెలికాండ్రు కవ్విషయము నెఱుకపఱిచి
వారితో భగవద్గీతం బఠియింపం దొడంగితి - నందలి ౨

ఆ. సంతతముగ విషయచింతన గావించు, పూరుషునకు వానం బొడము సంగ
మంకురించుం గామ మాసంగమునం జేసి,యామతిల్లు నలుక కామముననుం. ౩

ఆ. అలుకవలన మోహ మగ్గలమైపొల్చు, మోహనముననుం మఱపు మోహరించు
మఱపు హెచ్చి హెచ్చి మతి నడంగారెంచు, మతినశించు కతన మడియునరుండు. ౪

వ. అను పద్యములు నాచిత్తంబునం బాదుకొనియెం - దన్నినదము నాశ్రవఃకుహారం
బుల నింబుగా నేఁడును రవళిండెడి - నిగ్గీత విలువ యిడరాని పాత్తమను నమ్మిక
నాకు నానాంటికిం బొంపిరివోవుచున్నయది - తత్త్వజ్ఞానమున దీనికిం దులయగు
గ్రంథము వేఱొకం డేవాఙ్మయమునందును లేదని నాకు దృఢవిశ్వాసము గలదు-
నా చిత్తము కలంగంబాఱినపుడెల్ల నియ్యది యెనలేని మే లొనరించె - దీనికి
నింగిలీసుబాస నెన్నియనువాదంబులేర్పడె వానినెల్లం బఠియించితి - నం దార్నాల్డు
రచితంబ మేలుబంతియని నాయాశయము - నే నీనెయ్యురతో నియ్యప
నిషత్తుం జదివినను దీనినపుడు బాగుగం బఠించితినని పలుకనోపం - దదనంతరమునం
గతిపయవత్సరములు చెల్లిన వెన్క- నియ్యది నాదైనందినపారాయణమునం జేరె-
వెండియు ౫

తే. సిద్ధమతియైన యార్నాల్డు బుద్ధం గూర్చి,యాసియాజ్యోతి యను పేర వ్రాసినట్టి
గ్రంథముం బఠియించితిం గాంతు వెలయం,గరము నలరించె నప్పుస్తకంబు నన్ను.

సీ. మఱియు నచ్చెలు లొక్కమాఱు నన్ను బిసెంటు,నకు నెఱింగించి రన్నాతిమిన్న
యర్థించెం దనదుదివ్యజ్ఞానసంఘమునందుం బ్రవేశింపు మనుచు నన్ను
నామతం బెఱుంగనినాం డన్యమ్మతము నే,వ్విధిని బూనుదు నంచు వినయ మెసంగం
జెప్పి తిరస్కరించితి నామెకోరిక,నవలం దద్రితవాణి ననుసరించి

తే. తన్మతగ్రంథమును శ్రద్ధం దాల్చి చదివి,నాండ నద్దానం దనకు హైన్దవమతమ్ము
తత్త్వముం బ్రకటించు గ్రంథముల నెల్లం,జదువ నభిలాష ముదయించె
హృదయమందు. ౬

వ. వెండియుం దద్వ్రతన్వమునం జేసి క్రైస్తవమతబోద్ధలు హిందూమతము గుఱ్ఱిడినమ్మిక
లకుం బుట్టినిల్లని తెగడునాఁడు నిరాధారమని యెఱింగితి - నదియుంగాక ౭

సీ. ఆకాలమునయంద శాకాన్నశాలలో, నుత్తమక్రైస్తవుఁ డొక్కరుండు
పరిచితుఁడై నాకు నెఱిఁగించె నాత్మీయ,మతమహిమంబు ప్రేమమ్మగదుర
నలరాజకోటయందలి క్రైస్తవమతప్ర,వర్తకు ల్పానుదుర్వర్తనంబు
నతని కే వినిచితి నందుల కాతండు,తద్దయుసిగ్గిలి తల్లడిల్లి
ఆ. యేను శాకభోక్త నెన్నఁడు మద్యంబు,ముట్టి యెఱుఁగ; మాంసమును భుజించి
కల్లు పెల్లు ద్రావుక్రైస్తవు లెందఱో,జగతిఁ గలరు దీన శంక లేదు. ౯

వ. అయినను ౧౦

మం. మద్యమాంసంబుల మరగుఁ డటంచు,నెందును శాసించి యెఱుఁగదు బైబి
లద్దానిఁ బఠియింపుఁ డంతయున్మీకు,నవగతం బగు నన నగు నంటి నేను
బిదప నతండు బైబి లొసంగెనాకు, శ్రద్ధమై నద్దానిఁ జదువ సాగితిని
దానిభాగంబు ప్రాఁతనిబంధనమ్ము,పఠియించుతఱి శిరోబాధ నన్నేఁచెఁ
గ్రొత్తనిబంధనకుం జెందుభాగ,మానందవారాశియం దోలలార్చె
నద్దాన విలసిల్లు నద్రిప్రవచన,మెన యగు గీత కం చేఁ దలంచితిని
ధర్మేతరంబు నధర్మంబుచేత,నిర్మూలముఁగఁ జేయనేర వీ వెపుడుఁ
జెనఁటియై నీకుడిచెంపపై నెవ్వఁ,డేని గొట్టినఁ జూపు మెడమచెంపయును
బలిమిమై నెవఁడేని పై వల్వఁ గొనిన,నంతరీయముసైత మాతని కొసఁగు
మనెడిసూక్తులు నన్ను నలరించె మిగుల,"సలిలంబు నీకు నీఁజాలినవాని
కిష్టమృష్టాన్నంబు నిడుమా" యటంచుఁ,బలికిన శ్యామలభట్టాఖ్యసుకవి
తల్లజుపద్యంబు తలఁపునం బాఱెఁ,దాదృశంబగునట్టి త్యాగంబ జగతి
మంచిమతం బని మది నమ్మినాఁడ. ౧౧

వ. అంత నీ వ్యాసక్తి న న్నితరమతస్థాపకులచరిత్రము లెఱుఁగం ద్వరపెట్టుడుఁ గార్లయిలు రచియించిన 'వీరులు - వీరపూజ' యన్నగ్రంథముం జదువఁదొడఁగి యందలి మహమ్మదుజీవనకథం బఠించి యతనిగొప్పతనంబును మగతనంబును దబిసితనంబును దెలిసికొంటి_నంతలోఁ బరీక్షలు చేరువయగుటంజేసి తత్పఠనము నాఁపవలసివచ్చెఁ_గాని సర్వమతమర్మముల నెఱుంగవలయు నని నిర్ణయము గావించుకొంటి - నత్తరుణంబున నాస్తిక మతతత్త్వంబు నెఱుంగఁ గోరి తత్సంబంధిగ్రంథము నొకదానిం జదివితిఁ - గాని నే నప్పటికి నాస్తికతామరుదేశముం గడచియుంట నయ్యది నాకు నించదయ్యె - నపుడ వసంతాదేవి నిరీశ్వరవాదంబు విడిచి సేశ్వరవాదంబు నవలంబించె - నప్పరిణామము సైతము నాస్తికతయెడ నా కనాసక్తి కలుగఁ దోడయ్యె - నింకను గొన్ని కారణములు సాయపడుటం జేసి నా కమ్మతంబు దెస నసూయ వొడమె.

* * *

౨౧ దిక్కులేనివారికి దేవుడే దిక్కు

వ. ఆర్ష మతంబుతోడను మహమ్మదీయ క్రైస్తవా ద్యన్యమతంబులతోడను నా కించుక పరిచయ మున్నను సంకటసమయములం దయ్యది యెన్నఁ దరింపఁజాలదని నాకుఁ దెలియదయ్యె-నిక్కట్టు లొదవినపుడు తనకు దేన రక్షణము గల్గు దానిఁగూర్చి మనుజున కపు డెఱుక యుండనేరదు-నాస్తికుఁడు తనవిపత్తు తొలఁగుటకు నిసర్గమ మూలంబనుఁ- దన్ను భగవానుఁడు మనిచె ననియు నందులకుఁ దన తత్త్వజ్ఞానమును, దపస్సాధనయు నొకహేతు వని యాస్తికుఁడు భావించు-నిట్టులరుం దమయిచ్చవచ్చిన ట్లూహింప నడ్డులేదు-మానవుం డెపుడు తనసాధనాబలంబున కహంకరించు నపుడ తద్బలంబు నిర్మూలం బగునని యెఱుంగవలయు - నిట్టివేళల యందు శాస్త్రజ్ఞానముకంటె ననుభూతి పరమావశ్యకము-కేవలశాస్త్రజ్ఞానము నిరర్థకం బనువిషయముం దొలుత సీమలోఁ దెలిసికొంటిఁ- దత్పూర్వము వాటిల్లిన యాపదలనుండి యే నెట్లు బయటఁ బడితినో చిన్నవాడ నగుట నా కెఱుకపడదయ్యె - నేడన్ననో వింశతివర్షమ్ములవాఁడ-గార్హస్థ్య సౌఖ్యముం జక్కఁగా ననుభవించితిఁ - బై పెచ్చు బిడ్డతండ్రిని నైత నైతి - నిట్లునే నాంగ్లావని వ్యసించు తృతీయవత్సరమ్మున ౧

తే. పోర్ట్సుమతు నాఁ జెలంగెడి పురమునందు, జరిగె శాకాన్నభోక్తలసభ యొకండు
దానిఁ దిలకింప నొకనేస్తకానిఁ గూడి, యేను వెడలితి వేడ్క నాహ్వానముండి. ౨

తే. కడలికరవాల యగుటచేఁ గర్ణధారు, లుండి రప్పటఁ బెక్కు; రందున్నవారుఁ
గట్టు కొక్కొఱు వెలయాండ్రు గారుగాని, ఖుంచు కేనియుఁ జక్కటి నెంచఁబోరు. ౩

తే. అట్టివారలతో నిండినట్టియింట, నిల్చితిమి మేము వైనమ్ము తెలియుటనికి;
రాత్రిభోజన పైనతర్వాత మొదలు, పెట్టితిమి సెయ్యూరం గూడి పేకరంతు. ౪

సీ. తమయింటియతిథిబృందముతోడఁ జెలులు పే, కాడునాచార మయ్యాంగ్లభూమిఁ
దనరు; నయ్యాటలోఁ దప్పులేని ఛలోక్తు, లెలమిమైఁ బల్కెద రెల్లవారు
మేమున్నగిమునచామ లీవడవడిఁ, బాటించి మాతోడ నాటనాడఁ
దొడఁగి రయ్యాది రెండుగడియల సాగ న, ప్పడఁతు లంతట నీతిబాహ్యమైన

ఆ. పొడుకలకు మొదలువెట్టిరి బీభత్స, రసము వెల్లివిరిసె రచ్చలోన
నంతఁ బొలుగొనియె నక్కట ! నామిత్రు, డెఱుఁగనైతి నాతఁ డిట్టిఁడనుచు. ౫

ఆ. కష్టమెపుడు నేను నిముచ్చటల కయో, ముదురసాగె సరసములు కరమ్ము
పేకముక్క లవలఁ బెట్టునవస్థయు, సిద్ధమయ్యె నేమి సెప్పువాఁడ. ౬

వ. ఇంతలో భగవానుఁడు నాసంగడీనియంతరంగమునఁ జేరుటంజేసి యతఁడు
న న్నిట్లనియె. ౮

తే. బళిరె! యీఘోరకలికి నీపాపమునకు,నకట! నీవును బానిస వగుదువోటు
వలదు వల దిందు నీ వుండవలదు వలదు,లెమ్ము లేలెమ్ము పొమ్ము పోపొమ్ము వెలికి.

క. అనవుడు లజ్జాంబుధిలో, మునిఁగితి నప్పనుపు మస్తమునఁ దాల్చితి నా
తని మది మెచ్చితిఁ బదపడి,జననికడ నొదువుబాస జ్ఞప్తికి వచ్చెన్. ౯

వ. పదంపడి ౧౦

క. ఊడనిఁబాడితి గడగడ,లాడితి నానిల్చుసజ్జ కరిగితి మృగయా
పీడకుఁ దప్పినహరిణము,జాడ న్నాగుండె లదరె జడిగొనెఁ జెమటల్. ౧౧

ఆ. నాఁటిరేయి నిదుర నన్ను డాయదాయె నా,యాత్మఁ బెక్కుచింత లలముకొనియె
నిదియె నాకు లాఁతియింతులపట్ల వి,కార మొదవ మొదటిసారి యాయె. ౧౨

ఆ. అంత నెంతచెట్ట యయ్యె దైవంబ! యి,ట్లేమఁ దల్లి యున్న నెట్టులగునొ
యని తలంచి యింకనైనఁ బరాకును,దలఁగవలయు నంచుఁ దలఁచినాఁడ. ౧౩

తే. అఖల నిది వాసయోగ్య మైనట్టితావు,కాదు కాదని యెంచి సంగాతిఁ దొఱఁగి
నాఁటివఱువాత లేచి పైనంబుగట్టి,వీడనాడినవాఁడ నప్పాడువీడు. ౧౪

మం. భగవానుఁ డపుడు న న్నాబలించె వనుచు,లెస్సగాఁ దెలియంగలేనైతిఁ గాని
సకలకష్టములందు సాఁకె న న్నతఁడ, యిప్పు డవ్విషయంబు నెఱిఁగికొన్నాఁడ
నీపరిజ్ఞానమం దింకను నాకు,సంపూర్ణ మగునట్టి చతురత లేద
యనుభూతిచేఁ గాక యన్యమార్గమున,వేద్యంబు గాని దవ్విషయ మెవ్వనికి
నాధ్యాత్మికక్రియలందుఁ బెక్కింట, నల న్యాయవాదికృత్యంబునయందు
నైకసంస్థల నిల్పి నడుపుకాలమున, రాజకీయాఖిలారంభంబులందు
నేచి న న్బాధివివయిక్కట్ల నెల్లఁ,దొలఁగంగఁ ద్రోలి నిస్తులదయ న్నన్ను
నేలివజగదీశు నేలీల మఱతు,వెరవులు సకలంబు విఫల మైనపుడు
తోడున్నవారెల్లఁ దొలఁగినయప్పు, డవకాశ మంతయు వడఁగారినప్పు
డెట్టులో చేకూరు నీశ్వరుసాయ,మే ననుభుక్తిచే నెఱిఁగితి దీని. ౧౫

వ. మఱియు స్తుత్యుపాసనాప్రార్థనము లంథవిశ్వాసములుగా – వన్నపానాదుల
కంటె నయ్యవి కడుంగడు సత్యంబు – లవియు నిక్కంబులు – శేషంబు లెల్లం
గల్ల – లనుటు స్వభావోక్తికి దూరంబు బరా – దియుపాసన మడికారపు సొంపు
గాదు – దీనికి నాధారము చిత్తముగాని జిహ్వగాదు – కాన మానసికమాలిన్య
మును భక్తిరసముచేఁ గడిగివైచికొన్నవార లప్పరమాత్మను బ్రాపింపఁగల –

రమ్మాలిన్యమును నిర్మూలింప మనఃపూర్వక మగు నుపాసనకంటె సమగ్రమగు సాధన మితరంబు మృగ్యంబ - యది కడుంగడు విధేయతతో నెనసియుంట యెంతయు నావశ్యకంబు. ౧౬

***

౨౨ నారాయణ హేమచంద్రుఁడు

క. భారతమునుండి యత్తఱి,నారాయణహేమచంద్ర నాముఁడు సీమం
జేరె నతఁడు రచయితయై,పే రందినవాఁ డటంచు వినియున్నాఁడన్. ౧

సీ. ఆకారమున వేసమందు వాగ్ధోరణి,నొకవికారపురీతి నొప్పు నాతఁ
డతనితోఁ బరిచయమయ్యె నా కొకచోటఁ,బిలిచితి నతని నానిలుచుబసకు
నింగ్లీషు బోధింపుమీ! యని యతఁడు న,న్నర్థింప నీకొంటి నందులకును
మొదలిడితిం బాఠములు సెప్ప; వ్యాకృతి,జ్ఞాన మాతని కించు కేని లేద

తే. "బాలుఁ"డను దానిఁ గ్రియ యంచుఁ బలుకుఁ"జదివె" నన్నది విశేష్య మనిచెప్పు నతని దిద్దఁ
దరముకాదయ్యెఁదనకు; వ్యాకరణమిట్లు,రామి కతఁడెన్నఁడును విచారమ్ముపడఁడు. ౨

వ. ఆతం డొకమాటి నన్నుఁ గాంచి "మిమ్ముంబలె నే నెన్నఁడుం బాఠశాల కేగనైతి-నాయభిప్రాయము వెల్లడించు తఱి శబ్దశాస్త్రముతోడియక్కఱ నా కెన్నఁడుం బొడకట్టదయ్యె - హిందీ మరాటీ బంగాళీబాసలం దేను గృతాభ్యాసుఁడ - మహర్షి దేవేంద్రనాథఠాకూరు వ్రాసిన వంగకృతుల ననువదించి ఘూర్జరసోదరుల కొసఁగితి - నింకను బెక్కు సద్గ్రంథముల లాఁతిబాసలనుండి యనువదించి గుజ్జరాతివారికి సమర్పింప నాకుఁ దలంపు గలదు - మూలమునందలి భావమును దెచ్చుట మాత్రమ నాయనువాద లక్ష్యము - లక్షణశిక్షోదూరుఁడనై యేనెఱింగినబాసయే నాకుఁ బదివేలు - ప్రకృత మాంగ్లేయభాషఁ జదువఁ దొడఁగితిఁ - బదసముదాయంబునర్థముఁ దెలిసికొంటయ నాకుఁగర్తవ్యము - కాలక్రమంబునఁ బరాసు జార్మణ్యాము మున్నగు బాసలసైత మభ్యసించి యే నాయాయి దేశములం జూడ నెంచితి - ననవుడు నే నతనిఁ గాంచి ౩

తే. అమెరికాఖండమునకు మీరరుగరొక్కొ,యనుడు సంశయమేల యే నవ్వినూత్న
విశ్వవైభవ సౌందర్యవీక్షణంబు,సేయ కేరీతి భారతక్షితికిఁ జనుదు. ౪

క. విత్తవిచారము నాదగు,చిత్తమ్మున లేదు నాదుచెలికాండ్రరు నా
పొత్తంబులు నాకొసఁగెడు,విత్తంబే చాలు నాదువెచ్చమ్ములకున్. ౫

క. డంబములతోఁ డుత న్నా,కుం బనిలే దేను బొట్టకుం బట్టకు న
ల్పంబుగ వెచ్చింతు వినోఁ,దంబులకుం బోక దవ్వుదవ్వుల నుందున్. ౬

తే. ఏను మూఁడగు తరగతిలోన పయన,మాచరించుచునుందు రే పమెరికాకుఁ
బోవుచో "డెక్కు"మీఁదన పోదుఁజుమ్మి,రి త్తవెచ్చముక్క నేల భరింప వలయు?

వ. అని యతండు మాఱువల్కె – నిట్టి మేలినడత హేమచంద్రునిసొత్తై వెలయు–
వెండియుఁ దత్ప్రివర్తనంబున కుద్దియగు నుల్లమును మిడిసిపాటులేమియు నతనికి
సవరింపని రవణంబులై హావణిల్లుఁ–గాని తనసామర్థ్యముఁ గూర్చి యతనికి మితి
మీఱినవిశ్వాసం బొకటికలదు – మే మనుదినంబును గూడుచుండువార – మతఁ
డును శాకాహారంబ భుజియించు – మా కుభయులకుం బెక్కు–చేష్టల సామ్యంబు
దనరు – నిర్వారము స్వయంపాకులము – యొకనాఁ డతఁడు నాకతిథి యగు – న
మ్మఱునాఁ డే నతనికి విందనయ్యెడివాఁడఁ – బ్రాయికముగా మేమొకతావునంద
యారగించుచుండువార – మిట్లుండ నయ్యవసరంబున ౮

తే. కార్మికులదెస నెంతేని కరుణసూపు,సుకృతి"మానింగు" కీర్తి యస్తోక మగుచు
లండనుపురంబునం దెల్ల నిండుకొనుడు, హేమచంద్రుం డతనిఁ జూడ నిచ్చగించె.

ఆ. అతనిసాహసంబు నరసి మిత్రమ! మేలి,తరము వాఁ డతం డుదారచరితుఁ
డతనిఁ గాంచ శక్యమగునోటు మనబోఁటి, యలఁతి యలఁతివాండ్రి కంటి నేను.

వ. అనుటయు నతం డిట్లనియె. ౧౧

మం. ఏల సందియ మందె దిటు నే స్తకాఁడ,తప్పక యతని సందర్శింపవచ్చు
వినుము దానికిఁ దగువెర వెఱిఁగింతు, నే గ్రంథక ర్తనై యెసఁగినయట్లు
నతనియౌదార్యంబు నతనిశీలంబు,నాలించి కడు ముద మందినయట్లుఁ
గనులార నాతనిఁ గాంచి కృతజ్ఞ,తను వెల్లడింపఁగాఁ దలఁచినయట్లు
నాంగ్లభాష నెఱుంగనట్టి హేతువున,నిను దుబాసిఁగఁ దేర నే నెంచినట్లు
నతనికి నాపేర నంపుమా కమ్మ,యనవుడు నే నట్ల యాచరించితిని
విడువక మీరు రా వేఁడుచున్నాఁడ,ననుచుఁ బ్రత్యుత్తరమంపె "మానింగు"
హేమచంద్రునియత్న మిట్లు ఫలింప,నొదవె నాశ్చర్యం బనూనమైనాకు. ౧౨

వ. అంత నొకనాఁడు మే మమ్మహాశయుం జూడ బయలుదేరితి – మ త్తఱిఁ దగు
పటాటోపమ్ముతో నేనుంటిఁ – గాని చెలికాఁడు యథాపూర్వము తనవికృత
వేషంబుఁ దొలఁగింపఁడయ్యె – నందుల కే నించుక గేలిసేయుడు ౧౩

క. డంబముల మెచ్చెదరు పా,ఱుంబోతులు మీరు సత్పురుషు లెప్పుడుఁ జి
త్తంబును మెత్తురు గాని ము,దం బందరు వేసమునకుఁ దళుకుంబసకున్. ౧౪

వ. అని యతండు వల్కె - బదంపడి మే మమ్మహనీంగుభవనంబు సేరి యతని దర్శించి వానిసమర్పించు సత్కారములం బడసినవెనక - హేమచంద్రుం డతని యథోచితము గౌరవించి యాయనదీవనలం బడసె - సంత నేము మా మనికి పట్టులకుం జేరితి - మిట్లుండ నొక్కనాఁడు ౧౪

క. అరచట్టం దొడి కోకిబికి,పరిధానమ్మును ధరించి బొరేఁడుగడ్డం
బరుదుగ నేసంగ నాబస,కరుదెంచెను మద్వయస్యుఁ డాంగ్లము నేర్వన్. ౧౫

సీ. అది క్రొత్తబస యాట నయ్యింటిమగువ త,త్పూర్వము హేమచంద్రుని మొగంబు
నెఱుఁగదక్లాట నయ్యింతి కవాటంబు,విచ్చునంతన బిట్టు వెఱపు నంది
సంభ్రమంబున నాదుసరసకుఁ బేరెమ్మ,వాఱుచు నచ్చి యెవ్వండొ వెడఁగు
నీకొఱ కేతెంచి వాకిట నున్నవాఁ,డనవుడు నంగణమ్మునకు నేగి

ఆ. హేమచంద్రువేస మీక్షించి తద్దయు,నక్కజంబువడితి నతఁడు వెత్తి
నవ్వు నవ్వసాగె నామిత్రునకు సహ,జంబు లిట్టిలక్షణంబు లరయ. ౧౬

వ. అయ్యవసరమునం దేను నెచ్చెలీ! నీ యీ వేషంబుగాంచి వీథిలోని బాలురు గోలసేయక మానిరో యనుడు నతండు ౧౭

ఆ. గోల చేసినారు గుంపులుగుంపులై,పిఱుఁద నడిచినారు పిల్ల లెల్ల
వారి దెసకు దృష్టి సారింపనైతి నే,నంత వెనుకవెనుక కడుగు లిడిరి. ౧౮

వ. అని వాక్రుచ్చె - నిట్లతఁడు లండనునగరమునం గొంతకాలముండి యవ్వలఁ బరాసునాఁటికిం జని యా దేశమునందలి బాసనేర్చి యందలి గ్రంథములఁ గొన్నింటి ననువదించి పదపడి పూర్వోక్తప్రకారమున నమెరికా కేగి తనకు సాజం బగు వేసముతోఁ దిరుగాడఁ దొడంగుడు నది యాసీమ ననాగరకవేషం బగుట సంయుక్తరాష్ట్రములందు నిర్బంధితుఁడై యెట్టకేలకు విముక్తుఁ డయ్యె. ౨౦

***

౨౩ గొప్ప సంత

క. పదునెన్మిదివందల తొం,బదియగు వత్సరము క్రైస్తవశకమ్మునయం
దొదవినతఱిఁ బ్యారిసులోన దొడ్డవస్తుప్రదర్శన మొకటి జరిగెన్. ౧

ఆ. ఏను దానిఁ జూడ నేగితి దృశ్యముల్, పెక్కు లచటఁ గంటి నక్కజముగఁ
గాని కేవలం బమానినిర్మితంబు గో,పురము నింతవట్టు మఱవ నైతి. ౨

క. పొడుగువెడల్పులు దక్కన్, నుడువంగాఁ దగినయట్టి నూత్నత గానం
బడదయ్యె నందు; దానన్, దొడరెడుసంతృప్తి యెట్టిదో కననైతిన్. ౩

వ. దానిం దెగడినవారు పల్వురు గల రందుఁ డాల్స్టాయి ప్రథమగణ్యుం డతఁ డిది మానవునియెఱుంగమికి నంగమచ్చం బనియు ధూమపానంబున మతిపోయిన మానుసు లిట్టిబయలిమేడల నిర్మింతు రనియుఁ బల్కె - వెండియు ౪

క. నాగరకతయును స్వేచ్ఛయు, భోగపరాయణతయున్ బ్రభూతమ్ముగ న
చ్చోఁ గలదు గాని కోవెల, లోఁ గా లిడినంత నాత్మలో మాఱొదవున్. ౫

వ. "వర్జిన్ మేరీ" విగ్రహమునెదుట మోఁకఱిల్లి జోహారు లర్పించువారి డాసినతఱి నెవ్వనికి భయభక్తు లుప్పతిల్లకుండు - మోఁకఱించుటయు వేఁడికోలును గుడ్డి నమ్మికలు గావని నాయాశయంబు - మఱియు నా భక్తులు మోఁకరించుట నిరర్థకపాషాణమునకా ? తదర్థమైన భగవానునకు - వా రిట్టి విగ్రహారాధనమున భగవన్మహిమను గుంచక పెంచుచున్నా రనియ నాతలంపు. ౬

* * *

౨౮ పట్టా పుట్టినది - కాని పిమ్మట ?

తే. న్యాయశాస్త్రంబు చదువంగ నాంగ్లభూమి, కేను వెడలితిఁ గాని యద్దానిగుఱిచి
యింతకు న్మున్ను వివరించియెఱుఁగనైతిఁ, దదృణభారంబు నిచ్చోటం దలఁగువాఁడ.

వ. బారిష్టరుపరీక్షకుఁ జదువువిద్యార్థికి నియతకాలపరిపాలనమును బరీక్ష లోసఁగుటయు నను రెండుకట్టడలు గల - విప్పరీక్షకుఁ జదువవలసిన కాలము మూఁడేఁడు - లయ్యది యీరాఱుపాళ్ళుగా విభక్తమై యుండు - నందలి ప్రతిభాగమునందును విందు లిర్వదినాల్గు ప్రవర్తిల్లు - నం దధమ మాఱువిందులకైనను బరీక్షార్థి యేగునేని యతఁడు నియతకాలపరిపాలన మొనరించినట్లు యెన్నంబడు - వెండియు ౨

సీ. తొలుతొల్తనియ్యావిమేతలయందుగురుశిష్యు, లొండొరుల్ భాషించుచుండు తెఱఁగు
వ్యాఖ్యానము లొనర్చు నాచారమును బ్రవర్తిల్లుచునుండెఁ దత్క్రియలవలనఁ
జదువుగోరెడివారు చదురు లౌనని ప్రశం, సించుపోల్కి నుపన్యసించువెరవు
గణుతికెక్కినలౌకికజ్ఞానమును దగు, నాణియమ్ము గడించి రాణసెందు

ఆ. వార, లేఁ బఠించువడి కవెల్లఁ దొలంగ, గురుఁడు శిష్యు విడిచి కూరుచుండెఁ
దత్ప్రయోజనంబు దవ్వయ్యె నడవడి, యొండె సాగివచ్చుచుండెఁ జెడక. ౩

వ. పూర్వాచారపరాయణ మగు నాంగ్లదేశమున కయ్యది సహజలక్షణంబ - మఱియు

క. పలలాహారముతోడన్, బలుదినుసులమధువుతోడఁ బ్రాయికముగ విం
దులు సాగు, నందు నాకుం, గలదుగదా! రొట్టెముక్క కాలము గడపన్. ౪

క. ఇటు విందులు గుడుచుటచే, నెటు బారిస్టరుపదంబు నెనయుదురో యి
ప్పటికిం దెలియద నా; క, ప్పటియెయ్యు దప్పట్ట మంద వలచినవారల్. ౬

తే. చదువవలసిన పొత్తములు చాల సులువు, లగుట బారిస్టరునకు హాస్యంపుం బేరు
రెక్కొనియెం "దిండిపోతుబారిస్టు" రంచు, నెల్లరకు వానికందువ తెల్లమయ్యె. ౭

వ. మఱియుం బాఠ్యములకంటెం బరీక్షావిధానము సులభంబు - కావుటం జేసి విద్యార్థులు వర్షత్రయంబున మాసత్రయము శ్రమంపడినం గృతార్థు లయ్యెడి వారు - కాని నే నిట్టి నామమాత్రవిజయమునం దనివిసెందక పఠనీయముల సవిశేషముగాం జదువ నెంచితి - నట్లు సేయమి వంచన యని నాయాశయంబు - నే నింతకు మున్ను లాటిను నేర్చియుంటిం - గాన "రోమన్" న్యాయశాస్త్రము నభ్యాసన చదివితి - నిది యాఫ్రికా కేగినతఱి నా కెంతయుం దోడుపడియె - నిట్లుశ్రమించి పరీక్షలో గెలుపొందితి - నంత ౮

తే. కాశ్యపీ ధాత్రు వసు నిశాకాంతసంఖ్యం, గ్రీస్తవశకాబ్దము వెలుంగు కాలమందు
షష్ఠమాసంపు దశమవాసరమునందు, బిరుదపట్టంబు నాకు లభించు టాయె. ౯

వ. కాని యింతకష్టించినను న్యాయస్థానమునందు నోరువిప్పంజాల నను నుత్తలపాటు నాచిత్తమున హత్తుకొనె - నయ్యవస్థ వివరింప వేఱొం డధ్యాయము వలయు. ౧౦

* * *

౨౫ నా బెంగ

క. బారిష్టరుపట్టము చేకూరుట సుకరంబ కాని కోర్టులలోనన్
బారిష్టరుగా రాజిలు, టారయ నెల్లరకు సాధ్య మయ్యెడి పనియా. ౧

ఆ. మొదటినుండి తుట్టతుదిదాఁక నే ధర్మ, శాస్త్రసూత్రకోటి చదివినాఁడఁ
గాని రచ్చలందుఁ గమనీయఫక్కి వా, దించునట్టి వెరవు గాంచనైతి. ౨

వ. లాఁతివారికి నొప్పమి రాకుండునట్లు నీవస్తువు నుపయోగించుకొమ్మనునది యొక ధర్మవచనం - బిది తనవ్యాజ్యగానికిలాభించుట కెట్లుపయోగింపవలయునో నాకెఱుంగ వడదాయె - నేతత్సిద్ధాంతమునకుం జెందిన వివాదములం బఠించితిం - గాని యీ సూక్తి యుపయోగించుననునమ్మిక నయ్యవి హత్తింపంజాలవయ్యె - మఱియు ౩

సీ. చదువనైతిని న్యాయశాస్త్రంబు భారత, దేశసంబంధిని లేశమైన
మనవిపత్రంబు నెమ్మయి సంతరింపంగ, వలయు నవ్వేర వింత తెలియనైతి
నడివాఁక సుడినీటం బడి తల్లడంపడు కైవడి నుంటి నక్కాలమందు
వింటిం గోర్టులలోన వీరవిహారంబు, సలుపుచుండు ఫిరోజిషా యటంచు

ఆ. నాంగ్లభూమి నెట్టు లతఁ డిట్టినేర్పు నార్జించె నొక్కొ-యని విచిత్ర మంది
యతనిపగ్గె నాకు నబ్బ దీప్టువం,దిది యథార్థ మంచు నెంచికొంటి. ౪

క. ఆపిదప న్యాయవాది, వ్యాపారము పొట్టకూటి నైనను నాకుఁ
జేపటుపంగలదాయను, ద్వాపర మెస రేఁగి నన్ను దండడి వెట్టెఁ. ౫

క. ఈసందియములు న్యాయా,భ్యాసం బొనరించుకాలమందే నను బల్
గాసిల్లఁజేయఁ దెల్పితి,నాసంగడికాండ్రి కీమనస్తాపంబుఁ. ౬

తే. అంత నాచింత నెఱిఁగి మేలరసి మిత్రి,మొక్క-రుండు "దాదాభాయియొద్ది కేగి
యతనిహితబోధనము నందు మమ్మహాత్ముఁ,డాదరించును విద్యార్థి" ననివచించె. ౭

సీ. ఆంగ్ల దేశమ్మున కరుగు కాలమ్మున,నౌరోజిమహనీయునకు నొకండు
పరిచయలేఖ సంపాదించికొనిపోయి,తి నటంచుఁ దొలుతన తెల్పినాఁడ
నాకమ్మఁ బెక్కు-నా ళ్లైనపిమ్మట నెల్వ,రించితిఁ బురుషవరేణ్యు నతనిఁ
గనుఁగొన నెంతవాఁడను నేను? విద్యార్థి,జనులకష్టమ్ముల సౌఖ్యములను

ఆ. దెలియ సంఘమొండు నిలిపె నతండు త,త్సభల కెల్ల నేను జనుచునుందు
మఱియు నమ్మహాత్మమాటాడురచ్చల,కరిగి సమ్మదంబు నందువాఁడ. ౮

సీ. ఇటు లుండ నొక్క-నాఁ డెట్టెటులో సాహ,సించి యమ్మేటి దర్శించి కాని
పించితి నక్క-మ్మ;నంచితచరితుఁ డా,నౌరోజి పదపడి నన్ను మిగుల
నాదరించి మదీయ మగునుపదేశంబు,నావశ్యకం బగునప్పుడెల్ల
వచ్చి నీవు గ్రహింపవచ్చు నటంచు భా,షించెఁ బ్రేమరసంబు చిప్పిలంగ

ఆ. నట్టులయ్యుఁ దగినయక్క-ఱ లేనప్పు,డమ్మహాత్మునకు శ్రమమ్ము నొసఁగు
టనుచితమ్ము గాన నయ్యవకాశంబు,వలని లగ్గువడయ వలవనైతి. ౯

తే. కావుటంజేసి నాచెల్మికాఁడు నీదు, చింత లన్నింటి నౌరోజిచెంత విన్న
వించుకొ మ్మన్నహితము నవ్వేళయందు,నియ్యకొనుటకు నేఁ దెగియింపనైతి.

వ. అంత నొకానొక నెయ్యునిహితవు ననుసరించి సుప్రసిద్ధాంగ్లేయన్యాయవాది యగు "ఫ్రెడరిక్ పిఁకటు" సన్నిధికిం జని నాసందియములనెల్ల నతనితోడ విన్నవించితి-నయ్యుదారచరితుఁడు నన్నుఁ దననెచ్చెలింబోలె గారవించి ౧౧

సీ. జగమునందు ఫిరోజిషా బహురుద్దీను, లను బోలుప్రతిభావిలాసు లెంద
ఱుందురు? తల్లడ మందకు సాధార,ణన్యాయవాదియై నడుచుపొంటె
నక్క-ఱ లేదుసు మ్మెక్కు-డు నేర్పు;సా,మాన్యమైనట్టి ప్రామాణికతయు
నాసక్తియును జాలు నద్దాన విత్తంబు,గడియింపవచ్చుఁ బుష్క-లముగాఁగఁ

తే. దగవు లన్నియుఁ జిక్కు-లం దగిలియుండఁ,బోవు పఠనీయపుస్తకంబులను గాక
వింతపాత్తంబులను జదివితివె? వాని,పేరు లెట్టివియో వినిపింపవయ్య. ౧౨

ఆ. అనుడు నాపఠించు నలఁతిపొత్తమ్ముల, నెఱుకచేసినంత నించుకంత
చప్పరించి మగుడ జాలిమై నాతఁడి, ట్లనియె మందమధురహాస మొలయ. ౧౩

తే. తెల్లమయ్యెను నాకు నీ యుల్లమెల్ల, నసదుసూ! లౌకికజ్ఞాన మరయ నీకు
నదియపో! న్యాయవాదివై బ్రదుక నెంచు, నాతనికి జీవగఱ్ఱయై యలరుచుండు. ౧౪

సీ. ఔర! భారతదేశచారిత్రమైన నీ, వెఱుఁగ నైతివి కదా యింతవట్టుఁ
దచ్చరిత్రము భారతమునఁ బుట్టినవాని, కరయ నవశ్యపాఠ్యంబుగాదె
మొనమొన్న నీదేశమునఁ బ్రవర్తిల్లిన, సైనికవిప్లవచరితసైత
మయ్యరే! పఠియింపవైతివి మఱి న్యాయ, వాది మర్త్యస్వభావ మ్మెఱుంగ

ఆ. వలయు మొగమువంక తిలకించి నరుఁ డెట్టి, వాఁడొ గుఱుతుపట్టవలయు నట్టి
మార్గమెల్ల నెఱుఁగ మాళికసాముద్రి, కమ్ముఁ జదువు టవసరమ్ము సుమ్ము. ౧౫

వ. అని యతఁడు నాకవశ్యపఠనీయములగు గ్రంథములపేళ్ళను వానిలభించు
తావుల వ్రాసియిచ్చి నన్ను వీడుకొలిపె — నమ్మహనీయుని సల్పినహితోపదేశమ్మెన్నఁడు
నమ్మరవఁజాల — నతనిముందు నాసంక్షోభము పంచబంగాళ మయ్యెఁ — గానియదుగుఁ
గదలించినంతన సాక్షాత్కరించె — నంతనిలుసేరి మఱునాఁడ సాముద్రిక గ్రంథముల
న్వ్రాలిచి చదివితిఁ — గాని నాకవి దురవగాహంబులయ్యె — నివ్విధంబున ౧౬

క. అల "పిన్కటు" హితవచనం, బులు నాకున్ ఫలము నీకపోయినను విని
ర్మలమై విలసిలు నాతని, చెలిమి కడుంగడు శుభంబు చేకుఱఁజేసెన్. ౧౭

క. మంచివకీలై ధన మ్మా, ర్జించుటకు ఫిరోజషాగరీయో మేధా
భ్యంచత్ కౌశల మేటి క, టంచు నసామాన్యశక్తి యది యోలంచున్. ౧౮

తే. మఱియు సాధారణంపుఁబ్రామాణికతయు, నోడలు వంచి పనుల్ దిద్దు నడవడికయు
న్యాయవాది కుండినఁ జాలు నని యతండు, వలుకుహితమందు నాకు విశ్వాస మొదవె.

క. ఈలక్షణముల రెంటం, బాలుండినవాఁడ నగుటఁ బాదుకొనియె నా
శాలత మన్మానసమున, దూలెను నాబెంగ దూరదూరమ్మునకున్. ౨౦

వ. ఇట్లుండునంత నాకు బిరుదపట్టము లభించె — నది ప్రాప్తించిన మఱునాఁడ
బారిస్టరులపట్టికలో నాపేరు చేర్పించుకొని తదనంతరదినమ్మున ౨౧

తే. చెలులవీడ్కోలు గైకొని సీమ విడిచి, యమ్మనాఁడికకుం బయనమ్మొనర్చి
యెలమి తోలఁకాడఁ బొగయోడ నెక్కి వరుస, డాయవచ్చితి నేను బొంబాయిరేవు.

క. రంగత్తుంగాభంగత, రంగాళిఁ జెలంగుచుండె రత్నాకరము
ప్పొంగుచు నే నావిరిపడ, వం గట్టెక్కితిని మిత్రవర్గము మెచ్చన్. ౨౩

ఆత్మకథ

ద్వితీయభాగము

౧ రాజచంద్రకవి

గీ. అర్ణవం బల్లకల్లోల మగుచునుంట, నాప్రయాణంబుసల్పిన నావలోని
మంది సకలంబు నలసటచెందెఁ గాని, యుబ్బుచున్నాఁడ నే నెట్టిదెబ్బ దినక. ౧

గీ. అత్తఱిన్ గాలివాన పర్వెత్తుచుండ, నౌకపై నిల్వఁబడి దానిపోకలెల్లఁ
జూచుచు నఖండసంతోషవీచికా ప్రరంపరల నూఁగుచుంటి ధైర్యంపుబలిమి. ౨

వ. ఇది యిట్లుండ ౩

సీ. ఆచారదాస్యమం దాఱితేఱిన కుల, వృద్ధులు నన్ బహిఃవెట్టి యెట్టి
తీఱును ల్గూర్తురో నేరుపులేనియే, నెట్లు రచ్చలలో జయించి జగతి
తాణింతునో సంస్కరణవాంఛితం బస్మదీయ మేరీతి సిద్ధించునో య
టన్నతలంపు లైక్యమునంది నాయంత, రంగమం దొక్కఝంఝానిలంబు

ఆ. నపుడ రేఁపెఁ గాని యదియును నాగుండె, నిబ్బరంబుఁ జెఱుపనేరదయ్యె
నంతలోనవచ్చె నగ్రజుఁ డోడరే, వునకు నన్నుఁ గలిసికొనుటపొంటె. ౪

ఆ. మేటివెజ్జు సుకృతి మహాత్మాబలాత్కృతి, నతని కేము విందులైతి మపుడు
మున్ను సీమలోన మొలచినమాచెల్మి, తీవ మొగ్గదొడిగి తేజుసూపె. ౫

ఆ. అమ్మ నెపుడుచూతునా యన్నయుబలాట, ముల్లమందు ముదురుచుండెఁ గాని
మేనిఁదొఱఁగె నాపె యే నాంగ్లదేశమ్ము, విడువకున్ననాఁడె విధివశాన. ౬

క. ఉగ్రమగు నియ్యుదంతము, నగ్రజుఁడే నోడదిగినయంతన వినిచెన్
శుగ్రేఖ లలమ ధర్మ, వ్యగ్రుఁడనై శౌచవిధుల నపుడు నెఱపితిన్. ౭

క. ఈవార్త సీమ కంపిన, బావురుమని యేడ్చియేడ్చి పరభూముల నెం
తో వేదన గుడిచెద నని, భావించుట నన్న నేఁడు బాహిరపెట్టెన్. ౮

ఆ. తండ్రిచావుఁగన్న తరుణంబునందు నా, పడినశోకంబె బెడిదమయ్యెఁ
దల్లిచావు విన్నతఱి నన్నుఁ గలఁచిన, వంత; యేల దానివర్ణనంబు. ౯

ఉ. అమ్మనుజూచి పొంగి వినయమ్మునఁ గేలుమొగిడ్చి తల్లిరో!
నమ్మము నాప్రమాణములు నాఁటివి తప్పక యెన్నిబన్నముల్

పమ్మిననోర్చినాఁడ నని పల్కుట కువ్విళులూరి నా యభా
గ్యమ్మున నాసలెల్ల నడియాసలయై చన వెచ్చనూర్చితిన్. ౧౦

శా. నాకుం బిన్నటఁగోలె ముద్దుమెయి నానాధర్మముల్ నిర్మల
శ్లోకుల్ పోయినపోకడ ల్గఱపి నాలో నింతయాస్తిక్యమున్
రేకెత్తించినసాధుశీల జనయిత్రిం గోల్చి పాపాగ్ని కీ
లాకుల్యల్ తెగటార్పనైతి విధి యేలామాఱు నం చేడ్చితిన్. ౧౧

గీ. నన్నుఁ గనినంతఁ బొడవుగై కొన్నకూర్మి,వోలె నెదురయి బిగ్గఁ గవుంగిలించి
జనని మన్మస్తవీధి మూర్కొనఁ గరంగి,సాగయనైతి నటంచుఁ బెన్వగలఁ బడితి.

క. అడ లెంతపొటకరించిన,గడిదాఁటఁగనీక బాష్పకణములసోనం
దడియక జీవన్మాతృకు, వడువున గంభీరభావవత్త మెఱసితిన్ ౧౩

వ. నా కపుడు మోహతా పెక్కండ్రుమేటిమానుసులతో నెఱుకగల్గించె-నం దతని
సైదోడగు రేవాశంకరజగజ్జీవనుతో నేర్పడిననెయ్యంబు కొలఁదులు నెట్టరాని -
దతనిపెద్దన్న కల్లువాఁడగు రాజచంద్రకవితోడిపరిచితి నాకొదవుట యెన్నఁదగిన
విషయం - బతండు లేజవ్వనమ్మునం దుండియు సుశీలుండని సుధీమణియని
ముంజూపునంద నాకుఁదోఁచె - వెండియు ౧౪

చ. అతఁడు శతావధానమున నాఱియుఁదేఱినప్రోఢ, ధారణా
చతురతయందు నాతనికి సాటి యతండ;తదీయధీసమ
గ్రతఁగన దంతముల్పులిసెఁ గాని కవీంద్రు నపారశాస్త్రపాం
డితికిఁ బవిత్రవర్తనపటిష్ఠత కాత్మవిచారదీక్షకున్. ౧౫

గీ. కడు వలపుగొంటి నధ్యాత్మగౌరవంబు, వడయుటక వెచ్చపెట్టె జీవన మతండు
నగలబేహార మొకవంక నడుపుకొంచు, నమ్మహామహుఁ డొకవంక హరి భజించు.

గీ. ఆటపాటల బాసట యగువిధానఁ,గమలనాభుని వీక్షింపఁ గంటివేని
దెగును భవబంధ మన్నగీతిని దలంచు, రేవగల్లు ముక్తానందకృతి నతండు. ౧౬

సీ. రతనాలముత్యాలరాసు లమ్ముచునున్న,నతనిచిత్తము విష్ణునంద లెస్స
తవిలివర్తించు; నాదాయవ్యయమ్ముల,పుస్తకంబులతోడిపొత్తు విడువ
కాతనిమ్రోల వేదాంతవిద్యామర్మ,మెఱఁగించుపొత్త మేదే నొకండు
తేజరిల్లుఁ; దదీయదినచర్యయును దాని,విడద; బేరంపుసందడికిఁ దప్పి

గీ. నంత నీరెంట నొకదాని నాదరించు;,నతని వెలిపుచ్చు నుత్తమకృతుల కెల్లఁ
దల్లియై వానిదినచర్య తనరు; బేర,గాఁడె యాతఁడు కేవలజ్ఞాని గాక. ౧౭

మం. కొనువారితో నమ్మికొనువారితోడఁ, దగఁ బల్కి వారలఁ దరలించినంత
నతఁ డౌపనిషదరహస్యముల్ తఱచి, నిత్యవృత్తమ్ములోనికిఁ జేర్చుచుండు;
నమలాత్మఁ డితఁడు బేహారమ్మనడుమ,హరిచింత మున్గి దేహమ్మును మఱచి
నైకవారమ్ములు నాకంటఁ బడియెఁ;,దనభంగి నెల్లభూతములఁ బాటించు
చేనాఁడు మఱవఁ డీ యిద్ధశీలుండు, నాతోడ వీనికి నలుసంతయేని
నక్కఱలేకున్న నతివేలమైన,పరిచితి నాకు నేర్పడె వీనితోడ
నితనియంగడికి నే నేగినవేళఁ,దత్త్వసంవాదంబు తప్ప వేఱొండు
మాటపుట్టదుగదా మానాల్కవలన,నాత్మవిచారమం దపు డెన్నఁదగిన
యనురక్తి లేనినా కతనివాక్రుచ్చు,పలుకె మంత్రంబాయెఁ;బదపడి యేను
బహుమతాచార్యప్రవచనముల్ వింటి,వెదకితి దేశికున్ వేఱుగా నొకని
రాజచంద్రున కుద్దిరాఁ జాలినట్టి,యుపదేష్ట కన్పింపఁ డొకఁడేని నాకు
హృదయమ్మునకుఁ దాఁకె నితనిబోధనము,లితనిమనీషయం దెచ్చె గౌరవము
ప్రామాణికుండుగా భావింతు నితనిఁ,బెడదారిలో నన్నుఁ బెట్టఁ డీతండు
హృదయపుంబాదులో నిమిడియున్నట్టి,భావము ల్నాకునై ప్రకటించు నీతఁ
డీశ్వరతత్త్వంబు నెఱిఁగి యెఱుంగ,కల్లాడుపట్ల నా కాలంబ మితఁడ. ౧౯

క. అతఁ డింతగొప్పవాఁ డని,మతి నమ్మితిఁగాని వాని మద్గురుఁగా హృ
చ్ఛతపత్రపీఠియం దు,ద్గతభక్తి న్నిలిపి కొల్వఁ దలకొననైతిన్. ౨౦

క. ఆగద్దియ నీనాఁటికి నేగురుఁడే నాక్రమించియెఱుఁగడ యిప్డున్
నాగురునికై గవేషణ,సాగించుచు నున్నవాఁడ శ్రద్ధాళువనై. ౨౧

సీ. ఆచార్యుఁడే దైవమని మనధర్మంబు,గురున కొసంగినగఱువతనము
నీకొండు;నొజ్జయే లేకున్న మఱుఁ గెఱుం,గుట కల్ల యనెడుపల్కును యథార్థ;
మక్కఱంబులు నేర్పునతనికిఁ జదు రెంత,లోపించినను బెద్దలోట్టువాడమ
నేరదు; బ్రహ్మవిద్యారహస్యము దెల్పు,నాచార్యుఁ డలఁతివాఁ డైననాఁడు
గీ. బండిదొర్లదు;జ్ఞానసంపత్ప్రపూర్ణుఁ,డెవ్వఁ డాతండ గురుపదం బేలనర్హుఁ
డెఱుకవడచుటకై నరుఁ డెల్లనాఁడు, నుద్యమించుట తమకించు టుచితవృత్తి. ౨౨

గీ. దొరకు శిష్యునకుం దగ్గురుఁడు జగతి,నర్హతకొలంది యత్నంబు నాచరింపఁ
జెల్లుబడి యున్నవారపో యెల్లవారు,సిద్ధి దైవవశం బందు రిద్ధమతులు. ౨౩

వ. ఇట్లు నేను రాజచంద్రుని మదీయహృదయరాజ్యంబున కొడయనిఁ గావించుకొన
నైతిఁ గాని యమ్మహామహుండు బహువారమ్ము లితికర్తవ్యతాజడునకు నాకుఁ
దెరువుసూపి తద్దయుం దోడయ్యె-నితం డైంద్రియకసంబంధమునను తస్కిన్

టాల్‌స్టాయులు తమరచనలచేతను నాయుల్లంబు కొల్లగొని నానడవడికిం దమ
యడియాలంబు లుగ్గడువుగాఁ బ్రబ్బున ట్లొనరించి-రక్క-ఉపాసఁగినపట్ల వీరిం
గొనియాడువాఁడ. ౨౪

* * *

౨ జీవయాత్ర

మం. బొంబాయి నిటు కొన్నిప్రొద్దులువుచ్చి,యస్మదీయము కాణయాచికి రాజ
కోటకు సవరించుకొంటిఁ బైనంబు,నాసీమపోక నిందాపాత్రి మనుచు
నానాఁడు రేఁగినయట్టి పెన్గోల,మాజాతి నింకను మడఁగిపోకుంట
నను నాసికకుఁ జేర్చి నాపెద్దయన్న,గౌతమీనదిని మత్కాయమ్ము దోఁచి
యవల నింటికి నేగి యన్వయప్రజకు,నుడుగరవోనివిం దొాకఁ జేర్పరించె.

సీ. సంస్క్రియావాదులౌ జను లర్థిమై వచ్చి, విందారగించి దీవెనలొసంగి
ననుగారవించి మన్ననచేసిరి; సనాత,నాచారనిరతు లైనట్టివార
లడుగుఁబెట్టర; యిట్టియామెతలకుఁ బాచి,తమ్ముల కీయకొ ల్తనకు నావ
యంతేనిలేద; యిట్లయ్యు నగ్రజుదెస,నాకున్నభక్తి యస్తోక మగుట

గీ. నతనిమాటను జవదాఁటకదియపరమ,మంత్రమనియెంచియమ్మహామహుఁడు పనిచి
నట్టిసల్పితి; నన్ వెలిపెట్టువారి, కరుణ కేనాఁడు జతనంబు నెఱపనైతి. ౨

క. వెలి నిట్లు సడ్డసేయక, వెలివైచినవారిఁ బగఱవిధిఁ జూడక వా
రలు నన్నెంతగ రోసినఁ,గలఁగక వినయంబ వారికడను మెఱసితిన్. ౩

గీ. ఈబహిష్కారకరవాల మిట్టులుంట,నోగిరమ కాదు నాకు నీరొసఁగుటకును
గుండెలేదయ్యె నాబందుగులకు; వారి,యింటికిం బోవుటయ మానుకొంటి నేను. ౪

క. వారు పరోక్షమ్మున మముఁ,జేరుటకై యియ్యకొలుసేయుచు నున్నన్
గోరికపుట్టద నా కీ,ప్రారంభములందు దొంగబ్రతుకే లనుచున్. ౫

గీ. జాగరూకతమై నిట్లు సంచరించు,నన్ను బాధింపమియ కాక యెన్నరాని
కూర్మినించిరి నాదెస స్థలమువారు,పట్టుమై మున్ను బహివెట్టినట్టివారు. ౬

క. నాయుద్యమమ్ములకుఁ దగు,సాయమ్మును జల్పి;రీరసమ్మున వీరిం
దోరియుచు నొడ్డారించిన,నాయెడ నీలగ్గు పొసఁగునా యని తలఁతున్. ౭

ఆ. వెలికిజంకి దాని వెలలింప సంస్కృతి,మెచ్చువారినెల్ల రెచ్చఁగొట్టి
పిచ్చిపనులుసేయఁ జొచ్చిన నను వీర,లెదిరించి యెంతవట్టు పదురించువారొ. ౮

వ. వెండియు నౌకావతరణంబుసేయుటయ తడవుగా నిర్విచారంబుమై మాతృదేశ
మ్మునఁ బొద్దులుపుచ్చుటకుమా టీయల్లకల్లోలజీవనంబున బుంగువడి యపేత

ధర్మండనై పెక్కులూలామాలపు వేసమ్ములం గొనియాడి నాఁడికవారి యాడి
కకుం గుదురై యుండువాఁడ-నయ్యాది యట్లుండె. ౯

క. ఇందనుక నాదుముచ్చట,కుం దగుదాంపత్యసుఖము కుదురద;నిరతం
బుం దవిలి నెరసు లరసెడి,చందం బెది నన్ను విడువఁజాలద యింకన్. ౧౧

క. దోషైకదృష్టినై యే,నీషత్సుఖ మనుభవించియెఱుఁగ;నప్డె నా
యోషిత సమస్తవిద్యా,భూషిత కావలయు నన్నబుద్ధి జనించెన్. ౧౧

మం. జనియించినంతన సంబరం బేమి,వలపున్మైకపుసుడుల్ వలగొన్నమగఁడు
పడఁతి కేచందానఁ బారము లగుప్పు,నువిద కేమియు మప్పకున్న నేమాయెఁ
గటకటా జ్ఞానమ్ము కాసంతలేక,కస్తూరి కెన్నియో కడగండ్ల నిడితి
నిష్కారణంబైన నేరమ్ము మోపి,యింతిని గన్నారియింటి కంపితిని
గొఱలేనియుంగద లుడిచినవెనక,నాదోస మెఱిఁగి కాంతను దెచ్చుకొంటిఁ
దప్పు నావంతాయె దానికిఁ దగిన,శిక్షకుంబాలౌట చెలువ వంతాయె. ౧౨

క. పదపడి మాబుడుతలకుం,జదువులలో సాములందుఁ జతురతగూర్పన్
గొఁదలిడి చరితార్థుఁడనై,పదురుం గొనియాటసేయు పంతులనైతిన్. ౧౩

క. పసిబిడ్డలతో నెయ్యము,పసివారలతోడి యాటపాటలు నిత్య
వ్యసనంబులగుచు నాకో,కరసరాజ్యరమా ధురంధరత్వము గూర్చెన్. ౧౪

గీ. సీమ నెడబాసి యే నిల్లుచేరినంత,దొరలసదనంబునట్లు మాయిరవు పరిథ
విల్లు టుచితం బటంచు భావించి వలయు,చెలువమిడు వస్తుకోటి నార్జించె గురుఁడు.

క. తరతరముల చిఱుదిండులు,మరగితిఁ దేనీరు తద్ద మచ్చికవడితిఁ
బరిపరిదుస్తులకుం దిగి దొరలన్ మఱపించి మురియఁదొడఁగితి మివ్వుల౯. ౧౬

గీ. గడియగడియకు నూత్నోపకరణరాశి,వచ్చిపడుచుండె నింటి కవ్వారిగాఁగ
మొగలివాకిటఁ జౌదంతి నెగడెఁగాని,వచ్చుబడికంటె వెచ్చంబు హెచ్చిపోయె. ౧౭

ఆ. ఉన్నతాధికార ముత్తమకీర్తి య,నంతవిత్త మే గడింతునంచు
నగ్రజుండు నమ్మి యాసలు పెంచి గే,హావ్యయమ్ము లిట్టు లడరఁజేసె. ౧౮

చ. పరుఁ డెదిచేసినంత నిజభావము దావశిఖల్ వెలార్చుఁ దా
నోరుదెస దానిఁ జేయమి సముజ్జ్వలధర్మ మటన్నసూక్తి త
చ్చరితకు జీవమౌట జనసంతతి నాతని కెంద తెందటో
పరిచితు లున్నవారు మృదుభావులు విత్తవదాగగఁణ్యులు౯. ౧౯

ఆ. ఎల్ల యెడలనున్న యీనెచ్చెలులసహా,కార మూఁది యచిరకాలమంద
యతఁడు వలసినన్నియభియోగము ల్గడి,యించి నాకొసంగ నెంచినాఁడు. ౨౦

క. నా న్యాయవాదివృత్తి య,నన్యప్రాప్తముగ నడుచుననునమ్మిక న
మ్మాన్యుఁడు వెచ్చంబు నసా,మాన్యంబుగఁ బెంచి జంకుమాలినమదితోన్. ౨౧

వ. అతండు నావృత్తివికాసమ్మునకు మున్ముందువలయు సన్నాహము లెన్నిగల వన్నియుఁగావింపఁదొడంగెఁ గాని రాజకోటంబులోని చిటిపొటిపీట బల్లగట్టుటయన్న నాకు హాస్యాస్పదంబుగాఁ దోఁచె-నాబింక మిట్లున్నను దగవాదువానికి వలయు తెలివితేటలు నాకు దవ్వుదవ్వులన యుండె-నేది యెట్లున్న నేమి వీనుమిగిలినన్యాయవాది కిచ్చుసొమ్ముకంటెఁ బదిమడుంగులు నా కొసంగవలయు-నభియోక్తల యందు నన్ను వలచుపాటిమోటువాఁ డుంట యరిది-యెందే నొకఁడుండుఁగాక - నాయజ్ఞానమ్మున కహంతావంచనలచెలిమిఁ గూర్చి యే నీలోకమ్మున కింకను ఋణంపడుటపోలునా యనితలంచునెడ నాయభ్యుదయమ్ము వలచుసుహృజ్జనంబు నన్నుఁగదిసి మిత్రమా నీవు బొంబాయికింజని యచటి నెటూపాడిపట్టున నించించుకయనుభూతి నార్జించుచు నాయాయి ధర్మశాస్త్రంబులు పఠించుచు హెచ్చుకుందాడక వచ్చిన యభిగ్రహమ్ములతోఁ దనివిసెందుచుఁ బ్రొద్దులుపుచ్చుట లగ్గుగదా యనుడు నే నాహితోక్తి న్మెయికొని తన్నగరంబు సేరి ౨౨

గీ. పొనరుపడు నద్దెయింటఁ గాఁపురము వెట్టి,వంటకై రవిశంకరాహ్వాయు ధరాసు
పర్వు నియమించికొని వాని బానిసీని,కరణిఁగా కింటివానియ ట్లరయుచుంటి. ౨౩

గీ. అతఁడు శివమూర్తిపైని దోయమ్ము క్రుమ్మ,రించినట్టుల మేనిపై నించునీరు
తనువు రుద్దఁడు జందెము న్దాఁకఁ డతని,వలువడాలు కాటుక కొక్క-వాసి మేలు.

క. వేదమ్ము నెఱుఁగఁ డాతఁడు,లే దతనికి శాస్త్రమైత్రి లేశము నాచా
రాదులు తెలియవ తగువాఁ,డే దొరకె న్నాకు వంటయిలు దీర్చుటకున్ ౨౪

వ. ఒక్కమరి నే నతనిం గని సగౌరవంబు సస్నేహంబు నగుభంగి ౨౫

క. రవిశంకర! నీపాక,వ్యవసాయజ్ఞాన మల్ప మగుఁ గాక ధరా
దివిజుండ వయ్యు సంధ్యా,దివిధుల్ నెఱవేర్ప విట్టిదియుఁ జెల్లు నొకో. ౨౬

ఆ. అనుడు నాకు సందెయన మేడిఁగ్గై కొంట,పాఱ వేల్మి పలుగు బ్రహ్మయజ్ఞ
మేమిసెప్పికొందు నే నిట్టిబ్రాహ్మణ,త్వంబు నూఁది యున్నవాఁడ నకట ! ౨౭

క. ఖాప్రొయ్యిఁ దుడిచి కుక్షి,వ్యాపారము దిద్దుచున్నవాఁడను దర్వీ
లోపమ్ము ఘటిల్లినన్నాఁ,డీపాణిం బలుగు లేదె యీతని కనియెన్. ౨౮

మ. పాచకక్రియలోనఁ బాండితి లేని, యమ్మహీదేవున కాచార్యకంబు
నలుపుచు వంటలో సగపాలు నేన, నెఱపి సాగించుచుంటిని జీవయాత్ర
పనితొందరలు లేనివాఁడైననాకు, వంటసేఁతకు వీలు వలసినం తబ్బె
మరప్రొయ్యి గాని దొరల్ మాడ్కిఁ జొచ్చి, శాకపాకము లేము సంతరించిమి
నాబానసీనికి నాకునుం బోలె, నెవ్వానితోఁ దింటకే నడ్డులేమిఁ
గడుఁ జక్కఁగాఁ గాఁడికలిసె మా కపుడు. 30

క. ఐనం గల దింటర మొకఁడే నెంతగ మొత్తుకొన్న నీతఁడు బొగ్గుం
బోనివసనంబు నూడ్పఁడు, బోనమ్మను మాయఁ డెట్టిభూమీసురుఁడో. 3౧

క. ఈతంటా లెటు లున్నను, జేతికి నేగానిరామిచే సెలవునకున్
భీతిలి పదిపక్షంబుల, కేతన్నగరంబు వాసి యేగుట వలసెన్. 3౨

వ. ఏ నిట్లు లోకయాత్రకు మొదల్కాని మేడిపండువోని న్యాయవాదివృత్తివలన నేవపడి ముం దేమిసేయం దగునా యనుతలపోఁతకుం దిగి దిగులుకుడువం దొడంగితి. 33

* * *

3 తొలుతగవు

మం. బొంబాయిలోనఁ గాఁపురము సాగించి, హైందవన్యాయశాస్త్రాంభోధి నీఁద
నుత్సహించితి మిత్రుఁ డుత్తమాచార, నిధి వీరచంద్రగాంధి సహాయుఁ డయ్యె
నభియోగసంచయం బార్జించుపాంటెఁ, గష్టించుచుండె నగ్రజుఁ డెల్లవిధుల
వీరచంద్రుఁడు జగద్విశ్రుతిం గన్న, యల తయ్యాబ్జి ఫిరోజిషాదికన్యాయ
వాదుల ధీవైభవమ్ము నగ్గింప, విస్మయసాధ్వసావిష్టుండనైతి
స్మృతిపార మది నాకుఁ జీకాకుగూర్చె, నాలుగైదేండ్లు క్రిందను మీఁదఁ బడక
మనవృత్తి నెవ్వాఁడు మాడ లార్జించెఁ, బుయిలోట వలదంచు బోధించె మిత్రుఁ
డానాఁటి కానాఁటి కడరె నెచ్చమ్ము, బల్లగట్టితిఁ గాని ప్రజ్ఞ లేదాయెఁ
బాడిపట్టున కేగి పల్కాడుటన్న, నెక్కడలేనిజం కేర్పడె న్మదికి
నత్తకొల్వున కప్పుడపుడె కాల్వెట్టు, కోడలనై గోడు గుడువంగ వలసె. ౧

క. పడఁతియభియోగ మొక్కటి, నడుపుటకై తెగువచేసినాఁడను మొదటన్.
నడివాని వేఁడులంచం, బిడ నీకొననైతి నొక్క యేగానియునున్ ౨

క. అది యేకదినశ్రమమునఁ, దుదముట్టెడుతగవ చిక్కుతోడం బెనఁగొ
న్నదిగాద యట్టిపనికై, ముదమారన్ బుచ్చుకొంటి ముప్పదిరూకల్. 3

ఆ. వాదిగెల్వ వలచివచ్చిన యెలకాంగ్రేఁ,బట్టిచూడఁ దగినపట్టు వచ్చి
నిలిచి నోరువిప్పనిముసాన గుండియల్,పరువులెత్తఁ జెమట వఱదపాఱెచె. ౪

క. కుమ్మరిసారెవిధాన శి,రమ్ము గడు న్గుబ్బటిల్లె రచ్చయు విసుమా
నమ్ముగఁ బరిభ్రమించెఁ బ,దమ్ము లిసీ రాల్పడెం బదమ్ములయట్టుల్. ౫

ఆ. ఎంతపెనఁగులాడి యేమేమిచేసిన,నొదవదయ్యె నోట నొక్కమాట
తగవుపల్కువారు తగవరియున్ నాఁడు,నన్నుఁ జూచి యెంత నవ్వినారొ. ౬

ఉ. కుప్పనఁ గూరగాఁ బడి దిగుల్పడి దీల్పడి పూనుశేల నా
కొప్పనిచేత కంచు నభియోగినిఁ జేరి ధనం బభిగ్రహం
బప్పనచేసి నావలన నాగ్రహమందకు మంచువేఁడి యే
నప్పుడ కొంపఁజేరి త్రపయందు మునింగితిఁ బెద్దకుంగితిన్. ౭

గీ. తగినసామర్థ్య మేర్పడుదనుక నిట్టి,పనులు వల దన్ననిర్ణయంబునకు నచ్చి
యాఫ్రికాఖండమున కేగునంతవట్టు,ముట్టుకొనన్నైతి నభియోగ మెట్టిదేని. ౮

క. ఈగతిఁ గావించుటలో,నాగొప్పతనంబు లే దనందగుఁ బాడై
పోఁ గోరికవడి నా కభి,యోగమ్ము నొసంగుమందుఁ దుర్వ్యం గలఁడే. ౯

వ. కాని పోర్బందరుదొరతనమువారు తమ కరివెట్టసికతమ్మన నొకతురుష్కుని పొలము నగ్గపఱచుకొంటంజేసి పేదఱిమి కాదరువగు నక్కాఁపువాఁడు పాడిపట్టున కర్పించుకొనుట కొకమనవిపత్రము వ్రాసియిండని నన్నుఁగోరె నతని వాదున బిగువు లేబరమ్మని యెఱింగియు మజ్జనకునిపెద్దఱికం బూఁతగాఁగొని యమ్మలక నాబాసట నాసించుటంజేసి యాపనికిం దలయూఁపితి దానిముద్రణ వ్యయం బతండ భరియించె నారచించినవిన్నపంబుఁ గన్న నెయ్యరు తద్దయు నగ్గించి రాపొగడ్తచే నిట్టిమొఱమొక్కలు లిఖించుటకైనం జాలుదుఁగదా యను విశ్వాసమ్ము నాకొదవె నియ్యది తథ్యంబ. ౧౦

క. విత్తంబు నభిలషింపక,యిత్తెఱఁగున మొఱలు వ్రాఁత కేఁబూనినఁ గిం
చి త్తైసలిక నాకుండమి,సత్తెపుయగుఁ గాని బండిసాగునె దీనన్. ౧౧

ఆ. ఆంగ్లభాష నించుకంత గడించుట,నొజ్జనంబుమీఁది కొఱగెఁ జూపు
ప్రకటమయ్యె నప్డ యొకబడి కాంగ్లమ్ము,తెలుపునయ్యగారు వలయునంచు. ౧౨

గీ. పరమసమ్మద మం యప్పాఠశాల,కంపుకొన్నాఁడ విన్నపం బానుగతిని
మీరువిచ్చేయఁ గోరుచున్నార మంచుఁ,గమ్మనంపెను విద్యాలయమ్ము పెద్ద. ౧౩

క. చనుదెంచిన నన్నుఁ గనుం,గొని మన్ననచేసి శాస్త్రగురుపట్టము లే
మి నినున్ విడుచుట తప్పని,పని యయ్యె నటంచు జాలిపడుచుం బలికెన్. ౧౪

క. చల్లపడెఁ గాలుసేతులు,పుల్లవడె న్మొగము మూరిఁబోయినకోర్కుల్
పొల్లవడెనాకు;నన్నయు,డిల్లపడెన్ దీని విని కడిందివగపునన్. ౧౫

క. ఈరాచవీట నెన్నా,ళ్లారాటంపడినఁ గూలియబ్బ దటంచుం
దీరు పొనరించుకొని యేఁ,గోరికవడినాఁడ రాజకోటకుఁ జేరన్. ౧౬

గీ. నాదుసోదరుఁ డచ్చోట నడిమితరపుఁ,బాడిపల్కరియై యున్నవాఁడు గాన
మనవులన్ వ్రాతిత మున్నగుపనులతండు,నాకొసఁగునంచుఁ దలపోసినాఁడ నపుడు.

వ. అందు మాకుటుంబ ముంటంజేసి దినవెచ్చమ్మును గొంత కూడివచ్చు నని యేక
తంబాడి బొంబాయి నున్ననాపసికాఁపురమ్ము బండి కెక్కించితి-నయ్యది
యట్లుండె-నే నవ్వీట నున్నతఱి నెల్లనాఁడు జగాపాడిపట్టున కేగితిఁ-గాని దానం
జేసి నాకబ్బినమేలు పీసమేని లేద-వాదరహస్యంబు లెఱుంగఁదగిన శేముషి
బలంబు నాపాల సున్న-యెన్నేసిమాఱు లభియోగతత్త్వంబ తెలిసికొననేరక కూరి
కితి-నిప్పునియందు నాకెందఱో భాగస్వాము లున్నకతన నాసిగ్గువెర్రిఁగు చాలవట్టు
తొలంగె-రానురాను న్యాయస్థానమ్మునఁ దూఁగుటయు నొకయందం బని తలంచి
సిగ్గుమాలినవాఁడ నైతి. ౧౮

మం. ఇపుడేని బొంబాయి నెందఱో న్యాయ,వాదు లుండకపోరు పనిలేనివారు
హిత మొండు వారికై యే వెల్వరింతు, ననుభూతిపూర్వకం బగుసుభాషితము
నాఁడు గిర్గాములోన వసించునేను, దగవుపట్టున కేగుతరుణమ్మునందు
శకటవ్యయంబు పీస మొసగ్గ యెఱుఁగ, జగ మివతాళించు జడి కరిమ్ముఁ గాక
చిచ్చు లూరెడునెండ చెలరేఁగుఁ గాక, నడిచిపోకయు రాక నాదీక్ష యయ్యెఁ
దొంబదినిముసాలతో నేగివచ్చి, తద్దయు వెచ్చమ్ము తగ్గించుకొంటి. ౧౯

క. నాసఖు లామయములకున్, దాసత్వము సల్ప నేను దలవాల్పక యెం
తో సుఖముంటిని శ్రిమ క,భ్యాసంపడువాని దెసకు వచ్చునె చిడల్. ౨౦

క. రాబడి హెచ్చిననాఁడున్.నాబడి నే విడువ కట్ల నడిచెడివాఁడన్
నా బ్రతుకు నాఁటిసాదన,చేఁ బడసినలగ్గుకతనఁ జెలగెడి నిపుడున్. ౨౧

***

౪ మొదటిదెబ్బ

ఆ. న్యాయవాది యస్మదగ్రజుఁ డిచ్చుతోఁ,డ్పాటుకతన రాజకోటలోన
నెలకు మూఁడునూర్లు నేఁగంటి రూప్యముల్, ప్రౌఢివెలయ విన్నపములు గూర్చి
గీ. నడిమివానికి లంచంబు నిడ నటన్న, పట్టుదల రాజకోటలో వదలవలసె
నెంత యనివార్యమైన నే నిట్లుచేఁత, యాత్మవంచన గాకపో దని తలంతు. ౨
మ. పదిరూకలిట్లు సంపాదించుకొనుచు, దనివోవుచున్న యీ తరుణమ్మునందు
గురుతరావజ్ఞకు న్గురియైతి నేను, బ్రదుకున కదియపో ప్రథమఘాతంబు
నధికారధూర్వహుం డగు తెల్లవాని, తత్త్వమెట్లుండు నందనుక నేనెఱుఁగఁ
బోర్బందరుధరాధిపుఁడు కీర్తిశేషుఁ, డేలిక గాకము న్నితనిపాల
నొజ్జయై ప్రగడయై యుండె మాయన్న, యితఁ డమ్మహీనేత కేదియో దుర్నీతి
నేర్పినవాఁ డంచు నిందితుఁ డయ్యె, నయ్యభియోగ మందం దుండి తుదకు
నగపడె రాజకీయప్రతినిధికి, నన్నపైఁ గసిఁబూనె నాంగ్లేయుఁ డతఁడు
సీమలో వాఁడు నాచెల్మికాఁ డగుటఁ, దగుమాటలాడి యాతనిఁ దేర్పు మంచు
ననుఁ గూర్మిమైఁ గోరె నాసోదరుండు. ౩
క. ఎందో యెపుడో పొసఁగిన, పొందిక యిట్లాదవఁజేఁత పోలనిపనిగా
డెందమ్మునఁ దలఁచితి నా, చందం బది యగ్రజున కసమ్మతిఁ బెంచెన్. ౪
క. అతని కెదురాడఁ జాలక, ప్రతినిధి మన్నింపఁ డంచు భావించియు నే
గితి వానికడకుఁ బంపించితి దర్శన మొసఁగుఁ డన్నచీటిన్ దొలుత ౫
సీ. ఆనతివడసి యయ్యధికారికడ కేగి, యఱఁకువఁ జూపి నెయ్యమ్ముఁ దడవి
యుద్దిష్టమగుచేఁత కుద్యమించుడు వాని, మొగముపైఁ జుఱచుఱల్ మోసులెత్తె
నతనిలోచనవీధి నానాఁటినేస్తమిం, దులకా యటన్నపల్కులు పఠించి
తిని గాని నాపాఠమును మాననైతి రోఁ, తకుఁ జిక్కి కినిసి యాతండు నీదు
గీ. వాకు లికఁ జాలుఁ దీఱిక మాకు నలఁతి, కూళ నీయన్న యిటఁ జెప్పుకొనఁగ వలయు
మాట లుండినఁ దగుభంగిఁ దేటపఱుప, వచ్చు నతఁ డంచు నుత్తరం బిచ్చె నాకు.
గీ. చాలు నిది నాదునోటికి స్వస్తిసెప్ప, కొంట కటులయ్యు నక్కఱ గ్రుడ్డిదగుట
నాగొడవ మాననైతి నుద్యోగిముందు, నడువుఁ డికమీ రని యతండు నొడువుదనుక

గీ. విషయశేషమ్ము వినుఁడంచు వేఁడుచున్న, నన్ను మన్నింపకతఁడు తీక్ష్ణతకుఁ జొచ్చి
సేవకుని బిల్చి వీరికిఁ ద్రోవఁజూపు, మనియె నపుడేని నాగోల నాఁపనైతి. ౮

వ. అంత నతనిలెంక నాయంసద్వయమ్ము నూఁది నన్ను వెడలనడఁచుడు దండతాడితభుజంగమంబునట్లు నే బుసలుగొట్టుచు "నన్ను మీబానిసీనిచేఁ ద్రోయించి యవహేళనమ్ము గావించితిరి-దానికిం దగినక్షమాపణ వేఁడరేని పరువుపోకకు మీపై నభియోగమ్ము తేరకవిడువ" నని యయ్యధికృతున కొకలేఖ నంప నతండు ౯

గీ. ఈవె సభ్యత విడనాడి తెన్నిమాఱు, లెచ్చరించిన వెలుపలి కేగవైతి
కడకు నింకొకమార్గంబు గానలేక, లెంకచేత నిను న్వెడలింపవలసె. ౧౦

గీ. వెడలుఁడని బంటు సెప్పిన న్వినమిఁజేసి, పంపఁ దగినంతబలము చూపింపఁబడియె
నిది యకార్యమటంచు మీ రెట్లు నన్ను, ముదలకించిన సాధ్వసమ్మునకుఁ బోను.

వ. అని తనసాహిణిచే మాఱుకమ్మ నంప దానింగొని లజ్జాభరమ్ముతో రాజకోటకుం జేరి యావద్విషయమ్ము నగ్రజునకు నివేదించుడు నతండు నిరవధికసంతాపవశంగతుఁడై నన్ను సమాశ్వసింపనేరక తగుమిత్రుల నడిసి యాదొరపై నభిగ్రహంబు మోపుమార్గంబు నరయుచుండె-నయ్యవసరమ్మునంద సుప్రసిద్ధన్యాయవాది యగుఫిరోజిషామెహాతా యొకానొకతగవున కవ్వీడుసేర నే నగ్గుఱువమోలకుం బోవ జంకి యతనిచెలికాని కొక్కని కాపత్రమ్ము నొసఁగి దానిపై మెహాతాహితమ్ము నర్థించుడు నతం డీనాఁడు పెక్కండ్రు న్యాయవాదులబ్రిదు కిట్లయున్నదని గాంధికిం దెల్పి-మక్కొడెకాఁడు నేఁడ లండను వాసి యీదేశమ్మునఁ గాలుపెట్టె-వానిభావంబు లిపుడు తప్తక్షీరంబులంబోని-వధికారంబునందున్న యాంగ్లేయు లతని కపరిచితులు-నాలుగురూక లార్జించి సుఖింపఁ గోర్కికలదే నతఁడీవ్యాయసంబును రూపుమాపి తదవజ్ఞ న్మఱచుట లగ్గనిచెప్పవాడు నబ్బోధనమ్ము నాకుం గాకోలకల్పమ్ముగ నుండెఁ-గాని కబళించుట యనివార్యమై యెన్నఁడేని నేస్తమ్ము నిట్లు చెఱుపఁజన దనుకట్టడం జేసికొని దానిం దలఁగనైతి-నీసంఘటనతో నామనుగడకుం బెద్దమార్పు వచ్చె. ౧౨

* * *

౫ ఆఫ్రికా పోక

సీ. దొరచెంత కే నేగు టరయ దోసమ కాని, వీనివెలార్చు నుద్వృత్తి యెదుట
నపరాధ మస్మదీయము లెక్కసేయరా, నిదిగదా దీనికై నిప్పు లుమిసి
యంతలు సేయంగనగునె యాతఁడు నన్ను, మంచితనమ్మునైఁ బంచు టొప్ప
దా? చెల్లుబడిమైక మేచిననాఁడు వి, వేకమ్ము నిలుచునా? వీని కించు
ఆ. కంత తాల్మిలేమి నవ్వాలవింటి నీ, తెల్లబిడ్డ వచ్చి నెల్లవారి
నిట్ల చిన్నపుచ్చి యేపాటివిసువున, కేని మందునఁట కృశానువోలె. ౧

క. నాయభియోగము లీతని, న్యాయస్థానమ్ములోని వయ్యెఁ బ్రిసన్నం
జేయుట దుశ్శక మీదొర, నేయెడ నోరు దేవురించు టింపనినాకున్. ౨

క. ఏయదియో తలక్రిందులు, సేయుదునని వీని జంకెచేసి మరల నా
చాయకు నేగమి చింతా, దాయకమై నాదుశాంతతన్ గొఱవెట్టెన్. ౩

క. అలఁతియలఁతిత్రేండ్లకుఁ దా, వలమై సవరిల్లు కఠియవాడున నానాఁ
డలముకొనెఁ బెక్కుజగడం, బులు కల్లలు తలలుమార్చు బూమియచేఁతల్. ౪

క. మితిగడచిన యీర్ష్యలచే, నితరేతరకలహవహ్ని నెరిసిరి వసుధా
పతు లత్తఱి హితవాగభి, రతి సెడి మెఱమెచ్చులందు రక్తి వాడముటన్. ౫

వ. వారిసచివులు నద్దక్కంగల యధికృతులుఁ దమతమ లాభమ్ముఁ బొంతె నొండొరులఁ గిఱరించుకొనఁ జాగిరిఁక నమ్మహీపతుల కెవండేదిపల్కిన నదిప్రమాణం బాయె - నాసంస్థానాధీశుల శ్రవణంబులు ప్రియవాదులకు వశంపడె - వారు తమపైఁ బెత్తనమ్ముగల యాదొరకడ నూడిగమ్ము సలుపువానినే నుపలాలింప వలసె - నచటి సిరస్తాదారు వారిపట్ల శిరస్సదారుండ (శివుఁడు) యయ్యె - నితఁ డారాజకీయప్రతినిధికిఁ దుపాసియు నగుట వీనిమాటయం దా యాంగ్లేయునకు విశ్వాసము మెం - డీద్విభాషియ వానినేత్రమ్మును శ్రోత్రమ్ము నై వెలయు - నితనివచ్చుబడి యయ్యధికారి యాయమ్మునకంటె మిక్కిలి యనుట స్వభావోక్తియ-కావుటంజేసి ౬

క. విషపవనాపూర్ణం బీ, విషయం బనితోఁచె దీనివిసరుల కెడయై
పుషితస్వేచ్ఛాగతి నభి, లషణీయచరిత్రమై నిలంగల నాకో. ౭

క. అనుచింత యనుక్షణమున్, ననుఁ గాఱియవెట్టఁ దొడఁగె నాకౌతుక మె
ల్ల నడంగె నీయవస్థం, గనుఁగొని మద్భ్రాత బిట్టు కలగుండువడెన్. ౮

క. తగునధికారం బది నా, కగపడుచో, నిచటిబూమె లంటక శాంతి
స్థగితంబగు మన్గడతో, నెగడుదుఁగా యన్నతలఁపు నెక్కొనె నంతన్. ౯

ఆ. ఉద్భవించెఁ గాని యుద్యోగరక్తి మో, సమ్ము లెన్నియెన్ని సలుపలేని
వాని కెట్లు వడయవచ్చును ధర్మాస, నమ్ము గాని పెగ్గడనమ్ముగాని. ౧౦

క. ఆధారమ్మైకో లించుక, లేదే నిట నెట్టిమేలు లేదుగదా మా
కో దక్షిణోత్తరధ్రువ, పాదమ్ముల కున్నపాటిబాంధవ ముండెన్, ౧౧

వ. అయ్యవసరంబునందు పోరుబందరుసంస్థానమ్ము నేలుఱేఁడు తనదేశమ్మునందలి పంట
కాఁపులపై విధించినపన్ను దుర్భరం బగుట సేద్యగాండ్రపక్షమ్ము వహించి యే
నమ్మహీపతిని దర్శింప వలసె-నితండు మనవాఁడయ్యు మిడిసిపాటునం దాదార
కొజ్జ – గానఁ గర్షకులకోర్కి- వమ్మయ్యె-నాయభియోక్తలకుఁ బాడిలభింపమి
న్నన్ను నైరాశ్యమ్ము వలచె-నిఁక న్యాయమ్ము వడయఁగోరిన నుల్లతెల్లదొరకు
మనవి పంపవలయు-నతనికి న్నాకును జుక్కెదురుగదా-కర్తవ్యమేమి-యనివగచు
నెడ నొకమహమ్మదీయుండు పోరుబందరువాఁడు మాయన్నకడకు వచ్చి మా
కాఫ్రికాలో నపారమగు బేహారమ్ము గల-దందలి తగవుపట్టునఁ దడవులంబట్టి
మాయభియోగం బొందు కడుదొడ్డది నడుచుచున్నయది- పెదపెద్దన్యాయవాదులు
మాపనిం జూచుచున్నవారు-మీతమ్ముగుఱ్ఱం బుత్తెంచితివే నతండును మా
కొదవు-నతనికిని లగ్గగు-ననవుడు మదగ్రజుండు సస్మితాననుండై ౧౨

మం. ఏమందువని నన్ను నెచ్చరికింప, సగపాలుమెయికోలు చాటితి న్నేను
బేహారి యపుడు నన్ బేర్మిమైఁ జూచి, తమ్ముఁడా నీకు నింతయు జంకువలదు
తప్పకరమ్ము భద్రము లబ్బు నీకు, నాదీవి మానెయ్యురైన యాంగ్లేయు
లెందఱో గలరు పేరెన్నికగలరు, నీకు వారలతోడి నేస్తమ్ము పొసఁగు
నచటి మావ్యవహార మాంగ్లమం దుంటఁ, బనికివత్తువు నీవు బాగుగా మాకు. ౧౩

క. ఎన్నాళు లచట నుందువొ, యన్నాళ్ళున్ మాకు విందవగుదువు మఱి నీ
కన్నా! పయనమువెచ్చం. బన్నది సకలంబు నిత్తు మతిసుఖదముగన్. ౧౪

క. మాపనుల నిద్దుచు నీ, వాపుడమి న్నిల్వవలయు హాయన మొక్కం
డీపాటున కీయఁబడున్, రూపాయలు పదియునాఱునూ ర్లం చనియెన్. ౧౫

క. ఈపాటి విత్తమునకే, ద్వీపాంతరగతికి సమ్మతింజూపుట శ్లా
ఘాపాత్రము గాకున్నను, నూఁపితి శీర్షమ్ము కొసరు టొల్లనిబుద్ధిన్. ౧౬

మం. క్రొత్తరాజ్యముమీఁదికోర్కి హెచ్చగుట మాతృదేశముమీఁది మమతలొచ్చగుట
ననుభూతి ప్రబ్బుచన్నాస పైకొంట, నాదాయ మది యెంతయైన నేమంచు
నంగీకరించితి నాఫ్రికాపోక, చెచ్చెర సంతరించితి మూట ముల్లె. ౧౭

* * *

౫. నేటాలు

మం. అపుడు విద్యార్థినై యాంగ్లదేశాన, కేంబ్రిడ్జి నొందవినయోడఁబాటు వంత
యిపు డాఫ్రికాకుఁ బోయెడిపట్టునందు, దారయద య్యెఁ బరిస్థితు ల్మాఱుకతన
నాతల్లి యీవేళ నాకమం దుంట, లోకానుభూతి నాలోఁ గుదుర్కొనుట
యబ్ధియానమ్మున కలవాటుపడుట, యీనాఁటిపాళికిన్ హేతువు లయ్యె. ౧

వ. అయినను ౨

గీ. వెలఁది నీసారి విడనాడి వెడలుటన్నఁ, జిత్తమునఁ గొంతచింత రేకెత్తఁ దొడఁగె
సీమకుం బాసి యే నిల్లుసేరినంత, నుద్భవించెను మగుడ మా కొక్కచిఱుత. ౩

గీ. వైషయిక సౌఖ్యములమీఁది వలపు పెర్మి, వలన నిందక్క మాచెల్మి తొలఁగద య్యెఁ
గాని లోకమ్ముగుడుచు నొగాము లెఱిఁగి, యిపుడ కొంత సంస్కృతి కిచ్చగించె.

గీ. ఇంగలాండు వాసి యీనేల త్రొక్కిన, వెనుకఁ గొన్నినాళ్ళు వెలఁదిఁ గూడి
యొక్క తావునంద యుంటినిగాని భ, ర్తృతకుఁ దోడు దేశికతయు వచ్చె. ౪

క. అతికష్టమ్మున కొగ్గుచుఁ, గతిపయసంస్కృతులు మప్పఁ గడఁగితిఁ జెలికిన్
గృతి యిది ఫలింపఁగా నవి, రతవాసము మాకు నవసరం బనుకొంటిన్. ౫

గీ. ఎట్టు లనుకొన్న నేమి నా యీప్రయాణ, కౌతుకము మోపిల విరహార్తి కానరాద
యబ్దమన నెంత యని కాంత నాశ్వసించి, పట్టితిన్ నాఁడు నేను బొంబాయిబాట.

వ. అంత విశ్వప్రయత్నమ్ముమై నావలో మొదటితరపుసౌకర్యమ్ము విలిచి నేటాలునందు నాభాగ్యరేఖం బరీక్షింప నెంచి పరమోత్కంఠతోఁ (1893 ఏప్రియల్) బయనమైతి— మధ్యేమార్గమ్మున నౌకాధిపతి నాచెలికాఁడై నన్నుఁ జతురంగక్రీడకు దింపె—నయ్యాట బుద్ధివికాసమ్మున కెంతయుం దోడ్పడునని విన్నవాఁడ—నోడపెద్ద న న్నందుఁ గుశలుం జేయఁ జూచెఁ- గాని యపజయంబు సర్వదా నన్న వలచు—నతండు నాతాల్మిం గని యుత్తమచ్ఛాత్రుం డబ్బెనని యుబ్బిపోయెఁ – బదుమూఁడు నాళ్లకు మాయోడ తొలిరే వగు 'లాము' చేరె—నవ్వల 'మొంబాసా' కేగె— నావెన్క జాంజిబారుం గదిసె—నీ నౌకాశ్రయమ్మునం దరణి పదినాళ్లాఁగు— నొక్కదినంబున నౌకాధికారి వయాళికి రం డని యాంగ్లేయు నొక్కని న్నన్నుం బిలుచుడు ముప్వురము న్గట్టెక్కితి—మింతలో నొకకుంటెనకాఁడు తోడై మమ్ము

ఆ. పడుపువృత్తి నూఁది బ్రదికెడి నీగ్రోవ, ధూటు లిమ్మకొన్న పేట కీడ్చి
మూఁడుగదులుఁ జూప మూరినలజ్జమై, నచటఁ బచ్చిమూఁగ నైతి నేను. ౭

క. ఓచెల్ల నన్ను నచ్చెలి, యేచందమువానియట్టు లెంచెనొ దైవం
బే చెప్పవలయుఁ జనిన, శ్లే చివ్వున వచ్చినాఁడ నివ్వలిదెసకున్. ౧౦

ఆ. ఓడపెద్ద నాదుజాడలు గుర్తించి, మనసునందు నవ్వుకొనియెఁ గాని
కలికిచెంత నెడఁదగజిబిజి లేకున్కి, భగవదాదరమ్ము పొగడుకొంటి. ౧౧

క. గది నా కక్కటులే దని, మొదటన మొగమోట నేల మోఁద నిసీ నా
మది యింత పేదదా యని, తుదిలేని విచారజలధిఁ దోఁగితి నంతన్. ౧౨

క. నామనుగడ నింతకుము, న్నీమెయిత్రొక్కటలు రెంటి నెఱుఁగుదు భగవ
ద్భూమానుగ్రహాలక్ష్మీ, ధాముఁడనై తప్పకొంటిఁ దద్దురవస్థల్. ౧౩

క. అటమటజాడ లెఱుంగని, చిటిపొటిగోవాళ్ళు పరుపుసెడు నని యీదృ
గ్ఘటనలు పొసఁగినతఱి ను, త్కటకిల్బిషదాస్యమునకుఁ గడఁగెద రకటా! ౧౪

క. ఏ నిష్పాపము నంటమి, నానెఱి యని పొంగఁజాల నవలాగదికిం
బో నని మున్నె తిరస్కృతిఁ, బూనినచో నది మదీయపురుషార్థ మగున్. ౧౫

క. కేవల మీశ్వరునాదృతి, యేవంవిధ విజయసిద్ధిహేతువు గానన్
దీవలుసాఁగెను భగవ, త్సేవారతి యస్మదీయ చిత్తమునందున్. ౧౬

వ. అయ్యది యట్లుండె – నీతీరమ్మునం గల మేడెన్మిదినాళ్ళుండునని యెఱింగి నేను వీటవిడిసి దాపుదాపునంగల దర్శనీయస్థలమ్ములం గంటి – నుర్వీరుహమ్ముల యౌన్నత్యాదుల నొక్క "మలబారే" 'జాంజిబారుం' బురుడించుఁ బ్రకృతిసౌందర్యగాంభీర్యముల కానేల నెలవు నాఁ దగు – నంత మానావ 'మొజాంబిక్కు' గడచి 'మే' మాసమ్ముతుదికి 'నేటాలుం' జూచె. ౧౭

* * *

౭ కొన్ని యనుభవములు

సీ. 'ఆఫ్రికా'ఖండమ్మునం దవాచీభాగ, మునఁగల నీవృత్తులను గరంబు
వెలుఁగొందు 'నేటాలు'విషయమ్మునకు రేవు, పట్టణం బగుచు 'దర్బాను' తనరు
నచ్చట మాకలం బాఁగినంతన నన్నుఁ, దోడ్కొనిపోవ 'నబ్దుల్ల' యనెడి
సెట్టి వేంచేసె నాఘట్టమ్ముఁ జేరు త, ద్దేశవాసులు భారతీయుపట్ల
ఆ. వెలువరించునట్టి చులుకనఁ జూడ నా, మది కలంగె సెట్టిమాత్ర మిట్టి
లేఁతచేఁత కెపుడొ ప్రాఁతకాఁ పాయెఁ గా, బోలు నుత్తలంబు పొందఁ డయ్యె. ౧

గీ. ఇతఁడు నన్గౌరవంబుమై నిల్లుసేర్చి, వ్రాయసమ్ములు నాయిచ్చువానిఁ జూచి
తనకు నొకపారిజాతమ్ము తమ్ముఁడంపెఁ, గొఱఁతలే దిఁక నంచుఁ గోర్కులను బెంచె.

క. ఆతనికిం జదువులలోఁ, జాతుర్యం బసద కాని సంస్తవనార్హం
బై తగులోకజ్ఞత చుఱు, కై తనరుమనీష తోడుగనట్టివి సొమ్ముల్. ౩

ఆ. ఇతని కించుకంత యింగిలీసును వచ్చు, భారతీయు లితని గారవింతు
రెన్ని మేలిగుణము లున్నను నిత్యాశం, కితులలోనఁ జేరునతఁ డితండు. ౪

ఆ. తనమతమ్ము నితఁడు తద్దయు మన్నించు, నీశ్వరప్రసక్తి నెపుడు నలచు
మాటలాడుపట్ల మహదుక్తసూక్తులు, కుప్పతిల్లునట్లు గుప్పిపైచు. ౫

ఆ. ఇతనితోడిచెల్మి హెచ్చినకొలఁది ని, స్లాముధర్మతత్త్వ చర్చసేయఁ
దగులు పెంచినాఁడఁ దన్మతజ్ఞానమ్ము, నాఁడు నాఁడు వడసినాఁడ సుంత. ౬

వ. దర్బారును చేరినరెండవనాఁడో మూఁడవనాఁ డబ్దుల్లా నన్నుచటి తీర్పునెలవునకుం గొనిపోయి తనచెలిమికాండ్రకున్ నాకు నెఱుకగూర్చి స్వకీయన్యాయవాదికుఱంగట నన్నుపవిష్టుం జేయుటయు తడవుగాఁ దగవరి నాదెసకుఁ జుఱుచుఱుం జూఁడుచూపులం బఱపి పఱపి ౭

ఆ. ముదలవెట్టెఁ దుట్టతుద కస్మదుష్ణీష, ముజ్జగిల్లఁ జేయు టుచిత మంచు
సరగ వానిపల్కు పిఱువెట్టి నేఁ బాడి, పట్టువలన వెడలఁబడినవాఁడ. ౮

ఆ. నన్ను విడువవయ్యె మిన్నులు వ్రాలిన, పుడమి నున్నఁ గాని పోరితమ్ము
తెఱుకపఱిచె మల్క యీశిరోవేష్టన, కలహమునకు మూలకారణంబు. ౯

వ. తురకలుం దురకలనడవడిం బాటించువారును వెలిగా నితర హైందవు లానాఁటి తగవుపట్టులం దలఁచీరఁ జుట్టఁజన దనుచట్టము కల-దందలి భారతీయులలో నరబ్బుల మని చెప్పుకొను తురకవణిక్కు లొకతెగవారు-పారసీకులమని వ్యవహరించుకొను, వ్రాయసమ్మునం బ్రదుకు పారసీ లింకొకశాఖవా-రరబ్బులమని చాటుకొను హిందూలేఖకులు వేఱొక్కకోవవా-రీ ముత్తెఱంగులవారికింజుట్టఱికమ్ము నడుచు - నిఁక దక్షిణాపథమువారగు నఱవలు నాంధ్రులు నౌత్తరాహులగు నానాజాతుల మతమ్ముల పేదలుం గాయకష్టమ్ముచే బ్రదుకుచు నొకపెద్దపాయగా మెలంగుదు-రాంగ్లేయులు వీరిం గూలివాండ్రని పిల్తు-రచటి భారతీయులు పెక్కండ్రు కార్మవృత్తి నుంటం జేసి యానేలంగల యెల్లభారతీయునకుం గూలి యనుపేరు మాఱ్ఱట మాట యయ్యె-నిక్కాలంబున మనబేహారులు కూలిబేహారులైరి-నాకుం గూలి బారిష్ట రనునామము చేర్పడె. ౧౦

సీ. ఇంతగ్రంథం బున్నయీనేల నాతల, కట్టు తద్దయు వెట్టపుట్టఁజేయు
టొకవింతయా యిఁక నుష్ణీషమును డించి దొరలకుళ్లా దాల్చి పరిభవమ్మ
నకు దవ్వుదవ్వుల నడయాడు టది చిక్కు, లేనికర్జంబని యేను దలఁప
వల దిట్టిమాఱుపుల్ వచ్చి పరిస్థితుల్, విషమించు నిది శిరోవేష్టనమ్మ
ఆ. పలచు భారతీయవర్గము న్వంచించు, నట్టి చెట్టచేత యగును జున్వె
మఱియు నీదుతలకు మనపాగయే నెఱా, చెలువ మిచ్చునంచు సెట్టి పలికె. ౧౧

వ. వెండియు నాంగ్లేయులతపారమ్ము దాల్చిననిన్నుఁ జిఱుదిండిపసారమ్మునం దూడిగమ్మొసలుపు కింకరుఁగాఁ దలంతురని యబ్దుల్లా హితమ్ము గఱపె-నీసూక్తులు న న్నలరించెఁ-గాని కైంకర్యముపట్ల నతండు చూపినచిన్నచూపు న్మెచ్చనైతి-నీనాఁడుం గొందఱ కిట్టిభావ ముంట విచార్యం-బది యట్లుండె-నీవేష్టనకలహమ్ము ప్రసంగినవెన్క నేను నావాదంబు న్యాయ్యంబని యచటిపత్రికలకుఁ బెక్కింటికి వ్యాసమ్ము లంపితి-నావిమర్శనము పెరిఁగిపెరిఁగి నాలుగైదునాళ్లలో న న్నాఫ్రికా కెల్ల వెల్లడిపఱిచి నాయభిప్రాయమ్ములం బొగడువారిం దెగడువారిన్ బెక్కండ్రవెలికిఁదెచ్చె-నపుడు నాకుం బత్రికలలోఁ బిలువనిపెద్ద యనుపేరు లభించె-నాఫ్రికాయం దిరవుకొన్నంతదనుక నాతలగుడ్డ మన్మస్తకంబు న్విడువదయ్యె-నంద యెప్పుడేమికతమ్మన దానిం దొలఁచితి నగ్గాథ మున్ముం దెఱుకవడు.

***

౮. ప్రిటోరియాదారిలో

మం. దర్బానులో జీవితమ్మను గడపు, భారతీయులతోడఁ బలువురతోడఁ
దనకు నెయ్యముగూరు తరుణమ్మునందుఁ, దగవు పరీక్షించుతఱి సమీపించెఁ
గామక మీర లిక్కడకు రావలయు, రానిచో మీవారి రాకేని వలతు
నని సెట్టికిఁ బ్రిటోరియా పీటినుండి, వ్రాసె నాతనిపక్షవాది యుత్తరము. ౧

క. వ్రాయస మది యబ్దుల్లా, నాయెదుటం బెట్టి నీవు నడుతువె యన నే
నీయకొని వానిలేకరి, సాయమ్మునఁ దెలిసికొంటి జగడపుమసుఁగుల్. ౨

క. మనతగవుగుట్టు పొక్కం, జనదు సుమీ శత్రులైందజాలికు లవ్వా
రు నిలుచుతావున నీకున్, మనికి వలా దంచు సెట్టి న న్నెచరించెన్. ౩

వ. అంత నే నబ్దుల్లాను గని ౪

గీ. అచట మీన్యాయవాదిప ల్కాదరించి, కాఁపుర మొనర్చెదన్ మంత్రగోపనమ్ము
సేఁతలో నన్ను సోమించుజెట్టి నేన, కాని ప్రత్యర్థిమైత్రీసుఖమ్ము వలతు. ౫

క. నాతలకు నెక్కించనిచో, నీతగ విఁక వీధివీధి కెక్కనితోఁ బ్రవల్
సూతు నెదురువా ర్కెక్కకును, లాఁతులె సన్నిహితబంధుల కదా యంటిన్. ౬

వ. ఇట్లు నాకావించిన పరిష్కృతిప్రస్తావమ్ముచే సెట్టిచిత్తంబు చివుక్కు రుమన్న ట్లూహించితి-నంత నతండు నిజము నిజ మీన్యాయస్థానపీడ వదలుటకంటె వేఱొండు భద్రం బేమికలదు-కాని ప్రతివాదికి న్మాకును నెత్తురుపా త్తున్నయది-మాతత్త్వంబులు పరస్పర జ్ఞాతమ్ములు-త్రైయబ్ హోజీఖా నంతలంతలం బాటునకు వచ్చువాఁడు కాఁడు-మన మేకొలఁది పరాకునకుం జిక్కినను వాఁడు మనకొల్లసందు లెఱింగి కొంపగూల్పం గలఁడు కాన నీ వెల్లకార్యంబునం దాగాములు పెద్దపరికించు టావశ్యకం-బనవుడు నేను ౭

క. జంకేల నీకు జలనిధు, లింకిన మనగుట్టు నొరుల కిత్తునె తగవుల్
బింకమ్ము లుడిగి నేస్తము, వంకకు రం డనుహితమ్ము వాక్రుత్తు నటన్. ౮

మం. అని పల్కి బేహారియాశీస్సు లంది, పొదలుహర్షమ్ముమెఁ బోగబండి నెక్కి
వెడలి నేటాలుప్స్పోడు మారిట్జు, బర్గుఁ జేరితి రాత్రి పదిగంటలకును
బథికుఁ డొక్కండు నాపయనించు మొదటి, తరపుఁబెట్టెయఁ జేర తన్ను వీక్షించి
భారతీయుఁడ నౌట భరియింపలేక, చిటచిటలాడి చెచ్చెర లేచిపోయి
తెచ్చినయధికారి తిలకించి నన్ను, నిలువరా దిచ్చోట నీవు పిఱింది
పెట్టెకుం జనుమని బింకానఁ బలుకఁ, దాళుమా యిందుండఁ దగినట్టిచీటి
విలిచితి నంచు నే వినిచితి న్గాని, దిగక తప్పదటంచుఁ దండిరించె వాఁడు
పెట్టె వీడనటంచు బిగిసితి న్నేను, భటుని బిల్చెదనంచుఁ బదరె నుద్యోగి
యతఁడు నెట్టినఁ బోదు నన్నాఁడ నేను. ౯

ఆ. అంతలోఁ దలాగి యరుదెంచి నన్నుఁ దా, వెలికి నీడ్చివైచి వెడలిపోయె
వెనుక కేగనంచు విక్కెడునావంకఁ, జూచిచూచిబండి సురిఁగిపోయె. ౧౦

ఆ. మాత్రిసంచితోడ మాత్రమ నే బాట,సారు లాఁగుసజ్జఁ జేరినాఁడ
సెజ్జ పెట్టె గొడుగు చిమ్మినచోటన,కలవు కోలుకానికాఁపు వడసి.

క. చలిచట్ట మందసమ్మున,గల దయ్యది నీతు పొంగుకాలం బిఁక నా
నిలిచినతా వదురిలతో,మలసినపెనుమిట్ట సమయమా నిసిగడియల్. ౧౨

క. ఓవరిలోఁ దిల్లి కలే,దీవయ్య చోకా యటన్న నేపరిభవముల్
మోవఁగవలయునో యిఁక నా,దేవుండ యెఱుంగు నాఁటి తీవ్రవ్యథలన్. ౧౩

క. కడలేని పేరివమ్మున,వడఁకుచు గది నొంటి నున్నవాఁడ నెవండో
నడిరే వచ్చి పిలువఁ జలి,తడఁబాటునఁ జేసి మూఁగతనమునఁ బడితిన్. ౧౪

వ. అయ్యవసరంబునం దేను లోలోన ౧౫

క. ఏపని కొఱ్గుదు ని త్తఱి, నాపరువు న్నిల్పుకొనఁ బెనంగుదునా ? యీ
ద్వీపమ్ముఁ దలఁగి భరత, క్ష్మాపయనము వేగవేగఁ జాగించెదనా. ౧౬

ఆ. ఈపరాభవం బదెల్లను నాకుఁ గా, దనితలంచి వచ్చినట్టికర్జ
మనువుపఱిచి సెట్టి నలరించి యవ్వలఁ, జూతునా మదీయమాతృభూమి. ౧౭

గీ. అరుగుదెంచిన చెయిదమ్ము నట్టె విడిచి, క్రిమ్మఱిల్లుట భీరులక్షణము గాదె
యిపుడు కుడిచినయవమతి యెంత ? దీని, కోహటిల్లిన నవ్విపోదో జగమ్ము. ౧౮

ఆ. తెల్ల నల్ల వన్నె తెవు లిది మగతనం, బున్న దీనిఁ జంప నుద్యమింతు
సంతసమ్ముతోడ సైరింతు నిం దెన్ని. బెట్టిదమ్ము లెసఁగి చుట్టుకొన్న. ౧౯

వ. అని తలంచుచుండ నహర్ముఖం బగుటయుఁ గల్యకరణీయమ్ములం దీర్చుకొని ధూమశకటశాఖా ప్రధానాధికారికిం దనవారు నన్నుం బఱిచిన పాట్లెల్లఁ దంతీ్ర మూలమ్మున సమగ్రమ్ముగాఁ దెలుప నతండు నాదెస న్గడచినకార్యంబు దూష్యంబు గాదనియు నాపయనమ్మునకుం దగినసౌకర్య మొదవునట్లు పరికింపుమనియు శకట విరామస్థానాధికారికిఁ దంతినంపె - నెండియు నా యీబన్నంబు నబ్దుల్లా కెఱుక పఱచుటం జేసి యతఁడు వలయు నధికృతులం జూచుటయు కాక మారిట్జుబర్గు నందును దానిచేరువను గలభారతీయవణిక్కులకుఁ దీఁగ వక్కాణంబులు నడిపి నాయోగక్షేమంబుపట్ల జాగరూకులరై యుండుఁడని వారిం గోర సస్నేహమ్ము సగౌరవమ్ము నగుభంగి నన్ను న్గదిసి ౨౦

క. తమ మున్నువడ్డ పెను బ, న్నములం బ్రకటించి నూతనమ్ములు గా వీ
క్షమ నివి యని వాచామధు, రిమమైన న్నూఱడించిరి వణిక్ప్రవరుల్. ౨౧

క. పొగబండిలోనఁ బెద్దయు, సుగమిచ్చెదు పెట్టె నరుగఁ జూచెదు మన కీ
యగచాట్లు తప్ప విచ్చటి, జగజెట్టులచేతఁ దెల్లసాములచేతన్. ౨౨

మం. అని వారలాపగ లంతయు న్నిలిచి, తమకష్టమయ ముదంతము నెల్ల వినిచి
రంతటఁ బొగబండి యరుదెంచె నిసికి, నొకబల్ల నాకునై యుండె నద్దానఁ
గ్రొత్తనెయ్యుర వీడుకోలంది శకట, మెక్కి చార్లెస్వీటి కే నేగినాఁడ. ౨౩

* * *

౯ పలు బాధలు

వ. ఆనాఁడు చార్లెస్టౌను జోహాన్సుబర్గుల నడుమ నినుపదారి లేమిం జేసి యశ్వశకటంబులు నడుచుచుండె - నందును శ్వేత నీల వర్ణ భేదమ్ములు కలవు - కానఁ

దదధికారి నన్ను శకటాంతర్భాగమ్మునం గాక దానిపురోభాగమ్ము నూరెల నొక
లప్పైఁ దనకు న్సూతునకు మాత్రమె నిర్మింపఁబడిన రెండుపీఁటలలో నొకదాన
నిల్పి తా నంతరమ్మునఁ గూర్చుండె - నిది నిందుదుండగం బనియుఁ బరాభవం
బనియు నెఱుంగుదుఁ - గాని ౧

గీ. కట్టువడి కాలమున కవజ్ఞను సహించు, టుచితమనియెంచి యందు కూర్చున్నవాఁడ
నాకు వెలిపీఁట వలదటం చాఁకవెట్టి, నన్ను విడఁద్రొక్కి శకటంబు నడుపునతఁడు.

క. విడఁద్రొక్కిన నింకొకఁ డా,ఁడివోవు న్దిన మనంతరంబున నైనన్
సడిలేనిప్రియాణం బల, వడునా యని సూతుచేరువన కూర్చుంటిన్. ౩

క. శరవేగమ్మున మావులు,పరువెత్తుచునుండె బండి 'పార్డికో' పన్
పురమునకు వచ్చె నపు డొక, దొరకుం బాఁగచుట్టఁ డ్రైవుతోఁ వొందర వాఁడమెన్.౪

క. నాపీఠ మాక్రమించిన, నాపనికి న్వాలుబొసఁగు నని చల్లనిగా
డ్పాపోవం బీల్చి తనూ, తాప మడఁపవచ్చు నని యతండు దలంచెన్. ౫

వ. కావుటంజేసి శకటస్వామియగు నాతెల్ల వాఁడు నాపజ్జకు వచ్చి సారథి యొసంగిన
యొకకసుమాలపుం బట్టాను దనకాలిదిగువఁ బడవైచి నన్నందుఁ గూర్చుండఁ
గోరుఁడు నే నప్పరీభావంబు నోర్వలేక వెఱచుచు వెఱచుచు వానిం గని ౬

సీ. ఇది యేమి నను మొట్టమొదట లోపల నుండ, నీయ కిచ్చోటికిఁ ద్రోయఁ దప్ప
రాభూతి నెట్టెటులో భరించితి నది, యట్టుండ వెండియుఁ జుట్టఁగాల్పఁ
దలఁచి నీ చరణమ్ముదాపునఁ గూర్చుంట, వలతు వం దెవ్వాఁడు నిలుచు నీకు
నాపీఁట వలయుచో నీపీఁట కేఁ బోదు, ననునంత నతఁడు కట్టల్క బుర్రింగి

గీ. వడివడి న్నాదుచెంపలు వాఁపఁగొట్టి, పచ్చిబూతులు గూసి నన్ బండినుండి
క్రిందికిం ద్రొబ్బఁ జువ్వ లంకించుకొంటి, ముడుసులు తొలంగినం బట్టువిడున కుంటి.

క. పెనుబల్మి వెలయు నాతఁడు, నను నేలకునెట్టఁ గుడిచె నానావస్థల్
తనపట్టు నేను వదలక, పెనఁగితి నథ్వగులగుండె బిరబిరఁ గరఁగన్. ౭

క. వా రతనిఁ గాంచి కటకట, ఘోరంబగు నిట్టిచేఁతకుం జొత్తువె యే
నేరం బొనర్చె నితఁ డధి, కారము నీరీతిఁ జెఱుపఁగాఁ దగ వగునే. ౯

క. అతఁ డాడినవాక్యమ్ములు, శతధా సూనృతము లార్యజనతా సమ్మా
నితములు హితములు మాసం, గతి కనుపుము వాని దుండగం బది యేలా. ౧౦

క. అని రోయు మించిపోలే, దని అంకియవైచెఁ గాని యాతఁడు లజ్జా
వనరాశి మున్గి యవ్వల, నను మోఁదుట నుజ్జగించి నాచేఁ ద్రొఱఁగెన్. ౧౧

ఆ. కొసరుతిట్లు నాల్గు విసరి తురంగము, చోదకునకు గోనె చూపి వాని
నిలుచుపీఠ మెక్కి నిట్టూర్పు లూర్చుచు, ధూమపానమునకుఁ దొడఁగె నతఁడు.

ఆ. ఈల మొరసె నంతఁ గోలాహల మడంగె, బండికదలెఁ గాని భయము నన్నుఁ
దలఁగ నొల్లదాయె దయసేయు వీని ర, క్షింపు మని హరిఁ భజించుచుంటి. ౧౩

గీ. ఎడనెడ న్విస్ఫులింగంబు లడరుకంట, వాఁడు ననుఁజూచిచూచి యావచ్చువీట
దిగినపిమ్మట నీపాట్లు దేవుఁ డెఱుఁగు, రమ్మురమ్మని పెద్దయార్వం దొడంగె. ౧౪

క. అతఁ డెంతయొజ్జవాఁడైనఁ, బ్రతిభాషణ మీక యేమిపాపం బిది నా
బ్రతుకునకు న్నిండినదో, శతాబ్దపరిమాణ మన్నశంకం బడితిన్. ౧౫

వ. ఇ ట్లెఱసంజ విరియువేళకు స్టాండర్డన్‌లోఁ గాలుమోపి యందు హిందూసోదరు
లం గొందఱఁ బొడఁగనినంతన ప్రాణమ్ములు లేచివచ్చి యేను దేఱుకొనుచుండ
వైళంబ వారు న న్నంటసిల్లి ప్రసాదమ్మృదూక్ప్రత విలోకనమ్ముం బఱపి పయ
నంబు సుఖదంబుగాఁ జాగెనో టు-నీమే లారయుచుంటి మే మేతెంచినవార-
మబ్దుల్లా నీరాక మాకెఱుకసేయుచుఁ దంతీవార్త నంపినవాఁడు-రమ్ము
రమ్మని న న్నెంతేయు నలరించి యిసాహాజీసెట్టి మళిగకుం గొంపోయి నాపడిన
పాట్లెల్ల నూఁకొని పెల్లుదురపిల్లి మున్ను తా మనుభవించినయంగద లనేకంబులు
వినిచి న న్నూఱడిల్లఁజేసి-రంత సర్వశకటవ్యాపారసంఘప్రతినిధికిం గడచినదుండ
గం బెల్ల వెల్లడించుచు నొక్క-దీర్ఘలేఖ వ్రాయ వాఁడు మీ రెల్లి పయనించుతఱి
నెల్లరతోపాటు శకటాంతరాళంబునం దధివసింపవచ్చు-మిమ్ముఁ గాఱియపెట్టి
నతండు రేపురాఁ-డని ప్రత్యుత్తరం బంప నాయుల్లంబు కొండొకశాంతి ననుభ
వించె-నన్నట్లు బాధించిపరాభవించినయాతెల్లవానిపై నభియోగమ్ము దేరఁ దలంపు
వొడమమిం జేసి యాగ్రంథ మానాఁటితోడన తీఱుగడకు వచ్చె - నమ్మఱుస
నాఁడు నిరుపదిపమ్ముగాజోహాన్సుబర్గున దిగితి-నుదారుండగు నబ్దుల్లాసెట్టి పంపిన
తెఁగవకాఁ-ణంబుకలిస నచటి భారతీయవర్తకప్రముఖుఁడగు కమరుద్దీను తనసేవ
కుని నాకొఱ కంపెఁ- గానివాఁడు నన్నుఁ దెలిసికొనం జాలమి నే నొక్క-పూఁట
కూటింటికిం జని బస నర్థించుడుం దదధికారి నన్నాపాదశీర్షమ్ము పరికించి యాద
రంబు వెల్లివిరియ గదులు నిష్పాంధమ్ములు లే వనిపల్కె- నమస్కరించి కృత
గమనుం డయ్యె - నవ్వేల నాఁకట నున్న విలాసమ్ము నూఁతఁగాఁ గొని కమరుద్దీను
విపణికిం జని యందు నారాకఁబ్రతీక్షించు నబ్దుల్‌గనీసెట్టిం గనుడు ౧౬

క. అతివేలం బగు మన్నన, నతండు నన్గౌరవించె నబ్బసగాథన్
శ్రుతి వైచినంతఁ బరమా, ద్భుతమ్ము నానిష్కరించి బోరన నవ్వెన్. ౧౭

మం. మఱియు న న్నిలకించి మనకు నిందున్న, యన్నవిక్రియశాలలందుఁ జోటుండు
నని యెట్టు లూహించితయ్య సోదరుఁడ, యెఱుఁగ విమ్మహిలోని యిబ్బంది లేవు

ధనసంచయముమీఁది తగులమ్ముచేత, భరియింతు మే మెన్ని బన్నంబు లైన
యుష్మాదృశులు నిల్చు నుర్విఁగా దిచటు, నేటాలుసీమ నుండెడిబాధ లిట్టి
వల ట్రాన్సువాల్ పీడ లవి దుస్సహములు, బాపురే కడగండ్లపా లౌదువే మొ. ౧౮

వ. తేపు నీవు ప్రిటోరియాకేగు పొగబండిలో మూఁడవతరగతిపెట్టె నెక్కి చనుట తప్పదు-ప్రథమద్వితీయశ్రేణులు భారతీయులకు దురారోహమ్ము-లనవుడు నాకు నుత్తమశ్రేణియందె పయనించుతలంపు గల-దయ్యది దురాసదమ్మైన నశ్వశకటంబు నేర్పఱుచుకొందు-నవ్వీడు పదునెన్మిదిపరుగుల దవ్వునందె కలదు గదాయని నే యాకేయిగడపి మఱునాఁటి రేపాడి పటాటోపమ్ముమై దొరంబోలి ధూమశకట విరామస్థానమ్మునకుం జని తదధికారిం గని ప్రిటోరియాకుం దొలిపంక్తిచీటినిమ్మని వినయమ్మునం గోర ౧౯

గీ. అతఁడు మద్వాంఛపట్లఁ గట్టాదరంబు, మెఱసి శకటాధికారి ని న్నుఱనినాఁడు
వీధికిఁ దృతీయకు స్నీవు వెడలుదేని, నిపుడ నెఱవేర్తు భవదీయ మీాప్సితంబు. ౨౦

గీ. నిన్ను సౌజన్యరాశిఁగా నిశ్చయింతు, నభిలషించెద యుష్మత్ప్రయాణసుఖము
చిక్కుదాసిన మమురచ్చకెక్కఁజేయ, కనుచు నాకోర్కి దీర్చె సాధ్వగ్రియాయి.

ఆ. ఏటికోళ్లతోడఁ జీటి గ్రహించి మీా, పలుకు పసుపువోలెఁ దలఁతు నంటి
న విశేషమెల్ల నబ్దుల్ గనీ సూచి, ముక్కుమీాఁద వ్రేలు మోపుకొనియె. ౨౨

గీ. కదలెఁ బొగబండి ఘట్టముల్ గడచుచుండెఁ, జీట్లుపరికించువాఁడు న న్జేరవచ్చెఁ
బోదము మూఁడగుపంక్తికిం బొద మటంచు, విరిసినల్కను జుట్టనవ్రేలు సూపె.

క. పదపడి నాచీటిం గను, మిదిగో యని తా వచింప నెదియుండిన నే
మెదురాడక యచ్చోటికిం, బదపదమని వాఁడు మండిపడ్డాఁ డయ్యెన్. ౨౩

గీ. శ్వేతముఖుఁ డొక్కరుండు నాచెంత వచ్చు, నాతఁ డవ్వానిమాటకు నడ్డుదగిలి
యేల యీసాధుతామూర్తి నేఁతు వితని, చెంతఁ గలదుగదా మేలిబంతిచీటి. ౨౪

క. ఏచింతయు లే దీ విమ, లాచారునితోడిపోవు టబ్బిననాకున్
నీచేష్టిత మిది విడువం, జూచుట తగునంచు వానిచుఱు కడఁగించెన్. ౨౬

క. ఆసుకృతి నన్నుఁగని నీ, కేసందియమేని వలవ దియ్యాసనముం
బాసి చనఁబోకు నీసహ, వాసమ్మున కేను బెద్దవలచెద ననియెన్.

వ. అంత నయ్యుద్యోగి ఫుల్లగిల్లినమొగమ్ముతో నీతెల్లవానింగని బానిసీనితోఁ బోక నీకభిమతంబయేని నాపెద్ద లేమిచెఱపోయి రని సణుగుకొంచేగ - నంత మాశకటంబు రేమోగిరమ్ము వేళకుం బ్రిటోరియాపురప్రవేశ మొనర్చె. ౨౮

***

౧౦ ప్రిటోరియాలో మొదటినాఁడు

క. అచ్చట శకటంబును డిగి, యెచ్చటికిం బోదు నెవని నేమడిగిన నే
యొచ్చోం బోదవునో యనుభయ, మెచ్చన్ నిలుచుంటిఁ బథికు లేగెడుదనుకన్. ౧

క. నావెఱ్ఱిచూపు లొక నీ ,గ్రోవాఁ డవగతమొనర్చుకొని నన్నని మీ
రీవీటికిఁ గ్రొత్తలుగా, భావించెద నిందు మీకు బంధులు గలరా? ౨

క. లేరని యూహించెద నా, తోరం డొకవసతిఁ జూపుదు నటం చనుకం
పారాశి యగుచుఁ బల్కెడు, బోరనఁ గేల్మోడ్చి వానిపోయెదు వెంటన్. ౩

సీ. నడ తెంచునన్ను జాన్స్టనుపాలితం బైన, యన్నవిక్రయశాల కతఁడు చేర్చి
నా యుదంతము సెప్పఁగా యజమానుండు, ననుఁ బేర్మిమైఁ జూచి నల్ల తెల్ల
వింగడంబులు నే నెఱుంగన కాని మా, బస కేగుదెంచెడిబాటసారు
లెల్లరు నాంగ్లేయులే యాట నిను వారి, పజ్జనిల్పినఁ బరాభవము సేఁత
గీ. గాఁ దలంచెదరో లేచిపోదురో వ్య, థాకలఁత లేల భోజ్యమ్ము నీకు నీదు
సజ్జ వడ్డింతు దీనికి సమ్మతింతు, వె ట్లనం దలయూఁచియే నట్లయంటి. ౪

క. అవ్వల నోవరికిం జని, బువ్వకు నెదురెదురుసూచు ప్రొద్దున జాన్స్టన్
నవ్వుచు నన్గని వారికి, నివ్వెఱమి యింపదయ్యె నేతెమ్మనియెన్. ౫

గీ. ఆతనికి ధన్యవాదమ్ము లప్పగించి, యతిథిబృందమ్ముతో నన్న మారగించి
యంద శయనించి వేఁబోకయగుడు లేచి,యడుగుసాగించినాఁడగమ్యంబుఁ దెఱియ.

ఆ. నడిచి నడిచి కదిసినాఁడ మాజగడమ్ము, నడుపుచున్న మేటిన్యాయవాది
నతఁడు బేకరాఖ్య నలరారు సౌజన్య, ఘనుఁడు ధీమదగ్రగణ్యుఁ డగుచు. ౬

సీ. ఉచితమర్యాద నభ్యర్థితుండై నాదు, చేయంటి పీఠికాసీనుఁ జేసి
కుశలానుయోగము ల్గురిసి బంధువునట్లు, బేకరు నన్ను సంప్రీతుఁ జల్పి
నాకథసర్వంబు నాకర్ణనమొనర్చి, కలహస్వరూపంబు దెలిపి నీకుఁ
బాడిపట్టున కేగుపనిలేద మెలిక లె, న్నే నున్న తగవిది గాన సెట్టి
గీ. తీర్పవలసిన పెక్కుసందియము లిందుఁ, గలిగెడిం జువ్వె వానికై వలయుకమ్మ
లెదురుకమ్మలు వ్రాయుట కీవు పూని, తోడ్పడితి వేని యిదిమాకు దొడ్డమేలు. ౭

వ. అయ్యది యట్లుండె — నీరాక ప్రసంగినవెన్క రోయవచ్చు నను నూహమ్మునం
జేసి యే నింతవట్టు నీకుం దగునెలవు గాలింపనైతి — నిజ్జనపదమ్మున రంగుతెగులు
బెడిదమ్ముగాఁ బ్రాంపిరివోవుచుంట నీ వెఱింగియ యుందు — కాన నినుబోఁటి కిం

దనాయాసమ్ముగా వసతి సమకూరనేర-దైన నివ్వీట రొట్టెబేహారమ్మునం బొట్ట
పోసికొను దరిద్రి యొక్కొ-ర్తుక కల-దాయమ్మ నీకు బసనిచ్చునని తలంతు-
నాపెయింటి కేగుదము ర-మ్మని నన్నచటికిం దోడ్కొ-నిచని నాకువలయు వంట
కమ్ము నొసంగున ట్లామె నీకొల్పె-నతండు న్యాయవాదియ కాక పీనుమిగిలిన
మతప్రచారకుండునై వెలయు. ౯

క. ఈనాఁ డతండు న్యాయ, స్థానవ్యాపృతిఁ దొఱంగి సంతతదీక్షా
ధీనతమై నప్పుడమిం, బూనెం గ్రైస్తవమతప్రబోద్ధృత్వవిధిన్. ౧౦

క. భోగత్యాగక్షమ మగు, శ్రీగల దాతనికి దీనచింతామణియై
సాగించు న్మనుగడ నతఁ, డీగడెకు న్నడుచు మాకు నిటునటుఁ గమ్మల్. ౧౧

క. స్వకమత పారమ్యమ్మును, బ్రకటించు నతండు పంపు ప్రతిలేఖమునన్
మకరంద మధుర వాచా, నికరాధీనమ్ము హేతునిచయం బలరన్. ౧౨

క. భగవత్ప్రియనందనుఁ గా, జగదుద్ధరణక్రియా విశారదుఁ గా న
మ్మిగ నిల్పి యెతఁడు క్రీస్తుం, బొగడ్తగావించు నతఁడపో ముక్తుఁ డనున్. ౧౩

వ. మా పరిచితిప్రారంభమ్మునంద మతమ్ముదెస నీతలంపేమని బేకరు నన్నడుగుడు
జననముంబట్టి హిందువంగాని తన్మతపరిజ్ఞానమ్ము నాకడసున్న-పరధర్మవేత్తృత్వ
మన్న నదియుఁ గడుంగడు నిప్పచ్చరంబు-నా కెందు నమ్మికగలదో వాక్రువ్వ
నయితి గాదు-నామతమ్ము న్గుఱిచి పలయు గ్రంథమ్ములు చదువం దలఁచితి-నవ్వాల
నించించుక లాఁతిమతమ్ములం బరికింతు-నని యేను విన్నవింప నతండు నాపల్కు-ల
కలరి నాయెడం బ్రసాదమేదురమ్మగు చూడ్కి-నిగిడించి ౧౪

క. ఇచటం గ్రైస్తవధర్మ, ప్రచారకసమాజ మొందు భాసిలు నేత
న్నిచయంబున ముఖ్యుఁడనై, పచరించెద నేను దత్త్వపరతంత్రమతిన్. ౧౫

గీ. ప్రార్థనాగార మొక్కఁ డీపట్టనమ్ము, నందు నెలకొల్పి నేమమ్ము ననుసరించి
దానఁ గావించుచుందు మతప్రసంగ, మించుకయు వర్ణవైషమ్య మెఱుఁగ నేను.

క. ననుబోఁటి మతవ్యాపృతు, లనేకు లిందున్నవార లన్వహము జగ
జ్జనయిత్రారాధనమున, కెనిసెద మమ్మందిరమున నెల్లర మర్థిన్. ౧౭

క. నీ వచ్చటి కేతెంచిన, వావిరిగా సంతసింతు వారికి నీకున్
గావించెదఁ బరిచితి సం, భావింతురు వారు నిన్నుఁ బ్రమదస్ఫూర్తిన్. ౧౮

క. హిత మెంచి నీకొసంగెదఁ, గతిపయ మతపుస్తకప్రకాండము లందున్
నుతిగన్నది బైబిలు సు, మ్మతిరక్తిం దానిఁ జదువ నర్థింతు నినున్. ౧౯

వ. ఇట్లనుటయు నేనతనికి న్గిడిగిళ్ళువెట్టి తప్పక మీయుపాస్తి కేతెంతు – భాగవత సందర్శనమ్ము వాంఛనీయమ్ముగదా – యని విన్నవించుడు నతం డుబ్బి యెల్లి నీ రాకకు నిరీక్షింతు – నొంటిగంటవేళ కిటకు వత్తువే నిర్వారముంగూడి వేఁడుకోలున కేగుదము – నావుడు వల్లె యని వానివీడుకోలు వడసి బసకేగి యప్పేదరా లొసంగినయూకుబువ్వం దనివోవ నారగించితి – నాపె సాధుశీలయగుట నే నచిర కాలమ్మునంద తదీయాదరమ్మునకుఁ బాత్రుండనైతి – నట్లు మెసవినపదంపడి ౨౦

క. పయనించితి నబ్బుల్లా, ప్రియమిత్రము నొకనిఁ జూడఁ బెద్దయు వేడ్కన్
దయమై నతఁడు సదాభవ, దయమ్ము నర్థింతు నోడ కని మన్నించెన్. ౨౧

మం, అంతట నేత్రుఁ బ్రొద్దగుడు నిల్ సేరి, సాపాటొనర్చి సజ్జను సెజ్జ నెక్కి –
బేకరు నన్నిట్లు ప్రేమించు కేల, యితనిమిత్రులచెల్మి నెఱుక యెం తబ్బు
నేపాటి తెలియుదు నేసుమార్గంబు, మఱియు హిందూధర్మమర్మముల్ దెలుపు
గ్రంథమ్ము లెట్లు నా కైవసం బగును, నామతం బెఱుఁగనినాఁ డన్యమతము
బాగోగు లెబ్భంగిఁ బరికింపనేర్తు, నని తలంచుచు నిద్ర కగ్గపడ్డాఁడ. ౨౨

* * *

౧౧ క్రైస్తవ పరిచితి

వ. అంత నమ్మఱుదినమ్మున బేకరు వెంట వేఁడుకోలున కేగి ప్రార్థనామందిరమ్మునఁ గోట్లు మున్నగు పురుషులతోడను ఘోరిస్ లోనగు మగువలతోడను బరిచితి నార్జించి వారితోపాటు నేనును మోఁకరిల్లి జగదీశ్వరుం గొసరితి – వారు ప్రసన్నులై ౧

క. మాకుం జూపినమార్గము, మా కొసఁగినశాంతి నేఁటి మానెయ్యరికిం
జేకూర్పవే ప్రభూ! కరు, ణాకర! లోకైకనాథ! యార్తశరణ్యా! ౨

సీ. అని యేసునాథుని గొనియాడి రం దనా, ఖిలచిత్తవృత్తిమై వెలయుకోట్సు
నాడెందమును జూఱలాడె మా కల్లల్ల, గాటంపునేస్తమ్ము నాటుకొనియె
నతనితో దారసి వాహ్యాళిసాగించితి, నతఁ డిచ్చు ప్రస్తమ్ము లాదరమునఁ
జదివితి నవి యేసు జగదీశు నద్వైతి, యావతారం బని, దేవునకును
గీ. మనుజునకు సంధిసంధాత యని వచించు, శేలోకో నామనమ్మున కింపదయ్యె
నన్ను నమ్మింపఁ గోట్సు నానావిధాల, యత్నముం జల్పె నిర్వేల మైనకూర్మి. ౩

క. నామెడ వ్రేలెడు తులసీ, దామం బొకనాఁడు సూచి తా వగచి బలా!
ధీమంతుఁడ వీ వేటికిఁ, బ్రేమించెద విట్టి యంధవిశ్వాసములన్. ౪

క. నినుబోఁటి కిట్టివేదుఖు, చనునా యిటురమ్ము రమ్ము సరమును దలఁగిం
తు నటంచుఁ దెగడ నిది మ, జ్జనని యొసంగిన మహాప్రసాదం బనితిఁ. ౫

వ. అంత నతం డిది రక్షకంబను విశ్వాసమ్ము నీకుఁ గలదా — దీని మహిమం బేమి —
యని పృచ్ఛసేయుడు ౬

గీ. ఏతదీయప్రభావ మే నెఱుఁగకున్న, నస్మదభ్యుదయావాప్తి నభిలషించి
నిర్మలప్రేమమైఁ దల్లి నిలుపుసోఁగుఁ, దొఱఁగఁజాలను దగినహేతువులు లేక. ౭

ఆ. తనకుఁ దాన త్రెస్సి తావళమిది నాదు, నురముపొత్తునలన నుడుగునాఁడు
వెండి తులసిదండ విలుచుట కే నొల్లఁ, గాని దీని నేఁ డగౌరవింప. ౮

క. అని నాపల్కినపల్కులఁ, దనివోక యతండు సంతతము ననుఁ దెలుపం
బని పూని యేసుధర్మమె, యనవద్యము సేవనీయ మనిబోధించెన్. ౯

వ. మఱియు నతండితరధర్మమ్ములం దించుకనిక్కమున్నను గ్రీస్తుమతమునందె సమగ్ర సత్యమ్ము వెలయుననియు — దాని నవలంబింపనినాఁడు నిర్వాణంబు శశవిషాణం బనియు వేల్పుమానుసులనడుమ నేసునాథునిబోసట లేకున్న దురితనిబర్హణంబు సుసాధము గాదనియు సుకృతకర్మాచరణ బుచే నావంతయు లగ్గునొడమ దనియు వాదాడి నన్ను నమ్మింప సర్వథా శ్రమంపడుచుండె — నతని వలన నాకుం బరిచితు లైన క్రీస్తుమతానుయాయులలో నొకండు నన్నుఁగని మనము పాపులము — దురి తమ్ముసేఁత మన కనివార్యంబు — దుర్భరంబగు దాని వ్రేఁగునెల్ల నఘవిదూరుండు నీశ్వరపుత్రుండు నగు నేసుపైఁ బెట్టవలయు — నతఁడ మోక్షదాతయని విశ్వసింప వలయుఁ — దన్ను నమ్మినవారు వీతకిల్బిషు లగుదురని యే సభయం బొసంగె — వాని యౌదార్యమున కిది మూదల — వాఁడ శరణ్యుఁ డనుప్రత్యయ మ్మెవనికిఁ గలదతండ సమగ్రశాంతి కధికారియగుఁ — బాపంబునకు వెనువెంటన పాచితంబు వలయు నని నీవందు — విశ్లైన జీవితమంతయుఁ బ్రాయశ్చిత్తవిధులతోఁ జెల్లుఁ — దెగుదలలేని యీకర్మపుంజమ్ముకతన నినుబోఁటికి శాంతిసమకూడునా — మఱి నిశ్శ్రేయసమబ్బునా — యని పల్కుడు నతనిధోరణి నాకు రుచింపమింజేసి వాసిం బొడఁగని ౧౦

ఆ. ఏసుమతముఁ గొల్చునెల్లరు నీపల్కు, లనువదించువార లగుదురేని
యేను దన్మతంబు నించుకయును విశ్వ, సింపఁ జాల గౌరవింపఁ జాల. ౧౧

క. కలుషాపాదకవృత్తిని, దలఁగన్ జతనం బొనర్చెదను గాని యఘం
బులు సల్పి తత్ఫలంబులు, వలదని పరమేశ్వర స్తవం బొనరింపన్. ౧౨

క. పాపమ్మువలన సంహారో, వ్యాపారమువలనఁ బాయునంత కశాంతిన్
దాఁపితుఁడవైనె యలందురు, శే పెద్దయు వలతు నంటి నెంతయు నోర్మిన్. ౧౩

సీ. అనవుడు నతఁడు నిరర్థకాలాపమ్ము, లుడిగి నాపల్కినసుడుల నెల్ల
వారక తలపోయవలయు నటంచు నె, చ్చరికించెఁ; గటకటా జంకు లేక
యేనస్సు లొనరించు నితఁ డిట్టి క్రైస్తవు, లెందఱో లేరు కో ల్పెల్ల యెడల
వృజినమ్ము సేఁతకు వెఱచుఁ గ్రపఫుముక్క–, వోనిద్దై హృదయమ్ము పీని దలరు
గీ. నితఁడు సాదనచే నుల్ల మతిపవిత్ర, మగుననుచు విశ్వసించు;నాయాశయమ్ము లెవని
దుర్వాదమునబల్మి నెట్టి వెఱ్ఱి, తలలువైచునో యసి తద్ద తల్లడిల్లు. ౧౪

వ. ఏ నతని వెనుఁబొటు నెఱింగి నెయ్యురీ! పిడివాదమ్ము లొనర్చి మీవా రెవ్వ
రెట్టి పెడదారులు చూపినను మీమతమ్మునెడ నా కలుక వొడమనేరదు –నాపల్కు
విశ్వసింపు–మని వానిం దేర్చితిఁ–గాని బైబిలుతత్త్వమ్ము దెస నా కింకను గట్టి
నమ్మిక నిలువదయ్యె. ౧౫

* * *

౧౨ భారతీయపరిచితి

మం. నాఁడు ప్రిటోరియానగరమం దున్న, భారతీయులతోడిపరిచితి వలచి
సభవేర సమధికోత్సాహమ్ము వెలయ, నెల్లర నొక సెట్టియింటికిఁ జేర్చి
యామాటలీమాటలై నతర్వాత, నొసఁగితి వారికై యుపదేశ మొండు. ౧

వ. నామనుగడయందదియ మొదటియుపన్యాస మగుట దానికి వలయుపూర్వరంగ
మ్మున కెంతేనిశ్రమించితి–నందు వక్తవ్యము సూనృతవ్రతం బాయె–బేహారి సత్య
మ్మునసాగించుట దుశ్శక మనియు వణిజ్యాసూనృతంబు లితరేతరవిరుద్ధంబు
లనియుఁగొంద ఱాపణికులు నాకుం బలికి–రమ్మాటలదెస నాకు నాఁడును నేఁడును
విస్రంభ మొదవదాయె–నాప్రసంగమ్మున దీని మివులఁ జర్చించి

క. సూనృతము బేరమునకుం, బ్రాణము వాణిజ్యమాఁది బ్రిదికెడితగులం
బేనరునకుఁ గల దాతఁడు, పూనికమై సత్యసేవ పొనరుపవలయున్. ౩

క. పరభూముల వర్తించెడి, తగుణంబున సత్యనిష్ఠ తద్దయు వలయున్
బెఱలు మిముఁజూచి భారత, నరశీలవినిశ్చయం బొనర్తురు గానన్. ౪

ఆ. అని హితమ్ముగఁ బలికి వైకమత్యమ్మున, మేలు వెలువరించి మీకు సంఘ
మొకఁడు వలయునంటి నుద్యోగులకుమిమ్ముఁ, గలఁచు వెతలఁ దెలుపవలయునంటి. ౫

క. మీసమితి కేనువిత్తము, నాసింపక సాధనీయ మగునూడిగముం
జేసెద నంటిని మదుప, న్యాసం బది నిలువరించె నయ్యోలగమున్. ౬

క. చాగెం జర్చలు సభ్యులు, మాగొడవల్ వినుఁ డటంచు మన్నించిరి న;
న్నాఁగంగవలయు నీదు, ర్యోగంబుల నన్నకోర్కె యొదవె న్దనకున్. ౭

ఆ. ఇంగిలీసుప ల్కెఱింగినవారల, మ్మనుజులందుఁ బెక్కుమంది లేమి
నీడుముదిరియున్న నోడక మీ రాంగ్ల, వాణి నభ్యసింపవలయు నంటి. ౮

క. లాఁతివిలాఁతుల నున్నపు, డేతద్భాషానుభూతి యెంతయు వలయున్
బ్రీతిం గఱపెద నప్పలు, కే తేరుఁడు నావసించునిరవున కంటిన్. ౯

క. ఒకమంగలి యొకలేకరి, యొక యన్నువబేరగాఁడు నుత్సాహంబుం
బ్రకటించిరి శిష్యత కి, య్యకొంటి సమ్మదము గదుర నాచార్యకమున్. ౧౦

వ. వారికి నెసలిక లేమింజేసి యేన వారిమనికిపట్టుల కేగుట వలసె – నాయంతేవాసు
లెంతపరాకువడినం గినియక యెబ్బెఱికము సెందక నావిధిం బాటించితి – బోధన
కౌశలంబు నాపాలి దనుట యతిశయోక్తి కాదుగదా – యేడెన్మిదినెలలకు వా
రాంగ్లమ్ము నేర్చి తద్భాషాబలంబునఁ దమబేరసారమ్ముల నిరాతంకముగా నడిపి
విత్తముం బురాధికమ్ము గడింపఁజాలి–రిప్పరిణామంబు నన్నుం బరితుష్టుఁ గావించె–
నిది సభలవలనిమేలగుట నవి నియమపూర్వకమ్ముగాఁ బ్రతిమాసమ్మున జరుపం
బడుచుండె. ౧౧

క. ఏతాదృశీ సమజ్యలు, హేతువులై భారతీయు లెల్లరతో సం
గాతమ్ము పొసఁగె నా కపు, డాతురతయుఁ బొడమె వారియంగిద లడఁపన్. ౧౨

వ. కావుటంజేసి ప్రిటోరియానగరమ్మునం దున్న యాంగ్లప్రభుత్వ ప్రతినిధితోడి
పరిచితి నభిలషించితి–నతనికి భారతీయులపట్ల నాదరమ్ము కలదు–కాని వానిమాట
కచ్చోటఁ దగినవిలువ లేకుండె–నతండు వలయుతఱి నీకుఁ దోడ్పడుదు నని స
న్నాశ్వసించి భారతీయులకుం జెందిన కొన్ని రాజకీయపత్రమ్ములు నా కొసంగె–
వానిం జదివినపదంపడి ట్రాన్సువాల్ ఫ్రీస్టేటులం దున్న హైందవుల దుర్భరజీవన
మెల్లఁ దెల్లమయ్యె–నవ్వాల భారతీయులకుఁ బోగబండిలో వలయుసౌకర్యముల
న్గుఱిచి తదధికారులతోఁ గొంతగ్రంథమ్ము జరిపితిఁ – గాని దానిఫలిత మసంతృప్తి
దాయకంబ యయ్యె–నాయభియోగము నుమ్మగించుకొని యేఁడాదిలోపల నిలుసేర
నెంచిన నాపట్ల నీశ్వరేచ్ఛ వేఱగుటంజేసి నాకర్తవ్యమ్ము లిట్లు పొంపిరివోవఁ
దొడంగె. ౧౩

* * *

౧౩ కూలితనము

మం. ట్రాన్సువాల్ ఫ్రీస్టేటు రాష్ట్రమ్ములందు బ్రదుకు నీడ్చుచున్న భారతప్రజల
దురవస్థలెల్ల నిందు వచింపఁజాల, నెఱుఁగ నెంచినవార లేఁబల్కినట్టి
యాఫ్రికాసత్యాగ్రహచరిత్రఁ గాంద్రు, ఫ్రీస్టేటువారు నిర్మించినచట్ట
మడఁగించె భారతీయప్రజాస్వేచ్ఛ, నాశమ్మొనర్చె హైన్దవగౌరవమ్ము
బానిసతనమునై బ్రదుకుట తక్క, భారతీయున కొండుపని చెల్ల దిచటఁ
బాలకు లోకకట్టుపాటు గావించి, పాతిక పరకగాఁ బ్రతిఫలం బొసఁగి
తత్తిమిపైచిరి భారతవణిక్కు నకట, యిఁకఁ ట్రాన్సువాల్ రాష్ట్రమేలెడువారి
పను పది సభ్యప్రపంచగర్హ్యమ్ము, తద్దేశమందుఁ బాదమ్మును మోపు
భారతీయుం డైదుపదులరూప్యమ్ము, లరివెట్టవలయు గేహమ్ము క్షేత్రమ్ము
నార్జింపఁజన దిష్టమగుచోట నీతఁ, డెన్నికలందు లే దితనికిం జనవు
పదుగురు పయనించుపద్యలో నడుచు, నధికారమును వీని కందనివరమ
కటకటా! తొలుజాము కడచన్న వెన్క, నిలువీడి పోవరా దితఁడు రేపొద్దు
పోకతప్పనికష్టి పొసఁగినవేళ, నధికారు లియ్యకో లార్జింపవలయు
నిట్టిపోరాముల కిల్లైనచోట, గుణరత్నరాశితోఁ గోట్సుతో బెరసి
నిశలందు వాహ్యాళి నెఱపియే నున్కి, పట్టుఁ జేరుచునుందుఁ బదిగంటలపుడు
రారానివేళ నారాక నీక్షించి, రక్షకభటుఁడు నన్ బట్టుపాల్సేయ
మద్గౌరవంబు నెమ్మయిఁ గాచుకొందు, దైవమా యని యేను దల్లడంపడితి
నాకంటె నీచింత నలఁగెను నెయ్యుఁ, డతఁడు నన్ బంటుగా నంగీకరించి
తనచెంత నడియరితనమునై బ్రదుకు, నీగ్రో కొసంగెడునెఱి నూఁది నాకుఁ
జీటి నిచ్చెనయేని చిక్కురాకుండుఁ, గోట్సు దీనికి నొప్పుకో లెట్లుసూపు
నిట్టి తెక్కలిచేఁత కే నెట్లుసైతు. ౧

వ. కావుటం జేసి తగినయనుమతిపత్రమ్ము వడయఁ గోట్సు వెంట దొరతనమ్మువారి
న్యాయవాదియగు క్రౌజునొద్దకుం జేరుడు నయ్యధికారి

సీ. అలనాఁడు నాసహాధ్యాయుఁడై సీమలో, న్యాయశాస్త్రాభ్యసనం బొనర్చి
నతఁ డయ్యెఁ; నొఱగడ్డ మాలించి మామకం, బచ్చెరుపడె లెస్స నొచ్చుకొనియెఁ
జీటి నీనొల్లక చేయుత్తరం బిచ్చె, నిచ్చవచ్చినవేళ నేగు మనుచు
నెయ్యమ్ము తియ్యమ్ము నింపి విందొనరించె, నవుడప్డు కలసికొ మ్మనుచుఁ గొసరె

ఆ. రేవగళ్లు రక్ష రేకువిధమ్మున, నెంచి దాఁచుకొంటి నితని కమ్మ
దాని వెలువరింపఁ దగినంత దురవస్థ, కలుగదయ్యె దైవఘటనఁ జేసి. 3

గీ. నాకుఁ గడుఁ గూర్చునెయ్యుఁడై నాఁడు క్రౌజు; పరిచితియు నబ్బె వీని సోదరునితోడ
నది మదీయప్రజాసేవ నావసరము, నందుఁ గొండాడఁదగిన సాయం బొనర్చె. ౪

వ. అయ్యది యట్లుండె—నీరాష్ట్రంబున నల్లజాతులవారి కాలితెరువుపోకకుం జెందిన చట్టమ్ము నాపట్ల నెంతయుం జెట్టగూర్చె నొక్కనాఁ డధ్యక్షుఁడగు "క్రూగరు" భవనమ్ము ముందుగా వయ్యాళికిం జనుచున్న నన్ను పటికావలికాఁపు జాడవలనం దొఱఁగు మని యెట్టియెచ్చరికయు నొసంగనివాఁడు ౫

క. కన్నెఱ్ఱచేసి చెటచెటఁ, దన్నుచు వెన్నాడ నాఁడు తనున్న నన్నుమ్ముక్
విన్నఁబడెన్ దీలుపడెన్, నన్నుంగని యపుడ కోట్సు నడవంజనుమున్. ౬

క. నాపడు బన్నంబున కతఁ, డాఁపంగారాని నసటనందుచుఁ గోపో
ద్దీపితుఁ డగుచును గాంధీ!, యీపాలసు రచ్చకీడ్చుటే కర్జమనెన్.

క. ఇతనియలగొడ్డమెల్లఁ జూచితిని గాన, సాక్షిగా వచ్చి నీకునే సాయపడుదుఁ
బొమ్ముపాపమ్మభియోగముం దెమ్ము వీని, విడువఁదగదంచు ననుకంప వెల్లిగొలిపె.

వ. పదంపడి యే నయ్యేసుభక్తునిం గని ౯

ఆ. ఖేదరోషములకు లేదిందు నెలవయో, యీతఁ డేకొలంది యెఱుక గలఁడు?
నల్లమేనివార లెల్లరు నీలెంక, కొండెకాక భేదముండు నెట్లు? ౧౦

క. ఈతఁడు నను మన్నించిన, రీతిన నీగ్రోల నాదరించుట నిక్కం
బీతామసమ్ము సైఁపక, యే తెఱఁగునఁ దోసి రచ్చ కెక్కుదుఁ జెపుమా! ౧౧

క. నమ్మము నన్నెవఁ డేక, స్తిమ్మంచినఁ బాడిపట్టు దెసకుం జనఁగా
సమ్మతిపడ దని నా శప, థమ్ము సుమా యనుడుఁ గోట్సు తా విస్మితుఁడై. ౧౨

క. నీపాటమాని యించుక, నాపల్కు పునర్విమర్శనమునకుఁ దెమ్మా
కాపురుషుల కీదృశులకుఁ, జూపందగు నొక్కమాఱు చుఱుకుందనమున్. ౧౩

వ. అని నన్నుఁ గసరినవెన్క నబ్బంటుపై నిప్పులుచెరుగుచు నతండు వెలుకంబాఱి సిగ్గువేఁగున భయభరమ్మున నెన్నఁడో తన్నుమన్నించిన నన్నుంగని వీఁడు క్షంతవ్యుండని యేటికోళ్ళు చెల్లించె — నవ్వల ౧౪

గీ. భారతీయులఁ గలఁచు నీదారిచట్ట, మెన్నఁటికి నెట్లు తొలఁగునా యన్నతలఁపు
లతిశయించెను గాని నాకపుడు సెట్టి, తగవుపని ముఖ్యకర్తవ్య మగుట తెలిసె.

* * *

౧౪ తగవుపని

సీ. వెలకట్టరాని జీవితము సాగించుచు, నబ్దమొండు ప్రిటోరియాపురానఁ
గడపినాఁడను విశ్వకల్యాణసిద్ధికై, కష్టించుభాగ్య మిక్కడన తనకు
లభియించెఁ దత్కౌశలంబు నిచ్చోటన, యించుకించుక గండరించె నిండె
కట్టలుదాఁటి లోకవ్యక్తనానామ, తావలోడనకాంక్ష తీవరించెఁ

ఆ. బక్షవాదివృత్తిఁ బాలింపవలసిన, చదురు కొంతకొంతయొదవి తీర్పు
నెలవుచేఁతలందుఁ గలకీలకంబు లి, త్తావునంద యవగతమ్ము లయ్యె. ౧

క. నాతలఁ దాల్చిన యబ్బు, ల్లా తగవునవిల్వ యాఱులక్షలదాఁటుక్
భీతిజనకంబులై గణ, నాతీతము లుండెఁ జిక్కు లభియోగమునన్. ౨

గీ. అది బెహారమ్ముపొత్తున నుదితమగుట, నిన్ని మెలికలు తలచూప హేతువయ్యెఁ
దారకాణకు వలయుపత్రిములు లేక, తగవు సగపాలు మాటపైఁ దగిలియుండె. ౩

గీ. పత్రిములు వ్రాసితినిగాని ప్రతిఫలమ్ము, ముట్టలేదని యెదిరి తా మొత్తిపెట్టు
నోటిమాటలు మొదలంట బూటకంబు, లాదరింపకుఁడా యంచు నంకిలించు. ౪

క. ఇరువాఁగులబేరులు బం, గరుపిచ్చుక లగుట నిల్వఁగల్గిరి ప్రజ్ఞా
పరిపూర్ణులు కీర్తిధురం, ధరులై రాణించువారిఁ దగవాడుటకున్. ౫

వ. మాపక్షమ్మున బేకరు ప్రధానన్యాయవాదియై యుండె-నితఁడు గాక సొలిసిటరు
నొక్కండు కలఁడు. ౬

ఆ. వారిచేతిక్రిందివాఁడనై తిరుగుచు, నెఱుఁగఁగంటిఁ బెక్కుమెఱుఁగు లపుడు
సెట్టివాదమెల్లఁ జేకూర్చి వారల, కిచ్చుచుంటిఁ బర్యవేక్షపొంటె. ౭

క. ఈయది సత్యము విశ్వస, నీయం బని మదికిఁ దోఁచు నెఱిగల విషయం
బే యొసఁగుచుంటి వారికిఁ, బాయనిజంజాట మేరుపడె వ్యాజ్యమునన్. ౮

క. నాయిచ్చిన వాదమునం, దేయంశము వారిదృష్టి కించెనో వర్జ్యం
బేయది యయ్యెనో చూచుట, రేయుం బవలు న్మదీయకృత్యం బయ్యెన్. ౯

వ. దీనంజేసి నాకు గ్రహణపాటవమ్మును నిర్మాణకౌశలంబును నేర్పడె నని యెఱిం
గితి-ని ట్లనన్యాయత్తంబగుచిత్తంబున నీవ్యవహారంబున మునింగి వలయుపత్రిం
బులనెల్లఁ బరికించితి-మావ్యాజ్యగాఁడగు నబ్దుల్లాకు నిశితబుద్ధియు నాదేసం బర
సీమలుదాఁటిన ప్రత్యయమ్ము నుండుకతన నాకావించుకృత్యంబుల కెంతేని

సౌలభ్యం బొదవె-యథార్థవస్తువే ముక్కా-లున్యాయంబని పిన్కట్టు నుడివిన పల్కు-పుడు నాతలంపునం బొటి సర్వాంగీణసూనృతంబగు మాయభిగ్రహంబు కామక జయంబువడయునని విశ్వసించితి- వెండియు ౧౦

ఆ. ఈవివాద మిట్లు దైవాఱుచో నొక్క-, పట్టణమున నిల్చుచుట్టములకు
నేల తొలఁగఁబాఱు నిరుపేళ్లవారికి, సర్వనాశ మని విచారపడితి. ౧౧

క. వాదిప్రతివాదుల కప్పు, డేదైవం బావివేక మిచ్చెనొ పోరం
గాదని సెయ్యము కుశలా, పాదకమని విశ్వసించుభానం బొదవెన్. ౧౨

వ. ఏ నద్దానియీగడ నెఱింగి

చ. తలకొను దెంచువేడ్క- నల తైయబుసెట్టిని నిల్వరించి యీ
యలమటలేల యెవ్వఁడు జయంబును గాంచునొ యెవ్వఁ డోడునో
తెలియద సాధుశీలుఁడగు తీర్పరి నొక్క-ని మధ్యవర్తిఁగా
వలచుట మీకు సర్వశుభవర్తకు మూలమటంచుఁ దేర్చితిన్. ౧౪

గీ. వాది కతనికి బహుళార్థవర్త యున్నఁ, బేరు పేరందినట్టి బేహార మున్న
వారి విత్తంపగల్ నఱువట్లుపోవఁ, బెరుఁగఁజాఁగెను బాడిపల్కు-రులముడుపు. ౧౫

క. వెచ్చమునకంటె ఱొడ్డుగ, మచ్చరములు రేఁగి మదులు మంగలములు కాఁ
జొచ్చె వణిజ్యాదులు చెడి, వచ్చుబడియు సన్నగిల్లె వారికి నకటా! ౧౬

ఆ. పాడిపట్టునందుఁ బైచేయి యైనట్టి, యతఁడు మున్నుచిందు నర్థమెల్ల
మరలిరా దటన్న మాట నాయెఱుకకు నచ్చె నపుడ నెఱఁగు హెచ్చిరిల్ల. ౧౭

క. ఇతరేతర విజిగీషా, వ్రతులై గాలింతుర్ధర్మవాదు లశేష
స్మృతులుం దీర్పులు; నాకీ, కృతిమర్మ మెఱుంగునంత నేన జనించెన్. ౧౮

క. దుర్విధు లీదృశములకే, నోర్వక తగవాదుసెట్ల కుభయులకును నం
తర్విద్వేషమ్యాగ్నిశిఖా, నిర్వాణ మొనర్చ మైత్రినెఱపుట కాత్మన్. ౧౯

క. పొవులుచు నది నాధర్మం, బవునని భావించి దుర్భరాయాసములం
దవులుచుఁ గడ కెట్టెటులో, సవరించితి సంధితంత్రసంపాదనమున్. ౨౦

గీ. వర్తకుల కిర్వురకు మధ్యవర్తిగాఁగ, నెఱి నెసఁగునొకండు నిర్ణీతుఁ డయ్యెఁ
దగఁ బరామర్శకావించె జగడమతఁడు, గెలుపుసిరి యబ్బులాసెట్టి కేలు పట్టె. ౨౧

వ. తీర్పు ననుసరించి ప్రతివాది దరిదాపాఱులక్షలు చెల్లింపవలసివచ్చె -నిది యువ్వెత్తుగా నిర్వహించుట కడిందికర్జంబని వెఱచి యవ్వణిజుండు కొన్నిగడువు లర్థింప నతనికోర్కి- ధర్మ్యంబకాన మిపులఁగప్టించి యుదారుఁడగు నబ్దుల్లా నిందుల కొప్పించితి -నపుడు నాయానందము పొలిమేరలం గడచె -నిరువాఁగులవారును దమపాడి

పట్టుపీడ తొలంగుట కెంతేని హర్షించిరి - మఱియు నీయనుభూతిం జేసి నాకయ్యవసరంబున ౨౨

మం. పాడిపల్కెడివారి పని తెల్లమయ్యె, సత్యమ్ము తత్వమ్ము సకలంబు తెలిసె
మానవప్రకృతిమర్మము లర్థమయ్యె, నచ్ఛశీలురచిన్నె లవికానిపించె
మొలతెంచె నరుడెందమునఁ దూఱు నేర్మి, యిరువీళ్ళవారికి హితము బోధించి
పగ నడఁగించుటే పక్షవాదులకు, నుత్తమధర్మమం చూహింప వలసె
నప్పుసమ్ముగ నేతదాశయంబుంటఁ, బాడిపట్టున కెక్కపని రాకపున్న
జగడముల్ పెక్కెంటి సమయింపఁగంటి, నే నిట్టినడవడి నించుటం జేసి
కలిగినకష్టమ్ము కొసంతలేద, చెడినవిత్తం బొకచిన్నమే లేద. ౨౩

* * *

౧౫ మథనము

క. క్రైస్తవులతోఁ బొసంగిన, నేస్తమ్మున నాడుమది జనించినతలఁపుల్
ప్రస్తావించెద బేకరు, కస్తిపడం దొడఁగె నన్నుఁ గ్రైస్తవుఁ జేయన్. ౧

వ. అతఁ డొకప్పుడు

క. మతమునవిరివికి నాతోఁ, న్నతికిఁ వెల్లింగ్టనాఖ్యనగరమ్మునఁ బ్రి
స్తుతి కెంతయుఁ జాలి ప్రీవ, త్రితంబయిన గోష్ఠిఁ గాంచుటిపుటం జనుచున్. ౩

క. నన్నుఁ గొనిపోయెఁ బారిప, దౌన్నత్యముసూచి తన్మతాచార్యవచ
స్కన్నభ్రాంతుఁడనై తన, తెన్నున కే వత్తునని మదిం దలపోతన్. ౪

వ. ఈతలం పెటులున్నను బేకరునకు వేఁడికోలుబల్మియ కడపటిచేవ నాఁదగు - నీశ్వర ప్రార్థనమ్ముపై నితనికిఁ బెద్దయు నమ్మిక గలదు - హృదయమ్ముతోఁ గావించు వేఁడుకోలు భగవానుండు కామ కాలకించు ననియు నన్న వస్త్రాదు లగునైహికమ్ములుసైత మిద్దాన సిద్ధించుననియు నితఁడు విశ్వసించు - నిప్పట్ల నే నొక సిద్ధయంబునకు రానైతి కాదయ్యె - నంతర్వాణి పెరరేచిననాఁ డెల్లనిరోధమ్ములన్ గ్రేణిచేసి యేసుధర్మమ్ముకొల్వున కే నొడనని బేకరుతో నంటి- వెండియు

ఆ. అంతరాత్మ పంచినట్టుల కావించు, టంతకంటెమున్నె యమరె నాకు
కలమి సంతరించు నీచేత తద్వ్యప, ర్యాయము కష్టమూల మార్తికరము. ౬

క. కావున సందియ మందక, యీవిధి నాతనికి మాటయిచ్చితి నవలన్
దైవాజ్ఞవేడ్క నిర్వ్యర, మాపీటం గాలుమోపు టది వట్రిల్లెన్. ౭

క. ననుబోఁటి నల్లనెచ్చెలి, తనవెంబడి నుంట దుర్వ్యసావారిధిలో
మునుఁగంగవలసె బేకరు, తనర్చునుల్లసముతో నతం డదియూఁదెన్. ౮

క. నా కింత మెతుకుపెట్టుట, కీకొనియెడు పూఁటకూటియి ల్లుండ దొకం
డీకొన్న నేమి యొఱగెను, బేకరుతో నారగించువీ లుండదనున్. ౯

క. నెచ్చెలికాఁ డీపల్కుల, కచ్చెరుపడు నాగ్రహించు నతిఘులచనవుల్
త్రిచ్చి తగవాడుఁ దనపడు, ముచ్చిరితనము న్నిగూఢమును గావించున్. ౧౦

వ. ఎంతదాఁచిన నిది నాయెఱుకలోనిద యగు – నయ్యది యట్లుండె – వెల్లింగ్టన్ సభకు నేతెంచిన క్రైస్తవు లెల్లరు నపారభక్తిసంపన్నులు నను త్తమశ్రద్ధాబద్ధులు నాఁ దగుదురు – వారు నాయభ్యుదయమ్ము నలచి పరమేశ్వరుం బ్రస్తుతించిరి – వారి వేడికోలుపాటలు తేనియతేటలంబోనివి – వారినమ్మికలు నాకు నెమ్మి కలుగఁజేసెఁ – గాని ౧౧

క. నామతము నాదునమ్మిక, లీమాత్రిన ప్రిదులఁజేయు టేలా స్వర్గ
శ్రీ మోక్షసుఖము లేసును, బ్రేమింపనివారలకు లభింపక యున్నే. ౧౨

క. ఏ సాకఁడే భగవత్సుతుఁ, డా!సర్వేశునకు బిడ్డ లని యుండిననాఁ
డీసర్వమనుజు లతని క, హా! సూనులుగాక యగుదురో పెఱవారల్. ౧౩

క. జీసస్సు దేవుఁ డగుచో, నీసకలమనుష్యు లెవ్వ రీశులుగారా ?
యేసు తనరక్తధారలఁ, జేసి కడుగునొక్కొ జగముచేయునఘంబుల్. ౧౪

గీ. మనుజునకుఁ దక్క మృగ పశు మత్స్య నీడ, జాదికప్రాణికోటికి లేదె యాత్మ
చావుతో వీనికథ మాసిపోవునోటు?, సకలజంతువు లీశ్వరాంశములు గావో. ౧౫

వ. ఇట్టిసందియమ్ములు పెక్కులు నన్నుఁ గలంచె–నీతలంపులం గ్రైస్తవమిత్రుల చెవిని వైచినంతన వారిగుండె గుభిల్లుమనియె–నేసు వితరణఖని మహాత్ముఁడు దేశికవర్యుండుననియొడంబడుదుఁ గాని యతం డద్వితీయపురుషుం డనఁజాలఁ–లోకమ్మున కతనిచావొకమేటితారకాణ యగుఁ–గాని దానియం దద్భుతజనకం బగు నొకప్రభావము నిగూఢమ్ముగా నున్నదనినమ్మనేర–నన్యతరమతమ్ములం గానరాని మహీయస్త్వంబు క్రీస్తుధర్మంబున గోచరింపదయ్యె–వితరణంబునందును హిందువులు క్రైస్తవుల నతిక్రమించినవార యని తెలిసె–ని క్రైస్తుధర్మంబు సమగ్రంబని సర్వోత్కృష్టంబని విశ్వసింపలేకుంటిఁ–గాని హిందూధర్మమేని తాదృశంబని నిర్ణయింప నశక్తుండనైతి–నేలయన ౧౬

మం. నాలుగువర్ణముల్ నానావిధాల, తెగలు నస్పృశ్యతాదీను లపౌరు
షేయముల్ శ్రుతులని చెప్పెడివారు, నిందుకొన్నమతంబు నిర్దుష్ట మనుచు

నంగీకరించు నెట్టామ్నాయ మీశ్వ, రప్రసాదితమై కొరాను కాకుండ
నేమి బైబిలుమాత్ర మిట్టిది కాదొ. ౧౭

వ. అది యట్లుండె_నయ్యవసరంబున ౧౮

క. నన్నుఁ దమవానిఁ జేయుట, కెన్నెన్నో శ్రమల కొగ్గి రేసుమతమువా
రిన్నెటి నూఁదియ నిజధ, ర్మౌన్నత్యము సెప్పఁజాగె నబ్దులు నాకుఁ. ౧౯

క. పదపడి నాఁడెందమునం, దుదయించిన కలఁతలెల్ల నొకలేఖమునం
గదియించి రాజచంద్రున, కధీతవేదాంతకోటి కంపినవాఁడన్. ౨౦

క. అతఁడోపికమై హిందూ, మతమ్ములోఁతుల నెఱుంగుమా యని మతసం
తతిలో వైదికధర్మం, బతిగౌరవపాత్ర మనియు నాదేశించెఁ. ౨౧

వ. ఇతఁ డంపిన పంచీకరణ యోగవాసిష్ఠాది కృతులం బరికించి క్రైస్తవమహమ్మ
దీయధర్మములకుఁ జెందిన రచనలుసైతము పెక్కింటిఁ బఠించితి-నందుఁ డాలు
స్టాయికృతంబు "దేవునిరాజ్యము నీలో నున్నది" యనుగ్రంథము నన్నుఁ బెద్దయు
నలరించి నాచిత్తంబున హత్తుకొనె_నిది నన్ను నాక్రైస్తవమిత్రు లూహింపని
మార్గమ్మున కీడ్చినను వీరితోడినెయ్యంబునం జేసియ నేను ధర్మజిజ్ఞాసున నైతిఁ_
గాన వీరికి మిగుల ఋణంపడి యున్నవాఁడ. ౨౨

* * *

ఏ పెట్టిదో?

గీ. తగవుపని మూలముట్టుగా ముగియుటన్ బ్రి, టోరియా వీడి దర్బాను చేరవచ్చి
మాతృభూమికిఁ బైనం బమర్చువేళ, సెట్టి నన్నాదరింపఁగాఁ జేసె విందు. ౧

గీ. ఆటపాటలతో మధురాతిమధుర, భోజనమ్ములతో సుహృత్పుంజమంజు
గోష్ఠితో బహుమానవాక్కోటితో న, ఖండహర్షవిధాయిగాఁ గడచె విందు. ౨

వ. యాదృచ్ఛికమ్ముగా నపు డొకపత్రికం జూచుచున్న నా కందొకమూల "నిండి
యన్ ఫ్రాంచై" జను తలకట్టుతోడివ్యాస మొందు కానిపించె_దానిం జదువ
నేటాలురాష్ట్రమ్మున భారతీయులకు శాసనసభాసభ్యుల నిర్ణయించు చనవు నీని
చట్టమొకటి నిర్మింపఁ బడుచున్నట్లు తెల్లమయ్యె_నిది నాక కాక విందునందున్న
మిత్రులకును నజ్ఞాతంబ_పదంపడి దీనికలరూపు నబ్దుల్లా నడుగ నతం డిట్లనియె. ౩

మం. సోదరా! బేరంపుసుద్దులు తక్క, నితరప్రవృత్తి మా, కెంతేనిదవ్వు
వెలఁజూడఁ బత్రికన్ విలుతుముగాని, చట్టముల్ తెలియ మాచదు వదియెంత

ఫ్రిస్టేటువారు నిర్మించినఘోర, శాసనం బాకడు లక్షలదాటినట్టి
మాబెహారము సెల్ల మంటిలోఁ గలుపు, టెఱుఁగవే యప్పుడు మే మెన్నోవిధాల
మొత్తుకొంటిమిగాని మొఱ లుడివోయె, విద్యావివేకముల్ వెలితిగా నుంట
మాపల్కు నాదరింపర యధికారు, లిటఁ బక్షవాదులై యేపారుచున్న
యాంగ్లేయులే మాకు నక్షులున్ శత్రులు. ४

వ. అనుటయు నీనేల నిరవుకొన్న భారతీయులలో విద్యలుగడించిన యువ లెందఱో కాన్పింతురు-మీకు వారు తోడ్పడరో-యని నే నడుగ నబ్దుల్లా నైరాశ్యపిశున వదనుండై వెచ్చనూర్చి ౫

క. వా రేసుమతము నూఁదిన, వారగుటన్ మమ్ము లాఁతివారిఁగఁ గను టా చారము నిజ మాడినచో, వారిదెస న్మాకు గౌరవము సున్న సుమా. ౬

సీ. మఱియు వీ రిటఁ గ్రీస్తుమతబోద్ధలై యుండు, నాంగ్లేయులకు దాసులై చరింతు రమ్మతాచార్యు లీయననిఁ బాలించెదు, దొరలకు భృత్యులై తిరుగుచుండు రనియె నాతనిపల్కు లవి నన్ను మేల్కొల్పఁ, బదరి యిచ్చటనున్న భారతీయు లెల్లరు నన్యోన్యహితులై మెలంగు సత్సంచరించుట కృత్యమనియు నన్య

ఆ. మతముఁ గొల్చునంతమాత్రిన భారతీయులు విజాతు లగుదురొక్కొ యనియుఁ దలఁచి నన్ను నపుడు కలఁచినసంతాప, మెల్ల నడఁచి సెట్టి కిట్టు లంటి. ౭

గీ. చట్ట మిది నెగ్గనేని యిచ్చట వసించు, భారతీయులు దుర్భరాపదలు గుడుతు రాత్మగౌరవశూన్యులై యలమటింతు, రాఫ్రికా వీడఁదగినవా రగుదు రకట! ౮

వ. అనుటయు విందు లెల్లరు దీర్ఘాలోచనానిమగ్నులై యీముప్పు తప్పింప గాంధిని నిలువరింపు మని మాయభియోక్త నర్థింప లోకజ్ఞుఁడగు నబ్దుల్లా వారివలనికిం జూడ్కిపఱపి ౯

క. నాకుంగల యధికారము, మీకుంగల దితనిఁ గోరి మేలందుటకున్ లోకహితమ్మగు కీర్తి, కీకొండని వేఁడుకొంద మీసోదరునిన్. ౧౦

క. ఇతఁడు మనకొక్కదెస నా, ద్రుతిఁ జూపకపోఁ డటంచు నెంచెద నైనన్ మతి నొం డరయుఁడు సేవా, వ్రతుఁ డయ్యును గాంధిన్యాయవాదిగనుంటన్. ౧౧

ఆ. అతని కిచ్చుసుంక మది విస్మరింపక, యడుగుఁ డెట్టిసాయమైన మిత్రు లనుడుఁ బరమవాక్య మస్మన్మనోవీధిఁ, జొచ్చి నూదివోలె గ్రుచ్చుకొనియె. ౧౨

క. ఏ నంత నతనిఁ గన్గొని, సీనొడివినపల్కు వెఱఁగు నించు నయారే మానవసేవకు శుల్కం, బేనరుఁ డాసించు నితఁ డెఱుఁగవా సెట్టీ! ౧౩

క. ఈయున్న పెద్ద లెల్లరు, నాయెఱుఁగనివార వీరు నా కర్మిలిమై
సాయంపడ నోపుదు రని, నీయెడఁద న్నమ్మ దేని నెలనాళ్ళందున్. ౧౪

క. నాకుం గట్నముతోఁ బని, లేకున్నను ముద్రణమ్ము లేఖలు తంతుల్
రాకలు పోకలు నడుపన్, రూకలు కావలయు నివి యెఱుంగుఁడ యంటిన్. ౧౫

క. నావుడు వణికుట లేక, గ్రీవముగా నిట్లు పల్కరించి రహో ! బాఁ
తే విత్త మీశ్వరాదృతిఁ, గావలసినవట్టు తానుగా వచ్చిపడున్. ౧౬

క. ని న్ననుసరింప మాదృశు, లన్నా కల రెంద ఱెందఱైనను; మమ్మున్
మన్నించి నీవు నిల్చిన, నన్నియు నపుడపుడ మిత్రమా ! సూత్రపడున్. ౧౭

వ. నావుడు నవ్విందుకొఱకే తెంచినపెద్దల తత్క్షణంబునఁ గార్యసమితి పాలిసభ్యులుగా మాఱి – రి ట్లాఫ్రికాఖండమునం దీశ్వరుండు నామన్గడకుఁ బునాది వైచి యాత్మసమ్మానసమరంబునకు వెదపెట్టె. ౧౮

***

౧౭ బస పెట్టితిని

మం. హాజీమహమ్మదు యాజమాన్యమున, నబ్దులా సెట్టి దివ్యాగారసీమ
నడిచినసభకు నానాభారతీయు, లరుగుదెంచి నియోజనాధికారంపుఁ
జట్టంబు నెదిరింప సమ్మతిపడిరి, క్రైస్తవయువకోటి కరముల నలిపె
నైచ్ఛికభటు లసంఖ్యాకు లేర్పడిరి, పిన్నలు పెద్దలు పేదలున్ ధనికు
లాశ్రితు లాశ్రయు లానాఁటిసభను, మతకులభేదము ల్మఱచి పాల్గొనిరి
విశ్వజనీనమహా విధులకున్ దిగుట,కలవాటులేమి నయ్యాయిపద్ధతులు
క్రొత్తలై కడువింతఁగొల్పె వారలకు,నెన్నివేలును లున్న నెల్లర మొక్క
జననిబిడ్డల మన్న సద్భావ మొదవె, శాసనం బిపుడు చర్చకుఁ దేరవలవ
దాఁగుఁడీ! యధికారు లని తంతిపంప, నభ్యంతరమ్ముల నాలించుపొంటె
రెన్నాళ్ళు చర్చ వారించితి మన్న, యుత్తరం బరుదెంచి యుద్వేల మైన
సంతుష్టిఁగూర్చె మాసభకు నవ్వేళ. ౧

వ. పదంపడి యే నధికారులసన్నిధి కంపఁదగిన విజ్ఞప్తి యొండు విరచించి స్వచ్ఛంద సేవకుల సాయమ్మున నొక్క రేయిలో నందు వేలకొలఁది సంతకములు చేయించి వడివడిన్ దాని శాసనసభకుఁ జేర్చితి – వెండియు నమ్మనవిపత్రము నెల్లవార్తాపత్రికలకు నొసంగుడు నయ్యవి విమర్శనపూర్వకముగాఁ బ్రచురించి మాకుం

దోడ్పడియె – శాసననిర్మాతృ మండలియం దీవిన్నపం బొకపెద్ద కోలాహల మ్మును రేఁచె – నెంతచేసిన నేమి – కొట్టకొసకుఁ జట్ట మంగీకృతంబ యయ్యె. ౨

క. మాజతనమెల్ల నిట్లు ప, రాజిత మగు టేమియబ్బురంబగు విజయ
శ్రీ) జడనుపడిన నభినవ, తేజం బొకఁ డలమె భారతీయుల నుదుటన్. ౩

క. ఇతరేత రానురాగ, వ్రిత మీకొని రాజకీయవాల్లభ్యసము
న్నతి నందు టది వణిజ్యా, స్వాతంత్ర్యాగ్రియ మటంచు వారికిఁ దోచెన్. ౪

వ. నాఁడు వలసమాగాణములమేల్గీడు లరయుపెద్దలకు రిప్పన్ దొరకు సీ యపవాద మున్నుతిచి విపులవిజ్ఞాపన మొండు పంపనెంచి యసంఖ్యాతంబులగు రాజకీయ గ్రంథములం బత్రికలం బరికించి దానినిర్మించి మాసారమ్ములో నందుఁ జేరు వాళ్లు పదివేలు సేయించి తదధికారి కంపుటయ కాక యది యచ్చొత్తించి దేశమ్ము నలువలంకులఁ బంచిపెట్టించితి–వెండియుఁ దదీయప్రతికృతులంబెక్కు పత్రికల కందిం చుడు లండన్ టైమ్సు సైతము మావాద మాదరణీయంబని మెచ్చెఁ–గాన నేటాలు వారిశిష్టి సార్వభౌమునితిరస్కృతికిం బట్టుగాక తప్ప దనుసమ్మిక నాకొదవె–నంత

క. నేటాలుమిత్రు లెల్లరు, గాటంబగు పేర్మి నెఱప కామక మీ దీ
నాటం దిరపడుఁడని పలు, పాటుల నన్వేడ నిష్టపడితిం దుదకున్. ౬

సీ. అటులయ్యు మజ్జీవయాత్ర కయ్యెడు వెచ్చ, మొరు లోసంగుట నాదుపరువుపోక
యనియు నన్యులయింట నునికి నుజ్జనచేసి, రమణీయతామండరమ్మునందు
నద్దెగీమున నిల్చుటది సమంజసమని, న్యాయవాదిపాత్రిభ వానుకూల
జీవనమ్మున కిచ్చ సేయమి తద్వృత్తి, నడకించు టసియు నే నరసి నెలకు

గీ. నాల్గువందలరూప్యముల్ నాకు నిడు న,భిగ్రిహంబుల మీర లర్పింతు రేని
నిలుతు నిచ్చోట నాలావుకొలఁది మీకు,నూఁడె మొనరింతునని వార కొయ్యనంటి.

వ. పదపడి వార లాపాటిసొమ్ముం జులుక నార్జించి మాకొసఁగు సేవకుఁ బ్రతిఫల మ్మంగా నీకిత్తుము–వ్యాజ్యెములు నడిపినశ్రమకుం దగినసొమ్ము నీవు మాకడన్ వేఱ కైకొనవచ్చు నని–రంత నేను ౮

ఆ. సంఘమునకు సేవఁ జల్పుటకై విత్త,మభిలషింప నొల్ల దస్మ దాత్మ
యేల ధర్మవాది యీవిధి; కిందుఁ ద,ద్ధబలమ్ముకలిమితోఁ బనేమి. ౯

క. ఈకృత్యము శుభదం బని, మీకుం బనిపొందుపఱిచి మిముఁ గష్టములన్
దూఁకించుట బడలించుట,యే కద నాకార్య; మర్థ మిందుల కేలా. ౧౦

గీ. మనము విశ్వజనీనముల్ పనులుసేయ, నిట నటవదాన్యుల సమాశ్రయింపవలయు
ధర్మనిధి కొంత నాదు వేతనమ మైన, నెంతయొసొమ్మునకు బిచ్చ మెత్తవలయు.

గీ. సంబళముతోఁ బ్రజాసేవనం బొనర్చు,నాఁడు నే నెట్టు లొరుకాసు వేఁడనొర్తు
నెఱి నెడలి జీతమునకుఁ గక్కుఱితిఁగొన్న, బండి తొలుకరికే మూలఁబడుట నిజము.

చ. అనుటయు వారు నన్గని సమాదర ముట్టిపడంగ నే మెఱుం
గనియవి గావు నీదునడకల్ పరవిత్త మకారణంబుగాఁ
గొన వొకరూకయేని నినుఁ గోరి పరక్షితి నిల్పు వారు నీ
మనుగడవెచ్చ మీఁగి యసమంజస మెట్టులగుఁ సుహృన్మణీ ! ౧౩

వ. ఇట్లు పల్క నిప్పుడు నాదెసంగల ప్రేమోత్సాహముల కతన మీ రిట్లు వాకృత్తు - రివి యెల్లకాల మిట్ల యుండునోటు ? - మున్ముం దేను మీ మిత్రుఁడుగా లెంకగా మీావలవనిమాట లాడుదు - నపుడున్సైత మీ మీ యభిమానమే నందనేర్తునో నేరనో యీశ్వరుండ యెఱుఁగవలయు - మఱియు. ౧౪

క. వాదంబులేల యిట నా, సోదరులకు సేవఁజేయుచున్ భృతి నంటం
గాదనుఁడీ మీాతగవుల, కాదృతిమై నన్నునిల్పుఁ డంతియ చాలుఁ. ౧౫

మం. తెలజాతిపక్షవాదిని గామికతన, నిదియు మీా కింటరమే యాట నిక్క
మిట ధర్మవాదిగా నే నెంతదనుకఁ, బనికివత్తునో పాడిపట్టువా ర్నాకు
నేపాటిగారవం బిత్తురో తెలియ, నభియోగములు వేఁడు టది సంఘసేవ
కర్థించుమాఱుమే లనుట దోసంబె?, మఱియు వేతన మేల మానుఁ డాకోర్కి
యనుడు వర్తకు లెదురాట చాలించి, రబ్బులా నాకు నీయఁ దలంచినట్టి
బహుమతిసొమ్ముతో బల్లలుం బీఁట, లవి యివి కొని పంపె నాదరం బార
నిట్టు లే నాఫ్రికా నిరవుకొన్నాఁడ. ౧౬

* * *

౧౭ వర్ణద్వేషము

క. న్యాయస్థానం బొకతుల;, పాయనిధర్మానురక్తిఁ బట్టును దానిం
దోయలి యొకర్త; కనుచూ, పాయమ్మకు విధి యొసంగఁ డాయె లవంబుఁ. ౧

గీ. తెలివితేటలుమాత్ర మగ్గలముగాఁగఁ, బడచె నాయింతి; వదనంబువలను సూచి
బొట్టుపెట్టుట యామెకుగిట్ట; దెల్ల, యెడలఁ బాత్రతకే పేర్మియిచ్చుచుండు. ౨

వ. కాని నేటాలునందలి న్యాయవాదిపరిషదం బేతదాచారవ్యతిక్రమమ్ముగా వర్తింపుమని నెఱపాడిపట్టుం జెరశేపె - నదియుఁ దనయడియాలమ్ముల మొగమోట

పొట్టం బెట్టవలసె - నట్లన నే నచటియున్నత న్యాయస్థానమ్మునం బక్షవాదిగాం జేరవలచి తదధికారికి విన్నప మంపుడు నాతండు ప్రీతిమై నాచేరికకున్ మైకోలు సూపె - నైనను నావినతిపత్రమ్ముతోపాటు మదీయాంగ్లభాషా యోగ్యతా పత్రము నంపలే దనునెపమ్ము చూపుచు ధర్మవాదిమండలివారు నాప్రవేశము నిషేధించు నభియోగముం దెచ్చి - రాపత్రమ్ము బొంబాయిపాడిపట్టునం జిక్కు-వడియుండె - నల్లవారిం జేరందీసినచో మెలమెల్లంగా వారిసంఖ్య బలిసి తెల్ల వారికి నుపద్రవంబు దెచ్చునని యీసమితివారిభీతి - కావుటంజేసి తమపక్షమ్మున వీనుమిగిలినపాడిపల్కరి నొక్కని నిల్పి నన్నగికట్ట నెల్లదారులుం ద్రొక్కిరి - కాని తగవరి వారివాదముం జించిచెండాడి పాడికి నల్ల తెల్ల వేఱుడంబు లుంట దూష్యం బనిచాటి ౩

గీ. నన్ను వత్సలతం జూచి విన్నపంబు, నీది మన్నింపంబడియె గాంధి! ప్రమాణ
మాచరించి న్యాయస్థానమందుం జేరు, మనుచుం బాలించితిం బ్రీతి సతనిపనుపు. ౪

వ. పదంపడి తగవుపట్టునందలి కట్టుకట్టడంబట్టి నీశిరోవేష్టనమ్ము వర్జనీయం బని యతండు నన్నుంబలుక నవ్యాసతిం ద్రోయుపీలున్నను మున్నచటి మాండలిక దండనాధికారిపాడిపట్టునం దలకట్టుతీయ నని తుటారించినవాండ నయ్యు భావి కాలంబునందు నాకావింపవలసిన దండ నూత్రిలు పెక్కులుంటంజేసి వానికొఱకు నాబలంబు నూడంబెట్టవలచి తలగుడ్డను డించితి - నీచెయిద మ్ముల్లాప్రభృతిమిత్రుల కసమ్మత మగుడు నేఁబోద్దు తెఱుంగవలదా యని వారి నెట్టకే నొడంబఱచితి - నొక్కయంశంబ వేర్వేఱుసమయంబుల వెవ్వేఱువిధులం గంట నలయు నను ధర్మంబు దెస వారి కంగీకృతి లేదయ్యె - నామనుగడ నెల్ల సత్యమను నభినివేశంబ మైత్రీసౌఖ్యమాధుర్యము నందింపంగల్గె - నియ్యది సత్యాగ్రహమునందు నపరిహార్యంబగు నంగంబని రానురా నెఱుంగంగంటి - నీపట్టుదలకతన నాతలప్రాణమ్ము తోఁకకు వచ్చెడిది - నానెయ్యు రెల్లరు నసంతృప్తిపా లగువారు - కాని సత్యంబు కులిశంబువోలె నెంతకఠోరము క్రొవ్విరివోలె నంతమవ్వం బని తెలిసితి - నది యట్లుండె - నేటాలున్యాయవాదిసమాజమ్మువారి నిరోధమ్మునంజేసి యాఫ్రికా యందు నాపే రింకొకతూరి ప్రతిధ్వనించె - ననేకపత్రికలు వారిచేష్టిత మీర్ష్యా మూలంబని తెగడె - ని ట్లేను వెల్లడియగుటచే నాకృత్యంబులు కొన్ని సుకరంబు లయ్యె. ౫

* * *

౧౮ నేటాలు భారతీయసభ

సీ. పరభూమి నాదుకాఁపురము సాఫల్యమ్ము, నందుట వాంఛనీయమ్ముగాన
నభియోగవిధుల కే నవుడు గౌణత నిచ్చి, వరియించినాఁడ సేవావ్రతంబు
మనవు లంపినయంతమాత్రన యధికారు, లంకెకువత్తురా యహరహంబు
నలజడి గావింపవలయు సుస్థిరమైన పరిషత్తు లేనిచోఁ బనులుసాగ
గీ. నేర వని యెంచి నేటాలుభారతీయ, సభను నెలకొల్పి నియమముల్ సంతరించి
నెలనెలకు సభ్యు లొసఁగుకానికల దాత, లిచ్చునీవులతో బండి నీడ్చుచుంటి. ౧
గీ. నెలకుఁ బదునైదురూప్యముల్ నే నొసంగఁ, జొచ్చితిఁ సభ కిది నాదువచ్చుబడికి
మిక్కిలినకాన్క యయ్యు నీరొక్క మీఁగి, సులభతర మాయె నాయంబు సొరిది హెచ్చి. ౨

వ. ఏను సభాకార్యదర్శి నగుట సభ్యు లొసఁగుకాన్కలం బోవ్రుసేఁత నాకర్తవ్యమయ్యె-రానురా నెంతవేఁడిన విత్తమ్ము నీక సభ్యులు వన్నలయించి-రారంభశూరత్వ మన్నది నా కపు డెఱుకపడియె- నవ్వల నెలకాన్కల మాని వార్షికోపహారమ్ముల నేర్పఱిచితి-మీకట్టడం జేసి నాప్రయాసంబు చాలవట్టుతలఁగె-నార్థికవాగ్దానములఁ నమ్మి సభ కే నెన్నఁడు నధమర్ణతాబాధ నాపాదింప నైతి-ననుయాయులు నిరవధికోత్సాహమ్మునఁ గ్రొత్తసభ్యుల నార్జింపఁ బూనిరి-సంపన్నులగు వణిజులు మమ్మాహ్వానించి ధనంబు నీఁజాగిరి-కాని యక్క అనుమించిన సొమ్ము గడియించుట నింద్యంబని యే నితఃపూర్వంబ విశ్వసించితి - వెండియు ౩
క. నెలనెలకున్ బరిషత్తులు, పలుచర్చలు నడుచుటన్ సభాస్తారులలో
వెలసెం గ్రమకమమ్మున, లలితోపన్యాసకౌశలం బది మిఫులన్. ౪
క. చిల్లరవెచ్చముపెక్కువ, కొల్లనినే నచ్చుసేఁత కొప్పక లేఖల్
చెల్లుంజీట్లు నివేదిక, లెల్లన్ విరచింప నుత్సహించితిఁ జేతన్. ౫
క. వలవదని దాత లన్నను, నిల కిచ్చితిఁ జెల్లుచీట్లు నిక్కచ్చిగ లె
క్కలు దువ్వరువ్వ కుంచితిఁ, బలువుర కీపనికి నొల్లఁ బాటగు నకటా! ౬
ఆ. దోసి గానిలెక్క యేసంఘమున కేని, జీవగఱ్ఱయని వచింతు నిట్టి
యభ్యసంబు లేమి యనివార్యదుర్దశ, ఉదయమూల మెల్లసదములకును. ౭
వ. ఆయవ్యయవివరణమ్ము నిర్దుష్టముగాఁ జూపలేనివాఁడు నిష్కళంకముఁగా సత్యమ్మునునుచు టరిది-కాన మాసంఘ మెంతయనున్నవయైనను దానిచరిత్ర నతిజాగరితనై

జాల_దతఁడు పాగ నుజ్జగించి చేతం బట్టుకొనవలయుఁ-గావుటంజేసి నా(మోల నయ్యెఅవ యిట్టినడవడిం గొనియూడె-నీచెయిదంబు నాకుం (గొత్తయై నన్నుఁ జిన్నవుచ్చెఁ-గాన నే నతనింగని ౧౬

క. ఏల తలచీర డించెదు, కీలింపుము తప్పులేద కీలింపు మనన్
జాల వెనుకాడి యాడి కృ, తాలసతన్ జుట్టుకొనియె నాతఁడు వలువన్. ౧౭

క. అతఁ డెంత(నుయ్యెఁబొత్తిన, నతివేలానందభాగి యయ్యె వినూత్న
ద్యుతి వానిఁ బొదివె ననిమే, షతా(ప్రసన్నతల నన్ను సంభావించెన్. ౧౮

క. తమసాటివారి నవమ, త్వముపా లొనరించునాఁడె తమ కౌన్నత్యం
బమరునని కొంద ఱెంచెడి, (క్రమ మెట్టిదొ యెఱుఁగ నెంతకాలము చన్నన్. ౧౯

***

౨౧ మూఁడు నిష్కములపన్ను

గీ. బాలసుందరుతగవు నేటాలులోని, కార్మికులతోడ నాకు సఖ్యమును బెనుప
మెల్లఁ బరికింపఁజాగితిఁ దెల్లదొరలు, పాడికింబాసి వీరిఁ గిడ్పెఱుచువగువు. ౧

వ. వేయెనమన్నూటతొంబదినాల్గవయేఁట నేటాలునేలుబడివా రనునత్సరంబు నొడంబడికకూలివాండ్రతల కిరువదియైదు నిష్కములపన్ను చెల్లింపవలయు నను నపవాదముం బ్రవేశపెట్టుచు నది గని యేను ఱిచ్చవడి దాని మహాసభకు నందిం చితి-నం దీచట్టము న్మదలకింప నెల్లజతనంబులు తవణింపఁదగునని యైకకంఠ్య ముగా నిర్ణీతమయ్యె-నీయప్పనంబునకుం గలగుట్టు నించుక వెలువరింతు-వేయి యెనమన్నూటయఱువది యగునబ్దంబునం దీదొంతనముహారు ౨

క. నేటాలుగడ్డ చెఱకుం, దోఁటల కగునం చెఱింగి తోడన భరత
క్ష్మ్మ కెఱకిగఁ గలకార్మికులు, పాటుపడం దగుదు రట్టిపంటల కనుచున్. 3

మం. గుర్తించి హైందవక్షోణిఁ బాలించు, వారిమైకో లంది వలసినట్టు
పనివాండ్రఁ రావించి పంచవర్షములు, కూలిసేయ బిగించుకొని రొడంబడిక
యవధి చెల్లినవెన్క నా(శ్రితామన్కి, కుత్సాహ మొదవుచో నుండఁగావచ్చు
నర్థమున్నఁ బొలంబు లార్జింపవచ్చు, శక్తులైన వణిజ్య సాగింపవచ్చు
నని వారికిం జూపి రాశ లవ్వేళఁ, బంచాబ్దములు చన్నపదపడిస్సైత
మీకూలివాండ్రచేఁ గృషి సేద్యవచ్చుఁ, బొఁడి,పంటలు వృద్ధిపఱుచుకోవచ్చు
ననుతలంపులె యిట్టి యనుకూలభావ, గరిమఁ జూపఁగ మూలకారణం బందు. ౪

వ. కాని గడువుదాఁటినభారతకర్మకరు లాంగ్లేయు లెన్నఁడు నూహింపని యభ్యుదయమ్ముల నందఁగల్గి - రెట్లన ౫

గీ. భారతమునుండి నానాప్రకారశాక, బీజములఁ దెచ్చి కూరలుపెంచి కంచి మావితోఁటలు నాటి సుశ్రీ వరింప, భవనములుగట్టి బేరాలఁ బాదుకొనిరి. ౬

గీ. పచ్చపచ్చఁగఁ దిరుగాడు భారతీయ, కార్మికులఁ జూచి తెల్లవా రోర్మి నూడ్చి సొంతకరిసనము నడించుట సరే! వ, ణిక్కు లైరేని వీరి మన్నించు టెట్లు? ౭

క. అని యీరసమ్ము కొలువుం, గొనియాటకు మ్రొగ్గి రెన్నికుటిల కైనన్ వెనుదీయక తత్కార్మిక, జనావళిన్ రొప్ప వేక్కసల్పిరి వారల్. ౮

వ. వాణిజ్యంబ కాక మితవ్యయమ్ముతో నిరాడంబరముగా మెలంగుట, సామాన్య లాభంబునకుం దనిసనుట, యనామయకారికార్యంబుల నుఱమి, మందిరమ్ము సుందరమ్ముగా నొనర్చుకొంటకు బంకముచ్చుఁదనం బూనుట, మతవైలక్ష ణ్యమ్ము లోనగు నల్లవారిమనుగడ మార్గమ్ములునైతము వారిం జాతిద్వేషదోష దూషితులం బొనరించెఁ - గావున ౯

క. మునుముం దెన్నికచనవుం, దునుమాడు నిదేశమునకుఁ దొడఁగిరి తచ్ఛా సన మైనవెన్కఁ దలప, న్నను వడ్డించుటకు నేఁడు నూల్కొని రిన్స్! ౧౦

వ. చట్టము నామూలాగ్రచూడము పరికింప నై దేండ్లు ముగిసినంతన కూలివాండ్రు భారతదేశమ్మున కేగవలయు, నట్లు సేయనినాఁ డించుక జీతపుంబెంపున కీకొని రెండేఁడుల కొక్కమఱి ముచ్చిలిక వ్రాసి యీవలయు, నీరెండు తెఱంగుల కొల్ల నియెడ నేఁడాదికి మున్నూటడెబ్బదియైదురూపాయ లరివెట్టవలయు నని తెలిసె- నీతీర్పునెల్ల భారతప్రభుత్వమువా రొప్పక మూఁడునిష్కములకప్పమున కంగీక రించి - రిదియు నత్యాచారంబ - దీని నిర్మూలింప నేటాలుభారతజాతీయమహా సభవారు నిరంతరదీక్షమై శ్రమించిరి - కాని యది యిరువదేండ్లకు ఫలించె - నీప న్నెత్తి వైతు మని నేటాలురాచటికమువారు గోపాలకృష్ణగోకులున కిచ్చిన వాగ్దానము చెల్లింపమింజేసి చరమసంగ్రామ మారబ్ధ మాయె. ౧౧

క. ఆకయ్యంబునఁ గార్మకు, లేకాగ్రతఁ జూపి రెంద ఱెందఱొ బంధా లై కస్తిం గుడిచిరి వె, న్నికయ లఘునాళికాగ్ని కీల్గిరి పలువుర్. ౧౨

గీ. దొసఁగు లెన్నెన్ని పైకొన్నఁ దుట్టతుదకు, సత్యమే నిత్యవిజయధ్వజంబు నెత్తెఁ గర్మకరదుర్భరాపదాకార మూని, సత్యదేవత నాఁడు సాక్షాత్కరించె. ౧౩

క. సడలని విశ్వాసంబును, సడిసన్నతితిక్ష సుప్రశంసార్హం బౌ కడఁకయు లేకుండినఁ జొ, ప్పడునోటు జయంబు నాఁటిబవరంబునకున్. ౧౪

వ. కర్మకరు లీసమరమ్ము నెదుర్కొనక మహాసభవారు దీని గుర్తింపక యున్నఁ దప్పక తలపన్ను విధింపఁబడి చేటికి న్వేధించుచుండు — వెండియు నేతదీయంబగు దుష్కీర్తి యాఫ్రికాభారతీయులకె కాక సకలభారతప్రజల కంటి ప్రాఁబడియుండు.

* * *

౨౨ ధర్మనిరీక్షణము

క. పరమేశ్వర సాక్షాత్కృతి, వరియించుటఁజేసి వేడ్కవడినాఁడఁ బ్రజా
వరివస్య; కదియ వేలుపు, దరిసెన మిప్పించునన్న తాత్పర్యమునన్. ౧

క. భారతజగతీసేవా, భారంబును మోఁత నాకుఁ బరమప్రియ మీ
యారంభము నేటాలునఁ, గోరక లభియించె నెలమి కొనలొత్తంగన్. ౨

ఆ. బ్రిదుకుఁదెరువు వలచి పైకొన్న కార్యము, వాదువేడబముల దాడి కడలి
దేశయాత్రవలని తెల్వి కూటాడి నే, టాలునందు నాదు కాలి నిడితి. ౩

గీ. కాని భగవద్గవేషణాధీనవృత్తి, నాత్మసందర్శనమ్మునయందు నోల
లాడితిం గ్రైస్తవులు నెయ్యురై మదీయ, ధర్మజిజ్ఞాసకు న్దోహదమ్ము లిడిరి. ౪

వ. ఆయిచ్ఛ నుపశమిల్లఁజేయ నే నియ్యకొన్నను నాచెలికాండ్రగు క్రైస్తవు లడ్డుపడి — రెట్లన నాఫ్రికాక్రైస్తవమతపరిషదధ్యక్షుఁడై దర్బానునందు నెలవుకొన్న వాల్టను నన్నుఁ బసిపట్టి చేరఁదీసి గారవింపఁ దొడంగె — నితనినడవడి నాకు వింతగొల్పె — న నీతఁ డేసుధర్మంబు నారాధింపుమని యెన్నఁడుం గోరఁడయ్యెఁ — గాని ౫

క. తెరదీసి తనమెఱుంగులు, నెరసులు నాయెట్టయెదుట నిలిపెను దన స
చ్చరితము దుశ్శీలమ్మును, బరికించెడిమార్గ మేరుపఱిచెన్ నాకున్. ౬

క. అతని సహధర్మచారిణి, సతీమతల్లిక వివేకసంయుత వినయా
న్వీత విద్యారత; తజ్జం, పతులచరిత్రంబు నాకుఁ బ్రమదంబొసఁగెన్. ౭

వ. మాతలంపులయం దెన్నే నెడమడుగులు గలవు — కాని సత్య సహనౌదార్యము లున్నయెడ నవి లగ్గొనరించునట్టివ యగు — నయ్యాలుమగల సౌజన్యంబు నన్నుఁ గడుంగడు నాకర్షించుటంజేసి యే నేరాళమ్ముగా వారి సన్నిధి కేగుచుంటి — నీజడ్డు మతమ్ముదెస నా కేమరుపాటు వొడమకుండునట్లు సాయంపడె — వెండియు

ఉ. వీలగునప్పుడెల్ల మతవీధులుత్రొక్కుచు నిస్సమాన ధీ
శాలికి రాజచంద్రునకు సందియముల్ వెలిపుచ్చుచుంటి నా

గోల నుపేక్షసేయ కనుఁగుబలె నన్ననుఁగొంచు మంచిమా
ర్గాలకు నీడువందగిన కమ్మల నంపఁదొడంగె నాతఁడున్. ౯

వ. మఱియు నర్మదాశంకరకృతంబగు ధర్మవిచారము, మాక్సుముల్లరు వ్రాసిన 'హిందూదేశము మన కేమి బోధింపఁ గల'దను గ్రంథము, దివ్యజ్ఞాన సమాజమువా రాంగ్లీకరించి ప్రకటించిన యుపనిషత్తులు, మిగుల నాసక్తితోఁ బఠించితి-నీ వ్రాఁతలు హిందూధర్మముపై నా కత్యంత గౌరవ మేర్పడంజేసెఁ - గాని లాఁతిమతమ్ములదెస నాకపు డనాదరంబు వొడమదయ్యె - నపుడ వాషింగ్ట నిర్వింగురచించిన మహమ్మదుజీవితము చదివితి - నది తత్కథానాయకునెడ నా కభిమానము గూరఁజేసె - జొరాస్ట్రి బోధనమ్ములు సైత మానాఁడు పరిశీలించినాఁడ. ౧౦

క. ఏని ట్లలఁతిగ వలఁతిగ, నానామతశోధనం బొనర్చితిఁ దత్త్వ
జ్ఞానార్జనాభిలాషము, దానన్ వికసించె యోగతర్షము నొదవెన్. ౧౧

క. కృతు లరసినంత యోగో, న్నతి వశ్యముకామి నందు నా కబ్బిన పాం
డితి యల్పిష్ఠము భరత, క్షితి మెట్టినవెన్క యోగిశేఖరు నొకనిన్. ౧౨

క. సేవించి యోగవిద్యా, ప్రావీణ్యము పడవనెంచి పాతంజల మ
ప్డే విడిచితి నీనాఁటికి, నావల పీడేఱ కున్నయది విధివశతన్. ౧౩

వ. మఱియు నయ్యవసరంబునం దేను డాల్‌స్టాయిరచనల దీక్షమైఁ బఠించుచు నమ్మహామహుని 'వేదముల సందేశమేమి' మున్నగుకృతులు నాయుల్లమం దిల్లుగట్టుకొనియె-విశ్వప్రేమ మానవు నెంతయున్నతికిం జేర్చు నారహస్యంబు నానాఁటి కుగ్గడువుగా నెఱుంగఁగంటి-వెండియు నక్కాలంబునందు ౧౪

ఆ. ఏసుధర్మ మాశ్రయించుకుటుంబ మొ,క్కఁడు మిత్రమైనకతన దాని
వేడ్క నాదరించి వెడలితి భానువా,సరములందు వినుతిసదనమునకు. ౧౫

క. ఆసదనమ్మునఁ గాలిడు, నేసుమతమువారిబుద్ధి కీశ్వరచింతా
వాసనలే దైహికభో, గాసక్తియ జీవగఱ్ఱయగు వారలకున్. ౧౬

గీ. అకట! వాహ్యాళి కేతెంచినట్లు వారు, గుడికివచ్చెద రిట్టిపోకడలు చూడ
సిగ్గు గురువులువాఱెఁ దూఁ గగ్గలించె, నేవ క్రోళ్ళుబ్బ నా కట కేగుటన్న. ౧౭

వ. ఇట్లు ప్రార్థనామందిరమ్మువలనికిం జనుట దిగఁద్రావియు నా లంబితోడిచెలిమిం బాయనైతిఁ-గాని తలఁపనితలంపుగా నదియుఁ బరిత్యాజ్య మయ్యె-నెట్టులనఁ దత్కుటుంబిని ౧౮

క. శుచివర్తన యయ్యును సంకుచితాభిప్రాయములకుఁ గుదు; రాయమతోఁ
బచరింతు బహుళధర్మ, ప్రచయాంతరచర్చ నమ్రభావము వెలయన్. ౧౯

గీ. అనఘుఁ డార్యాల్డు ప్రాగ్జ్యోతి యనెడుపేరఁ, బలుకుపత్త్రము నాసాధ్వీపజ్జ నొక్క
తరుణమందు దేఁ బఠించుచోఁ దొరలె నేను-,మారజత్త్వారతమ్య మీమాంసచేఁత.

వ. అపుడు నే నామెతో నిట్లు పలుకరించితి. ౨౧

గీ. జననిరో బుద్ధగౌతము జాలిపెంపుఁ, గంటివే యది మనుజవర్గమ్ముఁ గడచి
కాలసర్పమ్ముదరికి వ్యాఘ్రమ్ముదెసకు, గునుకుపెట్టె సర్వప్రాణికోటికడకు. ౨౨

క. నగుమొగముదాని నాతని, మొగుబుజమునమేఁకపిల్ల నెవ్వఁడు కని మై
సొగయ నతివేలకరుణా, పగా జనుస్థానమగుచు భాసిలకుండున్. ౨౩

క. సకలప్రాణివ్యాపక, మకలంకం బీదృశంబు ననుకంపను గ్రీ
స్తుకడం జూతుమె నావుడు, నకటా! నాపలుకు నొంచె నాయమ్మహృదిన్. ౨౪

క. ఆకందువ పసివట్టితి, నీకథ కారాత్రికమ్ము నిచ్చితి నయ్యె
వాకులు నొడివితి నవ్వల, నాకె ప్రసాదించువిందు నడఁకువఁ గొంటిన్. ౧౫

వ. ప్రత్యాదివార మరుదెంచి మా యాతిథ్యముం బాటింపుమని యెన్నఁడో న
న్నీకుటుంబమువా రర్థించుటం జేసి వీరివిందుల కింతకుమున్న యలవాటువడితి -
నానాఁడు మాపంక్తియం దైదేండ్ల యీడుగలపసివాఁ డామెకొమరుండు నగు
మొగమ్మువాఁ డొకఁడు కూర్చుండి మెసవఁజాగె - నంత ౧౬

గీ. అతనితో ముద్దుముచ్చట లాడుకొనుచు, నారగించుచునుంటి నాహార మపుడు
కందుహరివాణమునఖంగుఖంగు చునుచు, మొరసె నొకయెంపముక్క నద్దొలిసెనేవ.

గీ. అంతఁ బసివాని నవ్వి నాచెంతనున్న, బదరికాఫలముం జూపి యిదిగొ దీనిఁ
జూడు మోచిట్టిపాపఁడా చూడు మెంత, చక్కఁగా నున్నదో చియ్యముక్కకంటె.

గీ. అనుటయుం జిక్కవెన్నెల నవఘళించు, డెందమునచిన్న పల్కులో సందడింప
నిజమ నీవాడువాక్యంబు నిజమ యంచు, ముద్దుఁగుఱ్ఱఁడు నామాట పెద్దచేసె. ౨౯

వ. కాని యీసల్లాప మాకొండొకతల్లికి దుర్భరసంతాపకారి యగుడు నాసవ్వడి
నెఱింగి యే నించుక మేల్కొని వైళంబ విషయాంతరము నందుకొంటిఁ -
దరువాతిరవివాసరమ్మునఁ గొతుకుచుం గొతుకుచు వారియిల్లు త్రొక్కనపదంపడి
యయ్యిల్లాలు నన్నుంగని ౩౦

క. నీనేస్తము నాబిడ్డకుఁ, గానిది సు మ్మితఁడు పిశితఖాదనవిముఖుం
డై నన్నుఁ బూఁటపూఁటకు, నానావేదనలపా లొనర్చెడి నకటా! ౩౧

క. నీకఱదలు వల్లించుచు, నాకొసఁగుము పండ్లటం చనారతముగ న
ఱ్ఱాఁకలుపెట్టెడి నీతని, నేకరణిన్ సైఁతుఁ బెద్దయిడుమయ వచ్చెన్. ౩౨

క. ఆమిషము న్దినకుండిన, నామయముల్ కవియుఁ దెంచు ననఁ గాని నిజ
స్థేమమ్ముఁ బాసి వాడిన, తామరతూఁడై నిసుంగు తక్కువపడఁడో ? ౩౩

క. ఏ నెట్టులోర్తు దీనికి, నేనాఁడున్ బిడ్డ కిట్టిహితములు గఱపం
బూనకు వీనిం జెఱుపకు, నీనేర్చినచదువు మాక నేర్పుము తండ్రీ ! ౩౪

వ. నావాక్కు లన్యథాకరింపకు మనుడు నే నగ్గరిత న్జూచి ౩౫

గీ. తల్లిరో ! నాప్రమాదము న్దలఁచి తద్ద, వనరుచున్నాఁడ నంజిక న్మునిఁగినాఁడఁ
దానునుం బిడ్డలను గన్నతండ్రి నగుట, నెఱుఁగుదుం దల్లిదండ్రులహృదయసరణి.

క. నానేర్పు నీతికంటెను, నానడవడి బిడ్డమదికి నాటును దిరమై
కానం గ్రవ్యము నంటని, యే నిచటకిరాక మానుటే లెస్సయగున్. ౩

గీ. దీన మననెయ్యపుందీవ తెగదు నీకు, నిట్టివేదన లికమీఁదఁ బుట్టనేర
వనుడు నాసాధ్వి నీచెప్పునట్టి తెఱఁగు, కడు సమీచీనమని వేడ్కయడరఁబల్కె.

* * *

౨౩ గృహవ్యవస్థ

వ. కాఁపురం బీడ్చుట యన నాకింతకుము న్నలవాటులేనికార్యంబు గాకున్నను నా లండనుబొంబాయిమన్కికిని నేటాలునందలియున్కికిని వేఱడమ్ముకలదిం దేనుహిందూ న్యాయవాదియు భారతీయప్రతినిధియు శివికిం దగుభంగి వెచ్చింపవలయుఁగాన

క. నగరిం జక్కనితావున, సొగసరిసదనమ్ము వడసి సుందరభావ
స్థగి తోపకరణములతోఁ, దగువిందులతోడ జీవితమ్ము నడిపితిన్. ౨

గీ. ప్రతికుటుంబమునం దొకబానిసీని, నిల్పు టనివార్యమగుఁ గాని నేఁటిదనుక
లెంకఁగా నరు నెట్లు పాలింపవలయుఁ, బాలకతయెట్టిదో కనఁజాలనైతి. ౩

గీ. అపుడు నాతోడ నొకమిత్రుఁ డప్పసమ్మ, పీఁటవెట్టెను; మఱియింటిబిడ్డవోలె
బానసీఁ డుండె నొక్కఁడు, మానివాస, మందె లేకరులున్ భోక్తలైనవారు. ౪

వ. మాకాఁపురంబు చక్కఁగా నడిచినదనియ వక్కాణింప నోర్తుఁ - గాని యిందుఁ గతిపయవిషమసంఘటన లేర్పడక మానలేదు - నాచెలిమికాఁడు బుద్ధిమదగ్రగణ్యుఁ డనియు విశ్వాస్యుఁ డనియుఁ దలంచినయేను దుట్టతుదకు విప్రలబ్ధుండనైతి-నెట్టులన

గీ. ఇతఁ డసూయకు లోఁగి నాయింట నిరవు, కొన్న లేనటి రాలుగా యన్న శంక
నన్ను వేధించునట్లు పన్నాగ మొండు, సంతరించె నుపాయకౌశలము మెఱయ. ౬

ఆ. ఆవులించునంతఁ బ్రేవులు లెక్కించు, గడుసు లేఖకుండు నన్నెఱింగి
వదలె నాదుకొల్వు పదపడి మాయింటి, చూరు దెసకు నిక్కి చూడఁ డయ్యె. ౭

క. అతనియెడఁ దప్పు గావిం, చితినొక్కొ యనుచుఁ బెద్దచింతించితి సి
కత యిట్టులుండ నెయ్యరి, బ్రతుకెల్లన్ విరిసి బైటఁబడె నొక్కతఱిన్. ౮

క. నాచెంగటఁ దాత్కాలిక, పాచకుఁ డపుడుండె వాఁడు పలువగఁ దుడుకుం
దోచినను వేల్పు నన్నుం, గాచుటకై పంపుదూతగా నచియింతున్. ౯

క. నాయెఱుకువకు న్వెలిగా, మాయింటన్ నడుచు నీతిమాలిన కార్యం
బీయాంధసికుఁడు తెలిసి మ, దీయాంధ్యముఁ జోపఁగా మదిం దలపోసెన్. ౧౦

గీ. మంచివాఁడని యెల్లరమాట విశ్వ, సించువాఁడని జనులునన్ జెప్పికొందు
రిట్టినాయింట నోర్వరానట్టికంపు, కవియుదెంచుట వాని కక్కజముగొల్పె. ౧౧

వ. కార్యాలయమునుండి ప్రత్యహమును రోహిణేయ కాలమ్మున కిలుసేరి సాపడుట
నానియమంబై యుండు - నిట్లుండ నొక్కనాఁడు కుతపకాలమునం దీబోనకాఁడు
ముచ్చెమటలతో నిట్టూర్చువాఁడు కార్యస్థానమ్మునఁ జేరి నన్నుం గని ౧౨

క. అక్కఱకల దొక్కఁడు మీ, రిక్కడ నే తేరవలయు నిప్పుడ యన్నన్
ముక్కు మొగం బిసుమంతయు, వక్కాణింపవ యిదెట్టి వల్లడి సెప్పుమా. ౧౩

గీ. ఏమి మునిఁగెనోయి యీయున్న మొలబంటి, పనులనెల్ల నొదుఁగఁబాఱఁ జేసి
యుఱుకుపెట్టవలయునో యంటి నవ్వల, నతఁడు మాట లేటి కనుచుఁ బదరె. ౧౪

గీ. అంత నతనిపల్కు నంకిలిపెట్టక, వెడలినాఁడ వానివెంట నింటి
కంటుకాఁడు నిల్చునఱ సూపి మీర యీ, తలుపుఁ దెఱవుఁ డని యతండు నొడివె.

క. గుట్టెల్ల నెఱిఁగి తలుపుం, దట్టితి మార్పలుకు రామి దార్ఢ్యము గొలఁదిన్
నెట్టితిఁ గొట్టితి భిత్తిక, లట్టిట్టై యటమటించె నడరెను ఱంపుల్. ౧౬

క. విచ్చెన్ వాకిలి గదిలో, ముచ్చముడిఁగి యుండె నొక్కమూలను వెలయా
లచ్చెలికాఁడును సగపాల్, చచ్చి నిలంబడియె నొక్కచక్కటి నిసిరో. ౧౭

క. పాదపాద మెన్నఁడు నీవీ, సదనంబునఁ గాలుమోపఁ జనదని పడుపున్
ముదియ నదలించి పంపితిఁ, బదపడి చెలికానిఁ గదిసి బాపురె! నిన్నున్. ౧౮

ఆ. నమ్మి చేలుపోయినాఁడ నావెంగలి, తనము నన్ను నింతదనుకఁ దెచ్చెఁ
జాలుఁ జాలు నీదుసంగతి గోముఖ, వ్యాఘ్రములు వసింపవలవ దిచట. ౧౯

వ. అనుటయు నతండు పశ్చాత్తప్తుఁడై బుద్ధి తెచ్చుకొంట మాలి వేగిరింపకు—నీ బ్రదు
కెల్ల వీధిపా లొనరింతు—నని నన్ను జంకెనచేయం దొడఁగె—నంత నేను జిఱునవ్వు
వెలార్చి ౨౦

క. చాటింపు మెల్లభూములఁ, జాటింపుము నన్ను నోరి! జడమతి! నాకుం
జా టన్న దున్న దఁటరా!, టాటోటుం బ్రదుకు నాకడ న్గల దఁటరా! ౨౧

ఆ. ఇచ్చవొడమినట్టు లేదేని గావింప, వచ్చుఁ గాని పాయవలయు నిచటు
నా నతండు రుద్రుఁడై నిప్పులుమిసె దు, శ్శకమ యయ్యె వానిఁ జక్కఁజేత. ౨౨

వ. అంత నేను గత్యంతరంబు కానరామింజేసి ౨౩

క. లేఖకు నంపితి రక్షక, శాఖాధిపుకడకు నంత శాంతార్భటుఁడై
నాఖరవృత్తిని సైఁచి ద, యాఖేలాలోలబుద్ధి వగుమని నన్నున్. ౨౪

క. చెలికాఁడు కొసరి గేహము, వలనన్ వెలువడియె గడుసువాఁ డితఁడంచుం
దెలిసియుఁ జేపట్టితి నా, చెలికారము వీని సవరచేయదె యంచున్. ౨౫

క. నాయాసలెల్ల నాఱడి, పోయెఁ గదా వీనిపొత్తు పోలనిదని మ
చ్ఛ్రేయోఽర్థు లెంతసెప్పినఁ, బాయనిమోహమ్ము నన్నుఁ బామరుఁ జేసెన్. ౨౬

వ. ఉల్లిమోక నమ్మల్లెపూలు పూవఁజేయఁ గడంగిన నా వేదుఱు నేమిసెప్పెదు—నైన
నియ్యకార్యంబు యుక్తసమయంబున నన్నుఁ బ్రబోధించె—నిది నాకన్న విద్వాఁడ
యేని యీచెడగరపునెయ్యంబున నం దొఁగి యమూల్యంబగు నాకాలంబు నిత
నికి రిత్తవెచ్చించి నేఁ డవలంబించిన యేకాంతజీవనమ్ము జోలికిం బోక వీనిచూ
పించిన దుష్పథమ్ము ద్రొలంబడి దిక్కుగాన కల్లాడుచుండెడివాఁడఁ—గాని ౨౭

క. ఏమానవుండు భగవత్, ప్రేమావృతు నెదిరిచి బాధపెట్టఁగఁ జాలున్
నామది పవిత్ర మగుటన్, సామి సదా నెరసులోర్చి సాఁకెను నన్నున్. ౨౮

మం. తొలకరియంద యీ దుస్సహంబైన, పరిణామ మొదవి మద్భావిజీవనముఁ
గుస్తరింపఁగ ననుకూలించె మిగుల, నీశ్వరుం డర్థిమై నీబోనకానిఁ
బ్రేవలే దనుచుఁ జెప్పెడివాఁ డెవండు, నానిద్ర విరియించి నన్నుద్ధరింప
వచ్చినహితుఁ డీ సువారంపువాఁడు. ౨౯

వ. అయ్యది యట్లుండె—నీ దుండగమ్ము బాహిరపోయిన వెంటన వంటరి నాసన్నిధి
కేతెంచి మీ రమాయికులు—పసివాఁడే నలవోక మిమ్ము వంచించు—నిట్టి
మీకొలు వభిలషణీయంబు గా—దొండు దెసకుం జనెద—ననుజ్ఞయిం—డని
న న్నుజ్జనచేసె—నయ్యవసరంబున ౩౦

ఆ. నన్ను మున్నువిడిచి చన్నట్టిలేకరి, కూళ యన్నతలఁపు గూరఁజేసి
నామనమ్ముఁ గలఁచె నీమిత్రిమే యటం, చెఱఁగి దుర్భరార్తి నెరిసినాఁడ. ౩౧

క. అతనిం బ్రిసన్నుఁజేఁతకు, శతధా యత్నంబొనర్చి సఫలత లేమిన్
వెతపాల వైతి నకటా !, యతు కతుకే యెంత దిద్దినప్పటికైనన్. ౩౨

* * *

౨౪ ఇంటికి

గీ. ఆఫ్రికాభూతధాత్రి నాయడుగు మోపి, సాగనంపినవాఁడ నగ్నత్రియమ్ము
తెలిసెఁ దత్‌తత్త్యులకు నస్మదీయతత్త్వ, మెఱుకపడె వారిజీవనం బెల్ల నాకు. ౧

ఆ. పాడిపట్టుపనులు పైకొనె నచ్చోటఁ, దీనసాఁగె భారతీయసేవ
పెద్దకాల మందుఁ బీఠమ్ముపెట్టఁగాఁ, దగినయవసరమ్ము దాపరించె. ౨

క. ఎక్కటిమనుగడ పెక్కులు, చిక్కులకు న్మూల మగుటచే భరతోర్విన్
ద్రొక్కి కుటుంబముఁ గైకొని, యక్కడికిం బోక సుఖద మగు ననుకొంటిన్. ౩

వ. మఱియు నాఫ్రికాభారతీయుల కడగండ్లు మాతృదేశంబున వెగ్గలంబుగాఁ బ్రక
టించి తదీయాదరంబు వడయుటకునైత మీపయనం బనుకూలించు నకాఁ దలంచి
వేయెనమన్నూట తొంబదియాఱగు శరత్తునడుమం జెలికాండ్ర నొప్పించి జాతీయ
మహాసభా,విద్యాపరిషద్వ్యవహారంబు లాదంజీమియాఖాన్,రుస్తుంజీల కప్పగించి
కాళీఘట్టమ్మన కేగుధూమనావ నెక్కితి-నందలిపథికులు కొందఱు నాసేస్తకాం
డ్రగుటంజేసి ౪

క. ఉరు దొక్కనికడ నొక్కని, సరసన్ దమిళంబు నొకనిసన్నిధిఁ జతురం
గరహస్య మభ్యసించితి, నఱవమ నా కప్పు డంటె నల్పాల్పముగన్. ౫

క. హిందూర్వి కేగినంతన, యందుం గొశలమువడయ నాసించితి నై
నం దైవయోగమున నా, కుం దీఱనిదయ్యె నాఁటికోరిక నేఁడున్. ౬

మం. ఏ నాఫ్రికాగడ్డ కెక్కినవెనక, నేర్చిన చదువెల్ల నిర్బంధమంద
యఱవమ్ము గఱచితి నాఫ్రికాబందె, నెరవాడలోఁ బఠియించితి నుదుదు
ధాటిమై మాటాడఁ దగునేర్పులేమి, నడుగునఁ బడుచున్న దఱవ మాపిసరు
కడుచింత గూరు నక్కథ నెత్తుకొన్న, నాఫ్రికారాష్ట్రింబులందుఁ గష్టించు
దాక్షిణాత్యులు నన్నుఁ దమజీవగఱ్ఱ, వడువున భావింత్రు వారెల్లప్రొద్దు
చెరలాడుచుంద్రు నాస్మృతిపథంబందు. ౭

ఆ. అఱువలొండె నొండెనాంధ్రులు నాకంటఁబడిననాఁడు వారిపట్టుదలయుఁ
ద్యాగపాటవంబు తలఁపునఁ బొడి సం, తోషవిస్మయములఁ దోఁగుచుందు. ౮

గీ. అక్షరాస్యులుగారు వా రాఫ్రికార, ణాంగణంబున నెఱజోదులై తెగించి
నట్టివారెల్లఁ జదువులో వట్టివారె, పొట్టకూటికి వఱువట్లువుట్టువారె. ౯

క. కపటచ్ఛాయ నెఱుంగని, సుపవిత్రుల వీరిమనసు చూఱాడఁగ నా
కపు డాఁకరాద భాషా, విపర్యయం బెంత విఱ్ఱవీఁగుచునున్నన్. ౧౦

క. అందదుకుగ నాంగ్లేయము, హిందూస్థానియును వార లెఱుఁగినకతనన్
బొందుపడెన్ మాపను; లి, బ్బందులు రావయ్యె నెట్టిపట్టులనైనన్. ౧౧

వ. కాని దాక్షిణాత్యులు నాయెడంజూపు గారవమ్మునకుఁ బ్రీతిగా నేను దమిళముం జదువనెంచి యించుక సఫలతఁ గంటి—నవ్వాల భారతదేశంబునఁ దెలుఁగుబాస నభ్యసింపఁ బూనితిఁ—గాని తత్ప్రయత్నము వర్ణసమామ్నాయముం గడచి యవతలకుఁ బోనేరదయ్యె—నిట్లు ద్రావిడాంధ్రములు చాలినంతవట్టు నా కబ్బ నదృష్టము కలుగదాయె—నిఁక ముందేని కలుగదని తలంతుఁ—గాన దాక్షిణాత్యులు కామక హిందూస్థాని నేర్తురను బాఢవిశ్వాసంబుతో నున్నాఁడ—నాఫ్రికావాసు లగు ద్రావిడు లించించుక హిందీ నెఱుంగుదురు—కాని తమనేర్చి నాంగ్లభాష కెక్కడ ముప్పువాటిల్లునో యన్న భయమ్మున నింగిలీసుఁ గఱచినవార దేశభాషల పట్ల నౌదాసీన్యముంజూపుదు—రది యట్లుండె. ౧౨

గీ. అపుడు మానావికునిచెల్మి యమరుకతన, నాతఁ డాత్మవిచారార్థి యగుటకతనఁ
గడలిపయనంపు సుద్దులకంటె బలిసి, నడిచె నాధ్యాత్మికాభాషణములు మాకు.

క. నీతికి నెఱుకకు వింగడ, మీతఁడు వచియించు నేసునెడ విశ్వాసం
బేతఁడు నిల్పునో యాతఁ డ, పేతాంహస్థితి యటంచుఁ బేర్కొనుచుండున్. ౧౪

వ. నీతికిం దగుతగములు నిర్ణయించుమతం బతని దృష్టిలో రిత్తమతంబ—యీ గొడవ కెల్ల నా యాకుబువ్వనేమంబ నిదాన మాయె—నన్నతం డెఱచి నేలతినవని నిందించుఁ—గూరగాయలంబలెఁ బసుపక్షులసైత మీశ్వరుండు మానవుతిండి కొఱకుఁ బుట్టింపఁ డెట్లని వాదించు—నిట్టి చర్చలు మమ్ము లోఁతులకుం గొంపోయెఁ—గాని యెవనిదారి వానిద—నీతిధర్మంబుల కరమరిక లేదని యొడ పెద్దయుఁ గలదని యేనును సిద్ధాంతము లొనర్చితి—యివ్విధంబున నయ్యాయి ముచ్చటల న్మనుఁగుచు నానందపరసీమలం ద్రొక్కుచు ౧౫

క. ఇరువదియు నాల్గునాళ్లకు, నురలుచుఁ బింపిళ్లుగూయు హుగ్లీనదిసాం
పరయుచుఁ గాళీఘట్టముఁ, దఱిసితి మాత్రవనిఁ గాంచి తనిసితి నాత్మన్. ౧౬

వ. ఆనాఁడ ధూమశకట మెక్కి బొంబాయినగరమ్మునకుం బయనము సాగించితి.

* * *

౨౫. హిందూదేశమున

గీ. దారినడుమం బ్రియాగమ్ము తగిలె నచట, బండి ముక్కాలుగంటసేపుండుఁ గాన
రాణకెక్కిన తన్నగరంబు చూడ, నౌషధం బొండు విలువఁగా నరిగినాఁడ. ౧

వ. అయ్యాయితావులు పరికించి మందుఁగొని వచ్చునంతలో శకటంబు మెలమెల్లఁ జాగుచుండె - నంచెకాపరి మంచివాఁడగుట బండి నొక్కనిముస మాఁచెఁగాని నా యెడ ఔడ కానిపింపమింజేసి నామూఁటముల్లెలఁ బదిలించి యుంచె - నవ్వల నే నొక్కపూఁటకూటింట బసపెట్టి యాంగ్లేయుఁడు పయొనీరుపత్రికాసంపాదకుఁడు నగు చేజనీ కుఱ్ఱఁగటికిం జని నేటాలుభారతీయులంగూర్చి నాపంపువార్త లాదరింపుము - ధర్మవ్రతక్క వేఱొండు నా కింపితము గాదని పలుకుడు నుచితమగు సాయంబొనర్తు నని యతండు నన్ను గారవించెఁ - బదంపడి రామణీయకరాశి యగు త్రివేణీసంగమమ్ము నాప్యాయముగాఁ దిలకించి భావికర్తవ్యాలోచనములతో నాఁటిరేయి గడపి ౨

క. వఱువాత లేచి బొంబయి, పురమ్మునన్ డిగుట కిచ్చపుట్టమిని సరా
సరి రాజకోట కేగితిఁ. గరఁగితిఁ బ్రియబంధుకోటిఁ గనుకలిచేతన్. ౩

గీ. ఆఫ్రికాభారతీయ బాధావమాన, దర్పణంబుగ నలఁతిపొత్తంబు నపుడ
వెలువరించితి వదనంపువెలుఁగుఁ బట్టి, పచ్చపుస్తకమని పేరుపడియె నద్ది. ౪

మం. భారతక్షోణిలోఁ బ్రథితిగన్నట్టి, యఖిలపత్రికలకు నద్దాని నంపఁ
బయొనీరుముఖ్యసంపాదకుఁ డైన, చేజనీ మునుముందు చేసెఁ దద్వ్యాఖ్య
తత్పిండితార్థమ్ము తరలెను సీమ, కద్దానిసారాంశ మాఫ్రికా కేగె
నేటాలునందు వన్నియ కెక్కినట్టి, యెల్లపత్రికలందు నిది యచ్చుపడియెఁ
జినపెద్దటీకలు చెలరేఁగె దీని, కాఫ్రికామన్కి నా కగపడ్డచెడ్డ
కడగండ్ల కిదె మూలకారణం బయ్యె. ౫

ఆ. బొబ్బజాడ్య మపుడు బొంబాయినగరాన, వేమొగాలతోడ విస్తరిల్లె
నెచటవిన్నఁ గన్న నేడ్పులు పీనుగులే, ప్రళయరుద్రునాటపాటవములె. ౬

వ. రాజకోటయు నిమ్మహామారిపాలఁ బడునో యని యే నపుడు బీతుకుడిచి యనామయాపాదకకార్యంబులందు నానేర్పు పెద్దదియగుటంజేసి నాసేవ నంగీకరింపుఁ డని దొరతనమువారిం గోరుడు వారు నన్ను రోగపరిశీలకవర్గంబునం దొకసభ్యునిగా నియమించిరంత ౭

ఆ. మఱుఁగుదొడ్లు తద్ద గరగరగా నున్కి, వలయుఁ గాన వాడవాడ కేగి
చాటుపెరడులుండుసందుల గొందులఁ, గంటి సభ్యులెల్ల వెంటనడువ. ౮

క. తమదొడ్డులు చూడ నిరో, ధముసెప్పక పేదవారు తద్దయుఁ బేర్మిన్
మముఁ జూచిరి మాచెప్పిన, సమస్తసంస్క్రియ లొనర్పఁజాగిరి దీక్షన్. ౯

క. ధనవంతులు తమపెడలిం, గనుఁగొంటకు నిచ్చగింపక మము న్గడుఁ జు
ల్కనగాఁ జూచిరి యిఁక మా, వినిచెడిహితవాక్కు లెట్లు విందురు వారల్. ౧౦

ఆ. ఎట్టకేని దానియీగడఁ బరికించి,ఘోరనరకబాధఁ గుడిచినాఁడ
గాలు తేమ క్రిములు గాఢాంధ మింకేమి,పేరుకొందు వారిపెరటిరోఁత. ౧౧

ఆ. ఇలకు నంటనీక మలమూత్రముల నయః,పాత్రమంద విడిచి పవనమునకు
వెల్తురునకుఁ దగినవీలిచ్చుచో దొడ్డి,హానిసేయఁజాల దంటి నప్డు. ౧౨

గీ. అవల మాతంగవాటిక కరిగి మాల, మాదిగలదొడ్లఁ గన నాకు మనసుపోయె
సాటిసభ్యుల కీకాంక్షఁ జాటినంత, నద్భుతం బనిదంపూర్వ మవతరించె. ౧౩

క. తుట్టతుద కొక్కసభ్యుం, డెట్టో తనవెంటరాక కిష్టంపడియెన్
మొట్టమొదలుగాఁ గన్గొని, కట్టబ్రంపడితి మాదిగలగూడెంబున్. ౧౪

క. వెలివాడవారలు న్నను, దిలకించినయంత నడరి దిగ్భ్రమపడి ర
వ్వల మీమఱుఁగుంబెరడుల, కలరూ పెఱుఁగంగ నేము కడుకొనువేడ్కన్. ౧౫

క. వచ్చితి మని యే నన మే,మెచ్చట మలమూత్రశాల లెచ్చట దైవం
బిచ్చినబయళ్ళకుం జని, నిచ్చలు శకృదార్తి మేము నీఁగెద మన్నా! ౧౬

క. మిముబోఁటి నాగరికులకు, రమాకృపాలబ్ధ సుఖపరంపరులకుఁ గా
క మలీమసులకు దారి,ద్ర్యమగ్నులకు నెట్లు మఱుఁగుతావులు చిక్కున్. ౧౭

వ. అని నమ్రతాదైన్యంబులు విరియ వారు మాఱుపల్కిరంత నేను ౧౮

క. మీయిండ్లఁ జూడ నొప్పెద,రా యనుడుఁ గొంకచేల రండీ కనుఁడీ
మాయిం డ్లొకయిండ్లా యుసి,రో యెలుకలకొంప లెల్లరోఁతలగంపల్. ౧౯

క. అని వార లాడి రంతట, జనంగములు నిల్చుపెక్కుసదనంబుల నేఁ
గనుఁగొని వానివెలందికి, ననూనవిస్మయము హర్ష మందినవాఁడన్. ౨౦

మం. కలయంపిఁ జల్లి చక్కఁదనాలు నిక్క, జిలుఁగుముగ్గులు రచించిరి చత్వరముల
గోమయమ్మునఁ గొత్తకొత్తగా నాల్గు, దెసల గోముఖమును దీర్చి రింటింటఁ
గుండలు చట్లు మూఁకుళ్ళు సానికలు, ముంతలు పిడతలు మొదలైనయట్టి
మృన్మయపాత్రముల్ మెఱుఁగులు క్రిక్క, చందానఁ దోమిరి చండాలకాంత
లిచ్చోటికిం జీడ లెట్లురానేర్చు, నేల మామేల్కొల్పు లిచటివారలకు. ౨౧

వ. అయ్యది యట్లుండె-నంత మాస్వచ్ఛందసేవకసంఘము రాజకోటం గల చైత్యంబులసైతము పరికింపఁబూని మున్ముం దొకవిష్ణ్వాలయమ్ము నావేశించె-నందలి ప్రధానార్చకుఁడు మాకుటుంబమిత్రుఁ డగుటం జేసి ౨౨

క. గుడినెల్ల మాకుఁ జూపఁగ, నొడఁబడె నాతండు మా హితోక్తులనెల్లన్
దడయక పాటించెద నని, కడుమక్కువఁ జూపె సాధుగణ్యుం డగుటన్. ౨౩

క. అతఁడు నెఱుంగనికసటుం, బ్రతు కిడ్చుచునుండె నొక్కప ట్టాగుడిలోఁ
జితచితలాడెడు నెంగిలి, మెతుకులపుల్లియలు ముఱిగి మెండుకొనంగన్. ౨౪

క. పావిత్ర్యనిలయ మనుకొను, దేవళమున గాలు కవియుదెంచుట నస్మ
ద్భావమ్ము కలఁగి దుఃఖ, ప్లావితమై నాఁడు నన్ను బాధించెఁ గడున్. ౨౫

వ. కోవెల యనం బరిపూతక్షేత్రంబనియు నందు శౌచవిధి నతిజాగరూకతమైఁ బాటింపఁదగు ననియు మనతలంపు-ధర్మతత్త్వవేత్తలు లో నెలి వెలందితనము కామక వలయు నందురు-కాని దేనిదారి దానిద యయ్యె. ౨౬

* * *

౨౬. రాజభక్తి శుశ్రూషలు

మం. పరిపూతమగు రాజభక్తిలో నన్ను, దొరయువారలు జగత్తున లేరు లేరు
సత్యమ్ముదెస నాకు సహజానురాగ, మెలయు శేతద్భక్తిహేతువై యుండు
మెఱమెచ్చులకు దీని మెఱయు శే నెఱుఁగ, నాఫ్రికాధాత్రి నాయరుదెంచునట్టి
ప్రతిసదస్సున రాజభక్తిగీతమ్ము, వినిపించు గాయకవితతితోఁ గలిసి
తత్కృతిం బాడితి ధర్మ్యం బటంచు. ౧

క. నా యెఱుఁగనిదోసము లాం, గ్లేయులరాచఱికమందు లేవైనను ద
ద్దేయంబును మన్నించుట, చేయందగుచేఁత యని వచింపఁగ నోర్తున్. ౨

వ. ఆనాఁ డాంగ్లేయరాజనీతి సౌఖ్యదాయకం బనియు నాఫ్రికాయందు సాక్షాత్కరించిన వర్ణద్వేషము దేశకాలానుసారిగాఁ బొడమినద కాని తెల్లవారి సహజలక్షణంబు కాదనియు విశ్వసించితిఁ-గాన 3

ఆ. అవనినాథభక్తి నాంగ్లేయుల స్మట్టు, మిగిలి తాళ మరసి మేళ మెఱిఁగి
దొరల్లు పల్కుపలుకుతోఁ గంఠము న్గల్పి, పాడినాఁడ రాజభక్తిగీతి. ౪

క. అక్కఱ పొసఁగినవేళల, నిక్కెఱుఁగని రాచబత్తి నెఱపితి దానిన్
రొక్కమ్మునకును మెప్పుల, కొక్కపుడే నమ్మకొంట కొడఁబడ నైతిన్. ౫

వ. ఏను మాతృభూమికిం జేరినవెన్క విక్టోరియా రాజ్ఞీ హీరోత్సవకార్యక్రమ మారబ్ధమయ్యె – నేతన్మహో నిర్వహణమ్ముపొంటె రాజకోటయం దేర్పడినదళమునం దేను బాల్గొని యథాశక్తి నిర్వ్యాళీకంబగు ప్రభుభక్తిం బ్రకటించితి – వెండియు మాబాలురకును రాజకోటబోధనాభ్యసన కళాశాలా విద్యార్థులకును రాజభక్తి గీతమ్ము నేర్పితిఁ – గాని యహింసాధర్మపరిశీలనమ్ము ముమ్మరమై వాఙ్మనసముల దెస జాగర్య హెచ్చినకొలఁది నా కీకృతియం దాదరమ్ము దొలఁగె – నెట్టులన నందలి ౬

క. రాజద్వేషులఁ గుణప స, మాజంబునఁ జేర్చు మట్టి మాయావుల దు
ర్వ్యాజమ్ము లడఁపు మను నుడు, లేఁజెల్ల! మదీయబుద్ధి కింపని వయ్యెన్. ౭

గీ. ఏలికకు దాయలైనవారెల్ల ధూర్తు, లగుదురో దోషమంతయు నగునె వారి
దీశ్వరుఁ డొకండె చాలువాఁ డిట్టియెడల, నితఁడు దండ్యుఁడు నిర్దోషి యితఁ డనంగ.

వ. ఈకృతింగూర్చి నాకొదవిన సందియమ్ములనెల్ల నా నెచ్చెలియు భిషఙ్మణియు నగు బూథునకుం దెలుప నతఁడు నాయాశయముం బెద్దచేసి యహింసానిరతి గల వాని కిప్పాట సూత్రపడ దని సందేశించె–మరియు ౯

గీ. ఆఫ్రికాభారతీయ దైన్యమ్ముగుఱిచి, కోటలోఁ గరపత్రమ్ము గూర్చునాఁడు
తగినతావుల కేగి యేతత్సమస్య, రచ్చలోఁ బెట్టవలయు న న్నిచ్చవొడమె. ౧౦

క. మునుముందుగ బొంబాయికిఁ, జనుదెంచితి న్యాయమూర్తిసత్తము రెనడేఁ
గనుగొంటి నతఁడు నాప, ల్కినవిన్నపమెల్ల నాలకించెను గరుణన్. ౧౧

గీ. అతనియట్ల నన్నుఁ దయాబ్ధి యాదరించె, నిరువురు న్మెహతాచెంత కేగుమనిరి
పెద్దతగవర్లె యిట్లు సెప్పినకతాన, నాకు మెహతామహత్త్వ మంతయును దెలిసె.

ఆ. అంత నతనిచెంత కరిగితి సాధ్వసా, విష్టమైనమనసు వెనుక కీడ్వ
బొమిడికమ్ములేని బొంబాయిసమ్రాట్టు, కొమరునట్లు నన్నుఁ గూర్మిచేసె. ౧౩

వ. మఱియు నమ్మెహతా యిట్లనియె. ౧౪

క. నీయుద్యమంబు విశ్వ, శ్రేయోవహ మది కడుం బ్రసిద్ధి గడింపన్
జేయఁ దగు నిచట నొకసభ, నాయొప్పినతోడుపాటొనర్చెద నీకున్. ౧౫

క. బొంబాయిసింగ మీసర, ణిం బల్కి సభాదినంబు నేమించి ప్రసా
దం బార నన్ను నంపుడుఁ, బంబినహర్షమ్ముతోడ బసకుం జనితిన్. ౧౬

క. ఆవలఁ దత్పురిఁ గల మా, బావను దరిసించుపొంటెఁ బయనించితి రో
గావలికిన్ వసపడి నా, నావేదన లందుచుండె నాఁ డతఁ డకటా. ౧౭

ఆ. అతఁడు నిస్పృహుఁడగుట నస్మత్సహోదరి, యూడిగంపువేగుఁగు నోర్వలేమి
నరసి రాజకోట కరుదెమ్ము నా నియ్యె, కొనియె భావుకుండు కొంకులేక. ౧౮

ఆ. అంత నాలసింప కక్కతో బావతో, నరిగినాఁడఁ గాణయూచి కెంద
తెన్నిమందు లిడిన నెదిర్చి తదోగంబు, ముదిరెఁ గాని సుంత బెదరదయ్యె. ౧౯

క. బావన్ నావసియించెడి, యోవరిలో నిల్పి యెల్ల యుపచారములన్
గావించితి రేయుం బవ, లావంతయు విసువులేని యాదటతోడన్. ౨౦

క. కనుమూఁత లేక వేళకుఁ, దిను లెఱుఁగక సేవచేసితిం బావకు ని
ప్పనిలో నేటాలుసమ, స్యను మఱవక యుంటి గ్రంథసంధాయకతన్. ౨౧

ఆ. ఎంతపడిన దైవ మెడపెట్టె భావుకు, దుర్గమార్తి జలధిఁ దోఁచె నన్ను
బావ నట్లుకోలుచుభాగ్యంబు కల్మిచే, నపుడుకొంతదుఃఖ ముపశమించె. ౨౨

గీ. తెగులుగొంటుల కిట్టు లూడిగముసేయు, కోర్కె నానాఁటికే న్నాకుఁ గొనలుసాఁగె
నేత దుపచారములమీఁది ప్రీతికతనఁ, జుల్కఁజేసితి నాకొకట్టు సొంతపనులు. ౨౩

వ. అపు డప్పు డిట్టిచాకిరిసేఁతకు నాయిల్లాలిన కాక మాకుటుంబమువారినెల్ల నియో
గించువాఁడ-నొకనిసంతుష్టికై కాక డంబము వలచియుఁ బ్రజాభిప్రాయమునకు
వెఱచియుఁ గావించుసేవ నిరర్థకము-యది సేవకునాత్మోన్నతి నడంచు నూడిగం
బెయ్యది హృది నానందితముఁ గావింపఁజాల దయ్యది కొలువుకాని కర్ధదాయ
కమ్ము కామియ కాక సేవ్యునిసైతము సుఖితుం జేయనేరదు-మఱియు ౨౪

ఆ. చిత్త మెప్పు డార్తసేవావిధానమ్ము, మరగి తాఁ బ్రమోదమగ్న మగునో
యపుడ భోగజాల మర్థమ్ము వైయర్థ్య, భాజనం బటన్న భావ మొదవు. ౨౫

* * *

౨౭ బొం బా యి స భ

క. మాసోదరిభర్త మముం, బాసినమఱునాఁడ దుఃఖభారము నెట్లో
త్రోసిచనితిన్ సభాదిన, మాసన్నం బగుటఁజేసి యలబొంబయికిన్. ౧

వ. మోహాతా మున్ను మొదలపెట్టినట్లు సభాపూర్వదినంబున నతనిం గంటి - నప్పు
డప్పేనుమానిసి ౨

గీ. వ్రాసి తెచ్చితె నీయుపన్యాస మెల్ల, గాంధి! యది యెన్నిపొరటల గ్రంథమయ్యె
ననుడు నంజుచు నంజుచు నాశుఫక్కి, నొడువనెంచితి నంటి రాల్పడ నెలుంగు.

వ. అంత ఫిరోజిషామెహతా విస్మయంబు నభినయించువాఁడు నన్నుంగని యిట్లనియె.

క. తగ దీతెలుంగు తగ దీ, నగరంబున వార్తలంపు నడవడి కలవా
రెగుడుదిగుడు కవనంబుల, కగపడరో వాఙ్ముఖంబు నచ్చొత్తనిచోఁ. ౫

గీ. వ్రాయు మిపుడేని బిరబిరవ్రాయు మెల్ల, పొట్లువడి తెల్లవాఱులోపలన దాని
నచ్చువేయింపవలయు నిట్లైననాఁడె, యంతయో యింతయో ఫలం బబ్బు సభకు.

గీ. అనుటయుం దెల్లఁబోయి గత్యంతరంబు, లేమి శరవేగమున నాదు లేఖనంబు
పూర్తిగావించి ముద్రణంబునకుఁ దార్చి, పవ్వళించితి గుండియబరువు డించి. ౭

గీ. తెల్లవాఱె సభాకాల మల్ల వచ్చె, నచ్చెరువుగొల్పె నా క మ్మహాసదస్సు
కొలువుచెవి కంటదాయె నాపలుకుపల్కు,నడుఁకుచుం బెంచినాఁడఁ గంఠస్వరంబు.

గీ. ఇంక నెత్తిలి భాషింపుమీ యటంచుఁ, దఱుమఁగాఁ జాగె న మ్మెహతామనీషి
యెంతగా నన్నతఁడు ప్రోత్సహించినాఁడొ, యంతగా స్రగ్గఁబాఱె నాగొంతురవళి.

వ. పదంపడి నాచిరంతనవయస్యుఁడగు కేశవరావు నన్నుద్ధరింప సభనుండి లేచివచ్చె-
నతని యెలుంగు గంభీరమైనది - కాని సభ్యులు 'వాఛా'ను వలచుటంజేసి నాపని
నతండు విన్నాణముగా ముగించెఁ - బరిషత్తు వింజ మ్మాఁకపెట్టిన ట్లయ్యె -
సదస్యులు నాయుపన్యాసము నిమ్మగుల మెచ్చిరి - కాన నా కెనలేని యానంద
ముదయించె - వెండియు నయ్యవసరంబున ౧౦

క. నాయకరత్నము మెహతా, నాయుక్తులఁ బెద్దసేయ నా కది గంగా
తోయమునయందు బ్రుంగిన, తోయమున నోమ్రవరాని తోషముఁ గూర్చెఁ. ౧౧

వ. మఱియు నానాఁడు మన్మిత్రులగు ధర్మవాదులు మువ్వు రాఫ్రికాకు విజయంచేసి
నాయుద్యమంబునకు బాసటయౌదు మని బాసయిచ్చిరి-కాని యయ్యాయి నిరో
ధమ్ములకతన వారు నన్నాదుకొనలేకపోయి-రంత నేను బొంబాయినగరంబును
గాలించి గాలించి నాసీమచెలికాఁడగు పేస్తనజీని గన్గొంటి-నితఁడు ౧౨

క. అసమానశేముషీ సా, రసమగ్రుఁడు ధర్మవాదిరత్నము; శాకాం
ధసులకు గావున మాకుం, బొసఁగెను జెలికార మాంగ్లభూవాసమునన్. ౧౩

గీ. కోవిదుఁ డతండు ఘూర్జరకోశరచన, కగ్గపడె నప్పు డుభయభవ్యప్రసంగ
మైనయంతన పేర్మిమై నాఫ్రికాకు, వచ్చి తోడ్పడవో యని వాని నంటి. ౧౪

గీ. అతఁడు నా కణుమాత్ర సాయం బొనర్ప, నొల్లమియ కాక నను సైత మల్లగడ్డ
కరుగఁ దగదంచు నెచరించె భరతభూమి, లేదె మనసేవ కని మూదలించి పలికె.

వ. వెండియు నచ్చెల్మికాఁడు నన్నుంగని ౧౬

గీ. మాతృభాషాభివృద్ధికై మన మొనర్పఁ, దగినపను లెన్ని లేవు? సంతతము ప్రబ్బి
వచ్చు పాశ్చాత్యవిజ్ఞానవైభవంబు, తెల్ల మొనరింపవా జనుర్దేశమునకు. ౧౭

ఆ. ప్రకృతిశాస్త్రమునకుఁ బరిభాష లేను శో, ధించుచుంటి నిపుడు తెఱపి లేక.
మంద లనియ లేని మత్కార్యభూమిలో, వింటివా యిదెంత వీసమంత. ౧౮

ఆ. కోట్లకొలఁది ప్రజలు కూటికి గుడ్డ క, ల్లాడుచుందు రిందుఁ జూడవొటు?
చదువు లేక హృదయసామరస్యము లేక, సంఘ మడుగుపట్టుజాడఁ గనవొ, ౧౯

ఆ. భారతీయు లాఫ్రికారాష్ట్రముల స్రగ్గి, మ్రగ్గిపోవుచున్నమాట నిజమ
కాని నిన్నువంటి కలికరి వారికై, మీఁదుకట్టుకొంట మెచ్చుగాదు. ౨౦

క. మునుముందు కదలి భారత, జనయిత్రీదాస్యపీడఁ జంపఁగవలయున్
వెనుక నలవోకగా ల,గ్గొనరు న్మనవారి కెచట నున్నను గాంధీ! ౨౧

క. నీతత్త్వము నవరించుట, బ్రాఁతి యటం చెఱుఁగుదును భవాదృశులైనన్
నీతో నేటాలుగడ్డకు, నేతేరక యునికి తనకు నెంతయు నించున్. ౨౨

వ. అనుటయు నతనిహితవాదము నన్నసంతృప్తిపా లొనరించెఁ—గాని యీ సల్లప
నమ్ముకతనఁ జేస్తనజీపట్ల నావెలారెంచుపెంపు పొంపిరివోయె—నతనిదేశాభిమాన
మునకు భాషాభిరతికి లెస్సపొంగితి—మానెయ్యం బీప్రస్తావమునం జేసి మిగుల
బిగిసె—నైన నప్పుడు ౨౩

క. నేటాలుభారతీయుల, కూటువకుం గొలువుసల్పుకోరిక నాకుం
గాటంబై కృష్ణుని యీ, మాటలు నాయుల్లమందు మల్లడిగొనియెన్. ౨౪

మం. పరధర్మమును లెస్స పాటించుకంటె, నిజధర్మ మెట్టిదేని భజించు టుఱవు
తనధర్మమునఁ జావు తద్దమే లిచ్చుఁ, బరధర్మమునకొల్పు భయకారణంబు. ౨౫

* * *

౨౮ పూనాలో

క. బొంబాయి నెడసి పూనా, కుం బోయితి లోకమాన్యగోకులు లచటం
బంబినకీరితి నిరుప, కుంబులఁ బాలించుచుండ్రు సౌజన్యనిధుల్. ౧

వ. ఏను దొలుతొల్త బాలగంగాధరుం గదిసి వినీతుండనై ౨

ఆ. అన్ని తెగలవారి యాశీస్సు లర్థించి, యిచటు బ్రొక్కినాఁడఁ గృప వెలార్ప
మనుడు లోకమాన్యుఁ డమ్మాటమెచ్చి నీ, పనికి నెల్ల రిష్టపడెద రనియె. ౩

గీ. రాజకీయప్రపంచ దూరస్థితుండు, సభకు నధ్యక్షుఁ డగుట యాశాస్య మందుఁ
బూజనీయుఁడు సడిసన్నబుధుఁడు రామ,కృష్ణభండార్క రర్హుఁ డీకృతికి ననియె.

ఆ. సభల నిపు డతండు సన్న్యసించెన కాని,యీకొనంగవచ్చు నిట్టికొలువు
నతనిఁ గన్న వెనుక నరుదెంచి ఫలితాంశ, మెఱుకసేయు మనియె బుద్ధబుద్ధి. ౫

క. గోకులుఁ జూడుము గాంధీ !, నీ కక్కఱ వాడమెనేని నిర్భికుఁడవై
నాకడకు రమ్ము వేసట,నా సహాయుండ నౌదు నలి ననిపల్కెన్. ౬

వ. అంత నిట్టియుదారుం డగుటన బాలగంగాధరుఁడు లోకమాన్యుఁ డయ్యె-నితఁడు
ననుబోఁటి ప్రత్యగ్రపరిచితు నింత గారవించునే యని యే నక్కజంపడుచు ఫెర్గుసన్
కళాశాల నున్న గోపాలకృష్ణుని సన్నిధికిం జనుడు నమ్మహామహుఁడు నన్నుఁ
దనవానిఁగాఁ బ్రేమించి నూత్నవిద్యార్థివింబలె గుచ్చిగుచ్చి పరిశీలించి నాకుఁ
దన్నగరంబునందలి సందర్శనీయుల నెల్లరం దెలిపి నీయుపన్యాసంబు నాలింప
నురవణించుచున్నాఁడ నని నన్నుఁ బెద్దచేసి తనవిద్యాలయంబు నలుగడం ద్రిప్పి
వలసినపుడెల్ల నీకు నాయండ కలదనియు భండార్కరునుత్తరము నాచెవిని వైవ
వలతు ననియుం బ్రోత్సహించి వీడుకొల్పె-నయ్యవసరంబున ౭

క. మెహతా హిమాద్రియట్టుల, మహనీయుఁడు తిలకు వార్ధిమాడ్కిని గంగా
లహరివలె సజ్జనస్తో, మహితుఁడు గోకులుఁడు నాదుమదికిం దోఁచెన్. ౮

గీ. అద్రిపతి నెక్కలే మబ్ధి నడుగుమోప, వెఱతు మమరాపగా వీచివీథులందు
నోలలాడెద మొనరింతు మోడపయన, మాడుకొననేర్తు మా తల్లియంకపీఠి. ౯

మం. గోపాలకృష్ణగోకులుఁ డర్హ్వాణీయుఁ, డానాఁడు రాజనీత్యంశమ్ములందు
నస్మద్ధృదయ మెంత యటెమె గోభూమి, నుండియు నేఁ డంత యొత్తరించెడిని
బరు లెవ్వరేని మద్భావమ్ము నట్టు, లాక్రమించియెఱుంగ రని పల్కరింతు. ౧౦

వ. అయ్యది యట్లుండె. ౧౧

క. అంతట నే భండార్కరు, చెంతకుఁ జని నాదుమనవిఁ జెప్పితి సంఖ్యా
వంతుం డాతఁడు జనకుని, వంతున నన్గారవించె వాత్సల్యమునన్. ౧౨

గీ. అన్న నా కిప్డు రాజకీయములతోడి, జడ్డు సుంతయు లేకున్కి జగ మెఱుంగు
నైన నిన్ను నైరాశ్యోపహతునొనర్ప, నోడెద న్నీదువాదంబుయుక్తమనియె. ౧౩

క. అభినంద్యము నీజతనము, సభ నాకే లంచు నుడువఁజాల మనీషా
ఋభుగురులు తిలగ్గోకులు, లుభయులు న న్నొనటన్న నొప్పెద ననియెన్. ౧౪

క. వా రిచ్చగించునాఁడే, వారక పరిషత్తు జరుపవచ్చును భవదీ
యారంభము జయలక్ష్మి ప,రీరంభముకల్మి విస్తరిల్లుత మనియెన్. ౧౫

వ. ఇట్లు పరమపూజ్యులు నిరాడంబరులు నగు నియ్యంతర్వాణిగ్రామణులు నన్నాదరించి యనాయాసంబుగా ననార్భటముగా సదస్సు జరిపించి నన్నంపి - రంత నేఁ జెన్నపురి కేగుదుఁ దన్నగరంబునవారు నారాక కుప్పొంగి విద్వన్మణియగు సుబ్రహ్మణ్యుని యాజమాన్యమునఁ బేరోలగము సమావేశపఱిచి - రందు నావినిచిన బాలసుందరుకథ సభ్యులన్ మిగుల నాకర్షించె - మఱియు నే నయ్యెడ ౧౬

క. అతిదీర్ఘవాఙ్ముఖము ము, ద్రితమ్ము పఠియించుదుం బ్రతిపదం బవధా
నిత విని సదస్యు లాస, క్తతఁ జూపిరి పచ్చపుస్తకంబును విలువన్. ౧౭

గీ. వేఁడివేఁడి గారెలవోలె వేలకొలఁది, పొత్తములు చెల్లెఁ గీర్తిసంపత్తిఁ గన్న
పత్రికానేతృమండలిమైత్రిఁ గంటి, నెల్లభంగుల నావేడ్క వెల్లివాఁడిచె. ౧౮

వ. నాఁటి నాప్రసంగము లన్నియు నాంగ్లభాషయంద నడిచెఁ - గాని యింటిలో వెలువడునంత సౌహార్ద్య సాహిత్య సముత్సాహములు నాపట్ల మదరాపురమ్మున బాహిరపోయె - నెమ్మికిం దేశ్వనిపాశంబులు లేవుకదా. ౧౯

***

౨౯ వేంటనేరమ్ము

క. పదపడి కాళీఘట్టముఁ, గదిసితిఁ బరిచితులలేమికతమున నానా
పదలం బ్రుంగితి నచ్చటఁ, గొదుకుచుఁ గొదుకుచు సురేంద్రుఁ గొల్వునఁగంటిన్.

ఆ. అతఁడు వంగదైవ మామాట లీమాట, లైనవెనుక నిప్పురాన నీదు
పలుకు నాలకించుప్రజ లుండరని నాకు, నుత్తలంబు గదురుచున్న దనియె. ౨

వ. ఇఁక నమృతబజారుపత్రికా సంపాదకు డు నన్నొక తిరుగుఁబోతుఁగా నూహించె-వంగవాసిపత్రికా యజమానుఁడు నీజోలి మా కక్కఱలే దనె - నిట్టి దుష్ఫలితమ్ముల కే నోడక యింగ్లీషుమన్, స్టేట్సుమన్ పత్రికా సంపాదకులఁ గన్గొంటి - నాంగ్లహైందవులగు వారు నన్నాదరించి యాఫ్రికాభారతీయసమస్య విలువ కలదని యెఱింగి దానింగుఱిచి నాయొసంగిన యంశమునెల్లఁ బ్రకటింపఁ జాగి - రం దింగ్లీషుమన్ సంపాదకుఁడు సాండర్సు నన్నాత్మీయుఁగా భావించి తన పత్రికను నా కప్పగించె - నితనికి న్నాకును గడిందినెయ్య మేర్పడె నంట యతిశయోక్తి కాఁజాలదు - యథాశక్తి నీయుద్యమంబునకుఁ దోడ్పడెద నని యియ్యుదారుండు నాకు వాగ్దాన మొనరించి దానిని శతధా పాలించె-నాబ్రదిమియందు డబ్బాటుగాఁ బాటిల్లిన మధురాతిమధుర ప్రణయంబు లీదృశంబు

లెన్నని గలవు - నాకు డంబములేమియు సత్యప్రవణత కల్మియు సాండర్సు వెలారించు నెనరునకుఁ గారణంబు లాయె - నితఁడు నన్నుఁ బెద్దపఃకించె-నాఫ్రికా యందలి యాంగ్లేయుల తప్పులం దెగడుటకు నొప్పులం బొగడుటకు నేను సంశ యింపలేదని తా నెఱింగె - నెదిరియెడ మన మెంత ధర్మ్యముగాఁ జరింతు మంత వేగిరమ్ముగా మనకు న్యాయము లభించునని నా యనుభూతి ఘోషించుచున్న యది - యి ట్లనుకోని సాయము ప్రాప్తించుడుం గలకత్తాయందుసైత మొక సదస్సు జరుప నెదురుచూచుచుంటి - నింతలో దర్బానుమిత్రు లిచటి శాసన నిర్మాణసభ త్వరలోఁ గూడఁ బోవుచున్నది - కాన మీరు వెంటనే రావలయు - నని నాకుఁ దంతీవార్త నంపుటం జేసి కలకత్తా కార్యక్రమాదులకు స్వస్తిసెప్పి నాయిల్లాలితో నిరుగురు బిడ్డలతో మేనల్లునితో ధూమనౌక నెక్కి రెండవమా ఆఫ్రికాపయనంబు సాగించితి. 3

* * *

ఆత్మకథ

తృతీయభాగము

౧ గాలివానచిన్నెలు

క. నడితరపు హైన్దవులలోఁ, గడుఁ బిన్నతికంబునంద కల్యాణవిధుల్
నడుచుట నాలుమగలమ, న్నడలితరేతరవిరుద్ధ గత్యాశ్రయముల్. ౧

గీ. మగఁడు చదువరిగానుంట మగువ కోన, మాలురాకుంట నైకసంసారసరణి
యగుట నింటియతండు తోయలి కొనర్ప, వలయు నాచార్యకంబు చిక్కులకునోర్చి.

వ. కావున నేను ౩

గీ. ఆలుబిడ్డల వేసంబునందు బాస, యెడల నాహారమున నడవడికపట్ల
రీతిదెసఁ బెద్దకాలంబు దృష్టినిల్పి, సైఁచితిం దొల్లి యింటియొజ్జనముబరువు. ౪

వ. ఆనాఁటికథలు కొన్ని తలఁపునంబాఱి నేఁడునాకెనలేనినగవు హత్తించు–వెండియు౫

గీ. పతిని సేవించుటయ తనపాలి పరమ, ధర్మమని విశ్వసించు హైందవవధూటి
జాయ కొడయండనని భారతీయుఁ డెంచు,నగుటఁబతిచేతికీల్బొమ్మ యయ్యెనబల.

వ. అయ్యది యట్లుండె – సభ్యత నర్థించువా రాంగ్లేయుల జీవనపద్ధతుల నవలంబింప వలయు నని యట్లొనర్చిననాఁడ వారికి సంఘమునయందు గౌరవం బేర్పడునని మన్ననలేనివారు ప్రజాసేవ కనర్హులని మున్ను నాతలంపు – కాన నాలుబిడ్డల చీరసింగారములు నాయిచ్చకొలఁది నేమించి కోమటివేసంబు వదలించితి – కాను రా నాంగ్లేయుల ననుకరించుట దూష్యమనియుఁ బారసీక నాగరికత యెల్లనాడె ములం గ్రీడిసేయునట్టి దనియు నెఱింగి మాయింటికి దాని నాహ్వానించితి– సీవిప ర్యాసంబు నాయిల్లాలికిం బిల్లలకు నసమ్మతంబ – యైనను వారు నావాదమ్మున కెదురాడనేరక నాచెల్లుబడి నుల్లంఘింపఁజాలక చెప్పిన వాలకమ్ములెల్ల సవరింపఁ జాగిరి – మఱి కొన్నినాళ్ళ కీతగులము నన్ను డిగ్గఁద్రావుటంజేసి నాగరికతా కూర్పాసకం బూడ్చివైచి సుఖంపడితి – వెండియు నాలుబిడ్డలతో నౌకాయానం బొనర్చుటకు నాకిదియ మొదలు–కాని ౭

క. పలువురు మిత్రులు బంధులు, కలమ్మనం దుంట నాకుఁ గడుఁగూరుచు నె
చ్చెలికాఁ డభియోక్తయు నై, యలరెడు నబ్దుల్ల తరణి కధిపతి యగుటన్. ౮

ఆ. ఇంట నున్నయట్లు యింటర మెఱుఁగని, జలధియాత్ర నవుడు సలుపఁగంటిఁ
గాని గమ్యభూమి కడుదాపునం దున్న, వేళ విసరెఁ బెద్దగాలివాన. ౯

క. అఱచేత నుసుఱు లిడుకొని, తెరువరు లత్తఱి విభిన్నధీదూరగులై
పరమేశ్వరు నిశ్చల ని, ర్భర నిర్మల భక్తియుక్తిఁ బొడిరి దీనుల్. ౧౦

క. హిందువులు ముసల్మానులు, నందఱు నొకతల్లిబిడ్డలై రప్పు డంగముం
గొందఱు ముడుపులుగట్టిరి, కొందఱు నాస్తిక్య మట్టి గుసగుసలునాడన్. ౧౧

క. తండేలు మమ్ముఁ గని యీ, గండంబున కేమి యిట్టిగాడుపునానల్
తండోపతండము ల్గని, యుండినవాఁ డీతఁ డీర లోడకుఁ డనియెన్. ౧౨

క. అతఁ డెంతదిటవు సెప్పిన, మతి కూఱట నొసఁగవయ్యె మా కాశౌసం
తతి వ్రయ్యవాఱఁ జటులా, త్ర తీవ్రితం బేర్చు విలయఝుంఝూఝుంపల్. ౧౩

గీ. అదె విరిసె నావ యిదె కలం బవిసె నన్న,రోద లనుచుఁ ణ మొసరేఁగ నెదలు వ్రీల
మిట్టతరఁగలు అంపిల్లి ముట్టడింప,నోడ యుయ్యాలజంపాలు లూఁగఁజాగె. ౧౪

క. ఏతన్మహాభయంకర, వాతార్భటి నిలిచె నొకదివారాత్రిము; త
ర్వాత మొయి ల్లీడలెను జల,జాతాప్తునిదర్శనంబు సమసంగె మాకున్. ౧౫

ఉ. ఎల్లరమోములందు నటియించె వినూత్నమహాస్స్న, గాడుపున్
వల్లడితోడనే పరుగువాఱె హరిస్మరణేచ్ఛ, విచ్చె న
ల్లల్లన పంచతాభయ, మనంతర మంతములేని యజ్ఞతా
వల్లులు ప్రిమ్మిప్రిమ్మి తెరువర్లను దప్పడుదారి కీడిచెన్. ౧౬

క, అవ్వల భగవద్గీతులు, నివ్వటిలెంగాని తొంటినిశ్చలదీక్షల్
దవ్వులకుం జనె నెఱపులు, కవ్వింపనినాఁడు భక్తి కానంబడు నే. ౧౭

గీ. ఈమహావాతవిప్లవం బామతిల్లి, తెరువరులనెల్ల నాదునెయ్యుర నొసర్చ
నిట్టిచెట్టులు మున్ను కన్నట్టివాఁడ,నగుట నిగ్గాలివాన కే నలుకనైతి. ౧౮

ఆ. కడలిచీడలేని యోడమవ నాకు ని,క్కతనఁజేసి గాలికసరు వేళఁ
బేదగుండె లేక పేటనఁబెట్టితి, నధ్వనీనసాధ్వ సాపహృతికి. ౧౯

క. చుక్కానువాని మెఱవడి, వాక్కుల నపుడపుడు వినిచి వారలభీతిం
జక్కాడితి మిక్కిలిగా, నక్కఱకు న్వచ్చె నేస్త మయ్యాది నాకున్. ౨౦

వ. మాపయనించునోడయు దాని ననుసరించు నబ్బుల్లా సెట్టి వేఱొండునావయు నిడుమలం గడచి వచ్చివచ్చి దర్బానుఘట్టమ్మునం దుక్కఁజీను దిగవైచెఁగాని నేను నిక్కపుంగసరున కగ్గపడి బెగ్గడిల్లుట ముంగలన కలదుగదా ! ౨౧

***

౨ గాలివాన

మం. పదియు నెన్మిదినాళ్లు పయనం బొనర్చి, దర్బానుతీరమ్ము తటియు, మావచ్చు
కలము బొంబాయిలోఁ గదలిననాఁడు, బొబ్బరోగంబు తత్పురి నున్నకతన
నీరుజాబీజంబు లిర్వదిమూఁడు, వాసరంబులు చెల్లువఱ కుండుఁ గాన
నిలిచినై దుదినాలు నిండెడుదన్క, నోడ సంద్రమునంద యుండంగవలయుఁ
బ్రజ లెవ్వ రుర్విపైఁ బాదుకోరాద, యని వెజ్జ మానౌక నంకిలిపెట్టె. ౧

వ. ఈ సత్కారము రెండవకప్పలికిని ముట్టె—దర్బాననందలి యాంగ్లేయు లీనౌకా యాత్రికుల వచ్చినదారిన పాఱఁద్రోలుటకు వెగ్గలంబుగా మొగ్గరంబులు పన్నుచుంట యితనిముదల కొకహేతు వాయె—నబ్దుల్లావణిగ్వర్గమువారు నగరవార్తా విశేషంబు లెప్పటి కప్పుడ మాకు నివేదింపఁ జాగిరి—తెల్లవా రానాఁటి కానాఁడు సంఘీభవించి సెట్టి నొకదెస వెఱపించుచు నొకదెస బుజ్జగించుచు నతఁడు తన రెండోడలం ద్రిప్పిపంపుచో వచ్చుదండువు లచ్చుకొందుమని సూచించుచుండిరి—కాని తద్వణిక్పుంగవుఁడు ౨

క. తెలవారి లెక్కసేయక, ఫలితం బెట్టులైన నొడ్డుపట్టించెద నా
కలములఁ దప్పక పాంథుల, నిలపై డించెద నటంచు నెరగలిఁ గ్రక్కెన్. ౩

గీ. ఒక్కదెస దీనభారతీయులు మఱొక్క, దెస భుజాసంప దధికార ధీబలప్రి
పూర్ణులగు నాంగిలేయు లేపునఁ దెగింపఁ, గదనమిబ్బంగి భయదమై మొదలుకొనియె.

గీ. అబ్దులా మన కిఁక వంగఁ డనితలంచి, యాత్రికులవంక కత్తెత్తి రాంగిలేయు
లింటికిం గ్రమ్మఱిల్ల కిం దుంటిరేని, పంతమున మిమ్ము జలధిలో ముంతుమనిరి.

క. మా పనుపుం దలఁదాల్చిన, మీ పయనపు వెచ్చమెల్ల మే మిచ్చెద మే
లా పీడ లిచ్చగింపఁగఁ, బోపొండని భీతినీతి బోధించి రొగిన్. ౬

వ. అయ్యవసరంబునం దేను యాత్రికులం గదిసి ౭

క. జంకకుఁ డీధవళాస్యుల, జంకెనలకు; నంకిలింపఁజాలర మిము వీ
రింకెన్ని యీఱతాఱల, కుంకించిన నించుకేని యోడకుఁ డంటిన్. ౮

క. తెరువరులు నెమ్మి వీడక, ధరాధరములైరి వారిఁ దత్తత్క్రీడా
పరిచితుల నొనర్చి వినో, దరసమ్మున బ్రింగఁజేయు తరుణమునందున్. ౯

క. వచ్చెం గిసిమిసిపండువు, మచ్చికమై నావికుండు మా కాతిథ్యం
బిచ్చె నపు డధ్వనీనజ, నోచ్చయ మది కూడికూడి యొకసభ యయ్యెన్. ౧౦

క. ఆసభ గంభీరోప, న్యాసం బొసగింతిఁ బ్రతీచ్యనాగరికత్వ
శ్రీసరణిగుఱించి; మన్మన, మాసమయమునందు జగడమందే నిలిచెన్. ౧౧

వ. ఏలయన దర్బానునందు రేఁగిన యాకయ్యంబున కేన మధ్యబిందువ నైతి - హిందూదేశమున నున్నతఱి నే నాఫ్రికావాసులగు నాంగ్లేయులం బాడితప్పి దిసంతులుకొట్టితి ననియు నేటాలుగడ్డనెల్ల భారతీయమయంబుఁ గావింపనెంచి రెండోడలపజను దెచ్చితి ననియుఁ దెల్లవారు నాయెడ నెగ్గుమోపిరి - కాని కల్లపొల్లనమ్మికలు సెప్పి నేటాలున కరుదెమ్మని భారతీయు నొకనినేని యేనర్థించి యెఱుంగ - నావచ్చు నావయందలి తెరువ ర్లేనలుపురో తిరిక్కఁ దక్కెల్లవారు నాయెఱుక కందని వార - యిఁక రెండగునోడవా రందఱు నా కపరిచితుల - వెండియు మ న్నాఫ్రికాలో నెల్లడింపనియక్కఱ మొక్కఁడేని తత్రత్యులగు నాంగ్లేయులంగూర్చి భారతంబున భాషింపనైతి - నావినిచిన యెల్లమాటకు న్వలసినన్ని తారకాణ లుండె - నైనను దమసంస్కృతికి దాసులై తెల్లవా రిట్లు పరిణమించి - రీమార్పు నాకు నిరంతరవేదనాజనక మయ్యెఁ -గాననాఁటిగోష్ఠిలో దీనిం దడవితి - శ్రోతలు కర్ణధారాదులు నాతలంపు నాదరించినాపల్కులనోర్మిమై నాలించిరి - సభానంతరము ప్రతీచీన సంస్కృతింగుఱించి నావికాదులకును నాకును గొంతగ్రంథము నడిచె - నం దేను పాశ్చాత్యనాగరికత హింసాత్మక మనియుఁ బ్రాచ్యసంస్కృతి యహింసాబద్ధ మనియు వక్కాణించితి - నంత సభ్యులు న న్ననుయోగవర్షంబున ముంచి - రపుడు సరంగు నన్నుఁగని ౧౨

గీ. ఆంగిలేయులు నేఁ డన్నయట్ల రేపు, ఘోరహింసలకుం బూనుకొందు రేని
యేవిధిం దావకం బహింసావిధాన, ముజ్జగింపక సాగింప నోర్తువయ్య. ౧౩

వ. అనవుడు న్నేను ౧౪

గీ. వార లొనరించు హింసాపచారమెల్ల, సైఁపఁగలబుద్ధి ధైర్యమ్ము సాహసంబు
మాకు జగదీశ్వరుండు కామక యొసంగి, విజయమొనగూర్చునని యేనువిశ్వసింతు.

క. ఈరీతి నన్నుఁ గలఁచిన, వీరిదెసన్ లేద సుంతవేర్మియు నాకున్
బేరిన యెఱుఁగమిరోంపిం, దూఱిన యానరులఁజూచి దుఃఖంపడెదన్. ౧౬

క. తమ యిట్లొనర్పుచేఁతలు, సమంజసము లనియ వీరు సంభావింతు
క్రిమ మెఱిఁగినవానికి నె, ట్లమర్ష ముదయించు నాకు నాంగ్లేయులపై. ౧౭

వ, అని యొసంగిన నామాఱుమాట నాలకించి నావికాదులు పెక్కండ్రు నన్నుఁ బరిహాసించిరి-నాపల్కులయెడ వారి కేర్పడిన విశ్వాసము తాదృశము కాఁబోలు-నిట్లు నిరుత్సాహమ్ముతోఁ బ్రొద్దులుపుచ్చుచు నౌకాబంధమ్ము త్రెంచుకొని గట్టెక్క నెన్నఁటికా యని యే నురియాడుచున్నతఱి . ౧౮

క. వింటిరె యిలఁ బదికాలము, లుంటకు మీ కిచ్చగింతయుండిన మాకున్
బంటులవలె వంగుడు వెడ, తంటాలకు రాకుఁ డేల తలతో నడకల్. ౧౯

ఆ. అనుచుఁ దెల్లవార లంపినవార్త కే, నొల్లఁబోక సుంత డిల్లపోక
పధికలోకమెల్లఁ బ్రకటించుధీరతా, గరిమ మరసి హర్షభరము మెఱసి. ౨౦

క. దిక్కోటి వ్రక్కలైనన్, జుక్కలు తెగిపడిన రవియు సోముఁడు పాడిం
దక్కిన దర్భనుతీరం, బెక్కెద మిది ధర్మబద్ధమే యగుఁ జుండీ. ౨౧

వ. అని యాంగ్లేయులకుఁ బ్రత్యుత్తరంబు నంపితిఁ – గొట్టకొస కిర్వదిమూఁడునాళ్లు ముగిసినవెన్క నావ లొడ్డుపట్టవచ్చు ననియుఁ దెరువరులు నేలపై నడుగుపెట్ప వచ్చుననియు నేలుబడివా రియ్యకొనిరి. ౨౨

* * *

౩ ఒరగల్లు

మం. రెండోడలును వచ్చి రేవులో విడిసెఁ, దెరువరు లెల్లరు న్దిగి రొయ్యొ నొయ్యొ
నపుడు నేటాలురాజ్యమ్ము పాలించు, నెస్కాంబి ప్రెగడలకెల్లఁ గన్నాకు
చీకట్లు కవియుదెంచిన యనంతరము, గాంధిని డింపుమీ కప్పలివలన
నతని పేరన్న నేఁ డాంగ్లేయులెల్లఁ, బ్రళయాగ్నులై రోషపడుచున్నవారు
తఱిసె నాతనికి దుస్తర దుర్విపత్తి, తీరపాలకుఁడు రాతిరివేళ నతని
నిరుపద్రవంబుగా నెలవును జేర్చు, నని కర్ణధారున కనిపె సందేశ
మది విని మేలుమే లనియంటి నేను. ౧

వ. పదంపడి యబ్దుల్లావర్తకమండలివారి ధర్మవాదియు నాంగ్లేయుఁడు ఋజువర్తనుఁడు నగు లాటను వచ్చి నన్నుఁగదిసి యిట్లనియె. ౨

ఆ. ఏలపెద్దచేసె దెస్కాంబివార్త నీ, వంటివాఁడు దొంగవానివోలె
నిల్లు సేరఁదగునె యీఁగయు నీమీఁద, నాడకుండఁ జూచువాఁడ నేను. ౩

క. పురి నిత్తఱి మదిమదికిం, గఱవన్నది లేద యెవరికార్యములకు వా
రరిగిరి యాంగ్లేయులు; భయ, పరతంత్రత కేల పాలుపడెదవు గాంధీ! ౪

గీ. తడయ నేటికి మనసుపేదఱిమి లేని, రవర వై తేని యాలుబిడ్డలను మొదలు
బండిపై నంపు మవ్వారిపజ్జ నొయ్యొ,నొయ్యొ నడుచుచుఁబయనించు టొప్పు మనము.

క. అనుటయు నేఁదల న్నూఁపితి, వనితయు బిడ్డలు నుపద్రవంబునఁ జిన్నెల్
కన్నుఁగొనకయ రుస్తుమ్‌జీ, ధనవన్మణిమందిరంబు దాసిరి పిదపన్. ౬

క. నావికునిముదల నైకొని, నావన్ దిగఁద్రావి నిల్చినాఁడను ధరపై
మూవ్వురు నల్వురు చిఱుతలు, కావించిరి క్రిందు గాంధి గాంధి యటంచున్. ౭

క. పొంపిరివోయెడి బుడుతల, యంపులు విని పక్షవాదిరత్నము లాటన్
గుం పెంతపేర్చునో యని, పెంపారునెలుంగుతోడఁ బిలిచెను బండిన్. ౮

క. నరుఁ డీడ్చుశకట మయ్యది, నరుపైఁ బయనింప నామనం బోర్వద త
త్పురుషతకు నియ్యకొన్నన్, జిఱుకుక్కలు తెల్లవారిశిశువులు నన్నున్. ౯

క. ఆబండి నెక్కనిత్తురె, "నీబుట్టను వ్రయ్యఁజేసి నినుఁజంపెద మో
రీ! బుద్ధిఁగలుగు" మనుడుం, దాబెదరెన్ శకటవాహి తడ బడిచెదరెన్. ౧౦

వ. అంత నేను ౧౧

క. లాటనుతో మెలమెల్లఁగ, బాటం జనుచుండ మూఁక బలిసెను నడువన్
జోటు కఱవయ్యెఁ గొందఱు, తూఁటరు లెస రేఁగి పాయఁద్రోసిరి మమ్మున్. ౧౨

క. నెఱికఱకుఱాలవానన్, ముఱిగినగుడ్లులను నన్ను ముంచిరి మిగులన్
జఱచిరి గుద్దిరి తన్నిరి, చెఱిచిరి తలచీర కూలిచిరి నేలపయిన్. ౧౩

క. స్మృతిసడలె నాకు దైవ, స్తుతిమై నపు డొక్కయింటిచువ్వలకడ ని
ల్చితిఁ గాని ధూర్తనిచయో, ద్ధతి డిందమిఁ దప్పవయ్యెఁ దన్నులు నాకున్. ౧౪

క. ఆయెడ రక్షకశాఖా, నాయకునిల్లాలు వీరనారీమణి తా
నా యీవిపత్తిఁ గని రో, షాయితమూర్తిని వెలింగి శరవేగమునన్. ౧౫

క. నాకడకు వచ్చె నన్నున్, సాఁకం దమకించి గొడుగుచాటున నిల్పెన్
మూఁక కపు డావఁద్రావిన, వీఁకయునై తనువు మనము విజ్ఞోడుపడెన్. ౧౬

వ. అయ్యవసరంబునం దొక భారతీయుఁడు రక్షకభటస్థానంబున కేగి మొఱపెట్టుడుం దదధికారి నన్నుఁ గాపాడుపొంటెఁ గతిపయభటుల నేమించె - వారు తగువేళ కేతెంచి దుండగీండ్రం జెదరఁగొట్టి - రంత నేను గమ్యస్థలంబున కేగుచుండ మధ్యేమార్గంబునఁ గల రక్షకశాఖాధికారి నన్నని మాశిబిరంబు నాశ్రయించి నిర్భీతిమై నుండు మనుడు నే నంగీకరింపక ౧౭

గీ. దోస మెఱిఁగినంతన యుగ్రరాసుతనము, నుజ్జగింతురు వీరు ధీయుతులు మెచ్చ
తలఁపు మొలతెంచు వీరికిఁ దప్ప దంచు, నతనికిం బల్కితిని గృతజ్ఞత వెలార్చ.

మం. పదపడి రక్షకభటులతోడ్పాటు, కలిమి రుస్తుముజీ యగారమ్మునఁ జేరి
విడిసితి నెయ్యురు వెజ్జులుం దగిన, యుపచారములు సల్పి రోర్మిఁబాటించి
వీపు దెబ్బలు పెద్ద వేధింపఁజాగె, గాయ మొక్కటి భయంకరముగా నుండె
నింటిలోపల శాంతి యొసలారెఁ గాని, బయట నుల్కాపరంపరలు ఱంపిల్లె. ౧౯

క. తుంటరులగు తెలవా రా,యింటి న్గిటికొనిరి క్రుంకె! నినుఁ డపరాబ్ధిన్
గెంటనితమస్సు లోకము, నంటెన్ గోలాహలంబు లాగుబ్బుకొనెన్. ౨౦

గీ. అప్పగింపఁడు గాంధి మా కప్పగింపుఁ, డొప్పకుండిన నాపదల్ తప్పవంచు
మూఁక కేకలువెట్ట నాముప్పు నెఱిఁగి, వచ్చి రక్షకభటచమూ వల్లభుండు. ౨౧

క. అదలింపక బెదరింపక, మృదువాక్కులతోడ మేలిమేలమ్ములతోఁ
జదురేర్పడ నగ్గుమిలో, మదిమది చేకూర్పఁజాగె మతకరి యగుచున్. ౨౨

క. అత డెంత పెనఁగులాడిన, మతికూఱుటరామి నర్థమానప్రాణ
స్థితి నిచ్చయున్నఁ గపటా,కృతులన్ జనుఁ డిల్లువీడి యింకొక దెసకున్. ౨౩

వ. అని చారులచే మాకు సందేశ మంపె - నౌరా! యితరేతర విప్రతీపమ్ములగు సంఘటనలు రెం డొక్కనాఁడ నన్నెదుర్కొనె - నెట్లనం బగలింట మన్మిత్రుఁడు లాటను నాప్రాణముల కెట్టి హానియుం బాటిల్లదని తలంచి నన్ను బాహాటంబుగా నరుదెమ్మన నేను మైకోలుసూపితి - రేప్రొద్దు మరణోపప్లవంబు ప్రత్యక్షముగానుండ వేఱొండు చెలికాఁడు చాటుగాఁ బొమ్మని హితమ్ముగఁ జెప్పె - నిదియు నే నంగీకరించితి - నా కొండె నానెయ్యుర కొండేని నాయాలుబిడ్డల కుపద్రవంబు వాటిల్లునని వెఱచి యే నిట్లు కావించితి నని యెవఁడు పల్కనేర్చుఁ - దొలుతొల్త నేను మూఁకం దలపడుటయు నవ్వల దొంగవేసమ్ముతో నూడనిఁ బొడుటయు నీ రెండుపను లొప్పుల యని యేఁడు నిర్ణయింపఁజాలుఁ - గడచన్న చెయిదంబుల మంచిచెడ్డలు నిర్ధరించుట రిత్తకురిత్త - వీనిగుట్టెఱిఁగి యిందే మేని నేర్వఁదగినది యున్న నేర్చుట లగ్గు - జగమునం దెవ్వఁ డెవ్వేళ నెట్లుండు నది వ్యాఖ్యానింప నయితి కాదు - మానవుని వెలినడవడింబట్టి వాని గుణదోషముల నెఱుంగు టరిదియగు - నయ్యది యట్లుండె - నయ్యధికారిహితమ్ము ననుసరించి యేనుభారతీయ రక్షకభటవేషమ్ము సవదరించి ప్రహారబాధానిరోధమ్మునకై శిరమ్ముపై నొకపిత్తళి మూఁకు డుంచి దానిపై దాక్షిణాత్యప్రావారంబు నుష్ణీషంబుగాఁ జుట్టి పలాయనమ్ము సాగించితిఁ - దదీయసంభ్రమంబున దెబ్బలతీపు మఱపునంబడె - నపుడు నావెంట నున్న వేగరు లిర్వురున్ హిందూవణిగ్వేషంబులు దాల్చి మూవురము నందుగొందులఁ బడి పోయిపోయి వాడ తెగుదల మాకొఱకు వేచియున్న శకటంబు నధిరోహించి రక్షకభటస్థానంబు నీఁగితి - మంత నేను దదధిపతియగు నలెగ్జాండరు నకు నన్నుఁ గొనితెచ్చిన ప్రణిధిద్వయంబునకు నేటికోళ్ళు సెల్లించి తచ్ఛిబిరంబు నాశ్రయించితి - ని ట్లే నొకదెసఁ దప్పించుకొనిచనుచుండ వేఱొండు దెస నలెగ్జాండరు ౨౪

పా ట

లెండు గాంధిని ముట్టడింతము
రండు తులువను బట్టుకొందము
కొండతుమ్మకుఁ గట్టి యాతని
ఫ్రండు రేఁపుదము
తెల్లవానికి నీతిలే దని,
నల్లవానికి భీతిలే దని
పల్లెపల్లెకు నేగి చాటిన
పలువ నోర్చెదరా ? ౨౫

క. ఇవ్విధిఁ బొడుచు గుంపును, నవ్వులతో మల్లుకట్టె నామెల్విని మీ
గుర్వోగిరిపోయె నిఁక నీ, నొవ్వేలా నెలవులకుఁ జనుండని పలికెన్. ౨౬

ఆ. గుంపులోనివారు కొంద ఱమ్మాటకు మండిపడిరి కొంతమంది నగిరి
సిక్కమా యిదంచుఁ బెక్కండ్రు సంశయా, ధీనులైరి మొగము తెల్లవాఱ. ౨౭

వ. అంత నలెగ్జాండరు వారి కిట్లనియె. ౨౮

క. సందియ మేటికి మీలోఁ, గొందఱు నడతెంచి వెదకికొండీ నెలవున్
గాంధి యిటనున్నచో మీ, కందించెద లేనిచో రయానఁ బదండీ ! ౨౯

క. రుస్తుంజీభవనము వి,ధ్వస్తముఁ గావింప గాంధితరుణీసుతులన్
గస్తిని ముంపఁ దలంపని, శస్త్రాత్ములు మీరటంచు సంభావింతున్. ౩౧

గీ. అనుటయు నమ్మఁకవా రిద్ద ఱరిగి వేయి, కనులతో నింటఁగల యెల్లగదులు వెదకి
యల్లవచ్చి కాల్ సేతులు చల్లవడెడు, వార్త వైచిరి గుంపునవారిచెవిని. ౩౧

క. కొంద ఱలెగ్జాండరుపని, నిందించుచుఁ గొంద ఱతని నేఱానేర్పున్
వందులవలె మెచ్చుచు మఱి, కొందఱు వందురుచు నిండ్లకుం జని రంతన్. ౩౨

వ. "గాంధిం గొట్టినమండఁగిండ్రి దండించు టావశ్యకం' బని నాఁటి బ్రిటనుదొర
తనమువారి ప్రధానమంత్రియగు నాస్టిను చేంబర్లేను నేటాలుదొరతనమ్మువారికిఁ
దంత్రీవార్త నంపుడు నదమాత్యశేఖరుండగు నెస్కాంబి ౩౩

క. ననుఁ బిలువఁబంచి నాదగు, తనువునఁగల గాత లరసి తద్దయు నడలెన్
మును నాపల్కినహితమును, వినినన్ నీ కిట్టిబెడఁద విజ్ఞనె యనియెన్. ౩౪

క. అకటా ! నీవెండ్రిక కే, నొకయొప్పమి రా మదీయ మ్ముల్లము వగచున్
సుకృతీ ! తద్ధూర్తుల పో, లికఁ జెప్పినఁ బట్ట నగ్గలించెద ననియెన్. ౩౫

గీ. నిన్నుఁ గొట్టినవారి దండింపఁ దంతి, నంపెఁ జేంబరులే నిట్టియవగడమ్ము
సైఁపరానిద యంచు నాసచివులెల్లఁ, గెరలుచున్నారు ఖలుల శిక్షించుపొంటె.

వ. అనియుం బలికెనంత నే నమ్మంత్రిపుంగవుం గని యిట్లంటి. ౩౭

ఆ. మూఁకలోనివారి మూవుర నల్వుర,జాడ తెలియుఁ గాని నేఁడు వారి
రచ్చ కీడ్పుచేత నచ్చుద నా కేమి,యొఱుగు దుండగీండ్రఁ బఱిచినంత. ౩౮

ఆ. ఇచటి తెల్లవారి హిందూర్వియం దేను,బాడిదప్పి యెగ్గు లాడినట్టు
లెవరొపల్క నల్కయేచిన పెడకట్టె,లిట్టులైరి నింద్య లెట్టు ? వీరు. ౩౯

క. మీపెద్దలు మీరు జుగు, ప్సాపాత్రులు ప్రజకు నచ్ఛధర్మపథంబుల్
చూపఁ దగుమీర నమ్మిక,మోపిరి రూటరు వచించుముచ్చట మీఁదన్. ౪౦

ఉ. ఏ నిటులంటి నా వలవ దెవ్వని నాపదపాలు సేతకున్
మానస మస్మదీయ మణుమాత్రియు నొల్లద నిక్కవంబు శే
పైన బయల్పడున్ నిజదురాచరణమ్ము దలంచి యప్పు డీ
మానవులెల్ల సిగ్గుమెయి మ్రగ్గుదు రంతియచాలు శిక్షకున్. ౪౧

వ. అనిన నయ్యమాత్యశేఖరుండు నీ విప్పు డాడినపల్కుల యొకపత్రమ్ముపై వ్రాసి యీ నోపుదేని వానిన చేంబరులేనున కంపెద - నీవు దుండగీండ్రపై నభియోగమ్ము తేరనొల్లనినాఁడు ప్రజాశాంతి సంధించుటకు నాకు వలయునలవు సిద్ధించుటయకాక నీగఱువతనంబుసైతము జగమ్మునల్గడం బ్రబ్బు - నక్కఱయున్నచో లాటనుమున్నగు నెయ్యురహితమ్ము వడసి సముచితవిధానముం గొనియాడు - మని పల్కెనంత నేను ౪౨

ఆ. ఇటకు రాకమున్నె యీనిశ్చయమ్ముతో,నున్న నాకు నిప్పు డొరులతోడి
చర్చ యేటికంచు సైరణపత్రిమ్ము,వ్రాసి మంత్రి కందఁజేసినాఁడ. ౪౩

***

౫ శాంతి.

మం. ఎస్కాంబికుఱఁగంటి కేగకమున్న, రక్షకభటశిబిరమ్ములో నాకుఁ
గడచిన రెన్నాళ్ళకాలంబునందు, నిరువురు భటులు న న్నెడయ కేప్రొద్దుఁ
గడుజాగరూకులై కాచిరి కాని, సచివుసన్నిధి కేను జనుదెంచునాఁటి
కల్లనల్లన భయం బడఁగారిపోయె, రూపింతు నిట్టిమార్పునకారణంబు. ౧

ఆ. కలము నవతరించుకాలానఁ బత్రికా, వార్త లాహరించువాఁడు నన్నుఁ
గదియవచ్చి చిత్తకార్తె జల్లులవోలె, నడిగెఁ బెక్కుపృచ్ఛ లాత్రపడుచు. ౨

చ. విసువక యెల్లప్రశ్నములు వింటిని సందియముల్ తొలంగున
ట్లొసఁగితి నుత్తరంబు మహదుత్తముఁడౌ మెహతాహితమ్ముఁ బ
ట్టి సకలవాఙ్ముఖాళిఁ బ్రకటించి పఠించితినంటిఁ దత్ప్రతుల్
కొసరకమున్న వాని కివిగో యని యిచ్చితి నాదరంబునన్. ౩

గీ. తొల్లి నేటాలుగడ్డపైఁ దెల్లవారి, మంచిచెడ్డలగుఱిచి నామాట లెట్లు
వెడలెఁ దద్భిన్నముగ నొక్కనుడియుఁ బల్క, లేద హిందూర్వనిమూదలింపఁగంటి.

క. నాతెచ్చినట్టిపథికుం, డీతరణుల లేఁడ యొక్కఁడేనియు నెపుడో
యీతెరువను లీసీమకుఁ, బ్రాఁతవడిరి తోఁటకూలిబ్రదుకున నంటిన్. ౫

క. కలరూపు నిటు వచించుటఁ, దులువల నటు రచ్చకీడ్వఁ దొడరమి లజ్జన్
దలవంచి రాంగిలేయులు, పలుభంగుల నన్ను మెచ్చఁ బత్రికలెల్లన్. ౬

క. ఆలరిమూఁకలు నాలుగు, మూలల గర్హితములయ్యె మున్నటికంటెన్
మేలై హైందవకీర్తి, శ్రీలతికాపుంజ మెల్లసీమలఁ బ్రాఁకెన్. ౭

వ. కొట్టకొస కియ్యాగడంబునంజేసి నాకర్తవ్యముల కానుకూల్యంబ పొసఁగి నాబాట నిష్కంటక మయ్యె-రహొశిబిరమ్మునుండి నాలుగైదునాళ్ళలో నిలుసేరి నాకృత్యంబులు నెఱవేర్చుకొనఁ దొడంగితి - నేతద్ఘటనాఫలితమ్ముగా నాకు న్యాయస్థానవ్యాపృతులుం బ్రబలెఁగాని ౮

క. ఒకవంక భారతీయుల, కకలంకం బైనపేర్మి యలవడిన ట్లిం
కొకవంకఁ దెల్లవారికి, నకటా! యీరసము హెచ్చె నవ్వారిపయిన్. ౧౦

క. మానంబ భారతీయ, ప్రాణం బని తెలిసెఁ దెల్లప్రజలకు నప్పుడ
ద్దానన్ వారికి హిందూ, స్థానమువా రన్న నధికసాధ్వస మొదవెన్. ౧౧

వ. అపుడ భారతీయుల కనర్థదాయకమ్ములగు చట్టమ్ములు రెండు నేటాలుశాసనసభవారి యంగీకృతిం బడసె-నివి నాకార్యక్రమంబును భారతీయులజాగర్యను మూరిఁబోవం జేసె-వీని నాయైబాసలం బ్రచురించి తీవ్రప్రచార మొనరించి ఖండించితిఁ -గాని తుట్టతుద కీశాసనమ్ములు తిరపడుట తప్పదయ్యె-నియ్యపవాదమ్ములను మొన్నటి నౌకానిరోధమ్మునుబురస్కరించుకొని నేటాలుభారత జాతీయ మహాసభకు డెబ్బదియైదువేలరూప్యమ్ముల కానుకలు సంపాదించి తద్ధనంబునం జేసి కొన్నిభవనంబులు విలిచి వానియొసంగునద్దెతో మహాసభాకార్యంబులు సాగించితి-నీయాస్తికి వలయుపరిపాలకుల నియమించితిఁ - గాని యే నాఫ్రికా నుజ్జగించినవెన్క నిది యంతఃకలహకారణమై పాడిపట్టునను వశమయ్యెఁ-గాన సర్వజనీనమ్ములగు సంస్థలకు మూలధనం బుండుచో నైతికపతనంబు తప్పదని విశ్వసించితి - మనసేయుపని జగద్ధితంబైననాఁడు లోకంబ దానికి వలయు వార్షికో

పాయసమ్ము లొసంగు-న ట్లొసంగనప్పు డది యక్కఱలేని దనంజను - నపారమగు మూలధనమ్ముతో మూలుగుచున్న పెక్కు-సంస్థలు లెక్కలుచూపక ప్రజాభిప్రాయంబు నఱక నిరంకుశములై యుంట మన మెఱింగిన విషయంబ - విశ్వజనీనసంస్థ ప్రకృతివలెఁ దనంతఁదా వర్ధిల్లవలయు-దానికి లోకమ్ము తోడ్పడని నాఁడది ప్రజాసంస్థ నాఁ దగని దగు-నొకసంస్థకుం గల జనాదరంబును దత్పాలకులసౌజన్యముం జూడఁదలంచుచో దాని కేఁటేట లోకులొసంగు కాన్కలపట్టికఁ బరీక్షించినం జాలు - నాఫ్రికాయం దేను శాంతిసమరంబు సాగించుపట్ల నీతలంపులు గట్టిపడె - లక్షలకొలందివిత్తమ్ముతో నావశ్యకమున్నను దన్మహాసంగ్రామ మొక్కతృణమేని మూలధనంబు లేకయ నడిచె - నెల్లి కాన్కలురానిచో నేమి సేయుదమా యని చేతులు పిసికికొన్నదినంబులుం గలవు - కాని వాని వివరించుచో టిదిగాదు. ౧౧

* * *

౫ పిల్లలచదువు

వ. ఏను దర్బనుఁబోఁ గాలుమోపినతఱి నావెంట నామేనల్లుఁడుం గొమరు లిర్వురుం గలరు - వీరు చదువవలసినపసివారు - కాని వీరి నాఫ్రికాలో నెచటఁ జదివింతు-భారతీయ విద్యార్థులకొఱకుఁ గ్రైస్తవులు సాగించుపాఠశాలలున్నను నందలి శిక్షామార్గమ్ములు ప్రశంస్యములు కామి నాబిడ్డల నట కంపనైతి - నీఁకనాంగ్లేయులకొఱకు నడుపంబడుబడి యితరహిందూడింభకులకు దురాసదమ్మైననునా బాలురకునంకిలిపెట్టదు-కాని యది నాకు రుచించుసౌకర్యము కాదు-వెండియు ౧

గీ. బుడుతలకు నాంగ్లభాష నేర్పుటకు నఱవ, మెఱుకసేయంగ హిందీని గఱపఁ దగిన
యొజ్జ లున్నారుగాని మా గుజ్జరాతి, ముక్కలను మప్పు నయవారు చిక్కరెట్లు.

వ. ఎంత జతనం బొనర్చినను దద్భాషాబోధకుఁడు లభింపమింజేసి ౩

ఆ. నేన యొజ్జనంబు నెఱపితిఁ బసివాండ్రి, కదియుఁ జాగదయ్యెఁ బదిదినాలు
తుదకు నొక్క తెల్లతో యలిశిక్షకుం, బాలుపఱిచినాఁడ బాలకులను. ౪

వ. అయ్యుపాధ్యాయకు నెలకు నూటైదురూపాయల సంబళ మొసంగుచుంటి-నడుమ నడుమఁ దీఱిక చేపడునప్పు డే నర్భకులకు ఘూర్జరభాషం గఱపుచు సర్వదా తద్భాషయంద వారితో సంభాషించుచుంటి- దీనంజేసి వారికి మాతృభాషాజ్ఞానమించుక యేర్పడె - లేఁతవాండ్రను జననీజనకుల కెడపుసేఁత లగ్గుగాదని యెఱింగి హిందూదేశమున కంపనైతిఁ - గట్టుపాట్లుగల విద్యాధికునియింట యాదృచ్ఛి

కమ్ముగా నంటిన ట్లంతేవాసిభవనమ్మున (హాస్టలు) బాలురకు విద్యావివేకంబు
లంటఁజాలవు – కాన నాబిడ్డల నాచెంతన యుంచితిఁ – గాని ౫

గీ. పెద్దకొడు కీడు ముదిరిన పిదప నన్ను, వదలి చదువంగ భారతావనికి నేగ
భాగినేయుఁడు నాపల్కు పాటిచేసి, నిలిచె నానేర్పువిద్యతో నెలమి నెంది. ౬

క. అవిలంఘనీయ నియతి, వ్యవసాయముకతన లేఁతవయసునఁ గసటుం
దెవులునకుఁ జిక్కి యాతం, డవని న్దిగనాడి మమ్ము నలజడి ముంచెన్. ౭

క. ఇఁక మిగిలిననాబిడ్డలు, ముగురున్ బడికేగి పాఠములు నేర కలం
తిగఁ జదివిరి నా నడిపిన, జగడముతఱి నిల్పు పాఠశాలన్ నియతిన్. ౮

గీ. తీఱుబడిలేమి: జదువున దిట్టతనముఁ, గూర్పలేనైతి నాకొడుకులకు నుస్సు
రుస్సురని వీరు నిట్టూర్పు లూర్చుచుంద్రు, పట్టభద్రులు తమకంటఁ బడినవేళ

వ. ఇప్పట్టునం దేను వారిదూఱున కించుక పాత్రింబ నైతి ననం దగుఁ–గాని కన్నవారి
సన్నిధి నుంటం జేసియ వీరికి స్వాతంత్ర్యనిరతి యేర్పడె నని నాతలంపు–వెండి
యుం దమయిచ్చ ననుసరించి వీరు కృత్రిమశిక్షాదాసులై యుండు రేని యీనాఁటి
సౌశీల్యము వీరికలవడునా–వీరిమనుగడ నాప్రజాసేవకు నడ్డగాలు కాకుండునా–
వీరియెడ నా కిపుడున్నంత నిశ్చింత లభించునా–కావున ౧౦

క. పట్టముల కేమి వీరికి, ముట్టినచదు వెల్లఁ గనకముంబోనిద తద్
ఘట్టమ్ముఁ దలఁచుకొన్నపు, డిట్టల మగునట్టితనివి యేర్పడు నాకున్. ౧౧

గీ. ఇపుడు నాపెద్దకొమరునం దెట్టిచెట్ట, నడత కన్పించు నది శిక్షణమ్ములేని
మూర్తమును గాని నా మొట్టమొదటి బ్రదిమి, కానవాలని మదికి నిత్యమ్ముతోఁచు.

వ. ఆబ్రదుకు మాంద్యమునకు నపరిపక్వజ్ఞానమునకు నెల వని యే నెంతు – నదియు
నాజీవితమునం దుచ్ఛదశ యనియు నవ్వల నాలో వచ్చినమార్పుల కెల్ల నా
యపోహమ్ములు మూలము లనియు, నాదుర్దశ కవి తార్కాణ లనియు వాని
నమ్మిక – తనయిచ్చ వచ్చిన ట్లూహింప నతనికిం జన వున్నది కదా! – వెండియు
మన్మిత్రులు కొందఱు ౧౩

క. నీసుతుల ధర్మవాదులఁ, జేసినఁ గీడేమి తారసిలు; వీరి నిజే
చ్ఛాసరణిం జననీ విది, దోసము కాదెట్లటంచు దూఱిరి నన్నున్. ౧౪

గీ. ఎంత యరసిన సార మావంతలేని, మాటలుగఁ దోఁచె నివి నాదుమదికి; లాఁతి
చదువునేర్చెడిబిడ్డల చదురు చూడ, నాసుతుల నేర్పె గురిగింజవాసి మిగిలె. ౧౫

వ. అయినను నా యీవిద్యాప్రయోగమ్ములవలని లగ్గు నిశ్చయింప భావికాలంబె
యోగ్యంబు – మానవాభ్యుదయంబును బరామర్శించువాఁడు గృహశిక్షకుం

పాఠశాలాశిక్షకు నుండువింగడంబును, జననీజనకుల జీవనపద్ధతులకు బిడ్డలమనుగడ తెన్నులకుం గలచుట్టఱికంబును గుర్తించుటకై యివ్విషయం బిటఁ దడవితి — నిదియునుం గాక సూనృత సేవానిరతుఁ డెంతవట్టు సత్యంబునారాధింపనేర్చుఁ, దన్నుఁ గొలుచువానివలన స్వాతంత్ర్య శక్తి యెంతబలి నపేక్షించు ననునంశముల నెఱిఁగించుటకుసైత మీయధ్యాయంబు నారంభించినాఁడ — వెండియు నానాఁడు

గీ. గఱువతనమునకుఁ దిలోదకమ్ము లొసఁగి, లాఁతిభారతవిద్యార్థులకు దురాప
మైనచదువును బసివాండ్ర కలవరించి, తృప్తిపడి యుందునేని మదీయసుతులు.

గీ. భాషలో వాఙ్మయమ్ములోఁ బ్రౌఢివడసి, యుండువారల కాని యాత్మోన్నతికిని
స్వైరజీవనమునకు నేఁ డారటించు, కరణిఁ బాగులుదు రనుమాట కల్లమాట. ౧౮

గీ. త్రాసునం దొకమై స్వతంత్రితను నిల్పిఁ, వేయిపాండిత్యముల నొండుచాయ నిల్పి
తూఁచునప్పుడు వ్రేఁకన యేచి స్వేచ్ఛ, దెసక ములుసూపు నంట పెంపెసఁగు
మాట. ౧౯

వ. మున్ను నేను భారతదేశమునందు సాహాయ్యనిరాకరణోద్యమంబు నారంభించిన తొలినాళ్లలో స్వతంత్రితా నాశకమ్ములగు పాఠశాలలం గలాశాలలం ద్యజియింపుఁడనియుఁ జదువుకొఱకు బానిసేంద్రియుంటకంటె స్వేచ్ఛకొఱకు నిరక్షరాస్యులై శిలావిదళనవృత్తిమై జీవించుట లగ్గనియు విద్యార్థులకుం గఱపితి — నాయుపదేశమ్ము విలువ నిప్పటికేని వారెఱింగియుందు రని తలంతు. ౨౦

* * *

౬ సేవాభావము

ఆ. న్యాయవాదివృత్తి నానాఁటికిం బ్రిబ్బి, హెచ్చఁజేసె నాదువచ్చుబడిని
విత్త మెన్నిరెట్లు విరిసిన నది నాకుఁ, గాకపోయె హర్ష కారణంబు. ౧

వ. అయ్యవసరంబున ౨

క. జీవనపథమున కింకను, బావనతం గూర్చి రోగబాధావశ దీ
నావలిని గాయికమ్ముగ, సేవింపఁగ నాదుమనసు చిందిలిపడియెన్. ౩

గీ. అపుడ దుర్భరకుష్ఠరోగార్తుఁ డైన, కర్మకరుఁ డొక్కరుండు మాకడపఁ ద్రొక్కఁ
బట్టెఁ డన్నముతో వానిఁ బంపలేక, నిలిపితిం గొన్నినాళ్ళు మానెలవునందు. ౪

క. ఏవపడ కతనిఁ జక్కని, యోవరిలో నిడితిఁ బూయ మురలెడిపుండ్లన్
బూవులవలెఁ గడిగితి సం,సేవించితిఁ గట్లుకట్టి చివికినరోగిన్. ౫

వ. కాని తితిక్షయును సంకల్పబలంబును గొఱంతవడుటం జేసి యీ తెవులుగొంటు నకుఁ జెక్కునా ఘ్యాడిగంబు సేయం జాలక ముచ్చిలికకూలివాండ్రకొఱకు దొరతనమ్మువారు నెలకొల్పిన వైద్యశాలయందు వీనిం జేర్చితి - నైనను శుశ్రూషావాంఛ నన్ను విడువమింజేసి యొక చికిత్సానిలయమున స్వచ్ఛంద సేవకుఁడనై యనుదినం బామయపీడితుల కూడెమ్ము సేఁతకుం గొంతకాలము వెచ్చించితి - నియ్యనుభూతి బోయరుయుద్ధమున క్షతగాత్రులైన సైనికుల సేవించుటకును, బిడ్డలఁ బెంచుటకును, బెండ్లమునకు మంతరసానినై పురుడు వోయుటకును నా కెంతయు నుపకరించెఁ - బసిబిడ్డల నిరుపద్రవంబుగాఁ బెంచు టకు జననీజనకు లించుకేని శిశుపోషణవిధి నెఱింగియుంట లెస్స - యిందు నా కబ్బినయొఱుక తద్దయు మేలుచేసె - నది లేనిచో నా పిల్లల కీనాఁటియారోగ్యము లభించుననుట కల్ల - మఱియు ౬

మం. బుడుతలకై దేండ్లు పూర్తియగాదనుక, నబ్బెడివిద్య యావంతలే దనుచు
నజ్ఞానమునకు దాస్యముసల్పువారు, తలపోయుచుండ్రు కొందఱు తల్లిదండ్రు
లర్భకుల్ ప్రథమ పంచాబ్దంబులందు, గడియించు తెల్వియ కడుమేలి తెల్వి
కందులకుం దల్లికడుపునఁ బడ్డ, యప్పుడ విద్యారంభ మది మొదలొ్కనెడి. ౭

ఆ. కడుపునిల్చునట్టి కాలానఁ దల్లికిఁ, దండ్రి కెట్టియెట్టి తలఁపు లుండు
నవియ పాప కంటు నాపన్నసత్వ ల, క్షణములెల్లఁ గమిచి కల్గు శిశువు. ౮

గీ. నేలపైఁ బడ్డపదపడి నిసుఁగు పితల, ననుకరింప నజస్రంబు నంగవించు
నవలఁ గతిపయవర్షంబు లరుగుదన్కఁ, గోర్కిసేయును దనపెంపుకొఱకు వారి. ౯

గీ. ఆలుమగ లీరహస్యంబు నరయువారు, ప్రజకొఱక కాక లాలసాభర మడంప
వలతురా గార్హపత్యజీవనము పరమ. పావనము నిఖిలాశ్రమశ్రీవనమ్ము. ౧౦

గీ. నిద్రవలె నన్నముంబలె నిధువనంబు, సైత మక్కఱగల యొకచేఁత యంచు
నేతఁ డూహించు నాతఁ డహీనమహాఢ్య, మూర్తియనిపల్కరింతు మోమోటవిడిచి.

వ. జగమ్మున కాధార ముత్పత్తి యనియు, విశ్వంబు భగవత్ క్రీడారంగము తన్మ హీయస్సాచ్ఛాయయు ననియు నాలుమగలకూటమి సంతానసిద్ధికొఱక యనియుం దెలిసికొన్న పురుషుండు పంచకరపాట్లు వడియెని తనవలపుపేర్మి నోర్చి నిజప్రజా శారీరక మానసి కాధ్యాత్మి కాభ్యుదయసంధానమ్మున కర్హంబగు తెలివితేటలు గడించి రాణించుఁ గావుత. ౧౨

***

౭ బ్రహ్మచర్యము ౧

గీ. బ్రహ్మచర్యవ్రతంబు మత్పాలితంబు, నిందు వివరింతు నుద్వాహ మెపుడు నడిచె
నపుడ యేకపత్నీనియ మానురక్తి, కలిగి నాహృదయమ్ములోఁ గాఁపురించె. ౧

వ. అయ్యది మదీయసూనృతభాషా నియమమ్మునం దాకపాలై వెలసె - నింటిపట్టు నందును బ్రహ్మచర్యదీక్ష వలయుట నా కాఫ్రికాయం దెఱుకకు వచ్చె - నేత దావశ్యకంబు నాబుద్ధికిం దగులుటకు విద్వత్కవీంద్రుఁడు రాజచంద్రుఁడు నిదానంబు నాఁదగు - నొక్కమరి నే మయ్యాయిసుద్దులన్గుఱిచి మాటలాడుకొను పట్ల నే నతనిం గని ౨

మం. వింటివే యింగ్లాండువిషయమ్మునందు, మంత్రిమాణిక్యమై మంతున కెక్కు
గ్లాడ్‌స్టనునేడ వానికాంత వెలార్చు, నెనరు మేల్బంతిపో నెలఁతల కెల్ల
నాయమ్మ తన కెంతయైశ్వర్య మున్న, విఱ్ఱవీఁగక మూఁడువేళలం బతికి
వలయు నాహారంబు వండి వడ్డించు, శాసననిర్మాయిసభలు తీండ్రించి
నైకవారమ్ములు నడుచుకాలానఁ, బతి కూపిరాడనిపను లుండువేళ
నతఁ డెంతడయ్యెనో యలయునో యనుచు, నాథునితోడ లండనువచ్చి నిలిచి
యాత్మేశునకు నించునన్నపానములు, తానయి సమకూర్చి తడయ కందించు
నగ్గింపవలదె యియ్యబలప్రేమంబు, కొండాడఁదగదె యీకొమ్మనేమంబు
మన్నింపఁజనదె యీమగువజీవనము. ౩

వ. అనుటయు నమ్మహామహుండు నన్నిట్లనియె - సోదరా! గ్లాడ్‌స్టనుపెండ్లము తనమగనికిం గావించినయూడిగంబు కొనియాడఁదగిన దంటి - వావెలంది వాని చెల్లెలనియొండె నమ్మికగల లెంకయనియొండెఁ దలంచి వారిద్దఱుం దాదృశానురాగంబుతోడన యతని కన్నపానీయములు సంతరించియిచ్చిరని యూహింపు - మపు డాలియు ననుజాసేవకులయు నుపచారములం దెయ్యది ప్రశంస్య మందు - విట్టిస్వసలు భృత్యులు మనకు నెందఱు లేరు? - నారీలోకమ్మునం గాక మగవాండ్రయం దీహార్దంబు బాహిరపోవునయేని నీకపు డేతాదృశ హర్షవిస్మయంబు లొదవునా? - యించుక సమీక్షసేయు - మనినంతన ౪

గీ. ఆలితోఁ గాఁపురముసేయు నమ్మనీషి, యట్లుపల్కుట దుస్సహంబాయె నాకు
నైనఁ గవిరాజువాక్కు సూదంటురాతి, రీతి నన్నపుడు బలాత్కరించిలాఁగె, ౫

మం. పడఁతి వెలారించు పతిభక్తికంటె, బంటుచూపెడు స్వామిభక్తి మేల్గాదె
యాలుమగలకు మిథోనురాగంబు, మూరిఁబోవుట యబ్రమున హేతువెట్టు?
లెకిమీఁదు కొలువుకాఁడిత రేతరాను, రక్తిమై నుంటయే ప్రస్తుత్యవార్త
యని బయల్ మెఱసిన యతనిభావములు, సారిది నన్ దమకు దాసుని జేసికొనియె.

వ. అపుడు నామనమ్మున ౭

ఆ. ఆలితోడ నెట్టియంటిసె నుంచుకో, వలయు వలపుతీండ్రి వావుకొఱకు
నింతి యొదవఁజేత యేకపత్నీవ్రతి, లక్షణంబె యను తలంపు లడరె. ౮

క. లాలస నన్నెన్నాళులు, పాలించునో యస్మదేకపత్నీవ్రత మ
న్నాళులు ఘృతకోశాతకి, లీలన్ దృణమాత్రవిలువ లేనిది కాదో. ౯

గీ. భూరిలజ్జాపరీత కస్తూరిబాయి, నన్ను వలపించు లెఱుఁగని నారి యగుట
నపుడు నాపూను బ్రహ్మచర్యవ్రతంబు, సుకరమై సాగు నన్న నమ్మిక జనించె. ౧౦

గీ. మనసు పేదర్కి నాపోవుమార్గమునకుఁ, గంపఁగొట్టె నెంతెంతజాగర్యతోడ
నడిపినను బండి గోతిలోఁబడియె రెండు, తడవ; లైనను జతనంబు విడువనైతి. ౧౧

వ. నాయత్నమునకుంగల మూలకారణ ముదాత్త మనంజాల - సంతానప్రవాహమ్మున కానకట్టకట్టుటకయే నీ వైషయికసుఖ పరాఙ్ముఖత్వంబు వలచితి - సంతుసాఁపుటకుం గల బాహ్యసాధన సంపత్తిని గుఱిచి యల్లఁతిగనో వల్లఁతిగనో యింగ్లాండునం దున్నతఱి నెఱింగితిఁ - గొన్నినాళ్ళాలిన్సను తెల్పిన నిరోధకపద్ధతు లవలంబనీయము లని నమ్మితిఁ - గాని పదంపడి హిల్సు బోధించిన నిగ్రహమార్గంబ సముచితంబని శతధా విశ్వసించి యందుఁ గృతార్థత వడచుటకు లెక్కలేనన్ని యిక్కట్లు కుడిచితి - నేతదుద్యమంబు నారంభించినవెన్క ౧౨

క. పడఁతుక సెజ్జకుఁ దద్దయు, నెడవుగ నాశయ్య నునిచి యెంతేని బడ
ల్పడినప్పుడ కూర్కుటకుం, గడఁగితి సంయమపరిరక్ష కడలుకొనంగన్. ౧౩

క. ఏ నెంత బిఱ్ఱుబిగిసినఁ, బూనిక యపుడపుడు రిత్తపోయిన దకటా!
యైన నపజయపరంపర, లే నాకిడెఁ దుదకు నెదురులేని జయంబున్. ౧౪

వ. నా బ్రహ్మచర్యదీక్షాస్వీకృతికిం గడపటినిర్ణయ మేకాన్నవింశతిశతషష్ఠ (౧౯౦౬) శరత్తునం గాని సాధ్యము కాదయ్యె - నాఁటి కేను సత్యాగ్రహోద్యమంబున కంకురార్పణముసైతము చేయమియ కాక స్వప్నమందేని దానిపట్టువు నూహింపనైతి - బోయరుకయ్యంబు ముగిసినపదంపడి నేటాలురాష్ట్రంబున 'జులూ' తిరుగఁబాటు రేఁగుడు నం దేను దొరతనమ్ము వారికిఁ దోడ్పడ నెంచి రణవ్రణితులకుం బరిచర్యసేఁత కొక్కదళంబు నడిపితిఁ - గత్తిమీఁదిసాము గావించు నక్కాలం

బున దేశారాధనలుబ్ధు లగువారు విత్తసంతాన వాంఛావల్లులం దెగఁగోసి తార్తీ యీకంబగు నాశ్రమంబును జేపట్టుట యనివార్యమని తలంచితి-నీతిరుగఁబాటు నం దేను శ్రమించినకాల మాఱువారములు - మైన నిదియ నామనుగడయం దెన్నఁదగినఘట్ట మాయె- నీనాఁడు శపథంపువిలువం దొల్లిటికంటె లెస్సయెఱింగితి_ నొట్టు స్వాతంత్ర్యద్వారమును మూయదు సరిగదా దానిం దెఱచుననియు నే గ్రహించితి-భగవ దనుగ్రహముపట్లను నాకట్లను నాకు నిశ్చయాత్మకబుద్ధి లేమింజేసి యే నిందనుక విజయంబు నడయ నేర నైతి-నీలోపంబునన మన్మనంబు సంశయజలధిం బడి యిటు నటుం గొట్టుకొనుచుండె - శపనమ్ముఁచేయ నొల్లని మానిసి ప్రలోభముదెస కీడ్వంబడినవాఁ డనియుఁ బ్రతినచేఁ దన్నుఁ దా నరి కట్టుకొంట విశృంఖలవిహారముం బాసి యేకపత్నీవ్రతము ననుసరించుటం బోని దనియు నా కెఱుకవడియెఁ- "ప్రయత్నమునెడ నాకునమ్మిక కలదు - కాని నన్ను నే నొట్టుచేఁ గట్టివై చికొనఁ గోర"_నన్నతలంపు మానసికదౌర్బల్యచిహ్న - మిందు విసర్జనీయం బగువస్తువుపై నిగూఢ మైన యొకవాంఛ కల దనుట సముచితము- కానినాఁడు చరమనిర్ణయము గావించుకొనుట క డ్డేమి యుండు - నురగము కాటువేయు నని యే నెఱింగితినేని దానిబారివలనం దప్పుకొంట కొ ట్టిడుకొందు - గాని వట్టిజతనంబ కావింపఁ - గేవలప్రయత్న మాచరించుట నాఁ బాము నన్నుఁ దప్పక దొరించు నన్నసత్యము నాకుఁ దెలియ దనం జనుఁ - ప్రయత్నమాత్ర మునన యేను సంతృప్తివడి కూర్చుంట యన ముఖ్యకర్తవ్యపు టావశ్యకము నాకు సుస్పష్టము కాలే దని వచింపవలయు - "మున్ముందు నాతలంపులు మాఱ కుండునా ? యిట్టిచో శపథముం బూని న న్నెట్లు బంధించుకొందు ?" ననుశంక మనకు సర్వదా వోడమి కలఁతం గూర్చు-"నీవిషయము విడువం దగినది" యన్న స్పష్టదృష్టి లేమిని సైత మాశంక తేటపఱుచుఁ - గాన "వైరాగ్యము లేని పరి త్యాగ మస్థిర" మని నిష్కులానందుఁ డనియె - నెచట విషయవాంఛ నశించు నచటఁ బరిత్యాగరూపకశపథము సహజము ననివార్యము నగుఫలం బని వ్రాకుత్తు. ౧౫

* * *

౮ బ్రహ్మచర్యము ౨

గీ. అతివ కానాఁడు బ్రహ్మచర్యమ్ముఁ దాల్చు, గడియవఱకును దానియీగడ వచింప
నడిగినంతన కాదాడ కవ్వొలంది, యూఁకపెట్టక నాదీక్ష ననుమతించె. ౧

క. ఈ నిగ్రహావ్రతమ్మును, బూనుతఱిన్ మిపుల బాధపొందితిఁ గామా
ధీనమనసునికి సులభం, బౌనె హృషీకపరితాప మార్పుట యంచున్. ౨

గీ. ఆలిమెడనేని వికృతికిం బాలుగాక, యూఁగుమగఁ డుండునా యటంచపుడు తోఁచె
నైన భగవానుఁ డీపవిత్రాశయమ్ము, మనుపఁడా యని దూఁకితి మంటలోన. ౩

వ. వింశతివర్షంబులు కడచన్నవెన్క నీనాఁడు నా బ్రహ్మచర్య విధింగూర్చి యేకతం బాడ నీడులేని యచ్చెరుపాటును నవధిలేని హర్షముం బొడమెడి - నింద్రియ నియంత్రణాదీక్ష నే నెన్నఁడో స్వీకరించితిఁ - గాని యిందు నేఁడు నాకుంగల స్వాతంత్ర్య సమ్మదంబు లా మొదటికాలంబునఁ గానరా - వేలయన నపుడు నన్ను సంసారవాసనలు విడువ వయ్యె - నేవేళ ధర్మభ్రంశము వాటిల్లునో యన్నభీతి నాకు మిక్కుటంబుగా నుండెఁ - గాని నేఁడు నన్ను వాసనలు తఱియంజాలవు - వెండియు నేను బ్రహ్మచర్యవ్రతంబు వలచినవెన్క నొక్కనెల నిండియు నిండక మున్న తలఁపనితలంపుగా శాంతిసమరంబునకు హేరంబపూజ జరిగె - నీవ్రతంబు న న్నాపత్తిష్టంభమున కాయిత్తపఱిచి యుండనోపు - మఱియు ౪

గీ. బ్రహ్మచర్యంబు నిర్దుష్టభంగి నెతఁడు, నడుపు నతఁ డాత్మసందర్శనం బొనర్పఁ
దనువునకు బుద్ధికాత్మకున్ దృఢిమ మొసఁగి, నిత్యమునుగాచు నింద్రియనిగ్రహంబు.

గీ. దమవిధానమ్ము దారుణతపమునట్లు, లిపుడు నాబుద్ధికిం దోఁప దిది యఖండ
రసమయం బైన యుత్తమవ్రత మటంచు, మాటిమాటికిఁ జాటు మన్మానసంబు.

క. వేయేల దీనిమహిమమ, నాయుద్యమకోటి నెల్ల నడుపుఁ దదీయ
శ్రీయొఱపు నన్ను ముగ్ధునిఁ, జేయుచు నానాఁడు పెంపుచెందుచు నుండున్. ౭

క. ఏ నిట్లు బ్రహ్మచర్య వి, ధానంబునఁజేసి యెంత తనిసనుచున్నన్
దీనిపెనువెట్టయున్ నను, గ్లానివశుం జేయుచుండుఁ గడుబెట్టిదమై. ౮

క. ఔరౌర! నాకు నేఁబది, యాఱేఁడులవయసు చెల్లె నైనఁ దదీయ
క్రూరతఁ జూచెద శస్త్రీ, ధారావ్రత మిది యటంచుఁ దలఁచెద నెపుడున్. ౯

క. ఏపురుషుండు రసజ్ఞా, చాపల్యము నడఁచు బ్రహ్మచర్యవిధానం
బాపురుషున కతిసులభం, బీపల్కుట కనుభవంబ హేతు వటందున్. ౧౦

వ. కాన నాతిండి శాకాహార మైనంతమాత్రన యేను దనివిసెందక యింద్రియనిరోధమ్మున కది తోడ్పడునట్లు పరికింపఁజాగితి - మితమై తైారరహితమై యభిఘార దూరమై సాధ్య మగునంతదనుక నపక్వమైన భోనంబు మేలైన దని యే నను భూతిచే నెఱింగితి - నంగీకృత బ్రహ్మచర్యున కడవిం బండినపండులు సముచితాహారం బని పంచవవత్సరంబులు శోధించి శోధించి నిర్ణయించితిఁ - గేవల ఫలా

హారంబుతో నున్ననాఁ డెట్టిసుఖము నెట్టిశాంతి ననుభవించితిఁ దాదృక్సుఖశాంతులు లాఁతితిండిఁ దినునాఁడు నా కందవయ్యె - బ్రహ్మచర్యవ్రత పరిపాలనంబు ఫలంబులు మెసవునాఁడు చుల్కనయ్యె పయఃపానం బొనర్చుతఱి దుశ్శకమాయె- బ్రహ్మచారికి దుగ్ధంబు కీడుసల్పు ననుట కే నావంతయేని జంక - నిట్లనుటంజేసి బ్రహ్మచర్యవ్రతికి క్షీరంబు వర్జ్యం బని తలంపఁ జన - దిం దింకను బరిశోధనమ్ము వలసియున్నది - సన్ననరములఁ బెంచుటలోఁ జక్కఁగా నఱుగుటలోఁ బాలకే మొదటితాంబూల మీఁదగు - పీన నించుక పైత్యదోష మున్నను నివి నిషేవ్యంబుల కాని నిషేధార్హంబు లనరాదు - వెండియు ౧౧

క. నాగాయుత శతసత్త్వము, నాఁగం దగు నింద్రియాళి; నానాదిశలం
దేగతి బళకర ముంచిన, నాఁగక తనయిచ్ఛవచ్చిన ట్లది డుయ్యున్. ౧౨

మం. కడఁగి ప్రేవుల నెండఁగట్టిననాఁడు, చెప్పినపని నెల్లఁ జేయు నింద్రియము
నిష్ఠతోఁ గావించు నిరశనవ్రతము, కామక తా హృషీకంబుల నడఁచు
నియ్యుపాసముపొద్దు లెప్పుడు ముగియుఁ, గోరినభోజ్యము లెక్కడుచు నెప్పటికి
ననుచు నువ్విళులూరునతఁ డాత్మలోన, సకలభోగంబులఁ జవిచూచునతఁడు
వాటించు బాహ్యోపవాసమ్ముకతన, దక్కనా ఫలము రిత్తకురిత్త గాక
యింద్రియమ్ములమీఁద నెత్తిననాఁడు, మనము తోడ్పడకున్న మనము గెల్చెదమె
విషయావలికి మది విత్తుగా నుంట, నది విషయానంద మాసింపనపుడ
యనశనవ్రతమున కబ్బు సార్థక్య, ముపవసించినమాత్ర నోదవునా దమన
మందురు కొంద ఱయ్యది నిక్కమైన, నిల్లి నోల్లనివాని కింద్రియజయము
నిండుగా నబ్బుట నిద్దురలోని, పలు కౌట నెవ్వాఁడు బ్రహ్మచర్యంబు
వలచు వానికిఁ బస్తు వారక వలయు. ౧౩

క. నడవడిని సంస్కరింపక, కుడుపున సవరింత చేసికొనకయ దమమున్
బడయఁ దలపోఁత బెడిదపు, వడకారున మంచుమునురు వలచుట గాదే. ౧౪

ఆ. స్వైరిబ్రదుకునకును సంయమిబ్రదిమికి, భోగిమార్గమునకుఁ జాగిబాట
కేమిపోల్కి-కుదురు నిది దక్షిణం బది, యుత్తరంబు సూచుచుండు నెపుడు. ౧౫

ఆ. బ్రహ్మచారిచూపు పరమేశ్వరుని జూచు, విష్ణుకీర్తనమ్ము వినును జెవులు
భోగిదృష్టి లాస్యమును గాంచు జావళి, పాటరవళి కాత్రపడును శ్రుతులు. ౧౬

క. అతఁడు కనుమూఁత నోల్లక, నుతిసేయును రాము నితఁడునుం గూర్కపయిన్
మతివిడి నర్తనశాలా, స్థతుఁడై రోమాంచములకుఁ జేపడి సాగయున్. ౧౭

ఆ. అతఁడు నిజశరీర మనుతీర్థమును గాచు, కోఱక యింతమెదుకుఁ గోఱుకుఁ గాని
యితఁడు చవులు వలచి యెల్లగడ్డిని దిని, కడుపుఁ గసటుకుడితిగాబుఁ జేయు. ౧౮

గీ. అంత యింతని విడుపున కవధిలేని, యట్ల నిగ్రహధర్మ మహత్త్వమునకుఁ
బరిమితియు లేద తాదృశబ్రహ్మచర్య, మలఁతిజతనమ్ములకు వశ్యమగుట కల్ల. ౧౯

క. చేతస్సు పవనసమ్మిత, మేతన్నిగ్రహ మసాధ్యమే యగు నైనన్
బ్రీతి నెవం డది రామని, కేతన మొనరించు నతనికిం బాలుపడున్. ౨౦

క. మనఉన్నతి నర్థించిన, మునుముం దెన్నెనివెతలు ముడివడు నైనన్
వెనుదీయుట మగపాడియె, ఘనశ్రమము వలదె మేలికర్జంబునకున్. ౨౧

వ. ఆఫ్రికాయం దున్నతఱి నింద్రియదమనంబు సాత్వికాహార సేవనంబునం జేసియ వసపోవు నని విశ్వసించితిఁ - గాని మాతృభూమి కేతెంచిన వెన్క నది కేవల ప్రయత్నమ్ములకుఁ బొల్పడ దనియు రామభజనంబును రామకరుణయు దానికిఁ జరమసాధనంబు లనియు ననుభూతిచే నెఱింగితి - నిప్పట్టునం గృష్ణభగవానుఁ డుపదేశించిన యీ పద్య మవశ్యపఠనీయం బని వాక్రుత్తు. ౨౨

ఆ. కడుపు మాడ్చుకొన్న కతమున విషయంబు, లడఁగుఁ గాని యుడుఁగునా రసంబు
దహరవీథి నెపుడు తత్త్వంబు రాజిల్లు, నపుడ రసము సైత మపసరిల్లు. ౨౩

* * *

౯ మితవ్యయము

క. అందమ్ము లోలుకు వస్తువు, లం దెచ్చితి నిల్లు పెల్లలంకృతిసేయన్
డెందమ్ము చివురుపెట్టెడు, చందమ్మున ననుభవింపఁ జాగితి సుఖముల్. ౧

క. భోగమ్ములపై నొదవిన, రాగము మఖుఁ బుట్టి పుబ్బరా నడఁగారన్
జాగించితి సంసారము, లోఁ గలవెచ్చమ్ము కొంత లుప్తముసేయన్. ౨

క. మడివాలున కిడురొక్కము, కడు హెచ్చుట నతఁడు వలయు కాలమ్మునకున్
మడుఁగులు దేమిని జేయం, గడఁగితిఁ జాకిరము దానిఁ గఱపితి సతికిన్. ౩

గీ. చాకిపనిఁ దెల్పు పొత్తముల్ చదివి కోక, లుదుక నేర్చితి నైర్మల్యసదనములుగ
నెంతవేఁగైన నప్పని వింతయగుట, మదికిఁ బొలివోని వేడుకం గదియఁ జేసె. ౪

క. తొలుతన్ నాసవరించిన, గళపట్టముఁ జూచి మిత్రగణ మది నవ్వెన్
వలసిన యోరిమి పేరిమి, కలమానిసి నొట దానఁ గలఁగక యుంటిన్. ౫

ఆ. ఇచటఁ జాకి లేఁడె యీపీడ యే లని, మేల మాడినట్టి మిత్రతతికిఁ
దనివిఁ గూర్పదయ్యెఁ దనపని తాఁ జేఁత, మంచి దనుచు నావచించుపల్కు. ౬

క. ఎవ రెంతపిసాళించినఁ, దవినకలితనమ్ము చాకితనమునఁ గంటిన్
భువనైకపూజ్యుఁడై వీ, స్మవిలినగోకులుఁడు నన్ను మెచ్చెను దీనన్. ౭

వ. దేశారాధకవతంస మగు నగ్గోపాలకృష్ణు నొక్కయెడ మహాదేవగోవిందరానడే బహూకరించి యొసంగిన రమణీయరాంకవం బొండు కలదు-గోకులుఁ డాసేలును బాలిశాధికమ్ముగా గౌరవించుచుఁ బ్రిధానసమయంబులందు ధరియించు-నగ్గుణవ జోహానున్బర్గునం దనకు జరిగినవిందునం దుపన్యసించువేళ నాసాలుం గప్పుకొన ముచ్చటపడి యది ముడుగఁబాఱి యుంట నసంతృప్తి సెంకుచుండ నేను ౮

క. ఆనెత్తి నెఱింగి సాలువు, నీనఱి నేఁ దొలఁతు రజకవృత్తిం గల నా
దౌనెఱి పరికింపవె కరు, ణానిధి! యని కృష్ణు వేఁడినన్ జిఱునవ్వల్. ౯

క. వెలయించుచు నతఁ డిట్లనె, బళారె! నీన్యాయవాదపాండితి నమ్మం
గలఁ గాని చాకితనమునఁ, గలకందువ నెట్లు నచ్చఁగా నేర్తు నయా! ౧౦

క. ఇది రానడే ప్రసాదం, బిది పూజ్యం బిది యమూల్య మిది కట్టులకుం
గుదు రగునో యే మగునో, మది శంకాతంకములకు మందిర మయ్యెన్. ౧౧

గీ. అనుటయు న్మెలమెల్లఁగా నతనిఁ దేర్చి, పట్టుసాలువు నపుడష్ట బాగుపఱిచి
మేలిమడివా లటంచునమ్మేటి యొసఁగు, బిరుదువడసితి సంతోషభరముతోడ. ౧౨

ఆ. చాకివానిబాధ పోకార్చుకొన్నట్లు, వలసె మంగిపీడ వాప్రకొంట
నీ కెవండు గొఱుగు నిలువకపో మ్మంచు, నన్నుఁ గసరె నొక్కనాపితుండు. ౧౩

వ. ప్రిటోరియాలోఁ దటస్థించిన యియ్యవహేళనం బోర్వ నైత కామింజేసి వైశంబపణ్య వీధికింజని కర్తరి విలిచి శిరోరుహంబుల నెట్లెట్లో కత్తించుకొంటి-నెగుడుదిగుడుగా నున్న నాతలంజూచి నాఁడు న్యాయవాదులు కడుప్రబ్బ నవ్వుటయ కాక ౧౪

మం. నెయ్యురీ! యిది యేమి నీనెత్తిమీఁద, నెలుకలు చెరలాడు నే మంచుఁ బలుక
గాదుకా దీనేలఁ గలతెల్లముండి, యస్మచ్ఛిరంబు నె ట్లొంటుకో నొప్పు
నతఁ డియ్యకొనకున్న నాఁగునా వపన, మేన కత్రించితి నెట్టెటో నెఱులు
సొగసున్న లేకున్న సొంతము గానఁ, గడు నించు నాకు నీకత్తిరిం పనితి. ౧౫

గీ. వారి కీపల్కు విస్మయకారణంబు, కాద నిక్కంబు నొరసిన క్షౌరకారి
నడతలో దోస మున్నదా నల్లవాని, బుఱ్ఱ గొఱిగినచో వీనిపాట్ల మాడు. ౧౬

గీ. ఎవరినో యాడిపోసికో నేల మనకు, లేదె యీ తెగు ల్మాలకు మాదిగకును
వపనవిధిఁ దీర్పు మంగలివానిపట్ల, మనము సైరణ వెలలింతుమా రవంత. ౧౭

గీ. తరతరమ్ములనుండియు వెఱపులేక, భారతీయు లొనర్చు నీఘోరదురిత
మిచ్చినఫలంబుగా నట్టియొచ్చెములకుఁ, జిక్కితి నెటాలుగడ్డలోఁ బెక్కుమార్లు.

* * *

౧౦ బోయరుయుద్ధము

వ. అష్టాదశశత సప్తనవత (౧౮౯౭) వత్సరముం దొట్టి నవనవతితమ (౯౯) హాయనంబుదనుక నామన్గడయందలి యన్యతరానుభూతుల నటు లుంచి బోయరుకయ్యమున్గుఱిచి వక్కాణింతు - నాఫ్రికాదక్షిణభాగమ్మునం దడవులంబట్టి కాఁపురించు హాటెంటాటులును రాజ్యలోభంబునంజేసి సప్తదశశతాబ్దిమొదట నాగడ్డఁ ద్రొక్కిన డచ్చివారును బరస్పరబాంధవములతో బిగిసిరి - వీరిసంతతివార బోయరులు నాఁ దగుదురు - డచ్చివారి శౌర్యసంపత్తు లడఁగారినంతన యష్టాదశశతాబ్ది కొట్టకొసనాళ్ళలో నాఫ్రికాయందలి వారివలసమాగాను లాంగ్లేయులాక్రమించి మెలమెల్ల నెల్లసీమల నెలిచి స్వతంత్రు లైరి - వారియ్యధికారంబు వడయుపాంకె బోయరులు కాఫరులు జూలూలు మున్నగు తద్దేశీయుల నయ్యాయుపాయంబుల నదిమివైచిరి - కాని ౧

క. మగఁటిమిగల బోయరు తెగ, పగపట్టిన కోడెత్రాఁచుఁబాము విధానన్
దగునెడరు వేచి నేఁటికి, దెగించి యొఱకత్తి దూసి తీండ్రిం బయ్యెన్. ౨

క. ఇరువాఁగుల రణభేరులు, మొరసెఁ గడున్ వీరగంధములు గుబులుకొనెన్
మెఱసెఁ గరాచురకత్తులు, కురిసె దునేదారికంటికొలుకుల నిప్పుల్. ౩

వ. అపు డాంగ్లేయప్రభుత్వమువారియెడ నాకుఁ గలనమ్మిక యేత దాయోధనంబున యథాశక్తి వారికి సాయంపడు మని నన్నుఁ బ్రేరించె - మేము మీయేలుబడిలోనివార మనునర్హతం జూపి వలయు చనవులకొఱకు మన మాదొరతనమ్ము వారి నిలువవైచుటకుం బూనిననాఁ డాయర్హతం జేసియ వారి కాపత్కాలమునం దోడ్పడుట మనకర్తవ్య మని యేను భావించితి - నాఁడు మనసకలాభ్యుదయమ్ము లాంగ్లేయులచేతన దేయమ్ము లని తలంచువాఁడఁ - గాన ౪

గీ. కన్ను చెడి కేలు కృత్తమై కాలు తునిసి, నాల్క తడియాఱి ఘోరరణమ్మునందు
దిక్కులేక విలాపించు దీనయోద్ధ, కూడిగముసేయఁ గూర్చితి నొక్కదండు. ౫

ఆ. నాఁడు తెల్లవారు నల్లవాఁ డన వట్టి, పంద యిమ్ముదప్పునందు నిలువఁ
డతఁడు రేయుఁ బవలు స్వార్థంబ వాంఛించు, రిత్తమనిసి యంచు హృదిఁ దలంత్రు.

క. కావున మా సమకట్టిన, సేవావిధి నెఱిఁగి చులుకఁజేసిరి చనువాఁ
డో వెజ్జు బూ తోకండ మ, జా! విజయం బగుత మంచు నలరించె మమున్. ౬

క. అది గా కతఁడు దయాసం, పద బొంపిరివోవ మాకుఁ బ్రథమచికిత్సా
విధి నేర్పి దానికిం దగు, చదు రేర్పడ నంచు నొసఁగెఁ జాతురిలేఖన్. ౮

వ. అంత సేవాకౌతుకంబు వేగిరపెట్ట ౯

క. మా కావించెడికొల్వున, కీకొం డని వేఁడుకొంటి మేల్పడివారిన్
మీ కోర్కి మాన్య మైనను, రాకుం డని కిప్పు డంచు వ్రాసిరి వారల్. ౧౦

గీ. అంతలో సమరమ్మతీ రకటవికట, మయ్యె శాత్రవావష్టంభ మంగబలము
శూరతయు నాఁడునాఁటికి మారిఁబోయి, దొరతనమువారి తాల్మిపాదును గదల్చె.

గీ. దిక్కు తోఁపక మనవారు దేశమెల్లఁ, దిరిగి పలుపాట్లు పడిరి పోటరులఁ గూర్ప
నపుడు రారండు తోడ్పడుం డనుచు మాకుఁ,దంతినం పెనమాత్యసత్తముఁడునెమ్మి.

వ. మా దండునందు మున్నూర్వు రపావృతులు నెనమనూర్వురు కర్మకరులుం గలరు- వీ రెల్లరు భారతీయుల - భిషగగ్రణి యగు బూతు కొండవలె మా కండగా నిలిచె - మేము లోహితస్వస్తికచిహ్నములం దాల్చి పొలికలని కేవల మాయూ డిగమ్ము సాగించుచు నిక్కచ్చి లేకున్నను సమరాంగణమునకుసైత మొక్కమా అరిగి లఘునాళికా బృహన్నాళికలు వర్షించు నగ్నిగోలమ్ములనడుమ మావిధిం బాటించితి - మియ్యవసరంబున దినమునకు రెండు మూఁడామడలమేర పయనం బొనర్చి శ్రమించి రణక్షతుల మోసి తెచ్చి శుశ్రూషించువారము-దళవాయి వుడ్ గేటుం బోని నెఱజోదుల నెత్తికొనివచ్చి సేవించునదృష్ట మిప్పట్టునన్గాకొదవెఁ- గాని సర్వసేనాని రణంబు నాఁపుటంజేసి సార్థమాసమ్ము పదపడి మాకూటువకు విడుమర యొదవె - నియ్యల్పకాలమునం దేముగావించినయలంతి చాకిరి కెంతేని హాగడ్త లభించి తన్మూలమున భారతీయులగౌరవం బతిశయించె - మఱియు ౧౩

ఆ. మా యొనర్చినట్టి యీ యూడిగముఁజేసి, భారతీయులందు బలిసెఁ జెలిమి
కూలివాండ్రలోనఁ గూరె వివేకంబు, తొడరె నాకు వారితోడి జడ్డు. ౧౪

ఆ. ఇతఁడు దాక్షిణాత్యుఁ డతఁ డౌత్తరాహుఁడు, వీఁడు క్రైస్తవుండు వాఁడు మలక
యతఁడు పారసీకుఁ డితఁడు హిందు వటన్న, వింగడంబు కానిపింప దపుడు. ౧౫

క. ఎల్లరకు భారతీయుల, తల్లడ మిఁక దొలఁగు నన్నతలఁపు జనించెన్
దెల్లదొరల చేఁతలఁగో, నుల్లమ్ములఁ బలుకులందు నొదవెను మార్పుల్. ౧౬

గీ. తెల్లజోదులు కొనియాట వెల్లివిరియఁ, జాటిరి కృతజ్ఞత న్మేము సల్పుసేవ
కడరె నొండొరులకుమధురాతిమధుర, మిత్రభావంబు కొలఁదుల మీఱిమీఱి.౧౭

క. ఆపద లతివేలమ్ముగఁ, బ్రాపించినవేళ మనుజభావ ముదారం
బై పొదలు నన్నసూక్తి ని, రూపించెద నొక్కకథ నెఱుంగంజేఁతన్. ౧౮

క. రాబర్ట్సుదొర కుమారుఁడు, తా బవరమునందుఁ గూలఁ దత్కుణపంబున్
మాబుజముల నిడికొని చను, చో బగ్గున మండి యెండ శూరతఁ జూపెన్. ౧౯

క. మాకును మాబడిఁ గల తెల, మూఁకకు నాలుకలు ఱాతిముక్కల యయ్యెన్
లోకమ్ము దాఁటుదుర్దశ, చేకుఱునో యన్నభీతి చెలసెను మాకున్. ౨౦

వ. అపుడు మాపయనించు మార్గమ్మునం దొక చిన్నకొండకాల్వ కన్పించుడు నెవరు మున్ముందు డప్పి వాపుకొన వలయు నన్నపృచ్ఛ మొలతెంచె - నంత మే మాంగ్లేయసైనికులం గని మీరు త్రావినవెనుక మేము త్రావెద మనుటయు మాతోడ వారు నట్ల యనిరి - కా దని మే మంటిమి - వల దని వా రాడిరి - యిట్లితరేతర సౌహృదసమ్మానములతోఁ బెద్దయుం బ్రొద్దు స్పర్ధం బూనితి - మేతాదృశౌదార్య మిక్కట్టులం దిక్క లాఁతివేళలం బాటిల్లునా? ౨౧

* * *

౧౧ నగరసంస్కరణము - క్షేమనిధి

క. నింద కల దొండు నేటాల్, హిందువు లవివేకమూర్తు లెడ్డెలు పశువుల్
మందిరచారిమము శుచిత, యుం దెలియని మోటువా రయోగ్యు లటంచున్. ౧

క. ఈ దూఱు కొంత నిక్కము, నాఁ దగు నే నట వసించునాఁ డిది విని ని
ర్వేదంపడి యేతన్ని, ర్వాదము నడఁగింప నెల్లవంతలు వడితిన్. ౨

వ. సమాజశరీరమ్మునం దొకయల్పాంగమేని చెడియుంట కేను సైరింపఁ జాల - మనలోపంబులు దాఁచిపెట్టి యొప్పరికించి పాచుటకుం గడంగక మాకుఁ బెత్తనంబు లీవలయు నని రాచటికమ్మువారి నర్థించుట నాకు నింపనిపని - కాన నే నీదుర్యశంబు దూరగింపఁ బెద్దయుం బ్రయతించితి - దర్బనునగరమ్మున బొబ్బజాడ్యంబు రేఁగునాఁటికి వణిజ్యాదులం బ్రసిద్ధులైన భారతీయులనెలవుల దిద్దితిఁ గాని లాఁతిమనికిపట్లదెస కేగ నయితి కాదయ్యె - నయ్యంటుఁదెవులు పంచారించిననాఁ డక్కార్యమునకుం బూనితిఁ - గాని యిందు నాతలప్రాణము తోఁకకు వచ్చె నంట యతిశయోక్తి కాఁజాలదు - నేటాలుదొరతనమ్ము నెదిరించుపట్ల భారతీయులు నా కొనర్చినసాయము వారిమేనికసటు వారిచేఁ గడిగించుటకే నొనర్పరైరి - వెండియు నీ జతనంబున ౩

క. కొందఱు నను దూషించిరి, కొందఱు వినయమ్ము నిండుకొనఁ జూతము లే
తొందర యే మని తొలఁగిరి, యిందుల కొకరువ్వ రాల్ప నేడ్చిరి పలువుర్. ౪

గీ. అపు డెటింగితి సంస్కరణాభిలాషి, భయదవైరమ్ములకుఁ బరీభావములకు
నసువు లర్పించుటకు సిద్ధమైననాఁడె, సంఘసంస్కృతిధర్మంబు సాగునంచు. ౫

క. ఈ సంస్కరణోద్యమమున, నాసల్పినసేవఫల మనన్ హైందవులం
దాసలు రెక్కొనె మందిర, వాసస్సౌందర్యవృద్ధి వలయు నటంచున్. ౬

గీ. మొఱలువెట్టుచు నధికారములకుఁ గడిఁది, గోలసేఁతయ కాదు నల్లురును మెచ్చ
కరణిఁ దనవారి దిద్దుఁబో గాంధి యనుచు,నాఁడు తెలవారునన్నుఁ గొండాడినారు. ౭

వ. కాని నేటాలునందలి భారతీయులు మాతృదేశమ్ము నెడఁ దమకర్తవ్య మెద్దియో దాని నింకను గుర్తింప రైరి - హిందూదేశము పేదఱికమికిం బుట్టినిల్లు - కానఁ దద్దేశీయులు ధనసంచయమ్ము కొఱకు లాఁతివిలాతుల కెక్కవలసె - వా రార్జించిన విత్తమ్మునం గొంతపాలు దుర్భిక్షాదిదుర్దశలకు నగపడినతఱిఁ దల్లిగడ్డకు నంపుట ధర్మ్యంబు - వేయేనమున్నాట తొంబదియేడవయేఁట భారతదేశంబునం బెద్దకఱ వేర్పడుటయ కాక మఱి రెండేండ్లకు వేఱొండుకాటకం బతిదారుణంబుగాఁ దల చూపె - నీరెండుదుష్కాలములయందును భారతీయ లాఫ్రికావాసులు తమజన్మభూమి కపారధనసాహాయ్య మొనరించి కృతకృత్యు లైరి - కూలివాండ్రును యథాశక్తి నిప్పట్ల విత్తం బొసంగి-రాంగ్లేయులు న్మగులఁదోడ్పడి-రీయభ్యాసమ్ము నంజేసి భారతభూమి కాపత్తి పొసఁగినపుడెల్ల నాఫ్రికాహైందవులు విత్తమ్ము నిచ్చుట యెల్లరకుఁ దెల్లంబ - యే నివ్విధంబున నాఫ్రికానున్న హైందవుల కూడిగమ్ము సలుపుచుఁ గ్రమక్రమమ్ముగాఁ బెక్కుధర్మంబు లెఱింగితి - సూనృతం బన నొక్కపెనుమ్రానిం బోనిది - దాని నెంతచక్కఁగాఁ బెంతు మంతచిక్కఁగా ఫలించు - సత్యదుమ్రఖని గర్భంబునం జొచ్చినకొలంది సేవారత్నమ్ములు వలసినన్ని లభించు. ౮

* * *

౧౨ స్వదేశాగమనము

మం. బోయరుకయ్యంబు పూర్తియైనంత, నాఫ్రికా నిఁక నస్మదాచరణీయ
కార్యము లుడిగెనె నాకావింపఁదగిన, యూడిగ మెల్ల హిందూర్విసే కలదు
మఱి కొంతకాల మిమ్మహి నుండునేని, హైందవప్రజ కించుకంత తోడ్పడెడి
యక్కఱల్ పొడతెంచు టది నిక్కమైనఁ, గాసుల నార్జించుకర్జంబ నాకు
నుత్తమధర్మమై యుండునో యంచుఁ, గొసలేని తలపోఁతకుం జొచ్చినాఁడ. ౧

వ. అయ్యవసరంబునందు ౨

క. ఇంగను నీదగు సేవా, రంగము నిచ్చటికి మార్చరాదా యనుచున్
సంగాతకాండ్రు హిందూ, ర్వ్యం గలవారలు బలాత్కరించిరి నన్నున్. ౩

క. ఏనున్ భారతభూమికిఁ, బైనం బొనరింప వేడ్కపడితిని నాజర్
ఖానులు కలరుగదా నే, వానిష్ఠితు లిచట నన్న భావముతోడన్. ౪

క. మిత్రములఁ గదిసి నా కిఁక, మాత్రవనికి సెలవొసంగి మన్నింపుఁ డనం
జిత్రములు బహుళదుఃఖ, క్షేత్రము లైనారు కొంతసే పవ్వారల్. ౫

గీ. ఎట్టకేలకు గాద్గద్య మెసఁగ నొక్క, వత్సరములోన నక్కఱ వచ్చునేని
పిలిచినంతన మీరు రావలయునంచు, నియమ మిడి యియ్యకొనిరి నాపయనమునకు.

క. నేమం బది దుర్భర మని, నామదికిం దెలియుఁ గాని నన్నుఁ బవిత్ర
ప్రేమప్రగ్రహమున నెపు, డో ముడిచిరి వార లిం కేటుల్ వలదంమన్. ౭

గీ. కాంచనాంబరధారి మత్కంఠసీమ, గట్టిగాఁ బ్రేమసూత్రమ్ము కట్టినాఁడు
నన్నతఁడు త్రాటితోఁ జేదుకొన్నకొలఁది, నే నతనిసాత్త నగుచున్నదాన బళిరె!

వ. అని మున్ను మీరాబాయి పల్కినయాపోలిక చాలవట్టు నాయందును సూత్ర
పడియెఁబదిమంది గలచోట దైవ ముంట నిక్క మ్మని పెద్ద లందురు - కాన
నెయ్యురకోర్కిం గుఱుచసేయ నేరక యీకొని వారియభ్యనుజ్ఞం బడసితి-
వెండియు ౯

క. నేటాలుతోడ నాకుం, గాటంబగు లంకె యున్నకతమున నన్నా
నాఁటఁగల భారతీయుల, కూటువ పాటించి వీడుకొల్పెడివేళన్. ౧౦

క. విందులలో, వింతల నభి, నందనపత్రములలో ననర్ఘోపదలన్
డెందమ్ము తనియు హార్దము, నందును నోలార్చి పరవశాత్ముని జేసెన్. ౧౧

గీ. ఏను మును భారతక్షోణి కేగుదెంచు, వేళ నేటాలుసోదరుల్ వేలకొలఁది
కానుకలు నా కొసంగిరి కాని నేఁటి, యుడుగర లనినంత నాయుల్ల ములికె. ౧౨

గీ. వెండిబంగారముల కాక వెల్గులీను, రవలు కెంపులు చెక్కినరవణములను
సూడిదలుగా నొసంగి రీనాఁడు వీని, నేమిసేయుదు ననుచింత హెచ్చునట్లు. ౧౩

గీ. మోవఁగారాని జాళువానేవళంబు, ఘోరచిగ నిచ్చి రొకరు కస్తూరిబాయి
కదియు నాసేవ కొసఁగినయట్టి యులుప, గాఁ దలంచుట ధర్మ్యంబు కాకపోదు. ౧౪

క. ఈపావడమ్ము లన్నియు, నాపెట్టెను డాఁచుకొన్న నాదగు సేవా
వ్యాపారం బది భృతక, వ్యాపారము కాక యెట్టు లభినంద్య మగున్. ౧౫

గీ. కనులు మిఱుమిట్లుగొను కెండుకట్టనమ్ము, లబ్బె నొకనాఁడు నాకు నయ్యంపకమున
నాల్గుజాల్ వెట్టివాఁడనై నాఁటిరేయి, గడపినాఁడను గర్తవ్యజడత మీఱి. ౧౬

క. మితిలేనిసొమ్ము నుడుగుట, మతి కింపనిచేఁత యయ్యె మఱి తద్వ్యసనమ్ముం
గుతుకమ్మునఁ జేకొంటయు, నతికష్టమ యయ్యె నాకు నక్కాలమునన్. ౧౭

సీ. పిసిడిన్నై యేను లోకు లర్పించినట్టి, ధనము దిగమ్రింగఁగా నియ్యకొనెదఁ గాక
యాఁకఁ బెట్టక యభ్యస్తలోకసేవ, లిచ్ఛగింతురె నాపుత్త్రు లిట్టిపనికి. ౧౮

క. సేవకు మూల్యము వేదఁగ, యే వినిచితిఁ బెక్కుమాఱు లీకుఱ్ఱలకున్
భావంబు నీటుగోఁటుల, కావలిదై వెలఁదినగల నమ్మితి నెప్డో. ౧౯

వ. మఱియు మాసంసారము క్రమక్రమమ్ముగా సామాన్యజీవనమ్మున కలవాటుపడుచున్నతఱి హిరణ్యఘటీకారంబులకును వజ్రఖచితాంగుళీమ్ములకును మేము తగుదుమా — కావున నీద్రవ్య మంతయుఁ బ్రజాసేవకు వెచ్చించుట యుత్తమకార్యంబని నిశ్చయించితి — నాకొడుకు లిప్పనికి వెనువెంటన మైకోలు చూపిరి — కాని నాయిల్లాలు తద్దయు వైముఖ్యముం బ్రకటించుచు నన్నుంగని యిట్లనియె. ౨౦

మం. నీ కేల యీనగల్ నీచేతికీలు, బొమ్మ లైనట్టి యీబుడుతల కేల
నాల్గవపడి నున్ననా కేల కాని, వల దందువా యెల్లి వచ్చుకోడలికిఁ
దగునందువా ప్రిజల్ తద్దయు మెచ్చి, యర్పించునులుపాల నవలికిం ద్రోపు
శేపెట్టిదో యెవ్వరికి దెల్లమగును, వేగిరింపకు మంచు వేఁడెద నిన్ను. ౨౧

క. అని పల్కెడి నాపెండ్లము, కనుఁదమ్ముల బాష్పవారి కాల్వలుకట్టన్
దనయుల కలంగ రపుడిఁక, వినిపించుట రిత్త నాదువృత్తాంతంబున్. ౨౨

వ. ఏ నట్టితఱిఁ గస్తూరిబాయిం గని ౨౩

ఆ. చాన! యెంత వెఱ్ఱిదానవు బయకారి, బన్నసరము వలచుపడుచు మనకుఁ
గోడ లగునె యైననాఁ డే నెటకుఁ బోదు, బేల! యింతవంత యేల నీకు. ౨౪

క. అనుటయుఁ జుఱుకుంజూపుల, ననుఁ గ్గాని యిట్లుపల్కె నాతి బలా! నీ
యనుకంప నీతలంపులు, మనుగడలుఁ గ్రొత్తలౌనె మాకు మహాత్మా! ౨౫

క. నాసొమ్ము లెల్ల నూడ్చిన, నీసంగతి యే నెఱుంగనేరనె నన్నే
బోసి నొనర్చిన నీవు బలీ! సేయించెదవె కోడలికి రవణంబుల్. ౨౬

క. నీసుతుల నెప్పుడో సన్న్యాసులఁ జేసితివి వార లర్థమ్మిఁక నె
ట్లాసింతు రెవ్వ రెవ్విధి, రోసిన నే నీధనంబు రోయఁగఁ జాలన్. ౨౭

క. అదిగాక లోకు లెవరో, ముదంబుమై నాకొసంగు ముక్తాస్రజముల్
గదియంగ నీకుఁ గలదా, యధికారము; తగవుఁదప్పి యాడకు మిట్టుల్. ౨౮

వ. అని యిల్లాలు పల్కిన పదంపడి యేను మెల్లన యిట్లంటి — మగువా! నేటాలు భారతీయు లీహారంబును ౨౯

క. నీసేవం గని యిచ్చిరో, నా సేవం జూచి యొసఁగినారో చెప్పుమా
రోసమ్ము నేలకొల్చెదు, సీ! సీ! యది యజ్ఞలోకసేవ్యము కాదే? ౩౦

వ. అనుటయు ౩౧

క. ఔ నౌను లెస్సపల్కితి, పీనగ నీసేవ కలరి యిచ్చినది యనం
గా నగుఁ గాని ప్రసన్నత, నూని విచారింపు ధర్మ మొండు వచింతున్. ౩౨

క. నీ సల్పిన సత్కార్యము, నా సల్పిన యదియుఁ గాదె నానాశ్రమముల్
మోసి యనిశమ్ము నీకై, నే సేవయొనర్చుచుంట నిక్కంబ కదా! ౩౩

గీ. అడ్డమాడక నీ తెచ్చు నంతవారి, కింతవారికి నైమక్కు లెల్ల విఱుగ
వండి వడ్డింపలేదె యీ మొండిజంతు, వేమి యిది సేవకాక వే తెద్ది యగునో. ౩౪

గీ. అనుచుఁ గస్తూరిబాయి వాదడుచుపల్కు, లుగ్రశస్త్రంబులై మది నాడుకొనియెఁ
గాని తద్బాధ నోర్చి యిక్కానుకలెల్లఁ, బ్రజకు నర్పింప నాయితంపడితి నప్పుడు.

క. ఎట్టకునేని వెలందుక, పట్టుం దిగఁద్రావి యిచ్చపడె నగ లీఁగన్
గట్టుం దాఁటినముదమునఁ, గట్టనముల నెల్ల మూటకట్టితి నంతన్. ౩౬

వ. అమ్మఱుదియయం దేను మున్ను స్వదేశంబునకు వచ్చుతఱి నాఫ్రికాభారతీయులు నాకొసంగిన పావడమ్ములు సైత ముంచి తద్విత్తంబునకు రుస్తుంజీప్రభృతి సాధుసత్తముల ధర్మకర్తలఁగా నియమించి నాయిచ్చ ననుసరించియొండెఁ బరిపాలకుల తలంపు ననుగమించియొండె నీ సొమ్ము జగద్ధితకార్యంబుల వెచ్చపోవలయు నను కట్టడతో దానపత్రమ్ము లిఖియించి యా ద్రవ్యంబు నొక వాణిజ్యకోశమునందుఁ బదిలపఱిచితి — మఱియు ౩౭

గీ. ఆఫ్రికాసోదరుల కూడె మాచరించు, వేళ నేతద్ధనంబును వెచ్చపెట్టఁ
దలఁచితిని గాని వలయు విత్తంబు సతత, మబ్బుటం జేసి యీసొమ్ము నంటనైతి. ౩౮

క. నానాఁటికి రేకెత్తుచు, నానాఁట న్నెలవుకొనియె నాపత్కోశం
బీనిధి; యిది యిట్లౌటకు, నే నెన్నఁడు నొచ్చుకొంట యెఱుఁగ లనంబున్. ౩౯

క. ఈ చేష్టితంబునం గల, యాచితి మెలమెల్లఁ దెలిసి యబలయు గగ్గో
లాఁచి ముదంపడె మచ్చుల, మూచూడక యిట్టు లేను మోక్షముగంటిన్. ౪౦

క. తనకావించు సపర్యలఁ, గని మెచ్చి జగం బొసంగు కట్నము తనసా
త్తని యెవ్వఁడెంచు నాతని, మనుగడ సంస్కార్య మంచు మానక తలఁతున్.

* * *

౧౩ మరల భారతభూమిలో

మం. భారతక్షోణి కిప్పుగిదిఁ బైనమ్ము, సాగించి నావచ్చు సమయమ్మునందు
మార్గమధ్యమ్మున మారిషస్ రేవు, తగిలె నచ్చట నౌక తడవుంటఁ జేసి
తరణిపొత్తును వీడి ధరణికి వచ్చి, యానేలవారి వృత్తాంతంబు లరసి
తద్రాష్ట్రపాలకత్వంబును మోయు, నతని చార్లెస్ బ్రూసు నాతిథ్య మంది
కతిపయవారముల్ కడముట్టుసరికి, మాతృభూమికిఁ జేరి మన్మిత్రబంధు
సందర్శనార్థ మచ్చటికి నిచ్చటికి, నేగుచుఁ గడపితి నిట్లు కొన్నాళ్లు. ౧

వ. ఇది వేయితొమ్మన్నూట యొకఁడగు శరత్తునాఁటి యుదంత–మాయేఁడు కాళీఘట్టమ్మున దిన్షావాచాయాజమాన్యమున భారతజాతీయమహాసభ జరుగనుండె–నింతకుమున్ను నే నాసదస్సుం గనియెఱుంగ–నిపు డందు నేటాలుభారతీయసమస్యం బ్రవేశపెట్ట నెంచి యే నప్పరిషత్తున కేగ నిశ్చయించితి–నింతలో సభాసమయమ్ము తఱియంబడ వాచా,ఫిరోజిషా,సెతల్వాడు మున్నగుమహారథులెక్కి–నధూమశకటంబు నధిరోహించి బొంబాయినుండి తత్సభాప్రయాణంబు సాగించితి–మధ్యేమార్గంబున ఫిరోజిషా నాగొడవనెల్ల నాలించి ౨

గీ. మాతృదేశంబు దాస్యనిర్మగ్నమై భ, రింపఁగా రాని నిందాపరంపరలకు
నగ్గపడి దురపిల్లు చున్నంతవట్టు, తలఁగునా మనయిక్కట్లు వలసలందు. ౩

ఆ. ఇంట గెల్వనప్పు డేరీతి రచ్చలో, గెలుపువచ్చు నంచుఁ బలుక నతని
యట్ల పెదవివిఱిచె నా సెతల్వాడు నా, యెల్లయాస లపసరిల్లుభంగి. ౪

క. నాచక్కి కపుడు దిన్షా, వాచా కరుణార్ద్రదృష్టి వఱపి సమజ్యాక్
సీచొన్నపనిర్ణయము నో, యీ! చక్కలిఖించి తనను నిమ్మా యనియెన్. ౫

గీ. దాన నొకకొంత తేఱి యేత ద్దయాబ్ధి, కే వినీతుఁడనై మ్రొక్కు లిడితి నంత
జయజయధ్వానములు పెద్దసందడింపఁ, గదిసె మాబండి కాళికాఘట్టనగరి. ౬

వ. పదంపడి పౌరలోకం బతిలోకవైభమ్మున సభాపతిమున్నగు మహామహులఁ ద త్తదుచితవసతులకుం గొనిపోవుడు నేను బ్రతినిధులకై నిర్ణయించినవిడిదలకు రిప్పన్కళాశాలాభవనమ్మున కేగితి – నాపుణ్యావశమ్మున లోకమాన్యుండు మా బసకు విజయంచేసె – నతఁ డుండుచో టొకకొలువుకూటంబ యగుఁ గదా – చిత్రకళాచతురుండ నైనచో నే నాదృశ్యంబు నెన్నఁడో రచించుకొనువాఁడ–నాఁడు తిలక్ మోతీబాబులు దొరతనమ్మువారి దుండగమ్ములన్గుఱిచి కావించిన

ప్రసంగములును వానినడుమనడుమ వెలువరించు కంచినవ్వులును జిరస్మరణీయ
మ్ములు నాఁ దగు - నిఁక మహాసభా నగరమ్ము దెసకు నాచూపు నించుకనిగుడ్తు-
నందు ౭

ఆ. వలసినంతమంది స్వచ్ఛందసేవకుల్, కలరు గాని సుంత కలుపుఁగోలు
తనము కానరాదు తాలిమి శూన్యంబు, నేరిమియు హుళక్కి వారియందు.

క. ఏసాయ మెవని వేఁడిన, నాసేవకుఁ డపుడ లాఁతి నప్పనిఁ బనుచున్
శాసించు నాతఁ డన్యుని, గాసింబడి సభ్యకోటి కలగుండుగొనన్. ౯

ఆ. అప్పు డేను గొంద ఱైచ్ఛికభటులతోఁ, జెలిమి నాచరించి సేవ తెఱఁగు
విన్నవింప సిగ్గువిరిసెను గైంకర్య, రతియు వారియందు నతిశయించె. ౧౦

వ, వినను బ్రజాసేవనాసక్తి కుక్కగొడుగుంబలె నెల్లయెడల నుదయింపఁ జాల -
దయ్యది యంతరంగమ్మునం బుట్టి యనుభూతిచే విస్తరిల్లవలయుఁ - గల్లకపటంబు
లెఱుంగని వీరికి సేవాభిరతి వలసినంత కలదు - కాని యోర్పునేర్పు లెవ రిత్తురు?-
జాతీయమహాసభయన్న నేఁడాది కొక మూన్నాళ్ళపండువు గదా ! - తావన్మా
త్రమున వీరి కబ్బునమభవం బెంత? - మహాసభా ప్రతినిధులును స్వచ్ఛందసేవ
కులవోలె నల్పానుభూతిగలవారల - వీరు పెక్కండ్రు ౧౧

క. తమ కేదో నెఱదొరతన, మమరినగతి మాటిమాటి కైచ్ఛికభటులన్
శ్రమపెట్ట నెంతు రకటా!, తమలెంకలఁబోలెఁ జూచెదరు జంకెనలన్. ౧౨

గీ. దాక్షిణాత్యులు భుజియించుతటి నొరుండు, చూడఁగా దఁట తద్ధర్మసూత్రరక్ష
కేరుపడె వేఱుగావంటయిల్లు; దాని, దడులు రవిమండలమ్మును దాఁటిపోయె. ౧3

క. వంటకు నీరాటకు మఱి, తింటకు నది యొకఁడ; గుర్రిక్కతిర్రిప్పఁగనీ కా
యింటఁ బొగరేఁగు నిల్లని,యంట తగదు మందసంబ యనఁజను దానిన్. ౧౪

క. ఇది వర్ణధర్మబాహ్యము, కద జాతీయోద్యమానుగంతలు చదువ
ర్లదిరా యస్పృశ్యత ని,వ్వీథి మెచ్చిన వీరిమీఁద బెద్దఱికంబుల్. ౧౫

క. మోపిన సామాన్యప్రజ,లేపగిది న్నడుతు రింత కెన్నిమడుంగుల్
పాపము పెంతురొ యని సం,తాపమ్మునఁ దోఁగి తద్ద తల్లడపడితిన్. ౧౬

క. అక్కడఁ గలగొలునకున్, ముక్కులు మొత్రోయటంచు మొత్తుకొనియె నే
చక్కిం జూచినఁ దెమ్మరయె, కక్కాదవెడి నేఁడు దానిగాథలు సెప్పన్. ౧౭

ఆ. మఱుఁగుదొడ్లు ఘోరనరకంబు లక్కటా!, యేమి యీయవస్థ సామి! యనుచు
నడుగ జంకులేక యైచ్ఛికభటుఁ డది, కుప్పవానికర్జ మప్ప! యనియె. ౧౮

క. అటు లగుచో శోధని యొక్కటి సంపాదించి యీయఁగలవా యంటిన్
భటుఁ డంత వెల్లఁబాఱుచు, నిటు నటుఁ గాల్కదలనీక యీక్షించె నన్నున్. ౧౯

క. ఏన పదంపడి యెట్లో, దాని న్గడియించి పెడలి తగ నూడ్చితిన్
గాని యిటు లెన్నిపెరడుల, మానుగ సవరింపనేర్తు మాపులు ద్రేపుల్. ౨౦

క. పలువురకుం బ్రతినిధులకుఁ, దెలియద యౌచిత్య మేమి తెగడెద వారిన్
నెలవునపంచల నంచుల, మలమూత్రము లుజ్జగింతురు మాపటిజాలన్. ౨౧

క. స్వచ్ఛందభటుల కేత ద, నచ్ఛక్రియఁ జూప నొక్కఁ డైనఁ దదీయం
బుచ్ఛను విష్ఠను దుడువఁగ, నిచ్ఛింపఁడ నాను ముట్టె నీగౌరవమున్. ౨౨

వ. మహాసభ యింకను గొన్నాళ్ళు సాగుచో నంటుఁదెగుళ్ళు తప్పక పీఁటవెట్టు నని తలంచితి - నట్టి దురాచారపరాయణులగు ప్రతినిధులును సేవాధర్మానభిజ్ఞులగు స్వైచ్ఛికభటులును మనదేశమునం దీనాఁడును వలసినంతమంది కల రనుట నిక్కంబ.

* * *

౧౪ లేకరి - లెంక

క. కాళీఘట్టమునందున్, గాలిడి యొడ్డోలగంబుగడియకు నిక రె
న్నాళు లెడముంటఁ దత్కా, ర్యాలయమున సేవఁ జేత కభిరతిఁ గొంటిన్. ౧

వ. దీనం జేసి జాతీయమహాసభావిషయంబులం దించుక యనుభూతి నార్జింపవచ్చునని నాతలంపు - కానఁ బరిషత్కార్యదర్శియగు ఘోషాలుచెంతకుం జని నన్ను నందేని పనిగొమ్మని వేఁడ నతండు నన్నాపాదశీర్ష మవలోకించి మందహాసం బొలయ మాకడ లేకరిపని యొండు కలదు - వలయు నందువా - యనుడు నేను మిన్నంది ౨

క. కావింతు నెద్దియైనను, సేవాధర్మమునఁ బెద్దచిన్నలు కలవా
నా విని నీశుశ్రూషా, భావము పరిపూత మార్యపరిగణ్య మనెన్. ౩

క. అతఁ డంత స్వైచ్ఛికభట, ప్రతతిన్ సవిధస్థుఁ దేటపడఁ గని తరుణుం
డితఁ డాడినట్టిపల్కులు, శ్రుతిఁ బడెనా యని వచించి సురుచిరముఖుఁడై, ౪

వ. నన్నుఁ జూచి సోదరా! యివ్వ్యాసనంబునం దధివసించి యసంఖ్యేయలగు నాలేఖలం బరికించి వలయువానికి నుత్తరమ్ములు వ్రాయు - మికార్యంబు నిర్వహించు లేకరి లేక నాపడునిడుమలు నోడువం బాలివి గావు సుమా - వేలకొలఁదిగఱువలు నాకొఱకు నేతెంచుటం గంటిని కదా - యూపిరిపుచ్చ లేక కటకటం బడుచున్ననా కీసాయం బొనరించి పుణ్యమునం బొమ్ము - నావుడు ౫

గీ. అతిరథశ్రేణికిం జెందు నమ్మనీషి, యిట్లు నను విశ్వసించుట కే నెలర్చి
యప్పగించినపని వేగ యాచరించి, యతనిమన్నన వడసి ధన్యతను గంటి. ౬

గీ. పిదప నాతఁడు నాయూరు పే రెఱింగి, వెల్లఁబొఱుచు ముక్కుపై వ్రేలునిల్పి
యెంతపొరపాటు పుట్టె నీయంతవాని, నింతయన్నవపనిఁ బంచు టేమిపాడి. ౭

క. పశ్చాత్తాపము వెలయ వి, పశ్చిన్మణి యాతఁ డిట్లు పల్కుడు నతనిన్
నిశ్చింతుం బొనరింప వ, యశ్చాతుర్యముల సేవనారంభములన్. ౮

క. మీరలు వృద్ధులు జాతీ, యారంభములందు ప్రెల్లనయ్యెను దల మీ
కీరెక్కడ నేనెక్కడఁ, దూరుపుపడమర లెఱుంగుదురె ననుబోఁటుల్. ౯

క. భారతజాతీయసభం, జేరి యథాశక్తి సేవసేయఁగ నువ్వి
ళ్లూరెడినా కలవోకగ, మీ రొసఁగినపనియ తద్దమే లొనరించున్. ౧౦

వ. అని యేను గృతజ్ఞతం జూపితి–నంత నక్కార్యదర్శి నన్నుం గని ౧౧

క. నీనడవడి యభినంద్యం, బీనాఁటియువల్ చరింప రీబాటలలో
మానక వలచెద రర్హత, లేని పదంబులు భరింపలేని యశంబుల్. ౧౨

మం. చిననాఁడు హ్యూమ్ముతోఁ జేతులుకలిపి, శ్రమియించినాఁడ నీసభ యేర్పడంగ
దీనిమన్గడయెల్లఁ దెలియుదుం జూవె, దీనిసేవయ నాకుఁ దియ్యనిచేఁత. ౧౩

వ. అని పెక్కువిశేషంబు లెఱిఁగించె – నివ్విధంబున మాకు గాఢస్నేహ మేర్పడుటం జేసి పగటిపూఁట నిర్వారముంగలిసి భుజియింపఁ దొడఁగితి – మతఁ డంగీని దాల్చి తటి నింటిబంటు వచ్చి గుండీలం దగుల్చు – నది గని యేన యప్పని గావింతు నని వేఁడ నక్కార్యదర్శి వల్లె యనియె – గఱువలయెడ నాకుంగల పేర్మి యీకోర్కెకిం గతము నాఁ దగు – ఘోషాలు నాతత్త్వంబు నెఱింగినవెన్కఁ దనకార్యంబుల కెల్ల నన్నుఁ బనుచువాఁడు – నే నొక్కనాఁడు తన గుండీలం బెట్టుచుండ నమ్మెటి ౧౪

క. మూఁతిబిగియించి భారత, జాతీయమహాసదమ్ముసచివుని వెత లీ
రీతివి గద యెసలిక లే, కాతం డసమర్థుఁ డయ్యె నంగీదిద్దన్. ౧౫

వ. అనుటయు నతనిబోళాతనంబునకు లోలోన నవ్వుకొంటిఁ – గాని యతని కొనరించునూడిగమ్ముదెస నా కించుకేని యనాదరంబు వొడమ దయ్యె – నీపరిచర్య కతన నా కొదవినమేలు సవతులేనిది. నాఁ జను – ఘోషాలుబాబుం గొలుచుటఁజేసి భారతజాతీయమహాసభా రహస్యము లెన్నే నెఱింగితి – గోకులుఁడు, సురేంద్రనాథుఁడు, మున్నగు మహామహుల మార్గంబులు కనుగొంటి – నెందఱో ప్రజానాయకులపరిచితి నార్జించితి – మహాసభయం దమూల్యమగు సమయ

మెంత పాడగునో తెలిసితి–నాంగ్లభాషకుఁ గల పెత్తనంబు నరసి మిగుల దురపిల్లితి–నొకఁ డొనర్చు కార్యంబు పలువురు గావించుటయు నక్కఱ దీర్చుట కొక్కఁడేని పూనమియుఁ గంటి – నిట్టికొఱంతలు నాయెడఁద నెంతకలంచినను నేఁ డివి నివార్యంబులు కావని తోఁచుటంజేసి వీనియెడ నాకు దురభిప్రాయమ్ము పుట్టదయ్యె.

***

౧౫ జాతీయ మహాసభలో

గీ. త్రిభువనీకళూహానం బైన దీప్తితోడఁ, జాగెఁ బరిషత్తు తన్మహాసభ నలంక
రించు నతిరథలోకము న్గాంచినంత, నంతరంగమ్ముతోడ నాయంగ మదరె. ౧

క. ఆసభ కధ్యక్షుండై, భాసిలు దిన్షా రచించె భారతమునకున్
వీసము తగ్గని సదుప, న్యాసం; బది చదువ శక్యమా సకలంబుల్. ౨

వ. అగుటంజేసి దాని యాయువుపట్లు కొన్ని వినిపింపఁబడె – నవ్వల విషయనిర్ణాయకసభ ప్రారంభమయ్యె – నుదారుఁడగు గోపాలకృష్ణగోకులుఁడు న న్నాగోష్ఠికిం దోడ్కొని చనె – నందు మహామహులు పెక్కు రాయయివిషయమ్ములం గుఱించి యాంగ్లభాషలో దీర్ఘచర్చలు గావించుచుండి – రీదుందుభిధ్వానములలో నాబూర యెవని చెవి కెక్కునా యని యేను మిగుల బెదరితిఁ – జీఁకట్లు పడుచున్నకొలఁదిఁ బరిశిష్టవిషయంబులు శరవేగమునఁ బరిష్కృతంబు లగుచుండె – సభ్యు లెల్లరుం బసకుఁజేర నారటంపడఁజాగి – రింతలో నర్ధరాత్రమ్ము కదియం బడె – నపుడు ఫిరోజిషా కొలువుం గలయఁజూచి యిఁక నిండ్ల కేగరాదా యని పల్క గోకులుం డెలుఁగెత్తి ౩

గీ. ఆఁగుఁ డాఁగుఁడు గాంధిగా రాఫ్రికా స, మస్య వినిపింతు రనుడు నమ్మాన్యనీయుఁ
డోర్మి వెలయించి గోపాలు నొయ్యఁ జూచి, నచ్చెనా మీకు వారినిర్ణయ మటనియె.

ఉ. నావుడు గోకులుండు సుజనస్తవనీయుఁడు దాని మెచ్చె ది
న్షా వఠియింపు మంచు నను సన్నయొనర్చె నెలుంగు రాల్పడన్
మై వడఁకం బఠించితి సమర్థనముం బొనరించె గోకులుం
డావల సభ్యు లెల్ల రగు నౌ నని సమ్మతిచూపి రొక్కటన్. ౫

క. తేపటికొల్వున గాంధీ, నీపాలికి నిడుదు నైదునిముసము లని ది
న్షాపల్కెఁ గాని సభ్యులు, చూపినచిఱుచిట్టి కేను గ్రుక్కంబడితిన్. ౬

గీ. తెల్లవాఱె మహాసభ వెల్లివిరిసెఁ, జర్చపైఁ జర్చ రేఁగె విశ్వమ్ము వడఁక
నిచట నీతప్పుపాటులో నేమిసెప్ప, నేర్తు దైవమా యనునక్క నిండె నాకు. ౭

గీ. ఓలి నరుదెంచె నావంతు మేలిరవళి, నపుడు నాపేరు పిల్చి రధ్యక్షుపాదు
లెట్టెటో వేదికంజేరి పట్టరాని, జంకుతో నిర్ణయంబును జదువఁగంటి. ౮

ఆ. అవల భారతీయు లాఫ్రికాగడ్డలోఁ, గుడుచు నొఁటకటమ్ము కొంత కొంత
సభకుఁ బట్టువఱుపఁ జాలితి నింతలో, బల్ల మీఁదిగంట ఘల్లు మనియె. ౯

వ. పదంపడి యేను నాపీఁటకుం జేరితి—నానాఁడు జాతీయమహాసభా ప్రతినిధులకుం
బ్రేక్షకులకు నంతరము గానరా దయ్యె—నెల్ల రెల్ల విషయంబుల పట్ల నభిప్రాయ
భేదమ్ము లేక చేతు లెత్తెడివారు—నా ప్రస్తావమ్మునైత మాఁగాదులం బడక
యూరీకృత మయ్యె—దీనం జేసి నానిర్ణయమ్ముదెస నా కెన్నఁడగినమేలు గోచ
రింప కుండె—గానివిశ్వభారతజాతీయమహాసభ కాఫ్రికాసమస్య పరిచితమై
తన్ముద్ర వడసెఁగదా యన్నతను పావహిల్లె. ౧౦

* * *

౧౬. కర్జన్ ప్రభువు కొల్వు

గీ. సభ సమాప్తమయ్యెఁ జాగిరి తమతమ, యిండులకు సదస్యు లెలమితోడఁ
గాని నాకు నాఫ్రికాపను లుంటచే, వంగరాజధాని వదలనైతి. ౧

క. సడిసన్న భారతీయులు, విడిసెడిబస కేగి పీఁటవెట్టితి సాధ్యం
పడునెడ వారికి నేటాల్, కడగండ్లు వెలార్చి నెమ్మి గాంచుటపొంకెఁ. ౨

క. ఆపట్టున కపు డప్పుడు, గోపాలుఁడు వచ్చు నాటకొఱ; కొకనాఁ డ
ప్పాపవిదూరుఁడు నను దన, కాఁపున వేంచేయ నింపుగదురం బిలిచెఁ. ౩

క. గోకులునిపిల్పునకు నుర, రీకృతి నాదృతిని వెల్వరించియు నేనై
పోక తగ దంచు నాఁగితి, నీకరణిఁ మూఁడునాలు గేగ న్దినముల్. ౪

వ. అంత నయ్యుదారచిత్తుఁ డే తెంచి తానై నన్నుఁ దనమనికిపట్టునకుం గొనిచని
గారవింపఁ దొడఁగె—నొక్క నాఁ డతఁడు నాపుచ్ఛడీకతనమ్ముగని గాంధీ! నీ
వీవిలాతియంద యునికి వలయు—నిట్టిసిగ్గరితన మున్న నిం దేమిసాధింపఁగలవు—
నీ కెంతమంది చెల్మికాండ్రైన నంతలగ్గు—వెండియు నిన్ను భారతజాతీయమహా
సభాసేవకుని గావించుట నాయభిమతం—బని నాబిడియము గొంతవట్టు డిందు
పఱిచె—నితనిపజ్జకుం జనకమున్నుమాఁబసయందు నా కబ్బినయనుభూతి యొందు
వినుతు. ౫

క. రాజప్రతినిధి కర్జను, తేజుమెయిన్ నాఁడు కొల్వుదీర నశేష
క్ష్మాజానులు వచ్చిరి గజ, వాజిమహాంగాదివైభవం బెసరేఁగన్, ౬

గీ. అందుఁ గొందఱు మాబస నాశ్రయించి, డంబ మెఱుఁగని చౌకవేసంబుతోడ
మెలఁగుచుండిరి కాని యక్కొలువునాఁటఁ, బొల్పడిరి నూత్ననూత్న నేపథ్యములకు.

క. దాసీపుత్త్రుల కైవడి, గౌసెన కైసేసి లాఁగుగట్టిరి మేలౌ
కాసె బిగించిరి మఱి జల,పోసనపుం బాదుకలను బూనిరి కడఁకన్. ౮

క. తలచీరలు చుట్టిరి వా,రల వేసము నాకు దుర్భరంబగు నార్తిన్
మొలపించె నిట్టికైసేఁ, తలకుం గతమే మటంచుఁ దలఁచెసితి వారిన్. ౯

వ. అంత వారు న న్నాదరంబుమైఁ జూచి ౧౦

క. మే మనుభవించునరకం, బేమ యెఱుంగుదుము బిరుదు లెమ్మెలు సొమ్ముల్
భూములు జితింప మాపడు, బాముల బన్నముల గుట్టు పరుఁ డెట్లెఱుఁగున్. ౧౧

వ. అని మాఱుపల్కుడు నే నంత నిలువక బానిసీండ్ర కనురూపంబులగు నీతలగుడ్డ
లీపాదరక్షలు మీ కేల యని పృచ్ఛసేయ నమ్మహారాజు లిట్లనిరి. ౧౨

ఆ. ఏమి కన్నవాఁడ వెరవది మాపట్ల, బానిసీండ్రపట్లఁ బలుకరింపు
మకట ! వీరు మాకు నడియరులైన లెం, కలము గామె మేము కర్జనునకు. ౧౩

గీ. కొలువుకూటంబునకుఁ బోవి గొప్పతప్పు, సహజవేషంబు వాటించి చనుట సొడ్డు
బదవ లెన్నని సైఁచి పోయెదము కాక, మాకు వశమానె దొరతోడిమాటలాట.

వ. అనుటయు వారిదుర్దశం దలఁచి యేను మిక్కుటమ్ముగాఁ జుమ్మలుచుట్టితి -
హార్డింజిప్రభువు వారాణసీవిశ్వకళాశాలకు శంకుస్థాపన మొనర్చిననాఁ డిట్టిపేరో
లగం బొండు నడిచె - నెంద తెందఱో నరేంద్రులాసభకు విచ్చేసిరి - భారతా
లంకరణ మగు మదనమోహనుచే నాకారితుఁడనై యే నాకొల్వునం బాలుగొంటి -
నపు డస్మ్యేలికలు ౧౪

మం. కౌశేయమగు లాఁగు గట్టి నుంజిలుఁగుఁ, బట్టుచొక్కా దొడ్డి ప్రసన్నరియాణి
ముత్యాలసరములు మోచి యనర్ఘ, కేయూరములు దాల్చి కీర్తితవజ్ర
కలితావతంసంబు గట్టి రింతులకై, సోయగం బిడు వారిసొమ్ములఁ గాంచి
వలువలఁ జూచి దుర్వారశోకంబు, గుడిచితి భూపాలకులు పరిష్కరణ
సామగ్రి యిటులుండ స్వర్ణత్సరువులు, ఖడ్గముల్ చెక్కి రక్కట వలగ్నమున
నవి రాచటికమున కానవాళ్ళా? దు, రంతదాస్యముగు ర్తులా? నెలంతలకుఁ
దగినకైసేఁత లీధరణీశ్వరులు గ, ణించుట కడు శోచనీయంబు; విత్త
మధికార మభిమాన మక్కటా! మనుజు, నెట్టిదుర్గతులకే నీడ్చుట నిజము. ౧౫

* * *

౧౭ గోకులుతో నొకనెల ౧

క. తన తమ్ముఁగుఱ్ఱకై వడి, నను గోకులుఁ డాదరించి నాబెరుకెల్లన్
దుడుమాడెను దొలుఫ్రూఁటన, కనుఁగొని సమకూర్చెఁ దగుసుఖంబులు తనకున్. ౧

ఆ. నాకు వలయువసతు లేకొంచెమో యటాట, చేన నాదుపనులు నెఱపుకొంట
నన్ను నిశితనియమ మెన్నఁడు విడకుంట, హత్తుకొనియె నతనిచిత్తవీధి. ౨

క. ఆకతమున గోపాలుఁడు, నా కచ్చెరుపాటు వుట్ట ననుఁ గొండాడున్
నాకడ గోపన మన్నది, లేకయ చరియించు నిర్వ్యాళీకప్రేమన్. ౩

క. తనదరిసెనమ్ము వడయం, జనుదెంచు నుదాగపురుషసత్తములకు నా
కనఘుం డెఱుకువ గూర్చుచు, ననుఁ బరమానందరాజ్యనాథు నొనర్చున్. ౪

వ. నాఁడు నాకుం బరిచితులైన గఱువలలో వైజ్ఞానికపండితశిఖామణి ప్రఫుల్లచంద్రుఁ డుత్తముఁడు – తనకు వచ్చు నెలసంబళ మెనిమిదివందలలో నలువదిరూకలు మాత్రమితం డనుభవించి తక్కర్థమెల్ల దేశసేవ కొసంగు ననియు నిందనుక నితఁడు బ్రహ్మచారి యగుటయ కాక ముందేని పాణిగ్రహణవాంఛ లేనివాఁడనియుఁ బల్కి గోకులుఁడు నా కితనితోడి నెయ్యమ్ము గూర్చె – నాఁటికిని నేఁటికిని బ్రఫుల్లచంద్రుని మన్నడయం దెట్టివేఱిమియుం గానరాదు – గోకుల ప్రఫుల్లచంద్రుల సల్లపనంబు నే నాపోకలేక వినుచుండువాఁడ – దానికి దేశాభ్యుదయమొండెఁ దత్త్వజ్ఞాన మొండె గుఱియై యుండు – నాదృష్టిలో నపాంపతు లగు ప్రజానాయకులు కొందఱు వీరిచూడ్కిలోఁ బడియ లగువేళ నామనస్సు చివుక్కురు మనుచుండుఁ – గాని వీరు వెడపల్కు వెలువరింతురా యని యూఱట సెందు వాఁడ – గోపాలకృష్ణుని పరామరిక యెడ నాకుం గలవిశ్వాస మతివేలము గదా – వెండియు ౫

చ. అతఁ డొకతెప్పపాటుతడవైనను వీసరవోవనీక భా
రతజగతీహితం బగు తెఱంగునఁ జల్పు సమస్తకార్యముల్
చతురుఁ డతం డొనర్చుపని సంతస మిచ్చుటె కాక లోకవి
శ్రుతము వివేక మిచ్చి పెనుచున్ జననీపరిషేవనేచ్ఛలన్. ౬

గీ. అతనివాక్రుచ్చు నెల్లవాక్యంబునకును, భారతక్షోణి వస్తువై పరిఢవిల్లుఁ
గపట మెఱుఁగక దబ్బఱకంపు లేక, యలరు నైర్మల్యకందమై యతనిపల్కు. ౭

క. బందిగములోన మ్రగ్గెడి, హిందూజనయిత్రిఁ దలఁచి యెండినపొట్టన్
వందురుసోదరులం గని, డెందం బది త్రెవ్వఁ దాఁ గడింది గ వగచున్. ౮

మం. తమగారవించు నుద్యమములదెసకు, నితని నాకర్షింప నేతెంచువారి
కేల పెక్కులుమాట లీరు మీపనులు, పాటించి నన్ను నాపని సేయనిండు
మునుముందు దాస్యనిర్ముక్తభారతము, నభిలషించెద నిచ్చ యాది పండినపుడ
యితరమ్ముదెసకు నా దృష్టి సారింతు, నని యుత్తరం బిచ్చునట్టిగోకులుని
నేమంబు సూచి యే నివ్వెఱపడితి. ౯

వ. రానడేపట్లఁ దనకుం గల పూజ్యభావమ్ము నతఁడు తన యెల్లవాక్యమ్మునం దచ్చు పఱచు – "రానడే యివ్విధిం బల్కువాఁ" డనువాక్కితనికి "సూతుఁ డిట్లనియెం" బోనిది – యే నితని సన్నిధి నున్నపుడ రానడే జన్మదినోత్సవము సంఘటిల్లె – నాఁడు గోకులుఁ డమ్మహామహుని సర్వజ్ఞతను నిర్భీకమగు దేశభక్తిని వర్ణించుచు ననుభవించిన హర్షపారవశ్యమ్ములు నుడువం బాలివి కావందు – మఱియు నొక్కనాఁ డేను గోపాలకృష్ణుం గని ౧౦

మం. ఈపురంబున మరుత్తిది నాఁగఁ జనుచు, వీథివీథికి నుండు విద్యుచ్ఛకటము
దీని నెక్కిననాఁడు దేశనాయకుల, గరిమంబు డిందునా కాదేని నీకు
నేల గుఱ్ఱపుబండి యీవెచ్చ మేల, యనుడు నించుక కుంది యతఁ డిట్టు లనియె.

వ. సామ్రాజ్యశాసనసభా సభ్యతంజేసి నాకుం బ్రాఁబడువిత్తమ్ము నాసొంతపనుల కొదవంజేయ నొల్ల – నా కెందఱు పరిచితు లుందు రందఱు నీకుం గలరయేని యానాఁడు నీవు మెఱపుబండిం బయనించుట యసాధ్య మనను-గాని వాలాయమది దుష్కరం బగు నందు – నాయకు లొనర్చు నెల్లపనియు వారిసంతుష్టి కొఱక యని తలంచుట కించుకే నెడము లేదు – నీవునైత మీమాత్ర తెలియమి కడుంగడు విచార్యము – మఱియు ౧౨

ఆ. మెచ్చుకొందు నీదుమితజీవనం బేను, నదియ వలతు శక్య మైనవట్టు
కాని నన్నుఁబోనిమానిసికిం గొంత, యుడుపరానివెచ్చ ముండుఁ జువ్వె. ౧౩

గీ. అనుడు నాశంక సకలంబు నపసరిల్లెఁ, గాని "నీ వసివా ర్పోవు టే నెఱుంగ
నిది తెవుళ్ళకుఁ బాదు గాదెట్లు? వీలు, చిక్కదె వయాళికిం బ్రజాసేవ"నంటి.

వ. నా యీయభిశస్తికి గోకులుం "డబిసీలుసల్పు నెసలిక నాకుం గలదని నీవెంతువా" యని మాఱుపల్కె – నీవాక్కు నా కసంతృప్తికారిణి యయ్యెఁ – గాని వక్తయందలి గౌరవంబు నానోటికిఁ దాళమ్ము వైచెఁ – దినుటకుం దీఱిక చేపడినట్లు వాహ్యాళికిం దలపడు నని నాతలంపు – శరీరపరిశ్రమము దేశసేవం బెంచుఁ గాని కుంచ దని యేను వినీతిమెయి నూహింతు. ౧౫

* * *

౧౮ గోకులుతో నొకనెల ౨

సీ. గోపాలకృష్ణుని గొడుగునీడల నిల్చి, వెలలేనికాలంబు వితయొనర్చ
కొకనాఁడు క్రైస్తవ మూఁదియు భారత, జాతీయ సభసేవ సలుపువానిఁ
గాళీచరణుఁ బొడఁగంటి నప్డాతని, చెలి చావుసెజ్జపై నలఁగుచుండె
నాడంబరములేని దాయనగేహ మా, తఁడు మహాసభలం దుదాత్తవేష

ఆ. మాదరించువాఁడ యయ్యును బేదవే, సంబు నింట వలపు చాలమెచ్చి
యేసుమతములోని నాసందియమ్ము లా, తనికి వినతితోడ వినిచినాఁడ. ౧

వ. అంతఁ గాళీచరణుఁ డఘమ్ముతోపాటు మనకు మాఱుపుట్టు వుండు నని యీవు నమ్మెదువా యనుడు శతధా విశ్వసింతునని యే నంటి – నవ్వాల నతండు ౨

ఆ. వేళ్ళతోడఁ బాపవృక్షమ్ముఁ బెకలించు, నిచ్చ యున్నవాని కేసుధర్మ
మొకఁడ దిక్కు; కసటునకు ఫలవకా మిత్తి, యేసుభక్తుఁడే జయింపఁ జాలు. ౩

క. హైందవధర్మంబునఁ గా, నం దరమా యిట్టిమహిమ నావుడు గీతా
సందీప్తభక్తియోగము, నందించితి నొవ్వతోడ నాతనిమదికిన్. ౪

క. ఈజతనము నిష్ఫలతా, భాజనమై నన్నుఁ దృప్తిపఱుపద యైనన్
జేజేల్వెట్టితి నాతని, సౌజన్యంబునకు నంతఁ జాగితిఁ బురికిన్. ౫

వ; అయ్యాయిరథ్యల కేగి న్యాయమూర్తి మిత్రి, గురుదాసబెనర్జి, ప్యారీమోహన ముఖర్జి మున్నగు మహామహుల సందర్శించి నేటాలుజతనంబులపట్ల వారసాయమ్ము వలచి పదంపడి కాళీప్రసాదము చూడంజనుచు మధ్యేమార్గమ్మున దేవికిం బలిగాఁబోవు పొట్టేలుగుంపులం గంటి – నింతలో దేవళమ్ము డగ్గఱించుడు ౬

క. అచ్చోటఁ దిరియుమూఁకలు, వచ్చి ననుం బలసెఁ గాని వాడల బిచ్చం
బిచ్చుటకు సమ్మతింపక, క్రచ్చఱ దేవ్యంగణమ్ముకడకుం జనితిన్. ౭

ఆ. అచటిమంటపమ్ము నాశ్రయించినసాధు, వొకఁడు నన్నుఁ దేనలొలుకఁ బిలిచి
యెచటి కేగువాఁడ విటురమ్ము తండ్రి! కూ, ర్చుండు మనుచు నాదరోక్తు లాడె.

వ. ఏ నతనిపట్ల నడఁకువ మెఱసి ౮

మం. ఏపాప మెఱుఁగని యిన్నిగొఱ్ఱియల, కుత్తుకల్ తెఱుగుట కూడునా యంటి
నతఁడు హింసాకర్మ మది కృత్య మంచు, నాడువాఁ డెవఁడుండు నని మాఱుసెప్ప
నటులైన మీార లీయజ్ఞుల కేల, నీతిసెప్ప రటంచు నేఁ బల్కినాఁడ
నీశ్వరార్చన యొండె యితనికి నించు, నన్యంబు నితఁ డొల్లఁ డనె జటాలుండు

భగవదారాధన పరతంత్రబుద్ధి, యిట నిల్చునా యని యే వించినాఁడ
నిది శరణ్యము వర్జ్య మిది నాక జగతి, నెల్లతావుల నున్కి యే నిచ్చగింతు
నీమూఁకగొడవ నా కేలా ప్రజాళి, యిసిరో గొఱ్ఱెలమంద కీడనె నతఁడు. ౧౦

క, ఏ నీఁకఁ జర్చం బెంపక, లోనికిఁ జని కాళికన్ విలోకించితి న
చ్చో నెత్తురు వెల్లివొడుచుచు, నానాక్షోభముల ముంచె నాహృదయమ్ముక్. ౧౧

క. అట నిల్వలేకపోయితిఁ, దటతట నాగుండె లదరి తలకిరిం దైత్తిక
ఘటనం బయ్యెది నా కె, న్నఁటికిని విస్మృతికిరా దనం దగు నిస్సీ ! ౧౨

వ. ఆ నాఁడు వంగసమాజ మొందు నా కాతిథ్య మొసఁగ నం దొక యుదాత్తునికడ
హింసామయంబగు నీ కాళికాపూజం దడవుడు నతం డిట్లనియె. ౧౩

గీ. గొఱ్ఱియలకుత్తుకలఁ బట్టి కోయు వేళ, మొరయుఁ బటహాదివాద్యముల్ ముమ్మరముగ
నాప్రళయఘోషమున మరణార్తి లేశ, మెఱుఁగకయ బలిపోవు నియ్యేడకములు.

క. ఆమాట లేను మెచ్చక, యేమీ గొఱ్ఱెలకు బాస లే వచ్చినచో
నీ మాడ్కి నీవు పల్కెడె, హా ! మాన్పఁగ వలయు దారుణాచారంబున్. ౧౪

వ. అని ప్రత్యుత్తరం బిచ్చితి - మఱియు ౧౫

గీ. అపుడు భూతదయామూర్తి యైన శాక్య, మునిచరిత్రము నాతలంపునకు వచ్చెఁ
గాని బుద్ధునిపోలె లోకమ్ముదిద్దు, తెలివి నాపాలిదా యంచు నులికినాఁడ. ౧౬

వ. ఈ బలిదానమ్ముపట్ల నాఁడును నేఁడును నాతలం పొక్కటియ - మెండియు ౧౭

గీ. నరునిప్రాణమ్ము వెలకంటె గొఱియబ్రదుకు, విలువ కొఱవడు నన్మాట వెఱ్ఱిమాట
మనుజుమై పెంచుటకు మేషమును వధింప, నడుముకట్టంగఁ జాల నేనాఁటి కేని.

ఆ. ప్రాణి యెంత దిక్కులేనిదో నరుబారి, నుత్తరింప మర్త్యుఁ డొసఁగుసాయ
మందుకొనుట కంతయధికారి నాఁదగు, నది వివాదదూర మైనపల్కు. ౨౦

ఆ. సనతులేనియట్టి సౌజన్య మధికార, మెఁతని కగ్గపడని వతఁడు తాదృ
శార్తినిఘ్నచేతనావళి కాశ్రియ, మిచ్చి మనుపఁ జాలఁ డింత నిజము. ౨౧

మం. అక్కటా! దిక్కులే కల్లాడుచున్న, గొఱియల నీమహాఘోరయజ్ఞమ్ము
వలనఁ దప్పింప నావంటిమానిసికిఁ, దెగువయుఁ జిత్తశుద్ధియు వెండి వలయు
నీత్యాగసంపత్తి కీపవిత్రతకు, నారటించుచు నంగలార్చుచుండఁగనె
యీబొందిపొత్తు నా కెడలునో యేమొ, యీరాక్షసత్వంబు నెడపి మానవుల
నుద్ధరించుటపొంటె, నొకపీస మేని, పాపమ్ములేని యీప్రాణుల మనుప,

నీకాళిగుడి నెన్నియే నేండ్లనుండి, వదలని కలుషప్రవాహ మింకింప
నేనాఁటి కీశ్వరుఁ డేమహోదారు, నేపుణ్యసాధ్విని సృజియింపఁ గలఁడొ
యనయమ్ము నట్టికల్యాణమ్ము వలచి, వినతిమై భగవాను వేఁడుచున్నాఁడ
జ్ఞానసంపత్తిఁ బేర్గాంచినయట్టి, శేముషీశక్తి వాసి గన్నయట్టి
వితరణకేళిప్రవీణు లైనట్టి, నలి భావనాప్రధానత నోఁచినట్టి
వంగీయు లెట్టు లీవధము సైఁచెదరొ, నాబుద్ధి కంద దీనాఁటికి నేని. ౨౨

* * *

౧౯. గోకులుతో నొకనెల ౩

గీ. కాళికాప్రీతి వలచి వంగప్రజాళి, సలుపు నీకూరహోమమ్ము సరణిగాంచి
జాలిమై వేఁడికన్నీరు జార్చినంత, వెడలె నాచూడ్కి వంగజీవితము దెసకు. ౧

గీ. తద్విశేషమ్ము లారయఁ దలఁచి బ్రాహ్మ, ధర్మముం దెల్పురచనలు తగిలి కంటి
మనసు నిడితిఁ బ్రతాపచంద్రునిచరిత్ర, వింటి నతనిప్రసంగముల్ వెక్కసభల. ౨

క. అతనివచించిన యుత్తమ, కృతి కేశవచంద్రచరిత మెచ్చఁగితి విద్వ
న్నుతు శివనాథుం గని వి, శ్రుతునిన్ దేవేంద్రనాథుఁ జూడం జనితిన్. ౩

క. అపు డమ్మహర్షి నిర్భర, తపమ్మునం దుంట నతనిదర్శనభాగ్యం
బుపలబ్ధము గాక విష, ణ్ణపుఁజూపుల మరలి వచ్చినాఁడన్ బసకున్. ౪

చ. పదపడి తన్నికాయమున బ్రహ్మసమాజమహోత్సవంబు రా
నది గన నేగితిన్ బిలుపు నంది; జగన్నుతులైన పెద్దలన్
గదిసితి వంగపండితులగాన మపూర్వ ముదారమాధురీ
సదనము వింటిఁ దేలించుకొనఁజాలని దాసుఁడనైతి దానికిన్. ౫

వ. బ్రాహ్మధర్మనిష్ఠితులం దెలియ నింతవట్టు శ్రమంపడినవెన్క జగదారాధ్యు
వివేకానందుం గనుకలి యవశ్యాచరణీయం బని నడిచి తదావాసమగు బేలూరు
మఠమ్ము దఱిసి శాంతిమూలంబగు తత్క్షేత్రంబు నగ్గించితిఁ - గాని స్వామి
యప్పు డందు లేఁడయ్యె - నతండు లుప్తారోగ్యుఁడై కాళీఘట్టమునం దుంట విని
యెనలేనినైరాశ్యముం గుడిచితి - నంత నయ్యాశ్రమంబున సోదరి నివేదిత నని
యాపెఱివికి నబ్బురంపడినాఁడ - నయ్యమ్మధోరణికిని నాపోకడకుం బొత్తు జతపడ
దయ్యె - నియ్యుదంతము గోపాలకృష్ణుచెంత వక్కాణింప నాకెకు నీకును సామ
రస్యంబు పొసఁగుట దుశ్శకమని యమ్మహానీయుండు వల్కె - నొకనాఁ డీమె
'పేస్తనజీవాదుషా' యింట శతవృద్ధ యగు నతనితల్లి కయ్యాయిధర్మంబు లెఱుక

సేయుతఱి నే నయ్యుల్లుహొచ్చి యదృష్టవిశేషంబున వారికి దుబాసి నైతి - సోదరికిం దనకును భావబాంధవము లేకున్నను హిందూధర్మమ్ముదెస న వ్విదుషీమతల్లికిం గలయాదరం బతివేలంబని తెలిసికొంటి - నవ్వాల నవ్వాలంది వ్రాసిన పొత్తమ్ము లార్జించి పఠించితి - నిట్లు కాళీఘట్టమ్మునందలి యుత్తమసంస్థలం జూడ సగపాలును దక్షిణాఫ్రికా రాజకీయసమస్యలం బ్రచారమొనర్ప నర్థభాగమ్మును గా నస్మదీయదైనందినకార్యక్రమమ్ము నిర్ణయించుకొంటి - నంత నొక్క దివసంబున ౬

క. బోయరుసమరంబున సే, వాయత్తము భారతీయ మగునట్టి దళం
బేయే శ్రమమ్ము లీకొనె, నాయున్నతి నొకసదస్సునందు వినిచితిన్. ౭

సీ. భిషగ్రగణ్యుండై పెనుపారు'మల్లికు', కై సేసెం బరిషద్రగాసనమ్ము
కీర్తించె నన్ను 'సింగ్లీష్మను'పత్రికా, నేతయా 'సాండర్సు' నెయ్య మూర
నీపల్కు తనివి సంధించెబో యని తర్ద, కొనియాడె గోపాలగోకులుండు
మనవార లెంతకమ్మనివా రహో! యంచు, సంతసంపడె సభాసదగణమ్ము

గీ. బెడఁద లెఱుఁగక గోఖలేగోడుగుసీడఁ, దిరుగుచు స్వంగభూమి నీదృక్షమధుర
గౌరవంబులు గంటి నగ్గాథ లెంత, యుంపితములైన నిచట వర్ణింపఁజాల. ౮

గీ. బ్రహ్మదేశంబు కాళికాపత్తనంపు, దాపునం దుంట నేగితి దానిఁ జూడ
నచటి బౌద్ధసన్యాసుల నంటియున్న, సోమరితనమ్ము నాకు నసహ్యముఁ దెచ్చె. ౯

గీ. కోవెలలు గంటి బంగారుగోపురములు, వీక్షచేసితి మితిలేక వెలుఁగుచున్న
క్రొవ్వుదివ్వెలఁ జూచితి నెవ్వియేని, నాకు సాహిత్య మొదవింపలేకపోయె. ౧౦

క. గుడిలోఁ బేరెమువాటెదు, కుడుములదేవర గుఱాలగుంపులు 'మోర్బిం'
బొడఁగన్న దయానందుని, వడసినయనుభూతి గుర్తువచ్చుట కయ్యెన్. ౧౧

గీ. అచటి మగువలచైతన్య సురసి వారి, యిచ్చకుం గలపెత్తన మెఱిఁగి యెఱిఁగి
పొంగితిని గాని పెంజెట్టిపోతు లట్లు, బ్రిదుకు మగవాండ్రదెసఁ గుందుపాటుగంటి.

వ. మఱియు బంబయినగరం బెట్లు హిందూస్థానమ్ము కాఁజాల దట్లు రంగూనుపట్టణముసైతము బర్మా కానేర దనియు మన మీదేశమ్మునం దాంగ్లేయవణిక్కులకు దళారుల మైనట్లు తెల్లబేహారులకును మనకును బ్రహ్మదేశీయు లడితికాండ్రయిరనియు నప్పుడూహించి తద్భూమిం బాసి ౧౩

క. చొచ్చితిఁ గాళీఘట్టము, నచ్చటినాపని సమాప్త మగుటం గని వి
ద్వచ్చక్రవర్తి గోకులు, వెచ్చనినిట్టూర్పు లడర వేఁడితి సెలవున్.

సీ. మునుముందు పొగబండ్ల మూఁడవతరగతి, పయనమ్ముసల్పి తత్పథికలోక
మనుభవించునవస్థ లవి గంట కర్తవ్య, మని యెంచి మామకీనాశయంబు

గోకులుతోఁ జెల్ప నీకేమి వెఱ్ఱియూ, యని నవ్వె నాతఁ డే నంతమాత్రఁ
గలఁగక నాతలంపులలోని లోఁతులోఁ, తులు చూపినంత సంతుష్టి వడసి

గీ. నన్ను మన్నించె; నపుడు పేర్గన్న వార, ణాసికిం జని రుగ్ణుౖడై యలమటించు
నవ్వ యానిబిసెంటుమే లరయుపొంటె, మొదట సమకట్టి కట్టితి మూట ముల్లె. ౧౫

క. పూరీలు లడ్డువమ్ములు, కూరినచిఱుదిండిపెట్టె గోకులుఁడు మహా
దారుం డర్మిలి వడ్డిcc, బాఱcగ నిడి నన్ను నాఁడు బహుమానించెన్. ౧౬

ఆ. వెలవత్తు రాఁగుఁ డీఁక నాఁగుఁ డన్న నా, వేఁడుకో లొకింత వినక నన్ను
సాగనంపి రపుడు శకటంబుదనుక న, గ్గోకులుండు 'రాయి' ధీకులుండు. ౧౭

***

౨౦ కాశిలో

ఆ. నడుమ నడుమ నిల్వఁబడి కాశి కాఁగా్రిపు, రాదు లీక్షచేసి యవల రాజ
కోటఁ జేరఁ దలఁచుకొంటిని దారిలోఁ, వెచ్చపెట్టుసొమ్ము నెచ్చనీక. ౧

క. క్రిందుకొని యున్నచేతల, నెందే నొక్కొక్కదివసమే నిల్చితి నం
దందుఁ గలధర్మసత్త్రము, లం దిగితిని రూకసెడనిలాగులు గంటిన్. ౨

క. ఇప్పయనమ్మున వెచ్చము, ముప్పదియొక్కండు రూప్యములలో నిమిడెన్
దప్పియును మెయిలు నెక్కక, గుప్పిలి బిగియించి రాజకోటకుఁ జనితిన్. ౩

క. కట్టా! మూఁడవతరగతి, పెట్టియ నేఁ డున్నయట్ల పేరినచెత్తన్
గట్టెవగొల్పు కంపున, ఘట్టిల్లగు మఱుఁగుదొడ్డిహొత్తున నుండెన్. ౪

గీ. కలదు పాంథులు సెల్లించువిలువపట్ల, నుత్తమాధమ శ్రేణుల హొత్తుకొన్న
వాసికి న్మించి యందలివారు వడయు, శాంతిసౌఖ్యమ్ములం గల యంతరమ్ము. ౫

క. మూఁడవతరమ్మువారికి, నేడకముల కున్నభేద మేది? యూబండిం
జూడఁగ గొఱ్ఱెలకుం దగు, జాడన కన్పట్టు నుడువఁజాలనిరోఁతన్. ౬

క. కడతరగతిపెట్టియలోఁ, వెడలుదు నే నాంగ్లభూమి వేమఱు; నొకనాఁ
డెడఁద యనుభూతికై నను, గడు దండడిపెట్టఁ బ్రథమకక్ష్యం జనితిన్. ౭

క. ఆకక్ష్యకుం దృతీయకు, నా కంతర మంతగాఁ గనంబడదయ్యెన్
సౌకర్యము లీశ్రేణిన్, జేకుఱుఁ దఱచై సెటాలుసీమరయిళ్ళన్. ౮

గీ. బల్లపై మెత్త లుండును బాటసారు, లత్తమిల్లుటకుం గల దానుకూల్య
మ్మ్రకమంబుగఁ బెట్టియ నాక్రమింప, రచటి తెరువర్లు నీగోల మైనవేమి. ౯

క. పొద్దునకు లొంగి నడుచుట, యిద్దేశమునందుఁ జూడ నెచ్చటనేనిన్
గ్రుద్దుచు నిక్కుచుఁ ద్రొక్కుచు, రుద్దుచు వీ రెక్కుచుందురు గదా బండిన్. ౧౦

చ. కడుఁగడు నింద్యమైన యధికారులమేల్బడి కేమి బండిలో
నడుగిడువారికంపునకు నక్కట! ముక్కులు మూసికోవలెన్
ముడుఁగులవారు వీరి కసుమాలపువేసము పైఁపఁజాల; రె
వ్వడువున నుండుఁగాక తలవంపక తప్పదు వీరి కిచ్చటన్. ౧౧

క. ఏపాపమునకొ శిక్షగ, నాపయనము సేయవలయు నాపెద్ద లిసీ!
యీ పామర పాంథజన, వ్యాపారము లెట్టు లేను వ్రాయఁగ నేర్తున్. ౧౨

గీ. ఉన్నచోటన పలుమంది యుమ్మివైతు, రగ డొనర్తురు బీడీలపొగలు గ్రక్కి
యాకువక్కలురుబ్బి నిర్భీకు లగుచు, వత్తువోడువంగఁ బరఁగింతు రెత్తువాఁగు. ౧౩

ఆ. కెలనివారినొవ్వ దెలియరు నేలయు, నాకసంబు వ్రియ్య నఱచుచుందు్రి
నెలువరింతు రింత వినరానిబూతు లీ, బెడఁద లెల్లదెసలఁ గుడిచినాఁడ. ౧౪

వ. వేయుం దొమ్మనూటరెండవయేట నేసి మూఁడవతెగపెట్టెలో నడుగిడితి — నవ్వాల నప్పడునైదునుండి నాల్గువత్సరంబు లెడపక దానియందు యాత్రిలు సల్పితి — నాఁటికి నేఁటికి నుగ్గడింపఁదగిన యంతరము పొడకట్టదయ్యె — నీ తెగులుం దుడిచివైచునౌషధము నా కొక్కండ కన్పించు.

ఆ. చదువులున్నవారు సంస్కారసంపత్తిఁ, గుదురుకొన్నవారు కొంత పైఁచి
యెక్కవలయు నిచ్చ లీశకటమ్ములో, మప్పవలయు నీతి మందమతికి. ౧౫

సీ. వలయుసౌకర్యముల్ వడయ విన్నపములు, పంపి పై వారికిఁ దెంపులేని
వేసట గూర్చి యేవోసుఖంబులు గోరి, యధికారులకు నుపాయనము లిచ్చు
టాదిగాఁ జెడుదారు లన్నియుఁ దొక్కుట, వదలి తీఱమి యెంత వచ్చుఁగాక
పయనంపుమేర తప్పకనిల్పి పెద్ద లి, ట్లూర్జితధర్మమ్ము నూఁదిరేని

ఆ. కొంతమంచిమార్పు కూడు నటంచు నా, యనుభవమ్ముకల్మి నాడనేర్తు
నిది యవశ్యకృత్య మిప్పనిలేక యీ, జాతి కన్నువిప్పి చక్కఁబడదు. ౧౬

క. ఆయుర్వ్రదికొలె నస్మ, త్కాయము రుగ్భరము రెచ్చి కడుదుర్బలమై
చేయునది లేక మానితి, నీ యవమశ్రేణిపెట్టె నెక్కెడిచేతన్. ౧౭

ఉ. పాడియు బాటయు న్గననిపాంథుల దిద్ది తదీయముల్ వెతల్
వీడఁగఁ జేయుసేవ లొకవెంటకు వచ్చెడి వేళయందు నే
నోడితి నాయభాగ్యతకు నుల్లము తద్దకలంగి లజ్జయుం
దోడయివచ్చి బిట్టువగతున్ బయనంబు లొనర్చుపట్టునన్. ౧౮

ఆ. పూనుకొంట వలయుఁ బోగబండ్ల నోడల, వెడలు పేదవాండ్రవెతలు దీర్చి
తరతరాలనుండి తరలని దూషితా, చారముల నడంపఁ - జాలువారు. ౨౦

క. దొరతనముసేయువారలు, పరదేశపు బేరగాండ్రపట్లం గడు నా
దర మునిచి కూర్చు ననుచిత, తరసౌఖ్యమ్ములఁ దొలంచుదంటయు వలయున్.

గీ. గమనపర్వమ్ము నిఁక దీసిఁ గట్టిపెట్టి, కాశికి న్వత్తు వలువాతఁ గాలువెట్టి
యప్పురమ్మునఁ బండాగృహమ్ము చేరి, పీఁటపెట్టఁ దలంచితి నాఁటి కెల్ల. ౨౨

ఆ. నన్ను ముట్టడించినా రొక రిద్దఱా?, కారు పదులకొలఁది పాలువారు
శౌచనిష్ఠుఁడైన జన్నిగట్టుగృహమ్ము, చేరుకొంట కాసచేసినాఁడ. ౨౩

క. నాతలఁపు సార్థమై పరి, పూతమ్ముగ నుండె నపుడు పోయినగేహం
బాతావున మొగసాలన్, మాతల్లివిధాన సురభిమాతయుఁ దోఁచెన్. ౨౪

క. అది శరం డంతస్తులతోఁ, బాదలెడిసౌధమ్ము సౌఖ్యపూర్ణము దానం
గుదిరితిఁ బై దెసగదిలో, మదిమది సంధించు మృదులమారుత మొలయన్. ౨౫

గీ. పుణ్యభాగీరథీసరి త్పూరమందు, బ్రుంగఁ దలఁచితి శాస్త్రోక్తభంగి నాఁది
తాన మగునంతవఱ కన్నపానములను, ముట్టఁజన దంచు నేమమ్ము పెట్టుకొంటి.

చ. వలసినవస్తు లెల్ల నలవై దికుఁడే సమకూర్చె "లొచ్చు నా
వలదు సపాదరూప్య మిడువాఁడను దక్షిణగా" నటంచు నేఁ
దొలుతన చెప్పితిన్ దగినధోరణిలోనె ముగింపు మంటి నా
కలిమినిబట్టి యాచిఱుతకాన్కయు పెద్ద యటంచు వించితిన్. ౨౭

ఆ. సరసుఁ డతఁడు పోరుసల్పక "దక్షిణ, కేమి యెంతయేని నీయవచ్చుఁ
దీర్ఘవాసు లిచ్చు కార్థికపుష్టికిం, దగినయట్లు మమ్ముఁ దనుపుచుండ్రు. ౨౮

క. వే లిచ్చు చక్రవర్తికి, నాలుగుపైసా లొసంగు నాదారునకున్
వాలాయము మొక్కరీతిన, పోలన్ జరిగింతు మెల్లపూజావిధులున్." ౨౯

క. అని పండా తనకమ్మం, దనము వెలారించె మంత్రతంత్రమ్ములు ప్ర
న్ననిబాట నడిపె సుష్ఠు, స్నానమ్ముతోఁ గప్పచాఁట్లు వైవక నిలిచెన్. ౩౦

గీ. మట్టమధ్యాహ్నమునకు ధర్మంబు లెల్లఁ, దీర్చుకొను టాయె నవల భక్తిప్రపత్తు
లడర విశ్వేశ్వరుం గొల్వ నరిగి యచటి, దృశ్యములఁ జూచి లెస్సచింతించు టాయె.

ఆ. కాశి యిట్టి దన్నకథ వినియుంట ని, రాశతోన గుడికి నరిగినాఁడ
విన్నదానికంటె వేయిమడుంగులు, కన్నదానఁ జేసి కలిగె నార్తి. ౩౨

క. దిగజాఱు నలఁతిగొందియ, భగవద్భవనమ్ము సేరు బాటగదా! యం
దగపడదు శాంతి యింతయు, నగురా!'బుంయి'మని ముసురు నటునిటు నీఁగల్.

క. పట్టేలా పైసా నిటఁ, బెట్టఁము నీయట్ల నేను బెడిదమ్ములు చే
పట్టఁజన దేను నీసిరి, ముట్టనిచో నీకు నశుభములు చుట్టుకొనున్. ౪౭

వ. అనుటయుం గిమ్మనక దమ్మిడీ నప్పండాముందు వైచి నిడుదనిడుదయూర్పు
లూర్చి సాగివచ్చినాఁడ - నవ్వెనుక నొండురెండుతడవ లవ్విశ్వనాథుపేటికిం
జనితిఁ - గాని యే నానాఁటికి మహాత్మ్మతివిశుద్ధితుండ నైతిఁ - గానఁ దొంటి
యనుభూతు లబ్బుటెట్లు ? - లోకమ్మున కేన దర్శనీయుండ నైనతఱి నా కట్టి
దర్శనభాగ్యం బొడఁగూడునోటు ? - మహాత్ములయగచాట్లు మహాత్ములకుం
గాక లాఁతివారి కెట్లువేద్యంబు లగు - నయ్యది యట్లుండె. ౪౮

క. పూర్వమ్మ నందుఁ గీదృశ, దుర్వాసన చెట్టిగోలతోడుత నవిము
క్తోర్వి కనంబడె నాఁ డా, సర్వావమవిధులు నచట సాగుచునుండెన్. ౪౯

క. కరుణామయుఁ డీశ్వరుఁ; డె, వ్వారే నిటన్ సంశయించువా రుండినచో
నరయుదురుగాక కాశీ, పురాదిక ప్రాజ్యపుణ్యభూముల నెల్లన్. ౫౦

క. ఎంతయసత్యము, నెంతబ, వంతము నెంతటియధర్మవర్తన నకటా!
యెంతటిపాషండత్వము, నింతగ నయ్యోగనిధి సహించునొ కనుఁడీ! ౫౧

క. ఇల నెవఁడు కల్లసేయం, గలాఁడు కర్మమ్ము; నందుఁ గలగుణదోషం
బులు భోజ్యమ్ముల కర్తకు, వలయునె ప్రభుఁ డింక నడుమవచ్చి పెనంగన్. ౫౨

క. అగుటం జేసియ "యెవ రే, పగిది న్ననుఁగొల్తు రిచ్చపడి యవ్వగకుం
దగుఫల మిచ్చెద నే" నని, జగదీశుఁడు కట్టుచేసి చాటున నుండెన్. ౫౩

క. అనుభూతు లీదృశమ్ములు, గాని యానిబిసెంటుఁ గంటకుం జనినాఁడన్
బెనురోగమ్మునతాఁకున, వనరి వనరి యపుడ యాపె వచ్చెను వెలికిన్. ౫౪

క. నావార్త విన్నయంతన, తా వచ్చెన్ నాకుఁ గరుణ దర్శన మొసఁగన్
గేవల మాకెం గనుటయు, నా వలచినచేఁత యగుట నాఁ డిట్లంటిన్. ౫౫

ఉ. అమ్మరొ! నీవు జబ్బువడి తన్నుడి న్వని నిన్నుఁ జూడఁగా
నీమ్మయి వచ్చినాఁడఁ గృశియించియు మంచమువీడి నిల్చి యీ
తమ్ముని గారవించితివి దర్శనమిచ్చితి వింతచాలు హా
ర్షమ్మఘటిల్లె నీ కలవు రాఁదగ దే నిఁకఁ బోయివచ్చెదన్. ౫౬

* * *

౨౧ బొంబాయిలో

క. తననిల్పిన కాంగ్రెసులోఁ, బనిసేయుచు ధర్మవాదిపథమున బొంబా
యిని దిరపడి యే నుంటకు, మనసువడెన్ గోకులుండు మద్ధితరతుఁడై. ౧

ఆ. కలదు నాకు నట్టివల; పైన నచట బా, రిస్టరగుట లెస్సకష్ట మన్న
భీతికిం బురానుభూతి నగ్గంపడి, కుదురుకొంటి రాజకోటలోన. ౨

క. నామేలు వలచి మున్నా, సీమకు నన్నంపినట్టి చిరమిత్రుఁడు తా
నై మూఁడభియోగమ్ములు, ప్రేమ 'దవే' తెచ్చియిచ్చి బెంగం దొలఁచెన్. ౩

గీ. అం దొకటి పెద్దవిలువగలట్టి దగుట, జంకితిని గాని ధైర్య మొసంగ నతఁడు
తగవుగుట్టెల్ల నెఱిఁగి వాదంబుసల్పి, గెల్పువడసితి మిత్రు లగ్గింప దాన. ౪

క. అల బొంబాయికిఁ జన్నను, గలుగ దిఁకన్ వెఱ పటన్నగట్టి జనించెన్
'నిలువంగనేల యిచ్చట, వెలలుము బొంబాయి' కని 'దవే'యుం బలికెన్. ౫

వ. వెండియు నతండు 'నినువంటిబారిస్టరులం బెంచుటయు డించుటయు నన్నుంబోని వకీళ్ల కేపాటిచెయిదంబు? – ప్రజాసేవకుం జాలిననిన్నుఁ గాతిమూవాడు కూపమ్మునం గ్రుల్లిపోసీము సుమా!' – యని కరమ్ము కొనియాడినంత నేనుం దనిసని యయ్యాయి చిక్కులు చక్కఁబఱిచికొని బొంబాయికిం జేరి గిరిగ్రామమ్మునం దొక బాడుగయింట నెలకొంటి. ౬

***

౨౨ ధర్మసంకటము

సీ. కార్యాలయంబును గాపురంబును గిరి, గ్రామంబునం బెట్టి రాణగన్న
గఱువల నెయ్యంబుకల్మి నార్జించుచు, వృత్తి కొగ్గితిఁగాని యీశ్వరుండు
తద్గేహమున నన్నుఁ దడ వుండనీఁడ య, ద్దానిలో నొకవారమేని ముగిసి
ముగియకమ్ముంద నాముద్దునకుం దావు, రెండవబిడ్డ సైరింపరాని
గీ. వేఁకికిం జిక్కి వాని తెల్వియును సడలి, వెడలెఁ దబ్బిబ్బునుడు లెంతవడిన నేమి
శౌర్యముం బాయదయ్యె నాజ్వరము సన్ని, పాతచిహ్నములుఁ బయల్పడియెఁ దుదకు

క. పిలిచినపార్సివైద్యుఁడు, కలుగ దిటన్ మందుచే సుఖస్థితి; వాడన్
వలెఁ గోడిగ్రుడ్లరస మ, వ్వలఁ గుక్కుటరసము నని ధ్రువమ్ముగ నుడివెన్. ౨

ఆ. మంచమెక్కి వనరు మణిలాలు దశశరత్, ప్రాయుఁ డాతఁ డేమిపలుకనేర్చు
మంచిచెడ్డ లరసి మంచెడినేన యే, దే నొకండు నిశ్చయింపవలయు. ౩

క. ఆవెజ్జు నుదారగుణ, శ్రీవిలసితుఁ జూచి సాధుశేఖర! యెఱచిన్
సేవింప మేము వేఱొక, త్రోవను జూపించి మాకుఁ దోడ్పడు మంటిన్. ౪

ఉ. నావుడు నాతఁ డిట్టులనె నాకు భవత్సుతుఁ డీవిపద్దశన్
ద్రోవఁగనేర్చి నిల్చునని తోఁపదు దైవమునిచ్చ యెట్టిదో
భావనసేయఁజాల మఱి పాలిడవచ్చును గాని దానిడా
చేవ గణింపఁదగ్గ పనిసేయదు నాయనుభూతిఁ జూచినన్. ౫

క. ఇట నెన్నియేని హిందూ, కుటుంబముల నింత కంతకును మం దేని
చ్చుట మీ కెఱుకయ వా రే, నెటన్న నటు లాచరింతు రీకొని సతమున్. ౬

ఆ. కోడిపులుసు గ్రుడ్లు కూడదునాక వా, డెదరు వారు జబ్బు లొదవుపట్ల
నాదుపల్కు మీరు నాదృతిచేసి యీ, కుఱ్ఱవాని నిల్పికొంట వలయు. ౭

ఆ. ఇంతనిశితదీక్ష యీదృక్షపరుషతా, యోగ యేల తీవ్రరోగనిఘ్న
సుతునిపట్ల; నెల్లగతులు త్రొక్కియు బిడ్డ, బ్రతుకుఁ జూడవలయుఁ బితరులెందు.

చ. అనుటయు నిట్టులంటి ననఘా! భవదుక్తి నిజంబకాని నా
మనవియు నాలకింపుఁ డిట మామకబాధ్యత లెస్సయేర్పడెన్
దనయుఁడు పెద్దయైనఁ దనధర్మము తాఁ గనువాఁడ కాని నా
మనిచెడిపాపమై తనసమస్తము నాతలపై నిడెం జుఁడీ. ౯

క. ఇఱుకునఁ బడు నిప్పుడ నరుఁ, డెఱుఁగఁడు కర్తవ్య మిట్టి దిట్టిది యని; నా
తెఱఁ గురవో కాదో మనుజుం, డెఱచిన్ దినవచ్చు నంట కే నియ్యకొనన్.

గీ. కలదు జీవనసాధనమ్ములకు సైత, మొక్కమర్యాద; జీవముల్ దక్క వచ్చు
కష్టకాలంబునం దేని గ్రవ్యమునకు, నరుఁడు లోఁబడరా దంట నామతంబు. ౧౧

క. నానమ్మినధర్మము నా, కైనను నాబిడ్డకైన నాలికినైనన్
బ్రాణోత్క్రమణమునందును, మానందగు నంచుఁ దెలుపు మాంసాదికముల్. ౧౨

ఉ. కావున వీఁడు నిల్వఁడని గట్టిగ మీ రెద విశ్వసించినన్
జావున కీతఁ డగ్గపడినన్ వెత లెట్టివి దాపరించినన్
నావిధి నుజ్జగింప నిఁక నాదగుపట్టు దలంచి మీకృపన్
ద్రోవక యుంతురేని తమతో నొకవిన్నప మాచరించెదన్. ౧౩

క. మీరిచ్చు మందు మాత్రికల, నీరోగి కొసంగఁగొల్ల నించుక జలమై
ద్వ్యారూఢి వడచియుంటం, బ్రారంభించెదను దాని బాలునిపట్లన్. ౧౪

క. నాడియు గుండెయు నడిచెడి, జాడలు నే నాకళింపఁజాలను బిడ్డన్
వీక్షక దైహికవికృతుల, నాడుచు మీరున్న యుష్మదాదృతి మఱవన్. ౧౫

క. సౌశీల్యమహఃపుంజము, నాశంకలు జంకు లెఱుఁగినాఁ డతఁ డిక నా
యాశించినట్లు వచ్చుట, కాశీస్సుల నిడుట కిష్టుఁ డయ్యెను గరుణన్. ౧౬

క. పసివాఁ 'డిది నాతలఁ' పన, నసమర్థుఁడ నైన నాకు నవ్యాజనకున్
బొసఁగినవాదము నతనికి, వెస వినిచితి నేమిసేయ వేఁడెద వంటిన్. ౧౭

క. ఈతోళ్ళు కొక్కరాయులు, నాకేటికిఁ దండ్రి! నీవు నమ్మినవైద్యం
బె కానిమ్ము జలీయము, నాకస్తి యడంగకుండునా యనె నతఁడున్. ౧౮

క. తప్పదు మాంసం బని యే, మప్పిన నెదురాడలేఁడు మఱిశిలాలైనన్
నొప్పి నెఱింగియు నతఁ డిటు, సెప్పుట నే నపుడు హర్షసేవధి నైతిన్. ౧౯

క. ఏ నించుక 'కూనే'ఋషి, పానీయచికిత్సతోడి పరిచితి గంటిన్
దీని కలవాటుపడి మే, లైనది యీయోగ మగ్రియం బనుకొంటిన్. ౨౦

క. అనుభూతి నెఱింగితి లం, ఘనమే కడుమంచిమందు గద యని; మణికిం
దివసీక కటిస్నానము, కొనసాగించితిని దీక్షగొని జాగర్యన్. ౨౧

సీ. నారింజరసము మూనాళ్ళొసంగితి నెన్ని, వేసటల్ కుడిచిన వేఁకిపొగరు
సడలద; యది నిశాసమయమ్మునం బెల్లు, రేఁగందొడఁగె దీనియాగడమ్ము
నూటిపై నాలైదుగీటులవఱ కేగ, నాగుండియలలో వణంకు వొడమ
సాగె బిడ్డకు వేఁడుచందమ నైన నీ, ప్రజ లెట్లుతలఁతురో పాడిదప్పి

ఆ. నాఁడ వని యగ్రజుండు నోనాఁడునో భి, షక్కనన్యుని బిల్చుట సముచితంబు
కాదొకో దేశివైద్యమ్ము నాదరింపఁ, దగదొ యనుచింత లెన్నని దగిలెనాకు. ౨౨

క. అస లేతండిరికిన్ దన, కసుగాయంబోని తెల్విఁ గడుపిన్నలపై
విసరుటకు హక్కుగలదా? యసదాశయ మిది యటంచు నపు డనుకొంటిన్. ౨౩

వ. అది యట్లుండ "నోయీ! నీలగ్గు వడయ నీ వెద్దాని నాశ్రయింతు వదియ నీబిడ్డ
లకుం బ్రాపు గావింపు – మీశ్వరుండు దీనం బరితుష్టి నందుఁ – దొట్టివైద్య
ముపైఁ గాక యౌషధమ్ము దెస నీకుఁ బ్రత్యయంబు కల్ల – వెజ్జు వేరువెల్లంకు
లీఁగల వాఁడ కాని ప్రాణదాత కానోపఁడు – దుసు రొసంగువాఁ డొక పరమేశ్వ
రుండ – జీవసూత్ర మతనిచేత నుంట తెలియు – మవ్వానినామంబు జపింపు –
మతని నాశ్రయింపు – మిది విశ్వసించి నీవలచినబాటం బొయకు – మనుతలంపులు

సైత మప్పు డుప్పతిల్లె – ని ల్లిడఁదం దికమకలు వడుచుఁ గ్రిందుమీఁ దగుచుండ
నాదిత్యుం డపరశైలమ్ముచాటున కరిగె – నిరు లెల్ల కడలం దాండవింపఁ దొడంగె –
నయ్యవసరంబున ౨౪

ఆ. బాలు నంటి యంటి పన్నుంటి బగ్గున, మండిపోవుచుండె మాయవేఁకి
గుండె చెదరి చెమ్మగుడ్డను బిడ్డపై, గప్పఁ దలఁచుకొంటిఁ గట్టకడకు. ౨౫

క. లేచితి శీతలవారిం, దోఁచితి నొకవల్వ నాసతో మణికాయం
బాచరణమ స్తకాగ్రము, లోఁచితిఁ దడుపునకుఁ గంబళులు పైనిడితిన్. ౨౬

క. నెట్టముగా గావంచా, చుట్టితి నార్ద్రమ్ము; నేమిచోద్యమొ పెన మొ
ట్లట్టుల యయ్యె నొడల్ మఱి, పుట్టద కుఱ్ఱనికిఁ జెమరుబొ ట్టొకఁడేనిన్. ౨౭

క. ఏత దుపచారభరమున, నాతను వెంతేని డస్సినదియై బుడుతన్
మాతకు నగ్గింపఱచితిఁ, బూత శిశిరపూరు తానుభూతి వలచితిన్. ౨౮

క. ఏగితిఁ జౌపాటీదెస, కాఁగెం బ్రిజరాకపోక లపుడు గణగణన్
మోఁగెం బదియవగంటయు, మూఁగిననాచింత కంతము గ్గనసైతిన్. ౨౯

ఆ. ఇంత మఱపులేక సంతతావృత్తిగాఁ జలుపుచుంటి రామశబ్దజపము
జంకు దూల్చి ధర్మసంకటాధీను న, న్నాదరింపు దేవ! యనుచు నుంటి. 30

క. గుండియలు వడఁకుచుండన్, గొండొకవడి కిల్లు సేరుకొంటిని మణిలాల్
తండిరి! నే నీ కప్పున, నుండంగాఁ జాల నిల్పు మూపిరి యనిమెన్. 3౧

క. ఏ నంతఁ జూడఁ జెమ్మట, సోనలుగా వెడలుచుండె సుతుగాత్రమునన్
క్షీణింపఁ దొడఁగె సెగ భగ, వానునకున్ శిరమువంచి వందన మిడితిన్. 3౨

క. నాతండ్రీ! మణిలాలూ!, భీతికి నీకఁ దావులేదు బెదరకు మంటిన్
మూఁతలు తొలంచి బాలుని, దా తనువుం దుడిచి వానియండఁ బరుంటిన్. 33

క. ఇద్దఱము నద్దిరెుుఱుఁగని, నిద్దురకుం జిక్కితిమి మణిన్ తే పరయన్
రద్దయ్యె వెట్ట నాభయ, మద్దరికిం బఱచెఁ బుత్రుఁ డడరెన్ పారిదిన్. 3౪

గీ. ఇపుడు నాకన్నవారిలో నెన్నఁదగిన, దిటవుగలవాఁడు తేటమైఁ దిరుగువాఁడు
నిక్కమారుఁడపో దీని కేమిహేతు, వనెద జలవైద్యమో రాముకనికరంబొ. 3౫

క. ఎవఁ డీదమిత్థం బనుచున్, వివరింపఁ గలాఁడు నాదువిన్నపములకున్
నవనీత మైనప్రభుఁడే, భవికం బిది కూర్చెనంచుఁ బల్కెద నిపుడున్. 3౬

* * *

౨౩ మరలనాఫ్రికా

క. నామణిలా లారోగ్య, క్షేమంబుల నిండెఁ దనివిసెందితి నైనన్
దేమ గల దాట నగ్గిరి, గామునఁ గలగీము విడువఁగన్ మనసయ్యెన్. ౧

క. శాంతాక్రూజున దొరకెం, గాంతమ్మగు భవన మచటఁ గాఁపురముంటిన్
జింతలను దీర్చి రాబడి, సంతస ముప్పొంగ బండి సాగందొడఁగెన్. ౨

వ. ఏ నింతదనుక నెఱపాడిపట్టున కెక్కనైతిఁ - గాని యచట నడుచుచర్చలకుం బోవుచు నందు మాటలాడ జంకుచు నుద్దండులగు నానాభాయిప్రభృతుల వాదంబుల కలరుచు నున్నతన్యాయరంగమునం గొనసాగునభియోగమ్ము లాలకించుచు నడుమనడుమ నివతాళించుకడలిగాలికిన్ సొగసి కన్నుమూయుచు నన్నుంబలెఁ దూఁగుబారిస్టరులం బ్రిత్యగుల నవలోకించి లజ్జ నుజ్జనసేయుచు నట్లు సుప్తి నందుటయు నొకయందమ యని మెఱుఁగుచు నప్పుడప్పుడు ధర్మస్థానమునందలి గ్రంథాలయమును సేవించుచుఁ దత్రత్యులతోడి నెయ్యంబు వడచుచు నిఁకఁ బ్రధాన న్యాయస్థానమునందు రాణింపఁగల నని తలంచుచుండ ౩

క. అప్పుడప్పుడు గోపాలుఁడు, కృపమై నాబసకు వచ్చి హితములు వల్కన్
విపులాసేవకు మరగిన, సువవిత్రుల నాత్మసఖులఁ జూపుచునుండున్. ౪

క. తనకార్యక్రమ మిది యని, వినుచున్ గమ్యంబు తెలుఁగు వివరించును స
జ్జనశేఖరుఁ డగ్గోకులు, మనయున్నతి నేను మాటిమాటికి మెత్తున్. ౫

మం. కాలంబు నీలీలఁ గడపుచునుండఁ, దత్పురంబున నిల్వఁ దలపోయుచుండ
దైవమ్ము న న్నొండుదారికి లాగెఁ, జేరనున్నాఁ డిటు చేంబరులేను
మనయవస్థలు వానిమది కెక్కభంగిఁ, బ్రకటింపఁదగు రాయబారమ్మునడిపి;
తరలిరమ్మా! నీవు తడయక యంచు, నరుదెంచినది తంతి యాఫ్రికానుండి
మఱవనైతిని దొంటిమాటచందమ్ము, పంపుఁడీ ధనమని బదులుపల్కితిని
వచ్చి వెచ్చమునకు వలసినవిత్త, మాలుబిడ్డల నింద యూఁగు డీ యంటి
నబ్ధిపైఁ బయనింప నాయిత్తపడితి. ౬

క. పనిలేక తిరుగుకుఱ్ఱలు, మనభూములవార లన్యమహికిన్ జనుటొ
ప్పని నమ్మి యపుడు నాతోఁ, గొనిపోయితి నలువురైదుగుర గోవాళ్ళన్. ౭

వ. అందు మగనలాల్‌గాంధియు నొక్కరుండు - గాంధీకుటుంబ మస్మదీయంబు పెంపులో నున్నయది - యందు స్వాతంత్ర్యజీవనమ్ము వలచువారికిం దోడగుటకే నభిలషించువాఁడ - జమీందారులకొల్వున దించిమాయయ్య వీరినరయువాఁడయ్యాడిగంబు వీరి కేలా యని నా తలంపు - నానాఁడు నా లక్ష్యమ్ము లెట్లు తిరపడె నట్లు వీరి యాదర్శములుసైత మభివృద్ధిపఱిచి వానినస్మదీయ సిద్ధాంతములం బెనవెట్టఁజూచితి - నిప్పట్లు మగనలాలు దెస నాపడినపాటు చాలవట్టు సార్థకం బాయె - నా యుదంతముఁ దేటపఱుచుట కిది యదనుకా దని తలంతు - మఱియు ౮

గీ. అనుఁగుబిడ్డల వీడి యర్ధాంగి నెడసి, తిరపడినవృత్తి వదలి చింతితము గాని
పని కకస్మాత్తుగా నగ్గపడుట నరసి, యపుడు కొండొకవంతపా లైనవాఁడ. ౯

ఆ. ఐన నిట్టిమనికి కలవాటుపడ్డ నే, నిజ్జగంబునందు నీశుఁ డొకఁడె
సత్య మితర మైనసర్వ మసత్యమ్ము, యని తలంతు క్షణిక మనియు నెంతు. ౧౦

క. మనకంటి కెల్లదెసలం, గనఁబడునది నడచునదియుఁ గల్లయ యిది యి
ట్లని విశ్వసించుటయు జీవనసాఫల్యమ్ము వలచువారికి వలయున్. ౧౧

ఆ. నిశ్చితమ్ముగాని నిఖిలజగమ్మునం, దే యఖండసత్య మిమిడియుండెఁ
దత్ప్రదర్శనము సదా సాగు సత్పురు,షార్థ మన్న దాని నరయు టొకఁడ. ౧౨

మ. ఇఁక వత్తుం గథ కాఫ్రికాగొడవ లెట్లెట్లున్నవో కంట కే
నొకనాఁడైనను ముందుగాఁ జనుటకున్ యోగమ్ము లేదాయెఁ దత్
సకలోదంతము నేర్చికూర్చి రట నస్మన్మిత్రు లద్దానికూ
డికమై విన్నప మల్లి పాల్వడయ నుంటిన్ దాత్యధర్మంబునన్. ౧౩

ఆ త్మ క థ

చ తు ర్థ భా గ ము

౧ వృ థా శ్ర మ ము

సీ. మాననీయుం డైన మంత్రి చేంబర్లేను, కాంక్షదీఱఁగ నాఫ్రికాధనంబు
పలుకోట్లు నుపదగాఁ బడసి యాంగ్లేయుల, బోయర్ల లోఁగొనఁ బూని వచ్చి
నతఁ డాట భారతీయ ప్రజాప్రతినిధి, వర్గంబుఁ జూచి మీవాద మెల్ల
నుచితంబ మీకిట నున్నబాధలు పెక్కు, లనియు నెఱుంగుదు నైననేమి

ఆ. స్వపరిపాలనమ్ము సాగించుకొను నిట్టి, వలసలందు మాకు నిలిచియున్న
పెత్తనం బదెంత పెద్దలకున్ విడి, తంబ మీకు రాజ్యతంత్ర మెల్ల. ౧

ఆ. ఓపినంతవట్టు మీపడుపాట్లు వా, రించుజతన మాచరింతుఁ గాని
మీర లిచటి తెల్లవారిపొత్తున నిల్వఁ, దలఁతు రేని మేలు వలతు రేని. ౨

గీ. వారితో సంధిచేసికోవలయు వారి, మైత్రి నార్జింపవలయు నన్మాట విస్మ
రింపఁ జనదని యతఁ డెచ్చరించినంత, నెల్లరకుఁ గాలుసేతులు చల్లపడియె. 3

ఉ. ఐనను మంత్రి మా నిదుర యంతయు దవ్వుగఁ జోపె నూతన
జ్ఞానము గంటి మేము తొలి సల్పినయత్నమ దెల్ల రిత్తయై
కానకు నర్పితంబయిన కౌముదియాట యెఱింగినార మ
ప్డే నఖిలమ్ము ద్రచ్చి వచియించితి దౌత్యములోనివాకిన్. ౪

వ. కాని చేంబరులే నాడినపల్కుల కల్లయగు – నతఁ డిచ్చకములకుం బోక యథా
ర్థమ్ము వక్కాణించె – దుడ్డెవరిదో గొడ్డువారి దనులోకోక్తి నవ్వేరవరి మృదు
లంబుగా వినిచె – నైనను మనచెంత దుడ్డుగట్టు కలదా? – దానిలేమి కేమి?
బడియమోఁదులు సైరింపఁగల కాయంబేని మన కున్నదా? – యయ్యది
యట్లుండె – నమ్మంత్రిపుంగవుఁ డపు డాఫ్రికాయం దనతికాలంబ నిలిచె – నాదే
శంబు సువిశాలమహీఖండం బగుట గాలింబలెఁ బేరెనువాఱె – నమ్మేటి నేటాలు
వీడి ట్రాన్సువాలునం గాలుమోపినతఱి మనవారి కడగండ్లనెల్ల నీతనికి నివే
దించుచేఁత నాతలపై నుండె – దీసం దీర్పఁ బ్రిటోరియా కేగుటెట్లా? యను
సమస్య నన్ను నిలువవైచె – నదనిలో నే నచ్చోటు చేరుటకు వలయునుత్తరువు
నార్జింప నందలి భారతీయుల కయితిగాదయ్యె – నదియును గాక ౫

గీ. అచ్చట న్మ్మన్ను విలయనాట్యంబు సలిపి, సలిపి బోయరుసమరంబు చన్న వెనుక
జీవకళలేక ట్రాన్సువాల్ సీమ బిక్కు-, బిక్కు- మనుచుండె లేమి పై కెక్కు-చుండ, ౬

ఆ. కుడువఁ గూడులేదు కొఱవడె వస్త్రంబు, వాడవాడ పాడువాఱియుండె
బేర మడఁగిపోయి బేహారి తాళమ్మ, నొక్క- విపణి కేమి నుడువనేర్తు. ౭

క. పెఱసీమవలన వలసిన, సరకెల్లను జేరవలయు సాహుకులకొట్ల
త్తఱి విచ్చవలయు నిప్పని, సరగన్ నెఱవేఱ దెన్ని శ్రమలం బడినన్. ౮

ఆ. కూడు గుడ్డ నిండుకొనకముం దానేల, వదలి పఱచినట్టివారు తిరుగ
నడుగు పెట్టరాద యటులౌట ననుమతి, వలయు నచటు త్రొక్కు-వాని కెల్ల. ౯

చ. అది తెలవానికిం గరతలామలకం బగుఁగాని మింటిపై
నొదవెడుపువ్వ మయ్యెడి నహా! మనవానికి; నెంతవేఁడినన్
గదలరు కన్నువిప్ప రధికారులు లంచము నిచ్చు వానికిన్
సదయులు వార లిప్పనికి సాగెను మ్రూఁగ దళారిదయ్యముల్. ౧౦

గీ. ఆఫ్రికాయుద్ధ మెసరేఁగినట్టివేళ, హిందువులు సింహళంబువా రెందఱేని
వచ్చిచేరిరి శస్త్రజీవనమునందుఁ, గదనకార్యాలయములందు గతులులేక. ౧౧

క. వీ రమ్మహి నెలకొంటకుఁ, గోరికవడి రేని వీలుగూర్చుట యుచితా
చారం బని యచ్చటియధి, కారులకుం దోఁచె దురము కడచన్నంతన్. ౧౨

వ. ఆంగ్లేయు లగువీ రెయ్యెడనేని వలసినన్ని నూతనోద్యోగమ్ములు సృష్టింపనేర్తు - రీదొరల చతురతంజేసి క్రొత్తశాఖయొండు పొటమరించె - నిందు నీగ్రోలకుం బ్రాచ్యులకును వెవ్వేఱు తెగలు వెలసె - నాసియాశాఖ కాసియావార యధికారులైరి - నేనాట్రాన్సువాలు మెట్టుటకున్ముంద యీనూతనకార్యక్రమం బారబ్ధమై యల్లల్లన తనయుచ్చుల నెల్లదెసలం బన్నుచుండె - నధికారులు మరలివచ్చు నెల్లవారికి ననుజ్ఞాపత్రమ్ముల నీవచ్చుఁ - గాని నల్లవారిపట్ల నది సవ్యంబుగా సాగదుగదా! - మఱియు ౧౩

క. దొరలున్ దళారు లొకఁడై, నిఱుపేదలు నల్లవారినెత్తురు పిండన్
దొరఁకొని రీదృశదుర్భర, పరిస్థితిన్ గమ్య మెట్లు పట్టఁగనేర్తున్. ౧౪

సీ. మనసుకలంగి యిమ్మక్రియఁ దొట్రిపడుచుండ, మత్పురామిత్రుండు మానసీయుఁ
డల దర్బనుపురమ్మునరయు రక్షకభట, శాఖాధిపతి యలెగ్జాండ రపుడు
తోడయ్యె నాదగుగోడెల్ల నతనికి, వినిపించి ట్రాన్సువాల్ మనికిపట్టు
గా నున్నవాఁడఁగదా! నేను నాకథ, యెల్ల మీకెఱిఁగినదే యటంచుఁ
ఆ. బలుక నతఁడు మాటపాటించి నన్నధి, కారికడకుఁ జేర్చి గారవించి
యప్పుడపుడ చీటి నిప్పింప మెచ్చి ప్రి; టోరియాకు బయలుదేఱినాఁడ. ౧౫

గీ. అప్పురిం జేరుటకుముంద యవగతంబు, లాయె రాఁగలబెడఁదల చాయలెల్ల
నేదియెట్లున్న నిబ్బర మింతవిడక, కాలుమోపితిఁ డ్రాన్సువాల్ గడ్డమీఁద. ౧౬

గీ. భారతీయుల తీఱముల్ బట్టబయలు, సేయు విన్నప మొండు సృష్టించినాఁడ
సోదరులగౌరవంబు లచ్చోటఁ బెనుపఁ, ద్రోవ లన్నియుఁ బరికింపఁ దొడఁగినాఁడ.

వ. దర్బనులో నింతకుమున్న రాయబారంబు వెడలినతఱి నధికారులు తొలుత శిష్టమండలిం గల వారి పేరు లడిగినయట్లెఱుక లేదు – కాని నేఁ డిచటఁ బ్రత్యేక శాఖ యొం డేర్పడియుంట నందలిపెద్ద లే నాతావు సేరకమున్న దౌత్యవర్గసభ్యుల నామంబు లడుగుటం జేసి నేనాదళంబునం బాల్గొనుటకు వారియ్యకొన రని ప్రిటోరియాభారతీయు లితఃపూర్వంబ కనుపెట్టి – రగ్గాథ బాధాకరంబయ్యు నుల్లంబు నలరించునట్టి దగుట నాగామి ప్రకరణంబున దానికలరూపు తెల్లం బొనర్తు. ౧౮

* * *

౨ నిరంకుశత

క. ఈనూత్నశాఖవారపు, డేనెట్టులు ట్రాన్సువాల్కుఁ జేరితి నా
నైనం బింతయుఁ దెలియక, నానామార్గముల నరసినారలు నన్నున్. ౧

క. వారికడ కప్పుడప్పుడు, చేరెడుహిందువులఁ బెద్దచేసిరి గాంధీ
బారిస్టరిచటి కెట్టులు, తా రా వీలయ్యె నంచుఁ దఱచిరి వారిన్. ౨

ఆ. వార లేమిసెప్ప వలఁతులు నారాక, చంద మిట్టి దిట్టిజాడ యంచుఁ
'బ్రాఁతచెలిమికల్మి నీతఁడు దర్బను, రాజపురుషు లడ్డురామివడసి. ౩

క. ఆనతిపత్రము లేకయు, యీనేలకు వచ్చియుండు నియ్యది నిక్కం
బైనఁ జెఱసాలయం దిడి, వీనిం దగురీతిఁ బరిభవింపఁగవచ్చున్.' ౪

వ. ఇట్లయ్యధికారు లూహించి – రే దేశమం దేని ఘోరసమరంబు సాగి యూఁగిన పదంపడి దొరతనమ్మువారు కొన్నాళ్ళదనుకఁ దీవ్రాధికారం బుపయోగించు టాచారంబ – యానాఁటి దక్షిణాఫ్రికాపరిస్థితియు నిందులకుం దగినట్టుల యుండెఁ – గాన నవ్విషయంబున శాంతిరక్ష కయ్యేలుబడివా రొండుచట్టమ్ము గావించి – రద్దాని ననుసరించి యనుజ్ఞలేకయ ట్రాన్సువాలునం దడుగిడువారు కారాగారశిక్షకుం బాత్రులగుట వలయు – నీశాసనంబు నూఁతగాఁగొని నన్నుబంధింపఁ దలంచిరి – కాని 'నీచీటిం జూపు'మని నన్ను నిలువరించుపాటిగుండె యధికారులకుం గఱవయ్యె – మఱియు ౫

క. అంత న్నిలువకే వారలు, తంతి న్నడిపించి రగ్గు దర్బనుప్రరికిన్
జింత కడు న్గడిచిరి నా, చెంతం బత్రమ్ముకల్మి సెప్పుటకతనన్. ౬

క. కసిదీఱక వా రప్పుడు, వెస వెరవుంగనిరి తుష్టి వెంచిరి చేంబర్
దెసకు ననుం జేరనీయక, బసయందే నిలుప సిద్ధపడి రవగుణులై. ౭

గీ. రాయబారమ్ములో వచ్చునాయకుల స, మాఖ్య లేమని తొలుతొల్త నడిగి రచట
నెచటి కేగిన దర్శనం బిచ్చితీరు, తెగులు కలదగదా నల్ల తెల్ల వాసి. ౮

ఆ. అది సహింపరాని దైనను మనగడ్డ, నెట్టిమూఱికి పేరె నెట్టికపట
మెట్టియార్య్యి పీటపెట్టె నెటూలులో, నట్టిచెట్ట లేద యని వచింతు. ౯

క. అం దున్నప్రజల సౌఖ్యా, నందమ్ములకొఱక దొరతనంబునం గలవా
రందఱు నలయుదు రడఁకువ, పొందికె మార్దవము పొంగి పొరలుచునుండన్. ౧౦

క. అధికారుల సౌజన్యము, వృథగా దచ్చోటిజాతు లెల్లను దాదృ
గ్విధ మూఁది "యథారాజా, తథాప్రజా" యన్ననుడికిం దార్కాణయగున్. ౧౧

వ. కాని ప్రజాప్రభుత్వతత్త్వం బెఱుంగని యాసియాబిడ్డ లీనూత్నశాఖం బాలింప వచ్చునప్పుడ తమనేల జీర్ణించియున్న నిరంకుశత్వాది దుర్గుణమ్ములన్నై తము తమ వెంటం గొనితెచ్చి – రింతియకాక యొకపాటి స్వపరిపాలనమున్న యాఫ్రికాకు వలసవచ్చి తోఁటదొడ్లులతోఁ దిరపడి యధికారుల కలుకని తెల్లవారికిన్ వీరికి నెయ్యంబు బిగిసె – నిప్పుడిగామమ్ముకతన దిక్కులేనిభారతీయులు కత్తినాగళ్ల సందునఁ బడినట్లు గిజగిజలాడ వలసె – నీసంకటంపురుచి నేనుం గొంత యనుభ వించితి – నెట్టులన ౧౨

గీ. సింహళమువాఁడు మన కాందిశీకశాఖ, నేలు నున్నతోద్యోగి టాన్స్వాలులోని
భారతీయులలోఁ బేరుపడ్డ సేటుఁ, దైయబుమొహమ్మదుం జూచి దర్పమడర. ౧౩

గీ. గాంధియన నెవ్వఁ డాతఁ డిక్కడికి రాక, యేలయని ప్రశ్న నతఁడు మాహితుఁడు మాకు
వలయునుపదేశములు సేయువాఁడు మేము, పిలువ నిటువచ్చె నని బేరి పలుకరించె.

చ. అది విని గాంధి మీకు హితుఁడా? కడులెస్స యట్లైన మేము మీ
కొదవలుదీర్చి భద్రమొదఁగూర్చెడి చేతకుఁ గాక యింక నె
య్యది పొనరింప నిందుఁగల మాయన కిచ్చటికేడు మేలు నె
ట్లు దెలియు నంచు నాతఁ డనఁదుఁ వివరించె మొహమ్మ దివ్విధిన్. ౧౪

క. మీనుడివినయది నిక్కము, మానెంజిలి వోకదై శ్రమంపడ మీ రి
చ్చో నుంటయు నేనెఱుఁగుదుఁ, గానీ! మాయింటివాఁడుగద గాంధి యనన్. ౧౬

క. అతఁడు మాపలు కెఱుఁగును, మాతలఁపు లెఱుంగు మాసమస్య లెఱుంగున్
మాతో నెండకునెండును, సీతువునకు వడఁకు నేమిసెప్పిన సైఁచున్. ౧౭

గీ. మీరు మాజాతివార మామేలు వలచు, వార గఱువతనం బున్నవార మెట్టి
వారలైనను గొనస కధికార మున్న, వారుగద గాంధికి న్కీకు వాసిలేదె? ౧౮

గీ. తైయ బిట్లాడ నుద్యోగి తలఁగదల్చి, మొగముచిట్లించి గాంధి న్కాగ్రమోల కిపుడ
చేరవలయును వానిఁ దీసికొనిరమ్ము, పొమ్మనుచు నాజ్ఞ యిచ్చె మొహమ్మదునకు.

గీ. అతఁడు నాపేర నొకచీటినైన వ్రాసి, పంపఁదగదా యటంచు నే బాధపడితి
నెంతయధికార ముండుఁగా కింతగడుసుఁ, దనము సెల్లునె యెవ్వఁ డీదారిమెచ్చు.

సీ. సేటుమున్నగువారితో పాటు వెడలి, నాఁడ నధికారిదండ కానాఁడు మాకు
నుచితపీఠంబు లచ్చోట నుండునెట్లు?, దేవురించుచు నిలఁబడితిరవలయు. ౨౦

క. నాదెసకుం గ్రుడ్లుఱుముచు, నాదొర యిట కేలచేరి తనియెను మావా
రాదృతిఁ బిల్వఁగ వచ్చితి, సోదరులకు హితముఁ దెల్పఁ జూచితి నంటిన్. ౨౧

చ. ఇదివిని యాతఁ డిట్టులనియెన్ గనవో తగ వింతవట్టు నీ
చదు వెటకేగె నిచ్చటి ప్రజాతతిఁ జేరవునీవు నేఁడు నీ
కొదవినయాజ్ఞ చెల్ల దదియుం బొరపాటునఁ బుట్టె నిమ్మహిం
బద మిడఁగాదు నీవు మును వచ్చినమార్గముపట్టి పోవలెన్. ౨౩

క. ఏలాశ్రమ? చేంబరుఁ గనఁ, జాలవు నీ విచటినల్లజాతి విపత్తుల్
తూలించి సక్రమమ్ముగఁ, బాలింపన మేము నిల్పఁబడినార మిటన్. ౨౪

క. మంచిది నీవిఁకఁ జనఁదగు, నంచున్ సెలవిచ్చె నాకు నపుడే నెదియున్
వించుటకు పీ లోసంగఁడ, యెంచెడివా రెవ్వ రతనియొగ్గును లగ్గున్. ౨౫

క. పదపడి నాతో వచ్చిన, పెదపిన్నల నిలువరించి బెదరించి వెసన్
వదలింపుఁడు గాంధి నతం, డొదుఁగఁజన దిచట నని తదుద్యోగి యనెన్. ౨౬

గీ. అపుడు మన్మిత్రగణ మా యవమానతఁ జూచి, పొంగును దేశమును దిగమ్రింగిమ్రింగి
విన్నవోయినమొగముతో వెడలి రింద్ల, కేర్పడెం గ్రొత్తచిక్కది యెఱుఁగకుండ. ౨౭

***

౩ చేదు మ్రింగుట

గీ. ఈయువజ్ఞ మదాత్మకు నెల్లలేని, వేదనం గూర్చెఁగాని జీవితమునందు
నీదృశంబులు పెక్కు సహింపఁగంటిఁ, గాన నివి నాకు నలవాటులోని వాయె. ౧

కం. అతులగుటన్ నేనీ దు, ర్ఘటనం జీరికినిగొనక కరణీయముపైఁ
బటుదీక్షఁబూని నిల్చితిఁ, బ్రిటోరియానగర మిత్రబృందమునడుమన్. ౨

వ. అంత నయ్యధికారి 'యీదౌత్యమున గాంధి రాఁదగఁ డతండు దర్బనునంద
చేంబరులేనుం గనియుంట నిట్లు నిర్ణయించుటవలసె' నని మా కొండు లేఖం బంపె-
నాకమ్మ నావారి కలుకవుట్టించె - నిట్టితఱి రాయబారంబ పరిత్యాజ్యంబని
మిత్రులుతలంచి - రయ్యవసరంబునం దేను వారింగని ౩

గీ. రాయబారంబు వదలుకోరాదు మీర, లిప్పుడు చేంబరుసన్నిధి కేగకున్న
నతఁడు మీకిట సేగిలేదనియ తలఁచుఁ, జూడఁ డియ్యది మనపాలిక్షీడు గాదొ. ౪

కం. అతనికడ నిపుడు వాచా, ప్రితాపముం జూపఁదగిన పనిలేద పరి
స్థితు లిట్టివిట్టివని వ్రా,సితిఁ మిది యెవ్వాఁడు చదువఁజెల్లదు సెప్పుఁడీ ! ౫

ఆ. ఏన చదివినంత నేమియొఱగు న య్య, మాత్యమాళి దీనిమంచిచెడ్డ
లెంచి చర్చసేయఁ డిటులగుటన్ దిగ, మ్రింగుటొప్పు నేఁటిభంగపాటు. ౬

క. ఈకరణిన్ నుడువ్రతఱిన్, మాకుం బ్రితినిధులు మీరు మాకర్జమునన్
మీకొదవిన యవమానము, తాఁకదొకో మమ్మటంచుఁ దైయబు వలికెన్. ౭

గీ. ఔను!మీమాట నిక్కంబ కాని మనము, బన్నమున కిట్టిదానికి బాధపడక
యిదియు మనమంచికే నచ్చినదియటంచు, నరసిదిగ్రమింగు టురవని యంటినేను.

ఉ. అన్న!రుచింపదయ్యొ భవ దాశయ మిత్తఱి నెంతవడ్డఁ గా
నున్నది కాకమాన దిపు డున్నవి చాలక క్రొత్తవేఁగు నీ
బన్నము నేలమస్తకము పై నిడుకోవలయుం బరిస్థితుల్
కన్నులముందె వింగడము గా నగుచుండె మరల్పరానివై. ౯

క. కలపెత్తన మెది మనకుం, దొలఁగినదొరతనము నెద్ది దుర్విధి యిచ్చో
నిలిపెన్ మనల నటంచున్, గలంగి త్రైయబు వచించెఁ గళవళపడుచున్. ౧౦

గీ. అతని యావేశమున కేను హాస్యపడితిఁ, గాని యీమంటచే లగ్గు కలుగనేర
దని యెఱుంగుదుఁ బ్రజలధోరణియునాకుఁ, దెలియుఁ గావునవారి శాంతింపఁడంటి,

సీ. మనజాతివాఁడు కమ్మనివాఁడు బారిష్ట, రులయందుఁ బేరుపేరు గలవాఁడు
కలఁడుగదా! 'జార్జిగాడ్ ఫ్రే'సమాఖ్యుఁ డీ, కృతికి నామాఱుగా నతని నిల్పి
దౌత్యంబు తరలింపఁదగు మీర లని విన్న, వించితి నాపల్కువెంట నడిచి
కని రయ్యమాత్యశేఖరుని మిత్రు లతండు, నాప్రిసంగము దెచ్చి నాఁడు నేడు

గీ. నొకనితోడన చర్చసేతకుఁ గడంగు, కంటె నవ్యనిజేర్చె యాగాము లరయు
టొప్పదా యిపు డంచు నానొప్పి నుపశ, మిల్లఁ జేయుటకుం జూచె మెల్లమెల్ల, ౧౩

గీ. ఇటుల మాకర్జము ల్మొగియుటకు మాఱు, వేయిరెట్లయ్యొ వెండియు విఘ్నపతి స
మర్చకుం బూనవలసె నిరంతరాప, జయములకు నోడి చెలులు వేసారి రప్పుడు. ౧౩

క. నీనుడి నమ్మికదా ! క, య్యానకు దిగి నొవ్వఁగంటి మారా ! యిది య
ద్దానికిఁ బ్రతిఫలమా యని, నానెయ్యురు కొంద ఱపుడు నన్నదలింపన్. ౧౪

క. ఏ నించుకయుం దూలక, నానెఱపిన చేత కొక్కనాఁడును వగవన్
ఆనాఁ డనిలో నుఱుకుట, నా నది కర్తవ్యపాలనం బని తలఁతున్. ౧౫

క. తొడగినయంతన లాభం,బొడఁగూడక పోవుఁ గాక యుత్తమకార్యం
బుడుగక సడిసన్నఫలం, బిడునను విశ్వాసమున్న దీమానిసికిన్. ౧౬

ఆ. ఐనదేమొ యయ్యె నద్దానిరగడలు, మఱచిపోద మింక మనము చేయఁ
దగినదాని సరయుదము శుభంబిది యన, నెయ్యు రీపథంబు నియ్యకొనిరి. ౧౭

వ. అయ్యవసరంబునం దేను వెండియు వారి కిట్లంటి. ౧౮

క. వినుఁడీ మిత్రులు ! మీరలు, ననుఁ బిల్చినచేత ముగిసినది యనఁదగు నై
నను నిల్వమింద యని న, న్ననిశము నెచరించు నంతరాత్మ యిదేమో. ౧౯

గీ. పొమ్మ నీవిఁక నింటికిఁబొ మ్మటంచు, నాకు వీడ్కోలొసంగినన్ డ్రాన్సువాలు
గడ్డపైనున్న యీకాలు కదలనీయ, నిచ్చగల్గదు నేటాలుపొచ్చుటకును. ౨౦

ఆ. చేతనైనసేవ చేయుదు నిట నొక్క, యేఁటిదనుకఁ దల్లినాఁటి కేని
వెడలుకోర్కెలేదు కడపెద జీవితం, బిచట ధర్మవాదివృత్తి నూఁది. ౨౧

క. ఏన్నాఁటికేని మార్చెద, నీ నూతనశాఖవారి హృదయము వీరి
శ్లే నిక్కుచు నెదు రింతయుఁ, గానక వర్తింప మనకుఁ గాఁతియెహెచ్చున్. ౨౨

క. ద్రోఁపిడిపా లాదుము మన, మీపుడమిం బాయవలయు నేడ్పులతోడన్
జేపటి కిచ్చుటిదుస్థితి, యీపగిది న్నిల్వనేర దెంతయు బెడియున్. ౨౩

గీ. క్రొత్తయధికారియును మంత్రిసత్తముండు, రాయబారము నెడ నన్ను రట్టువఱచి
రిది యసహ్యము కాని మీరిచటఁ గుడుచు, కుత్సలో దీనికిం గలకో రదెంత. ౨౪

క. ఈ గడ్డలోనఁ గుక్కల, లాగున మనవారు తోఁకలందిప్పుట యే
యాగడమునేని సైఁచుట, యేగతి సైరింతు మెవ్వఁ డిదిగని మెచ్చున్. ౨౫

గీ. అస్మదీయాశయమ్ము నిట్లపుడు ప్రజల, ముందువెట్టితి హితులతో ముచ్చటించి
తుదకు జోహాన్సుబర్గులోఁ గుదిరి బల్ల, కట్టఁబూనితిఁ గోర్కెలు నిట్టవోడువ. ౨౬

గీ. ట్రాన్సువాల్‌సీమ నాకుఁ బట్టా లభించు,టంత సుకరంబుకాద, యేమగునో యన్న
శంకమైనుండ భగవత్ప్రసాదబలము, కలిమి నదిచిక్కెఁ గోర్టులోఁ గాలినిడితి.

* * *

౪ త్యాగవృద్ధి

క. అల ట్రాన్సువాలునేలం, గల మనసోదరులపేర్మి కడుకొనుపొంటెన్
జలిపినకృషి వర్ణించుట, నిలిపెద నాబ్రదుకు వక్కణించెద మొదటన్. ౧

ఆ. ఇంతదనుక విత్త మింతయో యంతయో, కూర్చవలయు నన్నకోర్కె నాదు
మదిని బాయదయ్యె మత్సరమార్గ సం, సక్తి నంటి స్వార్థరక్తి వొలిచె. ౨

గీ. బంబయిని ధర్మవాదినై బ్రదుకువేళ, నన్నుఁ జూడంగ వచ్చు ననారతంబు
నమెరికాఖండవాసి విద్యావిభాసి, మరగ నవ్వీట నతఁడు బీమావణిజ్య. ౩

క. కడుఁబ్రిన్ననివాఁ డాతని, నుడువులు గ్రొందేనెలూరుననాతు లహో! ప్రాఁ
బడిన చెలింబలె నతఁ డి, వ్వడువున వాక్రుచ్చె భావివైభవ మొదవన్. ౪

క. మీవంటివార లెల్లను, మావసుధం దమకుఁదామ మానక బీమా
గావింతురు జీవితమును, భావింతురు దీనిఁ బరమభాగ్యం బనుచున్. ౫

క. ఆగామికాలమున మీ, రేగొడవల కేదిగుళ్ళ కే నోడక స
ద్యోగమ్మున రాణించుట, బాగుగదా యంచు నేను బలుమఱు వలతున్. ౬

ఆ. నిన్న నున్నవాఁడు నేఁడులేఁ డీబ్రదు, కేమిశాశ్వతం బిసీ! పయోజ
దళగ తాంబుకణము తద్జ్ఞులుమీరు మీ, చెంత దీని నింతసేయఁ దగదు. ౭

ఆ. అస్మదీయ దేశమందలివా రిట్టి, పని యవశ్యకృత్యమని తలంతు
రిందుఁ బాలువడయుఁడీ యని మి మ్మేను, ఒట్టుపట్టి లోభపెట్టఁ దగదె. ౮

క. నావుడు నామది నెన్నో, భావంబులు రేఁగ నన్నుఁ బలుతావుల నీ
త్రోవకుఁ ద్రిప్పం దమతమ, చేవలు చూపించి రిట్టిజీవికవారల్. ౯

గీ. ఎంతపెనఁగిన వారికే నింతవట్టు, పట్టువడక వచ్చితిఁ జోటుపెట్టనైతి
నిప్పనికి నియ్యకొంట సర్వేశుపట్ల, నమ్మకములేమి, పందతనం బటంచు. ౧౦

ఆ. ఇట్టివాఁడనయ్యు నీమాఱు వీనికి, లొంగిపోయి పోయి లోభపడితి
నతఁడు పండ్లుపులియున ట్లాడువేళ నా, యాస లేచియేచి యవధిదప్పె. ౧౧

క. నాకంటిమ్రోల నయ్యెడ, నాకుఱ్ఱలపొడవు లవి కనంబడెఁ జింతా
వ్యాకులితమైన కస్తురి, యాకృతియుం దోఁచెఁ దలఁపు లగ్గలమయ్యెన్. ౧౨

ఆ. తాళిబొట్టుతక్కఁ దక్కిన యిల్లాలి, తొడవులెల్ల మున్న తుడిచినాఁడ
నోయి! రేపు నీమకాయ మెట్లుండునో, యెవరుసైతు రప్పు డింటివ్రేఁగు. ౧౩

చ. జనకునివోలె నిన్నుఁ బలు చందములం బరికింపనోర్చి నీ
మనుగడలోనివెల్తి యణుమాత్రియు సైఁపని యన్న నెత్తిపైఁ
బెనుగిరివోలె వ్రాలుఁగద పేదయ కాని యతండు కల్మిలో
మునిఁగినవాఁడు కాఁ డతని ముంచిన నీ కపకీర్తిపుట్టకో. ౧౪

వ. ఇట్లు న న్నంతర్వాణి ప్రబోధించుటం జేసి నా బ్రతుకుపై దశసహస్రరూప్యంబులకు బీమాయొనర్చితిఁ - గాని నేఁ డాఫ్రికాయందు నాజీవితాదర్శపరిణామమ్ము వోడముకతన నాభావనలుం దాఱుమారయ్యెఁ - డ్రాన్సువాలునం బొసఁగిన యీకొత్తకడగండ్లతటి నానిర్వహించు నెల్లచేతకున్ భగవాను సాక్షిగా నిల్పుకొంటి - నీగడ్డయం దెన్నినాళ్ళైను మసలందగు నయ్యెది యింతవట్టు నిర్ణీతంబు కాదాయెఁ - గాని ౧౫

క. భారతభూమికి నేనిఁకఁ, జేరుట దుర్ఘక మటంచుఁ జిత్తమునఁ బ్రాన్
నారీ నందనులను నా, చేరువకుం దెచ్చుకొంట శివ మనుకొంటిన్. ౧౬

ఆ. ఆలుబిడ్డ లెంతకాలమ్ము దవ్వుల, నుంట కోర్తు రనుచు టుచితమోటు?
తప్ప కిటకు వారి రప్పించి మనుచుట, పరమధర్మమన్న భావ మొదవె. ౧౭

ఆ. ఈవిచార మెచ్చిహెచ్చి నాఁ డమెరికా, వణిజువాణి కేల వలపుగొంటి
బీతు రేఁగి యేల బీమాకు నీకొంటి, నని దురంతలజ్జ కగ్గపడితి.

క. నాయన్న జనకతుల్యుం, డాయెనయే నతఁ డనాథయగు మజ్ఞఁదలికిం
బోయఁడె చేరెఁడు గంజిని, బాయక దయచేయఁడేమి బారెఁడుగుడ్డన్. ౧౮

గీ. అనియునెంచితిఁ గాని నీవెలఁదికంటెఁ, దొలుత నీవ పోయెదవని తలఁచు టెట్లు
కడకు నెల్లరఁ బాలించు నొడయఁ డీశ్వరుండ! నీవును నీయగ్రజుండుఁ గాదు.

సీ. బీమాయొనర్చి నీబిడ్డల కాలికిఁ, దెచ్చిపెట్టితి పరాధీనవృత్తి
మనలేరె స్వచ్ఛందమార్గమ్ము ద్రొక్కి నీ, వారు; జగాన నేవంకఁ గన్న
నం కెలకందక యగపడునిర్భాగ్యు, లెట్లుజీవించెద రీవునైత
మందొక్కరుఁడవ యని యేల తలపోయఁ, జనదోయి! యన్న విచారధార

ఆ. యెడఁదఁ బరువులెత్తె నింతియకాని య, ద్దాని ననుసరించి తడయ కెట్టి
పనియుఁ జల్పలేద భావస్థిరత్వ మే, ర్పడక క్రిందమీఁదఁ బడుచునుంటి. ౨౧

వ. ఆఫ్రికాచేరినపదంపడియు న బ్బీమాసొమ్ము కట్టకగడువుదానిం గట్టిన ట్లెఱుక యుండె - వెండియు నాఁటినాతలంపులకు బాహిరంబగు ననుభూతియుం గొంత సాయంపడె - నెట్లన నాఫ్రికా కేనింతకుము న్నరిగినతటిఁ గ్రైస్తవవాతావరణమ్మునం గలసిమెలసి యుంటి - నద్దానిఫలస్వరూపంబుగా ధర్మంపునెడ నా జాగరూకత బలిసె - నీసారి దివ్యజ్ఞానసమాజమ్ముగాలి నాకుం దగిలె - నందుఁ గృషి సేయు 'రి' చనునతండు జోహాన్సుబర్గునంగల తనసమితితో నాకు మైత్రివాటిల్లఁ జేసెఁ - గాని

క. ఆమతసిద్ధాంతములకు, నామార్గంబులకుఁ బొత్తు నలికం బగుటన్
సామాజికత్వ మందక, ప్రేమించితి నందు వెలయు పెద్దల నెల్లన్. ౨౩

గీ. దినదినమ్మును వీరితో నెనసి ధర్మ, చర్చ సల్పితిఁ దత్సమాజమ్ములోన
గ్రంథపఠనమ్ము సాగెడు కాలమందు, పన్యసించితి నపుడప్డు పాడి నెంచి. ౨౪

క. ఈవర్గమ్ముల సోదర, భావము నార్జించుకొంట పరమాదృతిమై
నావలపుఁ బెంచుకొంటయు, జీవనసూత్రమ్ములై ప్రసిద్ధికిఁ జాలెన్. ౨౫

గీ. ఏతదాదర్శములకు నం దెవ్వఁడేని, వింగడమ్ముగ నడుచుచో విడువకయ వి
మర్శగావింతు నద్దానిమహిమ మస్మ, దాంతరనిరీక్షణంబున కాది యయ్యె. ౨౬

* * *

౫ నిరీక్షణ పరిణామము

క. పదియేండ్ల నాఁడు నా కిటఁ, గుదిరెం గ్రైస్తవులపొత్తు; గురుసన్నిధిలోఁ
జదివెడి విద్యార్థిం బలె, గదియున్ విదళింపలేక యే నపుడుంటిన్. ౧

గీ. నాఁడు బైబిలుగొప్పతనమ్ముఁ జాటి, నన్నుఁ గ్రైస్తవుఁ గావింప నెన్నియేని
శ్రమలకోర్చిరి వారు; తత్సదుపదేశ, విధి తటస్థుఁడనై నేను వినుచునుంటి. ౨

గీ. అపుడు నాశేముషికి నందినంతవట్టు, తఱచిచూచితి హిందూమతమ్ము తెఱఁగు
నితరసిద్ధాంతములు సైత మించుకంత, చదువఁగంటిని ధర్మజిజ్ఞాస వెరిఁగి. ౩

కం. ఈనాఁ డిచ్చటిదివ్య, జ్ఞానసమాజమ్ములోని సంగడికాండ్రై
లైనన్ శ్రమించి నన్నుఁ దమ, వానిం బొనరించుకొంట వలచిరి మివ్వులన్. ౪

క. నామైత్రి వడచి హిందూ, సామాజికమైన ధర్మసంస్కృతిఁ గానన్
గామించిరి తచ్ఛాయలు, తా మాదృతి సేయు మతపథమ్ముల నుంటన్. ౫

ఆ. అమరభాషఁ దనకు నబ్బినపరిచితి, కట్టలంతి యనుట గట్టి దాట
మనమతమ్ముఁ దెల్పు మునుపటివ్రాఁతలు, చదువఁ జాలనైతి సంస్కృతమున. ౬

ఆ. లాఁతిబాసలందు గీతాదికంబులు, వెలసెఁ గాని వానివలన నాయొ
నర్చినట్టికృషియు నలికంబ యాగుట్టు, చెలిమికాండ్రు కెఱుక చేసినాఁడ. ౭

సీ. సంస్కారములఁ బునర్జననంబుల నడు, విశ్వసింతురు గాన వీసమేని
గలుగదా లగ్గు నాకతమున నని వారు, మది నాసచేసిరి; మాఱుకులేని
పుడమి నేరండమే పడిసన్న తరు వన్న, సూక్తి యున్నదికదా; ముక్తసంగుఁ
డల వివేకానందుఁ డాత్మవిద్యారాశి, రచియించి యొసఁగిన రాజయోగ

గీ. మపుడు కొందఱు చెలులతో నరసి చదివి, నాఁడ మణిలాల్ద్వివేది యొనర్చినట్టి
గ్రంథమును రాజయోగమ్ముఁ గతిపయాస్త, సోదరులతోడఁ దర్చిచ్చితి నాదరమున.

గీ. ఒకనిఁగూడి పతంజలి యోగశాస్త్ర, మును బఠించితిఁ బెక్కండ్రెనసి గీత
చదువసాగితి జిజ్ఞాసుసమితి యొక్కఁ, డచట నెలకొల్పితిం దత్త్వరుచిని మరగి. ౯

క. ఆ మండలి నధ్యయనము, నేమమ్మున సాగె నాకు నిరతము భగవ
చ్ఛ్రీముఖనిర్గతవాణీ, ధామముపై భక్తిగలదు తద్గీతపయిన్. ౧౦

ఆ. ఇపుడు తదర్హస్య మెఱుఁగుట కర్తవ్య, మనితలంచి యితరు లనువదించి
వెలువరించు దాని వెలుఁగున మూలార్థ. వేది నగుట కంగవించినాఁడ. ౧౧

గీ. వెండియును దానిశ్లోకమ్ము లొండు రెండు, దినదినమ్మును వల్లింప దీక్షగొంటి
దంతధావనమొనరించుతఱిని దాన, మాడునెడఁ గార్యమిది పూర్తియగుచునుండె.

సీ. తెలవాన్కైవడి నిలఁబడి పలుదోము, నలవాటు కలదు నా కది ముగింపఁ
బదునైదునిముసముల్ పట్టు మజ్జనవిధి, సలుప నిర్వదినిమేషములు వలయు
నటులౌటఁ బద్యంబు లలఁతిపత్రింబుపైఁ, జక్కఁలిఖించి నాసముఖమందుఁ
గల భిత్తి కదికించి కడఁకమై వల్లింపఁ, దొడఁగితి రదనము ల్కడుగువేళ

ఆ. నగుర ! నీరాట యెల్లయు ముగియుసరికి, హత్తుకొనుచుండె శ్లోకమ్ము లాత్మలోన
నపుడుకంఠస్థమయ్యె నధ్యాయములు త, దీయముల్ పదుమూఁడు నాతృప్తివెరుఁగ.

ఆ. అనలఁ గార్యభార మగ్గలమాయె స, త్యాగ్రహమ్ము పుట్టె నానిసుంగు
నవఁత లేక నిత్యనవతమై వర్ధిల్లు, జాడలెల్ల నేన చూడవలసె. ౧౪

ఆ. కొలఁదిలేనివేగ్రఁగు తలనిడికొంటి నా, కాలమెల్లఁ జిఱుతలాలనమ్ము
పాలనమ్ము దిద్దుపనులకె చెల్లె న, గ్గీతమిగులుఁ జదువుగీత తొలఁగె. ౧౫

క. ఉపనిష దవతంసము నా, విపులత నుతిగన్నగీత విడువక చెలికాం
డ్రు పఠించిరి వారపు డే, యుపలబ్ధిం గనిరి వారె యోగ్యులు వలుకన్. ౧౬

క. నాయనుభూతి వచించెద, నాయది నానడకదిద్దు నద్దము నన్నుం
బాయని ధార్మికకోశం, బాయెఁ దదాచార్యకంబు నభినందింతున్.

ఆ. అర్థ మెఱుకవడని యాంగ్లోక్తికిం గోశ, మెట్లు విప్పఁజూతు నట్ల నడక
చక్కఁయందు నెట్టిచిక్కెదిరించినఁ, దెఱతు గీత నపుడ తీర్పుగందు. ౧౮

వ. ఈయుపనిషత్తునం గల ధర్మశాచివాచావర్గంబున ౧౯

ఆ. నన్ను నిలువవైచినవి యపరిగ్రహం, బన్నపల్కు సమత యన్నమాట
పడయునెట్లు తుల్యభావ మద్దానిఁ బా, లించునెట్టు లని చలింపవలసె. ౨౦

క. దొరలేని గర్వమున నొక, దొర మనకు నవజ్ఞసేయ దొరఁకొను ధర్మం
బరయక లంచమువిను నొ, క్కరుఁ డింకనొకండు గిల్లి కయ్యము రేపున్. ౨౧

ఆ. ఇట్టివార కాక నెందఱో కలరు ప, రార్థరతులు సజ్జనాగ్రసరులు
వీరు వారు నొక్కతీరువారా ? రెండు, దెసల నెట్లు సమత పొసఁగనేర్చు. ౨౨

క. ఇఁక నపరిగ్రహధర్మము, సుకరమె యీతనువు దారసుతముఖ్యుల పొం
దికయుఁ బరిగ్రహ మను టొ, ప్పు కదా ! వెరవేమి దీనిఁ బాటించుటకున్. ౨౩

క. అంతర్వాణిశిరోమణు, లెంతయు శోధించి పంచియిచ్చిన తేజ
స్సంతతి గ్రంథావళి నా, సొంతమె ? యీకల్మినెల్లఁ జూఁడవలయునా ? ౨౪

ఆ. ఆశ్రయింప వలయునా నాకుఁ గల దెల్ల, విడిచి వేల్పు ? ననుచు వేయివగలఁ
దీవ్రచింత చేయఁ దివిరితి నపుడ నా, యంతరాత్మ యిట్టు లానతిచ్చె. ౨౫

క. ఔ నోయీ ! నియమం బెది, పూనిన ధర్మంబులెన్ని పొనరించినఁ దాఁ
గానంజాలఁడ యీశ్వరు, మానవుఁ డీయిల్లు ముల్లె మానకయున్నన్. ౨౬

వ. ఈవిచారమ్ముతోటి నాంగ్లేయన్యాయశాస్త్రంబు నాకుపకరించె-"స్నెల్" రచించిన ధర్మశాస్త్రంబునందలి సిద్ధాంతచర్చలు నాస్మృతికిం దాఁకె - ధర్మకర్తృశబ్దార్థమీఁగీతాసేవనంబునఁ దద్దయు నెఱుంగఁగంటి - నవ్వల న్యాయశాస్త్రంబు దెస నాతగులమ్ము పెరిఁగె - నందుం బాడిలోఁతులోఁతు లుంట తెల్లంబాయె - ధర్మకర్తలగువా రసంఖ్యాతవిత్తముం దమమేలుబడి నుంతు - రంతియ కాని ౨౭

ఉ. అందలిగుర్విగవ్వపయి నైనను వారికిఁ బెత్తనమ్ములే
డెందును ముక్తిఁ గోరునరుఁ డిట్టుల యుంట తగున్ వివేక మీ
చందముదాని నేఁ దెలియఁ జాలితి గీతలకొల్వు నేర్చి నా
డెందము పండెనంచుఁ బ్రకటించెద దానికి నంజలించెదన్. ౨౮

కం. సమభావం బపరిగ్రహ, మమరుట కెద మార్పునందు టక్కఱయని దీ
పముఁ వోలెఁ దోఁచె సంశయ, తమస్సు పొడవడఁగె నాత్మ తనిసను టాయెన్. ౨౯

గీ. అంత నిచ్చినసొమ్మున కింత వచ్చుఁ, గాక రాకుండుఁగాక శంకలకు దిగక
మాపు సేయుము నాదుబీమా నటంచుఁ, బనిచినాఁడ రేవాశంకరునకు లేఖ. 30

గీ. నన్నుఁ బుట్టించినట్టుల నావెలంది, నాదుబిడ్డల సృష్టించినాఁడు వేల్పు
నన్ను సాఁకినగతి జగన్నాథుఁ డతఁడు, సాఁకు నవ్వారి నుద్యద్దయాకరుండు. 3౧

క. నారుం బోసినయాతఁడు, నీ రేలాపోయకుండు నెచ్చెలి ! యనుచుం
బూఁటిచేసితిఁ గమ్మను, గూరిచితి నృగుడ నన్నకొఱ కిటు లేకన్. 3౨

క. అన్నా! పలమో తులమో, నిన్నటివఱ కేగడించి నిల్పినసిరి నీ
సన్నిధిఁ బెట్టితి నిఁక నా, కెన్నఁ గలఁ గొర్కె విడ్పుపు లేఱదు నీకున్. 33

ఇంద్రవజ్ర

ఏ నింక నార్జించున దెంత యున్నన్
దానిం బ్రజాసేవక ధారవోయన్
నానిర్ణయం బయ్యె వినమ్రభావ
శ్రీనిండ నీపల్కులు సెప్పుకొంటిన్. ౩౪

వసంతతిలకము

నాయన్న కీతలఁపునం గలమేలిచందం
బాయుత్తరంబు గనినంతన తోఁపదయ్యెన్
ద్రోయంగరాని రుషఁ దోఁగి కటూక్తి చిందన్
వ్రాయంగ నోర్చె నిటువంటిది లేఖ నాకున్. ౩౫

ఆ. ఎంతవాఁడ వైతి వీనాఁ డహో! వెఱ్ఱి, తలలువైచె నీదు తెలివి యెల్ల
నప్పకంటె నీవు గొప్పవాఁడవె కన్న, దెఱచిచూడు మతని తెరు వొకింత. ౩౬

ఆ. అన్న మిడఁడె తండ్రి యాలుబిడ్డలకుఁ దత్, భద్ర మాసచేసి పాటువడఁడె
జగతిఁ బేరుగన్న జనకునియట్ల సం, నారభరము నీవు సైఁపవలదె. ౩౭

క. ఈసరణి నేదియేదియొ, వ్రాసె మదగ్రజుఁడు దానివైఖరి కే నా
యాసమునందక వినయపు, వాసన లెసలార నిట్లువ్రాసితి మరలన్. ౩౮

క. ఓయన్న! చిత్తగింపుము, నాయన వర్తించినట్లు నడుచుచు ధర్మం
బేమెడ నుల్లంఘింపక, సేయన్ దొరఁకొంటి లోకసేవావ్రతమున్. ౩౯

ఆ. అల కుటుంబమన్న పలుకున కర్థమ్ము, దీయుతఱి విశాలదృష్టి వలయు
నపుడు నాయెనర్చినట్టి కర్జంబున, మంచిచెడ్డ లెల్ల మదికిఁ దెలియు. ౪౦

గీ. ఇట్లు ప్రత్యుత్తరము నంప నితనిచూపు, మాఱదని యన్న నామీఁదిమమతఁద్రోసి
కమ్మ వ్రాయుటయు న్మానెఁ గాన మదిక, లంగి దుఃఖతరంగముల్ పొంగె నాకు.

ఆ. ఎట్టులైననేమి యే నాదరించిన, ధర్మ ముజ్జగించి దారిదప్పి
యుందునేని నాఁటికుందునకున్ వేయి, మడుఁగులైన కుందుఁ గుడిచియుందు. ౪౨

క. ఇది హేతువుగా నగ్రజుఁ, డొదవించిన యల్పదుఃఖ మోర్చితి నతనిన్
మొదలిటిచందపు భక్తిన, మది నిల్పితి వానిపెంపు మఱవక యుంటిన్. ౪౩

క. అతనికి నాదెస నర్మిలి, యతివేలం బగుట నిట్టి యలమట వొడమెన్
సత మతనిమదికి నాసుచ, రిత మస్మద్ధనముకంటెఁ బ్రియమై తోఁచున్. ౪౪

క. తనచరమకాలమున నా, మనుగడ మాన్యం బటంచు మదినమ్మి యతం
డెనలేనితుష్టి కెసరే, గినట్టి యనుతాపమునకుఁ గేంద్రం బయ్యెన్. ౪౫

ఆ. మరణశయ్య నున్నతఱి 'ధర్మబద్ధ మా, బ్రదుకు నీది మేలిబాట నీది'
యనుచు నగ్రజుండు పనిచినకమ్మలోఁ, గరుణరసను గట్లనొరసి పాఱె. ౪౬

క. దూరం బరయక నీదెస, నేరం బొనరించితిని గణింపకు మితనిన్
సైరింపు మనుచుఁ దా నన్నుఁ, గోరెను జనకుండు సుతుని గోరెనసరణిన్. ౪౭

క. తూరుపువడమర లెఱుఁగని, వారలు నాబిడ్డ; లిచ్చ వచ్చినరీతిన్
దీరిచి దిద్దుము కుఱ్ఱల, భారము నీమస్తకమ్ముపైఁ గల దనియెన్. ౪౮

ఆ. అనఘుఁ డతడు నన్నుఁ గనుగొంటకై కరం, బాత్రపడియె వత్తు నాఫ్రికాకు
ననియెఁ దడవుసేయ కరుదెమ్ము దర్శన, మి మ్మటంచుఁ దంతిసడితి నేను. ౪౯

గీ. ఒండొరుల నేము చూచుకో నొప్పఁడాయె, నీశ్వరుఁడు; ప్రతికులభావి నెట్టియాస
పెంచె నగ్రజుఁ డదియుఁ బ్రాప్తింపదయ్యెఁ, గడ కతండు దేశమునందకన్నుమూసె.

ఆ. పాతబాటలోనఁ బయనించుటయ కాని, క్రొత్తమెఱుఁగు లన్నకొడుకు లెఱుఁగ
రెంతపడియు వారి నింతయు నాపోవు, దెసకుఁ దిగువ లేక దిగులుగంటి. ౫౦

క. అరసితి వారలదోసము, నెరసంతయు నిందు లేమి నేఁ గనుఁగొంటిన్
దురతిక్రమమగు ప్రకృతిన్, నరుఁడెవ్వఁడు గెల్చు లోకనాయకుఁ డైనన్. ౫౨

ఆ. వేళ్లుబలిసి యున్న వెనుకటిసంస్కృతి, నెదిరిచి యెవఁడు నిగ్రహింపఁ గలఁడు?
మనకు నంటుచున్నమార్పులు వెల్గులు, నాశ్రితులకు నంటు టది హుళక్కి. ౫౩

గీ. బిడ్డలం గని యాసమైఁ బెంచువారి, పూఁట యన నెంత బెడిదమో తేటపఱుపఁ
దగు నుపాఖ్యాన మిది యెల్లతల్లిదండ్రులు, లాత్మజులు దీని గుర్తింప నభిలషింతు.

* * *

౬ ఆకుదిండికి బలి

క. చాగంబు ధర్మరక్షా, జాగర్యయు డంబముల దెసన్ విముఖతయున్
రేఁగినకొలంది రెక్కొన, సాగెను మన్మానసమున శాకాన్నరతుల్. ౧

క. ఏ నేధర్మము నమ్మితి, దానిం గడుభక్తి మున్న తల నిడికొందున్
నానాశ్రమమ్ము లీకొని, పూనుదు నడరింప నిచ్చపొడగలచోటన్. ౨

ఆ. జలచికిత్స మెచ్చు శార్మణ్యుఁ డొకఁడు జో, హన్సుబర్గునందు నాకుదిండి
నెల యొకండు నడుపఁ దలకొనుచున్ వేడ్కఁ, దోఁగి యచటి కేగ సాగినాఁడ. ౩

క. ఆకూటికి నాంగ్లేయుల, నాకుం గడుఁగూర్చువారి నడిపితి సాకుం
బేకరణిం గూర్చిన నది, పైకము తగినంత లేక బందఱుపోయెన్. ౪

వ. కాని వెనువెంటన వేఱొండు పూఁటకూళ్ళయి ల్లాపిటం దలయెత్తె — నద్దానిచరిత్ర
మిచట నావిష్కరించు టావశ్యకంబు. ౫

క. దివ్యజ్ఞానసదస్సునఁ, గ్రివ్యంబును దిననివారుఁ గల; రందుఁ గలా
భవ్యార్చనాభిరత వి, త్తవ్యయమున కోటవడని తన్వి రహించున్. ౬

క. పలువురు నెయ్యురు గల రా, వెలఁదికి నయ్యబల భోజ్యవిక్రయశాలన్
బాలలేనిదాని నడుపన్, దలపోసె నుదాత్తభంగిఁ దన్నగరమునన్. ౭

క. ఆయమవణిజ్యకై నా, సాయం బొకకొంత వలసె సంపన్నత్వ
చ్ఛాయ గలదాట నమ్మికఁ, బాయక యిచ్చితిని వేయిపౌన్డులఋణమున్. ౮

గీ. ఎందఱెందఱొ యభియోక్త లించుకేని, సంశయింపక సొమ్ము నాసరసనుంతు;
రప్పుగా నేఁడొసంగిన యర్థమెల్ల, 'బదరి' దయ్యభియోగి సద్భావపేటి. ౯

క. అతఁ డన్నా! నిన్నెఱుఁగుదు, నితరంబు నెఱుంగ నీకు నికార్యము సం
గత మనుప్రత్యయ మొదవిన, మఱి నంజక వడయు ముత్తమర్ణతయనియెన్. ౧౦

మం. అతఁ డాఫ్రికాభూమి కాదికాలమున, వచ్చి నిల్చినకూలివాండ్రలో నొకఁడు
సత్యాగ్రహం బేను సాగించువేళఁ, జెఱసాల కేగి డస్సినమేటిబంటు
ఈపాటివైకొలు నిచ్చుటంజేసి, యతనివిత్తంబు నయ్యతివ కిచ్చితిని
మాపంచు రేపంచు మాసము ల్గడపి, కొస కాసహోదరి గుల్లప్పగించె. ౧౧

క. నాగుండె చెదరె నింతటి, వ్రేఁ గెట్లుభరింతు నన్నవెఱ పైకొనియెన్
యోగం బీదృశ మెన్నఁడు, నేఁ గుడిచియెఱుంగ నింక నేమనువాఁడన్. ౧౨

ఆ. బదరి నన్నెఱుఁగు భారం బదెల్ల నా, మీఁదనైచి ఋణము నాదరించె
నమ్ముకొన్నవాని నష్టేటిలో ముంపు, తగనికసటుఁ జేఁత ధార్మికునకు. ౧౩

ఆ. అగుట నతనివిత్త మంతయుఁ జెల్లించి, యేన నష్టియెల్లఁ బూనినాఁడ
నీచరిత్ర విన్నహితుఁ డభియుక్తుఁ డో, కరువుఁ డిట్లు నాకు నెఱుక సెప్పె. ౧౪

గీ. సోదరా! యిట్టిచేఁతకు నీవునడక, కేమిపా త్తభియోగుల మేము నీదు
శీలమును నమ్మి నీచెంత వేలువేలు, నిలువనిత్తుము వత్తుము వలసినపుడు. ౧౫

క. మాసొమ్ము నిట్లు సంస్కర, ణాసక్తికి లోఁగి పెఱల కప్పగ నిడినన్
గాసియగు మీకు మాకును, మీసేవావిధియు మెల్లమెల్లఁగ నడఁగున్. ౧౬

క. ముద్దుముద్దుగ నితఁడు నన్ ముదలకించి, సన్నసన్నగ నాఁడు నాకన్నుదెఱచె
నింత కమ్మనిచెలికాని నెందుఁ జూడ, నితఁడు నాభాగ్యమునఁ జేసి యిపుడుఁ గలఁడు.

క. ఇతఁ డేనినేని మును దు,ర్మతిఁగా శంకించి యతఁడు మాన్యుం డను సం
గతి నవ్వేలఁ గనినంతన, కుతిలపడున్ వానిసరసకుం బరువుగొనున్. ౧౮

ఆ. అతని నాశ్రయించు; నపరాధి నతని మ,న్నింపు మిచ్చు నాదరింపు మనుచు
వేడివేఁడి యెడఁద నెలఁదితనమ్ము నుఁ,గ్గడువుగా గడింపఁ గడఁగుచుండు. ౧౯

క. మది నోడక యీతఁడు న,న్నెదిరించుట నాకు లెస్స యెంతయు నోదవెన్
అదిమొద లధమర్ణతకున్, గొదుకుదు నప్పుచిన నేవకున్ వసవోదున్. ౨౦

క. మన సెంతతీవరించినఁ, దన సంస్కారణానురక్తి తఱుఁగని దైన్
మనుజుం డోపికదాఁటిన, పని సేయుంజన దటన్న పాఠము గంటిన్. ౨౧

క. ఏ నిందు గీతఁ గోనఁ బ్రి, థాన మనాసక్తియోగతత్పరబుద్ధిన్
మాను టెఱింగితి భావిం, గానఁగ నీదొసఁగు వెలుఁగుఁగంబము యయ్యెన్. ౨౨

క. ఇచటన్ నిరామిషాన్న, ప్రచారమఖవేది కింతబలి నీవలె న
న్న చరిత్ర మెఱుఁగ కిట్లు వ, డచితిన్ సుకృతమ్ము వలచిడక్కనదానిన్. ౨౩

* * *

ఉష్ణజల ప్రయోగము

క. డంబ మెఱుఁగనిబ్రిదుకుపై నింబు నాదు,మదిఁ బెరుంగుటతో పాటు మందుమీఁది
వలపు లేమియు నొగిని దైవాఱఁజొచ్చె, లంఘనాదుల తెగు లాఁపి లగ్గు నిడఁగ. ౧

క. మలజాడ్యము తలయేరుం, బలుమఱు నన్నీ జోహాన్సుబర్గున నేఁచెన్
గలఁగక పథ్యాదులతోఁ, దొలఁగించుచునుంటి వానిదుందుడు కెల్లన్. ౨

క. ఆరోగ్యము సంపూర్ణము, కానేరద యెన్నివగలఁ గాఱియపడినన్
వారింతు వేని మందుల, నీరోగం బాదవి నిల్వనే ర్తునెఁ దలఁపుల్. ౩

గీ. అపుడు 'మాంచెస్టరు'నఁ బ్రాతరశన ముజ్జ,గించెడు సమాజమొం డుదయించె నన్న
నుడువు చెవిసోఁకె నెడపక కుడిచి వెజ్జు, నడుగులొత్తెడు తెలవాని కది శుభంబ. ౪

ఆ. అతఁడు తిండిపట్ల నాచరించెడు తప్పు,లెల్ల నే నొనర్పనొల్లఁ గాని
వేళ్లి కందుదనుక విడువక మువ్మాఱు, దినదినమ్ము బువ్వఁ దిందు నేను. ౫

గీ. నడుమఁ దేనీరుగొందు నెన్నఁడును గడమ,వచ్చుటకు నోర్వ నశనసేవనముపట్లఁ
బోపులంటని శాకంబ భుక్తిగాని, యుడుగలే నందు రుచులు వీలున్నవట్లు. ౬

క. ప్రాతరోభ్జన ముడిగిన, నాతలపో టడఁగునంచు నమ్మితి నెటులో
మూతిబిగించితి మస్తక,యాతన వదలించుకొంటి నతిశీఘ్రముగన్. ౭

ఆ. ఇన్నినాళ్ళనుండి నన్నొంచు నేరువ, కాదికారణంబు హద్దుమీఱి
మెక్కుచుంట యన్ననిక్క మీనాఁటితోఁ, దెలిసివచ్చె లజ్జవలిసివచ్చె. ౮

క. శకృద్వార్తి దీనికతనన్, వికలముగాదయ్యె దాని వెడలింపఁ దలం
చి కటిస్నానముఁ బూనితి, నొకకొంత ఫలంబుకంటి నుడుగనిదీక్షన్. ౯

వ. అట్టితఱి 'జుస్టు'గచించిన 'ప్రకృతికిమరలుట'యనుగ్రంథమ్ము నొకనెచ్చెలి నాకొసంగె - నందు మృత్తికాచికిత్సావిధు లెన్నేని గలవు - మఱియు సరిక్రొత్త పండ్లుం బక్వపదార్థమున్న కాయలు న్మానవప్రకృతి కనుకూలించుతిండి యని దాన నిరూపింపం బడియె - ఫలసేవనము నట్లుంచి యేను మృచ్చికిత్స నారంభించితి - నది నాకు లెస్సలెస్సం గూర్చె - దాని నిచటం గొంత వివరింతు - నెఱ్ఱమన్నొండె నల్లమన్ను శీతలవారిం దోఁచి దాని మనుఁగువల్వను రాచి పొట్ట కదికింపఁజను - నే నీవైద్యమ్ము సేయం జేయ నామలదోషంబు మటుమాయమాయె - నదిసుత నానేస్తకాండ్రం బలుగుర నిందు దింపితి - వారెల్లరుం దీని మేలు వడసి తనిసి - రీనేల నడుగిడ్డవెనుక నిరంతరకార్యవ్యగ్రుఁడనై యాప్రయోగమ్ములదెసకుం జనలేనైతి - నట్లయ్యు నీచికిత్సపట్ల నాకుం గలనమ్మిక చెక్కుచెదరదయ్యె - మట్టిమందు నేఁడునుం గొంతకొంత పాటింతు - నొండు రెండు తడవ లే నతిభయానకమ్ములగు రోగమ్ములకుఁ జిక్కితిఁ - గాని ౧౦

క. నరునకు మందులతో న,క్కఱ లేదని సెప్పవోర్తు గడుసరిపత్తిం
బరయుచు మృత్స్నాఘస్నుల, నెఱిఁగి ప్రయోగింప రుక్కులెల్లను డుల్లున్. ౧౧

గీ. కాయమునందెల్ల రసవిషగంధకములు, క్రిక్కిఱియ నరుఁ డాయువున్ డించుకొనెడి నకట!
యతఁడు తనదేహమున కొడయండు గాక, బానిసీఁడై నిరంతరాపదలఁ గుములు.

గీ. పట్టుసెడి మంచమెక్కి యీ ప్రకరణమ్ము, వలుకుచున్నాఁడఁ గాన నాతలఁపు లేఁడు
నలఁతి సేయంగఁ జనదు నా తెలిపినట్టి, దారులన్నియుఁ బరికింపఁదగు నతఁడు. ౧౩

క. నన్నుం బలసినరోగము, లన్నింటికి నేన హేతువని యెఱుఁగుదు నా
ట న్నాతాలిమి సడలద, కన్నాఁడను వేల్పుకరుణ గదరూపమునన్. ౧౪

గీ. మందునొల్లని యీ మొండిమనిసివలన, నెందఱో నెయ్యురగు వెజ్జు లింత యంత
గోడుగుడుచుట యేనెఱుంగుదును గాని, తక్క రవ్వారు నన్ను నౌదార్యఖనులు.

క. చదువరుల కిచట నొక్కఁడు, విదితముగావింతు 'జుస్టు' వినిపించిన ప
ల్కొదియేని సత్య మనుచున్, మదినమ్మక తఱచితఱచి మైకొను ట్రొప్పున్. ౧౬

వ. ఏలనా రచయితలచూపు తఱచుగా నొక్క లక్ష్యమ్మునంద తగిలియుండు - నెల్ల వస్తుల నెల్ల దెసలనుండియు నించించుక చూడందగు - వెండియు నవ్వస్తు

వెలుఁగన్నను సత్యమ్మగా నుంట వలయుఁ - గాని యేకకాలమ్మునం దదిసర్వథా నిక్కమై యుంట పొసఁగనేర దనియుం దెలిసికొను టావశ్యకంబ - నేఁ డావిష్కృతంబులగు పొత్తంబులం బెక్కులు రొక్కమ్మునకొండెఁ గీర్తికొండె సృష్టంబు లగుచుండుఁ - గావునం జేసి యిట్టివ్రాఁతలం గనఁగోరు గఱువ లియ్యెఱుకతో నుంట లగ్గు - తత్తదంశములం బరికింప నెంచినవా రనుభూతివడసిన పెద్దల మాటలం బాటించి యాఁగి యాఁగి పఠించి తత్త్వంబు గన్నపదంపడి పరీక్షకుం గడంగఁదగు. ౧౭

* * *

౮ ఒక హెచ్చరిక

క. ఇంతకుమును మృత్స్నాకథ, కొంత లిఖితమయ్యె నిచటఁ గొండొక భోజ్యో
దంతము వ్రాసెద దీనికి, వంతున్నది ముందువచ్చు వ్రాఁతలయందున్. ౧

సీ. ఆరోగ్యదిగ్దర్శనాఖ్య నిర్మించిన, కృతియందు భోజ్యసంస్కృతిని గుఱిచి
విస్తరించితిఁ గాన విపులంబుగా నిటం, దినుబండములసుద్ది తెలుపనొల్ల
నపుడప్డు నాకూర్చు నలఁతియలంతి పొ, త్తములలో నదియ తద్దయు రహించె
మనవారు తెలవారు మగవారు మగువ లా, రచనమ్ము దెస నాదరమ్ము నింపి

ఆ. రాత్మజీవనమ్ము నద్దానితో సరి, చేసికొనిరి నాకు వ్రాసి రెన్ని
యేని మెప్పుఁగమ్మ లింకను వ్రాయుచు, న్నారు గాన దానితీరు వినుతు. ౨

ఆ. అందు వెలయుదానిఁ గ్రిందుమీఁ దొనరించు, నట్టి యవసరంబు పుట్టలేదు
కాని దాని కెడపుగాఁ గొంతసనితిఁ ద, త్పరిత తెలుఁగ రేను బడినమార్పు. ౩

గీ. ఏ నొనర్చిన మార్పాటులెల్ల వీరి, కెఱుకపఱుచుట నాపాలికృత్య మగుట
లజ్జయుం బిమ్మటయు నెంత విజ్ఞఁ గాక, యిప్పనికి నంగవించితిఁ దప్పదనుచు. ౪

క. కూరిచినవాఁడ ధర్మ, ప్రేరితమతి నితరకృతులరీతిన దీనిన్
వారక యేతద్ధర్మ, శ్రీ రాజిలు నాయొనర్చు చెయువులనెల్లన్. ౫

క. ఈపుస్తకమునయం దేఁ, జూపినసూత్రములు కొన్ని సొంతమ్ములుగాఁ
జేపట్టలేకపోయితి, లోపంబిది చెప్పికొందు లోకమునెదుటన్. ౬

క. మనుజునకుం గొండికతఱి, జనయిత్రిపయస్సు వలయు, శైశవదశ దాఁ
టినవెన్క దుగ్ధ మెద్దియుఁ, గొనఁబనిలే దన్నబుద్ధి గూరెం దనకున్. ౭

గీ. అడవులం దారముఁగ్గినయట్టి పండ్లు, కాయలుం జాలు నరునియాఁకటి నడంప
గోస్తనీముఖ్య ఫలరాజ గొప్పచేవ, నీయఁగలవు మనీషకుం గాయమునకు. ౮

క. ఈదృశమగు సంథస్సున, నాదృతిగల మనుజుఁ డింద్రియంబుల నోర్చున్
భేదింపరాని శక్తికి, నాదరువగు బ్రహ్మచర్య మతనికి లోఁగున్. ౯

వ. "తిండివంటిదే త్రేఁపు - బుద్ధివంటిదే బుద్ధి" యనులోక్తులు పరమసత్యంబులు నాఁ జెల్లు - నిందు నేనును నాసంగడికాండ్రును వలసినంత యనుభూతి వడసితిమి - నా "యారోగ్యదిగ్దర్శనము" నం దాయాయంశములు లెస్సతర్కించితిఁ - గాని దైవప్రాతికూల్యంబుకతన భారత దేశమునం దస్మత్ప్రయోగముల నెల్లవానిం బాటింపనశక్యుండనైతి - ఖేదామండలమ్మున ౧౦

క. పెనఁకువకు న్వలసినపా, జును సంతనచేయ నలయుచున్ దిసుగునెడన్
బనుపడ్డ యొండుమఱపునఁ, బెనురోగంబునకుఁ జిక్కి పెద్దయుఁ జెడితిన్. ౧౧

క. మంచము నెక్కితి మృత్యువు, పొంచి నను౦జూచె నింతపుట్టినఁ బాలన్
డించియ బ్రతుకుం బడయఁగ, నెంచితి వ్యర్థశ్రమమ్ము లెన్నోపడితిన్. ౧౨

గీ. పాలులేకయ జీవించువీలు నెఱుక, సేయుఁడా యని వెజ్జులా చెలిమికాండ్రఁ
బలుకరించితి బాదాముపప్పుపాల, మినుపకడుగును జూపిరయ్యునుఁగు లరసి. ౧౩

క. మేనెల్ల సడలునంతకు, పీనిం గయికొంటిఁ గాని విడువద రుజయున్
బ్రాణంబు నిల్పుకొంటకు, నానామార్గముల వెదకినాఁడం బిదపన్. ౧౪

గీ. తెగులు పైకొన్నతఱిఁ దినఁదగిన దేమి, తగనిదెయ్యది యనుచర్చ తప్పటంచుఁ
జరకసుశ్రుతముఖ్యు లేర్పఱిచినట్టి, ధర్మములుచూపి రారోగ్యదాతృమణులు.

క. అక్కఱయగుచో నంజుడు, మెక్కినఁ దప్పేమియనిరి మిత్రులు; పాలం
దక్కుట మంచిదియని వీ, రెక్కరణిం బలుకనేర్తు రీకష్టదశన్, ౧౬

గీ. దుగ్ధమును ముట్టరాదని తొల్లి యేను, బ్రతినపూనితి నపుడు మహ్వావవీధి
నావులుం బఱ్ఱెలున కల వగుటఁజేసి, మేఁకపాల్ ద్రావ నీనాఁడు మెత్తఁబడితి.

క. ఇది యుత్తమధర్మముగా, దిది శపథపుగుండెఁ జీల్చులే యంచుఁ బదిం
బదిగ మది మొత్తుకొన్నను, బ్రదుకునఁ గలతీపి యిట్టిబాటను నీడ్చెన్. ౧౮

క. కట్టుగ్రమైన రోగటు, చట్టమునకు బొమ్మచూపి జయమును బడయం
బుట్టె నపు డిచ్చ దానన్, నెట్టుకొనెన్ జీవితాశ నిర్భరమగుచున్. ౧౯

వ. ఈ హేతువునంజేసి యస్మదీయ జీవనప్రయోగమ్ములు వెనుకడుగు వేయవలసి వచ్చె - లోకమునం గొంద ఱన్నపానములతో నాత్మకుం బొత్తులేదనియు నది కుడుచునది కోరునది కాదనియు జఠరముం జేరు పదార్థమ్ముకతనం గాక లోదెస నుండి వెలువడునుడువునం జెడుగు వాటిల్లు ననియు, వక్కాణించుట నాకవగతంబ! - యీపల్కులం గొంతసత్యంబు కలదు - కాని దీనిపై వాదమ్ము రేఁపుట దిగఁద్రావి యిచటినానిర్ణయంబు నివేదింతు. ౨౦

సీ. పరమేశున కెవఁడు వెలచు నచ్చపుభక్తి, ప్రకటించు నెవ్వాఁడు ప్రభునిపట్ల
నీశ్వరదర్శనం బెతఁ డాసచేయు న, ప్పురుషుండు పల్కునఁబోలెఁ గుడుపు
నెడల సైతము పట్టువిడుపుల నొందుగాఁ, బాటింపఁ దగునని చాటనేర్తు
నేనొనర్చినతప్పు లేఁబడ్డపొరపాట్లు, చేపట్టఁదగునని చెప్ప నోరుల

ఆ. కిదియ కాక మీకు నీతెన్ను వలదని, యడ్డగింతు వింజ మాఁగినట్లు
వెజ్జుసెప్పనేని విడువుఁడు పాలు నా, రచన చదివి మానరాద యందు. ౨౧

గీ. తడవులంబట్టి తెగులుచే నడఁగువాని, జాఠరజ్వాల శుష్కించి స్రుగ్గువానిఁ
దల్లివలె నుద్ధరింపఁగాఁ దగినమందు, కానరా దన్యతరము దుగ్ధమ్ముగాక. ౨౨

క. వెనువెంట నఱిగి రోగికిఁ, బెను వెంతయుఁ గూర్చి పాలు పెల్లాడుకొనున్
గనినాఁడ నీదృశంబగు, ననుభూతిని భారతోర్వి నయ్యేయెడలన్. ౨౩

గీ. కాన దుగ్ధమ్ముగుఱిచి నాగ్రంథమందుఁ, గలప్రసంగ మారూఢంబు కాదటంచుఁ
జదువరుల్ప్రమోల విజ్ఞప్తిసలిపి యెడఁద, ప్రేకమును డించుకొందు వివేకి నౌదు.

గీ. వైద్య సిద్ధానిఁ జూచినవా రీవయస్సు, నగిది మేల్సేయఁగల వనస్పతిని జదివి
కాక యనుభూతిమైఁ బొడఁగాంచిరేని, నాకు నెఱిఁగించి తోడ్పడ నున్నతులొసర్తు.

* * *

బలిమితో నెదుర్పాటు

ఆ. అల జొహాన్సుబర్గనంనువసించి యు, తోఁకచవములకు నాల్క సాఁచిసాఁచి
బెసిమ్యాలినట్టి యాసియాశాఖాధి, కృతుల దెసకు దృష్టి నిడుద మిపుడు. ౧

క. వీరిదారతనము నీతికి, దూరంబుగ నున్నకతన దుర్భరబాధల్
గూరి దిగువాఱి తూర్పుపు, వారత్తఱి దిక్కులేనివారై రకటా! ౨

క. అధికారమున్నవారా, పృథివికి రా నాజ్ఞపట్ట దితరు లపాత్రుల్
వ్యథలేకయ చోర వీలగు, నధమం బొకనూఱుపౌండు లర్థంబిడినన్. ౩

క. రక్కసితన మిట్లున్నది., యిక్కడ మీ రూఁకున్న నింకెవ్వవరు మా
దిక్కని ప్రాగ్దేశీయులు, పెక్కురు నాచెంత మొఱ్ఱపెట్టిరి దీనుల్. ౪

క. నీసోదరులం బొదివిన, గాసి పొకాలించి లగ్గు కల్పింపనినాఁ
డీసీమ నీవునిల్చుటఁ, జేసి ఫలంబేమి యనుచుఁ జిత్తము గదిమెన్. ౫

క. కడఁగితిఁ గర్తవ్యమునకుఁ, బడసితి సాక్ష్యమ్ము వలయుపత్రము; లంతన్
నడిచితి రక్షకశాఖా, విడింద్రుసన్నిధికి ధర్మవీరము విరియన్. ౬

క. అక్కటికము ధర్మేచ్ఛయు, నిక్కడు మన సున్నవానినెఱి నతఁ డుండెన్
జిక్కనితాలిమితో నా, వక్కణ సకలంబు ముక్కవదలక వినియెన్. ౭

ఆ. సాక్ష్యమెల్ల నరసె సాక్షులఁ దానై ప, రీక్షచేసె "ధర్మదృష్టి పెంచు
కొన్నవాఁ" డటంచు నన్నుఁ దలంచె నా, పలుకు విశ్వసించి పాడివలచె. ౮

ఆ. తెల్లవార లచటఁ దీర్పరులౌట వా, రాంగిలేయు దోషి నాదరింప
కచ్ఛధర్మదాసులై తీర్పుసెప్పుట, పొసఁగ దన్నబుద్ధి పుట్టె నాకు. ౯

క. అయ్యధికారియు నాతలఁ పియ్యకొని కడంగిచూత మెయ్యదియో య
న్యాయ్యం బగునను వెఱితో, నియ్యెడ మనపాలిధర్మ మేలావిడువన్. ౧౦

క. అపరాధుల బంధించెద, నపవిత్రంబైన ప్రభుత నాత్మ సహింపన్
గృహమూప్రట కాదుగదా, కృపణుల దెస ననుడు వార్ష మేసరె నాకున్. ౧౧

క. తప్పొనరించినవారలు, కుప్పలుగాఁ గలరు కాని కోర్టున కీడ్వన్
జొప్పడినగుట్టు దొరకిన, యప్పు లిరువురౌట వారి కాజ్ఞలు పుట్టెన్. ౧౨

వ. ఏ నిప్పట్ల మాటిమాటి కాపోలీసుదొరం దఱియుచుంటి – నా యొనర్చుపనికి దాఁపురంబన్న దెన్నఁడుం బొసఁగనేర – దట్లయ్యు నిందితులు నా జాడలెల్లం బరికించుచుపొంచు వేగరులం గొందఱ నియమింప వారు నా కార్యాలయంబున కపుడపుడు వచ్చుచుం బోవుచు వలయు విశేషంబు లారసించి యధికారులకుం దెలుపుచుండ జాగిరి – కాని వలసినంతమందిచారు లాయుద్యోగులకుం జిక్కరైరి – దీనికిం గారణంబు సాధ్యసంబ – హిందూస్థానమ్మువారుం జీనా దేశీయులు నిప్పట్ల నాదరువుగాకున్న సద్దోషులం బట్టించుపని నా కలవికాఁజాల – దిం దొకండు పలాయితుండయ్యెఁ గాని రక్షకభటులు బెట్టిదంపు వెరవు లూఁది సాధించి వానిం దెచ్చి – రభియోగమ్ము చర్చకువచ్చె – సాక్షు లెల్లరున్ విచారితులైరి – మాగెల్పున కెన్నెని ప్రమాణంబులొదవెఁ – గాని తీర్పు మాకు వింగడంబయ్యె–నంత ౧౩

గీ. ఆస లుడిఁగితి నేను బోలీసుదొరయు, దుర్భరంబగు నలజడిం దోఁగిపోయె
న్యాయవాదులబ్రదు కిట్టిదా యటంచు, నేవ తిండించె నాకు నావృత్తియెడల. ౧౪

గీ. రాసులై రాసులై యున్న దోసములను, మూసిపెట్టుట కొదవె శేముషి యటంచుఁ
బ్రజ్ఞపై రోఁతయును రేఁగెఁ బాడి కిచట, నాశ్రయము లేదెయనుభయంబడరెఁగాని.

ఆ. కోర్టుదెబ్బ తప్పుకొన్న నిందితులను, దొరతనమ్ము వారు దూర మరసి
కొలువునుండి వెడలఁగొట్టుట నవ్వారి, బ్రదుక దెల్ల బట్టబయల యయ్యె. ౧౬

క. వీరు పదభ్రష్టతమై, నాఁడిపా లగుట నాసియాశాఖదురా
ఛారము లించుక వెనుపడెఁ, గూరెం భ్రాంతిచ్చుప్రజాళిగుండెకు దిటవున్. ౧౭

క. నాకీర్తి పెరిఁగె నవ్వల, నాకల్మియుఁ బెరిఁగెఁ గోర్టునం బనిహెచ్చన్
లోకమ్ము నడఁచు లంచపు, వేకినయుం బటిఁగెఁ బాడి వెరుఁగందాడఁగెన్. ౧౮

క. ఆయుద్యోగులు నీచత, కాయువుప ట్లగుట నిక్కమైనను వారిం
దోయక కినియక నిల్చితి, నీయంశ మదెల్ల వారియెఱుకకుఁ బోయెన్. ౧౯

క. అధికారమ్ములు కోల్పడి, యధమస్థితిఁ జిక్కి వీర లత్తతి నాప
న్నిధులై తిరిగిరి బ్రదు కెవ్విధి నీడ్తుమటంచు నెల్లవీధులయందున్. ౨౦

వ. ఆనాఁడు జోహాన్సుబర్గుపురపాలకసంఘ కార్యాలయంబునం గొన్నికొలువుల కెడముంట వీరు వానిం బడయ నుద్యోగించి నాయంగీకృతిలేమింజేసి యదిఁ గృతార్థత వడయలేక యేఁకారుచుంట తన్మిత్రుం డొకండు నా కెఱుకచేసిన యంత ౨౧

క. ఏ నక్కటికమునం బని,పూని తదుద్యోగసిద్ధి పొసఁగించితి ని
ద్దానఁ దెలవారు శంకా, లీనాత్ములు గాక వర్తిలిరి నాపట్లన్. ౨౨

గీ. ఎంత యెదిరించినఁ గటుత్వ మెంతచూపి, యెంతయల్లరి చేసిననేమి నన్నుఁ
గొల్లి త్తశాఖయుఁ దీయమ్ముగురిసి మెచ్చె, నెఱుఁగ నవ్వేళ నాతత్త్వ మిట్టిదనుచు.

క. ఇది సత్యాగ్రహమునకున్, మొదలిటివే రని యహింసమోహనమూర్తిన్
బొదలెడు నొక యపఘన మని, పదపడి కనుఁగొంటి మేలిపథ మనుకొంటిన్. ౨౪

సీ. నరుఁడువే ఱాతఁ డొనర్చుకర్మంబువే, ఆని విన్నవింతు నింద్యమ్ములైన
పనులపై రోఁతయుఁ బ్రిన్నని చేఁతల, దెస నాదరంబు సంధిల్లు మనకు
నిది వోలుఁ గాని సత్కృతినొనర్చినఁ జెడ్డ, పనిసల్పినను మానవుని సమాద
రించుట వలయు నీరీతి నెఱుంగుట, యలఁతికార్యము కాసి వలచి నిలిచి

గీ. గెలుచు టంతంతలం గానికృత్య మిదియ, బీజమని విశ్వసించెద నీజగాన
దినదినం బగ్గలించు విద్వేషములకు, నోహటింపని సమర సన్నాహములకు. ౨౫

ఆ. సత్యశోధనమ్ము సలుప నహింసయు, మొదటిసాధనంబు మూలమంత్రి
మెంతదనుక మన కహింస వశంపడ, దంతపట్టు సత్య మగ్గపడదు. ౨౬

మం. కార్యంబుపైఁ గాక కర్తపై నలుక, తగ దట్లుసేయుట తనపైని దాన
పగఁగొన్నయ ట్లగుఁ బ్రజ లెల్లవారు, నజునిసంతానంబ యతఁ డీజనాళి
నొక్కతూలికతోన యొనరించి నిలిపె, నరునం దనంతగుణమ్ము లశేష
శక్తులుం గల వంట సత్యంబ కాన, నతని కల్గుట వాని కవమతిసేఁత
తద్గుణాఢ్యుఁ బ్రగించుఁదనముపాల్సేఁత, యఖిలప్రజాకోట్ల కపకృతిసేఁత. ౨౭

* * *

౧౦ పుణ్యస్మరణము

సీ. నానామతంబుల నైకజాతులవారి, చెలిమిమైఁ బెరిఁగినజీవితంబు
నాపాలిదై యుంట నాయిల్లు పరునిల్లు, నాభూమి పరభూమి నామతంబు
పరమతం బను భేదభావ మేనాఁడు నా, మదికినంటద; యహింసావ్రతమ్ము
బ్రహ్మచర్యము పరిగ్రహములేమియు నాది, యగు యమనియమమ్ము లాసచేసి
గీ. యింతవట్టును గష్టించునే నభేద, బుద్ధి నా కొండుగుణమని పొంగిపోవ
నెన్నఁడును దీనికల్మికై యించుకంత, జతనముం బొనరించినజాడ యెఱుఁగ. ౧

ఆ. న్యాయవాదివృత్తి కగపడి దర్బను, కాఁపురంబు నడుపు కాలమందు
నాకు సాయపడెడి లేకరులెల్ల నా, యునికిపట్టునంద యుండువారు. ౨

క. హైందవులుం గ్రైస్తవులును, నందుఁ గలారేను వీరి ననుజులవోలెన్
బొందికమైఁ జూచితి నా, చందము నీకొననిసతికి సంస్కృతినిడుచున్. ౩

వ. ఈలేఖకులందొకఁడు పంచమకుటుంబమునంబుట్టి యేసుమతము నాశ్రయించిన
వాఁ- డితఁడు సరిక్రొత్తగా నాపనికిం గుదిరె- నపుడు నావసించునెల వాంగి
లేయులమనికిపట్టు ననుసరించి యుండుఁ- గాన దానియఱలలోఁ గ్రంతలు
లేవయ్యె- నవి యుంటయు నా కింపితమ్ముగా- దిట్టిమాయింటఁ దూము
లుండఁదగినయెడ మూత్రంబువిడువం బాత్రంబు లుంచితి- వీనిం గడిగి చక్కఁ
బెట్టుట మాదంపతులకృత్యంబు- ప్రాఁబడినలేకరు లింటివారియట్లయై వారిపనం
టుల వార సవరించుకొనఁ జాగిరి- కాని యీక్రొత్తక్రైస్తవుని మూత్రకల
శంబు నేమ సంస్కరింపవలయు- నాయిల్లా లిట్టిపని సేయునది యయ్యు నీతమ్ముని
కుండం బొలఁగింప నేవపడె- నంత ౪

ఆ. మాకు రగడపెరిఁగె మనసులుచెడె నేన, పసఁటినెత్త సిద్ధపడితిఁ గాని
పడఁతి యొప్పదాయెఁ బదపడి తానైనఁ, గడవ నెత్తదయ్యెఁ గలఁకఁ బాసి. ౫

ఆ. ఎట్టకేల కాపె యీకొని కుండ చే, పట్టి కనుల నశ్రుపాత మడరఁ
గెంపుఁజూపుతోడఁ గెరలుచు నొఱలుచు, మెట్లుదిగుట యిపుడు నెట్లుమఱతు.

గీ. ఎంతమక్కువ చూపింతు నంతసిష్ఠు, గత వెలాఁరించుమగఁడ నే నతివపట్ల
శిక్షకుఁడ నంచుఁ దలఁచి యనుక్షణంబు, నాపె నేఁచితి బెడిదంపురూపువోలె. ౬

ఆ. అట్టులగుట నింతి యమూత్రభాండంబు, దెచ్చినంత నాకు మెచ్చురాద
యిచ్చతోడ నారవిచ్చినమొగముతో, నబల దీని కొగ్గ నాసపడుదు. ౭

ఉ. కావునఁ గస్సుబుస్సుమని గంతులువైచితి దుర్భరకు్రిధా
సేవధినైతి నిట్టివెడచేతలు మద్గృహమందుఁ జెల్ల వీ
తో్రివ సహింపనంటి నది తూపు తెఱంగునఁ గాఁడి తాలిమిం
దో్రివఁగ నింతియుం బరుష ధోరణి పింపిసలాడ నత్తతిన్. ౯

క. ఓయయ్య ! మీర యేలుఁడు, మీయింటిని నేను నిష్క్రమించెద నిఁక నం
చాయ త్తిదప్పికల్ప, స్ఫాయజ్జలదంబుఁ బోలెఁ బలుకం దొడఁగెన్. ౧౦

క. అపు డే నీశ్వరు మఱచితిఁ, గృప నన్వీక్షనాడె నెల్ల మెఱుకయు సడలెన్
విపదంభోనిధి నబలన్, రెపరెపఁ గేల్పట్టి యీడ్వ రేఁగితిఁ దెగితిన్. ౧౧

క. వాఁకిలిదనుకన్ దిగిచితి, పీఁకఁ గవాటంపు రెక్క విచ్చితి నవలన్
నాకస్తూరి గంగా యను,నా కూలంకషలు లోచనంబుల విరియన్. ౧౨

ఆ. మీకు నింతసిగ్గు లేకుండుఁగాక నా,సిగ్గు చిదుకలేదు చిన్నమంత
లజ్జనూఁది మదిఁ దలంపుఁడు నన్నిట్లు, వెలికిఁ ద్రోయ నెంచు నిలుతు నేను. ౧౩

క. కన్నారిచెంత కేఁగుము, నన్నన్ నాతల్లి వంద్రు లగపడ రిచటన్
మిన్నందిస తాలిమిప్తై, మన్నియతన మున్నజాతి మాయది యగుటన్. ౧౪

క. నా యాఁడుజాతిధర్మము, తో్రియక మీ రెంత పఱుపఁ దొడఁగిన నింద్యం
బేయది సల్పిన నోర్మిం, బాయక భవదాగమెల్ల భరియింపవలెన్. ౧౫

ఆ. ఇంక నైన లజ్జ యించుకపాటించి, మూయుఁడయ్య తలుపు వేయుఁడయ్య
వచ్చిపోవు పెద్దవారు పిన్నటివారు, నవ్విపోదు రిట్టిచివ్వఁ గన్న. ౧౬

గీ. నాపుడున్ గిన్క పెంచుకొన్నాఁడఁ గాని, యెడఁదలో సిగ్గుదొంతరల్ సుడియసాగె
నన్నుఁ గస్తూరి వదలలేకున్ననాఁడు, నేను గస్తూరి నేలీల నిగ్రహింతు. ౧౭

క. మాకొండొరులకు నిట్టి వ, నేకంబులు పుట్టిఁ దగవు లియ్యవి తుదకున్
శ్రీకరముల యైనవి జగ, దేకక్షమ పెంచి నిరత మింతియ గెలిచెన్. ౧౮

క. ఈ దృష్టాంతనలు సర్వము, నాదు పురాజీవితమ్మునన్ నడుచుటచే
నీ దినమునం దటస్థిలె, నూఁది సమస్తంబు సెప్ప నోర్తున్ నేర్తున్. ౧౯

ఆ. వలపుగుర్తితనము వాయనిమగఁడనై, నేఁడు లేను సతిని నిలువరించు
శిక్షకుండఁగాను జిత్త మీకొన్న దం,డింపవచ్చు నన్ను నెలఁత యిపుడు. ౨౦

వ. నేఁడు మా కొండొరులపై సమానస్వామ్యం బున్నయది - నిర్లిప్తులమై యుభ
యులమును జీవయాత్ర సేయుచున్నారము - రుగ్ణుండనై యేను డయ్యుతఱిఁ
గృతజ్ఞతామాత్ర ప్రతిఫలమునే నొల్లక కస్తూరి నన్ను సేవించునది యయ్యె -
నిది నాయిర్వదితొమ్మిదవయేటం బ్రివర్తిల్లినే నపుడు ౨౧

ఆ. బ్రహ్మచర్యధర్మ పరిరక్షణంబు నా, నించుకంతయేని యెఱుఁగనైతిఁ
జాన యన్న నాఁడు సహధర్మచరి యను, తెలివి లేశమేని కలుగనైతి. ౨౨

క. మగనికి వలసినసౌఖ్యము, లగపడఁ జేయుటకు నతనియానతు లెల్లన్
సిగఁదాల్చుటక జనించెను, మగువ యటం చపుడు నాదుమది నూహింతున్. ౨౩

వ. కాని నాముప్పదియొం డగునేఁట (౧౯౦౦) నాయాశయమ్ములం బెద్దమార్పు వాటిల్లె – నది ముప్పదియేడవయేటికిం (౧౯౦౬) బూర్తియయ్యె – దీని నాగామి ప్రసంగమున విపులమ్ముగా వర్ణింతుఁ – గాని యేను నిర్వికారుండ నగుకొలంది నాకుటుంబమున శాంతిసౌఖ్యములుం బావిత్ర్యంబు నావహిల్లం దొడఁగె – నవి యీనాఁటికిం బెరుఁగుచున్నవని నుడువం దగు – నిష్పాక్ష్యస్మృతిం జేసి మాయాలు మగలు జగమ్మున కొజ్జబంతింబోనివా రనియొండె నాయిల్లాలియం దేలోపముం గానరా దనియొండె మాలక్ష్య మెక్కుండ యనియొండె నెవ్వరుం దలపోయ వలవ – దాపెకుం బ్రత్యేకమగు నాదర్శమొండు లేమి నిక్కంబ – కాని ౨౪

క. నానడతలఁ బెక్కింటిని, మానిని మన్నింప; దంతమాత్రన వాదం
బేనాఁడు రాదు చర్చకుఁ, బూనిన సంతుష్టి యింతపుట్టదు నాకున్. ౨౫

గీ. చదువు సెప్పింపనైరి శైశవముపట్ల, నాపెకుం గన్నవార; లేనైనఁ గొంత
వేసటకు నోర్చి కస్తూరి విద్యలందుఁ,జతుర యగుటకు జతనంబు సలుపనైతి. ౨౬

ఆ. ఆకె చదువురాని దయ్యు హిందూసతీ, ప్రకృతిసిద్ధమైన పరమసుగుణ
మొండు లెస్సవడసె నుడుగక నావెంచు, నడుగునంద తాను నడుగువైచె. ౨౭

క. న న్ననుసరించుటయ తన, పన్నినబ్రతుకునకు మేలిఫలమని యదియే
పున్నెములకు నన్నిటికిం, గన్నాకని పరమసాధ్వి కస్తూరి నమ్మెన్. ౨౮

ఆ. బ్రదుకు వెలఁదితనము పాటించి నాపూను, నుద్యమంబులందు నొకటికైన
నాఁక సెప్పి యెఱుఁగ దాయమ్మ దీన మా, మనికి సౌఖ్యతుష్టిమ త్తనెదిగె. ౨౯

* * *

౧౧ ఆంగ్లేయులతో గాఢపరిచితి

గీ. ఉగడించెద సత్యప్రయోగచరిత, మిది రచించు తెలుంగిటన్ జదువరులకు
గ్రంథ మిట్లుండవలయు భాగమ్ము లిన్ని, వెలయ ననుబుద్ధి లేదు తొల్తొలుత నాకు.

క. దినచర్య నితరపత్రము, లనుదలచుచుఁ బుస్తకంబులం జూచుచు ని
ప్పని సేయు టెనెఱుంగను, వినిపించెద నంతరాత్మ వినిచినయట్టుల్. ౨

వ. నా మానసికవ్యాపార మెల్ల నంతరాత్మప్రేరితం బని పల్కంజాలఁ - గాని కార్యరూపమ్మునందిన నాతలంపులకెల్ల నదియ ప్రేరకంబనుట తప్పుగాదని యెంతు - నే నంతరాత్మం గన్నవాఁడను గాను - విశ్వంబునకెల్ల నీశ్వరుపైఁగల శ్రద్ధయ నాకుం గలదు - నాహృదినుండి యది తొలఁగింపరానిది - కాన నది కేవలవిశ్వాసము గాక యనుభవంబ యని తలఁతుఁ - గాని యిదియెల్ల ననుభవంబ యనుట సత్యంబు నొకభంగి బాధించుటయ యగు - నగుటంజేసి దీనికల రూపు నెఱిఁగింపఁ దగుపల్కు నాభండారమున లేదనుట సముచితంబు - కంటి కందని యీయంతరాత్మకు విధేయుఁడనై యే నీచరిత్ర పల్కుచుంటి నని నా నమ్మిక - మఱియు ౩

గీ. ఆత్మకథ సర్వథాయితిహాస మగుట, పాసఁగదని దీనిరచనకై పూనుకొన్నఁ బదపదమ్మున నిబ్బంది లాదవు ననియుఁ, దొలుత విన్నాఁడ నది లెస్స తెలిసెనేఁడు. ౪

గీ. సత్యపరిశోధనమ్ముపై సాగుచున్న, యీకథన్ నామెఱింగినదెల్లఁ జేర; దేవఁడు సూనృతావిష్కృతి కిట్టిపల్కు, వలయు నిట్టిది వలదంచుఁ బలుకనోపు. ౫

గీ. పాటిదప్పనిదయ్యు నాపక్షమంద, పుట్టుసాక్ష్యమ్మునకుఁ బాడిపట్టునందు నెంతవిలువ లభించు విశ్రాంతి యున్న, వారు తఱచిన వన్నెరావచ్చుఁ గథకు. ౬

క. కాదే యొక్కఁడు తనపెడ, వాదమ్మును రేపి నాదువాక్కుల నెల్లన్ ఛేదించి వ్రక్కలించి ప్రమాదమ్ములఁ జూపి యెలమిమై నిలవచ్చున్. ౭

గీ. తర్కమిటు పెంచినంత గ్రంథమును దీని, నాఁపుటయ లెస్సకాదా యటంచుఁదోఁచు నైన సాగింపఁదలఁచితి 'నాఁగవోయి!' యనుచు నాయంతరాత్మ పల్కుడుదనుక.

ఆ. సత్యశోధనమ్ము సాగించునెడ రచ, నయు నొకండుశోధనంబ యనుచు దీని వ్రాయుచుంటిఁ గాని మనీషుల, మెచ్చుకొఱకు వ్రాయునిచ్చ లేదు. ౯

ఆ. నన్నుఁ దొడర నియ్యకొన్న నెయ్యుర కింత, తృప్తిపుట్టుననియు దీనిఁగూర్తు వారిసంతసమ్ము వలచియ కలము చే, పట్టినాఁడ దీనిపుట్టువునకు. ౧౦

క. ఆనందుఁడు జయరాముఁడు, మానక నానాఁడు నన్ను మఱిమఱిగోఁజన్ బూనితిని గాన నిక్కథ, లోనిదోసంగునకు వారలును భాగస్థుల్. ౧౧

వ. అయ్యది యట్లుండె - నిఁక మూలకథకు న్వచ్చెద - నాయింట భారతీయులగు లేఖకులుం బెఱలును గుటుంబములోనివారింబలె నెట్లు కాఁపురించి రట్ల తెల్లవారు న్నిలువ దొరంకొనిరి - నానెలవునంగల కొంద ఱీపొత్తు నియ్యకొనకున్నను గావలయునని యేన వీరిం జేర్చుకొంటి - నెల్లరయెడ నిట్లు పంతగింపరాదనియు నెఱుంగుదు - నేఁటి యీక్రొత్తచుట్టఱికమ్ముకతనం జిక్కులు పెక్కులు దాప

రించెఁ - గాని పశ్చాత్తాపముపాలు గాక నాధర్మంబు నుజ్జగింపక తాల్మిం బూనితిఁ - (బాఁతనెచ్చెలికాండ్రు నాపట్టుదలకుం గుజగుజవోవుచుం గొణఁగసాగ వారిం దగురీతి హెచ్చరించుచు ౧౨

క. వినుఁ డాస్తికుండు తనలోఁ, గనుపరతత్త్వంబు నీజగద్వాసులలోఁ
దన కగపడు నానావిధ,జనులందుం జూడవలయు సంవిత్తిమెయిన్. ౧౩

ఆ. అట్టులగుట నాతఁ డందఱపట్ల ని, ర్లిప్తబుద్ధిమైఁ జరింపఁజాలు
నోర్పు వడయవలయు నూరక, మంత్రముల్, చదివినంత భవము చక్కఁబడదు.

గీ. దైవికమ్ముగ నపుడప్డు తాదృశావ, కాశ మబ్బిన నతఁ డది కాదు నాక
నవ్యబాంధవములకు మన్ననయొసంగి, మెలఁగవలయు రాగద్వేషములకుఁ దొలఁగి.

వ. నిర్లిప్తభావంబు వడయుసాధనం బిదియ సుఁడీ! యనుడు నా చెలికాండ్రుదారులై నాదారి కియ్యకొనిరి - నాతత్త్వం బిట్టి దగుటం జేసి బోయరుకయ్యంబు సాగినతఱి ౧౬

గీ. ఇఱుకటం బెంతయున్న నాయింటిలోని, కిద్ద ఱాంగ్లేయులను జేరనిచ్చినాఁడ
నెయ్యురను వీరి నిట్లు మన్నించుకతన, వెలఁది కస్తూరి నేడ్పింపవలసివచ్చె. ౧౭

క. ఆటంకము లెఱుఁగక తెర, చాటులలోఁ బడక నాదుసైదోడులటుల్
నాటెంకి నాంగిలేయులు, పాటింపంబడుట కిదియె ప్రథమం బయ్యెన్. ౧౮

క. ఏ నాంగ్లేయులనెలవుల, లో నిల్చితి వారినడతలున్ నేరిచితిన్
గాని యది ఫ్రూటకూర్లీగృ, హోనన్ గాఁపురము చేసినట్టులె యుండెన్. ౧౯

గీ. తాదృశముగాదు మన్నికేతనము దాన, నస్మదీయులు మిత్రు లేరైన నేమి
మాకుటుంబంపు సభ్యులమాడ్కిఁ దనిసి, రభ్యసించిరి నడవడుల్ హైందవములు.

క. తెలవారియింటివలె మా, యిలు కన్పడుఁగాని యందు నెసఁగెడిచందం
బులు సంస్కారము లన్నియు, వెలయున్ మనసంప్రదాయవిధి కగ్గములై. ౨౧

క. ఆమిత్రుల నాంగ్లేయుల,మామనికిన్ నిల్పుకతన మా కిడుమలు పె
క్కామతిలెఁ గాని సాదుల, కేమాత్రియుఁ గస్తివుట్ట దీయిద్దఱకున్. ౨౨

క. వారు తమయింట నిల్చిన, వారివలెం దనివి తద్దవడసిరి డర్బన్
లో శేఁగినయీనెయ్యము, లారంబండినవివో! జోహాన్సుబరుగునన్. ౨౩

* * *

౧౨ ఆంగ్లేయులతోఁ బరిచితి

గీ. ఒకపరి జోహాన్సుబర్గునం దుండువేళ, భారతీయులు నిర్మలాచారఖనులు
నాకడన్ లెక్కవ్రాయుచు నల్గురుండ, సాఁకితిం బుత్రనిర్విశేషముగ వీరి. ౧

క. నాపనుల కన్నిటికి వీ, రోపనివారైరి యిందు నొక్కరుఁడైనన్
డై పొనరించు టెఱుంగఁడిఁక, కేపగిదిన్ బండినదుచు నిది లేకున్నన్. ౨

క. ఏ నిది కొంతయెఱుంగుదుఁ, గానం గొందఱకు దీనిఁ గఱపితి భాషా
జ్ఞానం బన్నువయగుటన్, గానరు వా రిందు వలయు కౌశల మెల్లన్. ౩

క. ఈవైపు లెస్స నేర్చిన, నేటాల్ రాష్ట్రంబులోని నెయ్యుని నేఁ డి
చ్చోటికిఁ బిల్చెద నన్నన్, జీటీ శ్రమ లెన్ని పడినఁ జిక్క దతనికిన్. ౪

క. ఇఁక నయ్యధికారుల చెం, తకుఁ జని యానతికి వారిదయ నర్థింపన్
స్వకమత మీఁకొన దిస్థితి, నొకటియు నిర్ణయ మొనర్పనోపక యుంటిన్. ౫

క. ఒక దేశ వకీలుపని వే, ఱొకవంకఁ బ్రజాసపర్యయును వైకొనియెన్
సుక మింతయెఱుంగక మది, వికలంబగుచుండె వీని వేఁకనకతనన్. ౬

క. తెలజాతిపూరుషుండో, వెలఁదుకయో చిక్కె వైపువిధి దీర్పనిచోఁ
దొలఁగదు మద్భారం బని, తలఁచితి నది యెట్లు పొసఁగుఁ దద్రాష్ట్రమునన్. ౭

ఆ. నల్లవానికొల్వునకు నిచ్చగింతురా, తెల్లవారు రంగు తెగులువారు
కడఁగి మాత మనుచుఁ గష్టించి తద్వృత్తి, నాశ్రయించువారి నడుగ నడుగ. ౮

ఆ. అచట నిట్టిపనికి నర్హత వడసిన, వారియందు నాడువాండ్రు పలువు
రుండు కతన మిత్రుఁ డొక్కఁడు స్కాట్లాండు, కన్నియను గుదిర్చి నన్నుఁ జేర్చె.

క. నీతి నిరంకుశ్నయతఁ డే, జాతీయుండైన వాని సన్నిధిఁ గొలువుం
జేతకు డిక్కను నచ్చెలి, కాతంకము లేమి నెయ్యుఁ డాయమ నంపెన్. ౧౦

క. ఆకన్నెయు నుద్యోగము, లే కారటపడుచు వచ్చె లిబ్బిం గనుచాఁ
డే కొలఁదిం దనుపుం గను, నా కొలఁదిం దృప్తిఁగంటి నాపెం గనుచున్. ౧౧

ఆ. నల్లవాని చెంత నౌకరి చేయంగ, నమ్మ! నీకు నిష్టమగునె యంటి
నెచటనైన నేమి యింతయు నిష్టమ్ము, లెక్కసేయ నంచు లేమ పలికె. ౧౨

క. సంతుష్టిఁగంటి నబలా!, యెంతవలయు జీత మంటి నేదుంబదిపాం
డ్లింతు నని పల్కి బరువని, యెంతురె మీ రనియె డిక్కు మృదువాక్సరణిన్. ౧౩

క. ఏ నాసపడినపనులకుఁ, బూనిన నీజీతమునకుఁ బూర్తిగ వెఱవన్
గాని యిట కెవ్వుడువత్తువు, నా నిప్పుడె యంచుఁ గన్య నన్నలరించెన్. ౧౪

క. ఈ నెలఁతను నాకై, భగవానుఁడు పంపించెనంచుఁ వగచితి నపుడే
చాన నభిముఖనుజేసి బి, ఱానన్ గడఁగితిని గమ్మ వ్రాయించుటకున్. ౧౫

క. నాచెలియలిచందమ్మున, నాచిట్టికొమార్తెవోలె నాదగుడెందం
బాఁచికొనె డిక్క లేకరి, యీచిన్నది యని తలంచు టెన్నఁడు నెఱుఁగన్ ౧౬

క. ఇది యెఱుఁగమికిం గారణ, మిది పొరపా టంచు నెన్నఁడే నామెపనిం
గదిరినవెలితిం జూపుట, కొదవద యవకాశ మెల్లయును సాధువగున్, ౧౭

ఆ. అస్మదీయవిత్త మాకన్నె యెన్నని, వేలు పుచ్చుకొనియె వెచ్చపెట్టె
నెల్లరువ్వ లెక్క కెక్కించె నాపె నా, నమ్మకంబునెల్ల నాఁచికొనియె. ౧౮

గీ. అంజు టెఱుఁగక యెంతరహస్యమైన, నాచెవిని వైచె నప్పను జూచునట్లు
నన్నుఁజూచెను డి క్కింతనమ్మి ననుచుఁ, జెప్పికొనుట నాపాలిటి గొప్పమాట.

గీ. నిజహృదయరాజ్య మేలుమన్నీని బడయ, నాదుసాయమ్ము వలచెఁ జిన్నారిడిక్క
ఏమిసెప్పెద నాభాగ్య మేన కంటిఁ, గన్నియను ధారవోసినపున్నె మపుడు. ౨౦

క. తగువాని మేక్డొనల్డును, మగనిఁగ నంగీకరించి మానిని నన్నున్
దిగనాడెఁ గాని యవసర, మగుచోఁ దోడ్పడియె నాకు నయ్యామెడలన్. ౨౧

వ. అంత సంక్షిప్తలేఖనార్థ మస్మత్కార్యాలయంబున కొక్కనేర్పరి వలసివచ్చె –
నచ్చటి యున్నతపాఠశాలయం దొకదాన నుపాధ్యాయగా నున్న శ్లేశిన్ నాఁబడు
పదునేడేండ్లయీడున్న కన్నె యిప్పనికి నియ్యకోలుసూపి నాచెంతకుం జనుదెంచె–
నీమె యుద్యోగమ్ము వలచి కాక యనుభూతి నార్జింపఁగోరి యిట్లువచ్చె – వింత
వింతపోకడలు కల దగుటంజేసి శ్లేశిన్‌కన్యను మున్ముం దేను మెచ్చలేనైతి –
నీపెకుం దెల్లవారు నల్లవా రనుభేదదృష్టి యేమాత్రియు లేదు – కాని యేపనియం
దేని నాసక్తి సున్న – పెఱలం జిన్నవుచ్చుట కీమెయుల్లం బోహటింపదు – తలం
పుల దాఁపఱికముసేఁత కావంతయే నిచ్చగింపదు – కావున ౨౨

క. ఈ మెలఁతుకనడవడి పలు, బాముల నొదవించెఁగాని భావము శౌచ
శ్రీ మంజు వగుట నక్కొఱ, గాములు నపుడడ్డ దవ్వుగాఁ జనుచుండెన్. ౨౩

క. ఈ పిన్న కాంగ్లవాణీ, నైపుణి నాకంటె హెచ్చు నాఁదగు మఱి నే
నీపెదెసం గడునమ్మిక, చూపుదు నీకల్మి నాదుసుకృతం బనుచున్. ౨౪

గీ. అట్లగుట నీమె తీర్చినయట్టిపత్రి, మెట్టిదైనను బరికింప నియ్యకొనక
చెంతకు న్వచ్చినంతన సంతకంబు, వెట్టఁగల్గితి నావంత వెఱయు లేక. ౨౫

గీ. ఎల్లయని లేని యౌదార్య మీవెలంది, కొదవి తోడుగనిరవణమై యొప్పుచుంట
జీత మొకయాఱుపౌండులే స్వీకరించెఁ, గాసకుఁ బదిపౌండులను దీసికొని శ్రమించె.
గీ. అమ్మ! సంబళ మిది చాల నస దటంచు, మఱియుఁ గొనుమంచు నే బతిమాలినాఁడ
నెంతవేఁడినఁ గాసుల నిచ్చగించి, నీకడ న్నిల్వనొల్ల దీనెలఁత యనియె. ౨౭
గీ. నీకు వలసినపనిసేఁత నాకు వేలు, లక్షలని నిన్నుఁజేరితి లక్ష్యములకు
యుష్మదీయమ్ములకుఁ దద్దయును దవించి, యిచటఁ గుదిరితి ననియు నీయింతి కసరె.
గీ. ఒక్కపరి వెచ్చమెద్దియో యొత్తడింప, నడిగె నలువదిపౌండ్లసొ మ్మబల నన్ను
నదియు ఋణముగ నెంచి వీలైననాఁడు, తెచ్చి నిశ్శేషముగ నాకు నిచ్చివైచె.
గీ. చాన కౌదార్యమున కుద్దియైన ధైర్య, సంపదయు నబ్బెఁ గోరమీసాలుదువ్వు
రాచబిడ్డయు నీపెధీరత నెఱింగి, కుఱ్ఱింగవలయును సిగ్గువేఁగునకు నోడి. ౩౦
గీ. స్ఫటికశిలవోలె నచ్ఛమై పరిఢవిల్లు, నీనెలంతకు సరివచ్చునింతి నన్య
నే నెఱింగినసతులలోఁ గాననైతి, భాగ్యవశమునఁ గంటి నిబ్బాలచెలిమి. ౩౧
క. అవి పుణ్యస్మృతి యని స, మ్మద మందెద నీపె నాదుమదిఁ గన్పడుచోఁ;
నిది నుడువకుంట సత్య, మ్మెదెసన్ బహుళాపరాధముం జేత యగున్. ౩౨
క. ఆఁకటి నెఱుఁగదు డప్పిక, రాకడ యెఱుఁగదు దివమ్ము రాత్రి యెఱుఁగ దే
యాఁక లెఱుంగదు కర్జము, పైకొన్నపు డీపె యెల్లబాముల కోర్చున్. ౪౩
ఆ. కార్య మెద్దియేని గడుకొని కాఁదారి, పొద్దునందు నొంటిఁ బోవఁజాగఁ
దోడులేక వెడలుదువె బిడ్డ! యనఁ గన్ను, లెఱ్ఱవాఱఁ జూచు నీపె నన్ను. ౩౪
గీ. మీసములు గడ్డములు వచ్చి మిఱ్ఱుసూచు, భారతీయులు పెక్కు రీబాలపట్ల
గౌరవంబు వెలార్తు రాఁగాదు నారు,కోరి తలఁదాల్తు రీమెపల్కులు సతంబు. ౩౫
క. ఏము చెఱంబడ ధైర్య, శ్రీమతియై ప్రజలగుండెచేవ నిలిపి యీ
లేమయె సత్యాగ్రహసం,గ్రామము పాలించె వీరకాంతామణియై. ౩౬
గీ. అపుడు లక్షలకొలఁదిసొమ్మరయవలయు,వాములకొలంది కమ్మలు వ్రాయవలయు
నుడుకువయ లేక పత్రిక న్నడుపవలయు, నలయు టెఱుఁగక యీయెల్ల నాచరించె.
క. ఈ గరితం గొనియాటకు, సాగిన నాకలము నిల్వఁజాలదు పూజ్య
శ్రీ గోకులుండు శ్లేశిను,పైఁ గురిసినపేర్మి నెఱుకపఱిచెద నింకన్. ౩౮
క. నాకుం దోడుగ నిమమల,కీకొని ప్రజ కింతలెస్స యిచ్చినవారిన్
గోకులుఁ డెల్లర నెఱుఁగును, నాకై పలుమాఱు దర్శనం బిడుచుంటన్. ౩౯
క. నావారలు కొందఱు తత్, పావనచరితానకుఁ బ్రీతిపాత్రమ్ము లతం
డావారిదెసం గల తన,భావంబు లిఖించి యిడుట పరిపాటి యగున్. ౪౦

ఆ. నల్లవారు గలరు నాచెంతఁ గొందఱు. తెల్లవారుఁ గలరు తెల్వి నేర్చి
యెల్లవారియందు నీయమ కగ్రిమ, స్థానమిచ్చె మాన్యతముఁ డతండు. ౪౧

క. ఈదృశధైర్యం బీదృశ, వైదుష్యం బీదృశ ప్రవర్తనశౌచం
బీదృశవితరణ మెందఱు, కో దక్కెడటంచుఁ బత్రి మొసఁగెన్ బొసఁగన్. ౪౨

* * *

౧౩ ఇండియన్ ఒపీనియన్

సీ. భారతీయాశయం బనుపేర నప్పుడు, పత్రిక యొకండు వెల్వరింపఁగఁ దలంచి
మత్సహాయత నర్థించె మదనజిత్తు, మంచిపని యౌట నే సమ్మతించినాఁడ. ౧

వ. ఇయ్యది పందొమ్మిదివందల నాల్గవయేఁట వారపత్రికగా నవతరించి నేఁటికిం గలదు - మనసుఖలాలనాజరు దీని కాదిమసంపాదకుఁడు - కాని ప్రధానమైన భారము నాతలయంద నిలిచె - నాజరు సమర్థుండ నాఁదగుం - గాని యాఫ్రికాకుఁ జెందినచిక్కుసమస్యలు నాపాలుసేయువాఁడు - నావివేకశీలతపై నతని కతివేలంబగు విశ్వాస మొదవె - మొదట నిది హిందీ ద్రావిడ ఘూర్జ రాంగ్ల భాషలం బ్రకటిత మగుచుండెఁ - గాని ముందటిరెండుబాస లక్కఱలేదనికొన్నాళ్ళకు వాని నుజ్జగించితి - నీపత్రికకు నాచెంతఁ గలవిత్తంబు చాలవట్టు వెచ్చపెట్టవలసివచ్చెఁ - బ్రారబ్ధభారము విడువంజనదుకదా - మఱియు నట్లుకావించుట భారతీయులకులజ్జాకారణంబు నగు - నర్థంబురాకడకుం దీని నొకసాధనమ్ముగ గానించు బుద్ధి నా కావంతయేని లేద - యీబిడ్డకై కష్టనష్టమ్ములు మిక్కుటమ్ముగా సైరించితిఁ - గాని యిది దక్షిణాఫ్రికా భారతీయులకొనర్చినయుపకృతి కడుంగడు దొడ్డది యని యీనాఁడు భావింతు - సంపాదకస్థానమునం దేను లేకున్ననేమి? పత్రికాహృదయమ్మున కేన బాధ్యుండనని యెల్లజాతులవారుం దలపోసిరి - వెండియు ౨

ఆ. ఎన్నినాళ్లిది నాచేత నున్నదయ్యొ, నన్నినాళ్ళిందు నొదవు నయ్యాయిమార్పు
లస్మదీయాశయంబుల నవతరించు, సకలపరిణామములకు సూచకము లందు. ౩

సీ. ఈనాఁడు యంగిండియా నవజీవన, పత్రిక లెట్లు నా బ్రతుకులోని
కతిపయాంశమ్ములు కఱపు నానాఁ డిది, యట్ల యేర్పడె నస్మదాత్మశక్తి
నెంతయు వెచ్చించి యెల్లసంచికయందు, సత్యాగ్రహమ్మును జాటఁగంటి
వేగిరపాటునం దోఁగక మెఱమెచ్చు, లత్యుక్తు లొల్లక నిత్యదీక్ష

గీ. వడసి వ్రేఁకనిపల్కులే వాడి దీని, కిచ్చువ్రాఁతలు కూర్చితి నిదియ నన్ను
నెఱుఁగఁ గోరెడివారి కాదరువు నాదు, సంయమవ్రత శిక్షణస్థాన మయ్యె. ౪

ఆ. ఇందు భాష్యకారు లెంతపెనంగిన, నెత్తిచూపఁదగిన దేమిదొరకు
న్నాఁగియాఁగి కలము నాడింపవలసిన, బెడఁద కనిశ మగ్గపడిరి వారు. ౫

గీ. చదువరుల్ శాంతిసమరంపుజాడ లరయ, నాఫ్రికాభారతీయవృత్తాంత మెఱుఁగ
నెదురుచూతురు దీనికై యెల్లవార, మిదియ లేకున్నఁ దద్రిణం బెట్లుసాగు. ౬

వ. దీనిసాయమ్మునఁ బాఠక సంపాదకులనడుమ నచ్ఛమైనపొత్తు నేర్పఱుప నాస పడితిఁ - గానఁ జదువరులు తమసంశయాదులు నాకు వ్రాయుచుండువారు - బెడిదంబు లింపితంబులగు నీకమ్మలనెల్లఁ జదివి నిగ్గుదేర్చి మాఱుపల్కులు ప్రచురించుట నాపాలింటి కోకచదు వయ్యె - దీనంజేసి సంపాదకునిబాధ్యత యెట్టిదో నాయెఱుకువకు వచ్చె - నింతియ కాక నాకు భారతదేశీయులం దెనలేని గౌరవంబు లభించె - నిది రానున్నసత్యాగ్రహసమర మెల్లభంగుల రాణింపఁ గారణం బయ్యె - దీనికిం దొడఁగినవెనువెంటన ౭

క. సేవాభావముతోడన, కావింపన్వలయుఁ బత్రికాచాలన మన్
భావం బొదవె నెదురు లే, దీవార్త కనంతశక్తి యిదియగు; నైనన్. ౮

ఆ. కట్టలేనియేరు గ్రామమ్ములం దోఁచి, చేను చెట్టు పాడుసేయుఁ కరణి
నడ్డులేనివ్రాఁత లవి సత్యముం గూల్చుఁ, గాన నిల్పువలయుఁ గలమునకును. ౯

క. ఆనిగ్రహంబు బాహిర, మైన నిలుపులేమికంటె హానిఁ గదించున్
గాన జగద్ధిత మెంచెద, రే నాంతరనిగ్రహంబు నేలఁగవలయున్. ౧౦

మం. ఈచర్చలో దోష మింత లేకున్న, మహి నెన్నిపత్రికల్ మనుఁ జావులేక ?
పనికిమాలినయట్టి పత్రిక నెవ్వఁ, డాఁకట్ట నుద్యుక్తుఁడగు ? నిది గాక
యెవఁడు వాకొననేర్చు నిది రిత్తమైన, బాటలోఁ బయనించు పత్రిక యంచు ?
మంచియుం జెడ్డయు మహిఁ బరస్పరము, నేకమై చరియించు టిది నిక్కువంబ
యిందు మేలగుదాని నెంచి కైకొనుట, మానవాళికి నుత్తమంబైన చేత. ౧౧

***

౧౪ కూలిగూడెమా? మాలగూడెమా?

ఆ. ఎల్లవారికంటె నెక్కుడుగా మంది, కూడిగం బొనర్చు సత్తములను
మాలమాదిగలను మన మొనర్చితి మంట, రానివారిఁ జెప్పరానివారి. ౧

క. మనవీథులలో వారల, యునికికి నంగీకరింప మూరికి వెలిగా
మనవలయును దత్సోదరు, లనుచుందుము మాలగూడె మని తత్పదమున్. ౨

ఆ. మాలగూడె మన్నమాట పల్కుటకేని, యీసుపుట్టు మనకు నేవ వాడము
నేసుమతమువారియిల్లు యూరోపున, యూదు నిట్లు యణఁచి రొక్కనాఁడు. ౩

క. ఇక్కరణిన్ మనహిందువు, లక్కట! నేటాలుసీమ నస్పృశ్యులుగా
లెక్కింపఁబడిరి కుడిచిరి, పెక్కులు బన్నములు పేరుపెంపులు సెడఁగన్. ౪

ఆ. అచ్ఛశీలుఁడైన యాండ్రూసునీగియు, శాస్త్రి మోహనాస్త్రశక్తి రేఁగి
యణఁపవెట్లు వీరి యస్పృశ్యతాపీడఁ, జేయవోటు వీరి శిష్టజనుల. ౫

క. భగవత్కరుణకు మేమే, తగువార మటంచుఁ దలఁచి తక్కినప్రజలన్
దెగడిరి యూదులు వారల, జగనేరమ్మనకుఁ దగినశాస్తియ జరిగెన్. ౬

సీ. ఆర్యులముసంస్కృతులమేమయనితలంచి, హైందవులుకొందఱాత్మీయులందొలంచి
మీ రనార్యులు ప్రాకృతుల్ మిమ్మనంటఁ, దగదు పొండనిలెండనితఱిమిరుఱిమి. ౭

గీ. దక్షిణాఫ్రికా మున్నగుతావులందు, నేత దేనఃఫలంబు చిత్రాతిచిత్ర
సరణి వీరికి ముట్టె నెవ్వారికైన, గడవరానిది నాఁజెల్లుఁ గర్మఫలము. ౮

క. ఇనుముం గూడినయనలము, పెనుసమ్మెటపోట్లు దిన్నవిధమున నంహః
ఖనులగు వీరలచెంగట, నునికిన్ బార్సీలు మలక లొందిరి శిక్షన్. ౯

వ. పలుమాట లేల? — వీరివన్నెవారును వీరినేలవారును వీరియట్ల దక్షిణాఫ్రికా
యందు నిర్భరావమానమ్ములం గుడువవలసివచ్చె — నీదేశమ్మున మనవారు
కూలివాండ్రు నాఁబడుదురు — మనగడ్డలోఁ గూలివాఁడన వెలకుఁ గష్టించు
వాఁడు — కాని యిచట నప్పదమున కంటరానివాఁ డనునర్థంబు రూఢమయ్యె —
నాఫ్రికావారు వీరి నూరికి దవుదవ్వుల నుంతురు — వీరికాఁపురించుతావు కూలి
గూడెము నాఁబడు — జోహాన్సుబర్గునందలి గూడెమ్మును భారతీయులు తొంబది
తొమ్మిదేండ్లకు గుత్తగొనిరి — వీరికిది పెద్దయిఱుకాట మాయెనంతియకాక ౧౦

ఆ. మఱుఁగుదొడ్లు నామమాత్రశుద్ధమ్ములు, దుర్గమంబు లచటఁ ద్రోవలెల్ల
వలసినన్ని దీపములు లేవు లేవన్న, దిగులు లేదు భారతీయులకును. ౧౧

క. శౌచమెఱుంగరు నగర, శ్రీచారిమ మెఱుఁగ రేమిసెప్పద వీరిన్
దోఁచునె వీరికొఱంతల, నాఁచెడితలపోఁత లచటియధికారులకున్. ౧౨

గీ. విపినమున సౌధసృష్టి గావింతురేని, నేలలో రాజనాల్ పిండనేర్తురేని
వేఱ పొడచూపి తత్రత్యభారతీయ, చరిత మొప్పెడి దైశ్వర్యభరిత మగుచు. ౧౩

క. తమగడ్డఁ బాసి పరరా,ష్ట్రమునకు నెగఁబ్రాఁకు నిందఱం జూడము వి
శ్వమునందు; లేమి తాఁకునఁ, గుములుచు మనవారె యిరవుకొని రీకొలఁదిన్. ౧౪

క. వాణిజ్యముకొఱ కన్య, క్షోణికిఁ జనుచుందు రొరులు క్షుద్వేదనచేఁ
ద్రాణంగోల్పడి మన మా, గాణమువా రోర్వదు రాఫ్రికకుఁ గార్మికులై. ౧౫

క. చదు వింత రాదు వీరికి, వదలని దైన్యంబు వీరివంతు దయాసం
పదఁ బంచి వీరి నేలెడు, చదురులు కావలయు నేఁడు సౌజన్యనిధుల్. ౧౬

క. ఈ కూలివాండ్ర పిమ్మట, రూకలరుచి మరగి కొందఱు వణిగ్జను లా
త్మాకరుం జేరిరి తద్దయు, సైకమ్ముగ నుండు వీరిసంఖ్య గణింపన్. ౧౭

గీ. భారతీయులవాఢ్యమ్ము బలిసి నగర, పాలకుల సైఁపరానియొప్పరిక మేఁచి
రోఁతగొల్పుచు గూడెంబు రోగములకుఁ, బుట్టినిల్లయ్యె నునికికి గిట్టదయ్యె. ౧౮

క. పురపాలకవర్గము సం, స్కరణమ్మన కించుకేని కడఁగక తమ త
ప్పరమరికలేక గూడెము, నఱకడ నిడి దానినణఁప నాలోచించెన్. ౧౯

కం. శాసనసభయును సమ్మతి, చేసిన దిప్పనికి; నేమిసేయుద మిఁక నీ
డాసిననెవ్వగ నెవ్వగఁ, బాసెద మని కూలివాండ్రు పలుచందములన్. ౨౦

గీ. పలవరించునాఁడు పద మిడినాఁడ జో, హాన్సుబర్గుపురమునందు నేను
జదురులెల్లఁ జూపి సైదోడులం దీర్చు, టొప్పునన్న కోర్కె యొదవె నాకు. ౨౧

వ. గూడెము నెత్తివేయుచో నివేశములపై స్వామ్యమున్న భారతీయుల కించుక ప్రతిఫలంబొసఁగుట పాడి - దీని నిర్ణయింప నొకపంచాయతి యవతరించెఁ-బురపాలకసంఘమువా రిచ్చుసొమ్మల్పమని గుత్తగాండ్రు విన్నవించుచో నిక్కాటమివారు తీర్పుసెప్పుదురు - దాని కుభయపక్షములుం గట్టువడియుంట వలయు - నభియోక్తలు జయింతురేని వారివకీలునకు ముట్టవలసిన సుంకముం బ్రతివాదుల యొసంగవలయు - నభిగ్రహములు పెక్కంట గుత్తగాండ్రు నన్ను తమసభికుం జేసికొనిరి - యే నిప్పనిలో ధన మార్జింప నాసపడక యిందు వచ్చువిత్తమ్మున సగపాలు పేదలకువలయు మందుమాఁకులకు వెచ్చింతునని పల్కి నభియోగు లుపొంగిరి - దరిదాపు డెబ్బదితగవులం దేను వాదించితి - నం దొకటిమాత్రమ

రి త్తయయ్యెఁ – గాన నా కర్తమ్ము సాలవచ్చె – నిందుఁ బదాఱువందల పౌండ్లు పత్రికకై సమర్పించితి – నియ్యభియుక్తులు పెక్కురు బీహారుమున్నగు నుత్తరదేశములకు నాంధ్రద్రావిడాది దక్షిణసీమవృత్తులకుం జెందినవారు – వీరు తొలుత నొడంబడికకూలివాండ్రుగా వచ్చి పదంపడి స్వతంత్రులై భారతీయవణిక్కుల వోలె నొకసంఘముం బ్రతిష్ఠించుకొని తన్మూలమునం దమయిడుమలఁ బాపుకొన సాగి – రిందుఁ బలువురు ౨౨

ఆ. మిన్ను మీఁదఁబడిన మృషవల్కు – శేనాఁడు, నెఱుఁగ రత్యుదారు లిద్ధచరితు లీసమాజమునకు నేలికలై రామ,సింహు లొప్పు నచ్ఛశీలమూర్తి. ౨౩

ఆ. అతని వెన్క నతనియంతటి గఱువయై, బదరి యలరు మధురభావపేటి యిపుడు వీర లిద్ద ఱేగిరి దివికి నా,కపుడు తోడునిల్చి రధ్రిలట్లు. ౨౪

క. బదరికిని నాకు నెయ్యము, ముదిరెను సత్యాగ్రహంపుమొన నిల్చె సతం బెదబెదరు లేనివీరుఁడు,గద యీపురుషుండు సంఘకార్యముపట్లన్. ౨౫

క. ఇతఁ డిట్టివారు నన్మ,ద్ధితులగుటన్ భారతీయు లెందఱొ నాకున్ హితులైరి తమ్ముఁగుఱ్ఱని, గతిఁ జూచిరి వీరు నన్నుఁ గష్టసుఖాలన్. ౨౬

వ. ఓపినంతవట్టు నేనుం గష్టకాలమ్ముల వీరిసేవించితి – నబ్దుల్లాసెట్టి నన్ను గాంధీ! యని సంబోధింపనొల్లక సాహె బనిన నేను సహింపనని యెఱింగి తగుమాటకై రోసిరోసి భాయీ! యని పిలువం దొడఁగె – నాఫ్రికాయం దీపేర నాకు రూఢ మయ్యె – వెండియు ౨౭

గీ. మితిగడచి ముక్తులై యట, బ్రతికెడు కార్మికులు నన్ను భాయీ! యని పి ల్చుతఱిన్ బీయూషము నా, శ్రుతి నింపినయట్లు పరమసుఖము గ్గనెదన్. ౨౮

* * *

౧౬ మ హా మా రి – ౧

గీ. చట్టములుచేసి పాడికి బొట్టుచుట్టి, గూడెముం బాలకులు పట్టుకొనిరి గాని తగినపెఱనేల చూపమి దానియంద, పేదలున్నారు కార్మికవ్యాపీతమందు. ౧

వ. నాఁటికి న్నేఁటికి నంతర మొండు వాటిల్లె – మున్ను భారతీయు లీవాడపై స్వామ్యంబు గలవారు – కాని యీనాఁడు గుత్తగాండ్రు మాత్రమ – తొల్లి లోకమ్మునకు వెఱచియే నధికారు లీతావు నించుక శుద్ధమ్ముఁగా నుంచువారు – వీరి కాజంకులో నిపు డేమిపని? – కాన నెల్లకసటులకుం దావలమై గూడెము కేవల నరకంబుగా మాఱె – నీముఱికికిం దోడు ప్రజాసంఖ్యయుం బెరిఁగె – హిందూస్థానమువా రిట్టికడగండ్లకు లోనై యున్నతఱి ౨

ఆ. బొబ్బతెగులుకంటెఁ బోటరియా నల్ల, మారి వచ్చిపడియె నూరిమీఁద
శ్వాసకోశవీధి సంధిల్లు నిది దీని, బారిఁ జిక్కి బైటఁబడుట యరిది. ౩

క. బంగారు పండుగనులం, దుం గూలికి నవయువారిఁ దొడరిన దిది యీ
యంగద కిరువదిముగ్గురు, లొంగిరి మనవారు దొరలలోపముకతనన్. ౪

క. ఆయజమానులు సేవకు, లేయలజడి వడుదు రనిల మెట్టిది యంధ
స్తోయము లెట్టివి కుడిచెద, రో యని చూడరు పసిండి రోయుట తక్కన్. ౫

క. మారికిఁ జిక్కినవా రా, దారుణరోగమ్ముతోడఁ దమకొంపలకుం
జేరి రపు డచ్చటం గల, వీరుం డల మదనజిత్తు వీరియవస్థల్. ౬

క. కని కరఁగి 'గూడెమునకున్, వెనువెంటన రండు ఘోరవిప దంబుధిలో
మునిఁగిరి మనసోదరు, లని, పనిచెన్ నాకడకుఁ గమ్మ పరమాతురతన్. ౭

ఆ. అచట నిర్మనుష్యమగు నొకయింటితా, ళమ్ము వ్రక్కలించి యమ్మగండు
తెగులుగొంట్ల నెల్లఁ దెచ్చి తద్భవనమ్ముఁ, జేర్చి వారివెఱపు దీర్చుచుండె. ౮

గీ. ఏను ద్రొక్కుడుబండిపై నెక్కి యపుడ, గూడెమున కేగి దురవస్థ మూడుకతన
నెలవుసొచ్చితి మన్యథా తలఁపఁబోకుఁ, డనుచు నధికారులకు లేఖ నంపినాఁడ. ౯

ఆ. ఘనతగన్న వెజ్జు గాడ్ఫ్రే మహాశయుఁ, డడిగినంత సాయపడఁగ వచ్చె
నతనికరుణ కస్మదాత్మ ముగ్ధంబాయెఁ, గాని తీఱదయ్యెఁ గర్జమెల్ల. ౧౦

క. ఇరువదిమువ్వురు రుగ్ణుల, పరిచర్యలు మూవు రెట్లుభరియింతు రెదన్
గరగరికయున్నఁ దామై, దొరకరె సేవకులు వెతలఁ దోఁగినవేళన్. ౧౧

వ. అపుడు నాకార్యాలయంబునఁ గల్యాణదాసును, మాణిక్యలాలును, దేశాయియు, విస్మృతనాముఁడగు వేఱొక్కయువయుం బనిసేయుచుండిరి - వీరు నాలేకరులో బిడ్డలో నిర్ణయింపనేర - నాచెప్పినపని సేఁత వీరికిఁ బండువుగా నుండుఁ - బరోపకారప్రవణు లిట్టివార లెందఱో యుండరు - వీరి నందఱ నీజన్మమున వేఱ్వఁ దలంచి కర్తవ్యముం దేటతెల్ల గావించి యేమందు రన ౧౨

క. ఆమిత్రులు మీతోడన, మేముం బయనింతు మంచు మితహితశబ్ద
శ్రీ మీఱఁ బల్కినంతన, నామది పర్వాంబురాశినా నుబ్బతిలెన్. ౧౩

క. నాతో నుఱుకుట కింతయు, నాతంకములేదు రిచ్చ; కైనఁ గుటుంబం
బాతనిది పెద్దదౌటను, జేతం బీకొనదు వానిసేవలు వడయన్. ౧౪

క. అగుటన్ బైతోడుగఁ దత్, సుగుణాకరు నిల్పి రుగ్ణసోదరసేవన్
దిగితిమి తన్నిశ యంతయు, జగవెఱపు గదించి మమ్ముఁ జకితులఁ జేసెన్. ౧౫

ఆ. పెక్కురోగములకుఁ జిక్కినవారి కే, నూడె మాచరించినాఁడఁ గాని
నల్లమారిబారి గొల్లఁబోయినవారి, డాసి చూచి సేవచేసియెఱుఁగ. ౧౬

సీ. వెజ్జు గాడ్రఫే ధర్మవీరుఁడై సల్పి మా, వెఱపు దవ్వగఁజోపఁ గఱకుదేఱి
మందిచ్చి యోదార్చి మధురాంబువులు గ్రోల్చి, మైలఁ దోలఁచి దీనమానవులకు
నుపచర్య సలిపితి ముడివోని తెగువమై, లేకరుల్ బ్రదుకన్న లెక్కసేయ
కార్తుల సేవించు టది సూడ నెల్లలం, గడచినయూపోక వాడమె నాకు
ఆ. మదనజిత్తు వైద్యమణియును లెస్స క, ష్టించి రెట్టులో గతించె రేయి
ధార్మికంబు కృపకుఁ దానక మిగ్గాథ, వేడ్కదీఱ ముందు విస్తరింతు. ౧౭

* * *

౧౬ మహామారి - ౨

ఆ. గీము నాక్రమించి సేమమ్ము నరసెడి, దిక్కులేక వగచు తెగులుగొంట్ల
కాశ్రయమ్ముఁజేసి విశ్రాంతియెఱుఁగని, సేవచేయుమమ్ముఁ జిత్తగించి. ౧

క. నగరాధికారి మాకుం, దగుమన్ననమైఁ గృతజ్ఞతం బ్రకటించెన్
నెగులిడి పొకాలుటకు పీ, లగుసాయ మొనర్తు మనుచు నంపెను గమ్మన్. ౨

సీ. పనిలేనిగిడ్డంగులను జూపె నార్తు లం, దుంట కీకొనె వారి కుపకరించు
సారాయితోఁ బరిచారిక నొక్కర్తుఁ, బుచ్చె నయ్యిరవులబూఁజు దులిపి
యటనట మంచమ్ము లార్జించి రోగుల, నందుఁజేర్చితి మొకయాసుపత్రి
వెలయించితిమి బాధితులకోల్కు గావింప, వచ్చినయమ్మకు వలసినంత
ఆ. గుండెబలిమి కలదు గొప్పతనం బెంత, యేని గలదు కాని యీమె రుగ్ను
ముట్టుకొన్న నెట్టిచెట్టకుఁ జిక్కునో, యెవ్వఁ డెఱుఁగు నంచు నేమ జంకి. ౩

ఆ. వలదు వల దటంచు వారించితిమి రోగి, సరస కీపెకాలు సాఁగనీక
మద్య మిందు మాటిమాటి కార్తుల కని, హితవుసెప్పె మాకు నివ్వెలంది. ౪

క. మీరుం గొంచక యించుక, సారాయిని బుచ్చుకొంట సాగించినచో
దారుణరోగం బిది కడు, దూరంబగు నంచుఁ గరుణతోడం బలికెన్. ౫

క. మాయెదుటన పల్కఱు మై, రేయమ్మను గ్రోలె నబల రేయుం బవలున్
ఆయమ్మ యెంతకఱపిన, మాయుల్లము మెచ్చదయ్యె మదిరాసవమున్. ౬

క. రోగులకైనను మధువుం, దాగిన మేలౌదవునంచుఁ దలఁపను జ్వరితుల్
మూఁగురు దీనిం దాఁకక, యాఁగిరి నాయాశయమ్ము ననుమతిసేఁతన్. ౭

ఆ. వెజ్జునిచ్చ వడసి వీరికి మృత్తికా, వైద్యశక్తి పఱపువాఁడ నైతి
నిందునిలిచి రెద్ద జేఁక నెల్లరు వ్యాధి, చేతఁ బడిరి మారివాతఁ బడిరి. ౮

క. అడరెడు నిట్టూర్పులతో, విడిచితి మీసేవ; నైజవీరవిహారం
బుడుఁగక మారి పురమ్మున, వడఁకింపఁదొడంగె వివృతవక్త్రముతోడన్. ౯

క. పురపాలకసంఘమునకుఁ, ద్వరయేర్పడె నపుడు రోగివర్గమ్మున క
ప్పురి కొకయామడదవ్వున, విరచించె గుడారు లెల్లవెరవులు రోసెన్. ౧౦

గీ. ఆర్తులం గొల్వవచ్చి మా యాఁకఁజేసి, కెళవుగా నున్నమెలఁత కగ్గేయచరిత
కకట! యీవేఁకి సోఁకి తత్ప్రాణములను, దీసెనని వింటి నెంతేని దిగులుగంటి.

క. మారోగు లిద్ద ఱవ్వ్యాధిఁ, దేఱిరి మమ్మేల మారితినదయ్యో నహహో!
యే రీమార్పునకుం గల, కారణ మిది యంచు నొడువఁగలవాడు మహిన్. ౧౨

క. ఇత్తఱి మృత్స్నావైద్యం, బుత్తమయోగం బటన్న యూహము బలిసెన్
రెత్తగద మదిర దుర్ధి, మత్త గదా రోగి కదియు మందని వెజ్జుల్. ౧౩

క. నుడువుట యనుబుద్ధియు నా, కడరినయది కాని వీనియోగాములపై
వెడలెడు నా తీర్మానము, పడసెడిగౌరవ మదెంత భావనసేయన్. ౧౪

క. ఐనన్ నాయీనమ్మిక, లీనాఁడే నట్లయుంట నివ్విషయంబున్
మానక పల్కితి నిచ్చట, ధీనిధు లున్నారు దీనితీ రిది నాఁగన్. ౧౫

క. ఏ నీ తెగులు బటాబయ, లైనంతన వీటినేలు నధికారుల వే
రూనిన యౌదాసీన్యము, దీనికిఁ గతమంచుఁ గఱకుదేలిన వ్రాఁతల్. ౧౬

క. పత్రికలో నింపితి సుచ, రిత్రుఁడు పోలక్కు గుణగరిష్ఠుఁడు డోకున్
మిత్రులుగనైరి నా కి, చిత్రణముం జదివి పెద్దచేసిరి నన్నున్. ౧౭

ఆ. ఆకుఁదిండి వలచు నాల్బర్టువెస్టుతో, నన్నశాల నాకు నమరెఁ జెలిమి
చదివె నతఁడు మారిసంకటపాటుపై, నేనువ్రాసినట్టి దెల్ల నపుడు. ౧౮

క. భోజనవేళల నాతఁడు, నాజాడం గానలేక నాకును ఘోరం
బీజబ్బు సోఁకెనో యని, తేజం గోల్పడియెఁ బెద్దదిగులునఁ బడియెన్. ౧౯

క. ఆదుర్దినముల నేనున్, నాదగునెచ్చెలులుఁ గడుపునకు నల్పముగా
నోదన మొసఁగితి ముదరముఁ, తాఁ దేలికయైనఁ దెగులు తలకొన దనుచున్. ౨౦

ఆ. మానినాఁడ నేను మాపటితిండి నీ, చెట్టతెగులు నన్నుఁ బట్టివచ్చి
పెఱల నేఁచు నన్నవెఱపున నొడ్ల రా, కడకు ముంద పగటి కుడుపు గొంటి. ౨౧

క. ననుఁజూడక తహతహపడు, ననుఁగుంజెలి వెస్టు భోజనాగారమునం
దన గదితలుపం దట్టుడుఁ, దినుటన్ ముగియించి వచ్చితిని వాకిటికిన్. ౨౨

ఆ. నన్నుఁజూచి యతఁడు మిన్నంది నెచ్చెలీ !, యిటకు నీవురామి నేమివుట్టి
మెట్టులైతో యన్న కట్టారటంబునఁ, దోఁగియుంటి నెదియుఁ దోఁపకుంటి. ౨౩

క. నీమేలుగంటిఁ దనిసితి, నేమింపఁగదయ్య నన్ను నీపనియం దే
నేమాత్రియు వెనుకాడ మ,హామారికిఁ జిక్కి-సుగ్రిక్కు- నా ర్తులఁ గొలువన్. ౨౪

క. ఒడ్డులను స్రాఁకవలసిన, జ డ్డింతయు లేనివాఁడ శంకింపకు మే
యొడ్డైననేమి నా కని, దొడ్డతనం బది వెలార్పఁ దుష్టింగంటిన్. ౨౫

ఆ. అంత వెస్టుఁ జూచి యన్నా ! సపర్యకు, నిన్నుఁ గోర; నిప్పు డున్నక స్తి
యొండు రెండునాళ్ళ కుడుగును గాని నీ,సాయ మొకటి వలతుఁ జనవు నెంచి. ౨౬

ఆ. మదనజిత్తు నేఁడు మారికిదాసులై, వగచువారికొల్వు దగిలినాఁడు
లాఁతిపనుల నిప్పు డాతఁడు సాగింప, వీలుపొసఁగ దంచు విశ్వసింతు. ౨౭

క. కానన్ దర్బనునకుఁ జని, వూనుము పత్రికను; నీవహో ! తగుభంగిన్
దాని వెలార్పఁగలాఁడవు, దీనికి నీకొన్న దిగులుదీఱును నాకున్. ౨౭

వ. అనుటయు నితండు మిత్రమా నా కొకయచ్చుఁగూట ముంట నీ వెఱుంగుదువు - కాని వీలుచేసికొని నీపల్కు- పాటింపఁ దల్చితి - మాపటికి నానిర్ణయంబు నీకు నివేదింతు - నావుడు నట్లకాని మ్మని యేనంటి - నావల నాఁటిసాయంసమయ వాహ్యాళియం దయ్యాయిముచ్చట లై నపదంపడి వెస్టు దర్బనువోవ నిశ్చయించితి నని తెల్ప నే నుప్పొంగి పదివౌండులవేతనంబును వచ్చునాయంబునఁ గొంతభాగ మ్మను గై కొమ్మని మిత్రుం గోరితి - నితని కర్థంబు ప్రధానముగాదు - ప్రజాసేవయ వీనిపరమలక్ష్యంబు - కానఁ దనకు ౨౮

క. రావలసినవిత్తము తా, నీవలసినసొమ్ముల లెక్క- లిచ్చెను నాకున్
వేవేగ బండిని నెక్కెను, నావలపుం దీర్చి ప్రేకనం దొలఁగించెన్. ౩౦

క. నాటంగొలె వె స్టే నా, నేటాలుం బాయువట్టు నెయ్యముగురిసెన్
మేటి యితం డెంతయు నా, రాటపడెన్ నాదు జయపరంపరఁ జూడన్.

ఆ. ఇంగలాండుగడ్డ నిమ్మేటి 'తా'తను, పల్లెటూర నామతిల్లినాఁడు
శైశవంబునందుఁ జప్పచప్పనివిద్య, గఱచినాఁడు పేదకాఁపువాఁడు. ౩౨

క. అనుభూతికతన ధిషణా, ఖని యయ్యెఁ బవిత్రుఁడయ్యె గడుసరి యయ్యెన్
ఘనతర సంయమదీక్షా, వనుఁడయ్యె న్విశ్వుఁడయ్యె భగవానునకున్. ౩౩

క. పెఱలకు మేల్ సేఁతకు ని, గ్గఱువ కడున్ నొచ్చు; వచ్చుఘట్టములం దీ
పురుషుని వీనికుటుంబము, తెఱఁగెల్లను జెప్పి యప్పుదీఱుచుకొందున్. ౩౪

***

౧౭ గూడెము కాల్చుట

గీ. చెలులకున్ నాకు రుగ్ణసంసేవవలని, విడుగర లభించినది గాని వీటిలోని
కడరి యల్లటపెట్టు దయ్యంపుఁబనులు, తీఱవయ్యెను దన్మహామారిపనులు. ౧

ఆ. గూడె మున్నవలను వీ డేలుపెద్దలు, కనరు వినరు నిజము కాని తెల్ల
వారివాడపట్ల నోరంతప్రొద్దు జా, గర్యసూపుచుండ్రు కష్టియనక. ౨

ఆ. తెల్లడాలువారి యెల్లగృహమ్ములు, మారిబారిఁ బడక మనుటపోలె
వెచ్చమెంతయైన వీఁగక విత్తంబు, నుప్పునీటివోలె గుప్పిరపుడు. ౩

గీ. భారతీయులప్రాణమ్ము వార లెంత, చుల్కఁజేసిన నది మనస్సునకుఁ దేక
యాంగిలేయులభద్రమ్ము నాసచేసి, యధికృతుల్ డయ్యుచుంట కొండాడినాఁడ.

క. కొండాటతోన యాఁగక, నిండర్క బురపాలకులకు నేఁ దోడ్పడితిన్
మొండిన యగుచో వారీ, గండంబును దప్పుకొంట కట్టరిది యగున్. ౫

గీ. కొట్టి తిట్టి తుపాకులు బిట్టుప్రేల్చి, యెల్లరక్కసచేఁతల నిచ్చగింపఁ
దగినదురవస్థ వీరికి దాపరించి, యుండు నాసాయ మింత లేకున్ననాఁడు. ౬

క. నిజవాంఛా పరిపూర్తికిఁ, గుజనత కెద్దాని కేని గొంకరు వీ రీ
గజిబిజిలోనం బడకయు, విజయమ్మును గంట నెలమి విరిసెన్ దనకున్. ౭

క. ఆవేళ నల్లవారల, త్రోవకు నధికారి పెల్లు తుష్టింబడసెన్
గావలసినపను లన్నియు, నావల సుకరంబు లయ్యె ననిరుద్ధములై. ౮

క. నగరాధికృతులు పల్కిన, పగిదిన్ హైందవుల దిద్ద బాములువడితిన్
దగుతగములు సెప్పక నా, వగ నూఁది తెగించి వెంటవచ్చిరి వారున్. ౯

గీ. అంటురోగంపునెల విది యాట నిచటి, మనుజు లటునిటుఁ గదలరాదని విధించి
వారిగూడెమ్మునకు నాల్గువలఁకులందుఁ, గాపువెట్టిరి పాలకుల్ కఱకుబంట్ల. ౧౦

గీ. రాకపోకలు జరుపఁగా నాకు నస్మ, దీయులగు మిత్రులకును జీటీయొసంగి
రితరులగు భారతీయు లయ్యెరవునంద, నిలవలెం జెఱసాలలో నిలిచినట్లు. ౧౧

గీ. దానికై దాఱుక్రోసుల దవ్వునందుఁ, గ్రొత్తగూడెంబు గట్టి యీకూలివాండ్ర
కాదరువుచేసి యవ్వల నగ్గిపెట్టఁ, దలఁచి రధికారు లప్పురానిలయవీధి. ౧౨

ఆ. క్రొత్తయూరు గట్టి కూటికి నీటికిఁ, జాలువసతు లెల్ల సంతరింప
నవధి కొంతవలయు నందాఁక గూడెము, వారు తిరుగరాదు మేరదప్పి. ౧౩

క. బెడిదములగు నిమ్మార్పులు, పొడగని కార్మికులు తెల్లఁబోయిరి వెఱపుం
గుడిచిరి కాని ననుంగని, వడసిరి ధైర్యం బొకింత వదలిరి చింతన్. ౧౪

క. అందుం బెక్కురు లేమికి, విందులు కష్టార్జితమ్ము విత్తము తత్త
న్మందిరములఁ బూడ్చిరి యిప్పు, డెందున్ దాఁచెదరు వార లీప్సితమ్ముల్. ౧౫

వ. వాణిజ్యకోశ మన్నపల్కేని వా రెఱుంగరు – కాన నన్నునమ్మి తమసొమ్మెల్లఁ దెచ్చి నాయింటఁ గుప్పకుప్పలుగాఁ గుమ్మరించిరి – పదంపడి యఱువదివేల పౌండులకుం జాలినతద్ధనంబు నచటి యడితిబొక్కసమం దేను భద్రపఱచి వారికి వలయుధైర్యంబు నొదవించితి –నంతలోఁ గొత్తగూడెమ్ము సంపూర్తియగుట న్నగరపాలకులు భారతీయుల నెల్లరం బ్రత్యేకధూమశకటంబునం గొనిపోయి దానం గుదురుకొనఁ జేసి వారికి వలయుసౌకర్యంబు లేర్పఱుపం బూనిరి–యేనెల్లనాఁ డప్పాలెమున కేగి సోదరులయోగక్షేమంబు నరయం దొడఁగితి–మొట్టమొదట నిక్కాఁపురంబు వీరికేమాత్రియు నింపదయ్యెఁ – గాని మఱునాఁటికి మిగుల రుచి యించెఁ – బరిపూతవాతమ్మునం దోఁగి మున్యేడునాళ్లంట వీరియారోగ్యమున్ బలిసెఁ – గావుటం జేసి ౧౬

క. ఆటల నాడుచుఁ దీయని, పాటలు పాడుచును రామభజనమ్ములకుం
గూటువకట్టుచు వీరలు, పూఁటన్ నిముసంబునట్ల పుచ్చుట కంటిన్. ౧౭

ఆ. కూలివాండ్రఁ గొత్తగూడెమ్మునకుఁ జేర్చి, పాఁతగూడె మగ్గిపాలుచేసి
సంతత వ్యయప్రయాసమ్ము లోర్చి త, న్నగరిజభుకు మాన్పినారు దొరలు. ౧౮

***

౧౮ ఒకరచనమహిమ

ఆ. తెల్లవారిచెలిమి, దీనతానిష్ఠ్నయా, భారతీయసమితిఁ బలుకువిలువ,
న్యాయవాదభరము, నైతికజాగర్య, నాకు నెచ్చె మారిరాకఁజేసి. ౧

ఆ. అపుడు వెస్టువోలె నిపుడు పోలక్కు నా, చెలిమి వలచెఁ దిండినెలవునందుఁ
గల్ల కవుడు లేనియుల్ల మాబిడ్డనా, మ్మగుట నతఁడు నన్నుఁ దిగిచివైచె. ౨

వ. అతండు నాయారగించుబల్లకు దవ్వుగా వేఱొండుబల్లపై మెసవుచు నాతోడ సంభాషింపఁ దలఁచి మున్ముందు చీటినంపి వెనువెంటన సమ్మతివడసి నన్నుంగదిసి 'క్రిటి'క్కను పత్రికకే నుపసంపాదకత్వం బూనినవాఁడ – మీరు మహామారి న్గుఱిచి వెలువరించిన లేఖం గాంచి మీసందర్శన మెపు డబ్బునా యని యువ్విళ్ళూరుచున్నాఁడ – నేడు నాపాలింటిసుదినంబు – నా నతని నావానిం జేసి కొంటి – నాఁటిరేయంద మా కన్యోన్యసౌహార్ద మావిర్భవించె – మఱియు 3

క. అతఁ డాడంబర మొల్లఁడు, మతి కెయ్యదినచ్చు దాని మానక సేయున్
బ్రతుకుంబాటలలో మా, కితరేతరమైత్రి యుంట మెఱుఁగంగంటిన్. ౪

క. ఒక్కత్రుటిం దనమనుగడఁ, బెక్కులు మార్పులకు లోఁచె బెదరక; యే మే
యిక్కట్లు మూఁగినం దన, త్రొక్కినమార్గంబు విడక దుర్జయుఁ డయ్యెన్. ౫

క. పోలక్కతోడి నెయ్యము, పోలన్ వికసించు వేళఁ బూతచరిత్ర
శ్రీలలితుం డగు వెస్టీ, లీలన్ నాపాలి కొక్కలేకం బనిచెన్. ౬

మం. అవధారు! ప్రతికావ్యవసాయ మరయ, నీవు సెప్పినలాభ మిచ్చో హుళక్కి
మిగులు లేమియ కాక మిత్రమా! చేయి, తగులునో యనుశంక తలచూపుచుండ
బాకీలు బండ్లకుబండ్లుగాఁ గలవు, లెక్కలు సూటిగాలేవు వానికిని
ముక్కు మొగము లేక ముదిరినచిక్కు, విడదీయవలె నేఁడు వేసటనాక
యీకమ్మ గని ధైర్య మింకిపోనీకు, నాశక్తికొలఁది నంతయుఁ జక్కఁబఱుతు
నూహించినట్టిమే లొదవము కోడి, చేపట్టి మన్నించుచేత వోనాడ. ౭

వ. ఇది నష్టిం గూర్చుపనియని తెలినంతన వెస్టు దానిం ద్రోయవచ్చు - నపు డే నతనివెక్కిరింపఁ జాలఁ - బై పెచ్చు కలరూ పెఱుంగక వాని కొసకొల్పి యేన దోషినైతి - నానాఁడు మదనజిత్తుమాట నమ్మి యింతసెడితి - వెస్టు నాచెంత నెన్నఁడుం దీనిఁ దడవఁడ - కాని యొరు లాడినదెల్ల విశ్వసించువేఁడుఱు నాసా త్తని నిర్ణయించుకొని యుండు - దేశారాధకుఁ డెల్లయంశంబును దానై పరికింప వలయు - సత్యసేవకుఁ డావంతయే నేమఱ్ఱిల్లం జనదు - మూలముట్టుగాఁ దన మెఱుంగనిదాని నమ్మఁడా! యని పరులకుం జెప్పుట యన సత్యంబున కొకమచ్చ తెచ్చుకొంటయ - మఱియు ౮

గీ. ఇంతనేర్చియు నపుడప్పు డితరులాడు, పలుకులన్ నమ్మి దూఁకు నాప్రకృతి నోర్చి
తీర్చుకొనలేని వెఱ్ఱినై దెసలుసూచు, వాఁడ నని విన్నవింతు నెవ్వగకు లోఁగి. ౯

గీ. తలకు మించినవ్రేఁగు కావలయు నన్న, లోభమే హేతు వందు నీలోపమునకు
నకట! పేరాస నన్ను బిట్టడఁచివైచె, మిత్రు లీసేగిలో నన్ను మించినారు. ౧౦

ఆ. ఇంకఁ బ్రకృతమునకు నేతెంతు నెచ్చెలి, వెస్టు పంపులేఖ విప్పిచదివి
నిలువ మనసువోక నేటాలుబండికి, నపుడ పయనమైతి నచటువాసి. ౧౧

ఆ. శైలుదమక వచ్చి పోలక్కు ముచ్చట, లవియు నివియుఁ బూర్తియైనపిదప
నర్థి నొసఁగె నాకు "అన్టుదిలాస్టు" నాఁ, దనరుకృతిని మేలితరముదాని. ౧౨

క. సుచరిత్రుఁడైన రస్కిను, రచించె నిద్దాని విసువురానీక కడున్
రుచియించు మీకు నిది యని, వచించె నపు డతఁడు వినయవాసత్ఫణితిన్. ౧౩

ఆ. కదలె రైలు పుస్తకమ్మును దెఱచితి, మాయఁజాలనైతి ముగియువఱకు
నెల్లనుడియు నాదునుల్లంబు నువ్వెత్తు, కొల్లగొనియె నిదురచెల్ల దనియె. ౧౪

క. ఏమెయిఁ బల్కెను రస్కిను, నామనుగడ నెల్ల నట్ల నడిపించుటకున్
నేమంబు చేసికొంటిని, సామాన్యముగాని ధర్మసరణిం బడితిన్. ౧౫

క. కనియెఱుఁగ న్నే నింతకు, మును రస్కినుకృతులు; బాల్యమునఁ బాఠ్యముగా
నునిచినగద్యము పద్యము, వినా చదువనైతి వేఱువేఱగు రచనల్. ౧౬

ఆ. కడఁగి కర్మభూమి నడుగిడ్డపిమ్మట, నిట్టిపనికి విరతి పుట్టదాయె
నగుటఁజేసి నాకు నబ్బినపుస్తక, జ్ఞాన మల్పమనుట సముచితంబు. ౧౭

క. శ్రీమపడమినొండె ననివా, ర్యము లితరోద్యమము లడ్డమైయొండెను నా
కమరిన యీ లోపంబున, సమకూడినచెట్ట లేమి సత్యమ లవముఁ. ౧౮

క. చదివినముక్కలు నాల్గును, హృదయమ్మున కదికిపోయె నీ కొంచెములో
బ్రిదుకుం బ్రిన్నగ దిద్దిన, యది రస్కినువాణి యొకఁడ యని వాకుృత్తున్. ౧౯

క. ఈ రస్కినుకృతిపైఁ గల, కూరిమి పెల్లగుట దీని గుజ్జరిబాసన్
దీరిచి సర్వోదయ మను, పేరిడి వెల్వఱిచి తనివిఁబెంచితి నాత్మన్. ౨౦

గీ. ఏ పదార్థము లుండు నాయెడఁద డాఁగి, వానిప్రతిమలె రస్కినువాణిఁ గంటిఁ
గాన నిదినన్ను నేలుకోఁగల్గెఁ దనకు, నిచ్చయగుబాట నడుగువేయించితీరె. ౨౧

గీ. అంతరమ్ములు సుప్తమ్ములైన మనుజ, భావనల మేలుకొల్పెడిచేవ యెవని
వాకునకు వశ్యమైయుండు వాఁడె జగతి, వన్నె కెక్కును గవిశబ్దవాచ్యుఁ డగుచు.

ఆ. ఎల్ల వారితలఁపు లేకపథ మ్మొందిఁ, యుంట కల్లయగుట నొక్కభంగి
నెల్ల కవులమహిమ మెల్ల రపైఁ బని, సేయనోప దని వచింపనేర్తు. ౨౩

వ. రస్కిన్ సూచించు సర్వోదయసూత్రములం బరికింప నెల్లరలగ్గునంద తనల గ్గిమిడియున్న దనియు జీవికావిధాన మిరుగుర కొక్కరూప యగుట న్యాయవాది వృత్తికిని మంగిపనికిం గలవిలువ తుల్యంబ యనియుఁ గూలివానియు సేద్యగానియు జీవనంబు సత్యజీవన మనియు నాబుద్ధికిం దోఁచె – నిందు మొదటిది నాయెఱుకువ లోనిద – రెండవది కొంతకొంత తేటపడెఁ – గాని తృతీయమ్ము నేఁటివట్టు నాబుద్ధికిం దగులదయ్యె – నిందు రెండవ మూఁడవ సిద్ధాంతములు మొదటిదాన నణఁగియుంట సర్వోదయమువలనన విదితంబగు – నిట్టి తలపోఁతలం బ్రుంగి జోహాన్సుబర్గునుండి యిర్వదినాల్గుగంటల పయనమ్ము సల్పి నేటాలురాష్ట్రమునం గల దర్బనునగరమ్మునకు నిశాసమయంబునం జేరి వఱువాత లేచుటతోడన ౨౪

క. ఈసూత్రమ్ములు మూఁటికి, దాసుఁడనై నాదుజీవితంబును దిద్దన్
జేసితిజతనము విజయ, శ్రీ సంధిలఁజేయుమని భజించితి నీశున్. ౨౫

***

౧౯ ఫినిక్సు నిర్మాణము

ఆ. ఎట్లుతనియించె రస్కినుఋషి మదీయ, వర్తనంబెట్లుమార్చె నవ్వార్తలెల్లఁ
దెల్ల వ్రాసినయంతన తెలిపినాఁడ, వెట్టునకుఁ దొట్టతొలుతఁ బావిత్ర్యఖనికి. ౧

ఆ. పొలము నిచట గొంతవిలిచి యెల్లర మంద, నిలిచి కాఁపుఁదనము నిర్వహించి
యన్నవస్త్రములకు నక్కఱ యెంతయొ, నంతధనము గొంట ననుమతించి. ౨

గీ. తీఱుబడివేళలందుఁ బత్రికకు వలయు, సేవసల్పుచు నీదృక్షజీవనంబు
మరగియుండ మటంటి నిమ్మాటలెల్లఁ, దత్సఖునిబుద్ధి నురరీకృతంబు లయ్యె. ౩

గీ. తెల్లవారలకును భారతీయులకును, బొట్టకున్ మూఁడుపౌండులు పట్టునంచు
నేర్పరించితి మంతర మింతలేక, యచ్చుపనివాండ్రు దెసయంద వచ్చెశంక. ౪

క. తిండికి వలసినవెచ్చము, కొండురె వా; రట్టి దియ్యకొన్నను సుఖముల్!
పొండని తెగించి యటవీ, మండలమునఁ గాఁపురింప మతిసేయుదురా. ౫

క. వేతనమును దగ్గించుట, కాతంకము దెల్పువార లద్దానిఁ బురా
రీతిన కొనఁదగు రస్కిను, వ్రాఁతలు పాటించి బ్రతుకవచ్చుం బిదపన్. ౬

గీ. ఎట్టకేలకుఁ దెల్చితి మిట్లు; పిదపఁ, జెప్పితిం బనివాండ్రు కీచొప్పు నెల్ల
నెదిరిచి రిద్దఱుతక్కఁ దక్కెల్లవారు, వనికి వచ్చెదమని రచ్చుపనికినైన. ౭

ఆ. మదనజిత్తుసైత మెదురాడె నిది దుర్వి, వేక మనియె నెల్ల వెచ్చపెట్టి
సలుపు నిట్టిచేఁత సాగదు పత్రిక, యడఁగు నచ్చుఁగూట ముడుగు ననియె. ౮

వ. ఐన నుత్సాహంబు నుజ్జగింపక డర్బన్పురసమీపమున ధూమశకట ఘట్టమునకుం గడుదాపున ఫినిక్సనుచోట వేయిపౌండులవిత్తమ్మున కెనుబది యెకరముల నేలం గొంటిమి - దీనఁ గొన్నిఫలవృక్షంబులు నొకముసలికొంపయు నలంతినీటిబుగ్గయుం గలవు - రుస్తుంజీసా "హో"సంగినరేకులు మున్నగు పరికరములతో బోయరు కయ్యంబున నా కనుచరులై శ్రమించిన వడ్లవాండ్రు సాయమ్ముతో ముద్రణ శాలాదులు నిర్మించి మంచముం గంచము నచటికిఁ జేర్చి యందుఁ గాఁపువెట్టితిమి - యిది జనశూన్య మైనతావు - గడ్డియుం గాద మిందు వలసినంత - సర్పాదులవలని భీతియుం దద్ద - యెట్లున్న నేమి గుండె ఱాయిచేసికొంటిమి కదా - పదంపడి ౯

ఆ. గడన కోరి యాఫ్రికాగడ్డ త్రొక్కి వె, వ్వేఱువృత్తులందు వెలయువారి
నస్మదాప్తబంధు లగువారి నిందుఁ జొ, ప్పించుయత్న మాచరించినాఁడ. ౧౦

క. కాసులు వలచెడివారలు, మాసంసారమ్మునందు మన; రైనను ధీ
రాసులు కొందఱు వచ్చిరి, యాసలపొంగెల్ల నడఁచి యాశ్రమమునకున్. ౧౧

ఆ. వచ్చి మరలిపోనివారలలో మగన్, లాలుగాంధి నుఘువఁజాలి నతఁడు
నాఁటినుండి యితఁడు నాబాటవిడువని, యోగి యయ్యె మేటిత్యాగి యయ్యె. ౧౨

వ. మనీషా త్యాగ భక్తి వైభవమ్ములకతన నితండు నా యాంతరికప్రయోగమ్ముల పట్ల నాకుం బాసటయయ్యె – నస్మన్మల్లబలంబులో మొట్టమొదటిపీఠమ్ము వీనిది– స్వయంశిక్షితులైన శిల్పులందుసైత మితఁ డద్వితీయుండు నాఁ దగు – నిట్లు వేయి తొమ్మన్నూట నాల్గవయేట నీఫినిక్సు నిర్మిత మాయె – నంతరాయము లెన్నెన్ని ముట్టడించినం జెదరక బెదరక యీసంస్థయుం బత్రికయు నేఁటిదనుక మనుచున్న యవి – కాని ౧౩

క. ఇది నెలకొల్పినతఱి మా, కొదవినయిక్కట్లు పెక్కులున్నవి వానిన్
మదిమది నెఱుఁగందగు విని, చెద భావ్యాంకమునఁ దద్విశేషములెల్లన్. ౧౪

***

౨౦ తొలు రేయి

క. కలిగె ఫినిక్సునఁ బత్రిక, తొలిసంచిక వెలువరింప దుర్భరబాధల్
మెలఁకువ నా కుండనిచో, నిలిచెడి దది కొన్నినాళ్ళు నిస్పృహ నిడుచున్. ౧

క. రైతులమై బ్రిదికెడుతఱిఁ, జేతిపని న్నమ్ముకొంట శ్రేయంబని మ
చ్చేతస్సు చెప్పినను బె, క్కాతంకము లుంట నిడితి నచ్చోట మరన్. ౨

గీ. దానికిం జేటు వొడమినతఱిని గర్జ, మాఁగకుండుటకై హస్తయంత్ర ముంట
వలయు మనకంచు వెస్టుతోఁ బలుక నతఁడు, మంచిదని చేసియుంచెఁ గైమరయొకండు.

క. నూనెమర కుంటువడుచో, మానక పత్రికను జేతిమరఁ దీర్పవలెం
గానఁ దదీయాకృతిపరి, మాణము డించితిమి చిన్నమర కనువుపడన్. ౪

ఆ. కన్నుమూఁత మాని పిన్నలు పెద్దలు, రేయి నాల్గుజాలు రేఁగి తగిన
మడత లేర్పరింప మఱునాఁడు పత్రిక, పోవుచుండు నెల్లభూములకును. ౫

వ. కాని మొదటిరాత్రి విస్మరింపరానిది నాఁజనుఁ – గూర్పంతయు న్ముగిసి చట్టము యంత్రముం జేరెనంతన యది కదలనని బిఱ్ఱబిగిసె – సమర్థు లెందఱు శ్రమించిన నేమి – యెల్లయు రిత్తకురిత్త యయ్యె – వెస్టు విన్నఁబోయిన మొగమ్ముతో నన్నుఁగదిసి యీవారపుసంచిక నిలిచినట్ల యని వెచ్చనూర్చి చదికిలం బడియె – నంత నేను

క. ఓ నెచ్చెలి! దిగు లేలా, కానందగు లాఁతివెరవు కట్టలయికతో
నీ నిర్మించిన చక్రము, తా నక్కఱ దీర్పఁజాలదా యిపు డనుడున్. ౭

ఆ. అతఁడు కడిఁదికర్జ మది కైమరం ద్రిప్పఁ, జాలినంతమంది జనులు దొరక
రున్నవారు నల్గు రుక్కిరిబిక్కిరి, పనుల డస్సి మూలఁబడిరి చెడిరి. ౮

వ. అని నైరాశ్యముం బ్రకటింప నేమీ యీ గుఱ్ఱువెట్టు వర్ధకుల మేల్కొల్పి వీరి
తోడ్పాటు నర్థింపఁజనదా – యీ మాత్రతోఁ జేతులు కడుగుకొన వచ్చునా –
మనకర్తవ్యము నిశ్శేషము కాలేదని నాతలం – పని యేనంటి–నంత వెస్టు వడ్రంగు
లేమందురో వారికి నిద్రాభంగ మొనర్పఁగల తెగువ నాపాలఁ గానరాకున్నయది–
యన ౯

క. వల దది నాపని యంటిన్, గెలిచెద మటులైన నంచు నెచ్చెలి పలికెన్
బిలిచితిని వడ్లవాండ్రను, దెలిపితిఁ బత్రికకు నామతిల్లిన బెడఁదన్. ౧౦

క. అపు డాయెల్లరు నయ్యా! యిపు డోదవనియేము నరుల మెట్లయ్యెద మీ
విపరీతస్థితిలోని, ద్రిపోదుమా లెక్కసేయఁ దగనిది పనియున్. ౧౧

క. తురగమ్ములవలె నోడక, మరత్రిప్పెద మీరు దిగులు మానఁగవచ్చున్
బఱు పెక్కవచ్చు ననుడున్, దరిలేనిముదమ్ము వెస్టుధనమై విరిసెన్. ౧౨

గీ. అచ్చువారలు వడ్లంగు లిచ్చతోడఁ, బనికిసాగిరి పత్రికల్ బయలువెఱసె
నపుడు సంతోషపారవశ్యమున వెస్టు, భక్తిగీతమ్ము లెలుఁగెత్తి పాడఁదొడఁగె. ౧౩

క. బిరబిర వడ్రంగులతో, మరత్రిప్పితి నేను రేయి మాటునఁబడె భా
స్కరుఁడుం దోఁచెను బనిలో, నరపా లది నిల్చి యున్నయది యిప్పటికిన్. ౧౪

గీ. యంత్రచోదకు లేపుద మతఁడు పగటి, వెలుఁగులోఁ బిల్వ జంత్రంబు పలుకునేమొ
పలికెనా మేరతప్పక పనిముగింప, నేర్తు మని వెస్టుతో వక్కణించినాఁడ. ౧౫

గీ. అతఁడు చోదకుఁ బిల్చె నచ్చతురుఁ డేగి, ముట్టెనో లేదొ యంత్రమ్ము బిట్టుకదలె
నేమిసెప్పెద ముద్రణధామమందు, నొక్కపెట్టున మొరసె హర్షోల్బణంబు. ౧౬

ఆ. ఎందుడాఁగె రాత్రి యీబుద్ధి, యొందఱు, మొత్తుకొన్న బిగిసె మొద్దువోలె
వ్రేలు తగిలినంతనే లేచి మైసాఁచి, నంగనాచి యిపుడు నాట్యమాడు. ౧౭

వ. యంత్రమున్గుఱిచి యెల్ల రిట్లాడసాగఁ జాలకుఁ డయ్యా! మిమ్ము నమ్మించుట
నా కసాధ్యకృత్యంబ కాని మానవులయట్ల మరలు న్విరతి వలచుఁ – గాన వీనినడ
వడికయం దపుడప్పు డిట్టిమార్పు కన్పట్టుచుండు ననియె – జంతర మాఁకపా
లగుట మాకొక పరీక్షయనియు నది వెండియుం గదలుట నిష్కళంకమగు మా
కార్యంబు సాధించినమేలిఫలం బనియు నాబుద్ధికిం దోఁచె – నంతఁ బత్రిక మసలక

రై లెక్క మాకెల్లరకుం దలవేఁగు డించినట్లయ్యె - మా యాయభినివేశమ్ము పంటగాఁ బత్రిక కొకనియమ మేర్పడి యది ప్రజారంజక మాయె - మఱియు ఫినిక్సునందుఁబరాపేక్షలేక తమపనితామనిర్వహింపఁగలమార్పులారంభమాయెఁ- బిదప నిచ్చమైఁ దైలయంత్రమును వీడి నిర్భయమ్ముగాఁ జేతిమరతోఁ బత్రికను సాగించినకాల మీయాశ్రమజీవనంబునఁ బ్రవేశించె - నది ఫినిక్సుజీవనమున నత్యుత్తమ నైతికకాలంబు నాఁదగు. ౧౮

***

౨౧ పోలక్కా కూడదిగుట

సీ. ఏను ఫినిక్సునం దీసృష్టి కొగ్గిన, వేళ బారిష్టరువృత్తిఁ దొఱఁగి
కలకాల మిచ్చోట నెలకొని మడిదున్ని, పండించి యాఁకటిబాధ మఱచి
నాసేవ లన్నియు నీసంస్థ కందింపఁ, దలఁచితిఁ గాని నాతలఁపు లెల్ల
నాఁడివోయె నాయాశయం బాకఁడయ్యె, ముట్టిన దొకఁడాయెఁ దుట్టతుదకు
గీ. జీవనం బస్మదీయ మీత్రోవయంద, సాగుచున్నది యైనను సత్యసేవఁ
దవిలి కష్టించువానియత్నమ్ము చెడియు, నశుభసంపాదకంబు కాదని వచింతు. ౧
క. ఎవ్వనికి వాఁడ తనతిను, బువ్వను సృష్టింపవలయుఁబో! యను మతి నా
కవ్వారి యగుట నెల్లర, కవ్వసుధం బంచియిడితి ననుయాయులకున్. ౨
ఆ. కాపువారివోలె గడ్డికప్పినయిండ్ల, నిమ్ముకొంట మాకు నింపె కాని
తగిన తెఱపి లేక ద్రవ్యంబు లేక యీ, కొంటి మపుడు పేకుటింట్ల బదుకు. ౩
క. సంపాదకుఁడై పత్రిక, పెం పరసెడి నాజ రిచట్ఁ బెరుఁగక సేవం
దెంపక డర్బనుపురిలో, నింపితమగు సొంతయింటి నెడయక నిలిచెన్. ౪
ఆ. అచ్చుఁగూటమందు నక్కఱము ల్గూర్ప, వలయుకూలివాండ్రు కలరు గాని
యాశ్రమస్థులైన యంద ఱీచేఁతకుఁ, జాలువార లగుట మేలటంచు. ౫
క. తలఁచితి నెయ్యురు సమ్మతి, పలుకన్ వెనువెంట నచ్చుపని కొగ్గితి మీ
కళ నా కలఁతిగఁ జేపడె, వలంతియై మగనలాలు వఱలెను దీనన్. ౬
ఆ. ఇండ్లు కట్టమైతి మిచ్చట సంతృప్తిఁ, దోఁగి కాలు నిలువ దొక్కమైతి
మిట్టి యిఱుకునంద యీక్రొత్తలంబిని, వదలి బర్గు చేరవలసె నాకు. ౭
క. అచ్చటికర్జంబులు నా, వచ్చుట కెదురెదురు గనుచు వాడుచు నుంటన్
జొచ్చితి జొహాన్సుబర్గున, నెచ్చెలులం గదిసి వక్కణించితి బ్రదుకున్. ౮

క. చెప్పితి నాశ్రమచరితం, బప్పోలకుతోడ; విస్మయానందములన్
  దొప్పఁగఁదోఁగెం జెలి తా, నప్పుడొసఁగు రచన యింత కాదరు వగుటన్. ౯

క. అం దేనుం జేరుట కీ, కొందరె యని కౌతుకంబుగునియం బలికెన్
  సందియమా యంటి నపై, నం దరలెద నేఁడ యని మనస్వి వచించెన్. ౧౦

ఆ. అతనిచిత్తశుద్ధి కాత్మబలంబున, కేను వెఱఁగుపడితి నింపువడితి
  నుజ్జగించెఁ బత్రికోద్యోగ మాశ్రమ, సభ్యుఁ డయ్యెఁ బరమసాధు వతఁడు. ౧౧

క. వేఱిమి నెఱుఁగని నడతన్, నేరిమి గడియించుటన్ ఫినిక్సున మిగులన్
  బేరిమిగని యెల్లరకుం, గూరిమిచెలికాఁడు బందుగుఁడునై వెలసెన్. ౧౨

క. ఆడంబరములు మెచ్చని, వాఁ డగుట ఫినిక్సులోని వాతావరణం
  బేడప్పి నిడక యతనికి, వేడుకసంధించె నదియ పీ డనిపించెన్. ౧౩

వ. కాని యే నా వ్యవసాయకేంద్రమునం దతనిఁ దడ వుండ నీనైతి – నప్పుడు జోహాన్సుబర్గులో నా కండగానున్న 'రిచ్చి' న్యాయశాస్త్రాధ్యయన సంపూర్తికై సీమ కేగువాఁ డాయెఁ – గాన 'నీ వేతెంచి కార్యాలయ వ్యాపారంబులు నిర్వహించుచు న్యాయవాది వగుటకు సైతము కృషిసల్పు' మని యతనికిం గమ్మనంపఁ దనమన్నించువారి కెదురుసెప్ప నెఱుంగని మేలిశీలమ్ముగల పోలక్కు– ౧౪

క. ఏమార్గము సముచితమని, మీమదికిం దోఁచు నదియ మేలిడు నాకున్
  నామనికిచే ఫినిక్సున, కామతిలున్ గొంతవాసి యని యనుకొంటిన్. ౧౫

సీ. ఐనను జోహాన్సుబర్గునం దధివసింప, మనతలంపులు వెసఁ బండునని తలంతు
  రేని యిదె వచ్చుచుంటి జాగేల యనుచు, నుత్తరము నంప నాచిత్త ముబ్బతిల్లె.

ఆ. రిచ్చి వెడలిపోయె వచ్చెను బోలక్కు, దీక్షపూని పనులు దిద్దసాగ
  న్యాయవాది యగుట కస్మత్సహాయత, నందు 'టాయ' రతనియండ నిలిచె. ౧౭

గీ. వడివడిగ నాశ్రమంబు దైవాఱుహాంటె, నుత్తమవిచారముల బ్రుంగియుంటిఁగాని
  యల్లనల్లన తద్భిన్నమైన బ్రతుకు, మూఁగిరా లోఁతులోఁతుల కేగుచుంటి. ౧౮

వ. దైవేచ్ఛ వేఱుగా నుండదయేని యేను సామాన్యజీవనం బను నీమోహబంధమునం దగిలి యుండువాఁడ – నాలక్ష్యంబు లప్రయత్నంబుగా నెట్లు రక్షింపఁబడె నగ్గాథ నెఱిఁగించుటకుమును దితరవిషయంబులు కొన్ని వివరింతు. ౧౯

* * *

౨౨ రక్షకుఁడే భగవంతుఁడు

క. ఏఁడాదిలోన వచ్చెద, నోడకుమని చెలికి నభయ మొసఁగితి నపుఁ; డా
యేఁడాదిపోయె నేటాల్, పీడుట యెట్లన్న తర్క విధియుం బెరిఁగెన్. ౧

గీ. కాన బంబయినుండి నాకడకు నాలు, బిడ్డలను జేర్చుకొంటిని బిన్నవాఁడు
రామదా సోడలో గంతు రంతు మరగి, చేటుగానక యెగురుచోఁ జేయివిఱిగె. ౨

ఆ. నావలోనివైద్యుఁ డేవో చికిత్సలు, చేసెఁగాని మేలు చిక్కదయ్యె
బెదరఁబోకు మంచు బిడ్డకు ధైర్యమ్ము, సెప్పి మృచ్చికిత్స చేసినాఁడ. ౩

క. నెలనాళ్లు మట్టివైద్యమ, సలిపితి నర్భకునికరము చక్కంబడియెన్
బలిసెను గృహవైద్యముపైఁ, గల నావిశ్వాస; మింతగాయము మానన్. ౪

క. రోగుల పల్వురపట్లఁ బ్రి, యోగించితి మన్ను; పెక్కు రొందిరి సౌఖ్యం
బాఁగాని నేఁడు దీనిని, సాగించెడి సాహసంబు జాఱెను దనకున్. ౫

వ. ఈచికిత్సయం దాపత్తి కలదని యనుభూతిచే నెఱింగితిఁ - గాన నవీనయోగంబు సిద్ధాని నాదరించువారు మున్ముందు తమపట్లన ప్రయోగించుకొంట యావశ్యకంబు - సత్యం బపుడ బయల్పడు - నేతత్ ప్రయోక్తలపాలిటం బరమేశ్వరుండ యగదంకారుఁడై రక్షించు - మృత్స్నవైద్యమునం దెట్టియిక్కట్టు లుండె నట్టి యిక్కట్ల తెల్లవారితోడి చెలికారమునందుం గలవు - కాని చివరచిక్కుల నేను సరకుసేయనైతి - మఱియు ౬

క. రార మ్మనినంతన నా, చేరువకున్ వచ్చి నేను జెప్పినపనులం
గోరి యొనరించుపోలకు, చారిత్రం బిచట. గొంత సంభావింతున్. ౭

ఆ. అతనికిం బ్రధాన మన్నది యెన్నఁడో, జరిగెఁ గాని పెండ్లి సాగదాయె
నర్థపుష్టిలేమి నాతఁడు పరిణయో, త్సేక మూఁపెనంచు నాకుఁ దోఁచె. ౮

గీ. అతఁడు రస్కినుసిద్ధాంత మాదరించి, నడువఁజూచును సర్వదా నన్నుమించి
మంచిదే కానిరస్కినుమార్గమూఁది, బ్రిదుకఁబాశ్చాత్యులెం తేనిబడలవలయు. ౯

వ. కాన నొక్కనాఁడేను బోలక్కుం జేరి బుజ్జవమ్ము నెఱపి యయ్యెయుచ్చట లైనంత

ఆ. ప్రణయ మంకురించి బలిసినపిమ్మటఁ, గలిమి చాలదన్న కారణమున
విప్రయోగ మోర్చు టప్రశస్తము పేద, కిట్టులైనఁ బెండ్లి యెట్లుజరుగు. ౧౧

క. నీ విప్పుడు నావాఁడవు, కావునఁ బనిలేద యింటికర్చులు రోయన్
భావం బనుకూలించిన, వేవేగన్ బెండ్లియాడవే యని యంటిన్. ౧౨

32

క. చెప్పినవాక్యము వెండియుఁ, జెప్పం బనిలేదు వీనిచెంగట; నగుటన్
జప్పున మదాశయమ్మున, గొప్పెను బోలక్కు తనివియొదవెను నాకున్. ౧౩

క. తనవలచిన కన్యామణి, కనిచెను బోలక్కు లేఖ మచ్చెలి మైకో
లును దెల్పి నీమవలనం, జనుదెంచె వివాహధర్మసంభృతిపొం బెన్. ౧౪

గీ. వాద్యములు లేవు క్రొత్తవల్వలును లేవు, రవణములు లేవు మంత్రతంత్రములు లేవు
పందిళులు లేవు విందులపసలు లేవు, నడిచె దుగ్గానియును వెచ్చపడక పెండ్లి. ౧౫

ఆ. వరుఁడు యూదుజాతివాఁ డేసుమతమునఁ, బెరిఁగె వధువు వార లిరువు రిపుడు
జంటమైరి ధర్మసామాన్య మున్నచో, నిచట జాతిమతము లెదురఁ గలవె. ౧౬

గీ. పెండ్లిపై ముద్రవైచెడు పెద్దకడకు, నాఁడు దంపతితోడ నే నడిచినాఁడఁ
దెల్లవా రాలుమగలఁట నల్లవాఁడ, సాక్షినఁట నే నిదెంత విస్మయకరంబొ. ౧౭

ఆ. మధ్యవర్తి నల్లమానిసి యాట నీ, వధువు వరుఁడుఁ దెల్లవార లంచు
నెట్లు విశ్వసింతు నీ బంధ మని యధి, కారి మమ్ము రిత్తవారిఁ జేసె. ౧౮

ఆ. ఎల్లి భానువార మేతెంచుఁ గిస్మసు, పండు, వయ్యెఁ బెండ్లిపనులు సర్వ
మీతఁ డిట్లుపల్కె నిత్తఱిఁ గర్తవ్య, మెద్ది యనుచుఁ గొంతపొద్దు వగచి. ౧౯

క. ఎఱిఁగిన పైయధికారిని, దరిసించితి జంటతోడఁ; దత్కథ యెల్లం
బరికించి నవ్వి యతఁ డు, త్తరువిచ్చెన్ ముగిసెఁ బెండ్లితం తది యెల్లన్. ౨౦

క. కల రింతకుమును కొందఱు, తెలవారలు పురుషు లస్మదీయగృహమునన్
నిలిచెన్ క్రొత్తగ వచ్చిన, మెలఁతయు నీనాఁడు నాదుమిత్రుని సతియై. ౨౧

గీ. వీరితో నాకు నెన్నఁడు స్నేహడంబు, రామి నిక్కమకాని నాలేమ కిట్టి
యనుభవం బల్పతరమాట నాపె కొంత, గోణఁగెనపుడప్పుడదిలెక్కగొనుటచనదు.

క. నానామతముల జాతుల, మానిసులకు నిక్కమైన మద్గృహమం దే
దే నొక్కపొరపు వచ్చిన, దానిం బాటించి తడవఁ దగదని యందున్. ౨౩

ఆ. ఒక్కజాతివార లొక్కమతమ్మువా, రిరవుకొన్నయింట నెగయురగడ
నతకరించువేర్మి యస్మత్కుటుంబమం, దుప్పతిల్ల దనియు నుగ్గడింతు. ౨౪

వ. సజాతీయ విజాతీయ విపర్యయంబు భ్రాంతిజనితంబు నాఁదగు – సత్యముం బరికింప
నేమెల్లర మొక్కసంసారములోనివారము – యిఁక వెస్టుపెండ్లికథ వ్రాసెద –
నింతదనుక నాయుల్లంబు బ్రహ్మచర్యంబు దెసం బరిపాకమునొంద దాయెఁ – గాన
నవివాహితులగు చెలిమికాండ్ర నెల్లర నొకయింటివారిం జేయుట కర్తవ్యమని
తలంచితి – నంతఁ గన్నవారిం జూడ వెస్టు పయనమ్ముకట్టె – వచ్చునపు డిల్లా
లితో రమ్మని యే నతనికి వీడ్కోలొసంగితి – నేలయున ౨౫

క. ఎల్లర కల్ల ఫనికస్సన, నిల్లున్నది సేద్యమున్న దిఁకఁ బెండిలి నాఁ
బిల్లలు నా మాచిత్తము, తల్లడకుడువంగ నేమితంటా వచ్చున్. ౨౬

ఆ. వెస్టు మరలివచ్చె లెస్టరులోఁ బెండ్లి, యాడినట్టి వన్నెలాడితోడ
నిక్కమైనవన్నె చక్కనిగుణ మాట, నాపె వన్నెలాడి యనుట పొసఁగె. ౨౭

ఆ. ఆమెతల్లిదండ్రు లన్నలు తమ్ములు, పాడుకములు కుట్టి బ్రిదుకుచుండ
రాకె నేర్చెఁ గొంత యాకౌశలంబు న, య్యబలవెంట వచ్చె నంబికయును. ౨౮

క. ఈయవ్వ కృత్యముల దేసఁ, బాయనిపూనిక వెలార్పఁ బ్రిన్ననినగవుల్
రేయెండంబలె నిచ్చలు, గాయింపఁగ మాకు సిగ్గు కవియుచునుండున్. ౨౯

ఆ. పెండ్లికానివారి పెండ్లి సేయించుచు, నైనవారు దప్పులందు నిలుచు
సతుల సుతులఁ బిల్వఁజను నని తెల్పుచుఁ, గాల మచట నిట్లు కడపుచుంటి. ౩౦

* * *

౨౩ ఇంటి దేస

క. మితమగు వెచ్చము రస్కిను, మత మగుటన్ దాని దేసకు మది నిడి నాకున్
జతపడినవట్టు డంబపు, బ్రితుకున్ సవరింప నెల్లబాటలు కంటిన్. ౧

క. మానితి నంగడిరొట్టియు, కూనీమత ముగ్గడించు గోదుమరొట్టెన్
బూనికఁ జేయందొడఁగితి, దానికి మరపిండి యనుచితం బనుకొంటిన్. ౨

ఆ. చేతిపిండి లగ్గుసేయును గానఁ గై, మరనుగొంటి గోదుమలను విసర
నొక్కరుండు తిప్పనోపఁడ దీనిఁ ద, చ్చక్రిమునభరంబు చాల నగుట. ౩

ఆ. ఒక్కసారిపోల కొక్కమా తాతని, నవల యొక్కతడవ నాదుబిడ్డ
లతివ యొక్కతూరి జతపడఁ జక్రింబు, త్రిప్పువాఁడఁ బిండి కుప్పవడఁగ. ౪

వ. ఈపరిశ్రమంబు పసివాండ్రకుం దద్ద యుపకరించుఁ - గాని యే నెన్నఁడు స్వీరి
నిప్పునికి నియమించి యెఱుంగ - నట్లయ్యు నిది యొకరంతుగా బాలురు చక్రముం
ద్రిప్పసాగిరి - వీరి కలసట వొడమినంతన యేను సెల విచ్చువాఁడ - నెంతసోమరి
బిడ్డయేని నాచెంత గంతులువైచుచుం బనిసేయుచుండు - వెండియు ౫

ఆ. కసవుచిమ్మ యింటియొసపరితన మెల్లఁ జక్కఁజేయ లెంక యొక్కఁ డుండె
నతని బంటువోలె నరయక సంసార, సభ్యుఁజేసి నెమ్మి చాటినాఁడ. ౬

గీ. ఆతనికిఁ గుట్టులందఱు చేతనైన, సాయ మొనరించుచుండ రొసాయ మింటి
ముంగిటన్ బాగుచేత మఱుంగుదొడ్డి, కడిగిచిమ్ముట లోనైన యడుమ లోర్చి.

క. మల మెత్తుటకును బిడ్డలు, కలఁగనివారైరి తెగులు కల్గమిపొంకెన్
వలసినబాట లెఱింగిరి, యలయిక కలవడిరి నన్ను నలరించి రిటుల్. ౮

ఆ. కుఱవాండ్రచదువుకొఱ కేను యత్నంబు, సలుపలే దటంచుఁ బలుకఁ గాని
వలసినపుడు దాని వదలుఁడీయని చెప్ప, జంకనైతి నింత గొంకనైతి. ౯

క. నాపుత్రు లీకతమ్మున, నాపై దోషంబునిడిరి ననిచిన తమ సం
తాపము తెల్పి రిటన్ నా, లోపంబును గలదు పాడిలోఁతులు సూడన్. ౧౦

క. బాలురవిద్యాసంపద, చాలన్ వలచితిని గృషియు సల్పితి నైనన్
నాలాలస విఘ్నమ్ముల, పాలంబడి చెడియె నిడియెఁ బరితాపంబున్. ౧౧

వ. వీరికిం దగునొజ్జ నేర్పఱిచి విద్యనేర్పింపక యేన వీరైనతఱి నించించుక బోధించు
వాఁడ - మూఁడుక్రోసులదవ్వునం గల పనిపట్టునకు వీరి నావెంట నడిపించుకొని
పోవుచు లాఁతినెయ్యురు నన్ను వెన్నడింపనినాఁడు దారియందు వీరికిఁ బాఠ
మ్ములు చెప్పుచుంటిఁ - బెద్దవాఁడగు హరిలాలుందక్కఁ దక్కెల్లబిడ్డల నిట్ల
పెంచితి - హరిలాలు భారతభూమియందు నిలిచె - నియతుండనై యనుదినం
బొకగంటసేపు పాపలచదువుకై డస్సియుందు నేని వారు చదువరులై యుందురు-
కాని యేను దీనికి శక్తుండఁ గానైతి - నిప్పట్ల నాకొమరులకు వలసినంతచింత
కలదు - పెద్దవాఁడు తనకొందలపాటుం బెక్కుతడవలు నాకడన వెడలఁగ్రక్కెఁ-
దక్కినకొడుకు లీనేరంబు వారింపరానిదని యుదారతమై సైఁచిరి - యే నిందుల
కనుతాపముం గుడిచియెఱుంగఁ-గాని యాదర్శజనకుండఁ గామి కపుడపుడు వగ
చితి - నాబిడ్డలచదువుం బ్రజాసేవకు బలియిచ్చితి నని నాతలంపు - నాయవి
వేకం బిట్లు సేఁతకు హేతువు కావచ్చుఁ - గాని యది సదాశయసమగ్రమని చెప్ప
నోర్తు - మఱియు నయ్యవసరంబున ౧౨

క. బిడ్డలచదువులపట్ల న, సడ్డ యొనర్చినను వారిచరితము దిద్దన్
జడ్డెఱుఁగకె బడలితి నిధి, గడ్డెనను గన్నవారి కర్తవ్య మగున్. ౧౩

మం. ఏ నింతనలఁగిన నిపుడు నాబిడ్డ, లేగెడుత్రోవలో నదియేని వంక
యగపడ్డ నది మత్ప్రియత్నలోపంబు, కతనఁ బుట్టినచేటుగా నుజ్జగొనక
మాయాలుమగలను మానవిదోసఁగు, బిడ్డలం దిట్లు బింబితమయ్యె నందు. ౧౪

గీ. సుతులునాఁ గన్నవారియాకృతికె కాక, గుణమునకు దోషమునకును గుర్తు లనెదఁ
బరిసరచ్ఛాయ వారికిఁ బట్టుఁ గాని, తండ్రితాతలగుణమే ప్రధానగుణము. ౧౫

వ. వంశపారంపరీ ప్రాప్తంబు లగుదోషంబులఁ బాసి వాసిగన్న పిన్నవాండ్రుం
గలరు - కాని వారి యీ పవిత్రత కాత్మమూలస్వభావంబు నిదానంబు నాఁదగు-
నది యీ దుర్గుణంబుల బలిగొనం జాలు - వెండియు ౧౬

ఆ. చిన్ననాఁటఁగోలె బిడ్డల నాంగ్లేయ, భాష కప్పగించు భారతీయుఁ
డాత్మజులకె కాక యాత్మీయభూమికి, నెగ్గుచేసినట్లు యెంతు నేను. ౧౭

క. తనజాతికిఁగల సంస్కృతిఁ, గనలేమియ కాక తనదుగడ్డకు లోకం
బున కిట్టిబిడ్డ యూఁడిగ, మొనరింప నపాత్రుఁ డగుటయున్ నిక్కమగున్. ౧౮

గీ. అగుటఁ గుజ్జులతో నిచ్చ లంగవించి, మాటలాడఁ దొడంగితి మాతృభాష
ననుఁగుపోలిక్కు దీనికి నహరహంబు, నాఁక సెప్పుచు నిబ్బంగి నాడఁదొడఁగె. ౧౯

గీ. కుజ్జువాండ్రు భవిష్యమ్ము కుంటువడుపఁ, జాగితిరి మీరు లోకప్రశస్తిగన్న
యాంగ్లవాణి వశంవద యైననాఁడ, నేఁటిసంఘర్షమున వీరు నెగ్గఁగలరు. ౨౦

గీ. అభినివేశమ్ముతోడ నెయ్యమ్ముతోడ, నితఁడు పల్కినపల్కు నా కింపదయ్యె
నపుడు రేఁగిననావాద మరసి మొండి, తనము పరికించి పోలిక్కు తగ్గిపోయె. ౨౧

క. ఇరువదియేండ్లకుము న్నిది, జరిగిన; దానాఁటి నావిచారంబులు నా
యెఱిఁగినయనుభూతులతోఁ, బెరిఁగెను సాహిత్యబలము పెంచెన్ దనకున్. ౨౨

వ. నాకొడుకుల కక్షరజ్ఞానంబు లెస్స లేకున్నను గుజ్జరాతిబాసం దగునేర్పు వాటిల్లెఁ - బలువు రాంగిలేయులతోఁ గలసి యుంట నింగిలీసునందును సాధారణపరిచితి యేర్పడె - నప్రయత్నంబుగా రెండుభాష లబ్బి వీరికి దేశమునకు లగ్గుసంధిల్లె. ౨౩

* * *

౨౮ జులూ తిరుగుపాటు

క. ఏ నిల్లుకట్టుకొంటిని, గాని ప్రశాంతముగ నాల్గుకాలంబులపా
టానెలవునఁ దిని బ్రదుకుట, కానంబడదాయె దైవగతి వేఱగుటన్. ౧

క. పోలకు మున్నగుమిత్రుల, తో లంబిని బెంచి పుష్టితుష్టులు గనుచున్
గాలంబు గడపుచుండ నె, టాలుజులూ లెదురుచువార్త డబ్బా టొదవెన్. ౨

క. మనవాగలపట్ల జులూ, లొనరించినచెడ్డచేఁత యొకటియు లే దా
మనుజావలిదెస నాకుం, గినుకయు లే దపుడు వారు కృతనిశ్చయులై. ౩

ఆ. ఏలుబడి నెదుర్చు టేనియుఁ దద్దయు, నమ్మనైతిఁ గాని నాఁడు తెల్ల
వారిదోరతనంబు వసుమతీశ్రేయమ్ము, కొఱక యనుతలంపు కుదిరె నాకు. ౪

గీ. దానిదెస నాకు నిచ్చ యొంతయుజనించె, నీఁగయును దానిపై వ్రాలు టేనుసైఁప
నగుట నిది నీతి యవినీతి యనక బలిమి, నోడ్డఁదగునంచు నెంచితి నడ్డులేక. ౫

వ. నేటాలుసీమ కేదే నొల్లమి వాటిల్లినతఱి నది త న్నాదుకొనుట కొక స్వయం
సేవకదళంబు నాయిత పెట్టుకొని యుండె - నం దక్కఱవడుచో నల్లవారింగూడ
జోడించుకొంట కలదు - నా కీనాఁటితో గాటంబగు లంకెయుంట నేనుం దదా్రష్ట
వాసినకా భావించుచుండుఁ - గావున ౬

గీ. వలసినం గృత్తగాత్రసేవన మొనర్ప, భారతీయదళంబుతో వత్తు నంచు
రాష్ట్రపాలకునకు నుత్తరంబు నంపి, యతనిమైకోలు వడసితి నప్పుడపుడ. ౭

గీ. ఆలుబిడ్డల నంపితి నాశ్రమమున, కేను డర్బనుసొచ్చితి దీనజన ర
రక్షు లిర్వదినల్వురు దీక్షఁబూని, దండునం జేరఁ దఱిసితిం దగవుపట్టు. ౮

వ. మున్ముం దేను జులూ లెదురొ్కన్నచోటి కరిగి పరికింప నం దవరోధచిహ్న
మావంతయేని నాకుఁ గానరాదయ్యెఁ - దమపై నధికృతులు విధించినకా్రత్త
పన్ను చెల్లింపఁజనదని జులూనాయకుం డనుచరుల కాదేశించె నఁట - తత్క
రంబు రాఁబట్ట వేంచేసినసుంకరి నీప్రజలు నలుగుపెట్టి పంపిరఁట - జులూతిరుగు
పాటునా నిదియ - దీని నింతచేసి దొరతనంబువా రీతెగ నడఁగింప సమకట్టిరి -
కాన నా కీజులూలపట్ల నాదరంబు వొడమె - నంత ౯

గీ. కదనకార్యాలయంబును గదిసి యచటి, వెజ్జు నీక్షించి పనియేమి వినుపుఁ డంటి
నాతఁడు జులూల సేవింప నాజ్ఞ పెట్ట, నస్మదానంద మతివేలమయ్యె నపుడు. ౧౦

క. అతఁ డౌదార్యము విరియఁగ, క్షతాంగుల జులూలసేవ సలుపం దెలవా
ర్మతిసేయకుండి రే నే, గతి వీరిం జక్కఁజేయఁగల నొంటరినై. ౧౧

క. గాయములు కుళ్ళి దుర్గం, ధాయతనము లయ్యె మీర లరుదెంచుట ల
గ్గాయె నపరాధ మెఱుఁగని, యీాయనదలమొత్తి వినియె నీశ్వరుఁ డనుచున్. ౧౨

ఆ. మమ్ముఁ బెద్దచేసి మందులు పట్టీలు, నొసఁగి యార్తు లున్న దెసకుఁ జేర్చె
ముఱికిముద్ద లగుచు మూల్గుజులూలు మా, దళముఁ జూచి తెల్వి తనివి గనిరి. ౧౩

క. ఆవలఁ గల తెలజోదులు, మావంకకుఁ జూచి కొల్వు మానుఁడు వీరల్
చావం దగుపాలసు లని, తీవరపాటున జులూలఁ దిట్టిరి మివులన్. ౧౪

క. ఆ పచ్చిబూతులను విన, నోపక చెవులందు వ్రేళ్ళనొత్తితి మంతన్
మా పొత్తున కల్లల్లన, లోపడి రమ్మగలు కింక లుప్తము కాఁగన్. ౧౫

గీ. మున్ను నాతోడ లెస్స డీకొన్నదొరలు, వాయలీ స్వార్క్సు మున్నగువార లందుఁ
గలరు వారికి నా సేవఁ గన్నయంత, నచ్చెరువుతోఁచె నన్మెచ్చునాస యేచె. ౧౬

గీ. అపుడు మా పరిచారంబు నందుప్రజలు, దురమునన్ దెబ్బదిన్నపోటరులు గారు
చెఱకు లోపడి కొరడాలశిక్ష గుడిచి, నఱునఱయి కుళ్ళుచున్నారు వారు. ౧౭

క. తొలి బోయరుజగడంబునఁ, గొలు విట్టిది సల్ప నేర్ప కొంతవడయుటన్
వలసిన చికిత్స నడుపుచు, జులూలకున్ సేవఁజేత చులుకనయయ్యెన్. ౧౭

క. ఎచటికి దూఁడు ననీకిని, యచటికి డోలీలతోడ నరుగుచు భగవత్
ప్రియు రారాధనముం బలె, రుచిపడి సల్పితిమి నాఁడు రుగ్ణులసేవన్. ౧౮

***

౨౫ హృదయమథనము

క. ఆపన్నులగు జులూలకు, నోపినసాయంబు సేయుచున్నతఱిన్ నా
లోపల మథనము రేఁగెను, జేపడె ననుభూతినిఘ్న చిత్సంపదయున్. ౧

క. మున్ను బోయరుకదనంబు గన్ననాఁడు, నాకుఁ బుట్టనియోట యీనాఁడు పుట్టె
నిదిరణంబని పేర్కొంట యేమిపాడి, మానవుల వేట యనియంట మంచిమాట. ౨

క. రవిరాకడతో మొదలై, దివియు భువియు నదురిన గుండ్లదెబ్బలు మొరయఁ
రవుతులు పల్లెలపైఁబడి, తవిలి తుపాకులను బేల్చెదరు నిర్దయులై. ౩

క. ఈరోద నిచ్చలు చెవులం, దూఱఁగ నచ్చోట నుంట దుస్సహమయ్యెఁ
నారాయణుకరుణను జే, కూరెను మా కీజులూలకొలు వవ్వేళన్. ౪

క. అగుటం జేఁ దిది యెట్లో, దిగమ్రింగితి; మేము సమ్మతిం జూపనిచో
నిఁక నెవ్వరు నీ సేవకుఁ, దెగరని నమ్మితిని గానఁ దేర్చితి నాత్మన్. ౫

వ. ఆఖేటంబున కాటపట్టయిన తద్దేశంబున జనసంఖ్య యల్పతరంబు నాఁడగు -
నక్కడక్కడఁ గొండలయందును గుహాలయందును సాధువులు నాటవికులు నగు
జులూలు నివసించు కుటీరములు తక్క నచట నొండేమియు లేదయ్యె - నిట్టి నిర్జ
నారణ్యంబున క్షతగాత్రులడోలికలు మోయుచుఁ బెక్కుమడలమేర పయనించు
తఱి నాచిత్తమునం జిత్రజల్లులవోలెఁ బెక్కుతలంపు లుదయించె - నపుడ నా
బ్రహ్మచర్యభావన పాకంబునంబడె - ననుయాయులతోడం గూడి దీనిఁ దద్ద
తడవితి - మానవసేవకుం గాక భగవద్దర్శనంబునకును బ్రహ్మచర్యంబు ముఖ్యం
బని యానాఁ డెఱింగినట్లు సెప్పఁజాలఁ - గాని ౬

ఆ. తెలిసికొంటి నేను దినదిన మిట్లార్త, వర్గమునకు డయ్యావలయు ననియు
భోగములకు లోఁగి బుడుతల సృష్టించి, పెంచుచున్న నిది లభింప దనియు. ౭

గీ. రెండుగుఱ్ఱాలపై సవారీలుకొట్టఁ, జాల నిపు డింతి యాపన్నసత్వ యైన
నింతయావేశమున దూఁకి యీ యనాథ, సేవ గావింపనోర్తునా చింతలేక. ౮

గీ. శమదమమ్ములు లేక సంసారవృద్ధి, కిచ్చ సేయుచు జంజాట మెల్లఁ బెంచు
మనుజుఁ డత్యర్థశేముషీమంతుఁ డయ్యు, సంఘమునకూడిగము సల్పఁజాలఁ డందు.

వ. పరిణీతుఁడయ్యు బ్రహ్మచారియై మనువాఁడు సంసార సమాజముల రెంటిం గొల్వవచ్చునని నాయాశయం - బే నిట్టియాలోచనలు చేసి చేసి బ్రహ్మచర్యంబు నవలంబింప నాత్రపడితి - నపుడు నాహర్షంబునకు మేర లేదయ్యె - నాసేవా క్షేత్రంబును గడుంగడు విస్తృతమాయె - నంత ౧౦

ఆ. జగడ మాఁగిపోయె నీఁగ మీర లింటికిఁ, జేరవచ్చు నన్న సెలవువచ్చె
నార్తకోటి నిట్టు లాఱువారమ్ములు, కొలిచి మరలినాఁడఁ జెలులతోడ. ౧౧

క. ఏ నిలుసేరినపిమ్మట, మీనెఱపినసేవ మీసమీచీనత మ
మ్మానందపఱిచె నని భూ, మీనాథుఁడు కమ్మవ్రాసి మెచ్చెను మమ్మున్. ౧౨

క. పదపడి పరమోత్సాహము, గదురఁగ నాబ్రహ్మచర్యగాథ మగనలాల్
మొదలగువారికి వినుచుడు, నది సద్వ్రత మంచు మెచ్చులాడిరి మిత్రుల్. ౧౩

గీ. పొగడికే కాని తద్దీక్షపూని గెల్చు, టరిదియని చెల్మికాండ్రు కందఱకుఁ దోఁచె
భారమా యని కొందఱు పంతగించి, రందుఁ గొందఱు జేతలై గనియుఁ గంటి.

క. అపు డేను న్మది నంజక, శపథం బొనరించి బ్రహ్మచర్యము గొంటిన్
గృపనింపుము పెంపుము న, న్నపరాజితుఁ జేయు మీశ్వరా! యని యంటిన్. ౧౫

క. ఆనాఁడు దీనివిలువయు, దీనికఠోరతయు నింతదెలియదు నాకున్
నే నేతదీయపరుషత, యీనాఁడుం గుడుచుచుంటి నెరియుచునుంటిన్. ౧౬

వ. ఈబెడిదమ్ము వెంట దీనిమహిమమ్ము సైతమనుదినం బధికాధికంబుగా నెఱుంగుచుంటి - నీ నిగ్రహంబులేని బ్రతుకు రిత్తకురిత్త యనియు నది పాశవజీవనం బనియు నాకుం దోఁచు - నిచ్చమైఁ దన్నుఁదా నాదేశించుకొనుటయందె మానిసి మానిసితనంబు కలదని వక్కాణింతు - నొక్కనాఁ డేను ౧౭

గీ. బ్రహ్మచర్యంబు సర్వధర్మములఁ బెద్ద, యనుట యత్యుక్తి యనుకొంటి నట్టిపలుకు
సముచితంబని యనుభూతిజనిత మనియుఁ, దేటపడుచున్న దీనాఁడు దినదినంబు.

క. శారీరకనిగ్రహమునఁ, బూరితిగా దీవ్రతంబు భోగేచ్ఛ మదిం
బాఱుటయును గల లట్టివి, కూరుటయుం దగదు సిద్ధిఁగోరిన దీనన్. ౧౯

మం. బాహ్యేంద్రియమ్ముల బంధించుటయును, గడు బెట్టిదంబైన కర్జంబ యందు
బాహిరంబగుగెల్పుఁ బడసితిఁ గాని, యంతర్జయం బందనైతి నెల్లయును
జాగర్య విడువక చరియించుచున్న, నే తెంచుఁ దలఁపు నాయెఱుకువ లేక
తలఁపుతల్పును మాయు తాళంబు నరుని, కడ నున్నదనియు నేఁ గన్నాఁడఁ గాని
యతఁడ రోయందగు నలయక దీని, వెదకి యిచ్చెడివారు వేఱుగా లేరు
తమ కన్నయనుభూతిఁ దరువాతివారి, కిచ్చిపోయినపెద్ద లిచట దర్శకులు. ౨౦

వ. వారి యనుభూతులున్నైతము పరిపూర్ణములు కావు - నాదృష్టిం జూడఁ బరిపూర్ణత యన్నది భగవానుఁ డనుగ్రహింపఁ దగినదియ - కాన భక్తులగువారు తమతపశ్చర్యం జేసి రామనామాది మంత్రములఁ బవిత్రములఁ గావించి మన కిడిపోయిరి - మఱియు మనుజుండు మూలముట్టుగాఁ దన్నుఁ దా నీశ్వరున కప్పన చేసికొన్నం గాక లాంతి వెరవులం దలఁపుల నోర్వనేరఁ డని యేను విశ్వసింతు - ధర్మబోధకంబులగు నెల్లకృతులు నిదియ వక్కాణించు - నిందలిసత్యంబు నీనేమంబు నిర్వహించుతఱి నెఱింగితి - బ్రహ్మచర్యదీక్షం బూనినంతన యే నింతితో నెక్కటిసెజ్జయు నేకాంతసేవయు నుజ్జగించితి - నిట్లు నా యేకత్రింశవత్సరంబునం దారబ్ధమై యిచ్ఛానిచ్ఛలతో సాగివచ్చు నీనిగ్రహంబు సప్తత్రింశత్తమ వర్షంబు నడుమ వ్రతాకృతిం దాల్చె. ౨౧

***

౨౯. సత్యాగ్రహోత్పత్తి

గీ, అంచితబ్రహ్మచర్యధర్మానువిద్ధ, మస్మదీయాత్మశుద్ధి సత్యాగ్రహోప
గతికి మూలమ్ముగాఁ గొన్నిఘటన లేరు, పడఁదొండగెను జోహాన్సుబర్గునందు. ౧

ఆ. ఏను బ్రహ్మచర్య మూనుటకు న్మున్ను, నాదుబ్రదుకునందు నడిచినట్టి
ముఖ్యమైన ఘట్టములు మెల్లమెల్ల స, త్యాగ్రహమును గూర్చె ననితలంతు. ౨

వ. సత్యాగ్రహం బనుపదం బేర్పడకముంద తత్పదము నర్థం బైన వస్తు వుదయించె - నది పుట్టిననాఁడు దానిపే రిద్దియని నా కవగతంబు కాదాయెఁ - గాన దీనిప్రసంగము వాటిల్లినతఱి 'పేసివ్ రెజిస్టెన్స్' అను నాంగ్లశబ్దంబును ఘూర్జరియం దుపయోగించుచుంటిఁ - గాని యాంగ్లేయసమజ్య నొకదాన నిమ్మాట సంకుచితార్థవాచి యనియు, నిది బడుగువాండ్రు కాదరు వనియు, దీన నీరసకుంజోటుకల దనియు, రానురా నిది హింసలోనికి మాఱుననియు నెఱింగి యీనుడి భారతీయు లిచట సాగించుపెనఁకువ కలరూపు నావిష్కరింపనేర దని యంగీకరించి

క. మదినిడి తరిచితి డస్సితిఁ, బద ముచితము వడయనైతిఁ బ్రాజ్ఞులు సూచిం
చద లేని బహుకృతి పం, చెదనని పత్రికను దెల్లఁజేసితి వార్తన్. ౪

క. మదినిడి సదాగ్రహం బను, పదమును సృష్టించి వడసె బహుమతిఁ బ్రజ్ఞానిధియైన మగనలాల్ ; లే, నది "సత్యాగ్రహము" చేసి హర్షముగంటిన్. ౫

వ. నాఁటంగోలె నీనుడుగు నాతల్లిబాసయం దీనాఁటిశాంతిసమరంబున కభిధేయమై తీరపడె - నీసంగ్రామచరిత్రంబు దక్షిణాఫ్రికా ననువర్తించిన నామనుగడయు నాసత్యప్రయోగములయుఁ జరిత్ర యగు - నిందుఁ జాలవట్టు బందానై యెర

వడ నున్ననాఁడు వ్రాసి తక్కెల్లయు విడుపుఁగన్నవెన్క రచియించితి - నిదియ
దక్షిణాఫ్రికా సత్యాగ్రహేతిహాసం బనుపేర గ్రంథరూపమ్ముఁ దాల్పె - నందుఁ
జేరినగాథలం దొల్ఁచి నూత్నవిషయంబు లావిష్కరించి యవ్వల భారతదేశీ
యమ్ములగు మత్ప్రయోగమ్ము లుగ్గడింతు - నీ నాప్రయోగపరంపర నవిచ్ఛిన్న
ముగా నెఱుంగవలచు పాఠకు లా యితిహాసంబును సైతము తమమ్రోల నిల్పు
దురుగాక ! ౬

***

౨౭ ఆహారపరిశోధనములు

ఆ. బ్రహ్మచర్యధర్మపాలన సత్యాగ్ర, హోవలోడనంబు నన్నపనులు
పెద్దమార్పుసేయఁ దద్దయుఁ బెరరేచె, నాఁటి నామెసంగు కూటిపట్ల. ౧

క. అన్నమున మార్పుచేసితి, ము; న్నది యారోగ్యదృష్టి మూరుట జరిగెన్
గన్నంతయు ధర్మవ్రుదేస, నున్నదియై నేఁటివేర్మి కొగ్గినవాఁడన్. ౨

క. డెందమ్ము విషయవాసన, లం దగిలిన జిహ్వాచాపలం బధికం బౌ
నందురు పెద్దలు నాకుం, గ్రిందుగ నీ నాల్కపిచ్చి కనఁబడుచుండున్. ౩

క. జనురింద్రియమును నాల్కను, దన కగ్గముచేసికొనఁగఁ దద్దయు జతనం
బొనరించితిఁ గృత్స్నజయం, బొనగూడినదని వచింప నోడుదు నేఁడున్. ౪

క. మితిమీఱి భుజించెడు తర, గతిమానిసి నేను ముందుగా మేల్కొని యీ
కుతి నణఁపకున్నచో దు, ర్గతిపా లగువాఁడఁ బశువుకంటెను బాడై. ౫

గీ. ఏను నాదుర్గుణంబుల నెఱిఁగియుంట, మేలివారలచెల్మి నాపాలిదగుట
నుపవసించితిఁ బర్వంబు లాదవువేళ, భార మనుకొన్నదినమునఁ బండ్లుతింటి. ౬

వ. నిగ్రహదృష్టిం జూడఁ బండ్లకును గూటికిం జెప్పఁదగిన వేర్పాటు సున్న-గింజలం గలరుచియ ఫలంబులందుం గలదు - రానురాను బండ్లరుచియ మేలిదనియుం దోఁచుఁ - గాన నేకాదశి జన్మాష్టమి మున్నగు పబ్బములం దుపాస మొండేని యొంటితినుట లెస్సయని తలంచితి - నింతియకాక ప్రాచితంబులందుసైత మేకాన్నముం గొనుచుంటి - నిద్దాన మేను వెలందియై రసజ్ఞతయు నశనాయయుం బెనుపందెఁ - గాన ౭

గీ. భోగమునకును సంయమయోగమునకు, నక్కఱకువచ్చు నుపవాస మనుచుఁ దోఁచె
నేనకా దిట్టి యనుభూతి నెఱిఁగినట్టి, గఱువ లందందు నుంటయుఁ గన్నవాఁడ. ౮

ఆ. మేను లెస్సబలిసి మిసమిసలం దోఁగి, యుంట నాకుఁ దుష్టినొసఁగుఁ గాని
సంయమానురక్తి సడిసన్ననాలుక, వెఱ్ఱి డించుతిఫుట విస్తరిల్లె. ౯

క. కావునఁ దినుబండములం, దీవరపడి మార్పుసేయఁ దివిరితిని బుభు
క్షావేగ మాఁగి నియమము, మై వెలితిగఁ దింటి రేపుమాపులు రెంటన్. ౧౦

గీ. ముద్ద తగ్గించితిని గాని బుద్ధి చవుల, మీఁదికే పర్వులిడుచుండెఁ గాదు నాక
యగుట నిదిమంచిదదిమంచిదంచుఁ దెచ్చి, పూఁటపూఁటకుమార్చితిఁగూటి తెఱఁగు.

క. నిన్నటిరుచి నేఁటికి నా, మన్నన గనదయ్యె నిట్టిమార్పులలో నా
వెన్నడిఁ గొందఱునెచ్చెలు, లున్నా రం దుగ్గడింప యోగ్యుఁడు కేలన్. ౧౨

వ. "హారమాన్ కేలన్ బే" కను నితనిం గుఱిచి యాఫ్రికాసత్యాగ్ర హేతిహాసమునఁ
బెద్దయుం బల్కితిఁ - గాన నిచట నప్పని మానెద - నుపాసంబులోనగు నాహార
పరిశోధనంబుల నితండు నా సతీర్థ్యుఁ డయ్యె - సత్యాగ్రహ ముచ్చెచ్చిస్సితి
నున్నతఱి నే నితనిమనికిపట్టున విడిసితి - నే మొండొరుల మయ్యాయిపరివర్త
నంబులు నిర్ణయించుచు నూతనపరిణామములం దగ్గలంబుగాఁ జవులుకుడుచు
చుంటిమి - నాఁటి మా యాహారచర్చలు సైత మెంతయు రుచించుచుండె - నం
దొకఁడేని చేఁదుకాదయ్యెఁ - గాని చవులం దగిలి యిట్లు లోఁతులోఁతులకుం
జారుట లగ్గుకాదని యే నవ్వల నెఱింగితి - నోగిరముం గొంట మేనినిల్పునకుఁగాని
నాల్కనలరింపఁగాదు నాఁజను - సర్వేంద్రియములుం దనువును దనుద్వారమున
నాత్మదర్శనము నర్థించి శ్రమించునేని యానాఁ డవి స్వాభావికరూపమ్మునంది
తమకర్తవ్యముం జక్కఁదీర్పుననివక్కాణింతు - నిట్టిస్వాభావికతం బడయు నెంత
తరిచిన నది రిత్తచేఁత కాఁజాల - దీయరయికపట్లఁ బెక్కుమేనుల బలిసేయు
టక్కఱయైనను దాని కోహటింపం గాదు - కాని ౧౩

క. ఏ తెదురెక్కుచునున్నది, దారుణ మిది నెఱపువోనితనువును నిల్పం
గోరికవడి మన మకటా!, దోరింతుము జంతుసంతతులఁ గర్కశతన్. ౧౪

క. కడుఁగడు నింద్యంబగు పో, కడ సీకొని తుట్టతుదకుఁ గాయము నాత్మన్
మడియించుకొందు మొకరుజ, నడఁపన్ గమకింప సిద్ధమగు వేళోకఁడున్. ౧౫

గీ. అవిర తేంద్రియసౌఖ్యంబు లనుభవింపఁ, గడఁగి భోగించుబలిమిఁ గోల్పడుచునుందు
మిదియు ననిశంబు మనకంటియెదుట జరుగుఁ, గాని కన; మింతకంటె నక్కజము
కలదె? ౧౬

* * *

౨౮ కస్తూరి ధైర్యము

క. కొమ్మకుఁ గస్తురిబాయికి, ముమ్మాఱు కఠోరరోగములు తలకూడెన్
నమ్మిన మృజ్జలవైద్యము, నమ్మగువ కొనర్చి లగ్గు నందంగనితిన్. ౧

క. ఆపడఁతి మొదటిరుజకున్, జేపడె సత్యాగ్రహమ్ము చెలరేఁగుతఱిన్
నాపట్టు పరీక్షించుట, కాపద యిది కూర్చె వేలు పని నిలఁబడితిన్. ౨

క. ఆవెలఁది మివ్వల రక్త, స్రావంబున బడలె నొకభిషజ్మణి మిత్రుం
డీవెతకు శస్త్రవైద్యము, కావలయు నటంచు నాఁడు కఱపెను హితమున్. ౩

క. ఎంతో చెప్పినమీఁదట, నింతికి నీకోలువచ్చె నీ కోయుటకున్
సంతతరోగార్తిం బడి, కాంత కడున్ స్రుక్కి బక్కగా నపుడుండెన్. ౪

ఆ. అగుటఁజేసి వైద్యుఁ డాపెకు మత్తుమం, దిడక కోఁతచేఁతయెల్ల నడిపె
నపుడు నొగులు తద్దయైనను గస్తూరి, ధైర్యమూర్తి యగుటఁ దాళుకొనియె. ౫

క. అబ్బురమందితి నాబిడ, నిబ్బరముం జూచి కోఁత నిర్విఘ్నముగాఁ
బ్రబ్బె నుపచార మంతయు, నుబ్బుచు భిషజుండు నతనియోషయు సలిపెన్. ౬

వ. ఈచికిత్స డర్బనుపురమ్మునందు జరిగె - నది సాగిన రెండుమూఁడునాళ్ళ కీక
నిశ్చింతమై జోహాన్సుబర్గున కేగవచ్చునని వెజ్జు నాకు సెలవొసంగ నే నవ్వీడు
సేరితిఁ - గాని వెనువెంటన కస్తురబాయిపరిస్థితి తృప్తికరము కాదని వార్త
వచ్చె - మఱియు ౭

క. ఆకెకు మాంసరసాదుల, నీకున్నం గడవనేర మీఁగండము నీ
రీకొన్న నిత్తు నోడఁబడుఁ, డాఁకట్టుకుఁ డంచు వైద్యుఁ డడిగెను నన్నున్. ౮

ఆ. అనుమతింపనొల్ల నాయమకే హక్కు, గలదు దీని కొను గా దనంగఁ
దగిన తెల్వియున్న మగువక యాపల్కు, సెప్పి యొసఁగుఁ డాపె యొప్పుకొన్న. ౯

క. అని వెజ్జునకేఁ దెల్పుడుఁ, జనుదెం డికమీఁర లేను జాలన చెప్పన్
వినరే నస్మద్ధిత మీ, యనయమ్మ వడంపనేర నని వైద్యుఁ డనెన్. ౧౦

క. ఆవార్త విస్మయంతప, యే వెడలితి నింతిచెంత కెనసితి వెజ్జున్
ద్రావించితి మాంసరసం, బావల మిమ్మడిగినాఁడ నని యతఁ డనియెన్. ౧౧

క. ఇంత కికురింతువే యని, వంతం జాటితి నతండు వైద్యమునం దా
వంతయు వెఱవక యిట్టి బ, వంతము సాగింతు; మెన్నివంకరదారుల్. ౧౨

ఆ. త్రొక్కియైన రోగియిక్కట్టు దీర్చుట, కంగవింతు మిచట నన్నృతమునకు
విలువలేదు ధర్మ్యవిధియిది మా కని, తెగివచించెఁ గొండపగిది నిలిచె. ౧౩

ఆ. అపుడు దిగులు నొఁగులు నందితిఁగాని యీ, వెజ్జ నేస్తకాఁడు వెలఁదివాఁడు
మెలఁతతోడ సేవసలిపి కస్తురికిఁ దో, డ్పడినవాఁడు నగుట బాధయెల్ల. ౧౪

క. సైఁచితిని గాని వైద్యము, నాఛందముదాని నోర్వనైతిని రుజ పెం
పై చచ్చుఁగాక కస్తురి, యీచెలి వలదన్న నెఱచి నీకొన నంటిన్. ౧౫

క. నావుడు నగదంకారుఁడు, మీ వేదాంతోక్తు లిచట మేకొన రుగ్నుల్
మావశమున నున్నంతకు, నేవస్తువునైన నిత్తు మితముం బడయన్. ౧౬

క. ఇది వైద్యులపోకడ మీ, మది యిందుల కొప్పదేని మగువను గొనిపొం
డది యిట్లు సచ్చుచుండఁగ, నెద నొకచట్టుం బొనర్చి యే నెటుసూతున్. ౧౭

క. అనిపల్కెఁ; బదంపడి యీ, వనితం గొని యింటి కేగవలెనని మీరల్
పనుతురె యంటి నిసీ! య, ట్లను కట్టిఁడి కాఁడు వైద్యుఁ డనెనెచ్చెలియుణ్. ౧౮

వ. మఱియు నతఁడు మీరు నా కాఁక సెప్ప కుందురేని యొపినంతవట్టు మాఁజంట
కస్తూరిబాయి కెల్లయుడిగంబులు సేయు – వెనుకదిగులు మాని మీ రిల్లుసేర
వచ్చు – సామాన్యమగు నీపల్కు మీ కంగీకార్యంబు కాదేని మీరు మీ
యిల్లాలి నిచటినుండి తరలింపఁ దగునని చెప్పకతప్పదనియె – నపుడు నాచెంతం
గల నాబిడ్డయు వెజ్జుమాట నీకొనఁడయ్యె – నంత నేను పసివాళ్ళపాలై జాలి
గూర్చు నర్థాంగిని డాసితి – నపు డామె కెట్టివేసటయేని రారాదని యెఱుం
గుదుఁ – గాని యీతిండిమార్పుం దేటపఱుచుట పాడియని నమ్మి యామిష
చికిత్స కేమందు వన నాపె తనదిట్టతనంబు నావిష్కరించుచు ౧౯

ఆ. మాంసరసము నొల్ల మద్యంబు నొల్ల మత్, పూర్వజనన సుకృతపుంజ మధుర
ఫలముగాఁగ నేఁడు పడసిన మానవి, కాయ మావిలంబు సేయనొల్ల. ౨౦

క. నీచాన్నంబుల నిల్చిన, యీచెన్నఁటిమేను మోయ నాసక్తిపడన్
నీచేతులలోఁ జచ్చిన, నాచరితార్థత జగజ్జనస్తవ్య మగున్. ౨౧

క. అనుటయు నామత మిటఁ గై, కొనఁ బనిలేదమ్మ నీకు గోరమ్మలలో
మనమెఱిఁగినహిందువు లీ, కొనరే పెక్కండ్రు పొలసుకూటికి నంటీ. ౨౨

గీ. ఎంతసెప్పిననేమి నాయింతి తనదు, పట్టువిడదయ్యె న న్నాసుపత్రినుండి
యాశ్రమక్షోణికిం జేర్పుఁ డనియె నవుడు, డిల్లపడి నాదుడెందంబు జల్లుమనియె.

క. తుదకుం దిరపడి మెలఁతం, గదలింపఁ దొడంగి వెజ్జకడకుం జని చే
రెద మింటికి నిఁక మాకున్, ముదల నొసఁగుఁ డంటి వినయముగ్ధత వెలయన్. ౨౪

క. ఆతఁడు నిప్పులుక్రక్కుచు, ఘాతుకమూర్ధన్య! యిట్టి కష్టస్థితిలో
ల్లోఁతు లెఱుంగనిసతి కీ, నీతులు బోధింప సిగ్గు నెగయదె నీకున్. ౨౬

క. ఏపాటి క్రందునకునే, నోపద యీాయబల దారి నొడుదుడుకులలోఁ
బాపము! కస్తూరికి మఱ, గాపత్తి ఘటిల్లవచ్చు నరయుము తాల్మిన్. ౨౬

క. వల దీ హఠయోగము నా, పలుకు న్వినవేని తగినఫల మది యొదవున్
నిలయంబు కాలునప్పుడు, జలమునకున్ బావిదీయ శ్రమ రిత్తయగున్. ౨౭

ఆ. మాంససార మొసఁగ మైరేయ మీఁగ మీ, రొప్పకున్న రాత్రి యొక్కఁడేని
మద్గృహమ్మునందు మగువను నిల్ప నా, గుండె చాఁదనుచుఁ గొంకెఁ దుదకు.

వ. పదంపడి డోలీమున్నగు సాధనంబులతో నైదాఱుగురు పొగబండికడకు రావలయునని మున్ముందు వెస్టునకు వార్తనంపి కస్తూరి నొకనరశకటంబు నెక్కించి ధూమశకటఘట్టంబునకు వెడలితి - నది కడుదవ్వునం దుండె-నపుడు వానయుం గురియసాగె - నిట్టి దారుణావస్థయం దమ్మగువయ నాకు ధైర్యమ్ము గఱపుచు

క. నా కేమియు నలసట లే, దేకీడును రాదు మీరు హృదయస్థితి న
వ్యాకులితంబు నొనర్పుఁడు, లోకేశుఁడు కలఁడు లగ్గులున్ జగ్గులిడన్. 30

వ. ఇట్టిమాట లాడి నన్ను విస్మితుం గావించెఁ - గేవలశల్యావశిష్టయగు నాపె నేన ఘట్టవేదికం జేతులపై మోసితెచ్చి పెట్టియం జేర్చితి - ఫినిక్సునందు డోలీ సిద్ధముగానుండెఁ - గస్తూరి యలంతంబడక యాశ్రమప్రవేశ మొనరించె-నంత 3౧

క. జలవైద్యము సాగించితి, మెలమెల్లన కోలుకొనియె మెలఁతుక; చింతల్
తొలఁగెఁ గదా యనుకొంటిని, వెలఁదిన్ బ్రదికించుకొన్నవీరుఁడ నైతిన్. 3౨

క. ఆమిషము నంటరా దను, మామొండితనం బెఱింగి మము సవరింపన్
స్వామి యొకఁ డపుడు కరుణా, ధాముం డయి మావసించుధరణికి వచ్చెన్. 33

క. పలలంబు దింట తగునని, పలుకుచు మనుధర్మశాస్త్రి పంక్తులు చదివెఁ
జెలికడఁ దగ వీనుడు లని, తెలిసియు వాక్రివ్వనిచ్చితిని వినయమునన్. 3౪

గీ. మనువుప లేఁకమితోఁడ్పడు మాంస ముచిత, భోజనం బనిచెప్పి నాబుద్ధి మార్ప
మున్నెకంటిమనుస్మృతినున్న తెఱఁగు, నదియుఁబ్రక్షిప్తమనికొందఱనుటవింటి. 3౫

క. ప్రక్షిప్తము కాకున్నను, భక్షణ మిదిపాత్ర మిది యపాత్రం బని సం
వీక్షించి నిర్ణయింపఁగ, దక్షుండను నే నిటన్ స్వతంత్రుఁడ నందున్. 3౬

వ. కస్తూరిబాయి చదువుసందె తెలుంగనిచేల - పితృపితామహ పరిపాలితంబగు నాచరణంబ యామెకుఁ బరిగ్రాహ్యము - నిశ్చలంబగు నాపెవిశ్వాస మెవ్వరుం దాఱుమాఱు సేయఁ జాలరు - కాన నామె యామస్కరిం జూచి 3౭

ఆ. ఎన్నినాళ్లు మీర లెంతబోధించినఁ, బలల మాశ్రయించి బ్రదుకనొల్ల
దయదలంచి నన్నుఁ దలమేరుపాల్సేయ, కొండు దెసకు సాగు టొప్పు ననియె. 3౮

౨౯. ఇంటి సత్యాగ్రహము

వ. వేయితొమ్మనూటయెనిమిదవయేట మొట్టమొదలుగాఁ జెఱసాలకాఁపురంబు నాపాలి దాయె - నందు బందాలు తలఁదాల్పంవగిన కట్టడలం బరికింప నయ్యవి సంయమి యగువాఁ డిచ్చమైఁ బాటింపవలసిన కట్టుపాటులం బురుడించునని యెఱిఁగితి - నెట్టులన ౧

క. ఏ నెట్టులఁ దోలుతఱిన్, బోనము పెట్టెదరు నల్లపొడమానిసికిన్
దేసీ రోసంగ రుప్పిఁడి, గా నేర్తురు కూర లచటఁగల యధికారుల్. ౨

ఆ. ఉప్పుఁజేర్చి కూర నుప్పఁడు సంబారు, కార మిందు దానఁగలిపికొందు
మనుడు మీరు విందు లారగింపఁగ వచ్చి, నారె యనుచు వెజ్జ నన్నుఁ బలికె. ౩

క. వలసిన లవణము నిత్తుము, కలిపికొనుఁడు కూరలందుఁ; గారములేమిన్
దొలఁగదు తిన్నన యనియుం, బలికెను దుద కించుకంత పాకముమార్చెన్. ౪

క. ఉప్పుం గారము లేమిడి, యొప్పగు సంయమికిఁ గాని యొకఁ డాజ్ఞయిడన్
దప్పనిసరియై నేమము, నొప్పుకొనుటఁజేసి వాసియొదవదు లవమున్. ౫

గీ. వలచి పాటించునియమంబె ఫలము నించుఁ, గానఁ జెఱవీడినంతన కమలమిత్రుఁ
డస్తగిరిఁ జేరుటకుముందె యారగింప, మొదలుకొంటిని దేనీరు ముట్టనైతి. ౬

వ, నేఁడు నా కీనిర్ణయంబులు రెండును సాజంబు లాయె - నపుడు లవణముం దిన కుంట లెస్స యనియు, దుర్బలులు పప్పునుసైత ముజ్జగింపఁదగు ననియుఁ గొన్ని గ్రంథములఁ దెలిసికొంటిఁ - గాని నాకెంతయుం బ్రియములగు నీరెండుపదార్థముల నానాఁడు విడువఁజాలనైతి - నిట్లుండ ౭

గీ. గరితరోగమ్ము క్రమ్మఱిఁ దిరుగఁబెట్టె, సాయపడదయ్యె నపుడు నా జలచికిత్స
యుప్పుఁ బప్పును వర్జించు టురవటంచు, మొలఁతకుం జెప్పితిని గాని మెచ్చదామె.

ఆ. వైద్యుఁ డెవ్వఁడేని వలదని సెప్పెచో, వీనిఁ దినుట మీరు మానఁగలరె
యేమిధర్మమయ్య! యిది యని యిల్లాలు, పంతగింప నాకు వంతయొదవె. ౯

క. వెనువెంటన మ త్ప్రేమము, వనితకు నెఱిఁగించునదను వచ్చెఁగదా యం
చెనలేని సంతసంబును, గనఁగల్గితి నపుడు వెలఁదుకకు నిట్లంటిన్. ౧౦

క. ఓడెదవు నీవు వెజ్జాకఁ, డాడం బనియేమి యిపుడె యావస్తువులన్
వీడితి నీనియమం బాక, యేడాది పరిగ్రహింతు నీ వెటులున్నన్. ౧౧

వ, అనుటయుం గస్తూరి మిగులఁ బరితప్తయై స్వామీ! నాతప్పు మన్నింపుఁడు - మీహృదయం బెఱింగినదాన నయ్యు వాగ్ఘోషంబు గావించితి - నుప్పుపప్పు లే

నీక నంటనొల్ల - మీశపథంబు నుపసంహరింపుఁడు - నాదెస నింతపట్టుదల పాటింపకుఁ - డని వేఁడ నాపై నూఱడింపఁ దొడంగి ౧౨

క. నీ వీరెంటిని వదలినఁ, గావలసినయంతలగ్గు కల్గును నీకున్
నావెల్వరించు బాసను, దోవ నోడంబడ నెఱుంగుదువు నాతెఱఁగున్. ౧౩

క. నాకున్ మేలిడు నియ్యది, యాఁకట్టకు మింక నన్ను నబలా! యిపు డీ
వీకొన్నపనికి నా యీ, పోకయుఁ దోడగును వగను బూనకు మాత్మన్. ౧౪

క. ఏ నిట్లుపల్కఁ బెంకెల, లోనన్ సడిసన్న పెంకెలు గదయ్యా! మీ
రేనాఁడు పరులపల్కన, కొనంటి రటంచు నింతి యక్కథ వదలెన్. ౧౫

వ. ఈమార్పు సత్యాగ్రహమునం దొకపాలని నాతలంపు - నామనుగడం బాటిల్లిన యుత్తమఘటనలం దిదియు నొక్కఁడుగా గుర్తింతుఁ - దిండిమార్పునంజేసి యొండె లాఁతినేమమ్ముల నొండెఁ గస్తూరిబాయి రోగవిముక్త యయ్యె - నుప్పు వప్పులం దినమి నాయారోగ్యంబును బుట్టినందె - విసర్జించినపదంపడి వీనిం దినవలయు నన్నకోర్కి - నాయుల్లమునం బొడమదాయె - మఱియు నిప్పరివర్తనంబు కతన నాకునింద్రియశాంతియు సంయమప్రీతియు విస్తరిల్లెఁ - గాన వత్సరంబు కడచన్నను నిషేధంబు నట్ల యుంచితి - నిది దరిదాపు దశవర్షంబులు సాగె - నీనడుమ సీమలో నొక్కసారి యీనిగ్రహంబు చెడుటకును భారతదేశమ్ము చేరిన పిదప దీనిం ద్యజించుటకును గలహేతువులు మున్ముందు తేటపఱుతు - భోగులకుం గాక బ్రహ్మచారుల కీవస్తువులు తగవని పల్మాఱు సెప్పనొర్తు. ౧౬

***

౩౦ సంయమము

క. ఇంతకుమును కస్తూరీ, కాంతను బ్రాపించు తెగులు కారణముగ నొ
క్కింత మదంధస్సున నవ, రింత జరిగె నంచు వెలువరించినవాఁడన్. ౧

క. నా తాల్చిన సంయామము, హేతువుగాఁ గొన్నిమార్పు లేర్పడె ధర్మ
ప్రీతులు కొందఱు వ్రాసిన, వ్రాఁతలు గని నేఁడు పాలు వల దనుకొంటిన్. ౨

గీ. ఎఱుఁగుదు నన్నను దుగ్ధంబు మరగువాని, కింద్రియవికారములుతద్ద హెచ్చుననియు
మేనిపెనుపునకుం బాలు లేనినాఁడు, కొదవ యావంతయేని చేకూర దనియు. 3

ఆ. బ్రహ్మచర్యదీక్షఁ బాటించునంతకుఁ, బాల నుక్కఁబట్టఁ జాలనైతి
నలఁతికర్జమా పయస్సును వైళంబ, వదలుకొంట యెట్టివారికేని. ౪

ఆ. ఇంద్రియాలి నోర్వ నీచాగ మెంతయు, వలయు నన్నబుద్ధి బలియు వేళ
పాల నెలవాత లాజంతువ్రుల నేఁచు, గతిని జాటుపుస్తకములు డిగ్గ. ౫

వ. ఈరచనల యాగానులంగూర్చి కేలన్ బేకుతోఁ జర్చసల్పితి - నితనిచెల్మి నా
కనాయాసమ్ముగా నబ్బె - నది యేర్పడ్డనాఁ డితనిరాచవెచ్చముం జూచి యే
నదరిపోవువాఁడ - మా మొదటిచేరికయందు యితఁడు ధర్మతత్త్వముంగూర్చి న
న్నడిగె. నాఁటిచర్చలో బుద్ధభగవానుని యౌదార్యము లెస్స కొనియాడంబడియె-
నదిసుత మామైత్రి విరియఁజాగె - రానురా నస్మత్కార్యంబు లెల్ల నతని
కృత్యంబు లాయె - నేకాంగిగా నెలకుఁ బండ్రెండువందలరూకలు వెచ్చించు
నిచ్చెలికాఁడు నూటయిర్వదితోన యిలుదీర్చుకొననేర్చెఁ - గారాగృహావాసమ్ము
వీడి యేను వచ్చినవెన్క నిద్దఱ మొకయింటనే యుండి యల్పవెచ్చముతో
బ్రదుకుసాగించితిమి - మా కీ క్షీరవిచార మానాఁడ సంధిల్లె - నతఁ డప్పుడు ౬

క. పా లింత చెట్టసర కని, తేలినతరువాత వీని దిగఁద్రావఁగ జం
కేలా దుగ్ధము వదలిన, నేలోపము వచ్చు? నెచ్చెలీ! యని పల్కెన్, ౭

క. అక్కజపడి యే నాతని, వక్కణ మెచ్చితిఁ బయస్సు వదలితి మపుడే
యిక్కథ ముగిసినపిమ్మట, మక్కువ చేసితిమి పండ్లు మరగి సుఖింపన్. ౮

గీ. కటికిపేదలమై బ్రదుకంగవలయు, నన్న యాకాంక్ష మాకుఁ బైకొన్నకతన
వేఱుసెనగలాదిగఁ బెచ్చువిలువలేని, బండములఁదింట కలవాటుపడితి మపుడు. ౯

ఆ. ఓగిరంపుమార్పు లుపవాసములు బ్రహ్మ, చర్యమునకు లగ్గసలుపుఁ గాని
యొడఁద కసటుగుంటవడుపున నున్నంత, వట్టి వట్టివారు వాసిగనరు. ౧౦

క. అపవిత్రమైన చిత్తం, బుపవాసముకతన శుద్ధినొందదు భగవ
జ్జపమునఁ జర్చల నాతని, కృపాప్తి నది ధౌతమై రహింగనఁ జాలున్. ౧౧

క. ఎదకున్ మేనికి బాంధవ, మది యెంతయుఁగలదు దుష్టమగు మానసముం
బొదిగొను దురన్నవాంఛలు, వదలవు భోగేచ్ఛ లనపవార్యము లగుచున్. ౧౨

వ. ఆరగించుపదార్థములయు ననుభవించు భోగములయుం బ్రభావంబు చిత్తముపైఁ
బడుట తప్పదు - కాన నుపాసంబులును భోజనసంయామమును వలయునని
తలంతు - వికృతమైనమానసంబు శరీరేంద్రియములకు బానిసయగుంగాని వాని
బాలింపఁజాలదు - కావుటం జేసియుఁ దిండిపట్ల నొకనేమంబు పరిగ్రాహ్యము
వాఁడగు - నాతిండియు గరగరయై రజస్తమశ్శతువైవై యుంటయావశ్యకంబు.

***

౩౧ ఉపవాసము

క. క్షీరాదులు వదలి ఫలా, హారమ్మున బ్రదుకువేళ యమమును బడయం
గోరి తినకుండ నుంటయుఁ, బ్రారంభించితిని 'బేకు' బాసటగాఁగన్. ౧

గీ. వైష్ణవకుటుంబమునఁ బుట్టువాఁడ నగుట, సంతతవ్రతనిరత మజ్జనని యగుటఁ
దొల్లి హరివాసరవ్రతాదులు భరించి, నాఁడుఁగాని విశ్వాస మానాఁడు సున్న. ౨

ఆ. నేఁడు బ్రహ్మచర్యనిష్ఠకు నుపవస్త, మొదవుననన్న బుద్ధి కుదిరియుంట
నియ్యకొంటిఁ బస్తు; లేకాదసుల నీర, మొక్కదానిఁ గ్రోలు హక్కుతోడ. ౩

వ. నిరశనవ్రతం బిది మొదలుకొన్నయంతన శ్రావణమాసమ్ము వచ్చె - నపుడ రంజానుపర్వంబును సమకూడె - మాకుటుంబము వైష్ణవధర్మములోని దయ్యు శైవమును సైత మాదరించుఁ - గాన నీశ్రావణంబునం దేను నక్తంబులకుఁ గడంగితి - నది సత్యాగ్రహంబు సాగుచున్నకాలము - కానఁ జెఱకేగినవారి సంసారములు పెక్కు లాశ్రమమునందుండె-నందు నానామతంబులవారుం గలరు- స్వధర్మారాధనసేయుచుం బరధర్మమునకుఁ దోడ్పడవలయునన్న యాశ్రమనియమ మొక్కండు కలదు-కాన రంజానుపాసములు పాటింపుఁడని ముసల్మానులకుఱ్ఱల కుత్సాహంబు నొదవించితి - వారు నాపల్కు మన్నింప హిందూక్రైస్తవులు వీరిమాపటితిండి వండి యీఁజాగిరి - దీనఁ బరస్పగానుభాగ మతిశయించె - నుపవాసమహిమ మెల్లరకుం దెల్లయయ్యె - మఱియు

గీ. ఆశ్రమంబునఁ దిరపడినట్టివారి, కూటికిం గట్టుపాటులు కొన్నియుంట
నాఁక పెట్టక నాపన్వు నాదరించి, యెల్లవారును డిగఁద్రావి రెఱచితిండి. ౫

క. రంజానునందుసైతము, నంజుడు దెస కింతచనక నలఁగక మలకల్
మంజులతం జూపిరి నను, రంజించిరి వీరి మది మఱాక నుతింతున్. ౬

క. రుచులూరు వంటకమ్ముల, నుచితమ్ములఁ దీర్చి వీరి కొసఁగుచు మైత్రిన్
బ్రచురించి హైందవార్భక, నిచయం బానాడు నాకు నివ్వెఱగూర్చెన్. ౭

వ. నా పాటించు నొపవస్తముంగూర్చి సెప్పుచుం జెప్పుచు నిచ్చమై విషయాంతరంబు నావిష్కరించితి - నింపితంబగు నియ్యదంతము నిచటన పేర్కొంట తగు - నగునని కావించు నా యెల్ల చేతల కనుయాయులం గొందఱ గడించుకొంట నా కలవాటు - నేఁటిసహచరు లుపవాసాదు లెఱుంగరు - కాన నేదో పండువు నెపమ్మున వారి నాదారికిం జేర్చితి - ని ట్లాశ్రమంబున సంయామలక్షణం బేర్పడఁ దొడంగె - నందలివారు మ మ్మనుకరించుచుఁ బస్తులకు నొంటికుడుపులకు మెల్ల

మెల్లన ప్రియపడంజాగిరి – పీనికతన వారికిం జేకుఱినమే లిట్టిదని గట్టిగా నుడువం జాలఁ – గాని నాకు సంయమశక్తియు నారోగ్యముం గుదిరె – నిప్పస్తు లెల్ల రకుం బాగునొదవించునని తలంపనేర – నేలయన ౮

క. మన సింద్రియ విజయముదెస, ననురక్తం బైననాఁడ యనశనదీక్షల్
పనిసేయుఁగాని కేవల, తనూపవాసమున విషయిదర్పం బఱునే. ౯

శ్లో. "విషయా వినివర్తంతే, నిరాహారస్య దేహినః
రసవర్జం రసోఽప్యస్య, పరం దృష్ట్వా నివర్తతే."

వ. అను గీతాశ్లోక మిచట విచార్యంబగు – నింద్రియ దమనమ్ము వలచువాని కుపవాసాదినియమమ్ములు వలయుఁ – గాని మేనితోపాటు చిత్తంబు పస్తుండదేని దాన లగ్గులేమియకాక యెగ్గుసైతము వాటిల్లు ననుట యొప్పు. ౧౦

***

౩౨ అయ్యవారు

ఆ. చదువునేర్పఁదగిన శాబకుల్ బాలిక, లాశ్రమమునఁ బెక్కు రమణియుంట
నచటఁ బిత్రుపదమ్మునం దున్నవాఁడ నే, నగుట వీరిలెస్స యరయవలసె. ౧

గీ. అయ్యవారిని రావింప నాశ్రమమున, కేమిసంపత్తి కల? దది యెట్టులున్న
నేఁటివిద్యావిధానంబు నేర్పు తెలివి, నాకు సంతృప్తిజనకంబు గాకపోయె. ౨

వ. కాని సముచితవిద్య నాయనుభూతిలోనిది కాదయ్యెఁ – బితరులు తగువారై కుఱ్ఱల దిద్దుదురే నదియ యాదర్శవిద్యావిధానంబు నాఁజను – నిందేని బాహిరంబగు తోడ్పాటు కొంతవలయుఁ – గాని యీబిడ్డలు పిన్నటనాఁటినుండియు నాదండలేమియకాక భిన్నభిన్నమతములలో వేఱువేఱు సంస్కృతులలోఁ బైకి వచ్చిరి – వీరికి నాజనకస్థాన మెంతయుపకరించు? – విద్యా బోధనమునఁ జిత్త సంస్కారము ముఖ్యమని నాతలంపు – దీని నేయీడులో నేయలవాటులలో నున్న వారికేనిం గఱపుట సుకరంబ – దీనికి సద్వర్తన మాధార–మీయందరువు గట్టిదైన నితరాంశము లక్కఱయైనపు డనాయాసవేద్యంబు లగుఁ – గాన సర్వదా యే నీబుడుతలలో నప్పంబలె మెలంగుచుంటి – వెండియు ౩

ఆ. శబ్దశుద్ధి నెఱిఁగి చక్కఁ బఠించుట, వ్రాయుటయును గొంతవలయుఁ గాన
దీని నేర్పుపొంటె దేశాయి కేలను, బేకు లొప్పుకొసిరి పేర్మినింపి. ౪

గీ. చదువునకుఁ దోడు దేహశిక్షణము గఱపు, టక్కఱయు కాని మలమెత్తుటదితోడంగి
వంటకమ్ములు సవరింతవఱకు మేము, కర్తలము కాన వేఱ యీకష్ట మేల? ౫

క. ఫలవృక్షము లెన్నేనియుఁ, గల వాశ్రమభూమి పీనికర్జము ప్రూనన్
వలఁతులగు సేవకులు లే, రెలమిన్ మాపిన్నపెద్దలే దిద్దవలెన్. ౬

ఆ. మాలితనము నేర్చి కేలను పాటలు, పాడుచుం గదల్చుఁ బాదుపాదు
చెట్టుచెట్టుకడకుఁ జినచిన్నకాల్వలు, త్రవ్వ నేతమెత్తు నొవ్వలేక. ౭

ఆ. పనికిరానిచెట్లు పడఁగొట్టి తోడుగుల, సీడ్చుచుండ్రి పిన్న లూడ్చుచుండ్రి
కేళ్లివాటి నారుమళ్లకు మడవలు, మార్చుచుండ్రి బోదె తీర్చుచుండ్రి. ౮

క. పిడితాళ్లవోలెఁ జిఱుతల, యొడళ్లు నానాఁడు బిగియుచుండెను దీనన్
బడిలో వెండియు వేసట, పడయం బనిలేకపోయెఁ బసివారలకున్. ౯

ఆ. తోఁటపనియుంటగరగరతోయముంట,మడుఁగుఁదెమ్మెరయుంట నెమ్మదియునుంట
దిండి కొకనేమ ముంట నే తెగులులేక, మనిరి సంతృప్తిగని రాశ్రమమునవారు.

క. ఒక్కొకతఱిఁ గొందఱు పని, తక్కుదు రర్భకులు కొంటెతనములు చూపన్
నిక్కుదు రైనను మెల్లన. నొక్కుచు సవరించినాఁడ నొవ్వక వీరిన్. ౧౧

క. ఏదేని చేతిపని యొకఁ, డాదరువుగ నుంట వలయునని బిడ్డలకున్
బాదువులు కుట్టుచందము, లేఁదెల్పితి బేకునేర్పె సీకళ నాకున్. ౧౨

గీ. అతఁడు వడ్రింగమును నేర్పె నర్భకులకుఁ,గఱపె నొకరుండు పాకప్రకార మెల్లఁ
బాప లేనాఁడుఁ దలఁపనిపనులు నేర్చి, తెలివునందిరి నాకును దృష్టివోడమె. ౧౩

క. తనచేయనికర్జము కు, ఱ్ఱనికిన్ దేశికుఁడు చెప్పరా దనుచట్టం
బానర్రించితి మట్లగుటన్, నినుపాఠినవేడ్కఁ బనులు నేర్చిరి శిష్యుల్. ౧౪

***

౩౩ అక్షరజ్ఞానము

ఆ. చేతిపనులు కొన్ని చిన్నలకున్ మప్పి, వాసిగంటిఁ గాని బాసనేర్ప
మిగుల నిడుమవడితిఁ దగుశక్తిలేక వి, శ్రాంతిలేక కరణసమితిలేక. ౧

ఆ. పవలు రెండుజాలు పనిచేసిచేసి వే, సారి విరతినందఁ గోరు వేళఁ
జదువుసెప్పవలయు సందడిగావించు, నిదుర నాఁపవలయు నెటి వెలార్చి, ౨

వ. బాలురకు వారితల్లిబాసయందు చదువు సెప్పవలయు ననునేమంబు మాకుఁ గలదు – కాన నుర్దూ హిందీ ఘూర్జరీ తమిళములఁ బాఠములుసెప్పుచు హిందీ యింగ్లీషుల సాధారణభాషలుగా నేర్పుచుంటిమి – హిందీ గుజ్జరిబాసలవారికి సంస్కృతముసైతము బోధించితిమి – చరిత్ర గణిత భూగోళవిషయము లెల్లర కుపదేశింపఁ బడుచుండె – నుర్దూ తమిళములం గఱపుట నాపాలిపని యయ్యె – నేని రెండుబాసల నోడలలోఁ జెఱసాలలలో నించించుక నేర్చితి – ఘూర్జరీ సంస్కృతము లున్నతపాఠశాలలోఁ జదివితి – నా పాండిత్యము లీదృశంబుల– కాని

గీ. దేశభాషలపై నాకుఁ దీపియుంటఁ, గావ్యములు సెప్పనేర్పు నాపాలి దగుట
శిష్యులేమియు నెఱుఁగనిచిన్నలగుట, సాధువులు నోట నాబండి సాగిపోయె. ౪

క. చట్టులకడ నాయెఱుఁగమి, నెట్టట్టో మఱువుసేయ కిది రాదనుచున్
బట్టబయలుచేసితిఁ గ, న్నట్టిద బోధించి వారి యాదృతిఁ గంటిన్. ౫

గీ. కుఱ్ఱలకుఁ దద్దయుంజెట్ట కూరఁజేయు, సోమరితనంబు నడఁగింపఁ జూచినాఁడ
నాసపడి పాత్రముల్ తమయంతఁ దాము, చదువుకొనునట్లు దిద్దితి శాబకులను. ౬

క. ఎలయుం బఠనీయము లను, కలకల మెల్లెడల మొరయుఁ గానీ! చదువున్
వలచెడివానికి నొజ్జయు, వెలగలపాఠ్యం బటంచు వినుపఁగనోర్తున్. ౭

క. నాయొజ్జ పుస్తకమ్ముల, సాయంబున నేర్పినట్టిచదువున ముక్కా-
లేయెడకో చనె విడిగా, నేయది బోధించె దాని నిపుడున్ మఱవన్. ౮

గీ. నేత్రమున బాలకులు నేర్చునేర్మికంటె, శ్రోత్రమున లెస్సయెఱుక నేర్చుటయథార్థ
మగుటఁబఠనీయపుస్తమెయ్యదియునాఁడు, చదువదామూలచూడమ్ముఛాత్రజనముఁ.

క. నానావిధపాఠ్యంబుల, నే నించించుక వఠించి యిందలిసారం
బానాఁడు నాదుపల్కునఁ, గూనల కందించి తెలివికూరుటఁ గంటిన్. ౧౦

క. విన్నది విన్నట్టులు నా, సన్నిధి వివరింత్రుగాని చదివినదానిన్
దిన్నగ వక్కాణింపరు, పిన్నలు మది నిల్వ విట్లుపెనఁచినవిద్యల్. ౧౧

ఆ. అలఁతలేనిపూఁట నాడుచుం బాడుచు, సరసఫణితి నేను గఱపుమాట
వీను లొగ్గియొగ్గి విందు రాచిత్యమ్ము, నెఱిఁగి మురియుచుంద్రు చిఱుతవాండ్రు.

***

౩౮ ఆత్మశిక్ష

గీ. కడఁకమై నాశ్రమస్థులౌ బుడుతవాండ్రు, మేనికిని దండమున కింత మెఱుగుపెట్టఁ
జాలితిసిగాని యాత్మకు మేలివెల్గు, చేకుఱుంజేయ మిగుల నోలాకుపడితి. ౧

క. తనపాటించెడిమత మే, మనిపల్కుఁ దదీయతత్త్వ మది యెది యంచున్
మనుజుండు తరిచి సత్యము, గనవలయుంగానఁ గొండికల కీతెలివిన్. ౨

వ. నాయెఱింగినంతకఱపుటంజేసి వారు తమతమధర్మంబులపట్ల సామాన్యజ్ఞాన మార్జించిరి - కాని యిది మానసికశిక్షయం దొకపాల యని నాతలంపు - మఱి మేలినడక నలవరించుటయు నీశ్వరతత్త్వ మెఱిఁగించుటయు నాత్మజ్ఞాన మాపాదించుటయు నాత్మశిక్ష నాఁ జను-నియ్యెఱుకువ నొదవింపఁ బెద్దలు కుఱ్ఱల కెంతయుం దోడ్పడవలయు-నీ తెలివితక్కఁ దక్కెల్ల తెలువులుం గొఱగానివనియుఁ బైపెచ్చరిష్టదాయ

కంబు లనియు నాయాశయంబు – సన్న్యసించిననాఁడ మానవున కాత్మజ్ఞాన మేర్పడునని కొంద అందురు – కాని తురీయాశ్రమంబుదనుక నెవ్వఁడీయమూల్యసంపదకు దవ్వుగా నుండు నతఁడు దీనిం గనలేనివాఁ డగుటయకాక రెండవ కొండొకతనంబు నాఁ దనరి కరుణాజనకంబగు వార్ధకమునం జిక్కి నేలకు వ్రేగగు నంట సముచితంబు – వెండియు నాత్మశిక్షావిధాన మెద్దియని యెంచియెంచి తొలుతొల్తఁ గుఱ్ఱలచే భజనచేయించితి – నీతిరచనలు వారికి వినిపించితిఁ – గాని నా కీపథంబు సంతృప్తి నొసఁగదయ్యె. ౩

క. పుస్తకముకతన నాత్మిక, శస్త్రోన్నతి సంతరింపఁ జాలఁడు గురుఁ డన్
వాస్తవ మెఱిఁగితిఁ గుఱ్ఱల, నేస్తము నా కనుదినంబు నెగడినకొలఁదిన్. ౪

క. నిజవర్తనమున శిష్యు, వ్రజమున కీశిక్ష నొసఁగవలయును గురుఁ డా
ప్రజ దవ్వుల నున్నను దా, నజస్రజాగర్య నుండనగు శీలమునన్. ౫

క. సౌశీల్యనిధానం బగు, దేశికుఁ డేదీవులందుఁ దిరుగుచునున్నన్
దా శిష్యుల కాత్మబల, ప్రాశస్త్యము పంచి సాయపడనోర్చు నిటన్. ౬

క. ఇసుమంతయు జంకక యే, నసత్యముల నాడుతఱి మ దంతేవాసుల్
వసపడుదురె సూనృతమున, కసాధువులశిష్యు లెట్టులగుదురు సాధుల్. ౭

వ. దీనంజేసి నాసన్నిధినుండు యువతీయువలమ్రోల నేన యొక పదార్థపాఠముఁగాఁ బరిణామ మందవలయు ననుసత్యం బెఱింగితి – నిందు మచ్ఛాత్రులే నాకొజ్ఞలెరి – వీరికొఱకేని యే నచ్ఛశీలుండనై నాసౌజన్యముం బరిరక్షించు కొంట యావశ్యకంబని కంటి – నీ టాలుస్టాయి యాశ్రమంబునఁ బాటించిన మదీయమ్ములు నానావిధనిగ్రహమ్ము లీశిష్యు లొనరించినయుపకృతి నృలవఁజాలవు – మఱియునిందు

క. అల్లరి కాచార్యుండగు, పిల్లఁడు కలఁ డొకఁడు సాటిపిన్నల నెపుడున్
గిల్లి తగవాడు నాతఁడు, కల్లలకుం బుట్టినిల్లుగా మనుచుండున్. ౯

ఆ. ఎంతవారినైన నెదిరించునాతఁ డొ, క్కపు డొనర్చెఁ బెద్దయాగడంబు
కుఱ్ఱవాండ్రపట్లఁ గోపం బెఱుంగని, నాకు నాఁడు కడిఁది కాఁక రేఁగె. ౧౦

క. అతనిం గడిసితిఁ గఱదలు, శతములు సెప్పితిని గాని సరిపడఁ డయ్యెన్
జతురతఁజూపి ననుం దన, మతకంబున కగ్గపఱుప మార్గము లరసెన్. ౧౧

క. ఏచినకిన్కకు లోపడి, వైచితి నొకకఱ్ఱదెబ్బ వానికరముపై
నీచేతలోన నాకు న, హా! చే యననేల యెల్లయొడలును వడఁకెన్. ౧౨

క. నా కంపనగతి యంతయు, నాకుఱ్ఱఁడుఁ జూచియుండు నతఁ డంతఁ గడున్
శోకించుచు ని న్నేఁచిన, నాకుం గరుణింపుమని వినమ్రత మొఱసెన్. ౧౩

ఆ. అతఁడు బలిసి పిన్నయాఁబోతు కైవడి, నుండె నొకటి వేయ రెండు కొట్టఁ
గలఁడు కాని నన్ను నలమినయలమట, కన్నయంత నతనితెన్ను మాతె. ౧౪

క. అతఁ డవ్వల నా కవిధే, యత చూపఁడ కాని వాని నవ్విధి దండా
హతుఁజేత నింతవట్టును, వెతపాలగుచుండు సిగ్గువెంపర గందున్. ౧౫

ఆ. అతనిఁగొట్టి యస్మదాత్మోన్నతిం గాక, చూపినాఁడ నా పశుత్వగరిమఁ
బిన్నవాండ్రఁ బట్టిపీడించి విద్యలు, గఱపు లేనికేని గానిచేత. ౧౬

వ. నా యెల్ల బ్రదుకులో నొక్కమాఱు నాబిడ్డ నొకని మొత్తితిఁ - గాన నేఁ డా విద్యార్థి నట్లు లగుడంబునం జఱచుట యుచితంబని యిందనుక నూఱడిల్లనేర నైతి - నిప్పనికి మూలంబు రోషము - మోఁదుట యుద్దేశము - కాన నిది క్షంతవ్య మెట్లగు? - నిప్పట్లఁ బరితాపముం బ్రకటించుటయ నావిధి - కాని దానితోపాటు దండనముసైత మీకొని యపరాధినైతిఁ - బసివాండ్ర కాత్మజ్ఞాన మొదవింపఁ గడంగి యేన యిట్లుదాని నార్జించుకొంటి. ౧౭

* * *

౩౫ సదసద్యోగము

ఆ. ఆశ్రిమార్గియందు నవగడంబుల కల, వాటుపడ్డ కుఱ్ఱవాండ్రు నుంట
వారితోడ మత్కుమారులు మూగురు, సందుకొంట బేను సైఁపఁడాయె. ౧

క. ఆ కొంటెమూఁక వెన్నడి, మీ కొడుకులు తిరుగ నెట్టి మే లొడఁగూడున్
బోకిరిబిడ్డలు వీరుం, గాకుందురె యంచు హితముగఱపెను నాకున్. ౨

వ. పదంపడి యే సమ్మిత్రుని గని ౩

క. ఆ పిల్లల నా పిల్లల, నేపగిదిన్ వింగడింతు నిరువాఁగుల కే
నే పూఁటకాఁప నైతిని, నా పిల్పున వారువచ్చినా రిచ్చటికిన్. ౪

క. వా రింద నిల్వవలయును, వారలతోడన చరింపవలె నా సుతులున్
వీరికడ మంచియుండిన, వారికి నది యేలపట్టువడదో చెపుమా. ౫

ఆ. వారికంటె గొప్పవారు మీరంచు నా, పిన్నవాండ్రు కిపుడె భిన్నభావ
మడరఁజేత యుక్తమందువా యిది వీర, లెఱిఁగిరేని చెడుదు రింతనిజము. ౬

క. ఆ సంసర్గముకతనన్, నా సుతు లిదిదోష మిదిగుణం బనుచు నిరా
యాసంబునఁ దెలియంగల, రాసింపఁగఁదగిన శిక్షయగు నియ్యదియున్. ౭

క. అటుగాక దీన నేసం, కట మొదవిన సైఁతుఁగాని కటకరినై నేఁ
డిటనుండి వారిఁ దరలిం, చుట కింతయు నియ్యకోలు చూపఁగఁజాలన్. ౮

వ. ఇట్లుపల్కి నతఁడు నిరుత్తరుం డయ్యె - నవ్వల నగ్గడుసువాఁడతోడి నెయ్యంబు నంజేసి నాకొడుకుల కెట్టిచెట్టయుం గలుగమియకాక లగ్గుసైత మాపాదిల్లెనని చెప్ప నొర్తు - వీరి కేము దొడ్డవారమన్న యహంత యావంతయే నేర్పడ్డ నది యీచెలికారంబుకతన మటుమాయ మాయెఁ - దల్లిదండ్రులు కనుగల్గి యుందుర యేని బిడ్డలు చెడ్డవారిం గూడిమాడియుంటఁ గొఱగాములపాలు కారని యీ యనుభూతివలనఁ గంటి - నానాప్రకృతుల బాలికాబాలకుల నొక్కయెడన నిల్పి చదివించుట పితరులయు నొజ్జలయు మెలఁకువ కొకయొరగల్లు - వీరి కిప్పట్ల వేయికన్నులుంట వలయు నందు. ౯

* * *

౩౬ ప్రాయశ్చిత్తము

క. బాలికాబాలకుల మేలిబాట నునిచి, విద్దియలునేర్పి చక్కఁగా దిద్దుటన్న
నంతలంతలతోఁ దీరునట్టిచేఁత, కాదటం చనుభూతిమైఁ గన్నవాఁడ. ౧

వ. ఏను వీరి కాచార్యుఁడనై పాలకుఁడనై యున్ననాఁడు వీరిడెందములం జొర వలయు - నొఁగాములం బాల్గొనఁదగు - జీవనమర్మములం దేటతెల్ల గావింపఁ జనుఁ - గ్రొఱ్ఱువాఱు జవ్వనంపుటెలల మేలిబాటలం బరఁగింపనగు - నది యట్లుండె - సత్యాగ్రహులు కొందఱు బందిగమువీడి వచ్చినపదంపడి టాలుస్టాయి యాశ్రమంబున జనసంఖ్య తగ్గి - నున్నవారిలోఁ బెక్కురు ఫినిక్సువా రగుట వారి నచట్టి కంపి యేను జొహాన్సుబర్గునం దుంటి - న య్యవసరంబున ౨

గీ. ఆశ్రమంబునవా రిద్ద ఱక్కటా! భ, యంకరంబగు పతనంబు నంది రన్న
వార్త చెవిసోఁక నామేను వణఁకె గుండె, లదరె నది నాకు వజ్రప్రహార మయ్యె.

క. నాయస్త్రము సత్యాగ్రహ, మేయెడనే నడఁగిపోక యే విన్నతఁటిన్
నాయుల్లం బీతల్లడ, మీయలజడిపై ల్లెఱుంగ దెరియదు నిట్టుల్. ౪

క. ఎపుడో చెప్పెను గస్తురి, విపరీతము లిట్టి వృద్ధ్భవిలునని పెఱలన్
నెపమెంచక నమ్మెడి చం, దపుమానిసినౌటఁ దద్ధితము వినసైతిన్. ౫

గీ. కదలితి ఫినిక్సునకు జాలిఁ గదురఁజేయు, నాయవస్థను దెలిసికొన్నాఁడు బేకు
వలదు నీ వొంటిమై నేగవలదు నేను, వత్తు నీవెంట నని పట్టువట్టె నతఁడు. ౬

క. పాలితులు సేయుచెట్టకుఁ, బాలకులున్ బాధ్యులన్న పాడిని గంటిన్
దూలక తద్దోషమునకుఁ, జాలినశిక్షను భరింపఁజను ననుకొంటిన్. ౭

వ. ఆపతనమునకుం దగినప్రాయశ్చిత్తము నేన చేసికొన్ననాఁడు పతితులకు నావేదనయుం దమనేరంబును దేటపడి వివేకంబొదవునని తలంచి యేడునాళ్ళ నిరాటులు నాల్గునెలలు వొకపూటయశనంబు లొంటితిండియు సాగింప దీక్షగొంటి - నపుడు బేకు ౮

గీ. నన్ను వారింప యత్నించినాఁడు గాని, పీసమేనియు నాపూన్కి విడువనైతి
నవల నాతోఁ ద్రొక్కుమార్గంబు నతఁడుమెచ్చి, పంతగించెను నాతోడఁ బస్తునెఱప. ౯

క. ఆతని మధురాశయమున, కాతంకము సెప్పఁజాల కగుఁబో మ్మంటిన్
నాతీ రిట్టులు మాఱుట, చేతన్ జేతస్సు శాంతిసేవధి యయ్యెన్. ౧౦

క. నాగుండెల నల్లార్చెడి, వేఁగంతయు సడలెఁ దొలుత విరిసిన కోపో
ద్వేగం బల్లన రూపఱ, నాగఃకర్తల దెసన్ దయార్ద్రుఁడ నైతిన్. ౧౧

వ. ఇదియంతయు దారియంద నిర్ణీతమయ్యె – నంత ఘనిష్ఠనం దడుగువెట్టి వలయు
వార్తల నెఱింగితి – నాపూనిన యుపాసమునంజేసి యందలివారెల్ల రల్లాడిరి –
కాని దాన వారినడవడి చక్కంబడె – దుష్కృతినా నెంతబెడిదమో వారి కప్పు
డవగతంబాయె – విద్యార్థినీ విద్యార్థులతోడ నాకుంగలచెల్మి కడుంగడు గట్టి
పడియె – నియ్యవగడంబు జరిగిన వెనువెంటన యేతదనుబంధమ్ముగా వెండియుం
బదునాల్గునాళ్ళు పస్తుపూనవలసె – దానిఫలం బే నపేక్షించినకంటె నుగ్గడువుగా
నొదవె – నైనను ౧౨

ఆ. శిష్యులాచరించు చెట్టలకెల్లని, ప్పగిది నయ్యవారు పస్తులుంట
వలయునంచు నేను వాకుఁ ద్రివ్వఁ గాని యొ, క్కొక్కతఱి నుపాస మొదవునందు. ౧౩

వ. ఇట్టి ప్రాయశ్చిత్తంబులపట్లఁ దగినప్రాజ్ఞతయు నధికారంబును వలయు – మఱియు
గురుశిష్యుల కొండొరులదెస నిష్కళంకమగు ననురాగబంధము లేనితఱి నంతే
వాసి యొనర్చునేర మాచార్యునుల్లమున కార్తి నొదవింపనిపట్టునఁ జట్టున
కొజ్జపై మన్ననలేనినాఁడు కావించు నుపాసము రిత్తయగుటయ కాక యొకప్పు
డపకృతికిసైతము కారణంబగు – నీపస్తులయెడం గొందఱకు సందియం బుండ
వచ్చుఁ – గాని శిష్యునినేరమునం గొంత కాచార్యుండు ప్రతిభు వనుట పాడి. ౧౪

క. ఈ నిరశనవ్రతంబును, బూనినయపు డేను డస్సిపోవక పనులన్
మానక చేసితిఁ జేయుట, లో నింతయు మందగతికి లోపడనైతిన్. ౧౫

ఆ. ఒంటిపూఁటతిండి కొగ్గినతఱిఁ బండుఁ, గాక వేఱొకండు తాఁకనైతిఁ
బదియునాల్గునాళ్ల పస్తులోఁ గడపటి, కాల మీఁద్వఁ గొంత కష్టపడితి. ౧౬

ఆ. ఉపవసించువార లుదకంబు తద్దయుఁ గ్రోలవలయు నన్న గుట్టెఱుంగ
రామనామజపవిధా మహిమంబేని, నాఁడు తెలిసికొన్నవాఁడఁ గాను. ౧౭

వ. మఱియు నాకడ నొవ్వునోర్చు నేర్మియు నల్పంబ – కాన నియ్యుపవస్తమునఁ
గస్తిపడిచితి – నపుడు నాకుత్తుక పట్టిపోయె – నొడలు శుష్కించె – మాట
బిగువు సడలెఁ – గాని తుట్టతుదివఱకు రామాయణాదు లాలకించితి – నావశ్యక
మ్ములగు కమ్మలు వ్రాయించితిఁ – గర్జంబులు గావించితి. ౧౮

* * *

౩౭ గోకులుం గదియుట

క. పదియుందొమ్మిదివందల, పదునాల్గవయేట నిల్వఁబడియె నహింసా
సదనము మత్సత్యాగ్రహ, కదనం బది దక్షిణాఫ్రికారంగమునన్. ౧

వ. అంత గోకులునిచ్చ ననుసరించి యింగ్లాండువలన మాతృదేశంబుచేర సమకట్టి కస్తురితోడను బేకుతోడను సీమకుఁ బ్రయాణంబుసాగించి నౌకాధికారు లొసంగిన మేలిమేలిసౌకర్యముల ననుభవించుచుఁ గడలిపై నష్టాదశవాసరంబులు గడపితి - నిప్పయనంబునం జాగినవిషయము లొండురెండు వక్తవ్యములు - కేలన్‌బేకునకు దుర్బిణులదెస మక్కువ హెచ్చు నాఁదగు - నతనికడ నప్డు డేడుపౌండ్లు విల్వగల దూరదర్శకయంత్ర మొక్కఁ డుండె - నేను దానిం బురస్కరించుకొని

గీ. నెచ్చెలీ! నిజుపేదలనెఱిని మనము, బ్రదుకుసాగింప నెన్నఁడో ప్రతినపూని
యింతవెలగల పనిముట్ల నిచ్చగింపఁ, జనునె యిదిలేమి నేలోటు సంభవించు ? ౩

క. అనిపల్కుచుఁ బయనంబున, దినదిన మీచర్చ పెంచితిని దుద కొకనాఁ
డనుఁగుం గని మనకిట్టులు, పెనఁగువ సంధిల్లఁజేయుబిస నిద్దానిన్. ౪

క. మున్నీటి కొసఁగఁదగదా, యన్నా ! యేమందు వంటి నతఁ డౌననియెన్
గ్రిన్నన విసరితిఁ గిటికీ, తెన్నున యంత్రింబు నంబుధిం గుదురుకొనన్. ౫

ఆ. వలచి వాడుచున్నవస్తు వీకైవడిఁ, జెడెఁగదా యటన్నచింత సుంత
యెఱుఁగఁడాయెఁ గేల నితనికి నా కిట్టి, యనుభవమ్ము లన్వహమ్ము ప్రిబ్బు. ౬

క. ఇరువురమును సత్యమ్మును, మరగి బ్రిదుకుచుంటి మిట్టిమన్నడకతనన్
బిరబిరఁ గోపాదికములు, దురాశయమ్ములు నలంగి తొలఁగంబాఱున్. ౭

వ. అయ్యవి పాయగిల్లనంతవట్టు నరుండు సత్యముం గనఁజాలఁ డందు-రాగద్వేషాదులున్నమానిసి యుదారుఁడు కావచ్చుఁ - గల్ల లాడక పోవచ్చుఁ - గాని యంతమాత్రిన వానికి శుద్ధసత్యంబు ప్రాప్యంబు కాదని విశ్వసింతు- దాని నభిలషించువాఁడు ద్వంద్వములవలనం దొలఁగియుంట వలయు - వెండియు

ఆ. పస్తులుంట ముగిసి పదినాళ్ళు గడవక, ముంద కడలిపోక మొగియుకతన
నంజినట్టి దఱుగ నావపై నటునిటుఁ, దిరుగ మొదలుకొంటి దినదినమ్ము. ౯

ఆ. ఉక్కు లేమిఁజేసి పిక్కలలోఁ దీపు, లెక్కుడయ్యె నోడ నిట్లునడవ
సీమ నడుగుమోపి జీవరాజున కీ య, వస్థ చెప్పికొంటి వైద్యమణికి. ౧౦

గీ. అతఁడు కొన్నాళ్ళవిడుగర నందవేని, గాళ్ళకుం జేటురాక నిక్కంబ యనియె
నవల జాగర్యపూని యల్పాల్పభుక్తి, నల్లనల్లన గంటి ననామయంబు. ౧౧

వ. అయ్యది యట్లుండె — మాయోడ మదీరా చేరినంతన మహాయుద్ధము సిద్ధము కానున్న దనువార్త మాచెవింబడె — నింగిలీసుకాల్వం బ్రివేశించుతఱి సమర మారబ్ధమై మానావ యచట నిలిచిపోయె — నీటిలో దొంగదారు లేర్పఱుచుటం జేసి మేము పోర్ట్సుమౌత్ (సౌతాంప్టను) చేరుట కొండురెండునాళ్లు తడవయ్యె — నాగస్టు నాల్గవ దివసమ్మున నని సాగె — నాఱవదినమునం దేము సీమ నడుగుపెట్టితిమి. ౧౨

***

3ర పో రి లో నా పా లు

సీ. ఆంగ్లావనికిఁ జేరినంతన గోపాల, కృష్ణుఁ డనామయ శ్రీ గడింప
వలచి ఫ్రాన్సునకేగి తలకొన్న బెడిదంపు, జగడమ్మునకు తన నచ్చటన చిక్కు-
వడియున్నవాఁ డన్నవార్త నాలించి ని, ట్టూర్చి సీమకు నగ్గురూ త్తముండు
వచ్చుట కెన్నాళ్ళువట్టునో యాలోనఁ, గర్తవ్యమేమి యాకలనిపట్ల
గీ. ధర్మ మెయ్యది నాకంచుఁ దలఁచి యచటి, భారతీయుల నందఱఁ జేరఁదీసి
సమరమునఁ దెల్లవారికి శక్తికొలఁది, మనము సాయంబు గావింపఁజను నటంటి.
ఆ. సమ్మతింపరైరి సభ్యు లాంగ్లేయుల, నాదరింపుఁ డన్న నాదునుడికి
బానిసీం(డు మనము ప్రభువులువారలా, దెసకు సాయపడుట పొసఁగ దనిరి. ౨
క. ఱేనికి మూడినరాయిడి, బానిస తనమే లటంచు భావించి పరా
ధీనత నూడ్చుకొనం దగుఁ, గాని యిదే మనిరి వాదకౌశల మడరన్. 3
వ. అప్పటి నానమ్మికంబట్టి వీరివా(క్రుచ్చుపల్కు- లేను లెస్సలని తలంప నోపనైతి — మనకును దెల్లవారికింగల వేఱడము వెగ్గలంబని యేనెఱుంగుదుఁ — గాని మన మింతతక్కువపాటునం బ్రుంగియుంటి. మన్న తెలివి నా కానాఁడు లేదయ్యె — తెల్లరాచఱికి మించుక మంచిదనియు నందలిదొరలు కొందఱు చెట్టలనియు వారి నర్మిలిబలిమిం జేసి చక్కఁబఱుపవచ్చు ననియుఁ దెల్లవారితోడ్పాటున మనము లగ్గువడయం దలఁతుమేని వీరికిం బాటిల్లినయిడుమం గడవఁబెట్టి యవ్వేల మన యిమ్మదప్పుఁ దొలఁగించుకొంట కర్జంబనియు నప్పుడే నరయువాఁడ — నిపుడు వీరిదొరతనంబుదెస నాకు నిచ్చ యావంతయేని లేమి నిక్కంబు — నేఁ డీయేలుబడి కేను బాసటకానొల్ల — నా యిప్పటితలపోఁత లీచేరినచాలికాం(డ కప్పటికి పొటమరించె — నిట్టివారు నాతెన్నుమన్నింతురా? — యట్లయ్యు నాపట్టువదలక
ఆ. బిగిసి తెల్లవారి బెదరించి యొత్తుడు, పాలుచేసి మనవరాలు వడయఁ
గడఁగఁదగ్గ యదను గాదిది కయ్యంబు, నిలుచుదనుక నోర్మినిలుపు వలయు. ౪
క. మనసభ్యత మనయీవియు, మనదూరపుఁజూపు నపుడు మహికిం దెలియున్
మనయున్నతి నందకమును, మనయున్నతి నందనేర్తుమా యని యంటిన్. ౫

ఆ. నన్నుఁ* మెచ్చువారు నామధేయమ్ముల, నోసఁగుఁ డంటి లెస్సయొరయుఁ డంటి
నెల్ల దెసలవారి యెల్లమతమ్ముల, వారిపేర్లు పెక్కు వచ్చిపడియె. ౭

వ. పదంపడి "స్వయంసేవకవృత్తి న్మాఁది బవరమ్మున గాయపడ్డబంటుల కూడెంబు నెఱప నే మాయితంపడి యప్పునికిందగిన దిద్దుపాట్లు వడయ నుబలాటపడుచున్న వార"మని లార్డు కూ్రికునకుం దెలుప నతండు మమ్ముఁగొండాడి మాకొల్వున కియ్యకోలు చూపె - నంత మేటివెజ్జు కేంటలీచెంత నాఱువారమ్ము లే మెను బండ్రి మయ్యాయిసవరింత లెఱింగి తత్పరీక్షలో నెగ్గి కర్నల్ బేకరుకనుసన్నల నరిడి నేర్చితి - మితండ మాకూటువకుం దళవాయి యయ్యె - వెండియు ౮

క. ఏమూఁలఁగన్న నపుడా, సీమను రణకౌతుకంబు చిందుచునుండెన్
క్షేమము గలవారందఱు, సామునమర్మమ్ము లెఱుఁగఁజాగిరి కడఁకన్. ౯

ఆ. మేనిబిగువులేనిచానలు ముదుకండ్రు, మాతృదేశభక్తి మల్లడింపఁ
బోర గాయపడ్డవారికి నోదవెడి, యుడుపు లేర్పరింపఁ దొడఁగి రెలమి. ౧౦

క. అనిసేయు జోదులకు వల, సినదుస్తులు కుట్టి యొసఁగ సిద్ధపడియె లం
డనునగరస్త్రీమండలి, తనరు సరోజినియు నం దుదాత్తపదమునన్. ౧౧

గీ. కత్తిరించిన గుడ్డలకట్ట యొక్కఁ, డావె నాపాలుచేసి మీ రోపినన్ని
కుట్టిపంపుఁ డటంచు నన్గోరె నదియ, మొదటిదివసంబు మానెయ్యమునకు నెల్ల. ౧౨

క. ఆయమ్మకోర్కె మెచ్చితి, నా యనుఁగుంజెలులఁ గూడి నాడెము వెలయన్
రేయుం బవలుం బడి పలు, తోయమ్ములఁ దీర్చఁగంటి దుఱమునదుస్తుల్. ౧౩

* * *

౩౯ ధ ర్మ సం దే హ ము

సీ. తోడరునేడఁ దెల్లవారికిం దోడునిల్వ, నడుముగట్టిన నానేఁటినడత నెఱిఁగి
యిది యహింసకు నగ్గమై బ్రదుకునీకుఁ, దగునొకో యని పోలక్కు తంతినంపె. ౧

గీ. మున్ను హిందూస్వరాజ్య మటన్నపేర, నా రచించినపొత్తములో రణంబు
నీసడించితిఁ గాన నన్నిట్లు నెయ్యుఁ, డెదిరె నిది తప్పదనియు నేనెంచుచుంటి. ౨

వ. ఆలంబు కూడనిపనియని దక్షిణాఫ్రికామిత్రుల కేను బలుమఱుం గఱపితి-నాపల్కు వారిమైకోలుం బడసె-వెండియుం దిట్టినవానిఁదిట్టక కొట్టినవానిఁ గొట్టక తాలిమిం జూపఁదగు ననితలంచు నే నిద్ద ఱనికిం దారసిల్లిననాఁడు వారియాగాముల నగనక యొకనికిం దోడగుట తగవెట్లగు - నైనను బోయఱకయ్యంబునం దేను బనిసేఁత పోలక్కునకుం దెలియుఁ - గాని పదంపడి నాచూపు మాఱ్పునందియుండుననియతండు తలఁచె - బోయరుబవరంబునం దిగుట కేపాడి నాకాదరువయ్యె నదియ

నా కీపెనఁకువం బాలువెట్టె - నహింసాధర్మంబు నూఁది బ్రతుకంగోరువారు పోరితంపు దెసకుఁ జనరాదని యేను లెస్సయెఱుంగుదుఁ - గాని ౩

క. ఎవ్వనికిని గర్తవ్యము, దివ్వియవలె నెల్లనాఁడు తెల్లమి కాఁబో
దివ్విధి సత్యార్చకునకు, నవ్వలు నొవ్వలును గడవరానివ యందున్. ౪

వ. అహింసనా వ్యాపకంబగు నొకవస్తువు - మానవులు హింసాగ్నులం దగులుకొన్న యజ్జులు - ప్రాణి ప్రాణిందిని మనుట తెల్లంబ - బాహిరం బగుచంపు గావింపక జీవుం డొకనిముసమ్మేని నిలువంజాలఁడు - తినునప్పుడు త్రాగునెడఁ గూర్చుండు తఱి లేచుపట్ల నది యిది నానేల యెల్లప్రొద్దుల వలచియుండె వలవకయుండె మానిసి యించించుక హింస యొనరించువాఁడ - యెవ్వఁ డీహింసనంబు సేయ మికిఁ దంటాలువడు నెవ్వఁ డిట్టితలఁపునం గరఁగువడు నెవ్వండు చిఱుఁజీమకే నగ్గించఁ డతండ యహింసకుఁ బూజారి నాఁదగు - నతనియం దప్పసమ్మగా సంయమబుద్ధి వర్ధిల్లు - నక్కటికంబు పొంపిరివోవుఁ - గాని మేనుతా ల్పెవ్వండును బాహ్యహింసవలన సర్వథా ముక్తుండు కాలేమి నిక్కంబ - యదియుం గాక యహింసయం దద్వైతభావన యిమిడియుండు - నెల్లజంతువు లొక్కండ యగునే నొకటి కావించు చెట్ట తక్కన్నిటిం బొరయు - నగుట న్మానిసికి హింస యంటు తొ్రిపాడరానిది నాఁజనుఁ - గాన ౫

క. పదుగుండ్రను దా నొకఁడై, బ్రదుకునరుం డోరులసేయుపాపమ్మునపా
లది మోయవలయు; నాతని, మది మడిగట్టుకొని యెంతమంచిగ నున్నన్. ౬

గీ. ఇట్టితఱి రెండుమాగాను లేలుదొరలు, పొగరుపొంగునఁ గలనికిం బూనినప్పు
డెవఁ డహింసారిరక్షువై యెసఁగు నాతఁ, డాఁపవలయును జగడంబు మాపవలయు.

క. అతఁ డీకర్జము దీర్పఁగఁ, జతురుఁడు గాఁడేని చివ్వసాగించి నిజ
క్షితికిన్ సకలోర్వికి ను, న్నతి యేర్పడఁ జూడవలయు నానాశ్రమలన్. ౮

గీ. ఇంగిలీసువారి యేల్బడికతన నా, బ్రదుకు నావిలాతిబ్రదుకు తెఱఁగు
చక్కఁజేయుకోర్కి నెక్కొనియుండె మ, న్మానసమునఁ జెక్కునాళ్ళఁదొట్టి. ౯

ఉ. ఏ నిపు డాంగ్లభూమి వసియించి తదర్ణవసైనికాలి మత్
ప్రాణము నేలుచుండ నిరపాయసుఖస్థితి నందు మానిసిన్
గానఁ బటాల మయ్యది జగత్ప్రళయంబు ఘటించి హింసకుం
దానక మైననాఁడు ననుఁ దార్కొను దక్కులుపం బవార్యమై. ౧౦

వ. కావుటం జేసి యే నీదొరతనంపు జెండానీడ నుంటయు దీనిపొత్తు గంటయు నక్కఱ యని తలంతునేని హింసాజనకంబగు సమరంబు సేయంగాదని తెగఁబడి సెప్పినా పలుక వమ్మైనతఱి సత్యాగ్రహధర్మంబు నధిగమించి శాసనధిక్కారంబు నెఱపి చెఱసాలల న్వేదకు టొప్పు - నొండేని పెనఁకువం బాలువడచి తత్కౌశలంబు

నేరం జను - మనకుఁ గయ్యంబు నాఁపుబల్మి లేమి తెల్లంబ - కాన దాన డిగు టయ కర్తవ్యమని తేల్చుకొంటి - మఱియు ౧౧

సీ. అగ్నిగోళముపేల్చు హంవీరునెడ వాని, సుకము లందించుసేవకునిపట్లఁ
గాసంతయేని వింగడ మహింసకు లేమి, నిక్క; మక్కటికంబు నుక్కడంచి
ప్రజలపీపులు తలల్ బ్రద్దలుగావించి, పల్లియలం దోఁచు బందిపోటు
దొంగలకును వారి కంగమచ్చము లిచ్చి, వారిమూటలు మోసి వారిపుండ్లు

గీ. కడుగుమూఁకకు భేదమ్ము కల్ల; యగుట, దురమునన్ దెబ్బదిన్నజోదులసపర్య
కియ్యకోల్ చూపు ననువంటి కేలతప్పఁ, గదనహింసా సముద్భవ త్కల్మషంబు,

ఆ. మివుల మివుల నిట్లు మిత్రునిపోలక్క, తంతిరాకమున్న తరిచికొంటి
వచ్చినంత మగుడ నెచ్చెలికాండ్రతోఁ, దడవి రణమునంద తగవుగంటి. ౧౩

క. ఇది కానిచేత యని నా, యెద నేఁడుం బలుక; దప్పు డేల్బడిపై నా
కొదవినబుద్ధికి లోనై, కదనంబునపాలు గొంటిఁ గర్తవ్యముగన్. ౧౪

వ. అగుటం దీనిపట్ల నా కావంతయేని యనుతాపంబు వొడమదయ్యె - నాయీ త్రోవ నడువందగినదని యానాఁటినెయ్యుర కెల్లరకుం దనివిసంధించుట దుశ్శకం బని యేఁనెఱుంగుదు - నిది కడుంగడు సున్నితంబగు నంశంబు - దీన భిన్నభిన్నా శయమ్ముల కెడముండుఁ - గాన నహింసాధర్మనిష్ణాతుల కుఱంగట నాహృద యమ్ము నావిష్కరించుకొంటి - సత్యాగ్రహావలంబి యగువాఁ డాచారమునకుం గాక తనతలంపునకు విలువ నీఁదగు-నందుం బొరపాటు కలదోయని త్రిచ్చిత్రిచ్చి కంట వత్తినిడుకొని మెలఁగంజను - దోసంబు తెల్లమైన వెన్క దానిం దలఁదాల్చి పాచితమ్మొనకుం గడఁగవలయు. ౧౫

* * *

౪౦ స త్యా గ్ర హ లే శ ము

ఆ. పాడిలోఁతు లరసి బవరంబు నిచ్చగిం, చితిని గాని దైవగతి విరుద్ధ
మగుటఁజేసి దైహికావేశనంబు నా, కబ్బదాయె నందు జబ్బుకతన. ౧

వ. అట్టి చెట్టప్రొద్దునం దించుక సత్యాగ్రహ ప్రయోగంబును నా కక్కఱయయ్యె- మాకు సామునేర్పుటయంద బేకరు పడవాలనియుఁ దక్కన్నియెడల మా దండున కేన పెద్ద ననియు నియ్యధికారి నాపూఁటకాఁపుఁదనంబునన మాయెల్ల పనులుం జేయింపవలయు ననియు మాతలంపు - కాని యితనితీరు వేఱుగానుంట మాకు మున్ముందర కానంబట్టె - నిది సోరాబజీ సైఁపఁజాలక నన్గదిసి

క. అన్నా! కంటివె బేకరు, కన్నులు తలకెక్క నొజ్జగా వచ్చి నెఱా
మన్నియపోకిళ్ళకు డిగు, చున్నాఁ డితఁ; డోర్వనేల యుద్ధతు నిట్టుల్. ౩

క. గోర్చుట్టుమీఁద రోఁకటి, నార్చినగతిఁ బిన్నవాండ్రి నాంగ్లేయులఁ దా
నేర్చి మనపైఁ బ్రభుత్వము, తీర్చుటకుం బనుచు నేమి తెలుఁ గిది సెపుమా. ౪

క. అనుటయు దీనికి నలుగం, బనియే మని చల్లచల్లపల్కులతోడన్
వినిచితి నాతఁ డలంతులఁ, దనచూపు న్మరలఁజేయుతరగతి గామిన్. ౫

క, నన్నుఁగని కల్ల కపటము, తెన్నెఱుఁగవు నీవు తియ్యతియ్యని నుడువుల్
మున్ను కురియించి యవ్వల, ని న్నీ తెలవారు త్రోయనేర్తురు గోతన్. ౬

క. అంతయు ముగిసినపిమ్మట, భ్రాంతికి దవ్వగుదు వెల్లఁ బరికింతువు పూ
రింతువు శంఖము రండో!, శాంతిరణంబున కటంచుఁ జాటింతు గదా! ౭

క. పదపడి నీకు న్మాకును, బదింబదిగ దాపరించు బాములు జోస్యం
బిది కల్లగాదని హాసద్, వదనమ్మున మెల్లమెల్ల వక్కాణచేసెన్. ౮

క. ఏ నపు డస్మన్మైత్రీ, లీనాత్మల కార్తిగాక లేములుగా కే
మా నయ్యా!సత్యాగ్రహీ, నా నేమి ప్రతారితుండ నమ్మ మటంటిన్. ౯

క. వంచింపనిమ్మ న న్నతఁ, డించుకయు న్వేఱవ నోరుల నెవ్వండు ప్రతా
రించుం జివరకు నాతఁడ, వంచితుఁడగు నంచు మున్నవల్కెనె యంటిన్. ౧౦

ఆ. అతఁడు లెస్సనవ్వి యానాను బూమెలోఁ, జోరుము తడయనేల చోరుము నీకుఁ
జావుతప్ప దెపుడొ సత్యాగ్రహమ్మున, సరస కీడ్చి మమ్ముఁ జంపఁగలవు. ౧౧

వ. అని వాక్రుచ్చె – నీపల్కుల నుల్లేఖించుతఱి నసహాయోగదినమ్ములం గుమారి
'హాబ్‌హౌసు' వ్రాసినకమ్మ నాతలఁపునం గదలెడి – నీకన్నె యానాఁడు ౧౨

క. ఒకనాఁటి కీవు సత్యము, నకు నురిపా లగుదువంచు నమ్మెద నీకున్
సకలేశ్వరుండు తోడై, ప్రకటించుత మేలిమేలిబాటలు తేటల్. ౧౩

వ. ఇట్లుత్తరంబు ననిపె – నయ్యది యట్లుండె – బేకరుపోకడ న్గుఱిచి నేస్తకాఁడు
కినుకం జాటినపదంపడి నా కూపిరితిత్తులం దేర్పడ్డనొవ్వు ముమ్మరంబాయె –
రెండువారాలపస్తు ముగిసినవెన్క నాయెడ లింతవట్టు తిమ్మవడకుండె – నై నను
గరిడీ మానక మాయున్కికిం గ్రోసుదవ్వునఁ గల సాముపట్టునకుం గాలినడకన
చనుచుంటి – నిదియ నాయిమ్మదప్పునకుం గారణమయ్యె – నప్పు డనుచరు
లందఱు స్కంధావారమ్మునంద కాఁపురింప రేపొద్దున కే నిల్లుసేరువాఁడ –
నధికారిజం కైన లెక్క డగుటం జేసి యానాఁడ సత్యాగ్రహము నాశ్రయింప
వలసె – నయ్యవసరమ్మున బేకరు ౧౪

ఆ. సామునంద కాక సర్వాంశముల నేన, మీకుదార నటంచు మెచ్చిచూచె
నవలఁ దనప్రతాప మావంత రుచిచూపె, నొప్పఁడయ్యె నెయ్యుఁ డిప్పథమ్ము.

క. ఆ చెలి శరవేగమ్మున, నా చెంతకు వచ్చి యేమినాయం బిది యీ
నీచత నోర్చుట దుశ్శక, మోచెల్లి ! యతండు మనకు నోడయం డగునే? ౧౬

క. ఏ యానతినేనియు నీ, వీయందగు మాకు బేక రెవ్వఁడు పనుపన్
ద్రోయందగు నవగడ మిది, నీ యోరిమి నుజ్జగించి నీతి న్గనుమా. ౧౭

క. ఇంతకును మనము గరిడీ, సంతసె యుంటిమి కఠోరశాసనముల కే
మంత యదనయ్యె నేటికి, నంతరములు వలయు మనకు నాంగ్లేయులకున్ ? ౧౮

క. ఈవేర్మి కెవ్వఁ డీకొను, బోవలె నిది పొడవడంగి పోవలె మాన
శ్రీ వలచి కయ్యమున దిగి, యేవిధి సైరింతు మింతయేవపుబ్రదుకున్. ౧౯

వ. అనుటయు నేను బేకరుచెంత కేగి మాపైఁ గ్రొత్తగోవాళ్లకు దొరతనం బీగి మీకుఁ బాడిగాదనియు, మాదళంబున కేన ప్రతినిధినని మీరంగీకరింపవలయు ననియు నయ్యాయిభాగముల కక్కఱయగు నాయంకుల నేమ యెన్నుకొందు మనియుం బలుక నతండు ‘ససేమిరా’ యని బిఱ్ఱబిగిసె-నంత గత్యంతరంబు గానక

క. ఏ నొకగోష్ఠిం గూర్చితి, దానన్ సత్యాగ్రహవ్రతమ్మునమహిమం
బీనెయ్యుర కెఱిఁగించితి, నౌ నని శపథించి రెల్ల రాదారిఁ జనన్. ౨౧

గీ. మేము మాపెద్దలన్ నియమించుకొంట, కనువుపడ దేని గరిడిసాదనకు రాము
సాముకూటంబ త్రొక్కఁగఁజాల మన్న, నిర్ణయం బాచరించిరి నెయ్యు రపుడు.

క. అధికారికిఁ దీర్మానం, బిది సేర్చితి బాధలెల్ల నెఱిఁగించితి మా
మది సేవాయత్తమ యని, పదపడి మృదువాక్యసరణిఁ బంపితి లేఖన్. ౨౩

క. బోయరుసంగరమున మా, సాయముకల దస్మదీయసంఘమునకు నా
నాయఁకర ముండెఁ దక్కఱము, లాయెడ రా వీదృశంబు లంటిని దానన్. ౨౪

క. ఈపనికతనన్ బేకరు, చూపునమా ర్పింతయేని చొప్పడదయ్యేన్
మాపౌఁజునడత సమర, వ్యాపారవిరుద్ధ మనియు నాతఁడు తలఁచెన్. ౨౫

క. ఇతఁ డీకఁ జక్కఁబడఁ డని, మతినమ్మితి భారతంపుమంత్రికి మా యీ
వెతలెల్ల విన్నవించితి, నతఁ డీధర్మంబు దిద్దునని యనుకొంటిన్. ౨౬

వ. ఆప్రెగ్గడ యాఫ్రికాపరిస్థితులకు నిచ్చటినడవడులకు వింగడంబు కలదనియు, నున్నతాధికారి కీనేల నియామాధికృతుల నేమించుచన వుండుననియు, నట్లయ్యు నీఁక నాదొర మీమాట మన్నింపఁగలఁ డనియు నూరార్చె-నవ్వల నాకుం బేకరున కెన్నేని కమ్మలు నడిచె-నాబెడఁదనెల్ల నిందుఁ జాటనొల్ల-నది మన మీనాఁటి నిచ్చలుం గుడుచునిడుమవంటిద యన్నంతవట్టు వ్రాకుత్తు-నబ్బేకరు బెదరించియు బెల్లించియు మాదళమువారిం గొందఱ లోఁగొనియె-నంతన ౨౭

క. క్షతగాత్రులైన యోధులు, శతములుగ సహస్రములుగఁ జనుదెంచిరి దు
ర్గతిమై నెటలీవైద్యా, యతనమ్మునఁ బడిరి మూల్గు లాగుబ్బుకొనన్. ౨౮

క. బేకరునయభయములకున్, లోఁకువయైనట్టి మిత్రులు తదీయార్తా
నీకమ్మునపరిచర్యలు, చేకొని సాగించి; రెంతసేదం బడినన్. ౨౯

క. వా రాదీనుల నెల్లరఁ, దీరుచు లెట్లాదవు; నపుడు ధీమన్మణి యా
భారతమంత్రికి నాకున్, వేఱడ మిసుమంతలేని నెయ్యము గుదిరెన్. ౩౦

గీ. అతఁడు రాబర్ట్సు మంచమునంటియున్న, నన్నుఁగదిసి మృదూక్తిసంపన్నుఁడగుచుఁ
దనకు ననుచరమ్మై పొల్చుదళముసైత, మాసుపత్రికిఁ బోఁబోలు నంచుఁ గొసరి. ౩౧

ఆ. అచటనుండు నున్నతాధికారివినా త, దన్యు లెవరు దీని కాజ్ఞపెట్ట
రింతసెడదుపేర్మి యిందులవారి కీ, మేలుమఱవ రాంగ్ల మేలువారు. ౩౨

వ. అనియుం బల్కు నగ్గఱువకోర్కె మా కెల్లరకుం దనివినింపె – నంత నా చెంత
నున్న విద్యార్థు లందఱు నెటలీకేగ రోగినైన యేను నిట్టూర్చుచుం బడియుంటి.

* * *

౪౧ గోకులు నౌదార్యము

గీ. శ్వాసకోశమ్ము లుబ్బి మంచానఁ జిక్కి, చిక్కనంబడ్డ నామంచిచెడ్డ లరయ
నపుడపుడు జీవరాజు వైద్యాగ్రియుండు, వచ్చిపోవుచునుండె దైవమ్మువోలె. ౧

క. పాలం బప్పుల ముట్టక, యాలివ్తైలంబు నిమ్మ లరఁటులు ద్రాక్షల్
క్రోలుచు నాహరించుచుఁ, గాలం బపు డీడ్చుచుంటిఁ గట్టడతోడన్. ౨

క. క్షీరంబును గొనుమని పలు, మా అమ్మెహాతా వచింప మన్నియమంపుం
దీ రతనికిఁ దెల్పితి నప, కారంబగు ననియె వెజ్జు కానిమ్మంటిన్. ౩

క. గోపాలకృష్ణుఁ డప్పుడ, నాపాలికి వచ్చె రుగ్ను నన్నుంగని సం
తాపంపడెఁ బాలొల్లని, నాపోకడ నెఱిఁగి చెల్లునా యిది యనియెన్. ౪

క. గోకులునకు నెదురాడుట, నాకు నసాధ్యంబ సజ్జనస్తుత్యుఁ డతం
డీకడఁకన్ విడనాడమిఁ, జీకాకై గడువుకొంత సెలవి మ్మంటిన్. ౫

ఆ. మేలిమిత్రుఁడైన కేలనుబేకుతోఁ, జాలవట్టు చర్చసలిపినాఁడ
నీప్రయోగమందు నితఁడు నాబాసట, యయ్యు నన్ను మెచ్చఁడాయె నాఁడు. ౬

క. మిగిలితి నే నొక్కండన, యిఁగ నంతర్వాణి పల్కు నెయ్యది దానిన్
సీగఁ దాల్పవలయుఁ గావునఁ, దగుచింతల నెల్ల రేయి తంటాపడితిన్. ౭

క. ఏ నిపు డివ్వ్యాధి నూడ్చిన. నానమ్మికలెల్ల నల్ల నాశమునందున్
హీనం దప్పితినా యన, మానస మెదిరించు నట్టిమాట సహింపన్. ౮

వ. కావుటంజేసి నేఁడు నాకర్తవ్య మెయ్యది? గోకులునికూర్మి నెందనుక మన్నింపఁ దగు? నొడలింబ్రోవ నీకట్టడ నెంతవట్టు సడలించుటొప్పు? నని లెస్సతడవి యిప్పట్ల ధర్మమువన కెగ్గువాటిల్ల కుండునంతకుం గాచుకొనఁదగిన నేమంబులెల్ల నాకవసపడియుంట వలయుననియు, నితరంబు లగదంకారున కధీనమ్మలై యుండఁ దగుననియు నిర్ణయించుకొంటి - నేను దుగ్ధంబు నొల్లమికి ధర్మంబ హేతువు నాఁజను - నిశ్శ్రమముగాఁ బయస్సు నాకర్షింపఁ గాళీఘుట్టమ్ము వా రెనుములకుం గోవులకు నాపాదించుహింస లేనెఱుంగుదు - నదియుం గాక పలలంబునట్ల పాలును మానిసి కాహారంబు కాఁదగదని విశ్వసించితిఁ - గాన ౯

క. ఏది యెట్టులైన దుగ్ధము, కాదని భావించి యెడఁదఁ గలఁగక మఱునాఁ
డే దరిసించితి గోకులు, నాదృతి నతఁ డేమి తేల్చె తని ప్రశ్నించెన్. ౧౦

గీ. అవల వినయమ్మదైవాఱ ననఘ! మీర, లేమిపంచిన శిరసా వహింతుఁ గాని
దీనిదెసఁ బంతగింపకుఁ డేను దుగ్ధ, కణము గొననొల్ల మాంసభక్షణము నొల్ల.

క. ఇవి ముట్టకున్నచో మృ, త్యువు తప్పద యందురేని యోడక దానిం
గవుఁగిటఁ జేర్చెదఁ బాడికి, దవిష్ఠమైనట్టి బ్రదుకు తగునా యంటిన్. ౧౨

ఆ. అంత నమ్మనీషి యక్కజపడి యిది, యానె చివరమాట యని వచించె
నట్టి దింక నొండు పుట్ట దీనోట మ, న్నింపుఁ డితనిఁ గరుణనింపుఁ డంటి. ౧౩

క. తన్నెంత కష్టపెట్టినఁ, దిన్నఁదనం బింతవిడక ధీవార్ధి యతం
డన్నా! యిచ్చట ధర్మం, బన్నది నా కంతుపట్టదైనను నీకున్. ౧౪

గీ. వింగడంబుగ నీకఁ బల్క నంగవింప. నరుగుమా! నీవరించిన తెరువునంద
యార్తరక్షాపరాయణుఁడైన వేల్పు, నీకనామయసంపత్తి నెఱపుఁగాక! ౧౫

క. అని నన్నుఁబల్కి వెజ్జుం, గనుఁగొని గాంధీ నలంపఁగా దిఁక నాతం
డనువగు నన్నపదార్థము, తినిపించుచు మెల్లమెల్లఁ దేర్పుం డనియెన్. ౧౬

క. గోపాలకృష్ణుఁ డాడిన, యీపల్కులు జీవరాజు నెట్లలరించున్
బాప మతఁ డట్లయని తల, నూఁపుట యనివార్యమయ్యె నొల్లమి యున్నన్. ౧౭

వ. అతఁ డింగువతో సాతాళించిన మినుపచేరుం గ్రోలుమని పల్క నొండురెండు నాళ్ళు దాని సేవించితి - నది నా కొంటక నాయిదుమం బెంపుచేసెఁ - గాన వెండియుం బండ్ల నాశ్రయించితి - మోహాతా సముచితంబులని తోఁచిన బాహ్యోపచారంబుల నేమఱిల్లక నడుపంబూనె - దీనం గొంతచక్కఁబడితిఁ గాని నాకట్టడ లీభిషక్కునకుఁ దద్దయుం గిన్క నొదవించుచుండె - నింతన గోకులుం డక్టోబరు నవంబరుమాసమ్ములం దానేలఁ దారసిల్లు మంచుపెల్లున కోహటించి మాతృభూమికిం బయనమ్మకట్టె. ౧౮

* * *

౪౨. వైద్య మెయ్యది

ఆ. ఎన్నిపాట్లువడిన నన్నుఁ బీడించెడు, తెగులు వోమిఁ గొంతదిగులు గంటి
మందులేల తిండిమార్పున దీనిపోం, గడఁపవచ్చు నంచు నరసికొంటి. ౧

క. అన్నంబుమార్చి రోగుల, కున్నతి చేకూర్చునేర్మి నొసపరివైద్యుం
డన్న సడిగన్న యేలి, స్సన్నామునిఁ బిల్చి నొవ్వుచందము లెల్లన్. ౨

క. వినిపించితిఁ బాలకు నా, కనుకూలత్వంబు లేమి నాడితి దానం
బనియే మున్నది నాచె, ప్పినబువ్వం దినుమటంచు వెజ్జు వచించెన్. ౩

ఆ. క్రొవ్వులేనికూడు గొనుమిప్డు రొట్టియు, పండ్లు పచ్చికూర పనికివచ్చుఁ
గోష్ణజలము వోసికొ మ్మెప్పుడుం గిటి, కీలు విచ్చియుండఁ బోలు ననియె. ౪

ఆ. దీనఁ గొంతవట్టు తేటతెఁగాని సం, పూర్ణమైనలగ్గు పొందనైతి
నపుడు సాధ్వి సిసిలియా చెల్మికత్తెయై, యాసచేయుచుండె నాసుఖంబు. ౫

క. పాలకు నాకు న్నెయ్యము, గిలింపఁ దలంచు నాపె; గిట్టదుగద యా
క్రోలుట నామది; కాయమ, యీలేవడి తొలఁగఁద్రోయు టెట్లని వగచున్. ౬

క. ఆలేమకు నొకమిత్రుఁడు, పాలపొడిం జూపి దుగ్ధబంధుత్వము లే
నే లే దీనుఋమున కిది, చాలున్ క్షీరమ్మువలనిసారము నొసఁగన్. ౭

గీ. మఱి రసాయనశాస్త్రసమ్మతము కాఁగ, నేర్పడియె నిద్ది యని దానియెఱుక లేక
వినిచె నాతనిపల్కామె విశ్వసించి, యప్పొడిం దెచ్చి నాకిచ్చె నప్పుడపుడ. ౮

క. మన్నియమంబు నెఱింగిన, యన్ను తదాదరముసూపు నమ్మ దయాసం
పన్నతమై నిడువస్తువు, తిన్ననిదో కాదొ యన్నదిగు లెట్లుండున్. ౯

ఆ. అగుట నామె యొసఁగు నాగుండ నీటిలో, మెదిచి త్రావి పాల నొదవురుచియ
నాల్కకంటఁ జూచినాఁడ నీసా కొక, చెంపనున్న చిన్నచీటి నపుడు. ౧౦

క, పొడు మిది పయస్సుతో నే, ర్పడినట్టిద యంచు నెఱుకపడె నంతఁ గడున్
వడి దానిఁ ద్రోసి కొందల, పడకుము కథయిది యటంచుఁ బావనమతికిన్. ౧౧

వ, సిసిలియాకు లేఖనంప నయ్యమ్మ కమ్మం గనినంతన నాచెంత కేతెంచి తనపడ్డ
పరాకున కెంతయుం గస్తిగుడిచి సిగ్గునందొఁగ నే నాపె నూరార్చి ౧౨

క. నీతప్పులేదు మిత్రుం, డాతఁడు పత్రంబు సూపఁడయ్యెను నీకున్
నీతమ్మునివలె నన్నుం, జేతమ్మునఁ జూచి నాదుచెట్ట నడంపన్. ౧౩

క. నీతెచ్చినవస్తువు నీ, రీతిం దగవని బహిష్కరించితి నాయీ
చేఁతను మన్నింపుమని వి, నీతిన్ వాక్రుచ్చినాఁడ నెలఁతయుఁ దేఱెన్. ౧౪

వ. పదంపడి యెఱుఁగమింజేసి కావించినయీపనిపట్లఁ జింతయు శిక్షయు నక్కఱ
పడవని సిసిలియాకుం దెలిపితి – నీవెలందియౌదార్యములు పెక్కులు నాస్మృతి

పథంబునం గలవు - కాని వానినెల్ల నిచట వెలువరింపఁజాలఁ - బెక్కుకడగండ్ల
నన్నాదరించిన చెలికాం(డ్రెందఱో కలరని పల్కి- వారినిచటం దలఁపునకుఁ దెచ్చు
కొందు - శ్రద్ధధానుం డిట్టియెడ ౧౫

క. అనుకంపానిధి యీశ్వరుఁ, డనర్థమను విసపుమందు నందించుచు న
వ్వెనుకలఁ దియ్యనినెయ్యము, ననుపానముగా నొసంగునని గుర్తించున్. ౧౬

వ. అది యట్లుండె - రెండవమా ఱేలిన్సనువచ్చి పచ్చికూరలు రుచింపవేని వాని
వండితిను మనియె - నిమ్మార్పు నా కింపితమాయెఁ - గాని తెగు లడంగకుండె-
నట్టితఱి రాబర్ట్సు నాకడ కరుదెంచి మంచుకారు కదియంబడుచున్నయది - మీ
కిచట నారోగ్యంబు చేకూరదని తలంతు - మీరు భారతముం జేరుటలెస్స -
మీకావించినసాయ మలంతి నాఁజాల - ననవుడు నేనప్పలుకులు మెచ్చి మాతృ
భూమికిం జేర జతనంబు గావించితి. ౭౧

***

౪౩ వీడుకోలు

గీ. భారతోర్వికి రా నిచ్చపడుటఁజేసి, బేకు నావెంట సీమకురాక యొదవె
నిద్దఱము నేఁడు పోగయోడ నెక్కఁబోవ, నక్కటా! పుట్టదయ్యె నయ్యన్న కాఙ్క్ష.

గీ. అతఁడు జర్మనుజాతివాఁ డగుటకతన, సమరమది తీవ్రదశనున్న సమయమగుటఁ
జెట్టయిది వుట్టె నెంతయిక్కట్టువడిన, రిత్తయయ్యెను హార్దింగుచిత్త మెద్రిచి. ౨

ఆ. మివుల నార్తిగంటి మిత్రుండు కేలను, బేకు నుజ్జగించి నొకనెక్క
నాఁడు నన్నుఁబాయ నాకంటెఁ బెద్దయు, నలమటించె నమ్మహాశయుండు. ౩

గీ. అతఁడు నావెంట భారతక్షితికి వచ్చి, యున్నచో నాల్గుకొండ్రలు దున్నుకొనుచు
నాసమై మగ్గమున గుడ్డనేసికొనుచు, మనుచు నుండెడివాఁడు నామన మెలర్ప. ౪

క. ఈనెచ్చెలి తనశీలము, మానక వ్రడమ్ము నింతమఱవక రాజ
న్మానవతమై నెటాల్మహి, లోనం గలఁడిపుడు మిత్రులు కడుంజెలఁగన్. ౫

వ. ఇఁకం బ్రకృతమ్మునకు వచ్చెద - నాయెక్కినకప్పలికి మూఁడవతరగతి లేమిం
జేసి రెండగుదానియంద కుదుర్కొని నానాఁడు విరియునారోగ్యముం గని మురి
యుచు నల్లనల్లన బొంబాయిచేరి పదియేండ్లనాఁడు విడనాడిన తల్లిగడ్డం గని
లెస్సపొంగితి - ననామయంబు కొఱవడియున్నను గోకులుం డచటికేతెంచి
ముద్దుముద్దుగా నెదురుకోలుపండువు సాగించె - నప్పుణ్యారాశిం గని యతని
మార్గమ్ముపట్టి నాతలవ్రేఁగు డించుకొనంజూచి బంబయికిం జేరితిఁ - గాని విధి
నిర్ణయం బన్యతరముగా నుండె. ౬

***

౪౪ న్యాయవాదవిశేషములు

ఆ. ఏల దానిఁగోడవ యిం దని యేనెంత, చెప్పుచున్న మిత్రు లొప్పకుంట
నిపుడు కొంతపల్క నెంచితి నా కోర్టు, బ్రదుకు నీడ్చినట్టి బాటతెఱఁగు. ౧
క. కల్లలకుం గైతవముల, కొల్లక యీధర్మమునకు నొగ్గితి నంచున్
దొల్లియ వాక్రుచ్చితి నిది, చెల్లెన్ గేవల సమాజసేవాదృష్టిన్. ౨
క. కూటికినిం గుడ్డకు నే, పాటిధనం బగుఁ దదీయపరిమాణంబున్
దాఁటనిభృతి నడసితి నది, పాటింపకయుం బ్రియాసపడితిని గొంతన్. ౩
క. ఈమనుగడరూ పెఱుఁగుట, కీమాటల చాలుఁ గాని యింకను దెలుపన్
నామిత్రు లభిలషించెద, రేమోఫల మిచ్చునందు రిది కొందఱకున్. ౪
ఆ. న్యాయవాదిబండి నడవ దసత్యంబు, పల్కకున్నఁ గుట్రపన్నకున్న
నతనిజీవగఱ్ఱ యనృతంబ యంచు నేఁ,బిన్ననాఁడ లెస్సవిన్నవాఁడ. ౫
క. ఉన్నతపదమ్మునెడ నా, కెన్నఁడు నాసక్తి లేదు హేయంబు దెసన్
గన్నింతవడదు టక్కరి, పన్నుగడం బన్న నేమిపనియుండు నిఁకన్. ౬
గీ. బొంకునకుఁ జోటునీక నాపూనినట్టి, నేమమిది దక్షిణాఫ్రికానేల నేను
ధర్మవాదిత్వముం దలఁదాల్చువేళఁ, బెక్కుమార్లుగ నొరయికం జిక్కవలసె. ౭
ఆ. ఎదుటివారు సాక్షి కెన్నెనిదబ్బఱల్, నూఱిపోయు చెట్టతీరు విందుఁ
గాని యెపుడు నట్టికక్కఱితిం జిక్క, కల్మషంబు మూటగట్టనైతి. ౮
వ. ఏ నొక్కతఁగవున జయంబుగన్నవెన్క నాపక్షమ్మువారు నన్నుఁ గికురింతపా
ల్పేసిన తెఱం గెఱింగితి - నన్ను నమ్మినయభియోక్త సత్యనిరతుండైన జయించు
నొండేని యోటమింగుడుచు నన్నతలం పొండ నాయుల్లముం బాయకుండు-జయా
పజయంబులంబట్టి సుంకముకోలంది నేర్పఱుచుకొంట నాయీబ్రదుకునం గాన -
మీవాదంబు సత్యదూరం బగునేని నన్నాశ్రయింపంజన దని మున్మంద యభి
యోగులకుం జెప్పువాఁడ - దీనంజేసి దబ్బఱతగవు నాపాలం బడదాయె - నొక
మాఱు నాయభియుక్తులం దెన్నఁదగినవాని వ్యాజ్యమొండునన్ను లెస్సపరికించె-
నది లెక్కచిక్కులకుం బుట్టినిల్లు నాఁడగు - దాని పంచాయతినిర్ణయంబు మా
కుపకరించెఁ - గాని పోబడిం జేరఁదగ్గయంకె యొం డిందు రాబడిం జేరె - నీపొర
పాటువలనిలగ్గు మాయది - యెదుటివా రీతీర్పు చెల్లరాదని లాతిహేతువులం
జూపి మారొక్కనిరి - పంచాయతిప్రమాదంబు నంగీకరించి దానివలనినష్టిం గుడు
చుట మనపాడియని నే నభియోక్తకుం దెల్పితిఁ - బ్రధానుండగు న్యాయవాది
నాయీపల్కు నియ్యకొనఁడయ్యె - బుద్ధిమంతుఁడగు వకీలిట్టిచేతకు దిగఁడని
యతండు నాకు నీతులుమప్పె - నంత నేను ౯

క. మన మెుప్పుకున్నఁ గోర్టీ, యనృతమ్మును సమ్మతించునా ప్రతివాదుల్
కనులేనివారలా క, ల్లను దెగనాడంగ నింతలంపట యేలా. ౧౦

క. నావుడు నప్పెద్ద కడుం, దీవరపడి కల్ల కవుడుదెస కేగక యీ
దావా నడుపుట నీకోన, నీవే తలఁదాల్చి మోయు మీబరు వెల్లన్. ౧౧

క. అని బిఱ్ఱబిగిసె నవ్వాల, మన సొప్పదయేని మీరు మానఁగవచ్చున్
నను నభియోక్త వరించినఁ, బెనఁగెద సత్యానురక్తి పింపిసలాడన్. ౧౨

క. ఏ నిట్లుపల్కి వ్యాజ్యెపు, వానిదెసం గంటి నతఁడు వాడియు నన్నుం
బోనాడలేక మీఁరే, పూనుఁడు సూనృతము నేలుపురుషుఁడు లేఁడా? ౧౩

క. ఇవ్విధి నా నేనుబ్బితి, నవ్వాల నన్నెచ్చరించె నాపెద్ద కడున్
ద వ్వడలెన్ నాపట్టును, కీవ్వేదనవెంట నాకు నిచ్చెను మెప్పుల్. ౧౪

* * *

౪౫. చాతుర్యమా?

క. నాయిచ్చిన యుపదేశము, శ్రేయఃకారణమ కాని చేవమెఱసి యే
నీయభియోగమునం దగు, నాయము రాఁబట్టనేర్తునా యనుకొంటిన్. ౧

క, అందదుకులతగ వియ్యాది, యందుం బెదరచ్చకెక్కినట్టిది యాటన్
డెందము వడంక నధికృతి, ముందు నిలంబడితి దైవమును జేకొంటిన్. ౨

వ. అంత నేను దొలుతొల్త న పంచాయతి ప్రమాదమ్ము వెలువరింప ధర్మాధికారి యిది చాతుర్యంబు నాఁ దగదాయని వక్కాణించె - నపుడు నామోము కంది కందగడ్డయయ్యె - నాపట్ల లూలామాల మావంతయేని లేమింజేసి యీనింద సైరింప నశక్తుండనైతి - మఱియు ౩

క. ఈపెద్ద యింతవికట, వ్యాపృతి మున్ముందుచూపె నక్కట! విషమం
బై పొల్చు నావివాదం, బేపగిదిన్ నెగ్గువన్న యిఱుకునఁ బడితిన్. ౪

ఆ. అవలఁ గొంత తేఱి యయ్యా కడుంగడు, వెఱఁగుఁగూర్చుమాట వినిచినారు
చివరదన్క నావచింపుప ల్కాలింప, కిట్లు వెక్కిరించు టేమిపాడి. ౫

క. అనుడున్ శంకయు చాటితి, వినుఁడు మిఘుం జిన్నపుచ్చువిధ మొల్ల భవ
న్మనస్సుఁ గలంచుట కెంతయు, వనరుదునని ధర్మధాత వక్కాణించెన్. ౬

క. శాంతిమయి నాతఁ డిట్లన, సంతోషము జాలువాఱసాగెను నాకున్
స్వంతయు విదువక వాదం, బంతయు వివరించినాఁడ నయ్యధికృతికిన్. ౭

వ. పదంపడి ప్రత్యర్థిపక్షవాది నానాశ్రమమ్ములువడి తనధోరణిం బ్రకటించెఁ - గాని పద్ధుపొరపాటుతక్కఁ దక్కంగల పంచాయతినిర్ణయంబునెల్లం బాడిపట్టు

వారు తిరపటించిరి - నాసంతృప్తి కపుడు మేరలేదయ్యె - నివ్వార్త విని మా పెద్దయు నభియోక్తయు లెస్సపొంగిరి - మఱియు నసృతంబు నాశ్రయింపక యీమనుగడ సాగింపవచ్చు నన్న నాతలంపు తద్దయుం గట్టిపడె - నంగడిగాం బఱచుకొన్న న్యాయవాదివృత్తి కసత్యంబ మూలభూతం బగుట దానిం దీనం జక్కాడుట యరిదియని సెప్పనోర్తు. ౮

***

౨౬ అభియోక్తలయందు

గీ. ఒక్కమరి ట్రాన్సువాల్ కోర్టు నెక్కియున్న, తగవు నడిపితి నందు సత్యంబులేమిం
దుద కెఱింగితి నంత నాతోడ బొంకు, వలుకు నాయభియోక్తపై నలుకగొంటి.
గీ. అతనికిం బ్రతికూలమౌనట్లు తీర్పు, సెప్పెడా యని పల్కితి నప్డెదురు
వారు ధర్మాధిపతులైనవారు తద్ద, విస్తుపోయిరి నావాదు విశ్వసించె. ౨
క. ఆతని కిట్లపకారము, సేత జరిగెంగాని యింత చీ యన్నను మ
న్నీతి నెఱుంగుట నతడు కస్రి, ధాతప్తుడు గాక లజ్జతొడను గుస్రింగెన్. 3
క. ధర్మవు దెస నాచూపిన, యర్మిలి యిది రచ్చనెల్ల నాకర్షించెన్
బేర్మి కడు హెచ్చె నాకీ, శర్మంబును విస్మరింపజాలన యెపుడున్. ౪
గీ. రంగు తెగు లెంతయున్న న న్నింగిలీసు, వారు మన్నింపసాగి రవ్వారిగాంగ
నిక్కమునకుం బూజారినై నిలువనేర్చు, నాతం డెవ్వానియుల్లంబు నాంచికొనడు?
క. నా తెల్విికి నవ్వలిదై, లోతైనసమస్య పుట్ట లోంగక యిది నా
చేతం దీఱదు సడిస, న్నాతనికిం జూపుమందు నభియోగికడన్. ౬
ఆ. నిర్వ్యళీకమైన నీతికి నగ్గమై, వెరవులేమి నిట్లు వెలువరించు
నన్ను లెస్సనమ్మి నాదెసవార ల, చంచలానురక్తి ముంచువారు. ౭
క. ఈకతమున నభియోక్తలు, నా కీడగుషామ్మ హెచ్చు నా నిచ్చుటయే
కాక మ దుద్యమలతికలు, పాకించి నుపఘ్నంబు లైరి పరహితశీలల్. ౮
ఆ. వారెరూకతోడ వారిసాయమ్ముతో, నచట నారొనర్చినట్టిచేత
నాదరించి రద్దిరా ! లోకసేవనం, బనుచు నిట్టిపెంపు నభినుతింతు. ౯
క. చెఱసాలకు నడువుం డనం, గొరడాచెటచెటల కియ్యకొం డన నడ్డం
బెఱుంగక సాగిరి మూంగిరి, కఱకరినాబ్రదుకు రసజగత్తునం దేలన్. ౧౦

***

౪౭ అభియోగి చెఱ తప్పుట

క. నాచదువరులకు రుస్తుం, జీ చరిత మొకింత తెలియఁజేసితి మొదటన్
నాచెలికాఁ డభియోగియు, నై చెలఁగె నతండు నమ్మి నంజక నన్నున్. ౧

గీ. పెద్దబేహారియై కల్మి తద్దపెంచె, నతఁడు తనచేర్చుసరకుల నడ్డుచేసి
యట నిషిద్ధములైన యయ్యాయివస్తు, లందుకొని కుహనావణిజ్యార్థియయ్యె. ౨

గీ. కూటిముద్దయటుల్ రసఘుటికవోలె, దర్పణముకై వడిఁ దనునేర్పు నోర్పు
నుక్కడంచి బజారున కెక్కఁగాని, దొంగతన మెన్నినాళ్ళు సురింగియుండు. ౩

క. అయ్యాపస బైటఁబడె నెద, ద్రవ్యాలుగా నక్షువారి వఱ్ఱులుగాఁగన్
జయ్యన నురుఁగులు గ్రక్కుచు, డయ్యుచు నబ్బేరె నాకు డాయఁగవచ్చెన్. ౪

క. అన్నా! లుబ్ధుడనై నినుఁ, గన్నుమొఱంగితిని మూటకట్టితిఁ బాపం
బిన్నాళ్ళకు నది పండెను, నన్నుం బన్నముల ముంచి నవ్వఁదొడంగెఁ. ౫

క. చీఁకటిబేర మొనర్చితి, నాకొంప మునింగె దొరతనమ్మునఁ గలవా
రీకుట్ర గనిరి చెఱకుం, బోకడ విధి వ్రాసిపెట్టెఁబో! నానొసటన్. ౬

క. ప్రకటంబగు నవమతి యిది, యకటా!యిఁక నేను జచ్చినట్లకదా! నీ
వొకఁడవ నన్నిపు డీచె, ట్టకు దప్పులవానిఁ జేయుటకు దిక్కగదా! ౭

క. నామనుగడ సర్వంబును, నీముంగల నిడితిఁగాని నిల్పితి దీనిన్
నామెచ్చు వృత్తిమర్మము, నేమని వివరింతు నీకు నేనోఁ శనికిన్. ౮

క. కుతిలపడి కొందలంపడి, యతఁడిమ్మెయి వగచె నావు రావురు మనుచున్
మతిగరఁగి రుస్తుమున్ మిత, హితవాక్కుల నూఱడించి యే నిట్లంటిన్. ౯

క. ఎఱుఁగుదువు నన్ను; నిన్నుం, బరిరక్షణసేయఁ ద్రోయఁ బ్రభు వీశ్వరుఁ డొ
క్కరుఁడ సుమీ మైనన్ మన, పరిచితిఁ బాటించి సాయపడియెద నీకున్. ౧౦

క. నీచత యని వెన్కాడక, నీచేసినదోషమెల్ల నెఱి నియ్యకొనన్
సైఁచెదవే నరికట్టిన, యీచిక్కు నడంచి నీకు నెలమి ఘటింతున్. ౧౧

వ. అంత న ప్పారసీవణిజుం ‘డేను గావించినపాపంబునెల్ల నీముంగల నంగీకరించితి నింతవట్టు చాలదో’టనుడు ‘దొరతనమ్మువారి దెస దోసమ్ముసల్పి నాకడం జెంపలు వాయించుకొంట మెట్లుచితంబగు’నని యే నాడ నెట్టకేల కబ్బేరి దారికివచ్చె-
నంత
౧౨

క. పరికించిచూడ నతఁ డీ, దురితము పెక్కేండ్లనుండి తొలఁగక సేయన్
దొరఁకొన్నట్లు కనంబడె, దురాశకుం గొలఁదిలేమి తోడన తోఁచెన్. ౧౩

క. ఇరువురమును రుస్తుంజీ, పురాతన న్యాయవాదిపొంతకుఁ జని యీ
చరితంబునెల్లఁ జెప్పుడు, నరిది యిటన్ గెలుపుగొంట యని యతఁ డనియెన్ ౧౪

క. బరువంతయు మిత్రుఁడు నా, శిరమ్ముపై నిల్పె నీవు సెప్పినరీతిన్
జరియింతుఁ గరుణమై నా, పరువును దక్కింపు మంచు బతిమాలుకొనెన్. ౧౫

వ. పదంపడి యే నతనికి ధైర్యమ్ముచెప్పి యీనేరంబు రచ్చకు రాదని తలంతు — నభియోగంబుఁ దెచ్చుటయుం దేమియు రేవుసుంకరివశమ్మునం గలదని — యతండు రాచఱికమ్మువారి ధర్మవాదిప్రముఖుఁ డాడిన తెఱంగున మెలంగవలయు — నే నియ్యిరువురం గామక దర్శింతు — వారు న న్నాదరింపరయేని ౧౬

క. జరిమానా కట్టుటకో, చెఱసాలం బడుటకో విశృంఖలచిత్త
స్థిరతన్ సిద్ధముగ మిమ్మ, దురవస్థ పదేనుపాళ్ళు తొలఁగఁగవచ్చున్. ౧౭

క. అప్పా! బందియ నీకుం, దప్పదయే నదితలంచి తప్పిచెందుమట కే
నొప్పన్ దెక్కలితనమున, కప్పసముగ లజ్జగుడుచు టది పాడియగున్. ౧౮

క. ప్రాయశ్చిత్తముగాఁ దల, పోయుము చెఱనుండి పాపపుంజంబునకున్;
ఛీ! యిఁక ముచ్చను గానని, చేయుము శపథంబు లగ్గు చేకుఱు మిపులన్. ౧౯

గీ. ఇమ్మెయిం బల్కి సెట్టి నాయెల్లబ్రమకు, నీవశమ్మునఁ గలదు నన్ నీటముంతొ
పాలముంచెదవో నీదుపనిచినట్లు, యడుగుపై చెద ననియె దాసోహ మనియె. ౨౦

ఆ. అంత నడుముగట్టి యస్మదీయంబగు, వినయమెల్ల నతనియనయ మూడ్ప
నప్పగించినాఁడఁ దప్పు సమస్తంబు,వలికినాఁడఁ బన్నువాని చెంత. ౨౧

గీ. తె మ్మనినఁ బత్రములనెల్లఁ దెచ్చి సెట్టి, పాపపుంబ్రదు కంతయు బాహిరింతు
నతఁడు నేఁటికిఁ దనదోస మరసియరసి, నానకుం జిక్కి కుములుచున్నాఁ డటంటి.

వ. అంత నాసుంకరీఁడు జాలిందోఁగి యిప్పారసీతాత సా దయ్యు నెఱుకలేనిపని గావించె-నిప్పట్ల నాకర్తవ్యంబు మీకుఁ దెల్లంబ-మాన్యాయవాదిచిత్తంబు నూఁది యే నిందు సంచరింపవలయు-మీ రమ్మేటిం గనుగొంట లెస్స - యేను పీలైనంత వట్టు మీ బేహారిగౌరవంబు రక్షింతు-నవుడు నెల్లలేనిహర్షంబు వడసి యే నవ్వల నవ్వకీలుసన్నిధికిం జేరి కలరూ పెఱుఁగంజేయ నగ్గఱువ నాసూనృతానురక్తికిం దనిసని యెన్నఁడున్ మీకు నాకడ నాస్తి యనుపల్కు పుట్టదని ప్రమాణపత్రముం బ్రసాదించెఁ - బదంపడి రుస్తుంజీదొంగసొత్తు నిబ్బడివిలువం గొని విడుచునది యన్న యానతీ వచ్చె - వెండియు ౨౩

గీ. మిత్రుఁ డీదాంగ బ్రదుకెల్ల మేలిమేలి, యక్కరంబులతో దిద్ది చక్కఁదనము
విరియుచట్టాన బిగియించి వ్రేలఁగట్టె, నాత్మ నోడక నైజకార్యాలయమున. ౨౪

క. తనవారు తరతరమ్ముగ, మనువా ర త్తఱి వణిజ్య మరగినవారుఁ
జనరా నీచెడుదారికి, నని హెచ్చరికింప నాతఁ డప్పని కోర్చెన్. ౨౫

ఆ. ఇది శ్మశానవాటి నేచినవైరాగ్య, మెట్టి దట్టి దనిరి. సెట్టిమిత్రు
లెంతవట్టు వీరి యీపల్కు గట్టిదో, తెలుపఁజాల గుట్టు దేవుఁ డెఱుఁగు. ౨౬

క. ఈనిందను రుస్తుంజీ, వీనులలో మెల్లమెల్ల విడిచితి నన్నా!
యే నిన్ను మొఱఁగి యెచటికిఁ, బోనేర్తు నటంచు నతఁడు పొసఁగం బలికెన్. ౨౭

ఆత్మకథ

పంచమ భాగము

౧ ఆద్యనుభూతి

గీ. అస్మదీయులు సేవావ్రతానురక్తు, లాఫ్రికా నుజ్జగించినయట్టిబంట్లు
మగనలాల్ గాంధిముఖ్యులు మాతృభూమి, నందుకొన్నారునాకంటెముందవచ్చి. ౧

క. నెచ్చెలులకంటె మును నా, వచ్చుట నిర్ణీతమయ్యె వదలనికయ్యం
బచ్చుపడి రోగబాధలు, హెచ్చి నిలంబడితి సీమ నిప్పటిదనుకన్. ౨

గీ. దున్ని పండించి తినుచు నేదో రవంత, సేవ సల్పుచు మిత్రులతో వసింప
నిచ్చగించితి నిందుల కేది లెస్స, తగినతా వని తద్దయుం దరిచికొంటి. ౩

గీ. దేశమం దాశ్రమంబులఁ దీర్చి ప్రజకు, నూడిగముసేయు పెద్దలతోడిమైత్రి
లేమి నిదమిత్థమని తెల్పలేక లేక, యొండు వ్రాసితి నపుడు నెయ్యురకుఁదుదకు. ౪

ఆ. ఆర్తబంధువైన యాండ్రూసుచెంతకు, నేగుఁడంటి నతనిహితము నూఁది
నిలువుఁడంటి నంత నెచ్చెలికాండ్రు ద, ర్శించి రయ్యుదాత్తశీలధన్యు. ౫

క. వా రమ్మనీషి పంచిన, తీరునఁ గాంగ్రికిఁ బోవ్రుదెంచిరి మహితా
చారులు శ్రద్ధానందులు, కూరిమిమై వారిఁ జూచెఁ గొడుకులవోలెన్. ౬

గీ. అంత శాంతినికేతన మరయ నేగు, దెంచి రందుఁ గవీంద్రుఁ డభ్యంచితాద
రానురాగసుధల్ పంచి యస్మదాప్త, జనుల రంజించె వెన్నెలజాలువోలె. ౭

క. స్వామియుఁ గవితారాజ్య, స్వామియుఁ బాలించుధర్మసంస్థలఁ గంటన్
నామిత్రులు తెలివిం గని, రామేలిమి యుపకరించె నన్వాల నాకున్. ౮

వ. శ్రద్ధానంద రవీంద్ర సుశీలరుద్ర లాండ్రూసునకు ముప్వేల్పులంబోనివారు నాఁజెల్లు — నతఁడు దక్షిణాఫ్రికా నున్నతఱి వారిగఱువతనమున్గఱచి ఔరెం బౌరి వర్ణించువాఁడు — వారినామాక్షరంబు లీసాధుపుంగవుని హృజ్జిహ్వారంగముల సర్వదా నర్తించు — నక్కారణంబునం జేసి యాండ్రూసు నానేస్తకాండ్ర సుశీలరుద్రసన్నిధికిం జేర్చె — నాయయ్య వారిం బెద్దలాలించి వారికిం దన కాఁపురించుగేహంబ వీడుపట్టుం బొనరించె — నతనిబిడ్డలకు న్వారికి నప్పుడప్డ నెయ్యతియ్యంబులు బలిసె — నంత నావారు ఫినిక్సుబ్రిదుకు న్మఱచి యం దునికి వాటిల్లె — మఱియు ౯

క. ఒడదిగి వీరికుశలపు, జాడం బరికించి వంగజగతిం గవిస
మ్రాడాశ్రమమున నందఱు, పోఁడిమిమై నుంట తెలిసి పొంగితి నెడఁదన్. ౧౦

క. గోపాలకృష్ణగోకులు, శ్రీపదములఁ గెరఁగినంతఁ జెలికాండ్రఁ గనన్
జూపునిడి మధురమధురా, లాపంబులఁ వారువారలరుప్ప నొసంగన్. ౧౧

వ. బొంబయినగరంబునం దే నాఁగియుంటి - నచట నాకుం గైకోలుమన్నన వడయు తఱి సత్యాగ్రహం బించుక వలసివచ్చె - నేతదీయంబగు పరిషత్తు పేటిట్ మందిరంబునం గూడె - దానితళతళలకుం గన్నులు మిఱుమిట్లుపాలై కూలివాండ్రం బెరసి బ్రదుకుసాగించిన యే నెంతయుం గలఁతచెందితి - నప్పటినావేస మంగరకా పాగా మున్నగువానిం గూడి యిప్పటిదానికంటె నెఱుఁగు నాఁదగు - గాని సమలంకృతులైన సభాసదులయం దేను వెక్కిరింపఁదగి యుంటి - నైనను మాననీయుండగు ఫిరోజిషామెహాతాయండదండల నిల్చి యెట్లకేని గట్టునం బడితి - నానాఁటిస్వాగతపత్రిదు లాంగ్లభాషలో నడిచె - వాని కేను గుజ్జరిబాసం బదులాడ నోహటిల్లితి - నంత ౧౨

ఆ. నన్ను సత్కరింప నగరమ్మునం గల, గుజ్జరాతివారు కొలువుదీర్చి
రందు ముఖ్యవక్త యయ్యె జిన్నాసాహెబ్, బతఁడు ఘూర్జరీసుతాళి నొకఁడ. ౧౩

క. చెప్పినముక్కలు నాల్గును, గప్పురపుంబల్కులట్లుగా నాంగ్లమునన్
గుప్పె నతఁ డన్యులు న్గతి, దప్పక మాటాడి రపుడు త త్పరభాషన్. ౧౪

క. పదపడి నా ప్రత్యుత్తర, మది గుజ్జరియంద వినిచి యాంగ్లోక్తి నిటన్
వదలఁదగు నంటి మన కు, న్నదిగద యొకబాసయంటి నమ్రత వెలయన్. ౧౫

గీ. ఎన్నఁడో దేశమును వీడిచన్న యేను, గ్రొత్తగా నేఁడ వచ్చి యీగోష్ఠి నిట్లు
మోహరించుట కూడదేమో యటంచు, జంకితిని గాని కొల్వు నాసరణి మెచ్చె.

క. నా కపుడు బలము చేకుఱె, నీక్రొత్తతలంపు జగమునెదుట వెలార్పన్
వీఁక యొదవెఁ బదపడి పూ, నాకుం జనవలసెఁ గృష్ణు నాగురుఁ జూడన్. ౧౭

***

౨ పూనాలో గోకులుతో

గీ. గోకులుం డీవు పూనాకు రాకముంద, రాష్ట్రపాలుని గనుట కర్తవ్య మనుట
నతని విల్లింగ్డనాఖ్యుఁ జేరితిని కుశల, వార్తలైనంత నమ్మేటి వలికె నిట్లు. ౧

గీ. దొరతనముపట్ల నెట్టియాందోళనంబు, సేయనెంచిన నాతోడఁ జెప్పిసేయు
ముభయపక్షంబులకును లగ్గాదవు దీన, రిత్తవేసటయుం దలయెత్త దపుడు. ౨

వ. అనుటయు నిట్టివాగ్దానమున కభ్యంతరమేమి ? - సత్యాగ్రహవ్రతినగు నాకు నాయెదుర్చువారితలఁపుం దొలుతొల్త నెఱిఁగికొంట యవశ్య కార్యంబ - తదనంతర మొప్పినంతవట్టు వారి కిష్టుండనై మెలఁగఁ జూతు - నాఫ్రికాబ్రదుకునం

దిట్టినేమంబు నెల్లప్రొద్దులం బాటించితి - నేఁడుం దీని ననుసరింతు - నని యేను
వక్కాణింప నయ్యధికారి తద్దయుం దనిసి నన్నుఁ గొండాడి ౩

ఆ. వలసినప్పుడెల్ల వచ్చి నాతో మాట, లాడవచ్చు నీకు నడ్డులేదు
కోరి ద్వారతననమ్ము వా రెట్టిదోసమే, నాచరింపఁ గడఁగరని యెఱుంగు. ౪

క. అని పల్కుడు నానమ్మిక, యును దాదృక్షంబ యంటి నొద్దికతోడన్
వెనుకం బూనాపట్టణ, మున కేగితిఁ గౌతుకంబు మూరింబోవన్. ౫

ఆ. అచట గోకులుండు నాతనిపాలించు, సమితి సిరవుకొన్నసభ్యతతియు
నన్నుఁ గన్నయంత నాయం దను త్తమ, ప్రేమవృష్టి కురిసి పెద్దచేసె. ౬

క. ఉల్లంబులు విచ్చితి మపు, డెల్లర మయ్యాయిచర్చ లెసఁగించితి మా
యుల్లాస మపూర్వము న, న్నల్లసభం జేర్పఁ గృష్ణుఁ డాసక్తిపడెన్. ౭

క. అద్దానఁ జేర నాకును, బుద్ధిపొడమెఁ గాని తక్కుపురుషులచూపుల్
తద్దయు నా కెడమడుగై, యద్దమువలె నుంట విడితి నాతగులంబున్. ౮

గీ. లాఁతిసభ్యులకున్ నాకు లంకెపాటు, కుదురమింజేసి కృష్ణుండు కొంతనొచ్చి
యోయి! కేవలసభ్యత్వ మొందకున్న, నీవు సభ్యుండ వనియ గణింతు ననియె. ౯

వ. అంత నాతలంపులనెల్ల నయ్యుదారచరితున కెఱిఁగించి మున్నందు ఫినిక్సువీడి
వచ్చిన యనుయాయివర్గంబు నిల్వ నాశ్రమం బొందు నిర్మింతుననియు నేను
ఘూర్జరుండ నగుట నాదేశమునంద యుండి భారతసవిత్రి నారాధింతుననియుం
బల్క నామార్గంబు నమ్మహాశయుండు మెచ్చి యిట్లనియె. ౧౦

క. వలసినవి త్తము నాకడఁ, గల దాశ్రమమునకు దానిఁ గైకొను మిపుడే
చెలికాఁడ! యిట్టులైనన్, దలఁచెద నీయాశ్రమంబు నాయది యనుచున్. ౧౧

ఆ. అనుడు నూరనూర నర్థము నార్జించు, బెడఁదతీఱె దొడ్డినిడినవేల్పు
టావునట్లు కృష్ణుఁ దాదరువై తల, వ్రేఁగు డించె నంచు వేడ్కవడితి. ౧౨

క. గోపాలుఁ డపుడు సంఘు, శ్రీపాలకుఁ బిల్చి లోకసేవకు నీతం
డేపాటివి త్త మడిగిన, నాపూఁటన యిచ్చి పంపు మని శాసించెన్. ౧౩

ఆ. మరలివచ్చునాఁడు మహనీయుఁ డితఁడు నా, కొఱకు విందొకండు కూర్చె నందు
నన్నుఁ దనుపుపండ్లు మున్నగుభోజ్యంబు, లేర్పరించెఁ గూర్మి లిగురుపెట్ట. ౧౪

క. అమ్మేటి యపుడు రుగ్ణత, కిమ్మైం నడయాడలేని యింటరమున దూ
రమ్మున నుండియు నాతి, థ్యమ్మునకున్ నిర్ణయించుతావు న్గదియన్. ౧౫

ఆ. వలచి మెల్లమెల్ల వచ్చుచువచ్చుచుఁ, దూలితూలి దారిఁ గూలఁబడియె
గురున కిట్టిమూర్ఛ తఱచుగఁ బ్రాప్తించు, కతన మిత్రు లపుడు కలఁగరైరి. ౧౬

ఆ. కృష్ణు గదికిఁ జేర్చి యెల్లర మాదరం, బడరఁ దీయమాట లాడుకొనుచు
విందు గుడిచినార మిందనుకన్ మది, నాఁటియుండె గురునినాఁటిమూర్ఛ. ౧౭

౩ బెదరింపా?

గీ. బంధువులఁ జూచునాసక్తి భర్తృహీన, యై కృశించువధూనిక నరయుచింత
నన్నుఁ బెరరేప బొంబాయినగరి వదలి, కదలితిన్ రాజకోట కుత్కంఠతోడ. ౧

వ. ఏ న్రాధికారంగమున సత్యాగ్రహసమరంబున కొకసాధనమ్ముగా నాకట్టు నవరించుకొంటి - నది యచటికూలివాండ్రు పాటించువేసంబు నాఁదగు - దీనినాంగ్లదేశమునం దింటనున్నవేళనైత మాదరించితి - నేఁడు భారతమునం దడుగు మోపినవెన్క నెటాలునం దాఁచియుంచిన కాశియవాడుదుస్తుల వెలుఁగునకుం దెచ్చితి - నంగరకా దోవతి మల్లెపూవుంబోనితలగుడ్డయు నందుఁ బ్రధానంబులనంజను - నవియెల్ల నిచటినేఁతమరలం బోటమరించినట్టివ - యందలితలచీరయు నంగరేకును బనిలేనిబ్రేఁగని తోఁచి యరచట్టయు నంతరీయంబును జౌకపాటుచాతుం దాల్చితి - నిట్టిబట్టలతో మూఁడవతరగతిపెట్టియం బోవువాని లేనివానిఁగాఁ దలంతురు - నాఁ డానాఁడిక బొబ్బతెగులునకుం గుఱియై బెదరుచుంట నొకచో నధికారులు మాతరము తెరువరుల దింపి వారితిమ్మనం బరికించి - రపుడు నా కించుక వేఁకి యుంట వారు నాయూరుపే రడిగి రాజకోటంగల వెజ్జుపజ్జకుం జనుమని యానపెట్టిరి - పదంపడి మాబండి వడ్వాణుచేరుసరికిఁ బ్రజారాధనతత్పరుండు కుట్టుపనికిం బేరందినవాఁడు నగు మోతీలాలు నన్గదిసి వీరమగామునంగల పన్నునంజేసి త్రోవరు ల్గుడుచుకడగండ్ల యీగడ నెఱిఁగింపఁ జెఱసాలకేగ నాయితంపడి యుంటిరా యని యేనంటి - నంత నతఁడు ౨

ఆ. బందియన్న మాకు భయమది కాసంత, లేమినిజము కాని నేమమునకు
నగ్గపఱిచి మమ్ము నందఱ నీవ సా, గింపవలయు నిడుమ త్రెంపవలయు. ౩

క. ఈసీమవాఁడవై జన, తాసేవారతుఁడ వగుటఁ దప్పక మాకున్
నీసన్నిధిఁ జనవున్నది, మాసంప్రార్థనము నీవు మన్నింపవలెన్. ౪

గీ. నేఁడు నిన్నవరోధింపఁగూడ దాప్త, బంధువులఁ జూచి మరలి బంబయికి నేగు
నపుడు కామక నీవిందు నాఁగవలయు, వెట్టిపిన్నల మమ్ము దీవింపవలయు. ౫

క. నావారికౌతుకంబును, సేవావిధి నరయ నీదుచిత్తము పొంగున్
రావలెనని యీవాడిన, యావెంటన వచ్చువాఁడ ననుయాయులతోన్. ౬

వ. అని మధురమధురమ్ముగాఁ బల్కి నన్నుం దనవానిఁ గావించుకొనె - నవ్వేల మోతీలాలుపెద్దఱికంబెల్ల మెల్లమెల్ల నా కవగతంబాయె - సబర్మతీ సత్యాగ్రహాశ్రమమేర్పడ్డవెన్క నెలనెలం గొన్నినాళ్ళందుండి యతఁడు పిన్నలకుం గుట్టుపని యలవఱచువాఁడు - కాని ౭

ఆ. దైవ మోర్వలేనిదై వెడరాకాసి, తనము నెల్లఁ జూపి తరుణు నితని
మ్రింగివైచె నకట! మిత్రునిపోకతో, దొడ్డయడవి యయ్యె వడ్డవాణు. ౮

ఆ. పరికృతమునకు వత్తు నిఁక రాజకోటకుఁ, జేరినంత నాజ్ఞ గౌరవించి
యాసుపత్రి కేగ నచటిభిషక్కు నా, తెఱఁగు నరసి సిగ్గుతెరలఁ జిక్కె. ౯

క. అధికారిపట్ల నాతఁడు, క్రుధయుం బ్రకటించెఁ గాని కోపించుట స
త్పథమెట్లగు నధికృతి తన, విధిఁ దా నెఱవేర్పవలదె వెఱలే కెపుడున్. ౧౦

ఆ. అంటురోగ మున్నయదనఁ దృతీయచూ, శ్రేణి వెడలువానిరీతి నరయు
కేమిదోస మెవ్వ రీపెట్టెనెక్కిన, దానిచట్ట మింత తప్పరాదు. ౧౧

క. అధికారులకుం గూడదు, పథికావళిపట్లఁ బక్షపాతము; వారి
యధమశ్రేణిం జనునరు, వృథాపరిభవింతు రన్యమ్మృగ మనుకొంచున్. ౧౨

ఆ. నీవు నీవటంచు సేవకునిం జూచి, నట్ల చూతు రతనియార్తనాద
మాలకింప రెంతకైనఁ దెగింతురు, తన్ని యీడ్చి వానిధనము గొందురి. ౧౩

క. రొక్కముదిని చీటీ నిడ, రక్కట తప్పింత్రుబండి నవగడమిది నే
నక్కడ నక్కడఁ గుడిచితి, నిక్కము సెప్పితిని దీని నిల్పుటవలయున్. ౧౪

ఆ. విత్తమున్నవారు చిత్తంబుమార్చ్చ యీ, దిక్కులేనివాని తెఱఁగు దిద్ద
నెక్కవలయు నాతఁ డేగెడుపెట్టెలో, స్రుక్కవలయు నెన్నిచిక్కు లున్న. ౧౫

క. అతనికి దవ్వైన సుఖ, స్థితి మాకును ఫలదటంచుఁ జెప్పుట వలయున్
మతినిడి వానికి నాగర, కత నేర్పుటవలయు భీతిఁ గడపుట వలయున్. ౧౬

క. ఏ నపు డవ్విషయమునం, దేనేలకుఁ జన్న మిత్రు లీ వీరమగా
మూనినశాయరిచట్టము, లూనము కావలయునని రలుప్తప్రతిఘుల్. ౧౭

క. చట్టపుఁజందము లన్నియు, నెట్టన చూచితిని వాదు నిక్కమ యంచున్
బట్టించితి నెడఁదకు సమ, కట్టితి దౌరతనమువారికన్నులు తెఱవన్. ౧౮

ఆ. నన్నుఁ బెద్దచేసి మున్నలవిల్లింగ్డ, నిచ్చుపల్కు గుర్తుతెచ్చుకొంటి
నతనిఁగంటిఁ గస్తియంతయు నమ్మెటి, మోరిలఁ జెప్పి ధర్మ మేలుమంటి. ౧౯

ఆ. అతఁ డుదారబుద్ధి నస్మదీయంబగు, మనవి నాలకించి తనిపెగాని
కీడు మాదికాదు కేంద్రప్రభుత్వంబ, తగును దీసిదిద్ది తగవు నెఱప. ౨౦

క. ఆయధికారులసన్నిధి, నీయది వినిపింపుమనియె నేనవ్వాల నీ
శాయరిచేఁ బ్రజలందెడి, రాయిడి సకలమ్ము వ్రాసి రారాజునకున్. ౨౧

క. పలుమార్లు విన్నవించితిఁ, దొలఁగెను రెండేడు;లపు డెవో షనిమీఁదన్
గనిసితిని జేమ్సుఫర్గును, దెలిపితి నీగోడవ నతఁడు తెలతెలఁబోయెన్. ౨౨

క. తెప్పించె నెల్ల పత్రము, లప్పా! వీలున్నఁ దీర్తు నని సెలవిచ్చెన్
ముప్పియ్యది వెనువెంటన, తప్పించినయ ట్లెఱింగి తనిసనినాఁడన్. ౨౩

వ. ఏ నీగెల్పు సత్యాగ్రహమూలబంధ మనితలంతు – నేలయన వీరమగామునందలి పన్నుబాధలం గుఱిచి బొంబాయిప్రభుత్వ కార్యదర్శి చెంత నేమున్నముచ్చటించుతఱి 'బగసాి'యందు నాచేసినయుపన్యాసంబు నతఁడు వెలికిం దీసి యిది సత్యాగ్రహం బని జంకెనగావించితి – వీచప్పళ్ల కింతచేవగల యేలుబడి బద్దలెల్లు నని తలంతువా – యని కీవిమైఁ బల్క– ౨౪

ఆ. నరుని మేలుకొల్పువెర విది జంకెన, చేఁతయని తలంపఁజెల్ల దీవు
ప్రజలు నేఁడుకుడుచు బాములఁ దూలింపఁ, దగినయొఱపు లాడఁదగును నాకు. ౨౫

క. బానిసమును దెగటార్పఁగ, మానస మున్నట్టివారు మానక విజయ
శ్రీ నించు నెత్తు లన్నియుఁ, గానందగు ననుభవంబు గడియింపఁదగున్. ౨౬

క. ఈవసుధఁ నరుపన్నిన, యేవెరవుం గన్న దాన హింసయ తోఁచుఁ
గేవల మొకసత్యాగ్రహ, మేవెలయు నహింస కెల్ల నెల్లయనంగన్. ౨౭

క. నాయాశుగ మిది దీనికి, నాయంకుడ నేను నన్ను నమ్మినప్రజ కీ
సాయకమర్మము లన్నియుఁ, బాయక యే నెఱుఁగఁజేఁత పాడిగఁ దలఁతున్. ౨౮

క. తెల్లదొరతనముపే ర్వెన, మల్లోకము లదరుఁగాని మోహనగాంధీ
వాల్లభ్య మేతదస్త్రము, చెల్లును బ్రహ్మాస్త్రమునకుఁ జెలియై బలియై. ౨౯

క. అని యేను జంకెఱుంగక, వినుచుడు నమ్మంత్రి లెస్సవింతలు వింటిన్
గనుఁగొందము మున్ముం దనెఁ, దనదర్పము పొంగిపొంగి తల నూఁగింపన్. 30

***

౪ శాంతినికేతనము

గీ. వెడలితిని రాజకోటను విడి రవీంద్ర, కేతనంబైన శాంతినికేతనమున
కచటియొజ్జలు విద్యార్థు లవధిలేని, పేర్మి నాపట్లఁ గురిసిరి కూర్మిజల్లు. ౧

క. నెమ్మియు డంబములేమియుఁ, గమ్మనిశిల్పంబు చిందఁగా స్వాగత ప
త్రి మ్మొసఁగిరి విద్యాసద, నమ్ముఁ గలేల్కరుని గంటి నాఁడే యచటన్. ౨

గీ. మగనలాల్ పెత్తనమ్మున మాఘనిక్సు, మిత్రు లందుండి; రాశ్రమసూత్రములకు
నగ్గపడి నైజ ధీసౌహృదాదికముల, నతఁడు క్రొత్తావి నింపె నయ్యాలయమున. ౩

వ. ఆనాఁ డాక్షేత్రంబునఁ బూజనీయు లాండ్రూసు పియర్సనులుం గలరు – జగదానంద నేపాల సంతోష క్షితిమోహన నగీన శరత్ కాళీబాబులతోడ చెలికారంబును నా కపు డగ్గలంబుగా నొదవె – మఱియు ౩

క. గురుశిష్యులతో నట నం, దొఱతో నదికితిని బ్రికృతి తోడగుకతనన్
నరుఁ డెపుడుఁ దాన తనపని, జరిపికొనవలయు నంటి సవినయఫణితిన్. ౫

క. జీతంబునిచ్చి పాచకు, చేతన్ వండించుకంటె శిష్యులు గురులున్
బ్రీతివడి కూడుగూరలు, చేత కడున్ లెస్స యంటిఁ జెలికానివలెన్. ౬

ఆ. గురుఁడు బానసమ్ము పరికింపసాగిన, నాఁడు బాలకుల కనామయంబు
శీల మెంతయేని చేపడునంటి నా, యుక్తి మెచ్చి రొజ్జ లొకరుతక్క. ౭

క. క్రొత్తపనియన్నఁ గుఱ్ఱల, చిత్తము క్రోల్లుకుఁ గాన శిష్యులు హర్షా
యత్తులయి రస్మదిచ్ఛకు, నత్తెసరులుపెట్టి తఱిగి రప్పుడ కూరల్. ౮

క. గురుదేవుం డిదిసెప్పుడు, సరియని యాచార్యులన్న శంకింపననేన్
బరువనక పియర్సను సం, బరపడి చెమరోడ్చి వంటపని దీర్పంగన్. ౯

క. కొందఱు బియ్యముఁదీర్చుట, కొందఱు కట్టియలు వ్రియ్యఁగొట్టుట సాలన్
గొందఱు కడుగుటయున్ గను, విందైయే నెల్లలేనివేడుక గంటిన్. ౧౦

క. ఎవ రలసిన నెవ రోడిన, నెవ రిదికాదన్న నేదయెఱుఁగక వికస
ద్వదనమ్ముతోఁ బియర్సను, పెదపెదగుండిగలు తోమి పెంపఱకుండున్. ౧౧

గీ. వంటహండులు తోమెడివారు కుడుచు, నలసటన్ మఱపింప గాయకులు కొంద
ఱమరవాటీ మరందధారానుసారి, సారగీతి వెలార్తు రవ్వారిముందు. ౧౨

వ. ఇట్లు శాంతినికేతనమెల్ల మధుకోశమ్మువోలె జుంజుమ్మనం దొడఁగె – నవ్వల ఫినిక్సునంబలెఁ దాలింపులేని పాకపద్ధతి నిం దలవరించితి – నద్దానఁ గూడుగూర లేకకాలమ్మునంద మఱ్ఱి పొయ్యిపై నుడుకుచుండె – నౌకరిద్ద ఱొజ్జలుం గొందఱు చట్టులుం బూని దీని సంతరించువారు – వంటసాలయెల్ల నిమ్మెయిఁ బరాధీనతం బాసి వాసింప దొరఁకొనెఁ – గాని కొన్నాళ్ళ కీదారి మాఱి తొంటియట్ల యయ్యె నని వింటి – నైనను దీనంజేసి నికేతనమ్మున కించుకయేని లెస్సయ మొలతెంచి యుండు – నది యట్లుండె. ౧౩

క. కొన్నాళ్ళీగురుదేవుని, సన్నిధి వసియించి కొంతసంస్కృతి వడయన్
గన్నిడితిఁ గాని దైవము, నన్నున్ మెడపట్టి యీడ్చినది నిర్దయమై. ౧౪

ఆ. నాకు నిచట నైడునా ళ్లైగి యేఁగక, ముంద గోకులుండు బొందివదలి
చన్నవార్త పిడుగుచందాన వచ్చి మ, మ్మకట! దుఃఖవార్ధి కగ్గపఱిచె. ౧౫

గీ. తల్లిపోయినలేఁగనై తల్లడిల్లు, నన్నుఁ గుస్తరింప వయస్యు లెన్నియేని
పల్కు లాడిరి సురపదపాంగణమున, జరిగె సంతాపసభ దాని మఱవనేర. ౧౬

కం. ఏ నప్పు డపుడ కస్తురి, తో నెచ్చెలి మగనలాలుతో నెవ్వగతోఁ
బూనాపట్టణమునకుం, బైనము సాగించినాఁడఁ బదములు వడఁకన్. ౧౭

గీ. మాననీయుఁ డాండ్రూసు బర్డ్వానుదనుకఁ, దన్నుఁ దొడరుచు నెచ్చెలీ! తావకీన
మస్త్రరాజంబు సత్యాగ్రహంబు నిచటఁ, బఱుపుతఱి యెప్పుడౌనని పల్కరించె.

వ. అంత నేను దీనికిం బదులుసెప్పఁజాల - గోపాలుం డొకయేఁ డీదేశంబునెల్లం గ్రుమ్మరి పరికింపుమనియు నీలోనన దానిగుఱిచి యెట్టినిర్ణయంబేని వెలువరింపకు మనియు నా కాన వెట్టె - నాయయ్యపల్కు శతధా పాటింతు - నది నాధర్మమని తలంతు - నవధి ముగియుంగాక యక్కఱలేని యనుయోగంబులకు నుత్తరం బిడఁజాల - నైనను భారతమునం దీక నైదేండ్లదనుక శాంతిసమరంబు రేఁగదని విశ్వసింతు - నని విన్నవించితి - గోకులుండు 'హిందూస్వరాజ్య' గ్రథితంబులగు నాయాశయమ్ములెఱింగి దేశమందొకయేఁ డుండువేని నీతలంపులువాని వియ చల్లపడునని నవ్వువాఁ డన్నవార్త నిచట వక్కాణించుట సముచితంబు.

* * *

౫ మూఁడవతరగతివారిపాట్లు

గీ. క్రిందు బలువయ్యె బర్డ్వానుఘట్టమందు, రైలుచీటి నుపార్జించువేళ నాకు
దొడ్డతరగతి నేగుపాంథులకుఁ గాక, చిక్క దది మాకు ముందని చెప్పెఁబెద్ద. ౧

క. కిటికీ విచ్చినయంతన, యటుసేరితిఁ గాని రాపు లగ్గలమయ్యెన్
బటుతాహీనులు తద్దయుఁ, గటకటపడి రపుడు దక్కెఁ గాఱియ నాకున్. ౨

ఆ. ఒత్తులోర్చి యెట్టకో చీటివడసితిఁ, దుళ్ళిపడుచు వచ్చె ధూమశకట
మాముపెల్లు గునిసియాడ బలిష్ఠులౌ, వారు చనిరి వగ్గువాండ్ర నెట్టి. ౩

క. ఎక్కనవా రెక్కెడువా, రక్కట! తిట్టుకొనసాగి రన్యోన్యశిరో
న్యక్కారంబులు మొరసెను, దిక్కేమని యేను బెద్దదిగులునఁ బడితిన్. ౪

క. ఆపెట్టెకు నీపెట్టెకు, వే పరువెత్తితి నదేమి విడ్డూర మొకో
పోవా మ్మిట నెడలే దని, రేపెట్టియుఁ జేరి యెంతయెడమడు గైనన్. ౫

క. పదపడి మాగతి యేమని, కొదుకుచుఁ జని శకటరక్షకునకు వినిచితిన్
బదమున్న నెక్క లేదా, పిదపన రమ్మని యతండు బింకము మెఱసెన్. ౬

ఆ. పయన మాఁపరాని పనియిది యించుక, కరఁగిచూడు మంటిఁ గాని యాతఁ
డాలకింపఁడయ్యె నస్మదీయోక్తి వె, న్వెంట బండికదలుగంట మొరసె. ౭

క. సోదరు నెందేఁ జొరుమని, పైదలితోఁ జేరినాఁడఁ బైతరగతికిన్
దాదృక్పరిణామము గని, యాదొర సామ్మడుగ వచ్చె నవ్వలియంచెన్. ౮

ఆ. నాకుఁ దగినచోటు లేక యీబండికి, నేగుదెంచినాఁడ నింతనిక్క
మిప్పుడేని వసతి యిదియని చూపుచో, నడ్డుసెప్పనంటి నతని కేను. ౯

గీ. **అతఁడు నామాట** పెద్దసేయక వివాద, మేలసాగింతు చోటులే దిపుడు నీకు·
బెచ్చురొక్కము చెల్లించుమిచ్చు లేని, నాఁడు దిగిపొమ్మటంచు నోహాడఁ దొడఁగె.
ఆ. అతని నిల్వరించి యారగడం బెంచు, వేడ్కలేమి వానివిత్త మిచ్చి
వేఁడివేల్పు వొడుచువేళకు 'మొగలుస, రాయి' ఘట్టమునకు రాక జరిగె. ౧౧
క. అవకాశం బేర్పడి మూఁ, డవతరమున కేగినాఁడ నప్డు; డీ సర్వ
వ్యవహారము నధికారికి, వివరించితిఁ బెట్టెమార్పు వెల్లడిపొంజెన్. ౧౨
గీ. సాక్ష్యముగ నాల్గుమాటలు సంతరించి, చీటినిమ్మంటి నతఁ డది సేయనొల్లఁ
డవల రాఁదగ్గవిత్తంబు నంపుఁడనుచుఁ, గమ్మనంపితి నగ్రాధికారికడకు. ౧౩
గీ. అతఁడు సాక్ష్యమ్ము లేనినాఁ డర్థమీఁగఁ, బాడికన్పింప దైన మీపట్ల శంక
నవధరింపఁగఁజాల రాఁ దవినసొమ్ము, పంపుచున్నాఁడ నని లేకనంపి తనిపె. ౧౪
క. ఈ మూఁడవతరగతిలోఁ, నామనుగడఁ బడ్డ యాతనల్ వివరింపన్
సామాన్యగ్రంథము గా, దాముప్పుల నచటనచట నలఁతిగ వినుతుఁ. ౧౫
క. కాయపటుత్వము కొఱవడి, నాయీపయనంబు మానినాఁడను విధిలే
కీయెడఁబాటున కే నెం, తో యడలినవాఁడ నడలుదు న్మనుముందున్. ౧౬
ఆ. ఈతృతీయవీధి నేగడుప్రజల యం. గదకు వారిస్వార్థకాంక్ష కొంత
యెఱుకలేమికొంత హేతువౌఁగా కథ, కారిగర్వ మాదికారణంబు. ౧౭
క. నానావస్థలతోఁ గ, ల్యాణికి వచ్చితిమి మగనలాలున్ నేనున్
స్నానమొనర్చితి మంచియు, మానిని యెచ్చోటఁదీర్చు మజ్జనవిధులన్. ౧౮
వ. అందులకేఁ దారాడుతటి భారతసేవకమండలికిం జెందిన 'కౌలు' న స్నానవాల్ల పట్టి కస్తూరిని ద్వితీయశ్రేణింగల యుపస్పర్శశాలకుం జేర్తు నా నతనిసాధుత్వ మొదవంజేసికొంటకుఁ దొలుతొల్త వెనుకాడితిఁ - గాని తుట్టతుదకు నియ్యకొంటి- సత్యారాధకున కిది యుచితంబు కా- దేలన నాయింతి కటం దానమాడు చనవు లేమియు నాపె యాగదియంద యవగాహింతు నను పూన్కిగలది కామియు నాకుం దెలియుఁ - దెలిసియు మగనివలపునం జిక్కి సత్యంబునుల్లంఘించితి -సత్యస్వరూపముం జూడ మాయా స్వర్ణయవనిక నిరోధంబగు నని యుపనిషత్తు ఘోషించుగదా !

***

౬ నా ప్రయత్నములు

క. పూనాపురికి న్వచ్చితి, దీనతమై నున్నహితులఁ దిలకించితి ధ
ర్మానుగము లార్ద్వదైహిక, నానాకర్మములు ముగిసినవి కృష్ణునకున్. ౧
క. పదపడి భారతసేవక, సదస్సుకర్తవ్య మేమి సద్గురువ్రాదికిన్
ముదమేర్పడ మన మెవ్విధి, బ్రదుకం దగునంచు నేము పలుచందములన్, ౨

వ. తర్కంబులు సాగించితిమి - సమితియం దే నావేశించుటయు నాంటిసమస్యలయం
దొకటియయ్యె - గోకులుం డిచట నున్నంతవట్టు నాకీహాత్తుతోడియావశ్యకము
లేకపోయె - నతనియానతిం బాటించుటయ నాధర్మం బనియు, ఝంఝూఝంప
కుం జిక్కి యల్లాడుమాతృభూమి కట్టిమేటి యారకాటియై నిలువ నాకు దిగులే
మనియు నపు డేను భావించితిం - గాని ౩

ఆ. నేఁడు గోకులుండు లేఁడుగదా! తదీ, యాత్మ తృప్తివడవ నతనిసమితి
నిపుడు చేరుటొప్పు నే నని సభ్యతం, బడయు నపుడు పట్టుపట్టినాఁడ. ౪

క. నాఁడు సదస్యులు పెక్కురు, కూడిరి నామార్గమన్నఁ గొందఱమదికిం
గీడనితోఁచెను వారల, నోడకుఁడని తేర్పఁ బెద్దయున్ శ్రమపడితిన్. ౫

క. ఎల్లరు నన్నుఁ బ్రేమింతురు, తల్లులవలెఁ దండ్రులట్లు తనిపెద రైనన్
బెల్లాదరింతు సంఘము, నల్లది యుచితంబ వారి కది వేల్పుగదా. ౬

క. ఈకతమున మాతర్కం, బేకటుభావంబులేక యింపుగ నడిచెన్
నీకు న్నాకు నభిప్రా, యైకీభావము పొసంగదని రపు డెదురుల్. ౭

క. ఉత్తరపక్షీణములకుం, బొత్తెక్కడ ననిరి యిట్లుపోయిన రేపీ
తుత్తుమురై గురునాత్మకు, నుత్తల మిడు సంఘ మనిరి యుడుఁగనితాల్మిన్. ౮

క. మఱియొకపరి చర్చింతము, త్వరయేమని యెవరియింటిదారికి వారల్
మరలిరి మన్మానస ము, క్కిరిబిక్కిరియయ్యె నపుడు కృత్యము నెఱుఁగన్. ౯

క. పెక్కురు సభ్యులు నాదెస, మక్కువగలవారె కాని మతభేద మిటుల్
నెక్కొన్నసమితిఁ జేరుట, చిక్కులకున్ బాదటంచుఁ జివరకుఁ దోఁచెన్. ౧౦

వ. త దనంతరంబ నాసమస్యను బరిష్కరింప సభ్యులం గూర్పవలదని మాననీయుఁడు
శ్రీనివాసశాస్త్రికి లేఖవ్రాసి నాతలవ్రేఁగు డించుకొంటి - నన్నెదిరించినవారి
కీవార్త హర్షజనకం బాయె - వారితోడిచెల్మియు నవ్వల నా కెక్కుడుగా
లభించె - నేతత్సమితితో నాకు లౌకికసంబంధము లేకున్న నేమి? - దాని నధః
కరించు నాధ్యాత్మికబాంధవ మేర్పడె - నదిలేని లౌకికసంగ ముసుఱులేని మేనిం
బోనిది కదా! ౧౧

* * *

౭ కుంభోత్సవము

క. అగదంకారుని రంగూన్, నగరంబున నిలుచువాని నానెయ్యుర నొ
డ్డగువానిఁ బ్రాణజీవను, జగదాప్తుం జూడ నెడఁద సందడిపెట్టెన్. ౧

క. కలకత్తా మఠ్పథమునఁ, బొలుచుట నన్నచట నాఁపె భూపేంద్రుఁ డతం
డలఘూపచారములతోఁ, వెలలించెను భక్తి మేటివిందులతోడన్, ౨

క. వంగీయు లతిథిపూజకు, ముంగలివా రనుట నిక్కముగఁ దోఁచెను నాఁ
డంగద ఫలములతోడన, భంగించెడివాఁడ నిక్కృతపక్వాన్నుఁడనై. ౩

ఆ. అపుడు మత్తనూజుఁడగు రామదాసు నా, సరసఁ గలఁడు కలరు సఖులు కొంద
ఱేమిసెప్ప నప్పూరీమచర్చిక నున్న, ఫలములెల్ల విలువఁబడియె నాకు. ౪

క. పలుదినుసులవంటకములు, వెలసెను మావారికొఱకు; వెలఁదులు మాబు
వ్వలు సంతరింప నెంతయు, నలఁగిరి కనువిచ్చి రేయినాలుగుజాలున్. ౫

క. ఈతిండిబాధ కడచుట, కే తెరువుం గానవైతి నిది దుర్భర మీ
చేఁతకు మాదెసఁగల సం, ప్రీతియ బీజంబటన్న రీతి నెఱుఁగుదున్. ౬

ఆ. ఔనుగాక నలుగు రతిథులకై యింటి, యెల్లపాదు నెముక లిట్లు విఱుగఁ
గొట్టుకొనుచు నిశలఁ గూర్కన్న దెఱుఁగక, సేవచేఁత పెద్దసేయనొల్ల. ౭

క. భూపేంద్రనాథవసుగృహ, మే పాటిసమాదరంబు నిడె మా కటుపై
నాపాటి యనాదర మిడి, వేఁపెన్ బాగయోడ దానివిధ మేమందున్. ౮

క. డెక్కపయనంబు మాయది, యక్కడఁ గలస్నానశాల కాకల్పము గా
లక్కట! నారకజగతికి, నక్క యనన్ మఱుఁగుదొడ్డి యందముఁగుల్కున్. ౯

క. మూత్రపురీషంబులలో, గాత్రంబును ముంచి చాటుగది కేగవలెన్
మిత్రువలె నావికున కప, విత్రత యిది చెప్పిచెప్పి విఫలుఁడనైతిన్. ౧౦

గీ. ఆకు వక్కలు కసటుపొగాకుతోడ, నమలి తమనిల్చునెడయంద యుమియుచుందు
రెంగిళులు నింతు రాకసం బెగిరిపోవ, ముచ్చటింతురు తెరువర్లు మొక్కలీంద్రుడు.

ఆ. ఎల్లవాఁడు చోటు కొల్లగొనం గన్ను, వేసియుండు సిగ్గు వాసియుండుఁ
దనకు మూరెఁడైనఁ దనమూటలకు బారెఁ, డమరవలయు నేల యని పెనంగు.

క. ఆనాల్గుపూఁట లెట్లో, ప్రాణంబుల నుక్కఁబట్టి బయటం బడితిన్
మా నొవ్వంతయు నౌకా, వాణిజ్యమువాని చెవిని వైచితి నంతన్. ౧౩

వ. దీనం జేసియు నెయ్యుండగు ప్రాణజీవనదాసుమెహతాపూనికం బట్టియు నా తిరుగుపయనంబునం దిధుమలు చాలవట్టు కొఱవడె - మెహతాసైత మక్కఱలేనన్నిపండ్లు తెప్పించి కుప్పలువోయించె - నతనియిల్లు నాపాల సొంతయిల్ల - కాన నచట నానాజాతిఫలంబుల నారగించుట మానితిఁ - గాని తిండికొలఁది నట్ల యుంచితి - నపుడు నూత్నవస్తులదెస నాయిచ్చ హెచ్చగుటం జెలికానిరావించు క్రొత్త క్రొత్తపండ్లం జవులూర మెసవం జాగితిఁ - దినుట కింతసేపు వలయు నన్నకట్టడ నాకపుడు సున్న - వెఱసంజతో మొదలిడి తొలుజాము చెల్లు దనుక నయ్యాయిబండములు మెక్కువాఁడ - నీముచ్చట వేయుం దొమ్మన్నాట పదునైదవయేఁటిది - హరద్వారమునం దాయేఁడు కుంభోత్సవము సాగు - నప్పండువునఁ దైర్థికసేవ గావింప ననుచరులతో రమ్మని నాకుం బిలుపువచ్చె - నంత

మాదళమును దోడ్కొని శాంతినికేతనమున నున్నమగనలా లాక్షేత్రంబున కరిగె-
రంగూనునుండి యేనేగి వారెంబెరసితి - హరద్వారమునంగల మహాత్ముని మున్షీ
రాముం జూచునుత్కంఠయు నాయీపయనంబున కొక హేతువు నాఁదగు -
వెండియు ౧౪

క. భగవానుఁ డెఱుఁగుఁ గాళీ, నగర హరద్వారములకు నడుమం జనుచున్
బొగబండిలోనఁ గుడిచిన, యగచాట్లు మదీయముల్ దురాత్రిప్రదముల్. ౧౫

క. ఒక్కొకతఱిఁ బెట్టియలో, నిక్కడుచీఁకట్ల కేమి నే మందుఁ గడున్
గ్రిక్కిఱిసి గోతములవలెఁ, గుక్కలవలె నుంటి మంతఘోరము నెఱుఁగన్. ౧౬

గీ. మూఁతలేనిడబ్బాలలో ముడిఁగి ముడిఁగి, మట్టమధ్యాహ్నపుంబ్రొద్దువెట్ట కదరి
యడుగులం గాల్చురేకుల కడలి బడలి, నాఁడు మాపడ్డపాట్ల నెన్నఁటికి మఱతు? ౧౭

ఆ. నాల్క పిడుచకట్టినను మిత్తివెచ్చని, కోఱ లెమ్మదనుక గుచ్చుకొన్న
నిచ్చగింతురి గాని హిందువుల్ కొందఱు, ముసలిమానుజలముముట్ట రపుడు. ౧౮

క. ఈపరమచ్ఛాందసులు రు, జాపీడకుఁ జిక్కి వైద్యశాలకుఁ జనిన
న్డ్రెపాల స్నేయుస్మా, నేపలలరసంబు నిడిన నిగ్గరు తాగ్రివన్. ౧౯

క. మనదేశంబునఁ బాకీ, పనిసేఁతయ మేలిమేలిపనియని రవి శాం
తినికేతనవాసమ్మునఁ, గనుఁగొంటిని నేఁడు దానిగడియలు వచ్చెన్. ౨౦

క. గోకులువర్గమువారలు, నీకుంభోత్సవసపర్య కేతెంచిరి సే
వాకాంక్ష వచ్చునెల్లర, కోకస్సుగ ధర్మశాల యొసఁగిరి పెద్దల్. ౨౧

గీ. అందు డేరాలువైచితి మచట మలవి, సర్జనముసేయ గోపాలుసమితి నలరు
'దేవు' గుంటలుత్రవ్వి శుద్ధిం బొనర్చు, రూకలిడి నిల్పు నూహించెఁ బాకివాండ్రు.

ఆ. అది యెఱింగినంత నిది మాఫినిక్సు వ, ర్గమ్మువారిపాలి కార్యమంటి
దేవు మెచ్చెఁ గాని మావాఁగులోఁ జెప్పు, వాఁడ నేను జేయువాఁడు మగను. ౨౩

క. డేరాలోఁ దిరపడి నను, జేరెడు త్రైర్థికులః బెద్దసేయుట తత్తత్
సారతరధర్మచర్చలు, తీరుచుటయు నాకు నింతతీఱనిచెయ్యాల్. ౨౪

క. గుంపులుగుంపులు నను ద, ర్శింప నపేక్షించి ప్రజ పొరింబొరి వచ్చెన్
అంపిది యొకనిముసంబును, దెంపన్నదిలేమి మునుఁగఁ దిన నోటిలిఠిఁ. ౨౫

గీ. ఈహరద్వారయాత్రయం దేను దక్షి, ణాఫ్రికాగడ్డఁ గావించు నలఁతికొల్వు
భారతావనికిం దేటపడియె నన్ను, కథనెఱింగితిఁ గాని బల్కస్తి గంటి. ౨౬

క. పొగబండిపైనమున మూఁ, డగుతరమున వచ్చువేళ నందఱతోఁపా
టగచాట్లువడితి నన్నపు, డగురా! యని మెచ్చు నెఱుఁగ రందలిపాంథుల్. ౨౭

క. బండిం దిగితినో లేదో, తండము లిట్లొత్తు నన్నుదర్శింపఁగ నీ
రెండింట జాలినిడఁ దగు, గండం బిదియంచుఁ దేల్చెఁ గడువేసరితిఁ. ౨౮

క. ఊపిరి కెడమీయక త్రో, ద్రోపులతో నన్నుఁ జుట్టు తుటుములఁ జూడన్
గోపం బొదవును మఱి సం, తాపమ్మును రేఁగుచుండుఁ దఱచుగ నెడఁదన్. ౨౯

క. ఆమూఁడవతరగతిలో, బాములుగా కల్గ యేరుపడ దేర్పడినన్
సామాన్యంబుగ నయ్యది, మామంచిగఁ బరిణమించి మది నలరించున్. ౩౦

క. ఆవేళ దూరమెన్నక, త్రోవన్ నడయాడుబల్మితో నుంటిని మా
గ్గావగ్రహణముగూర్చ్చ యు, శోవిభవం బపుడు నాకుఁ జొప్పడదయ్యెన్. ౩౧

వ. నేఁడు హరద్వారముం జేరిన త్రైర్థికులకు ధర్మంబుదెసం గలచూ పన్నవ నాఁజను – జాగర్యలేమియుఁ జాపల్యమును బాపండిభావంబును వలసినంత కలదు – బైరాగు లీజాతరకు నేలయీనినట్లు వచ్చిరి – పయశ్శర్కర లారగింపన వారవతరించియుంద్రు – టక్కరియొకం డిచటి కొక్కమొదవుం దెచ్చె – వాఁడొకలేదూడచరణమ్ము ఖండించి దానిం దీనివిదారితకకుదంబునం బెట్టికుట్టియాధేనువుం బంచపాదిని గావించె – లోభాకృష్టుం డతఁ డీపాపద్వయం బూఁతగాఁ బామరుల విత్తంబు కొల్లకొట్టఁ దొడంగె – నంతఁ గుంభోత్సవదినంబు దాసె – నది నామనుగడ నొకపవిత్రదివసంబు – తీర్థంబులఁగనుకలింజేసి పుణ్యారాసులార్జించుదురాశ నాపట్ల సున్న – హరద్వారమున కే నీమోహంబునకు లోనై వచ్చినవాఁడం గాను – గాని పదునేడులక్షలత్రైర్థికు లీనాఁ డీయుత్సవమునం బాల్గొనిరి – వీరం దఱుఁ బాపండు లనుట యపరాధంబగు – నందుఁ బెక్కండ్రిచట నాత్మనైర్మల్యంబు చేపడునన్న నమ్మికమై వేంచేసి రనుటనిక్కంబు – తత్పావిత్ర్య మిట్టి ప్రత్యయంబునంజేసి యేర్పడుంగాని యది యించుక కష్టం బనకతప్పదు – భగవదాదరముం బడసినపుణ్యమూర్తులుసైత మీప్రజానీకమునం దెందఱో కలరు – కాన నే నీక్షేత్రంబునకు రాక తప్పని తలంపఁజాలనైతి – నట్టితఱి నిచ్చోఁ గాన వచ్చుకలుషంబునకుఁ బాచితంబుగాఁ గఠోరనియమం బొండు తలఁదాల్చుటయుఁ దన్మూలమునఁ జిత్తంబు ననావిలంబుఁ గావించికొంటయుఁ గర్తవ్యంబకదా యని భావించితి – నాపుట్టువు నేమంబులకొఱక వెలసెఁ – గాన నేఁడు పాటింపవలయు నియమంబేమి?యనువిచారమునం దోఁగ ౩౨

ఆ. వంగనగరమందు రంగూనులో నాదు, పొట్టకొఱకు నెయ్యి రెట్టిరిత్త
యలవు నోర్చి సుక్రి రది తళుక్కునఁ గొ, త్తమించువోలె నెడఁదమెఱసె నపుడు.

ఆ. ఒరుల కూడిగంబు నెఱప జనించు నా, కొరులె యిట్లుబడలుచుంట యెట్లు
లోర్వనేర్తుఁ దిండి కొకయెల్ల గీఁత నా, ధర్మ వగునటంచుఁ దలఁచుకొంటి. ౩౪

క. కావున నక్కఱయగుతఱి, సేవించెడిమందుగాక జీవనమునకుం
గేవల మైదుపదార్థము, లే వాడుకసేయ నిశ్చయించితి నాఁటన్. ౩౫

క. రవి యస్తమించులోనన, యవి సాపడవలయు నన్నుయానయుఁ గొంటిన్
లవమేని యీవ్రతంబును, జవదాఁటక నిర్వహింపఁజను ననుకొంటిన్. ౩౬

ఆ. ఈకఠోరదీక్ష కే నగ్గపడి పదు, మూఁడుసమలు గడచె నాఁడునాఁడు
పట్టిపట్టి నన్నుఁ బరికించెనిది దీని, హారమ వజ్రకవచ మాయె నాకు. ౩౭

క. నాపూనిక యిది పల్మఱు, త్రోపాడెన్ నన్నుఁ దొడరు దొడ్డ తెగుళ్లన్
బ్రాపై మదాయురభ్యుద, యాపాదకమయ్యె వెజ్జునట్టులె యొదవెన్. ౩౮

***

లా లక్ష్మణడోల

ఆ. ముగిసె నుత్సవంబు మూర్తిభవ త్సుకృ, తమ్ము మున్ని రాముదర్శనమున
ధీమనోజ్ఞ మమ్మహామహుఁపాలించు, గురుకులమ్ము గంటిఁ గుదుటఁబడితి. ౧

క. గందగగోళములకుఁ బెను, విందు హరద్వార మచ్ఛవిధశాంతిరమా
కందము గురుకులమని నా, డెందమునకు నత్తఱిన్ గడిందిగఁ దెలిసెన్. ౨

క. మధురప్రియతా వారా, న్నిధి నన్నిఁదించెఁ బూజనీయుఁడు రాముం
డధికాదృతి నా కొసఁగిరి, విధుతాహంకారు లచట వెలసినవడుగుల్. ౩

క. ఆచార్య రామదేవుని, జూచితిఁ దత్కార్యశక్తిసొగసులు గంటిన్
నోఁచితి నాతనిచెల్మికి, మాచిత్తము లోకట రెంట మార్కొనుచున్నన్. ౪

ఆ. చేతిపనుల తెఱఁగు చేకొని తద్దయుం, దరిచినాఁడ నాడ గురులతోడ
నితరకార్యభార మెక్కుడై యొజ్జల, సెలవు పొందినాఁడఁ జింతతోడ. ౫

ఆ. ఇంతదవ్వువచ్చి తీచేరువన హృషీ, కేశతీర్థ మఘవినాశకంబు
వెలయు దానిఁగాంచి వెడలుట లెస్స గ, దా యటంచు నెయ్యు రాడి రపుడు. ౬

క. సరియని తత్క్షేత్రంబున, కరిగితిఁ బావనకథాసమంచిత గంగా
సరిదోఘమ్మున మున్గితి, మరలితి నాఁబసకు నాప్తమండలితోడన్. ౭

క. నన్నుఁ దిలకింపఁ బెక్కురు, సన్యాసులు వచ్చి; రేను జనుమార్గములన్
బ్రన్నన తిన్నన కలదని, కన్న యతీశ్వరుఁ డొకండు కథసాగించెన్. ౮

గీ. అతఁడు ధర్మప్రసంగంబు లవియు నివియుఁ, దడవి ధర్మువుపట్ల నాయెడఁద లెస్స
యిచ్చమై నున్నదని నిశ్చయించి సిగయు, జందియము నాకు లేదని కుందుగుడిచి.

గీ. ఆస్తికుఁడ వీవు హిందూమ తావలంబి, వకట! మనధర్మమునకు బాహ్యాంకమైన
పిలుకయును జందెమును లేనివేసమెట్లు, నీకురుచియించె నిదినాకు నెగులునించె.

గీ. జాలిమై నిట్లుపల్కు మస్కరిని గాంచి, సవినయోక్తుల నోయతిస్వామి! యేను
బాల్యమునఁ బోరుబందరుపట్టణమునఁ, గంటి విప్రార్భకుల జన్నిగట్లఁ జెలుల. ౧౧

క. తాళంపుఁజెవులు జందెపు, నూలికి సంధించుకొని మనోహరనినద
శ్రీ లాస్యమాడ నపు డా, బాలురు నడయాడ నాకుఁ బండులుపులిసెన్. ౧౨

క. ఏ నెపుడు బ్రహ్మసూత్రము, పూనుదునో చెవులగు త్రిపొత్తునఁ బోఁచన్
మానక త్రిప్పుచుఁ గమ్మని, యీనాదము నాలకించు టెన్నఁటి కగునో. ౧౩

క. ఉవ్విళ్ళూరిన నిమ్మెయి, నవ్వేళ స్వరియవాడునందలి బచ్చుల్
దవ్వుగనుండిరి పోఁచకు, నవ్వలఁ గొన్నాళ్ళ కచట 'నందఱుద్విజులున్. ౧౪

గీ. జన్నిదముదాల్చి ప్రామిన్కు సదువవచ్చు, ధర్మసంబద్ధమైన పద్ధతి యి దంచుఁ'
గదలె నుద్యమ మొండు మా గాంధికుదురు,కోమటులునింపిరపుడుపోఁగులనొడళ్ళ.

క. ఒకపాఱుఁ డపుడు మావాం, డ్రకు నాకుం గఱపఁదొడఁగె రామస్తోత్రం
బిఁక నభ్యంతర మేమని, చెకచెక మామేనఁ దొడిగెఁ జిన్నరిపోఁచన్. ౧౬

క. నాకుం బెట్టెలు తట్టలు, లేకున్నను జెవులుగట్టి లిప్పఫలింపన్
వీఁకను ద్రిప్పితి జందెము, చీకి తెగెం గొన్నినాళ్ళ సెల్లుడు నదియున్. ౧౭

గీ. వెండియును దానిఁ దాల్చెడు వేడ్క నాకు, నొదవమింజేసి క్రొత్తజన్నిదము దేసకు
నరుగనైతిని వయసురా నది యవశ్య, ధార్యమని నొక్కసాగిరి తగ్గవారు. ౧౮

ఆ. కిట్టి యెంతపట్టుపట్టిన నాపట్లఁ, బొఱదయ్యె వారిపాశ్రవంబు
శూద్రకునకు బ్రహ్మసూత్రంబుతగనినాఁ, డొరుల కేలజందెముండవలయు. ౧౯

క. వెలిచిన్నె దీని మోచెడు, నలవాటును మాకుటుంబ మగ్గింపదు కా
వలయునని జందె మూనన్, బలువగుకారణము కానఁబడ దిక నాకున్. ౨౦

గీ. ఏను వైష్ణవధర్మంబులోనివాఁడ, నగుటఁ దులసీసరంబు నాయఱుత నిడితి
నేమఱక పెద్దవాండ్రు నా కించుకంత, పిలుకపెట్టిరి కాని మాపితిని దాని. ౨౧

గీ. ఆంగ్లదేశమున న్నిల్చునపుడు వెట్టి, వాఁడితం డెవ్వఁడని తెల్లవారు నన్ను
వెక్కిరింతు రటంచు సిబ్బితికి లోఁగి, వీడనాడితి నా నాల్గువెండ్రుకలను. ౨౨

క. నావెంట నాఫ్రికాప్రజ, సేవించెడు ఛగనలాలుసిగ వలదన్నన్
దొవ్రంజేసితి నస్మ, ద్భావం బెదురాడు నిట్టిబహిరంకములన్. ౨౩

ఆ. ఎన్నికోట్లమంది హిందువుల్ జందెము, లేనివారు జగతిలేరు నేడు
మనమతమ్ములోని మనుజులుగారె వా, రేల నాకు సూత్ర మిది మహాత్మ! ౨౪

గీ. పోఁగుదాల్చుట నా మాఱుపుట్టు దాల్చు, టని తలంతును మాఱుపుట్టనఁగ వెలఁది
బ్రదుకు, ఇక్కిలిబ్రదుకునాఁ బరఁగు నేఁటి, హైందవసమాజమున వీనికండగలదె.

క. మనసంఘము మనదేశము, మనసంస్కృతి దుర్భరావమస్థితి లజ్జా
కనకంబై యున్నతఱిన్, జనునే తలయెత్తి మనము జన్నిద మూనన్. ౨౬

గీ. అంట రానితనమ్ము రూపౌఁచునాఁడు, హెచ్చుతగ్గులవేఱడం బెడయునాఁడు
చటులపాషండిభావమ్ము సమయునాఁడు, మనకు జంధెముదాల్చుపెత్తనమువచ్చు.

ఆ. కాన బ్రహ్మసూత్రి మూనంగఁ దగునని, మీవచించుపల్కు మెచ్చనేర
జుట్టునిల్పు మన్నసూక్తి మన్నించెద, సిగ్గుపడక యిఁకను సిగను బెంతు. ౨౮

క. ఉపవీతవిరుద్ధంబుగ, నపు డేనాడినవచస్సు లయ్యతికిం దృ
ప్తి ఘొసంగఁజేయవయ్యెను, విపరీతోక్తుల కతండు వెండియు నొగ్గెన్. ౨౯

వ. నన్ను నావాదంబుచేతన తలక్రిందుసేయ నక్కవితాల్పు పెద్దయుం బెనఁగెఁ - గాని యజ్ఞోపవీతధారణమునకుఁ జెందిననాయాశయమ్ములు నాఁడు నేఁ డొక్కరూపు నంద వెలయు - జగమునం బలుమతమ్ము లున్నంతవట్టు నెల్లమతంబున నొక్క వెలిగు ర్తుంటతప్పదు - కాని డంబమునకు నహంకారమునకుం గారణ మైననాఁడిది పరిత్యాజ్యంబ యగు - నేఁటి మనసమాజ మున్నతింబడయ నీసూత్రం బొకసాధనమ్మని యేను విశ్వసింపఁజాలఁ - గాన దీని దెసం దాటస్థ్య మూనితి - లజ్జాత్రాసంబులం జేసి శిఖం దొ్రసితిఁ గాన ననుయాయులతోఁ గొంతకొంత చర్చించి మరల దీనిం బెనుప సమకట్టితి - నంత లక్ష్మణఝోలం గాన నరిగితి - హృషీకేశమ్మును దీనిం గామక చూడవలయుఁ - దొల్లింటి మనపెద్దల ప్రకృతిరమణీయ తాభిజ్ఞతయు ధర్మబోధకశిల్పంబు దిద్దు దూరదృష్టియు నిచటం గని యేను లెస్సపొంగితిఁ - గాని ౩౦

క. పావనములు సౌందర్య, శ్రీవనములు నైన యిట్టిసీమల మనుజుల్
గావించునెగ్గులకు నా, భావమ్ము కలంగె శాంతి పరువిడె నకటా! ౩౧

క. నలుగురు నడిచెడిత్రోవల, కెలఁకుల గంగమ్మతల్లికే్రవల నజ్ఞుల్
మలమూత్రమ్ములు విడుతురు, చెలఁగుచు మిన్నేటినీరు చెఱిచెద రిస్సీ! ౩౨

క. మఱి నాల్గడుగులు వోయిన, దొరకుఁగదా వీరి కచట దొడ్డబయ ళ్ళీ
తెఱ వెఱుఁగరేమి వీ రని, పరితాపముగంటిఁ గర్మఫల మనుకొంటిన్. ౩౩

వ. లక్ష్మణఝోల నా నుయ్యెలవోలె వ్రేలాడు నాయససేతువు - మున్నిచట రజ్జునిర్మితము రమణీయం బైన వంతెన యుండ నౌదార్యరాశియగు మార్వాడీసాహుకండు దానిం దొలఁచి యపారవిత్తంబు వెచ్చపెట్టి యాలోహసేతువు నేర్పఱిచి దీనితాళపుంజెవులు దొరతనమువారి కప్పగించె - రాజభక్తిసంపన్నుం డయ్యునాఁడే నీయొప్పగింత సైరింప నోడితిఁ - దత్త్వమునం బరికింప నిది స్థిరికవరణంబు కదా - వెండియు నచటి ప్రకృతిసౌభాగ్యమున కీకట్టు వచ్చ్యయనియు వక్కాణింతు. ౩౪

***

౯ ఆశ్రమస్థాపనము

ఆ. రాజకోటలో హారద్వారమున వైద్య, నాథమందుఁ జెలులు నన్ను నిల్పఁ
గోర్కిఁ బడిరి గాని కొసకు నహమ్మదా, బాదుకేలన నేను బాదుకొంటి. ౧

ఆ. అచట వెలయునెయ్యు రాశ్రమమునకునా, వెచ్చమెల్ల నేమ యిచ్చువార
మనికిపట్టుసైత మొసఁగెదమని కడుం, గూర్మిఁజూప నంపుఁ గుదురుకొంటి. ౨

క. ఏను గుజరాతివాఁడను, గానన్ దద్భాష నండఁగాఁ గొని నాచే
నైనంతసేవ చేయుట, కానేలయ తగునటంచు నరసితి నాత్మన్. ౩

ఆ. మఱియు నందుఁ జేతిమగ్గాలపై జీవ, నంబుసేయు జన మనంత మగుట
నాలువడుకుపనికి మేలొడఁగూర్చు న, య్యవనియంచుఁ బెద్దయాసపడితి. ౪

క. మొదటన చెప్పితి నాశ్రమ, మిది కులముల లెక్కసేయ దిందలితీరున్
మదిమెచ్చి వచ్చువారలకుఁ, బదమిచ్చుఁ జుఁడీ యటంచుఁ బౌరాప్తులకున్. ౫

క. నీతలఁపుల నీకొని నీ, నీతిం దలఁదాల్చి నిల్వనేర్చిన సురియా
శీతావు తొక్కినప్పుడు, చూతము లెమ్మనియె నొక్కసోదరుఁ డెలమిన్. ౬

వ. అంత నే నాశ్రమంబునకుం బేరేమి యనుచర్చకుం దిగఁ దపోవనం బనియు సేవా
శ్రమం బనియు నెయ్యు రయ్యాయినామంబులు సూచించిరి – సేవాశ్రమంబనుట
యుచితంబ – కాని మాసేవాస్వరూపంబు దీనం దేటతెల్లఁ గాఁజాలదని నమ్మితి –
నీకఁ దపోవనం బన్నయాఖ్య మాతలకు మించినవ్రేఁగు – సత్యముం బరికించు
టయు నారాధించుటయు దానిదెస నభినివేశంబు పెంచుటయు మాలక్ష్యంబులు –
మఱియు నాఫ్రికారంగమున మాపూనినకార్యపద్ధతి నిచటం బ్రవేశపెట్టి యది
యీదేశమునం దెంతవట్టు ఫలించు నని శోధించుట నాయాశయంబు – కాన
సత్యాగ్రహాశ్రమం బనునభిధానంబు సముచితంబని యెట్టకేలకుం దెల్పి మా
యూడిగంబును దాని తెఱంగును దీన సులభంబుగా నెఱుకపడునని తనివి నందితి –
మఱియు ౭

క. ఆశ్రమ మొకసేమంబున, కాశ్రితమై బ్రదుకవలయు నని కట్టడలన్
సశ్రముఁడనై లిఖించితి, విశ్రుతు లగువారికెల్ల వినిచితి నర్థిన్. ౮

క. గురుదాసబెనర్జీ బుధ, వర్యుఁ డప్పుడు విరాగణించు వ్రతవర్గమునం
దిరపడవలె నమ్రతయుం, బరమవ్రత మిది యటన్నపల్కును మఱవన్. ౯

క. ఈనాఁటియువజనమ్మున, గానంబడ దిట్టిపొలికట్టడ యని ధీ
మానితుఁ డతండు కన్గొన్, నేనుం జూచెదఁ గొఱంత యిది సంఘమునన్. ౧౦

వ. కాని నమ్రతనుసైత మూనియమములం దిమిడ్చిన నది యదిగా నుంట పొసంగదు –
తేటతెల్లగా వివరింపఁ బూనినన్నాఁడు దానిని శూన్యత నాఁజను – నదియె ముక్తి

యగు - దానిం బడయు లాఁతినేమంబు వలయు - ముక్తిం గోరువాఁడు ప్రజం
గొలుచువాఁ డెల్లయెడల శూన్యతా నిరభిమానితలం బాటించు టావశ్యకంబ -
యొండేని యతఁడు మోక్షార్థియు సేవకుఁడుం గాక స్వార్థప్రియుండు నహంయువు
నగునందు - నయ్యది యట్లుండె. ౧౧

క. ఒకవంటసాలతో నది, యొకసంసారమ్ముఁబోలె నొప్పిదమున కే
లికయై యాశ్రమ మేర్పడె, రకరకములవారిమందిరం బది యయ్యెన్. ౧౨

***

౧౦ పరీక్ష

ఆ. అమృతలాలుఠక్కరత్యుదారుండు నా, కనిపె నొక్కలేఖ మవమకులజుఁ
డర్థ్యుఁ డర్థహీనుఁ డాలితో బిడ్డతో, నిన్నుఁ జేరు నిచ్చయున్నె యనుచు. ౧

ఆ. ఆశ్రమంబుపుట్టె నప్పుడ తలఁపని, ఘటన యిట్లు రూపుకట్టి నిలిచె
నేమిసేయవలయు నిప్డని సంభ్రమం, పడితిఁ జెలులయెదుట నిడితిఁ గమ్మ. ౨

క. వా రభ్యంతర మేమని, రారన్ ముదమంది రంత నాశ్రమవిధులన్
మీఱనిచో వారిం గొని, గారము వర్షింతుమని జగన్మాన్యునకున్. ౩

క. ఠక్కరుబాబున కాకున్, మక్కువ నంపితిని వచ్చె మాలఁడు సతితోఁ
జక్కనికొమార్తతో నది, యక్కున మను నప్డు లక్ష్మి యనునామమునన్. ౪

వ. ఈబిడ్డతల్లిదండ్రులు దానీబహన్ దూదాభాయి నామంబులం బరఁగుచుండ్రి -
బొంబాయినగరంబున దూదా యొజ్జనంబు నెఱపువాఁడు - మాయాశ్రమధర్మం
బులకుం గట్టువడియుంట కీజంట యీఁకొనియె - మే మాప్యాయనమ్మున
వారికిం గైగోలుమన్నన యొసంగితిమి - కాని ౫

క. ఈమాలవారిపొత్తున, కే మీఁకొని యుంటఁ జేసి యిన్నాళ్ళును మా
సేమంబు నరయు మిత్రి, స్తోమంబునఁ బెనుతుపాను తోఁచెన్ వీచెన్. ౬

ఆ. అద్దెయింట నుంటి మపు డచ్చటం గల, వాపి కింటివారు వచ్చుచుండ్రి
వారి వారితోడువాఁడు మారాకడ, కేవపడియె మాకు నిమ్ము సెడియె. ౭

క. మానీటిచుక్క లాతని, మేనం బడరాదు పడిన మే మిఁక నానా
హీనోక్తులు వినఁదినవలె, నానాఁటికి నతనివెట్టి ననలం దొడిగెన్. ౮

క. దూదాను గన్నయంతన, తా దావముపోలె మండెఁ దగవిటఁ బో వా
మ్మోమ్దయ్యామ యని మాలకు, నూఁదరపెట్టం దొడంగె నుడిగినతాల్మిన్. ౯

క. నో రెంతపాఱవైచిన, మీ రాతనివంక రోషమిశ్రితచిత్తుల్
గారాదని ప్రత్యుత్తర, మీరాదని యంటిఁ జెలుల కే నవ్వేళన్. ౧౦

ఆ. అతఁడు కొట్టుఁగాక యాఱడిచేత లే, వేవి సేయుఁగాక బావినీరు
మానవలవ దంటి మదిమదిమ్మైఁ జెలి, కాండ్రు నిలిచి రతనికాండ్రు సైచి. ౧౧

క. మానిగ్రహ మాయయ్యకు, నానం గదియించెఁ గొన్నినాళ్లకు మంటల్
మాని సుఖముండె నాతం, డైనను బురివారిసాయ మడుగునఁ బడియెన్. ౧౨

గీ. ఏను దొలుతొల్త గోసంగివానిరాక, సెప్పఁ జూతములె మ్మన్న చెలిమికాఁడు
నన్ను మెప్పించుపాణసి నన్నుఁదొడరు, మాలఁ జేయూరఁ గలఁడని మదిఁదలంచె.

గీ. ప్రజలు ధనమిచ్చు టది కుంటుపడినవెన్క, మాకు వెలివచ్చుచున్నద న్మాట వింటి
నెట్టిప్రశయంబు మూఁడుఁగా కీపురంబు, వదలరాదంటి మా లంబివారితోడ. ౧౪

ఆ. బల్లఁబోక మాలపల్లెకుఁ జని యంద, కాఁపురమ్ము వెట్టి యోపినంత
కూలి నాలి చేసికొని గంజిద్రావుచు, నుంద మంటిఁ జెలులయొప్పఁ గంటి. ౧౫

గీ. అంతలో బొక్కసము సున్నయయ్యె నన్న, మాట నాచెవికిం దెచ్చె మగనలాలు
బాగుబాగిఁక గూడెమ్ము బాటఁ బట్టి, సాగుదము లెండయా యంటిఁ జల్లచల్ల.

క. ఇక్కట్లిట్టివి నాయెడఁ, బెక్కులు వాటిల్లెఁ గాని బెదరక నిల్వన్
జక్కనిబాసట యెట్లో, చిక్కెఁ దుదిగడియఁ జిత్రచిత్రం బగుచున్. ౧౭

ఆ. వచ్చునెలకు లేదు వసువని మగనలా, లెచ్చరించి నాలు గేను నాళ్ళు
చనెనొ లేదొ నాదుసన్నిధికిం బాపఁ, డొకఁడు వచ్చె వేగ ముట్టిపడఁగ. ౧౮

గీ. అతఁడు శకటంబు వీధిలో నాఁగియున్న, దెవ్వరో సాహు మీకొఱ కేగుదెంచి
పంచె మిముఁ బిల్వ నన్నని పల్కినంత, బండికడ కేగినాఁడ సంభ్రమముతోడ.

గీ. నన్నుఁగని సెట్టి చిన్నారినవ్వు దోఁప, నన్న! మీయాశ్రమంబున కలతిసాయ
మాచరింపఁగ నాసక్తియయ్యె నాకు, నాదరింతురె నాకోర్కి నని వచించె. ౨౦

క. తప్పక మీయాదరమున, కొప్పెద నేఁ డట్టి దెంతయుం గావలె నో
యప్పా! యంటిని వణిజుం, డప్పటియుత్ వత్తు నెల్లి యనుచుం గదలెన్. ౨౧

క. మరుసటినాఁ డవ్వేళకు, నరుదెంచెను సేటు మొరసె నాతనిమోటా
రెటఁగించిరి చిఱుతలు నా, కుటఁగటి కేతెంచి వర్తకునిడగ్గఱుటన్. ౨౨

గీ. అతఁడు లోనికి రాఁడయ్యె నవ్వెహారి, చేరువకు నేన పోయితి నౌర! పదియు
మూఁడువేలరూపాయలమ్ముల్లె నాదు, చేత నిడి మానివోలె వేంచేసె విపణి. ౨౩

క. కలనైన నిట్టియుపకృతి, కలిమిన్ దలపోసియెఱుఁగఁ గడు నక్కజమున్
వెలయించె సెట్టి సాయము, నలిపినరీతియు నపూర్వసంధానంబై. ౨౪

క. అతఁ డెన్నఁడు మాసేవా, యతనంబును ద్రొక్కియెఱుఁగఁ డా నైగము నో ౨౫
క్కతఱిన్ మాత్రమ చూచితి, నతిసర్జన మీదృశంబు నభినందింతున్.

ఆ. ఇన్నివేలవిత్త మీరీతి నబ్బుట, నాఁగె మాలపేఁట కరుగుటైన
మొక్కవత్సరంబు చిక్కఁకుండఁగ బండి, నడుపవచ్చునంచు నాకుఁ దోఁచె. ౨౬

క. నామాలపొత్తు పొర, స్తోమమునం దొకతుపానుఁ దొడరించినయ
క్షేమని సెప్పుదు నాశ్రమ, భూమినిసైతము కలంత పొలువఁగఁజేసెఁ. ౨౭

ఆ. అంటరానివార లాఫ్రికానేల మా, యునికి నుంట తింట యుండెఁగాని
ప్రకృత మాశ్రమమునఁ బాలివాండ్రై మాల, లిరవుకొంట చాన కింపదయ్యె. ౨౮

వ. కస్తూరియ కాక లాఁతివెలందులును దానిబహేనుపట్ల నొప్పరికమూని యున్న యీగడ కడుంగడుఁ బదనుగల నాకంటికిం జెవికిఁ దేటతెల్లయయ్యె – బొక్కసము వట్టువోయి ప్రజలసాయంబు తెంపువడిననాఁడు నాడెందమం దెన్నఁదగినవగపు వెలిపులు పుట్టవాయెఁ – గాని నేఁడు తలచూపిన యీయింటిపోరు సైరింప నోటువడితి – నిమ్మాలెత యెల్లమగువలంబోనిదియు నాఁజెల్లు – నయ్యిల్లాలి మగండు పెద్దచదువరి కాకున్నను గుణదోషవిచారంబు లెస్స నేర్చినవాఁడు – వానితాల్మికే నుబ్బుచుందు – నతని కొక్కొక్కయెడఁ గింక యంకురించుఁగాని వానియోర్పు నన్నులోఁగొను – నలఁతి యలఁతి యీసడింపుల లెక్కసేయకుమని యేను దూదాభాయికిం జెప్పనతఁ డియ్యకొంటయ కాక తన యాలికిసైత మోరిమిం గఱపువాఁడు – సత్యాగ్రహాశ్రమం బీయాలుమగలపొత్తు వడయుటంజేసి పెక్కసవరింతల నెఱిఁగె – వెండియు ౨౯

ఆ. ప్రొయ్యి పెట్టునాఁడ పొచ్చెములేక మే, మంటరానితనము నాదరింప
మది సమాజమునకు నాఱనిమచ్చగాఁ, దలఁతు మనుట మాకుఁ దప్పెఁ జిక్క. ౩౦

క. ఏమింత తెల్లచేసిన, గీముసవెచ్చంబు నాఁటికిన్ నాఁటికి ను
ద్దామంబైన సనాతను, లోమిరి మాయాశ్రమంబు నుద్గాఢముగన్. ౩౧

క. మాలలతో నివసించుచు, మాలఁడు వండినది తినుచు మనుచుండుఁ గదా
మాలంబి; దీని నెఱిఁగియుఁ, బోలన్ మాకిడిరి వారు భూరిధనంబుల్. ౩౨

వ. ఈపెద్దలు తమ్ము సనాతనమతారాధకులఁగా విశ్వసింతురు – దీనంజేసి యంటరానితనంపు టట్టడుగు లుఱ్ఱూతలూఁగె నని తెల్లమియయ్యె – నియ్యది సామాన్య ప్రమాణమ్ము కాదుగదా – మఱియు నీముట్టుడోసంబు నడఁగార్చుపట్ల నన్నెదిరిన [illegible]తీఱసులం గూర్చియు నాకస్మికంబుగాఁ దారసిల్లినయంతరాయములం గడచి[illegible] నొడ్డుపట్టుటం గూర్చియు సత్యాపరిశీలనమునకుం జెందిన నానాగాథలం గూర్చియు వివరింపఁదగినగ్రంథ మెంతేని కలదు – కాని దానినిపు డుజ్జనసేతయు ముందైనఁ గొంత [illegible]యు ననివార్యంబు – కారణం బేమన ౩౩

క. [illegible]కథను వచ్చుపురుషు లు, నేకులు మని యున్నవారు నేఁ డీజగతిన్
నాకొనఁదగు[illegible], [illegible] గవక పావిత్ర్యవృత్తాంతంబుల్. ౩౪

క. సమ్మతికోలు కయ్యెయి భా, గమ్ములు వారలకుఁ జేర్చి కాఁదగు సంస్కా-
రమ్ములు సేయించుట వా, ని మ్మతి తెప్పించు టెంత నెగులో నెప్పుడీ. ౩౫

ఆ. నెగు లొకండె కాక నే నాత్మచారిత్ర్య, నియమ మతకరించుటయును బుట్టు
నగుట సత్యశోధనార్థి కీకథ నిక, వెల్లడింపఁజాల నెల్లఁ జేర్చి. ౩౬

ఆ. ఇడుమ లిట్టివయ్యు నీశ్వరాశంసన, మున్న నసహయోగ యుగముదనుక
నస్మదీయరచన మల్లనల్లన లాఁగ, వలయు నన్నకోర్కె కలదు నాకు. ౩౭

* * *

౧౧ ఒడంబడిక నెత్తివేయుట

ఆ. అడుగునంద వచ్చె హంసపాదం బను రీతి నింట బయట రేఁగినట్టి
గాలివానఁ జిక్కి గాసిల్లి తేటిన, యాశ్రిమంపుసుద్దు లవలఁ బెట్టి. ౧

క. నేటాలుకూలివారల, నూటార్చు బెడంద కొంత యోజన సేయన్
బాటిల్లెఁ దరుణ మే నె, చ్చోటన్ నెలకొన్న వీరిసుఖ మెంతుఁ గదా. ౨

గీ. లేమిడికి నోడి భారతభూమి వీడి, వీరు నేటాలుగడ్డకుఁ జేరినిల్చి
రచట నైదేండ్లు కూలిసేయంగ నొప్పి, పత్రములు వ్రాసి రీపేదబ్రతుకువారు. ౩

వ. వీరి కచట విధించినవార్షికము మూఁడుపౌనులతలపన్ను నేలుబడివారు వేయుఁ దొమ్మన్నూట పదునాల్గవ శరత్తునం దొలఁగింప నిర్ణయించిరి - కాని తచ్ఛాసన మింతదనుకఁ బ్రయుక్తంబు కాదయ్యెఁ - బదునాఱవ సంవత్సరంబున మదన మోహనుఁ డీచేటుం గూర్చి రాజప్రతినిధి హార్డింజిప్రభునకుం దెలుప నదను వచ్చినన్నాఁ డీపద్ధతిం దొలఁగింపుమని స్వమాట్లు నా కొనతిచ్చెఁ గావున వేచి యుండం దగునని యతం డుత్తరమిడెఁ - దేటతెల్లగాని యీవాగ్దానముంబడసి భారతీయు లుప్పొంగఁజాలరు - కాన వెనువెంటన దురాచారంబు నిద్దాని నడఁగింప నిశ్చయించితి - నింతవట్టు దీని దెసకుం జూపు నిగిడింపక పరాకుపాలై యున్నను ౪

గీ. నేఁడు భారతదేశంబు నిద్రలేచి, తనవిధిం బరికించుచందము నెఱింగి
తగనిప న్నిది యుంచు మాత్రమునుచెంతఁ, దడవి పత్రికలన్ దీని వెడలఁ జాటి. ౫

క. అలబల మెంతయుఁ బెంచితి, వల దీకత మాంచు నెల్లవా రెంచినటుల్
తెలిసితి సత్యాగ్రహ మిట్టి, ఫలయు నొకో యన్న తర్క వైఖరిఁ బడితిన్. ౬

వ. అంత రాజప్రతినిధి 'యదనువచ్చినన్నాఁ'డన్నపల్కు వివరించుచు 'నిపుడున్న తెన్నెనను మాటు వేఱొండుతెఱఁగుం బ్రవేశపెట్టఁ దగినతఱి వచ్చునంతన యాపద్ధతి పరిత్యక్తం బగు'నని వెల్లడించెఁ - బదంపడి పదునేడవయేటి రెండవమాసమ్మునం దీబన్నముం దుడువ మాలవ్యామహాశయుండు సామ్రాజ్యశాసనసభ నొందు

చట్టముం బ్రతిపాదించెఁ - గాని రాజప్రతినిధి దానిం ద్రోసివైచె - నీసమస్యను దేశమందెల్లం జాటుట కర్తవ్యమని నమ్మి మున్ముం దాయధికృతుం గనుకలి లగ్గని తలంచితి - నతనిం జూడ నాపంపినమనవి తోడ్తో నురరీకృతం బయ్యె - నమ్మేటి ఘమ్మునపడు నన్నాదరించి నాతోఁ బెద్దతడవు సంభాషించియు నిదమిత్థ మని యెద్దియుం దేల్చి పలుకఁడయ్యెఁ - గాని నా కతనిసాయంబు లభించితీరు నన్నయాస మొలకెత్తెంచె - నంత ౭

క. తలప న్నిది దూష్యం బను, నలజడి సాగించినాఁడ నపు డాద్యసభన్
వెలయించితి బొంబాయిని, వెలగలవా రెందఱేని విడిసిరి రచ్చన్. ౮

క. పలుతర్కంబుల కవ్వల, జులై చివరనాఁడు పన్నుచొప్పును మాపన్
వలెనని తీర్మానంబును, సలిపిరి నల్గడల నిట్లు జరిగె సదస్సుల్. ౯

గీ. జాతిగౌరవ మర్థించుసతులు పీను, మిగిలినన్నలు బొంబాయినగరివారు
రాయబారంబు నడిపి రీఱాపు నాఁపు, టుచితమని పల్కి థిల్లీకునొప్పు గనిరి. ౧౦

క. ఏను గరాచీమున్నగు, నానాపురములకు నేగినాఁడను సకల
స్థానంబుల నుత్సాహ, శ్రీ నిండ నుదాత్తసభలు చేసిరి పౌరుల్. ౧౧

క. ఈపనికిం బూనిననాఁ, డీపాటి మహాసదస్సు లేర్పడు ననియున్
నాపల్కులు ప్రజ కింతటి, తీపి నలిగించు ననియుఁ దెలియనివాఁడన్. ౧౨

గీ. తోడులేని ప్రయాణంబ నాఁ డొనర్చు, వాఁడ వేగులు నావెంట వచ్చువారు
కాని కల్లయుఁ గపటంబు లేనిమనిసి, నగుట మా కెన్నఁడేని గయ్యంబు సున్న.

వ. అదృష్టవశమ్మునం జేసి నా కానాఁడు మహాత్మతి విశ్రుతి లేదయ్యె - నైన నేమి నన్నుగుర్తించినయెడం దానిగోల తప్పకుండె - నొక్కమాఱేను బొగబండిం జనుచుండఁ బెక్కంచెలలోఁ జారులు నన్నుఁ గదిసి నాచీటిం బరికించి దానిసంఖ్య నెత్తివ్రాసికొని యించుక రగడగావించిరి - నాప్రక్కనున్న తెరువరులు వ న్నొక యతిం బలె భావించి మాటిమాటికిం బ్రణిధు లేతెంచి నన్నుఁ గలంచుటం గని కినిసి నావంకకుం జూచి యీనీచులకుఁ జీటిం జూపనేల యని పల్క ౧౪

క. పోనిండు నాకు దీనన్, గ్లాని జనింపదుగదా యికన్ వేగరు లీ
పూనినపని వారలవిధి, యౌను గదా నిక్క మరయుఁ డయ్యా! పాంథుల్. ౧౫

క. అని యాడినమాటలఁ, దనివిం గనరైరి వారిదయ నాపట్లం
గునిసెను దోస మెఱుంగని, మనుజుని బాధించు టుచితమా యని వారల్. ౧౬

క. చారుల నేదిరించిరి; నా, కీరాయిడి నతకరించు నిజుకటమునకున్
గారణమయ్యెఁ గొలందికి, మీఱినపథికాలి; తద్ద మొదిగితి దీనన్. ౧౭

వ. ఏను గరాచినుండి కాళీఘట్టమునకుం జనుచుంటి - లాహోరున బండి మాఱవలసె-నపుడు నా కెంతబడలినం దావు దొరకదయ్యె - శక్తిసంపన్నులు కిటికీవలనం బెట్టెలోఁ బడసాగిరి - నాయాశ యంతరించెఁ - బయనం బాఁగరానిది - కర్తవ్యమేమని యే నొల్లంబోవుతఱిఁ గూలివాఁ డొండు ముప్పావులా నిత్తువే నునికి సంపాదింతు ననె - నభ్యంతర మేమని యే నంటి - నతఁడు పెట్టెపెట్టెకుం జని తెరువర్ల కా ళ్ళంటి యెంతదేవురించిన నేమి వారు మెత్తఁబడరైరి - బండి సాగు తఱి వచ్చె - నపు డధ్వగుఁ డొకండు బండిలోనివాఁ 'డిం దెడములేదు - కాని యతని నెట్లో నెట్టుము - నిల్చియైన వచ్చు' నన దలారి నాసమ్మతిం బడసి నన్నెత్తి లోనం బడవైచి తనకట్నముతోఁ దానేగె. ౧౮

క. అది నాపాలిట ఘోరా, పదాశ్రియం బనఁగఁ దగువిభావరి; యెట్లో
కుదురుకొని రెల్ల రిదియే, పదివేలని యేను గొలుసుపట్టి నిలిచితిఁ. ౧౯

ఆ. కడచిపోయెఁ బెక్కుగంటలు కూర్చుండ. వే మటంచుఁ బాంథు లాము వెలయ
నన్ను నెచ్చరింప నాకుఁ దా వెచ్చటఁ, గలదు నిల్వ నేమికస్తి వచ్చు. ౨౦

క. అని యల్ల నుడువసాగితి, దననిల్చుట వారి కింపితము గా దైనన్
మఱఁగింపరు సాఁచినకా, లణఁగింపరు సానుభూతి నౌద్ధత్యంబున్. ౨౧

ఆ. కసరి విసరి పల్కఁగడఁగిరి వార లే, నడఁగి ముడిఁగి మాటలాడుచుంటి
నెట్టకేని వార లించుక తేఱి నీ, యూరు పేరు సెప్పవోయి యనిరి. ౨౨

క. నాపేరు విన్నయంతన, పాపము! తెరువర్లు క్రుంగఁబాఱిరి తప్పుల్
సైఁపుఁ డని రెడము నిచ్చిరి, చేపడె నా కపుడు తాల్మిచే నగులగ్గుల్. ౨౩

ఆ. అలపుసేరి మూరి తలకాయ గిరగిరఁ, దిరుగువేళ నిల్చుదిటవు లేక
దెసలు సూచువేళ దేవుఁ డిబ్భంగిఁ బ్ర, సన్నుఁ డయ్యెఁ బథికసమితి బెరసి. ౨౪

క. తఱి దప్పక కలకత్తా, దఱిసితిఁ గాసింబజారుధాత్రీపతి మం
దిరమున విడిసితి నాదర, భరితం బాతిథ్య మొసఁగెఁ బ్రభుఁ డవ్వేళన్. ౨౫

గీ. అమ్మహారాజు యాజమాన్యమ్మునంద, జరిగెసభ వెల్లివాడిచె నుత్సాహ మచట
వచ్చి రారచ్చకుం దెల్లవారుఁ గొంద, ఱాలకించిరి నామాట లాసపెంచి. ౨౬

వ. అంత జులై నెల ముగియకముంద యీకూలి చట్టము నిషిద్ధంబాయె నని రాచఱి కమువారు వెల్లడిచేసిరి - యిది పరిత్యాజ్యంబని యేను వేయెనమన్నూట తొంబది నాల్గవయేఁట మొదటిమొఱం జాటితి - సర్ హంటరు దాస్యకల్పంబని ముద్రవైచిన యీనీచపద్ధతి యెన్నఁడో తొలంగునని యే నాసపడితి - నెందఱెందఱో గఱువలు తోడ్పడ నేఁటికిది రూపుమాసె - నీవిజయమ్ముకల్మికి సత్యాగ్రహం

బును గారణమని వక్కాణింతు — దానిం బాటించి డస్సినవారి తుసుగడ్డం
తెలియవలచువారు నాగచించిన దక్షిణాఫ్రికాసత్యాగ్రహేతిహాసమ్ము చదువ
దురు గాక ! ౨౮

* * *

౧౨ నీలిమందు డాగు

క. సీతమ్మతల్లి పుట్టిన, పూతాత్ముఁడు జనకయోగి ప్రోచిన మహి ను
ద్యోతిలుఁ జంపారణ్యము, చూతాదివనీకదంబ సుందర మగుచున్. ౧

క. అచ్చటిపొలములు బంగరు, పచ్చులు పండింపఁ దగినయట్టివి వానిన్
నెచ్చొకవెలకు విలిచిరి, వచ్చిరి తెలవార లటకు వాణిజ్యరతుల్. ౨

క. నిఱుపేదలు చదు వెఱుఁగరు, పొరపొచ్చెము లెఱుఁగ రందుఁ బొదలెడుకాఁపుల్
దొర లీసాధువులం దమ, కరిసనమున దింపి కొల్లగట్టిరి సిరికిన్. ౩

క. దారుణశాసనములతో, వారిని బానిసలఁ జేసి వైచిరి చెమటం
గాఱిచినరైతు కూడుం, జీరయు కఱవై కడుం గృశింపఁ దొడంగెన్. ౪

వ. నాఁడు మనదేశంపు నీలిమందువిలువ మండిపోవుటంజేసి యాంగ్లేయులు తమభూములం దీపైరు వేయింపసాగిరి — వారు సేద్యగాండ్రకుం దగుకూలి నొసంగమియ కాక యిరువదింటి మూఁడుపాళ్ల నేలం గర్షకులు పండించినవనీలిపంట నెల్ల నిర్మూల్యంబుగాఁ దమకుఁ గానుకపెట్టునట్లు చట్టంబు స్థాపించిరి — వెండియుం గమ్మతీండ్రు క్రమవిరుద్ధంబులగుపన్ను లెన్నియో చెల్లింపవలయు — భూస్వాముల కధికారులచెంత వలసినంత పలుకుబడి యుండుఁ — గాని పంటకాఁపుల మొఱ నాలకించుదిక్కు లేదయ్యె — నట్టితఱి ౫

క. చంపారణ్యమునం బెన్నులంపటలకుఁ జిక్కి యలుగులంపడు రైతుల్
పెంపారు పెట్టులని యీ, చంపుం దొలఁగించు నాప్తజనుఁ డెవఁ డనియున్. ౬

గీ. అచటిదైన్యములందుఁ బా లందుకొనుచు, మనెడు హాలికుండు రాజకుమారశుక్లుఁ
డారటించుచు లక్నోపురాంతరమునఁ, గూడు కాంగ్రెసులోఁ బట్టుకొనియె నన్ను.

ఆ. చాంపరానులోనిసైరికుల్ కుడిచెడు, నిడుమలెల్ల నాకు నెఱుకచేసి
మమ్ము నుద్ధరింప మాపాలమ్మనకు రా, వలయు మీర లొప్పవలయు ననియె. ౭

క. నీచెప్పినపల్కులతో, నాచందము నిర్ణయింప నామది పాతలున్
మీచిక్కులు కాంగ్రెసునకు, సూచింపుఁడు కృత్యమవలఁ జూతమటంటిన్. ౮

వ. అంత నతనివక్కీలు వ్రిజకిశోరుఁ డాసమస్యను భారతజాతీయ మహాసభదృష్టికిం దెచ్చె — సభ్యులెల్లరు దాని నంగీకరించిరి — రాజకుమారుఁ డిందుల కెంతయుం దనిపినందెఁ — గాని యల్లలికినంతన పండువు కాదని యతం డెఱుఁగు — నగుటం

జేసి నన్నాభూమికిం గొనిపోయి తమతీఱముల నెల్లఁ దెల్లము సేయుం బట్టుపట్టె - నాపయనమ్మునం గావుక మీసీమకువచ్చి మీబ్రదుకుం బరికింతునని యేనంటి - ననంతరం బేను గాన్పూరునకుం జనఁ గర్షకుఁ డితం డచట సాక్షాత్కరించి మా నేల యీచేరువం గలదు - మాకై యొకనాటిని వెచ్చింపుఁ డనియె - నపు డే నీసారి మీకోర్కెఁ జెల్లింపఁజాల - నొండొకపరి తప్పకవత్తు - నని ప్రతినచేసి నన్నుం జెలువై చికొంటి - నంత ౧౦

క. చేరితి నాశ్రమమున కీ, సైరికుఁడు న్వచ్చె నపుడ సమయంబది ని
ర్ధారణసేయుండనె న. వ్వీరుని రవరవకుఁ బెల్లు విస్మయపడితిన్. ౧౧

క. అన్నా! కలకత్తా కేఁ, గ్రిన్నం జనవలయు నపుడు కావుక మి మ్మా
పన్నుల దర్శించెద మీ, బన్నంబులు మోవఁ బాటుపడియెద నంటిన్. ౧౨

క. కాలం బిదియని సెప్పితిఁ, గాళీఘట్టంబునందుఁ గాల్ మోపకముం
దే లోకవ్యాపకుఁ డీ, మేలికృషీవలుఁడు నాసమీపముఁ జేరెన్. ౧౩

ఆ. ఓనమాలచదువురాని కల్లయుఁ గప, టంబులేని యుత్కటప్రతిజ్ఞ
వెలయువాని వాని వీక్షించినంతన, మనసుపొంగి యతనిమనిసి నైతి. ౧౪

వ. వంగనగరమ్మునం గల కర్తవ్యమ్ము వేవేగ ముగించుకొని నీలిమందువలనిడాగుం దుడువ నే నక్కాఁపువెంట వేయితొమ్మన్నూట పదునేడగునేఁటిమొదటఁ జంపా రణ్యమునకుం బయనము సాగించితి - నే మిద్దఱ మొకయీడుగల్గి యచ్చమైన రైతువేసముతో నొకపెట్టెయంద చేరి సూర్యోదయావసరమునఁ బాటలీ పుత్రమ్ము గంటిమి - నాకా పురం బింతకుము న్నపరిచితంబు - కాన నచ్చోటులుం డగు రాజకుమారున కవ్వీట మాటసెల్లదాయని యూహించితి - బండిలో నితని యీగడ కొంత మెఱింగితిఁ - గాని యిపు డెల్లయుం గంటి - నితఁడు బొత్తిగా నమాయికుఁడు - తనచెలికాండ్రని తలంచినన్యాయవాదు లితని కట్టివారు కారు- పై పెచ్చు మనయారైతుపెద్ద వారి కాశ్రితులింబలెఁ గన్పట్టె - నిట్టి కర్షకాభి యోగులకును ధర్మవాదులకుం గలదవ్వు కొలఁదిపెట్టరానిది నాఁదగుఁ - గాన ౧౫

క. రాజకుమారకుఁ డంతన్, రాజేంద్రుని మందిరంబునకు ననుఁ జేర్చెన్
సౌజన్యరాశి యతఁ డా, రోజునఁ బురమందు లేమి రోఁజితిఁ జింతన్. ౧౬

క. సేవకులు గలరు గీమునఁ, గావలసినతిండిఁ దెచ్చెఁ గర్షకవీరుం
డేవేవో కాయగసరులు, నావెంటం గలవు తీర్చినాఁడ బుభుక్షన్. ౧౭

గీ. అంటరానితనమ్మున కాధరిత్రి, పాడుగా నుండె లెంకలు పాదుకులవు
గుట్టెఱుంగరు నానీటిబొట్టు సోఁక, నద్దిరా వారినై రక్తల్య మంతరించు. ౧౮

క. ఏ నప్పుడు శక్రుదా ర్తికి, లోనైతిని రైతుమూపె లోపలి పెడలిన్
మాను పిటు పోవయా యని, చానిన చూపించె బయటిపాకీవాడ్డిన్. ౧౯

క. ఈదృశము లనుభూతులు, నాదగుజీవనమునం దనంతము లొదవెన్
ఖేదంబు విస్మయంబును, రాదు సుఁడీ నాకు నిట్టిరాపులకతనన్.

క. ఆచేయుట తనవిధి యని, చూచెను సేవకుఁడు తనదుచొప్పది తన్నుం
బ్రోచుదొర కింపితంబని, తోఁచెను వానికి నిఁకెట్లు దూఱుదు నతనిన్.

ఆ. అక్కజమ్ము పెంచు ననుభూతు లిట్టి వా, కృపకుచందమెల్ల నెఱుకపఱిచె
నతనిపట్ల నస్మదాదర మల్లల్ల, మూరిఁబోయె జాలి ముమ్మరించె.

ఆ. అతఁడు నన్ను నడుపునట్టినేర్పరి కామి, లెస్సగంటిఁ బాటలీపురంబు
చేరుకొంట మొదలు సైరికబాంధవ, పరిగ్రహంబు లేన పట్టుకొంటి.

***

౧౩ టీహారువారి మంచితనము

క. ఏ నున్ననాఁడు లండను, లో నిల్చి మదీయమిత్రలోకమ్మున నొం
డై నెగడుహక్కు ముస్లిము, ధీనిధివృత్తాంత మది మదిన్ దళుకొత్తెన్.

క. ఒకపరి బొంబయికాంగ్రెసు, నకు వచ్చిననాఁ డతండు ననుఁగని ప్రాఁజె
ల్మికి గుర్తు సెప్పి యాదృతిఁ, బ్రకటించుచు 'నావసించు పాట్నాపురికిన్.

క. ఏ తెంచినతఱిఁ దప్పక, యాతమ్మని యింటిదెసకు నే తేరవలెన్
గౌతుకమిది పండగునని, చేతమ్మున లెస్స విశ్వసించెద' ననియెన్.

క. కావున హక్కన కప్పటి, నావచ్చుట నెఱుకపఱిచినాఁడఁ బ్రమోద
శ్రీవారిధియై పొంగుచు, వేవేగ నతండు నాదువిడిదలఁ జేరెన్.

క. తన మోటరుశకటంబున, నను నింటికిఁ జేర్చి మధురనమ్రతమైఁ బ్రి
న్ననివిం దొసంగి నెచ్చెలి, తనముం బ్రకటించి మత్కృతజ్ఞత వడసెన్,

క. రాజకుమారుఁడు సెప్పఁగ, మాజతనము తెలఁ గెఱింగి మాలానా హ
క్కజడ్డపట్ల మున్మను, పోఁజెల్లును మీ రుమ్రఘుప్పపురమున కనుడున్.

క. పైనముకట్టితి నంపితి, వైనము వినిపించు తీఁగవక్కాణము న
చ్చో నలరెడికృపలానికి, మానితశీలునకు బుద్ధిమచ్ఛందునకున్.

క, అద్దమరేయికి గాటపు, నిద్దురతఱి కచటికేగి నిల్చెను మారై
లద్దిర ! శిష్యావలితోఁ, దద్దయు నాసక్తితో నతం డరుదెంచెన్.

క. త న్నగరకలాశాలకు, వన్నియనిడు గురుపదంబు వర్జించి యితం
డున్నాఁడు నేఁడు గేహం, బన్నది లే దచట నీకృపాచార్యునకున్.

క. తన సాటియొజ్జయై సజ్జనుఁడగు 'మలకాని' నిల్చుసదనంబునకున్
గొనిపోయె నన్ను మిత్రుం, డనూనహార్దమ్ము కురిసె నప్పండితుఁడున్.

ఆ. దొరతనమ్మువారి దొడ్డకలాశాల, నొజ్జనమ్ము వడసి యున్నమేటి
నన్నువంటివాని నాఁడు మన్నించుట, నిక్క మరయ లెస్సయక్కజంబు. ౧౧

క. ఆవల బిహారునం గల, లేవడిపెం పెల్ల మూదలించెను జెలికాఁ
డీవు తలకొన్నపని యొక, త్రోవకు నేతెంచుటన్న దుష్కర మనియెన్. ౧౨

క. అతనికి బీహారుపరి, స్థితు లన్నియుఁ దెలియు లోకసేవనరతిమై
బ్రతికెడు తద్దేశీయుల, కత లాతఁ డెఱుంగు వారిగారవ మందున్. ౧౩

క. నారాకచంద మంతయు, వారికి మును సెప్పఁ గాన వచ్చిరి వీటన్
బేరందినపెద్దలు నా, చేరువ; కగ్గించి రేను జేసినచెయువుల్. ౧౪

గీ. రామనవమీప్రసాదాఖ్య రాణగన్న, సభికుఁ డీవచ్చువారిలోఁ జాలినతఁడు
మఱచిపోఁజాల నితనినామంబు నెడఁద, సభినివేశంబు నేతదీయంబు మెత్తు. ౧౫

క. అమ్మేటి మీర లిగ్గురు, నిమ్మున వసియింతు రేని యీడేరదు మీ
నమ్మినపని మాయాతి, థ్యమ్మున మాచెంత నిల్వఁదగునని తలఁతున్. ౧౬

క. ఇందు గయాబా బున్నతి, నందినసభికుండు తద్గృహమ్మున బసపె
ట్టందగును మీకు మి మ్మే, నందులకుం బిల్చువాఁడ నాతనివోలెన్. ౧౭

క. మాకు నధికారు లన్నఁ, జేకుఱుఁ దల్లడము; చెప్ప సిగ్గగు నైనన్
లోకమ్మున కోపినమే, లీకొని కావింతు మిట్టి విట మాబ్రదుకుల్. ౧౮

ఆ. రైతు లిందుఁ గుడుచు రారాపు లెన్నియో, కలవు శుక్లఁ డెల్లఁ బలికియుండు
నతనిపల్కు నిక్క మక్కటా! నేఁడు మా, నేత లిచట లేమి నెగులువుట్టు. ౧౯

గీ. వ్రజకిశోరుఁడు రాజేంద్రుఁ డజితదీక్ష, నవధరించిన సంఘసేవాభిరూపు
లిచ్చితిని దంతి వారికి వచ్చుచుందు, రమ్మనీషులు పిదప మీ కమరుఁ దనివి. ౨౦

క. ఇచటి యవుగాముఁ లన్నియుఁ, బ్రచురింతురు వారు మీకు బాసటలై య
భ్యుచితమ్ముగ వర్తింతురు, రుచింత్రు వేంచేయుఁ డగ్గఱువగీమునకున్. ౨౧

గీ. అనుడు నప్పల్కులెల్ల నాయాసఁ బెనుపఁ, జేరుకొంటి గయాబాబుగారియింటి
కతఁడు సకుటుంబముగ నంచితానురాగ, రసము వర్షించి నాకు సంతసముగూర్చె.

వ. అంత రాజేంద్ర వ్రజకిశోరప్రసాదులు పూరీ దర్భంగాల విడిచి నన్నుం గదిసిరి - వ్రజకిశోరుఁ డానాఁడు లక్నో కాంగ్రెసునం దెనలేనిపటాటోపమ్ము నవధరించి వకీలుదొరవోలెఁ జూపట్టె - నేఁడు బీహారుప్రజలకు సాజంబగు నడవడుకను డంబము లేమికిని విశ్వాసమునకును మూదలయై నన్ను లెస్సతనిపె - నితనిపట్ల సాటి పాడిపల్కరులు వెలువరించుపేర్మిం జూడ నా కెలమియు నబ్బురంబు నావహిల్లె - నదిసుత నా కీధర్మవాది బృందమ్ముతోడి నెయ్యంబు తిరపడె నంత ౨౩

క. వలసినయుదంత మెల్లను, దెలిపెను వ్రిజబా బతండు దీనులతగవుల్
తల నిడికొని వారికి మేల్, గలిగినఁ దత్సేవ దక్కెఁగద యని పొంగున్. ౨౪

గీ. త్యాగధనులయ్యు రాజేంద్రుఁ డీగుణాఢ్యుఁ, డుజ్జగింపకు పేదర్మ విజ్ఞకులు
కమ్మతీండు్రరచెంత సుంకమ్ము గొనుట, యెట్లుజీవింతు మది లేక యే మటంద్రు.

క. భృతివడయక బీదల కే, గతి సాయమొనర్తు మంద్రు కాళీఘట్ట
క్షితిని బిహారున సభికులు, జతలేనిధనమ్ము నడుగ జంకెఱుఁగ రెదన్. ౨౬

క. ఒకన్యాయవాది తనమతి, ప్రకటింపం గొనియె సొమ్ము పదివే లెచ్చో
టికిఁ జని విన్నను వేయిం, టికిఁ దగ్గినముడుపు లేమి నివ్వెఱపడితిన్. ౨౭

గీ. వలదు లోభ మిటుల్ ధర్మవాది కంచు, నపుడు సౌహార్దపూర్వకమైన మంద
లింపు నెఱపితి నాపల్కు లెన్నయును త, లంపున వకీళ్ళ న న్నాదరింపరైరి. ౨౮

గీ. చాంపరాన్ సేద్యగాండ్రుభూస్వామివలనఁ, గుడుచుకడగండ్లఁ గొన్నింటిఁ గోర్టువా
రెదుటఁ బెట్టిరి వానిగుట్టెల్లఁ దెలిసి, కరము తర్కించి యచటిసోదరులఁ గాంచి.

ఆ. అన్నలార!యిడుమ లగ్గలమై పేద, కాఁపు లింతయోట గన్ననాఁడు
పాడిపట్టువలనిఫల మది యేపాటి, యూఱడించు వీరి నుద్ధరించు. ౩౦

క. వెఱపును దవ్వుగఁ ద్రోపుట, సరియగుమం దిపుడు దుష్టశాసన మది రూ
పఱువలయును 'దీన్‌కఠియా', పరాన్నభుక్కులకు మేలిపాఠము కాఁగన్. ౩౧

గీ. చట్టమిది నష్ట మానంతవట్టు మనము, కన్ను మూయంగఁదగదు నాకార్య మిచట
నొండు రెండు దినాలతో నిండు ననుచు, వచ్చితినిగాని తలఁపది వాసె నిపుడు.

క. కండునుగదా నెఱం కిది, రెండేఁడుల కృత్యమని యెఱింగితిఁ దలఁపున్
బండించు తెఱఁగు జూచితి, నుండెద రెండేండ్లుసైత ముపకృతి యున్నన్. ౩౩

క. నాయత్నము నెగ్గఁగ మీ, సాయంబును వలయునంటి సరసుఁడు వ్రిజబా
బోయన్న యస్మదాదులు, చేయం దగుసేవ యెద్ది సెప్పుఁడా యనియెన్. ౩౪

గీ. వలదు మీ న్యాయవాదితా వైభవంబు, లేకరియును దుబాసియు నాకు వలయు
నిందు రావచ్చు నేఁజెఱకేగుదశయు, మీరలును వచ్చెదరయేని మిగులమెత్తు.

క. కారాగృహమున కోడిన, రారండని యేను మిమ్ము రాపిడిసేయన్
గోరిన వ్రాయసపుంబని, తీఱిచినం జాలు దూఁకితి రెదఁ గలనన్. ౩౬

క. ఇచ్చటి కైత్థీ యురుదులు, వచ్చినపండితుఁడఁ గాను వానిని విత్తం
బిచ్చి యెఱింగినబాసకుఁ, దెచ్చుటకుం జాల మేమి తెల్పుదు రంటిన్. ౩౭

క. ఎన్నాళ్లయినను మీ రిపు, డన్నపనుల్ సేయ మాకు నాతంకములే
దన్నా! చెఱకును దగుచే, వ న్నేర్తుమటంచు నపుడు వ్రిజబా బనియెన్. ౩౮

***

౧౪ అహింసా దేవి సాక్షాత్కారము

గీ. హాలిక భూస్వామివర్గమ్ము నంతరమునఁ, బొటమరించిన జగడాలపాలు పెఱుంగ
నిచ్చచేసితిఁ గానఁ గీ తెఱుఁగుపొంటెఁ, గమ్మతీండ్రడను జెక్కండ్రఁ గాంచవలసె.

క. కాఁపులఁ గంటకు మున్నుగ, భూపతులం జూచి వారిపాలకువఁ దెలియం
జూపునిడి సమయ మడిగితి, నాపిమ్మట వారిమంత్రియండకుఁ జనితిన్. ౨

క. మీ రీనాఁడ్టిక వారలు, కారుగఁదా మాకుఁ బుట్టుకయ్యంబునఁ బా
గ్గోరకుఁడు చెప్పఁదలఁచిన, తీరది లిఖయించి పంపఁ దివురుం డనుచున్. ౩

ఆ. అతఁడు మిన్నుసూఢ నన్నా! విదేశి నే, నగుదునని తలంప హాలికసమితి
వలచునేని వారివండలు పరికించు, హక్కుగలదు నాకు నంటి నెదిరించి. ౪

వ. అంత రాచఱికమువారు నిల్పిన మధ్యస్థసంఘము నేలుయజమానుం దఱిసి నావాదంబు మొదలిడ నయ్యధికారి (కమీషనరు) నన్ను జంకెనచేసి నీవు వెన్వెంటన తిరహూత్ పరగణా విడువందగునని హితమ్ముసెప్పె - నవ్వల నను యాయులం గని కడచినకథయెల్లం దెల్లమొనర్చి యేలుబడివారు నే నీకర్జంబు సాగింప నీకొనరు - నాతలంచిన గడియకుముంద నన్నుం జెఱగొందురని తలంతు - నట్టిపని మోతీహారినొండె బేతియానొండె రూపుదాల్చునఁ గడుంగడు లగ్గొడముఁ - గాన వేవేగ నాసీమలకుం బోక నాకర్తవ్యమని వక్కాణించితిఁ - జంపారణ్యము తిరహూత్ ప్రాంతమునం దొకమండలము - మోతీహారి దానికిం బెనువీడు - బేతియాచేరువ రాజకుమారశుక్లుండు కాఁపురించుపల్లియ కలదు - దాని కెలంకులం దిరపడియున్న కోఠీ తెగపంటకాఁపు లానీమం జేర్వడసిన గుల్ల కాండ్రు - వారిబ్రదుకుం గనవలయునని రాజకుమారుండు నన్నర్థించె - నప్పని నాకుం బ్రియమాయెఁ - గాన ౫

క. పైనమ్మును సాగించితి, నానాఁడే చనితి మోతీహారికి శీల
శ్రీనిధి గోరఖకబా, బానందమ్ము విరియ స్వాగతాదులు సెఱపెన్. ౬

క. చెలికాండ్రతోడ నాతని, నెలవున విడిసితిఁ; దదీయనిలయం బప్పు డు
జ్వలధర్మశాల యయ్యెను, గొలంది యసదైన నిఱికికొంటిమి దానన్. ౭

క. అప్పేటికి నిరుపరువుల, దవ్వున నొకరైతు తగవుదప్పినశిక్షన్
నొప్పింపఁబడెనని వింటిమి, నెవ్వగపాలైతి మెట్టినీతి యటంచున్. ౮

క. వఱువాత లేచి ధరణీ, ధరబాబుం గూడి కృషికుదర్శించుటకున్
దొరఁకొంటి బయలుదేఱితి, మిరువ్వురమున్ ఘుంభరంబునెక్కితి మర్మిన్. ౯

గీ. బండిపై ఘూర్జరంబునఁ బయన మెట్లు, నడుచు నిచ్చట నేన్గుపై నడుచు నట్లు
సాముద వ్వేగుటకుమున్న మామతంగ, మొకఁడు పోలీసుబంటు మాయొద్దఁదోఁచె.

క. మీకేటికోళ్ళు సెప్పఁగ, నా కానతియిచ్చి పంపె నాయకుఁ డనుచున్
వాకొనె నతండు తన కా, వాకునఁగల యర్థమెల్ల వైళమ తెలిసెన్. ౧౧

క. సరిసరి నీ వటకుం జని, పరిస్థితుల నరసిరమ్మ బాబూ! యంటిన్
దొరపంపిన శకటముపైఁ, దిరపడితిన్ వచ్చినట్టి తెరువునఁ జనితిన్. ౧౨

ఆ. చాంపరాను వదలిచను మన్నయాజ్ఞ నా, కిచ్చెబంటు పురికి వచ్చువేళ
నిల్లుసేరినంత నీపన్నుపైని మీ, వ్రాలువలయునంచు వాఁడు వలికె. ౧౩

గీ. ఇచటి కష్టసుఖంబులనెల్ల వినక, యేను విడనాడిపోవఁ జాంపారనుసీమ
యిది సమంజసకృత్యమం చేఁ దలంతు, ననిలిఖించి వ్రాల్ చేసితి నాజ్ఞమీఁద. ౧౪

క. శాసనధిక్కృతి చేసితి, దోసంబిది యెల్లి తడవుదుము రమ్మనుచున్
నాసన్నిధి కవ్వలఁ బో, లీసువిభుం డానపంప లెస్సయ యంటిన్. ౧౫

ఆ. కడఁగి కంట వత్తినిడికొని యారేయి, వలయుకమ్మ లెన్ని వ్రాసివ్రాసి
వ్రజకిశోరుఁ బిల్చి వక్కాణించితిఁ దగు, తగము లిట్టివంచుఁ దర్చిత్రిచ్చి. ౧౬

క. నా కానతి పుట్టినకథ, పాఁకెను గ్రామ్మించువోలెఁ బట్టణమందున్
మూఁకలుమూఁకలుగా నగ, లోకంబది నావసించు లోఁగలి కెక్కెన్. ౧౭

క. రేయెల్ల నొల్లఁబోవక, చేయందగుచేఁత లరసి చేసితిఁ గానన్
రాయిడికి దీని కోర్చితి, నాయనుచరు లొక్కతాటి నడిపిరి ప్రజలన్. ౧౮

క. ఎచ్చటనేఁ గాల్మోపిన, నచ్చట నుప్పొంగు మానవాంబుధి; యైనన్
నెచ్చెలియలికట్టలుగా, నెచ్చెలు లేర్పడిరి పడవనేర్చిరి మెప్పుల్. ౧౯

వ. అయ్యది యట్లుండె – నాపైఁ బ్రయుక్తంబైన యాజ్ఞాపత్రంబును జట్టముంబట్టి ధిక్కరింప వీలున్నను బరిగ్రహించితిఁ – గాన నేను వ్యక్తిం బరిభవింపక తదాదేశంబునుమాత్రమ సముచితంబుగాఁ ద్రోసిపైచితినని తలంచి యధికృతులు నన్నుమెచ్చి నాపాల మిత్రకల్పులుగా వర్తింపఁజాగిరి – నావలనిభీతియుం బాటిల్లదని తలంచి వీరు నన్ను రాపాడక నాసౌకర్యములనెల్లఁ జేకూర్చిరి – వెండియుఁ గోట్లనం దేశరేఁగిన మానవానీకంబు నొకహద్దునం బెట్ట నాయు నాయనుచరులయుం దోడుపాటు నిచ్చమె నందుకొనిరి – కాని ౨౦

క. తమదొరతనమ్ము వోయెడి, సమయంబది వచ్చెనంచుఁ జక్కం గని రా
జ్యమఁ గలవారలు దండభ, యము మానిరి పూని రస్మదాదేశములన్. ౨౧

క. మున్నలచంపాటవిలో, నన్నెవ్వ రెఱుంగ రచటి నాఁగటిజోదుల్
మిన్నందిన కింపాకులు, మన్నుదినిన పెద్దజెట్టిమాదిరిజంతుల్. ౨౨

క. మిన్నేటికి నుత్తరమునఁ, బన్నగభూషణున కింటిప ట్టాసఁగిన యా
పెన్నద్రిపాదమునయం, దున్నది చాంపార్ణ నూతనోర్వీతలమై. ౨౩

ఆ. అచటఁ గాంగ్రెసునకు నావంతచోటు లే, దందుఁ జేరవెఱచు నాప్రజాలి
కదలివచ్చి నేఁడు కాంగ్రెసుబలఁగ మి, య్యావనికఁ డయ్యె నభయమిడియె. ౨౪

క. ఈకడఁ గాంగ్రెసువే రిడి, నేకర్జము సలుపఁగూడ దిప్డంచు సుహృ
ల్లోకమ్మునెదుటఁ దేల్చితి, లేకుండిన నేమి పేరు లెస్సయొదవినన్. ౨౫

ఆ. అచటఁ బక్షవాదు లడరి వాచాటులై, రచ్చలందు వాక్యరణము సేత
క్రిందుమీఁదు మీఁదుక్రిం దొనరించి న్యా, యంబునిల్పి కాంగ్రెసనఁగఁ జెల్లు.

వ. మఱియుఁ జంపారణ్యమునం గల నీలితోఁటలదొరలును రాచకొలువువారును గాంగ్రెసునాఁ గుట్రయనియు రాజద్రోహమనియు బొంబనియుం దలఁతురు - వీరి కదియట్టిది కాదని నిక్కంబు నెఱిఁగింపవలయుఁ - గాన దానిపే రెత్తరాదని దాని స్థూలాకృతింగూర్చి యే నచటి ప్రజలకడ ముచ్చటింపరాదని తేల్చితిమి - కాంగ్రెసన్న మూఁడక్కరము లెఱుంగకున్న నేమి - దానియాత్మం గని తొడరినం జాలు - వలసినకార్యం బట్టిద - కానఁ బూర్వరంగముం గూర్చి జాతీయమహాసభాపక్షమునఁ బ్రత్యక్షముగా నొండెఁ బరోక్షముగా నచటి కెవ్వరుం బ్రయుక్తులు కారైరి - రాజకుమారున కట్టిసేనం దట్టుకొనఁదగ్గ బలిమియుం గల్ల - రాజకీయోద్యమప్రచార మానేలకుం గ్రొత్తనాఁజనుఁ - దత్రత్యు లితరప్రపంచముం గన్నవారు కారు - కాకున్నను ౨౬

క. తమ ప్రాఁజెలికానింబలె, రమణీయత రాదరానురాగమ్ముల వ
న్నమలినచిత్తులు సూచిరి, కమలమ్మున మునిఁగి తేలు కమ్మన వెలయన్. ౨౭

క. ఆనాఁడీమందిని భగ, వానుం గనుఁగొంటి సత్యవసువును గంటిన్
గానంగంటి నహింసను, దీనిన్ మెఱమెచ్చుపల్కు దేరక యంటిన్. ౨౮

క. ప్రత్యక్షరమును దీనన్, సత్యము యనవో ర్తు నిట్టిసాక్షాత్కృతి కే
నత్యర్థంబుగఁ బ్రజపై, నిత్యమ్ము వెలార్చు నెమ్మినెఱి హేతువగున్. ౩౦

క. ఈకూర్మి కీదృశంబన, నాకు నహింసావ్రతమ్మునన్ దినదినముల్
రేకెత్తెడి విశ్వాసమ, కాక మఱెద్దియును గాదు కాదని వినుతున్. ౩౧

క. ఆనీలిమందుజగమున, నానేరము రచ్చకెక్కవదినంబు నహో!
యే నెట్లుమఱతుఁ జాంపార్ణన్, మానవులకు నాకు నాఁడు మకరార్క మగున్.

ఆ. ప్రకృతిని బట్టిచూడ నేన విమర్శింపఁ, దగినవాఁడఁ గాని తత్త్వ మరయ
దొరతనమ్మువారె తుదకు విమర్శకులై, నారు పెద్దపెద్ద నలఁగినారు. ౩౨

* * *

౧౫ అభియోగము నెత్తివేసికొనుట

క. మొదలిడి రధికారులు న, న్నెదిరి విచారింప; నేర మిదియని తెల్పన్
మదిచాలక మినుసూచిరి, బెదరిరి నోరెత్తలేని బెడఁదం బడుచున్. ౧

క. ఏలుబడివారి సభికుఁడుఁ, చాలింపుఁడుచర్చ గడువు చాటుం డనుచున్
గోల యొనరింపసాగె న, చేలా యని మోహరించి యే నిట్లంటిన్. ౨

ఆ. అయ్యలార ! విరతి నంగీకరించుట, కేను జాలఁ జాంపరాను వీడి
చను మటంచు మీర లనిచినయానతిం, గుఱుచ చేసి యొప్పుకొంటిఁ దప్పు. ౩

వ. శిక్షాస్మృతియందలి నూటనలువదినాల్గవసూత్రమ్ము నూఁది నాపై మీపఱిపిన యాజ్ఞాపత్రమ్ముపట్ల నాకావించిన గంభీరధిక్కారంబునకుఁ గారణ మిదియని మీయానతిం గాని నిర్ధరింపవలతు — నిది నాతలఁపుంబట్టి యవిధేయత కానేరదు — మఱి యిచటియేలుబడికిని నాకుం బొటమరించిన యభిప్రాయభేదమ్మని విన్నవింతు — నిచట నీలిపంటనేలం బాలించుదొరలు సేద్యగాండ్రదెసం బాడిదప్పిరని విని నిఱుపేదలగు కాఁపుల వేఁడుకోలుం బడసి వారి కోపినంతవట్టు సాయం బొనర్ప నీగడ్డపై నడుగిడితిఁ — గాన ౪

క. ఔగాములెల్లఁ దెలియక, యేగతి సాయంబొనర్తు నీరైతులకున్
లోగుట్టెఱుంగ మీయను, రాగము భూస్వాములాదరంబును వలతున్. ౫

క. నారాక కింతకంటెను, వేఱొండుతలంపు లేద వినుఁ డిద్దానన్
మీరాజ్యమున నశాంతియు, నాఱనిబాధలు జనించునని భావింపన్. ౬

క. ఈతరగతిపనులం దను, భూతి కడుం గంటిఁగాని భూపాలు రెదో
రీతి న్ననుఁజూచిరి నా, నీతిని శంకించి రాజ్ఞనెఱపిరి నాపై. ౭

క. దొరతనమువారి సంకట, మెఱుఁగుదు వేగరులు సెప్పువృత్తాంతము వా
రఱలేక నమ్మవలయును, దొరలదు శకటంబు వేఱుత్రోవం జనినన్. ౮

క. నాపైఁ బఱిపినయానకు. లోపడవలె నేను; ధర్మలుబ్ధత్వంబున్
నాపాలఁ గలద యైనను, మీప న్పినాఁ డతిక్రమింపఁగవలసెన్. ౯

క. దానిం దలఁదాల్చితినా, యే నేపని కాసచేసి యెవ్వరికొఱకీ
పైన మొనర్చితి వారికి, దీనుల కెగ్గాచరించు తెఱఁగునఁ బడుదున్. ౧౦

ఆ. ఏను వారిచెంత కేగనినాఁ డెట్లు, సేయనేర్తు నార్తసేవనంబు
కృత్య మిట్టిదగుట నేనయి చాంపరా, నుజ్జగించి పోక యుచిత మగునె? ౧౧

గీ. అకట! యీ ధర్మసంశయమందుఁ జిక్కి, నేఁడు నన్నిటనుండి త్రోపాడు కడిఁది
వేఁగు మీతలమోపితి వెరవు నొండుఁ, గానలేనైతి సత్యమ్ముగనుఁడు వినుఁడు. ౧౨

క. ఈదేశమునం బ్రజలకు, నేదే నూడిగము సేయనెంచెడి ననుబోం
ట్లీదృఙ్మహోద్యమంబున, నాదమఱచి యుంట నింద్యమని కంటిఁ జుఁడీ. ౧౩

క. చిత్తసమున్నతి గలవాఁ, డిత్తఱి నాపోవుబాటకే రావలయున్
మెత్తఁబడ కాజ్ఞనెదిరిచి, యుత్తలపడ కనుభవించు టొప్పును శిక్షన్. ౧౪

క. నాకు విధించెడిదండన, మేకొంచెమొ యగుట వలచి యే నీపలుకుల్
వాకొంటినని తలంపక, మీకుం దోఁచినవిధంబ మేకొనవచ్చున్. ౧౫

క. న్యాయంబుకొఱకు వెలసిన,మీయెడ నాదరములేక మీయాజ్ఞ నిటుల్
ద్రోయుటకు సిద్ధపడలే,దాయాజ్ఞను మించునాజ్ఞ కంజలి నిడితిన్. ౧౬

ఆ. అది మదంతరాత్మయాజ్ఞ సుఁడీ! యేది,యెట్టులైన శిక్ష యెట్టిదైన
దాని నెల్ల ప్రొద్దు తలఁదాల్చి పోక న్యాయమతమటం చొనర్తు మనవి మీకు. ౧౭

వ. ఏ నిట్టివాఙ్మూలము నొసంగినవెన్క నభియోగంబు నిలువరింపందగిన యక్కఱ కానరాదు – కాని దండనాధికారియు రాచతీకమువారిన్యాయవాదియు నీకథ యిట్లడముతిరుగు నని భావింపమింజేసి శిక్షానిర్ణయంబు గావింపనోడి గడువుపెట్టిరి – యే నీనడుమ నియ్యుదంతమునెల్ల ఢిల్లీశ్వరునకును మదనమోహనునకుం బాటలీపుత్రస్థ మిత్రమండలికిం దంతిమూలమున్నఁ దెలిపితి – దండనుం బడయఁ బాడిపట్టున కే నేగకముంద 'యీయభిగ్రహంబును డిగ్గఁద్రావునది' యని రాష్ట్రపాలకుండు తన కానపంపె ననియు మీరు మీకృత్యంబు నిఁక నిరాఘాటంబుగా సాగించుకొనవచ్చు ననియు, నుద్యోగులు మీరు వలచుసాయంబు నెరవేర్పఁగల రనియు మండలాధికారి నాకుంగమ్మనని చె – నిట్టి లెస్సమా ర్పింతలో నొదవునని యే నూహించి యెఱుఁగఁ – బదంపడి ౧౮

క. ఉత్తమపురుషుని ధర్మా, యత్తుని 'హైంకాకు' మండలాధిపుఁ గంటిన్
మెత్తనిపలుకుల వలసిన, పత్తరములనెల్ల మీరు పరికింపఁదగున్. ౧౯

క. నన్నుం గననెంచిననాఁ, డన్నా! రావచ్చు నీకు నాటంకములే
దెన్నండు ననుచు గఱువల, కన్నాకై యతఁడు కురిసె గౌరవరుక్కుల్. ౨౦

క. ఇది సత్యాగ్రహపథమున, మొదటిదగు పదార్థపాఠము గదా! యిచటన్
బదిఁబదిగా నేతత్కథ, కదలెం బత్రికలకెక్కి కడ లన్నిటికిన్. ౨౧

గీ. పక్షపాతమ్ము విడనాడి ప్రభుతవారు, నడిపి రీనేర మని తోఁచు నాదుబుద్ధి
కగుటఁ బత్రికలెల్ల నీయడ్డు నింత, పెద్దసేయంగఁ బనిలేదు ముద్దుమాపి. ౨౨

క. మితిమీఱిన భాష్యమ్ములు, చతురతలుం జాటిచాటి సంపాదకు లీ
కత నాకసమున కెత్తిన, ఘ్రితిమించు నటన్న వెఱపుఁ జొప్పడె నాకున్. ౨౩

క. కావునఁ బ్రసిద్ధపత్రిక, లావిష్కృతిసేయువారి కయ్యా! యిటకున్
వేవేల వెచ్చములతో, మీవార్తావహులు రాక మేలని తలఁపన్. ౨౪

క. జగమునకుఁ దెల్పఁజాలిన, వగవార్తల యున్నఁ బంపువాఁడను నేనై
రగడం బెంచుటచేఁ బని, యగునా యని పేర్మి వెలయ నంపితిఁ గమ్మల్. ౨౪

క. ఏలుబడివారలకు నా, పాలం గల్గినయుదారభావము గనుటన్
నీలిపొలమ్ముల సాములు, జాలింబడి రెంత చెట్ట సమకుఱె నంచున్. ౨౫

క. అధికృతులకు నైతం బిది, వ్యధగూర్చెను గాని వార లతిశాంత పయో
నిధులట్టుల చూపట్టిరి, కథయంతయు సన్నసన్నగా వినుచుంటిన్. ౨౬

క. సత్యానత్యంబుల సాం, గత్యంబున వెడలుపత్రికలు వీరిమనం
బత్యర్థప్రతిఘం బడి, నృత్యం బొనరించుగతికి నీడ్వఁగవచ్చున్. ౨౭

ఆ. ఏనుగాక వారియీమంటవేఁడిమి, గుండెలేనిరైతు కుడువవచ్చు
నిచట సత్యశోధనేచ్ఛఁ గష్టించు న, న్నకట యడ్డకట్ట లంటవచ్చు. ౨౮

క. ఏ నింతజాగరూకత, మై నున్నను చోటదొరలు మావర్గంబున్
నానావిధపరిచారా, ధీనము గావించి రనృతధీకింకరులై. 30

క. కడుమెలఁకువతో నిది యె, క్కుడు పోటిపోటి యిద్ది యనక గుటెనిడి యే నె
ల్లెడలన్ నిక్కము వదలక, నడుచుట వమ్మయ్యె వారినట్టువ మెల్లన్. 3౧

ఆ. ప్రజకఠోరుపట్ల వా రెంత కేని తే, గించి తెగడి రెల్ల మించి; వారి
పలుకు పొగుకొల్లఁది బాబుయశస్సు రే, కెత్తఁదొడఁగె దెసల నొత్తఁగడఁగె. 3౨

ఆ. రాపు లిట్టివగుట రండని పత్రికా, లేఖకులను బిల్వలేక యుంటి
దేశసేవ మునిఁగి తేలు నాయకులఁ, చోడునిల్వఁ డంచు వేడ్కనైతి. 33

క. రావలసినతఱిఁ దెల్పిన, నేవచ్చెదఁ గొంతసాయ మిచ్చెద నని వి
ద్యావార్ధి మదనమోహనుఁ, డావేదించినను దెల్ప నమ్మహనీయున్. 3౪

వ. ఏనిట్లు పట్టుపట్టి యీనీలిమందు జగడంబునకు రాజకీయపుగ్గువల పంటకుండు తెఱంగున మెలఁగితి — నక్కఱపడినసుద్దుల నేవ వీనుమిగిలినపత్రికల కంపితి — నిమ్మెఱుక సంపాదకుల, ప్రజానాయకులకొఱక కాని జగమునకుం దెల్పుపఁగాదు — కొనకు రాజకీయ్యముగా ముగిసినను దన్నిరోధముతోడిపొత్తు లేనిపనికిఁ దదాకృతి నిచ్చిననాఁ డాచేత యాఱడిపోవు ననియు, దానిని యథాతథంబుగా నిల్పిన న్నాఁడు రాజకీయసమరమునకు నైత మది బాసట కాఁగలదనియుఁ జిరకాలాను భూతిం గనుఁగొంటి — నిష్కళంకమైన ప్రజాసేవ యేరూపమున జరిగినను దుదకది దేశమునకు రాజకీయమ్ముగా నుపకరించునని యీ చాంపరాను పోరాటంబు చాటెడిని.

***

౧౬ కార్యగతి

ఆ. ఇచటఁ జాంపరానువృత్తాంత మంతయు, సంతరించుపనికిఁ జాల; వచటి
సేద్యగాండ్రదీనజీవనకథ నూఁచ, ముట్టువల్కినపుడ ముగియు నదియు. ౧

వ. చంపారణ్య పరిశీలనంబు నా నహింసాసత్య సంప్రయోగంబ - దీనికిం జెందినగాథ లెన్నేని గలవు - వాని నుత్తమంబులని యేర్పరించిన యంశంబు లిట వివరింతు - గ్రంథమెల్లం గనవలచువారు రాజేంద్రప్రసాదరచింతమై 'చంపారన్ మేఁ మహాత్మాగాంధీ' యనుపేరం దనరుకృతిం బఠియించు టొప్పు - నది యట్లుండె - నీచర్చయంతయు గోరక్షకబాబుమందిరంబున సాగునేని వారియిబ్బంది యిబ్బడి ముబ్బడి యగుట నిక్కంబు - కాన మా కొకబాడిగయిల్లు వలసె - మా వసించుట కద్దెగీము నొసంగుదిట వామోతీహారిప్రజల కింతవట్టు పుట్టదయ్యెఁ - గాని వెరవరియైన వ్రజకిశోరుఁ డెట్లో శ్రమించి యొకయిరవు నార్జించె - దాని ముంగలను కడుంగడుఁ బఱపై నిలువం దగియుండె - నే మానెలవునం బీఁట వెట్టితిమి - కాని ౨

గీ. చేతిలో రూకలేక యేచేతయేని, సాగదుగదా ప్రజాహితశ్రీ గడింప
నాయొనర్చినపనుల కేనాఁడు నొక్క, చిన్న మర్థించి యెఱుఁగఁబో సన్నగాండ్రు.

ఆ. వ్రజకిశోరబాబువర్గంబు నా న్యాయ, వాదివర్గ; మదను వచ్చినపుడు
వారు, వారితరమువా రగుమిత్రులు, వేసికొందురి విరళ మోసరిలక. ౪

గీ. పచ్చపచ్చగఁ గాలంబుపుచ్చు మేము, దేవురింతుమె సామాన్యజీవిమోల
నని తలంతురు వార లీయాశయంబు, సముచితం బనఁదగు వాదసరణిఁ బట్టి. ౫

క. ఈపనికిం జంపాటవిఁ, గాఁపురమొనరించు సేద్యగాండ్రధనంబున్
జేపట్టరాదు రువ్వాయు, నాపద్ధతికిన్ దురర్థ మంటును గానన్. ౬

గీ. వెండియును భారతావనీమండలంబు, లెల్ల నీభిక్ష నిడుట కేనొల్లనైతి
నాపనికి రాజకీయస్వరూప మప్పు, డొదవు దేశీయతయు సోఁకు నోటలేక. ౭

క. అల బొంబాయిపురమ్మున, వెలయుచెలుల్ పదియునైదువేలధనం బీఁ
దలఁచినముచ్చట చెవిఁ బడ, వలదు వలా దంటి నేను వందనములతోఁ. ౮

గీ. చాంపరాన్మండలంబు సుజ్జనరమొనర్చి, తక్కినబిహారునం గల ధనవదాఢ్యు
మొండయుపసర్పణీయమిూవండకనియు, నడుగునాతఁడువ్రజకిశోరనియుఁగంటి. ౯

క. అక్కఱయగుచో వలసిన, రొక్కము నంపఁగ భిషగ్వరుండగు మెహతా
మక్కువచూపెం గావున, నిక్కట్టును దానిఁ బడయ నెంచితి నెడఁదన్. ౧౦

గీ. సొమ్ము౽దిగు లిట్లు తీఱ నచ్చోట గునియు, లేమికిం దగుచందాన మేము దాని
వెచ్చపెట్టఁ దలంచితి మిచ్చ యిట్టి, దగుట నార్జింపకుంటి మత్యర్థవసువు. ౧౧

గీ. లెస్సవిత్తముతోఁ బనిలే దటంచుఁ, దుట్టతుద కర్థమాయె నీఘట్టమునకు
వాడినధనంబు సకలంబు మూఁడువేల, మించదయ్యెను గడనలో మిగిలెఁ గొంత.

క. నెచ్చెలుల తెఱఁగు మునుపు, న్నచ్చెరు వొదవించె నాకు నందఱవెంటన్
వచ్చెను దల కొకపాచకుఁ, డెచ్చయ్యెను వంటసాల లేదెసఁ గన్నన్. ౧౩

క. నడిరేయిఁ దిందు రెవ్వరి,యొడమిని వా రారగించుచున్నను నేమం
బుడిగినబ్రిదిమికి లోపడి,నడిచెడు వారలపథమ్ము నా కార్తినిడెన్. ౧౪

క. ఆసహచరులకు నాకున్, వీసంబును వేర్మిలేని నెయ్యము కల్మిం
జేసి దురర్థము లరయక,నా సన్ననిపలుకుములికినాటుల నెమ్మిన్. ౧౫

క. రుచిసూచి రనుచరులు మీ,రిచటన్ సేవకుల విడిచి యెక్కటిపాకం
బుచితసమయంబులందుఁ గు,డుచు టొప్పు నటంచుఁ దుద కెటో నాహితమున్.

ఆ. ఇయ్యకొనిరి నెయ్యు రిందుఁ గొందఱకు మాం,సమ్మువలయు బొనసమ్ము లిట్లు
రెండుతోవలైన రెక్కొను వెచ్చమ్ము,మానుఁ డెఱచి నంటి మంచి దనిరి. ౧౬

క. శాకాన్నముసైతము విత,గా కుండువిధాన వండఁగడఁగిరి దీనన్
రూకలవెచ్చము తగ్గెను,మాకుం బల్మియును దఱియు మలచం బయ్యెన్. ౧౭

క. వచ్చిరి వాజ్మ్రలబుల,నిచ్చటకుం గాఁపు లుర్వి యానినకరణిన్
హెచ్చినయుత్కంఠను గనఁ,జొచ్చిరి నను; వారి నిల్వ [సుక్కిరి మిత్రుల్. ౧౮

ఆ. వారి సెప్పనుడులు వ్రాసికొనంగ నే, డ్గురు కడంగి రెంతయిడుమ వడిన
ముగియదాయె వ్రాఁత మునిమాపులను రిత్త, చనఁగవలసె రైతుజనము కొంత.

క. నిక్కమున కిన్నిసాక్ష్యము, లక్కఱలే దెల్ల రాడునదియును దరిదా
పొక్క తెఱఁగ య్యైనఁ దనివి, చిక్కదు కాఁపులకుఁ బలుకుసెప్పక చన్నన్. ౨౧

ఆ. సాక్ష్య మిచ్చినంత సంతస మెంతేని, నెగడుచుండు వీరిమొగములందుఁ
గమ్మతండ్రి యిట్టికమ్మనియుబలాట, మరసి హర్షమూర్తి నగుదు నేను. ౨౨

ఆ. కాల మెంత పట్టుఁగాక వాజ్మ్రలంబు, త్రిచ్చిత్రిచ్చి వ్రాయఁదగిన దంటి
నిట్టి నిల్పుకతన నీవ్రాఁత లెదురెక్కి, వచ్చె నేటఁ బొఱవై చినపుడు. ౨౩

క. ఈసాక్ష్యమ్ముల నింటను, వ్రాసికొనెడువేళ వేగువారలరాకన్
దోసినను నేరమిది యను, శాసనములు లేవు కాని సద్భావమునన్. ౨౪

క. చారుల శాసిచ్చితి న, వ్వారలఁ బ్రేమించినాఁడ వాజ్మ్రలంబుల్
కూరుచుతఱి వీరలు మా, చేరువ నివసించి కనిరి చేసిన దెల్లన్. ౨౫

క. మాసౌజన్యము వడచుచు, మాసన్నిధి వీర లుంట మంది భయంబుం
బాసె నసత్యకథా దు, ర్వాసన కెడయైనపల్కు వల్కెను దీక్షన్. ౨౬

ఆ. సాక్ష్య మింత పెరుఁగఁజాగిన భూస్వామి, సమితి కార్తిగూర్ప సమ్మతింప
శాంతచిత్త మూఁది సౌజన్యసంపత్తి, నోర్వ నెంచితిని దదుద్గమంబు. ౨౭

ఆ. నేర మొవనిపట్లఁ బేరె నమ్మకనిసి, నియ్యకోలు వడసి యేగి చూచి
మంచిచెడ్డలెల్ల మాటలాడుట మేలి, చేత యనుచు విశ్వసించినాఁడ. ౨౮

వ. కావుటం జేసి నీలితోఁటలదొరలం గదిసి యేను వారిపాలించుపంటకాఁపులు
కుడుచుకడగండ్ల నెల్లం దెల్లమి కావించుడు ౨౯

క. కొందఱు తచ్చన లాడిరి, కొంద ఱుపేక్షించి రవలఁ గొందఱు సత్య
స్యందివచస్సుల నెడఁదవె, లంది వెలారించి నా కెల గ్రిడి రందున్. 30

* * *

౧౭ సహచరులు

క. రాజేంద్రుఁడు వ్రిజబాబు జ, గా జోడుగ నుందు రెండుఁగన మిట్టికవర్
సౌజన్య ప్రేమంబుల, నీజత న న్నాఁకపెట్టె నెంతయుఁ దనివెన్. ౧

వ. వీరివిద్యార్థులుగా నొండె ననుయాయులుగా ననుగ్రహ శంభు ధరణీ రామనవమీ
బాబులుం గొందఱు న్యాయవాదులును సర్వదా వీరిం బలసి యుండువారు -
నడుమనడుమ వింధ్యా జనకధారీబాబులు వచ్చువారు - వీ రెల్లరు బిహారుదేశీ
యులు - కర్షకు లిచ్చువాఙ్మూలముల వ్రాయసము వీరికృత్యంబు - మఱియు ౨

క. ఆచార్యుఁడు కృపలానికిఁ, దోఁచునె మావెంట నిలిచి తోడ్పడకున్నన్
వేచూపుల నిడి యాతఁడు, కాచెన్ నానిల్చునింటిగవ నర్థిమెయిన్. 3

క. నన్నుఁ గన వచ్చుగుంపుల, పె న్నొత్తడి నాఁప నితఁడు పెద్దయుఁ బెనఁగెన్
గన్నుఱుపుచు నవ్వించుచుఁ, బిన్నలఁ బెద్దలను నిల్పి పిఱిఁదికి నంపెన్. ౪

క. పగ లిట్లుడస్సి రేతఱి, జగయొజ్జతనంబు నూను సహచరులకు బల్
నగవు నొదవించుఁ బందకు, మగఁటిమి సేకూర్చు నితని మఱవఁగఁజాలన్. ౫

గీ. 'హక్కు' బొసట కీకొని యప్పు డపుడు, వచ్చి నన్ దిలకించి పోవం దొడంగె
నతని యొకనాఁటి జీవనద్యుతినిగన్న, నా కితం డబ్బురముగొల్పినాఁడు నేడు. ౬

క. ఆడంబరమ్ము లే దీ, నాఁ డితనికి; నాఁటి నేఁటినడతల నరయన్
రాడగ్రణికిని లెంకకు, వేడబములఁ గానిపించు వేఱిమి తోఁచున్. ౭

క. కాలక్రమమున నా కా, నేలన్ నడయాడ నాడ నిజ మెఱుకవడెన్
మైలై నసేవ గోరిన, వాలాయం బచటఁ జదువువలె ననుకొంటిన్. ౮

క. ఆ చాంపరాను కాఁపుల, నేఁచెడు నవివేకభూత మిట్టి దటంచున్
సూచింపఁజాల నకటా!, పూఁచినచీఁకట్లు వారిపోఁ బ్రునచిఱుతల్. ౯

క. మిన్నక చరించు బుడుతల, నెన్నండును మందలింప రీరైతులు కా
కున్న నొకరుద్యోకూలికి, నన్నా! తోలెదరు నీలియడవుల దెసకున్. ౧౦

క. మగవానికిఁ బది కానులు, మగువకు నార్కాను లొసఁగి మణిపమ్ము నవా
ఠగ డనక నాల్గుజాములు, నొగుల్తు రీకూలివాండ్రు నోఁచిన సాహుల్. ౧౧

క. బుడుతలకు మూఁడుకానుల, నిడియెద రేకాఁపువాని కేనెప్పటికో
గడన యొకపావులా చే, పడ నతఁ డుప్పొంగు విరిసె భాగ్యం బనుచున్. ౧౨

క. అనుచరులతోడఁ ద్రిచ్చితి, మునుముందుగ నాయుకుప్పముల కుఱ్ఱలకున్
గనువిప్పవలయు నని యిది, యనివార్యం బనియుఁ దెల్పి యచ్చటి ప్రజకున్. ౧౩

క. ఎల్లయుఁ దెల్పితి వారల, యుల్లాసముగంటి వచ్చునోజ్జల కన్నం
బి ల్లొసఁగవలయు మీ; రిఁకఁ, జిల్లర నే మోర్చి సేవచేసెద మనితిన్. ౧౪

క. ఆ పేదసేద్యగాండ్రకుఁ, బాపము! రూపాయ కానఁబడ దేప్రొద్దున్
లోపమిది సెప్పి వార, ధ్యాపకులకు గింజ లిత్తుమని రగు నంటిన్. ౧౫

గీ. గురుల నెచ్చట నార్జించుకొంద మనెడు, చింత యవ్వలఁ బొడమె నాసీమయందు
భృతిని ముట్టకయుండ గ్రహించియుండె, దొడ్డయొజ్జలు చిక్కుట దుష్కరంబు,

గీ. చింతలన్ నామహాత్ర దేశికుని చేతి, కప్పగించుట యన్న నే నొప్పనైతిఁ
బుస్తకజ్ఞానముకంటె శస్త్రమైన, శీల మబ్బుట కే నాసచేయుకతన. ౧౬

వ. పదంపడి స్వయంసేవకులు వలయుదు రని వార్తాపత్రికల విజ్ఞప్తి చాటితి – దాని నాదరించి దేశపాండ్యా గంగాధరరావు బాబాసాహెబ్, సోమణు; పుండలీకుల నంపె – బొంబాయి వలన నవంతికా బాయియుఁ బూనానుండి యానందీ బాయియు విచ్చేసె – నేను సత్యాగ్రహాశ్రమనివాసులగు ఛోటేలాల్, సురేంద్రనాథులను, నాబిడ్డ దేవదాసును రావించితి – నీలోత్పల మహాదేవ దేశాయి తన యిల్లాలు దుర్గాదేవితో వచ్చె – నరహరిపరేఖు తనరాణి మణిబహానుతోఁ జనుదెంచె – నపు డేను గస్తూరినిగూడ రప్పించితి – ని ట్లుపాధ్యాయులు నుపాధ్యాయానులు నుపాధ్యాయులుం గనువిందుగా వెలసిరి – యవంతికయు నానందియుం జదివినవారు – కాని దురకు న్మణికిని గుజ్జరాతియొఱుక ఖిగులనలంతి నాఁజనుఁ–గస్తూరిబాయి కది యాపాటియేని లేదయ్యె – నిట్టినారీజన మ్మచటి హిందీడింభకుల కేమి నేర్పఁ గలదు? – కాని పసివాండ్రకు నుడితీర్పులకంటె మడినేర్పు లెఱుకచేఁత లెస్స – కాన నిమ్మగువలు పాపలకు శౌచవిధులు మప్పం బనిచితి – నప్పనికి వీరెంతయుం దగి నామెప్పు వడసిరి – వెండియు హిందీ, మరాఠీ, గుజరాతీబాసల యక్కరములించుమిం చొక్కరూప యగుట నియ్యమ్మ లాకుఱ్ఱల కొనమాలుప్పైతేము

కఱపిరి - యంకెలును నేర్పిరి - యీదృశంబగు సేవంజేసి యీవెలందుల కాత్మ విశ్వాసము హెచ్చె - మఱియు ౧౮

క. ఈసతులకు నిప్పని దెస, నాసయు నేర్పడె నవంతి యారయుబడి పెన్
వాసి గడియించె నప్పన, చేసెం దనయుసుఱు లీపె సేవావిధికిన్. ౧౯

క. ఈ కాంతలసాయమ్మున, మాకుం బల్లియలఁ జొచ్చుమార్గము దొరకెన్
లోకము నెఱుఁగని పేదల, చీఁకుం జింతయుఁ గనంగఁ జేపడె వసతుల్. ౨౦

గీ. పాఠశాలలు నిర్మించుపని యొకండ, చాలునని నిల్వనైతి నచ్చాంపరాను
ప్రజలలో నీడుముదిరినప్పలకుఁ గొంత, వెలఁదితన ముపదేశింప వేడ్కపడితి. ౨౧

క. పల్లియలలోని మైలకు, నెల్లయ లే దచట; వీధి కేగినఁ జె త్తల్
పుల్లెలు బావుల కెలఁకులఁ, గ్రొళ్ళు బ్బెడిరొంపి గాలు క్రిములుం దోఁచున్. ౨౨

క. గుమ్మములందును గాలిడ, గమ్మది యెదిరించు నెవనికాయము గన్నన్
బమ్మినతామర గజ్జియుఁ, గొమ్మలు రెమ్మలు వెలార్చుకొని కన్పట్టున్. ౨౩

క. అలవి యగునంతవఱకీ, మలినత్వము నూడ్చి మూర్ఖమండలి దిద్దం
దలఁచితి వారలమనుగడఁ, గల సందులు గొందు లరయఁగా మన సిడితిన్. ౨౪

క. ఈసవరణలో వెజ్జున్, బాసట కావలయుఁ గానఁ బడసితి భిషగ
గ్రేసరు 'దేవున్' భారత, భూసేవకసంఘసభ్యుఁ బుణ్యాచరిత్రున్. ౨౫

క. మున్నే లభించె నా కా, యన్నచెలిమి యిట్టు లాదవె నది నేఁ డతఁడ
స్కన్నప్రీతి ననామయ, కృన్నియతుల నల్ల నేర్పెఁ గృపి కావలికిన్. ౨౬

ఆ. ఆఱునెలలు నిల్చె నతఁడు చంపారణ్య, నరసమాజసేవనంబు నెఱపఁ
జదువు సెప్పుచున్న చానలు మగవాండ్రు, వడచి రతనిచెంత వైద్యవిధులు. ౨౭

వ. వీరి కితరకార్యక్రమంబుతోడిపొత్తు బాత్తిగా లే దనందగు - భూస్వాములతో నొండె నేలుబడివారితో నొండె వలయువ్యవహారంబుల నెల్ల నేన సంబాళించుకొనువాఁడ - నన్మ దనుచరులందఱుం దమనేమమ్ముల జవదాఁటక సమగ్రనిగ్రహముం బ్రకటించి నన్నలరించిరి. ౨౮

***

౧౯ గ్రామప్రవేశము

గీ. ఒజ్జ నొకని నుపాధ్యాయ నొకత నెల్ల, పల్లెకూటమున న్నిల్పఁ బనిచినాఁడ
రుగ్ణులకు మందు లిత్తు రారోగ్యవిధులు, వెల్లడింతురు వీర లాపల్లెజనకు. ౧

క. కొందఱు గరితలసాయము, నంది పరీక్షింతు రచటియతివల బ్రతుకున్
మందిర భోజన భాజన, సౌందర్యము నేర్పి వారి సవరింతు రొగిన్. ౨

వ. ప్రతిపాఠశాలయం దేరండతైలము గంధకలేపము క్వినిన్‌మాత్ర లుంచితిమి - నాల్కపై ముత్తికియున్న నామదము, వేకి సోకినఁ గ్వినిన్, కసిమిరి కన్పడిన గంధకలేపము ప్రయోగించితిమి - గడ్డతెగుళ్ళవారి దేవుచెంత నిల్పితిమి - మాచౌకవైద్యము పెక్కండ్రకు లగ్గుగూర్చె - దీని నెవ్వరుం గేలిసేయరైరి. ౩

ఆ. కడిఁదికర్జ మయ్యె గ్రామమ్ము దిద్దుట, నిచ్చలుం బాలాల నిలిచి డయ్యు
నతఁడుసైత మొప్పఁ డయ్యెను దనచేతఁ, దనపురీష మెత్తి దాగురింప. ౪

గీ. ఐనను భిషక్కు దేవు కాసంత బెదర, కనుచరులతోడ నొకపల్లె కరిగి దాని
నెల్ల రీతుల సవరింప నిచ్చచేసి, వీధులను జిమ్మఁ బెండను బెంట నెత్తె. ౫

క. లుకలుకలాడెడి గుంటల, నొకదారికిఁ దెచ్చి నూతి నొప్పుగఁ దీర్చెన్
బ్రకృతగ్రామము గని ల, జ్జకు లోనై ప్రజ లొనర్చసాగిరి సేవల్. ౬

క. నా చను మోటగదారియు, శౌచమ్మున వెలయునట్లు సవరించుట కా
యా చోట్లవారు పూనిరి, పూచె వివేకంబు గ్రామభూములలోనన్. ౭

క. ఈ కమ్మనతోపా టక, టా! కటుతయు దక్కె మాకు; నటనట మమ్మున్
లోకు లుపేక్షించిరి మా, పోకన్ బుయిలోట లేక పోనాడి రెదన్. ౮

వ. ఏను మహిళాపరిషత్తులఁ బెక్కింట వక్కాణించినగాథ యొండిచట వెలలింతు - 'భీతిహరవా' యనుపేరం బరఁగు పల్లెచేరువ నొకచిన్నగూడె ముండె - నందుఁ గాఁపురించు నబలల కొందఱు యులవరించువలువలం జూడ నయ్యికి వట్టొడ్డుచుండె- నది యేను సైరింప నోడి యీ యోఁడువాండ్రు చీరగుంజుకొనమికిం గత మెద్దియో పరికించి రమ్మని కస్తురిం బనుప నాపె యీగడయెల్ల స్గని వచ్చె - నామె నప్పా లెంపునెలఁత యొత్తర తనగుడిసెలోనికిం జేర్చె ౯

క. కనవమ్మ! తల్లి! మాకుటి, కనవమ్మా! యిచట గోడగదులని బీర్వా
లని పెట్టియలని సెప్పం, జనువస్తు వొకండు లేనిచందము నెల్లన్. ౧౦

ఆ. ఉన్న దొక్కచీర యుదికినచో నిది, చక్కఁబడు నటన్న చదువు తెలియు
నేమికట్టి దీని నేటిలో ముంచెదఁ, జెప్పవమ్మ హితవు నొప్పుకొండు. ౧౧

క. ని న్నేలుమహాత్ముఁడు నా,బన్నము గని జంటకొక పంపిననాఁ డీ
పెన్నరకము నోర్చెదనా?, ప్రిన్నఁగ నీరాడి మడుఁగుబట్టఁ దొడుగనా? ౧౨

క. అని పల్కెనఁట కటా! మన, జనపదముల నిట్టిదుఃఖజనకస్థితిఁ గ
న్గొనుచుండుఁ బెక్కుతావుల, మన మెరియున్ వగల నిట్టిమాటలు వల్కన్. ౧౩

ఆ. మాఱుబట్ట లేక మానమ్ము నిల్పుకోఁ, దగినవెరవు లేక తల్లడిల్లి
పనికిరాని ప్రాఁతతునుకలతో నిల్చు, నింతి లేనినాఁడె శాంతి మనకు. ౧౪

వ. అది యట్లుండె - వేఱొండుకథ నిపుడు పేర్కొందుఁ - జాంపరానుసీమ తెల్లుం బోనిపూరియు గడయు వలసినంత కలదు - కాన భీతిహరవాయందు మానెలకొ

ల్పినపాఠశాల కీసరకుతో నొకచప్పరంబు కలసె - నొకనాఁటిరేయి నెవరో దాని కగ్గి ముట్టించిరి - దాపునంగల నీలిదొరలలెక్క యీయకార్యంబు గావించి యుండుననిి గ్రామీణులకు శంకవొడమె - నిఁక నట్టిపూరికొంప తగదని 'సోమణు' తలంచె - నతఁడును గస్తూరిబాయియు నాబడి సాగించువారు - పల్లెప్రజలసాయ మ్ముతో సోమణు తాతిగోడలపైఁ బెంకుటిల్లు నేర్పఱిచె - నిఁక దాని కగ్గివలని వెఱపు తొలంగె - నివ్విధంబున ౧౫

గీ. చదువునేర్పుచు శౌచమ్ముసరణిఁ దెల్పు, చామయంబులలోనింత యాదుకొనుచుఁ బల్లియలఁ గొల్చు నైచ్ఛికభటులపట్లఁ, బ్రజలకుం బ్రేమ మేచె గౌరవముతోఁ జె. ౧౬

క. ఈసేవ సుస్థిరమ్ముగ, నాసీమఁ నడువఁజేత కాసించితిఁ గా నీ! సాగదమ్యోఁ దలఁ పని, వాసికొనన్ వలసె నేఁడు వాలినవనటన్. ౧౭

క. వచ్చినసేవకు లందఱు, నచ్చటఁ గొన్నాళ్ళు యుంట కరుదెంచిరి దీ వ్యచ్చరితులు నూతను లటు, చొచ్చిల్లుట కడిఁదియయ్యెఁ జూడన్ జూడన్. ౧౭

వ. నా మొదలిడిన యీయాడిగంబు గావింపఁ దగినవా రాబిహారునం జిక్కరైరి - మఱియుఁ జంపారణ్యమునందు నాకర్తవ్యము సమాప్తం బగునంతన నాకై యెదురుచూచుచున్న ఖేడాండుకర్జంబు నన్నుం దిగిచికొనియె - నా కాఁపురం బచట నాఱుమాసమ్ములకు ముగిసెఁ - గాని యానాఁడు కావించినచేత యీనాఁడు నైత మానేల నేదే నొకరూపునం జూపట్టు. ౧౮

* * *

౧౮ ఉజ్జ్వలపక్షము

క. మును పల్కినగతి నొకదెస, జనతాసంసేవనంబు జరుగుచునుండెన్ మన మిడి యొకదెస ఘగ్గా, జనకర్షకచరిత వ్రాఁత సాగుచునుండెన్. ౧

ఆ. వలసినన్ని హాలికవాఙ్మూలముల సమా,ర్జింపఁగంటి నిది యెఱింగినంత మండిపడిరి నీలిమందుబేహారు లా, యిత్తపడిరి నన్నుఁ జిత్తుసేయ. ౨

వ. పదంపడి బిహారుదొరతనమ్ము నారు 'మీయాతురయిక పెద్దకాలంబు వాయికొనె - నిఁక నీకార్యంబునకు స్వస్తి చెప్పి మీ రీరాష్ట్రముం బొయిఁజనదా, - యని నా కొండుకమ్మ నంపి - రందు వినమ్రుం బెంతయున్న నేమి? దానిహృదయుంబు తేటతెల్లంబు - కావుటం జేసి ౩

గీ. నావిచారణకుం బెక్కునాళ్లు వలయు, నది ముగించినవెన్క నియ్యవనివారి యలజడుల్ వాపవలయు నే నంతవట్టు, వదలి పోనొల్ల బీహారువసుధపొత్తు. ౪

క. అని వ్రేల్బడివారికి వ్రేఖను బంపితి; నప్పుడు నాదుగ్రంథము నాఁపన్ బెనువెరవు గని గవర్నరు, తనచెంతకు రమ్మటంచుఁ దన్నుం బిలిచెన్. ౫

ఆ. కాఁపువాండ్రు కుడుచుకస్తి విచారింప, నేను సమితి యొందు నిలుపువార
మందు సభ్యపదము నంది, మీఁదుం బని, సేఁత వలతు నంచు నాత్రఁ డనియె. ౬

వ. అంత నీసమస్యం బరిశోధించుతఱి నావారిసాయంబు వడయుటకును నన్నునమ్మి కొన్న సేద్యగాండ్రకు వలయుహితంబు సెప్పుటకును సమితి కావించుతీర్పు నాకు నింపనినాఁడు నాయిచ్ఛవచ్చినరీతిం గర్షకుల నడిపించుటకును నాకు నడ్డుసెప్పరయేని మీఁపల్కుం బాటించువాఁడ నని యే నాడ రాష్ట్రపాలకుఁ డీ నాకోర్కుల కెల్ల నియ్యకోలుం దెలిపెఁ - బదంపడి నే నాసంఘమునం బాలివాఁడనైతి - దీనికి సర్ ఫ్రాంక్ స్లాయిగారు నేతలుగా నియుక్తులైరి - యీసమితి పెద్దయుం దర్చిచ్చి త్తచ్చి హాలికులయభియోగంబు న్యాయ్యమని విశ్వసించెఁ - గాన ౭

ఆ. దొరలు మున్ను పాడిఁదొఱఁగి రాఁబట్టిన,సొమ్ము నందుఁ గొంత కమ్మతేండ్ర
కీఁగి వలయు దారుణాగస్సు 'తీన్ కఠియా' విధాన మెడసిపోవవలయు. ౮

వ. అని నిర్ణయించుట సముచితం బని తలంచె - సభ్యులెల్లరు నేకాశయబద్ధులై యుంటకును గర్షక రక్షకశాసనము పుట్టుటకును దనదిట్టతనంబెల్లఁ జూపి రాష్ట్రాధికారి 'యెడ్వర్డ్ గెయిటు' లెస్స తోడ్పడె - నూఱేండ్లనుండి నోరు లేని కాఁపుల నెత్తుటిం బీల్చు 'తీన్ కఠియా' శాసన మీనాఁటికి ట్లంతరించె - దీనితోడన ౯

క. తోఁటదొరల రాచఱికము, చాటునఁబడె దీన హాలికజాతికి నుసుఱున్
దేటయు నేర్పడె నిది యిఁక, మాటువడ దటన్న నీలిమచ్చ నశించెన్. ౧౦

గీ. చాంపరానెల్లఁ దిలకించి చదువు పెంచి, యితరసంస్కృతి నేర్పి పై క్కేఁడు లచట
నుండఁజూచితిఁగాని రావోయి! యంచు,నీశ్వరుఁడునన్ను వేఱొక్కయెడకుఁదిగిచె.

* * *

౨౦ కూ లి వా రి తో

క. పంచాయతికార్యము నొక, యంచునకుం దెచ్చునంత నక్కట! కఱవే
తెంచెను ఘూర్జరమున నశి, యించెం బంటలు దురార్తి నిగ్గిరి మనుజుల్. ౧

క. "ఖేడామండల" మెంతయుఁ, బాడయ్యెను సేద్యగాండ్రు పన్నిడలే రీ
నాఁ డోర్వరానిపిమ్మట, మూఁడేక్ దోడ్పడుఁడు మీరు మ ప్పిది రొప్పన్. ౨

వ. అని మోహనలాల్ పాండ్యా శంకరలాల్ పారఖులు నా కొక యుత్తరము నంపిరి- దవుదవ్వుల నిల్చి వారికి హితమ్ము నెఱిఁగించునిచ్చయుం దెగువయు నాకడ లేదయ్యె - న య్యవసరంబునంద యహమ్మదాబాదుకూలివాండ్రు సంబళములు చాలక యలజడిపాలై రని యనసూయాబాయి వ్రాసినలేఖయు వచ్చెఁ - గార్మికులఁ దగినబాటకుం జేర్చునుబలాటము నా కున్నయది - యిది యలఁతికార్యంబైనను బిహారునం బీటవెట్టి దీని సాగింపనేర - నగుటం జేసి ౩

గీ. ఘూర్జరంబున కేగి చిక్కులను రెంటిఁ, జక్కఁబెట్టి హుటాహుటిఁ జాంపరాను
వలనికి న్వచ్చి నెరవేర్పఁ దలఁచుకృత్య, మఖిలముం దీర్పఁగల నని యాసపడితి. ౪

క. చేరితి నహమ్మదాబా, దారసితిన్ గొడవ లంత లంతలతోడన్
దీఱదపని యని వెసఁ జం, పారణ్యము సేరఁజాల నని యనుకొంటిన్. ౫

గీ. అచట నిల్పినవిద్యాలయంబు లల్ల, నల్ల న సురింగె నను యూయు లా ననంగ
గాలిమేడలు పెక్కింటిఁ గట్టుకొంటిఁ, గాని మూన్నాళ్ల కవి పాడుకదలి కూలె.

ఆ. బడులు గాక పల్లెపట్టుల కారోగ్య, భాగ్యవిధులు నేర్పుపనియుఁగాక
గోకులంపులగ్గుఁ గోరియుఁ జాంపరాన్, మహికి సేవఁ జేయ మనసునిడితి. ౭

క. హిందీప్రచార మన గో, బృందసముద్ధరణ మన్నఁ బ్రియపడి తామై
ముం దడుగువైచి లక్షలు, వందలుగాఁ గందు మారువాడీసాహుల్. ౮

క. తనధర్మశాలలో న, న్నునిచి కడున్ గారవించె నొకపరి సంపత్
ఖని బేతియాపురమ్మునఁ, దనరెడిమార్వాడి సాధుతామూర్తి యనన్. ౯

ఆ. అతనితోడిధనికు లానాఁడు నన్ దమ, మొదవు లున్నసదనములకుఁ జేర్చి
కనులవిందు గూర్చి వినిచిరి వారి గో, సేవకరణి మధురభావసరణి. ౧౦

వ. గోసంరక్షణావశ్యకము నంతకుమున్న యే నుల్లమం దిడికొంటి – దీనిపట్ల నిపుడు నామన్నించు నెల్లతలంపు లప్పటివ నాఁడను – నాఁడెగం దిద్దుట యావంగసముం బెంచుట బసవన్నల పనివేగు డించుట మున్నగుచేతలు గోరక్షకుం జెందియుండు – మార్వాడిసంపన్నుల సాయంబు వడసి చంపారణ్యమునం దీయూడిగంబు సైత మారంభించితి – నమ్మండలమునం దేను బహుకాల మధివసింపమింజేసి యీసేవ సగపాలియందకుంటువడె – బేతియాక్షీరశాల నేఁడుం గలదు – కాని సమగ్రంబు గాకుండె – వెండియు ౧౧

మం. దయ నుజ్జగించి హైందవనామధారు,లిది రేయి యిది గుంట యిది రొంపి నాక
యలవితప్పినవేగు నటితిప్పె మోపి, యిపుడేని దద్భూమి నెడ్ల బాధింతు
రక్కటా! తమపాడి నడఁగార్చుకొందు, రనిశంబు వగతు నియ్యార్తిఁ దలంచి
చాంపరానున కేను జనినప్పుడెల్ల, నాచాలమింజేసి నట్టుపాలైన
యీచేతఁ గనినంత నెరియు నామెడఁద, పడతు నచ్చటిసఖుల్ పఱుపు హెచ్చరిక.

ఆ. ప్రకృతమునకు వత్తు నిఁక హమ్మదాబాదు, చేరినంతఁ గఱవుసీమ కేమి
సేయవలయు నంచు రోయుచు మున్ముందు, కూలివాండ్రఁ దేర్పఁ గోర్కెపడితి. ౧౩

క. ధర్మానుగ మని నమ్మితిఁ, గార్మికవర్గమ్ము నేఁడు కావించుపనిన్
గూర్మియు నోర్మియు నైత, చ్ఛర్మము ననసూయబాయి సంధిలఁజేయున్. ౧౪

వ. ఈమెసోదరుఁ డంబాలాల్ సారాభాయి యంత్రస్వాముల దెసం బనిసేయు– నాకును వీరితోడిచెల్మి మిక్కుటము – కాన నాపాల నిది గడ్డుసమస్య యయ్యె –

మధ్యస్థసంఘము నెన్నుకొని దానితీర్పుం బాటింపుc డని యజమానుల నర్థించితిc-
గాని. వారు 'ససేమిరా' యని కూర్చుండిరి - కాన వేఱుదారిం గానక సమ్మె
సాగింపుc డని కూలివాండ్రకుపదేశింప వలసినవాఁడ నైతి - ముమ్ముందు
కూలిపెద్దలతో లెస్సచర్చించితి - నోగాములు తెల్పితి - నల్లరి తగదనియుc
గట్టుతప్పినవాని నాcగరా దనియు, బికిరమునకుం జనరా దనియుc దిండి కొఱ
వడిననాఁడు మన్నింపcదగిన వేఱొండుకూలిం జేపట్టవచ్చుననియు నేమములిడితి,

క. నాబాటలు నామాటలు, నాబీదల కింపు నింపె నాcకటిమంటల్
ప్రాబల్యెగు శ్ళైవి ముట్టిన, బాబూ! పనికేగ మనిరి పట్టిరి ప్రీతినన్. ౧౬

ఆ. కట్టులోని కర్మకరుల సబర్మతీ, తీరమునకుc జేర్చి దినదినంబు
వలయువిధులు జ్ఞప్తి కెలయించి మానంబుc, బెంచుకొండ యని వచించుచుంటి.

క. "పాలింపుఁడు శపథం" బను, ప్రా లుంచినసిడము లూని వా రనుదినమున్
బ్రోలెల్లc దిరిగి ప్రొ ద్దటు, ప్రాలన్ వచ్చెదరు సభకు వాలినవేడ్కన్. ౧౭

క. ముత్యోడునాళ్లు నడిచెను, గయ్యంబిది నడుమ నడుమc గార్మికవాంఛల్
న్యాయ్యములని పోషించెదు, నయ్యల నర్థించుచుంటి నడcకువతోడన్. ౧౮

మ. వారు సేవేడికోలు సరకుచేయక ౨౦

ఆ. కూలివాండ్రు మాకుc గొమరులవోనివా, రేము వారిపితలయాఁడువాండ్ర
మేల సెప్పవయ్య యీబిడ్డదండ్రుల, నడుమc దీర్పుసెప్పనరుc డొరుండు. ౨౧

క. మా కూలివాండ్రకుంబలె,మాకున్ శపథమ్ము గలదు మన్నన గల దీ
రాకడ పోకడ లే లని, వాకొంటకుc జాగి రేను వాడకయుంటిన్. ౨౨

***

౨౧ ఆశ్రమము దేసకు

ఆ. సమ్మెసుద్ది నిల్పి సత్యాగ్రహాశ్రమ,రంగ మొక్కమాఱు తొంగిచూతుc
జాంపరానుకొల్పు సాగించుతటిసైతమిటకు వచ్చుచుంటి నెడపదడప. ౧

క. పురమునకుజ్జం గల 'కొచ్చర ' బను కుప్పమున నిది యెసంగుచు నుండన్
గటికరి జొబ్బుతెగుల్ దుర్భరముగ నప్పల్లెటూరc బ్రాcకెన్ సోcకెన్. ౨

క. ఎంత కనుగల్గి యున్నను,జెంతం గలచేటు మమ్ముc జెనకుట నిక్కం
బింతంతల కుట్టల ని:శ్చింతముగా నిపుడు ప్రోపుసేయంగలమా ? ౩

క. ఆనాc డాపల్లెకుc జని,నానాశౌచములు నేర్పునాణెము మాకున్
లేనట్టి దగుట నచ్చటు,మామట కర్తవ్య మన్నమది మొలతెంచెన్. ౪

క. ఇచ్చోటు వలదు పొం డని, హెచ్చరికం జేసె దయ్యా మీవల్లడితో
నచ్చినతావుం గొని యటు, సొచ్చుట కత్తఱిని బెద్ద చూచుచునుంటిన్. ౫

వ. పుంజాభాయిహీరాచందు సత్యాగ్రహాశ్రమమున కానాఁ డొకబందుగుఁడై యది యలంతి యిది వలంతి నాక యెల్లయుడిగముం గావించు - నతని కహమ్మదా బాదుగు ట్టంతయుఁ దెల్లంబ - కాన నాశ్రమమునం దగినపొలమ్ము నతఁడు వెదకం దొడఁగెఁ - దిరిగి తిరిగి నేఁడు మాసిల్చునేల నాయయ్య గుర్తించె - నా కాతావు లెస్సయనియుం దోఁచె - నేలయన ౬

క. కారాగృహ మాగడ్డకుఁ, జేరుగడం గలదు లోకసేవను బ్రదుకం
గోరిన మాయాశ్రమమున, వారికి నది యెంతయును శివం బనుకొంటిన్. ౭

గీ. మూఁడుబంతులు పెట్టి మామొగమునందు, వ్రాసినాఁడు గదా బందివ్రాఁత ధాత
యిట్టివారికి మొగసాలయట్టు చెఱయుఁ, గంటిముం దుంట కల్యాణకరము కరము.

క. ఆరోగ్యము నిడునేలన, కారాగారముల దొరలు కట్టుదు రి య్యా
కారణముల నిలువందగు, ధారణి యని దాని విలువఁ దలఁచితి నంతన్. ౯

క. ఏ డెనిమిది నాఁడులలో, బీ డయ్యాది కీర్తి మయ్యెఁ బెరిఁగినమ్రాకుల్
గోడలు గీములు నం దా, నాఁ డెవ్వియు లేవు గాని నద్యంకమునన్. ౧౦

క. శాంతిని కేతనమై యే, కాంతముగా నుంట నది సుఖంబిడు నంచున్
సంతసమంది గుడారులు, కాంతముగా నిల్పి నిల్వఁగడఁగితి మచటన్. ౧౧

క. రేకులతో సంధించిన, పాకలలో వంట తీర్పఁబడుచుండె జనం
బేకాన్న మేకభాండం, బేకశ్రేణిగ భుజించు నేకాన్వయమై. ౧౨

క. పిన్నలు పెద్దలు మగవాం, డ్రిన్నులు నొకనాల్గుపదుల కమరిరి దానన్
బెన్నలసట లెక్కింపని, యన్న మగన్లాలు దాని నరయుచు నుండెన్. ౧౩

ఆ. గట్టియిండ్లు కట్టి కా లోమ్రపులోపల, వాన లూరి మూరి వఱదపొంగి
యిడుమ లెన్నియేని గుడిచితి మాశ్రిమ, స్థలిని బండములకు దవ్వొవమచు. ౧౪

క. అది పాడువడ్డబీడై, పొద లేచినదగుటఁ బుట్టపుట్టను దోఁచున్
బెద చిన్న పాము లచ్చట, బ్రిదుకుట సూశకంబె వెడఁగుఁబాపలతోడన్. ౧౫

క. పై పెద్ద చిలువ నణఁపఁగ, నోపదు మాతాల్చునేమ; మొక్కండును ద
ద్రూపము గని బెగ్గిల్లక, పాపోవక నిల్వలేఁ డవగ్రహణమునన్. ౧౬

గీ, అపుడ కా దిపుడేని మాయాశ్రిమమున, నురగమును గాంచి జంకనినరుఁడు లేఁడు
చిక్కు లిట్లుండెఁ గాక హింసించుప్రాణి, చంపదగినట్టిదని సమ్మతింపనైతి. ౧౭

వ. ఫినిక్సునందును టాల్స్టాయియందును సబర్మతియందును నానెలకొల్పినయాశ్రమంబులం దీకట్టడ పాటింపఁబడియె – భుజంగాదులవలనివల్లడి యీనాఁడు రంగములందును వలసినంత కలదు నాఁజెల్లు – నైనను ౧౮

క. ఎన్నఁడు నెవ్వని ముట్టద, పన్నగ; మిటఁ గన్నువిచ్చి పరికించిన నీ
తిన్నఁదనంబునకున్ భగ, వన్నిరవధికరుణ యొండ వఱలున్ గతమై. ౧౯

వ. భగవానునకుం బక్షపాతములే దనియొండె మనగొడవ లన్నియుం బరికించుపాటి విడుమర యతనికిం గలవని యొండె యెవ్వరే నడ్డుసెప్పక యుందురుగాక! – నా కడుగడుగునం దోఁచు నియ్యనుభూతి నింతకుమించి తేటపఱుచునేర్మి నాకడం గానరాదు – మానిసిబాస భగవల్లీలల నూఁచముట్టుగ్గడింప వలంతికా దనెద – నవి వర్ణింపరానివని నరుఁ డెఱుంగరానివని యేను గంటి – మర్త్యుఁ డేతద్వ్యాఖ్యకుం దెగిననాఁ డతనికిం బసిపాపల తొక్కుఁబల్కుల శరణ్యము నాఁజెల్లు. ౨౦

గీ. అహింసధర్మమ్మున కెదురు మా యాశ్రమస్థు, లిరువదై దేండ్లఁదొట్టియు నురగపీడ
కగ్గపడ; రానుషంగిక మనుట మాని, భగవ దనుకంపయని దీనిఁ బల్కరింతు. ౨౧

క. ఇది వేదుఱునమ్మిక యని, యెదురాడిన మూదలింప నేఁ జాలఁ జుఁడీ!
బ్రదు కిడ్చెద నీవెట్టిని, వదలక; తద్దాస్యవిధి నవశ్యము వలతున్. ౨౨

వ. అది యట్లుండె – నాశ్రమకార్యంబులం దానాఁడు ప్రధానంబు నేఁతపని – నూలుఁ దీయుట మాకు నంతవట్టు చేపడనిచేఁత – కాన మున్ముందు వాపశాల నిర్మింప నెంచి కూలివాండ్రసమ్మెతటిఁ దన్మూలబంధమ్ము లేర్పరించితిమి. ౨౩

* * *

౨౨ ఉపవాసము

గీ. కట్టుకట్టినభృతకులు మొట్టమొదటి, నాళ్లలో ఊతిగుండెమై నడువసాగి
రనుదినమ్మును వచ్చి నావినుచుకఱద, లాలకింపఁ దొడంగి రత్యాదరమున. ౧

క. తమ వాయురాదు చేసిన, సమయమ్మును విస్మరింపఁజన దనుచుంటిన్
శ్రమ మెట్టిదైన శపన, క్రమ ముల్లంఘింప మనిరి కర్మణ్యార్థుల్. ౨

క. నడిచెఁ బదునాల్గుదినములు, సడలెం బనివాండ్రదీక్ష సనసన్నముగన్
గడఁక గలవారు జాఱిన, బడుగుల దూషింపఁ బాలుపడి రల్కమెయిన్. ౩

ఆ. వాదు హెచ్చిహెచ్చి వారికి వీరికి, నడరునేమొ దురము బెడిద మగుచు
నేమిసేయువాఁడ నిపుడని తద్దయుం, గలఁగినాఁడ భీతి నలఁగినాఁడ. ౪

ఆ. సభకు వచ్చువాండ్రసంఖ్యయు నల్లల్ల, కుందసాగెఁ జేరి కూరుచున్న
వారిమోములందు వలసినంత యుపేక్ష, మూఁగియుండెఁ దెలివి యాఁగియుండె. ౫

ఆ. అకట! పేదలెల్ల రల్లాడుచున్నవా, రన్నమాట వింటి నడలుగంటి
నేది నాకుదారి యిప్పుడని యోరంత, ప్రొద్దు తడవికొంటిఁ బెద్ద వడిని. ౬

వ. నెటాలునం దుప్పతిల్లిన కూలివాండ్రసమ్మె లేనెఱుంగుదుఁ — గాని నేఁటికట్టు నాప్రేరించుటం బాటమరించెఁ — గాన నిది నాపాల నూత్నసమస్య యయ్యెఁ — గర్మకరు లెల్లనాఁడు నాచెంతఁ బ్రతినగావించి చనుచుండిరి — నేన యిప్పనికి పాకిరినైతి — నగుటం జేసి వీరు తమకావించుబాస నతకరింప నోపరని నాతలంపు — దీనికిం గతము నా యహంతయో, భృతకులదెస నా కేర్పడిన మక్కువయో నిక్కంబుపట్ల నాకుంగల ప్రేముడియో నిర్ణయించువారు లేరది యట్లుండె. ౭

క. రేపాడివేళ నొకనాఁడీ పేదలఁ జేరఁదీసి యెది కృత్యంబో
యేపల్కు సెప్పవలెనో, తోఁపక సుడివడుచునుంటి దుర్భరవృత్తిన్. ౮

గీ. అట్టితఱిఁ గర్మకరులెల్లఁ గట్టు నూఁది, నిలుచునంతకు నీసమ్మె గెలుచునంత
కేను మెతుకంట ననుపల్కు లెఱుకలేక, వెడలె నానోటినుండి పెన్‌పిడుగులట్లు.

క. గడగడ వడఁకిరి భృతకులు, పడె ననసూయమ్మ విడుచుబాష్పోదక ము
గ్గడువై సబర్మతీనది, కుడియెడమలఁ దాఁకి పర్వ్యాగొను వఱ్ఱగుచున్. ౧౦

ఆ. మాకుఁ గాక పస్తు నీకేల బాబయా, నిన్ను దింప మిట్టిబన్నమందు
మమ్ము సైఁపు మన్నమాట నిఁకన్ జవ, దాఁట మనిరి బీద లోట విడిచి. ౧౧

క. అంత నుపాసంబది నా, వంతు దురాపత్తు లెన్నివచ్చిన నెడఁదన్
జింతింపక నిల్చుట మీ, వంతు సుఁడీ! త్యాగమిది యవశ్యము వలయున్. ౧౨

ఆ. మనకుఁ గల్మిసున్న మ మ్మెలుఁడని వీటఁ, దిరిసి కట్టుకట్టఁ దివురు టొప్ప
నొరులు మెచ్చువృత్తి యొండూని మీరు జీ, వింపవలయు బెగడు త్రెంపవలయు.

క. స్వస్తి యెపు డందురా నా, పస్తున? కీసమ్మె యొడ్డుపట్టినయపుడే
కస్తిం గుడువకుఁ డిది విని, యస్తవివేకుండు శస్త్ర మందునె యంటిన్. ౧౪

వ. ఆనాఁ డహమ్మదాబాదు పురపాలకసంఘము వల్లభభాయి యాజమాన్యమున నడుచు — నతఁడు కొందఱుకర్మకరులకుం బనిచూపె — నాశ్రమమునం గట్టిన నేఁతసాలయం దిసుము నింప నేము కతిపయకార్మికులం బిల్చితిమి — పదంపడి ౧౫

ఆ. ఇసుకతట్ట నెత్తి నిడుకొని యనసూయ, ముందు నడిచెఁ గార్మబృందమునకుఁ
జూచితీరవలయు నా చారుదృశ్య మా, పత్రిజల కపుడు లేనిబలిమి చిక్కె. ౧౬

క. గౌరవపూర్వక మగు చెలి, కారము యంత్రాల యాధికారులకును నా
కేరుపడి యుంట నిక్కం, బారయ నొకదోస మున్నయది నాయిల్లిన్. ౧౭

ఆ. ఏను బూనినట్టి యీయుపవాస మా, సాహుకార్లమదికి జాలిఁగూర్చి
వారినిర్ణయంబు వారింపకుండునా, యేమిపాడి యందు నిట్టిమార్పు. ౧౮

గీ. వారి నెదిరించి సత్యాగ్రహోరుధర్మ, వేది నగు నేను బస్తుంట కా దటంచు
నెఱుఁగుదుర్; యజమానుల నిగ్గఁజేయఁ, దగినవా ర్యూలివారలే యగుట నిజము.

క. భృతకులదోసమునకుఁ గా, కితరులతప్పునకుఁ బూన నీపాచితమున్
బ్రతిభువ నే నప్పేదల, కతుకుఁ దదీయంబు దోష మడఁగక నాకున్. ౨౦

ఆ. వీను మరలదారలయెడ వినయంబ చే, పట్టవలయు వారి నట్టిగతిన
మెత్తఁబఱుపవలయు నొత్తడిసేఁత గా, కున్న వీరి కెదిరి యున్స్న రనుట. ౨౧

క. నాపస్తు సాహులకుఁ బెను, రాపిడి చేకూర్చునని కరం బెఱిఁగియు నే
నాఁపంజాలక పూనితి, నాపని మేలని మదంతరాత్మ వచింపన్. ౨౨

క. ఏ నిల్లికి నొగితినని, దీనన్ నా కార్తి యుప్పతిలునని మీారల్
మీానడిచెడితెరు వింతయు, మానం బనిలేద యంటి మరపెద్దలకున్. ౨౩

వ. వారు నాపల్కుం జల్లచల్లఁగా నాదరించిరి - కాని నడుమ నడుమ సవిలాసంబుగా న న్నవహేళనంబు గావించిరి - యిట్లొనర్చు నధికారంబు వారికిం గలదు.

క. యంత్రాలయాధికృతులకు, మంత్రిగ నిలఁబడియె ధనికమణి యంబాలాల్
కాం త్రితనిం బౌరులు దు, స్తంత్రి మసత్యోక్తి లేని సత్పూరుషుఁగన్. ౨౪

ఆ. ఇతనియభినివేశ మతిలోకమై నాదు, మదిని లోఁచికొనియెఁ గొదువలేక
యింపు లెస్సవొడమె నివ్వీరుతో నెది, రించి బవర మాచరింప నాకు. ౨౫

ఆ. ఇట్టి మానసీయునేల్బడి నున్న వి, రోధివర్గమునకు నాధరించు
ననశనవ్రతంబు పెనుఁగొండలంబు సం, ధించుఁ గాన నాకు దిగులువొడమె. ౨౬

క. ఈవణిజునింతి సరళా, దేవికి నా కీడులేని తీయము వెలయున్
భావింతుఁ జెలియలింబలె, నావెలఁది నుదారచిత్త నంచితశీలన్. ౨౭

క. అన్నవలె నప్పుకై వడి, న న్నరయుచు మజ్జయంబునకు నుబ్బెడి యీా
చిన్నది నానిట్టుగ్రిం గని, విన్నంబడె నాపె తెఱఁగు వెతనిడె నాకున్. ౨౮

క. అనసూయాదేవియు నా, యనుఁగుంజెలికాండ్రుకొంద ఱనశనదీక్షన్
గొని నాతో నిల్చిరి తొలు, దినమున ; బతిమాలి వారిఁ ద్రిప్పితి నవలన్. ౩౦

ఆ. నాల్గుదెసల నిట్లు నర్తించె హార్దమ్ము, సాహుకార్లగుండె జాలువాఱెఁ
దడవుసేయఁ జనక తగవు నెట్లో చక్కఁ, బఱుచుపొంలె నాత్రిపడిరి వారు. ౩౧

ఆ. అపుడు రచ్చసాలమై పొల్చె ననసూయ, మనికిపట్టు దివ్యమందిరంబు;
నడుమ నేఱుపడియె సడిసన్న యానంద, శంకరధ్రువునకు సమ్మెపొత్తు. ౩౨

క. పెద్దలకోరుటఁ బొసఁగువ, డిద్దుట కితండ కొసకుఁ దీర్పరి యాయెన్
రద్దయ్యె సమ్మెకు పన్నుం, బొద్దుల నప్పటికి మాటఁ బుచ్చితి నోర్మిన్. ౩౩

ఆ. సమ్మెపుట్టి మూఁడుసప్తాహములు నిండె, నేఁటి కిట్లు చక్కఁబాటు కుదిరె
సంధి సంతరింప జరిగినసభకు న, ద్ధరణి నేలుచున్నదొరయు వచ్చె. ౩౪

ఆ. అతఁడు కూలివాండ్రకది యిది సెప్పుచు, గాంధిపల్కు వినుట కర్జ మనియె
నవలఁ గొలఁదినాళ్ల కయ్యధికారి నా, కెదిరిచి భీమసమర మొదవఁజేసె. ౩౫

క. నాపల్కు దూష్యమని యపు, డీపెద్ద కృషీవలులకు నిత్యం బలికెన్
బాపము! కాలము మాఱుట, తోపాటీతఁడును మాఱె దుర్వారగతిన్. ౩౬

క. రసనీయము కారుణ్య, ప్రసువగు నొకవార్త నిచటఁ బల్కక యీస
ర్గ సమాప్తిసేయ మన్నా, నస మొప్పదు కాన వింతు నాలుగుముక్కల్. ౩౭

ఆ. కట్టు ముగిసినంతఁ గార్మికశ్రేణికిఁ, బంచుపొంటె రుచికి సంచులైన
లడ్డువములు గంపలకొలందిఁ దెప్పించి, రర్థి చెంగలింప నర్థపతులు. ౩౮

ఆ. వేలకొలఁది నున్న కూలివాండ్రకు వానిఁ, బంచుటెట్లు శాంతి నించుటెట్లు
నగరి నిట్టిపనికిఁ దగినంత నేల నా, ర్జించుటెట్లు నిర్వహించుటెట్లు. ౩౯

వ. ఇట్టి శంకలకు లోనై యెట్టకేని బాసచేసినమాత్రనికేవల నీవిందుం బూరితి సేఁత యెల్లభంగుల నుచితంబని నిర్ణయించితి – ముయ్యేడునా ళ్లొకనేమంబున కగ్గంపడియున్నవారు వేగిరపడక బారులుతీరిభక్ష్యంబు లందుకొందురనినమ్మితిఁగాని

క. వడ్డన మొదలిడ్డంతన, యడ్డంకి రవంతలేని యల్లరి సాగెన్
బిడ్డలు దొడ్డలు బంతుల, నొడ్డారించిరి త్యజించి రొక్కుమ్మడిగన్. ౪౧

ఆ. కూలిపెద్ద లెంతకొట్టుకొన్నను ఫలం, బావగింజయంత యబ్బదాయె
గోల పెంచిపెంచి కొసకు భక్ష్యంబులు, కొల్లలాడఁ దొడఁగి రెల్లవారు. ౪౨

క. ఇఁక లాభము లేదని పం,పక మాఁపించితిని నిల్పఁబడిన మిఠాయిన్
జెకచెక సంబాలాల్ టెం,కికిఁ బంపితి వచటిబంతికిన్ వెచ్చపడన్. ౪౩

వ. హాస్యరసం బిందుఁ దేటతెల్లంబ – సమ్మెచెట్టుకడ లడ్డువమ్ములు పంచెద రన్న సడి పేటంగల తిరిపగాం డ్రెల్లో పసిపట్టి మెల్లమెల్ల మాత్రనిం జేరిరి – భక్ష్యరాశిం జూఱలాడిరి – దావాగ్నిపోలె రేఁగిన వారిబుభుక్ష యింతపనిసేయించె – నిది కడుంగడు శోచ్యంబు నాఁజను – వెండియు ౪౪

క. బగబగ మండెడునాఁకటి, సెగలం బడి సగ్గిమగ్గి చెడుపేదలు పెం
పగుచున్నా రీగడ్డను, దిగు లెంతయు రేఁగు దీనిఁ దెలిపెదుపట్లన్. ౪౫

ఆ. గండుమెఱసి క్షుత్తు కప్పించునెడ దీనుఁ, డేమిసేయు గరువ మెట్లుమనుచు
నారగించుపట్ల నానెడుతఱిఁ బెల్లు, వెలితిపడ కితండు నిలువలేఁడు. ౪౬

క. విత్తముగల యయ్యలు తగు, వృత్తిని జూపించి వీని కిడ రన్నంబున్
జిత్తమువచ్చిన నాలుగు, విత్తులు బిచ్చంబు రాల్చి వీఁగుదు రకటా! ౪౭

***

౨౩ ఖేడా సత్యాగ్రహము

ఆ. కూలివాండ్రు లగ్గుకొఱకు సాగించిన, కదన మాఁగినంతఁ గదలినాఁడఁ
బంటపోయి కఱవుపట్టి కృశించు ఖే, డాధరిత్రిఁ బన్నుబాధ లడఁప. ౧

వ. అచటిసేద్యగాండ్రు శరవిముక్తికై జతనం బొనర్చుచుండిరి - వారి కమృతలాల్ ఠక్కరు, మోహనలాల్ పాండ్యా, శంకరలాల్ పరీఖు లండయైరి-వీరు దివంగతులగు గోకులదాసకహాన్ దాసు, విఠలభాయి పటేలుల నాశ్రయించి బొంబాయి శాసనసభ యందు గగ్గోలు పుట్టించిరి - దొరతనమువారికడకు రాయబారంబులు నడిపిరి - ఘూర్జరసభ కేనత్తఱి నధ్యక్షుఁడనై యుంటి - నీసభాపక్షమున నధికారికి మనవులు, తీఁగవర్తమానములు పంపితి-మతఁడు వానిం బాటింపమియ కాక మాకు బెదరింపులరుచియుం జూపె. ౨

క. నాఁ డధికారులచనుగతి, నేఁడు పరీక్షింప నవ్వు నెట్టన పుట్టున్
గోడువిన రెచటినుండియొ, యూడిపడిన వేల్పులట్లు యుందురు జగతిన్. ౩

క. కన్నంతన కృపకావలి, విన్నప మది ధర్మ్యమన్నవిధ మెదఁ దోఁచున్
బన్నముల కోర్చి ప్రభువుల, సన్నిధి మొఱపెట్టనేల జన మిప్పనికిన్. ౪

క. నేలం బంటలు నాల్గవ, పాలికిఁ గుం దైననాఁడు పన్నిమ్మని భూ
పాలకు లొత్తడిపెట్టుట, పోలద యనుసూత్ర ముండెఁబో! చట్టమునన్. ౫

గీ. నాలుగవపాలికంటె నీనాఁటిపంట, లొచ్చ యనెఁ గార్షుఁ డధికారి హెచ్చ యనిమెఁ
దీర్పరిం బంపుఁడని కమ్మతీండ్రు వలచి, రది ప్రభుత్వమ్ము నెదిరించు టనిరి దొరలు.

క. విన్నపములు సంప్రార్థన, లన్నియు వమ్మైనయంత హాలికజనులం
గ్రన్నన పిల్చితిఁ దడవితి,నన్నలు! సత్యాగ్రహులుగ నగుఁడా యంటిన్. ౭

వ. ఈసమరంబున ఖేడామండలమందలి స్వయంసేవకుల కాక నాకు వల్లభభాయి పటేలు, శంకరలాల్ బాంకరు, మహాదేవదేశాయి, యనసూయాబాయి, యిందులాల్ కన్నైయాలాల్ యాజ్ఞికుఁడు మున్నగువారు సాయంపడిరి - వెండియు

ఆ. పెరటివేల్పుటావుకరణి వేల్వే లర్థ, మిడుచు నాఁడునాఁడు నడరుచున్న
న్యాయవాదివృత్తి నీయజ్ఞదీక్షలో, నొల్లఁబోక విడిచె వల్లభుండు. ౯

క. ఇతఁడు మఱి దాని నంటక, జితేంద్రియత మెఱసి లోకసేవావిధికిన్
బ్రతు కప్పనచేసె జగ, ద్ధితశీలుర కొజ్జబంతి నీతని మెత్తున్. ౧౦

క. విడిదలకుఁ జాలినంతటి, యెడమున్నది యగుట నుచిత మీాతా వనుచున్
నడియాదునఁ గల యనదల, విడిమట్టునఁ బటగృహమ్ము వేసిరి మిత్రుల్. ౧౧

వ. అంత సత్యాగ్రహులగు సేద్యకాండ్రెల్లరు ౧౨

గీ. "పాపులాపంటయేని మాపల్లెలందుఁ, బండదయ్యెను వర్షమ్ము లెండిపోయి
పలుమఱు న్వేఁడుకొంటిమి పన్నుకట్ట, నేర మీయేఁటి కంచు సర్కారువారి. ౧౩

క. అధికారులు మావిన్నప, మథఃకృత మొనర్చి రాఁపరైరి కరంబున్
వ్యథ లెన్నియిడిన శిస్తున, నథమాంశం బే నొసంగ మాపదనుంటన్. ౧౪

గీ. ఇచ్చమై నేము సుంకంబునిచ్చి మున్ను, వినిచిన దసత్య మనిపించుకొనుటకంటె
మానసంపత్తి నార్చుకోఁబూనుకంటె, మాపొలా లప్పగించుటే మాకు లెస్స. ౧౫

క. ఒడయుం డిఁకఁదమరెండవ, గడువునరిన్ గోర కార్తిగల్పింపక యు
న్నెడ మాలో సంపన్నుల, ముదుగక మాయెల్లపన్ను నొసఁగెద మర్థిన్. ౧౬

క. తనపాలిపన్ను వెట్టిన, వెనుకన్ నిఱుపేదరైతు వెతపడుఁ గానన్
ధనవత్కర్షకుఁ డేత, ద్దినమునఁ జెల్లింపఁడయ్యెఁ దెంపరి యగుచున్. ౧౭

క. నాదారుకాఁపు లిత్తఱి, నేదారియు లేక మేఁక నెద్దును గేదెన్
గాదెను గడవం జట్టిని, రోదించుచు నమ్మవలయు రొక్కము వడయన్. ౧౮

క. ఏతాదృగ్దశ నర్థా, పేతుల కర్షకులసేమ మెంచుట విత్తో
పేతుల కృత్యంబని మా, చేతంబున నిపుడు విశ్వసింతుము దీక్షన్." ౧౯

వ. ఇట్లు బాసచేసి తత్ప్రతిజ్ఞాపత్రమ్ముపై సంతకము లుంచిరి—వారి యీపెనఁగువ నిందు విస్తరించి వర్ణింపఁజాల—నగుటం జేసి యానాఁటి మధురమధు రానుభూతు లిచటం బెక్కింటి నుజ్జనసేయక తప్పదు—శంకరలాల్ పరీ ఖీపోరాటమున్గుఱిచి సంతరించిన మేలిపొత్తముం గన్నవారు దీనికలరూ పెఱుంగ నోర్తురు. ౨౦

***

౨౪ ఉల్లి దొంగ

గీ. ఎచటనో దుర్గమక్షోణి నెసఁగుచుంటఁ, బత్రికాలేఖకుల కడ్డపాటు నిడుట
నొరులు రారైరి చాంపరాన్ దురము దెసకు, నేఁటి ఖేడావివాద మానెఱిది గాదు.

క. పెదపెద్ద శీర్షములతో, నద నెఱిఁగి తదీయవార్త లఖిలాశలకున్
వెదచల్లెఁ బత్రికలు త, త్కదనము ఘూర్జరులకుం బ్రకామ్యంబయ్యెన్. ౨

క. సత్యాగ్రహమ్మునకు వసు, వత్యల్పము చాలు ననుకహాస్యము కనమిన్
నిత్యము వల దనుచుండిన, సత్యార్థధనమ్ము వార లంపిరి నాకున్. ౩

గీ. విత్త మొకవంక వేనవేల్ పెరుఁగుచుండఁ, బొదుపు నేర్పితి నొకవంకఁ బోటరులకు
జోదు లిది లెస్సగా నేర్వలేదు గాని, దిద్దుకొన్నారు తమపోవుతీరు కొంత. ౪

క. రైతుల కీసత్యాగ్రహ, రీతి కడుం గ్రొత్తయగుట రేయుం బవ లే
నేతద్ధర్మవిశేషము, భూతచరిత్రమ్ము దెలుపఁ బూనితి నోర్మిన్. ౫

గీ. అధికృతుల్ మీ రొసంగుప న్నారగించి, నిచ్చలు న్నిమ్ముఁగొల్చు బానిసల కాని
మీకు నొడయుండ్రు కారనిర్భీకవృత్తి, బ్రిదుకుఁడని కాఁపులకుఁ దెల్పఁ జనికిదిగితి. ౬

క. దొరలం గని బెదరకుఁడని, సరిచేసితిఁ గాని రైతుజన మధికారిన్
నిరసింపం జన దనువిధి, కఱపుట దుస్సాధమయ్యె గ్రామములందున్. ౭

ఆ. భీతిపోయినంత రైతు లుద్రిక్తులై, తగతరాలనుండి తమ్ము నేఁచి
భంగపఱుచువారిపట్ల మాటోడ్డుట, కంగవింపకుంట యరిదిచేత. ౮

క అవినయ మిది సత్యాగ్రహి, కవలంబన మైనయెడఁ బయస్సున కురగో
గ్రవిషమ్ముతోడి నెయ్యం, బవు శతసుకృతమ్ము లొక్కయనృతోక్తిఁ జెడున్. ౯

క. ఏ నెంత పెనఁగులాడిన, నానుడివినయంతవట్టు నడియాడు ప్రజల్
పూన రడంకువ; తుదకుం, గానంబడె నాకు దీనికలరూ పెల్లన్. ౧౦

క. ఉన్నవి సత్యాగ్రహమున, మన్నింపఁగఁదగిన ధర్మమార్గంబులు పె
క్కన్నింటను బెడిదము నాఁ, జన్నది వినయంబె యన్న సత్యము గంటిన్. ౧౧

క. వినయంబన మన్ననమ్మె, సనసన్నగ మాటలాడుచందము కాఁబో
దనయుంబు నెడఁదతోడం, దనదాయను బెద్ద సేయఁదగు విందుబలెన్. ౧౨

క. కల్లయుఁ గైతవము న్వీడి, యెల్లతఱిన్ బగతుసేమ మెంచుట వలయున్
జెల్లు నడంకువ నా నిది, యుల్లం బిడవలయు సత్యయోద్ధలు వీనన్. ౧౩

వ. సత్యాగ్రహప్రతిజ్ఞం బూనినప్రజలు ధీరులైనంతన గేలుబడివారు కైట్టిదంబు
లగు వెరవుల నూఁదం దొడఁగిరి – సేద్యగాండ్రపసరమ్ముల వారిగిమునం జిక్కిన
పనిముట్లను బలాత్కరించి లాఁగిరి – తొలిగడువుప న్నిమికి దండువుగొందు మని
యాన లంపిరి – యచ్చటచ్చటఁ బండినపంట నాఁకట్టిరి – కాన ౧౪

క. కలఁగిరి నలఁగిరి కాఁపులు, సిలు గోర్వక కొంతమంది చెల్లించి దరిన్
దలుపులు తట్టలు నధికా, రులముందట నిడిరి కొందఱు కొనుం డనుచున్. ౧౫

క. మఱికొందఱు కాఁపులు సుర, గిరులై నిలఁబడిరి యెట్టికీ డేర్పడినన్
బిఱుతివియక తుదిమట్టుం, దురమిచ్చెద మనిరి ధర్మద్రోహుల మొగయన్. ౧౬

ఆ. సమర మిట్టు లుండ సైరిసు లెవరో శం, కరపరీఖుపన్ను కట్టివేచి
రంత రగడ రేఁగె నక్కటా కంచెయే, చేను మేసె ననిరి సేద్యగాండ్రు. ౧౭

క. అత్తఱి శంకరలాల్ కడు, నుత్తలపడి లజ్జగుడిచి యోగ్యము ప్రాయ
శ్చిత్తం బేమని తుద కా, గుత్తపొలం బార్తసేవకొఱ కర్పించెన్. ౧౮

వ. ఇట్లుండ నధికారు లొక నేలంగల యుల్లిపాయలగుట్టం బాడిమాలి నిర్బంధించిరి –
కాఁపు లపుడు కొంత బెదరియుంటం జేసి వారికి వెండియు జవసత్త్వంబు లొద
వింపవలచి యా పలాండుశాఖ నొండుచోటికిం దరలింపుఁడని వారి కితవుం

గఱిపితి - మోహనలాల్ పాండ్యా నిప్పనికి నొడయనిం జేసితి - నిది యాజ్ఞోల్లంఘనమని యేను భావింప - నిలువపంట నిట్లాగుట శాసనబద్ధం బయినను ధర్మవునకు బాహిరంబ - దోపిడికి దీనికి వేర్మియేమి? - కాన నేల్పడివారి యీయాకం ద్రోయుట పాడియని యనుయాయులకుం దెలిపితి - వెండియు ౧౯

క. ఈరీతి నెదుర్కొనవలెఁ, గారాగారమ్ము పొత్తు గనవలె దొర లే
యే రాపి ళ్ళొడఁగూర్చిన, సైరింపన వలె సమగ్రజయ మది యంటిన్. ౨౦

ఆ. బంది కేగుటన్నఁ బాండ్యాకు సంబర;, ముచిత మైనవెరవు నూఁది చెఱకుఁ
జనక నేఁటిశాంతిసమరంబు నాఁపుట, కితఁడు సమ్మతింపఁ డించుకేని. ౨౧

క. కావున నితఁ డా లశున, శ్రీ వేఱొకదెసకుఁ జేర్ప సిద్ధంపడె నీ
త్రోవన్ మెచ్చినచెలికాం, డ్రీవీరునివెంట నడిచి రేడ్వురు వేడ్కన్. ౨౨

క. ఇంతపని సేయువారిఁ ద్య, జింతురె యధికృతులు బందుసేయక; వారా
సుంతయు నెఱపిరి వెంటన, గంతులువై చెన్ ప్రజానికాయము దీనన్. ౨౩

క. చెఱసాలబెదరు తీఱిన, తఱి మగఁటిమిఁ బెంచు రాజదండన; మోహాశ
నరనారీమండలితో, నిఱుకునఁబడె రచ్చ నేర మిది త్రచ్చునెడన్. ౨౪

వ. పదంపడి పాండ్యాప్రభృతుల కించుక కారాగారశిక్ష విధింపంబడియె - నే నీ దండముం దెగడుదు - ధర్మశాస్త్రముంబట్టి యిప్పని ముచ్చిమి కానేరదు - కాని రచ్చ కెక్కుట మా నేమంబునకు వింగడం బగుటఁ బునర్విమర్శనముం గోరమైతిమి - శిక్షితులఁ జెఱసాలకుం గొనిపోవుతఱి వారివెంట నపూర్వమగు మెఱవణి సాఁగెఁ- బ్రజ లానాఁడు పాండ్యా నుల్లిదొంగ యనుపట్టంబిడిమన్నించిరి- తద్బిరుదం బితని నిపుడుం బాయదయ్యె - నీ ఖేడాసత్యాగ్రహచరిత్ర కాగామి విభాగమ్ముతో స్వస్తిసెప్పెద. ౨౫

* * *

౨౯ ఖేడా సత్యాగ్రహ సమాప్తి

ఆ. రాను రాను రైతు లీనిగ్రహమ్మున, కాఁగలేక లేక యలఁతసెంది
రోర్మివిడని సత్యయోగులు తడసినం, బెల్లుచెదుదు రన్నభీతి గంటి. ౧

క. సత్యాగ్రహధర్మమునకు, వ్యత్యస్తము గాని మార్గ మగపడునేనిన్
బ్రత్యుత్క్రమ ముడిగించుట, కత్యంతము రోయుచుంటి నాక్లిష్టదశన్. ౨

వ. నాఁడు తలఁపనితలంపుగా నడియాదుసీమ నేలునుద్యోగి పచ్చపచ్చగానున్న కమ్మతీం దప్రివెట్టుదు రేని సన్నగారుకాఁపులకడం బన్నురాఁబట్ట మని నా కొక వార్త నంపె - నద్దాని వ్రాయసంబునం దీర్చి పంపుఁడని యే నడుగ నతం డట్ల

కావించె - 'మండలమ్మున కెల్ల నతఁ డధికారి కాఁడు - కాన దీని కేమందు'
వని కలెక్టరు నడిగితి - నమ్మేటి 'మీ రింతకుము న్నీనిర్ణయంబు నెఱుంగరా'
యని వ్రాసె - నా కట్టివృత్తాంత మతఃపూర్వ మశ్రుతచరంబ - కాని ౩

క. ఈసుద్ది నిక్కమగుచోఁ, జేసినశపథంబు సిద్ధిఁ జెందినయట్లు
ల్లాసపడవచ్చు రణమం, దాసించినఫలము యిదికదా తొలుతొల్తన్. ౪

ఆ. అగుటకతన మండలాధిపుముదల నా, హృదికి సమ్మదంబు నిడియెఁ గాని
పోరు ముగియునాఁడు పొందుసంతృప్తి నా, కబ్బదయ్యె నితనియానఁ జేసి. ౫

ఆ. గుల్లకాండ్రు శిస్తుచెల్లించునొత్తడి, కలుగదని యితండు వలికెఁ గాని
చెప్పఁదగినలగ్గు చేపడదాయె నే, గానియేని లేని కర్షకులకు. ౬

క. ఇతఁడు నిఱుపేద కలవాఁ, డతఁడని రూపింపఁ బ్రజలె యర్హులు తత్స్వా
నృతము నధికారులు నిరా, కృతిచేసిరి నేఁడు దీనికిన్ ముచ్చిరుదున్. ౭

క. ఈసత్యాగ్రహమున జయ, మాసాదిత మయ్యెనని మహాస్సులు సాగెన్
నాసంవీక్షణమున నీ, యాసత్తి గణింపరాని దని వ్రాక్రుత్తున్. ౮

గీ. ఉండవలయును సత్యాగ్రహులకు మొదటి, నాఁటికంటెను దుదినాఁట మేటిబల్మి
యపుడె నిర్దుష్టముగ రణంబాఁగె ననుట, యుచిత మిది లేదు నేఁటియాయోధనమున.

క. ఐనను ఘూర్జరకృషికులు, దీనం దేఁకువను సంస్కృతిం బడసిరి. నేఁ
డా నేర్మివలనిలెస్సలు, కానంబడు మనకు నెల్లగ్రామములందున్. ౧౦

వ. విదుషీమణి వసంతీదేవి (బిసెంటు) కావించిన 'హోమ్‌రూల్' ప్రచార మీ
కాఁపులం దాఁకె ననుట నిక్కంబ - కాని ఖేడాసత్యాగ్రహంబె విద్యాధికులను
స్వయంసేవకులను గమ్మతీంద్రమనుగడ కగ్గపఱిచె ననం జను - నైచ్ఛికభటు
లీకాఁపులఁ బదిమియుం దోతప్రోతమ్ముగా నల్లుకొనిపోయిరి - వా రీపెనఁకువం
దమకుఁదగ్గ కార్యరంగమును గుర్తించిరి - వారి స్వార్థత్యాగనిరతియు దీనం
బొంపిరివోయె - మఱియు ౧౧

క. వీరాగ్రణి వల్లభుఁ డీ, పోరికి నర్పించుకొనియెఁబో! త న్ననినన్
లేరని తలంతు నల్పం, బీరణఫల మని వచింప నెదగలవారల్. ౧౨

క. పల్లియలు పట్టణంబులు, వెల్లువలోఁ జిక్కువడ్డ వెనుకటియేఁటన్
నల్లవొ! బార్డోలిని నేఁ, డల్ల ఫలంబెల్లఁ దెల్లమాయె నృనకున్. ౧౩

ఆ. క్రొత్త వెల్గు పుట్టె ఘూర్జరమ్మునఁ దన, బలిమి తెలిసె నచటిపంటదారకు
మఱవఁ డాతఁడాత్మమహిమంబునికవాని, తలఁపుమాటె బ్రదుకువలపుమాటె. ౧౪

క. త న్నుద్ధరింప నెవరో, యున్నారని యెదురుసూచు నూహము తొలఁగెన్
బన్ననిచాగమె ముక్తికిఁ, బెన్నాదరు వనియు రైతుబిడ్డకుఁ దెలిసెన్. ౧౫

వ. ఖేడాసమస్యంజేసి ఘూర్జరమున సత్యాగ్రహసాధంబునకు గట్టిగట్టిపునాది యేర్పడియె - దానిముగింపు నా కెట్లున్న నేమి? సేద్యగాండ్రకుఁ జైతన్య మొకఁ గూర్చెఁ - దమబల్మి నతిక్రమించినలగ్గు వాటిల్లెనని కాఁపులు తలంచిరి - యేలుబడివలనిచెట్టం దొలఁగింపఁ జాలుతెరువుం గంటిమని వారుప్పొంగిరి - వారిసంతసమున కీయెఱుక చాలుఁ - గాని యీప్రజలు సత్యాగ్రహలక్షణం బామూలచూడము కన్నవారు కారు - కాన వీరు కొన్నికడగండ్లఁ గుడిచిరని మున్ముందు మన మెఱుంగనోర్తుము. ౧౬

* * *

౨౬. ఐక్య ప్రయత్నము

క. ఖేడాసత్యాగ్రహ మొన, గూడినతఱి సాగుచుండె ఘోరాహవ మా
కీడునఁ బడి ఢిల్లీపతి, నాఁ డాహ్వానించె దేశనాయకసమితిన్. ౧

ఆ. షేఖ్మహమ్మదొకఁ డిచెలిమి నాకుం గల, దన్నవార్త సెప్పియున్నవాఁడ
నగుట నన్నుసైత మాతఁడు పిల్వ నా, నంటి హస్తినగరి నందుకొంటి. ౨

వ. కాని యాలీసోదరులును బ్రిజారాధ్యులగు లాఁతిపెద్దలును నేఁ డాకారితులుగామింజేసి యీసభం బాల్గొంట కే నొకవంకఁ గొంకుచుంటి - నపు డాలీసగర్భ్యులు బందిగమునం బడియుండిరి - యేను వీరిగొప్పతనము లెస్సవింటిఁ - గాని యొండురెండువిడుతలె వీరిం గంటి - మఱియు హాకీముసాహెబుతోడి మైత్రియు నా కప్పటి కేర్పడదాయె - నాండూస్రురుద్ర లీగఱువం బెల్లుకొండాట యే నెఱుంగుదు - లక్నోనగరమున ముస్లింలీగు సమావేశమైనతఱి శ్వేబ్కురేషీ, బారిస్టరుఖ్వాజాల పరిచితిం బడసితి - నన్సారీ యబ్దుల్రహమానుల నెయ్యంబు వడచితి - వెండియు ౩

క. ఉత్తమశీలుర సేవా, యత్తుల ముస్లిముల మైత్రి నార్జింపఁగఁ ద
చ్చిత్తము లోఁతులు సూడఁగ, నత్తఱిఁ బయనించినాఁడ నయ్యాదెసలన్. ౪

క. హిందూ మహమ్మదీయుల, చెందములకుఁ బొత్తులేమిఁ దెలిసితి నేటా
లందు నివసించువేళల;, మం దీరుజ కెద్ది యనుచు మల్లటపడితిన్. ౫

గీ. చక్క చక్కఁగ నెదుట నిచ్చకములాడి, చనవుగోల్పోయి పరులతో సంధిసేఁత
కిష్టపడుబుద్ధి నాపాల నెపుడు లేదు, వలయుసత్యమ్ము గరువమ్మువలయు నాకు.

వ. హిందూముసల్మానుల కైక్యముం గూర్చుతఱి నా యహింస కగ్నిపరీక్ష తప్పదనియు, నక్కార్యమం దీనాప్రయోగములకు వలసినంత యవకాశ ముండుననియు నాఘ్రికాయంద నమ్మితి - నావిశ్వాస మిప్పటికే నట్లుకలదు - భగవానుఁ

డనుక్షణ మీరాపిడి నాపాదించుచున్నను నాప్రయోగ మల్లల్ల సాగుచున్న యది - యే నిట్టితలపోఁతల న్మనిఁగి బొంబాయి రేవునం దోడదిగితిఁ - గావున వెన్వెంటన ౭

క. ఆలీద్వయముం జూచితి, మాలో మొలతెంచె మధురమైత్రి; తదీయో న్మీలనకాలమ్మునఁ జెఱ, సాలం బడె నీయుగమ్ము జాలిం బడితిన్. ౮

గీ. అదను చిక్కనన్నాఁడు మహమ్మదాలి, బందిగమునుండి కమ్మలుపంపె నాకు నవి యలంతులుగావు రామాయణములు, భారతంబులు బహుళార్థబంధురములు.

క. ఈసోదరులం జూడఁగ, జేసినయత్నమ్ము లెల్లఁ జెడె నధికారుల్ నాసంప్రార్థన ముడివోఁ, జేసిరి వేసరితి వారిచిత్తము రామిన్. ౧౦

వ. ఈయన్నదమ్ములు చెఱకేగినపదంపడి ముసల్మానుపెద్దలు కాళీఘట్టమునం గూడిన తమసభకు న న్నాహ్వానించిరి - వారికోర్కపై నాలీద్వయమ్మను వెలికిం దెచ్చు కొంట మహమ్మదీయుల కర్తవ్య మని తత్పరిషత్తునం దుపన్యసించితి - నవ్వల న న్నలిఘురుకళాశాలవారు పిల్చిరి - జన్మభూమికిం బరిచర్యసేయ మీ రందఱుం బరిత్రాట్టులు కండని యచటి విద్యార్థిలోకమ్మున కుపదేశించితి. ౧౧

గీ. అంత నాలీసగర్భ్యుల న్నాఁకవలన, విడువుఁడని యేలుబడివారి వేఁడుకొంటి నల ఖిలాఫత్తువాద మీయన్నదమ్ము, లెట్లుభావింతు రా తెఱఁ గిపుడు గంటి. ౧౨

క. సౌకత్ మహమ్మదాలుల, యాఁక దొలంగన్ ఖిలాఫ తది చక్కఁబడన్ వేఁకన యనక శ్రమించుట, నాకృత్యం బనుచు నాఁడు నమ్మితి నెడఁదన్. ౧౩

వ. ఏను ముసల్మానులకు నిక్కపుంజెలికాఁడ నైన న్నాఁడీధర్మంబు పాలింపవలయునని భావించితి-ఖిలాఫతుసమస్యయందలి మంచిచెడ్డలం దడవుట నాకక్కఱలేనిపని- మహమ్మదీయులు దీనిం బాటించుట పాడియైన వారికిం దోడగుట నా కావశ్యకంబ- మతవిశ్వాసము లందఱ కొక్కరీతి నుండవు - తనవిశ్వాసము సత్యమని యెల్ల వాఁడుం దలఁచు - నట్లుగాక యిప్పట్ల నెల్లరనమ్మిక లొక్కఁడైన లోకమం దిన్నిమతములకుం దావులేదు - కాన ఖిలాఫతుసమస్య మతసిద్ధాంతవిరుద్ధము కాదనియు నాంగిలేయుల పెదప్రెగ్గడ లాయిడ్ జార్జి యిందలిసత్యము నంగీ కరించినాఁడనియుం దెలిసికొని యతఁ డాడినమాట చెల్లించునట్లుసేఁత నావిధి యనుకొంటి - వెండియు ౧౪

గీ. ముసలమానుల మతవాదమును గణించు, నను విమర్శింపఁదొడఁగి రానాఁడు పెక్కు రెవ్వ రేమన్న నేమి నా యాతలంపు, మానవులసినధర్మవుం గాననైతి. ౧౫

గీ. ముస్లిములఁ గ్రింగఁదీయు నీముప్పుగుట్టు, పలుకనెంచితి నల ఛేమ్సుఫర్డునెదుట నిభపురమ్మునయందుఁ గా లిడినయంత, దీనజనబంధు వాండ్రూసు కానఁబడియె.

వ. ఆయయ్యా యిటలీ యింగ్లండుల కొకరహస్యసంధి సాగినదనియు, నిట్టితటి నీయుద్ధ
సభం బాటించుట పాడియగునా యనియు నన్నుఁ బ్రశ్నించె – నా కాపాత్తు
గొడవ తెలియకున్న నేమి ?– దీనబంధు వన్నదాని శంకింపఁజాల – నగుటంజేసి

క. అత్తటి ఢిల్లీవిభునకు,నుత్తర మంపితిని సభకు నొడఁబడ ననుచున్
మెత్తనిపల్కులఁ జర్చకుఁ,జొత్తము రమ్మని యతండు సూచనచేసెన్. ౧౮

గీ. అతనితో లెస్సతడవినయంత నాఁడు,సందియము తీఱె నీకొంటి సభకుఁ జేర
నాఁటి ఢిల్లీశుపల్కినమాటలోని,సారమును వక్కణింతు నాచదువరులకు. ౧౯

వ. “ బ్రిటన్ ప్రెగ్గడలు కావించునెల్లచేఁతయు నామెఱుకలోనిదని తలంపఁగాదు –
తన్మంత్రివర్గమువారు తప్పటడుగు వేయరని నిర్ణయింపఁ జాలువా రెవ్వరు?– కాని

గీ. ఆంగిలేయులదొరతనం బది జగచ్ఛి,వంకరంబని భారతావనికి దాన
లగ్గువాటిల్లెనని లోఁ దలంతువేని,కృత మెఱుంగుట పాడిగా నెంతువేని. ౨౧

క. ముజ్జిడ్డుగ బవరంబులు,విజ్జినయిానాఁడు దానివెత దీర్చుట యే
తజ్జగతివారి విధి యని,వజ్జీరునివోలె నిలిచివల్కవె నీవున్. ౨౨

ఆ. ఆంగ్లభూమి వెడలు నయ్యాయిపత్రిక, లీరహస్యమైత్రి నెఱుకసేత
యేనుఁ గంటి దీన నింతకుమించిన, యెఱుకలేదు నాకు నింత నిజము. ౨౩

క. పత్రికల నెన్ని చిత్రవి, చిత్రంబులు వుట్టు నది వచింపం బనిలే
దీత్రొక్కటలోఁ బత్రిక, చిత్రిణ మీ విట్లు విశ్వసింపం దగునా ! ౨౪

క. కదన మొకయొద్ద పట్టిన, పదపడి యిది పాత్రి మిది యపాత్రింబని త్రోం
బది సెప్ప మదేమని మ, మ్మెదిరింపుము చర్చసేయు మే నొండాడన్”. ౨౫

వ. రాజప్రతినిధివాదం బిట్టిది – యిది నాకుం గొత్త కామి నిక్కంబ – కాని యా
నాఁటిధోరణింబట్టి వింతగాఁ దోఁచెఁ – గాన సమరసభం బాలుగొంట కియ్యా
కొంటి – నవ్వల ఖిలాఫత్తుగాథన్గుఱిచి ఛేమ్సుఫర్డున కొకలేఖ వ్రాయం గడఁగితి.

* * *

౨౭ పోరికిఁ బ్రజం గూర్చుట

క. అయ్యాయి నాయంకులతోఁ, గయ్యపుసభ సాగె సమరగాథలు బెడఁదల్
నెయ్యము తియ్యము విరియఁగ, నయ్యిభపురవిభుఁడు వినిచె నక్కఱ తెలిపెన్. ౧

క. కలనికి బంటులఁ గూరుప, వలె నను నిర్ణయము తెచ్చె వక్కణచేసెన్
వలచెను దీర్మానంబును, బలపఱచుట కేను నిల్వఁబడవలె ననుచున్. ౨

వ. అంత హిందూస్తానీపల్కున దీని సమర్థింతు – నియ్యకొం – డని యేనాడ
నతఁడు నాకోర్కి మన్నించుచు నాంగ్లమునందును భాషింపుఁడని యర్థించె – నది

దీర్ఘోపన్యాసముల కదను కామింజేసి "నాకర్తవ్యము నిప్పట్ల లెస్సయెఱింగి యా
నిశ్చయంబున కామోదింతు" నని యిరుబాసలం బల్కితిఁ - బదంపడి ౩

క. ఏ నాకొల్వున హిందూ, స్థానీపల్కునకుఁ జేర్మి సంధించుట నౌ
నౌ నని సభ్యసమాజము, నానాభంగుల నుతించె న న్నావేళన్. ౪

క. మధురంబుగ రాజప్రీతి, నిధిసభలో దేశభాష నెగయుట కిదియే
ప్రథమనిదర్శన మనె న, వ్విధముం గని యేను లెస్స వెలవెలనైతిన్. ౫

క. నానన్ గుడిచితి మనగతి, యీనీచస్థితికి వచ్చెనే యనుకొంటిన్
మానించిరె వెలివైచిరె, నానుడువున్ దొర లటంచు నలఁగుడువడితిన్. ౬

గీ. ఇంతకంటెను దార్కాణ మేమివలయు, నక్కటా! భారతీయహైన్యము వెలార్ప
మననుడుల్ రెండుమూఁ డన్నమాత్రి కిన్ని, మెప్పులా? యెట్లుమఱతు నిమ్మేళనంబు.

వ. అది యట్టు లుండె - నయ్యవసరమునం దేను సంగ్రామసదస్సునం బాలుగొం
టకుఁ గల యాశయమ్ము లివి యనియు, నాగామికాలికవాంఛ లిట్టివనియు
నేలుబడివారికిం బ్రజలకుఁ దెల్లమిసేఁత సముచితంబని తలంచితిఁ - గడుంగడు
శ్రమించి దిల్లీశ్వరున కొక దీర్ఘలేఖ సంతరించితి - నందు ౮

క. ఆలముపట్లం గూర్చిన, యోలగమున లోకమాన్యుఁ డుండమి సరదా
ర్లాలీ సోదరు లుండమి, నాలో దుఃఖమ్ము పొంగినది యని యంటిన్. ౯

క. భారతజనతా హృదయ, ద్వారము తెఱచితిని సమరతంత్రోద్గతముల్
మూరిన మహమ్మదీయుల, కోరిక లీదృశము లంచుఁ గూర్చితి నర్థిన్. ౧౦

క. ఈకమ్మను బ్రకటించుట, కీకొనుఁడా యంటిఁ గరిప్పురీంద్రుఁడు హర్ష
శ్రీకలితోక్తులఁ దన యుర, రీకృతి నందించె వెలువరించితి రచనన్. ౧౧

ఆ. కొలువు ముగిసినంత నెలలె సిమ్లాశైల, శృంగవాసమునకు చేమ్సుఫర్డు
లెస్సవిలువ యున్న లేఖమ్ము నిద్దాని, నంచె కప్పగించి యనుపనైతి. ౧౨

గీ. వీనికిని వానికిని గాక వెలఁదివాని, కిచ్చి యుత్తర మిది పుచ్చు నిచ్చవడితి
దీనబాంధవుఁ డాండ్రూసు తెలిపె నేఁటి,పనియొనర్పంగ 'నైర్లండు'పాత్రుఁడనుచు.

గీ. అమృతాచార్యుఁ డీకమ్మ యర్థ మనుచు, మదికిఁ దోఁచిన మన్నింతు మాటననియె
నవలఁ బరికించి సముచితంబని వచించి, కదలెరవరెండు సిమ్లానగమ్ము దెసకు. ౧౪

క. నిసిపయనం బిది వేసట, నొసఁగున్ రెండవతరాన నోడక చనుఁడీ
వసు విత్తు నంటి నడితర, మసుఖం బిడదని గమించె నతఁ డా శ్రేణిన్. ౧౫

వ. ఈతనిసౌజన్యంబు న న్నెంతేని వలపించె - నిట్టిపుణ్యపురుషుని కేలం బెట్టి పంపిన
లేఖ నాతలంచినట్ల లెస్సయొదవించె - నాదారి సుగమం బగుట కిది కారణం
బయ్యె - నిఁక నారెండవకర్జంబు కయ్యంబునకు వలయుబలఁగమ్ముం గూర్చుట

కదా! – నా కీబికిరంబు ఖేడామండలమునం గాక యిం కెందు దొరకు! – నను
చరులం ద్రిక్క– మున్నుం దేవరి నర్థింతుఁ – గావున ౧౬

క. ఖేడా చేరినయంతన, ప్రొడలతో వల్లభాది బుధవర్యులతోఁ
గూడి సమస్యం దడవితిఁ, బాడిం గని యనికిఁదోడుపడుఁడా! యంటిన్. ౧౭

క. నామార్గమునకుఁ గొందఱు, వైముఖ్యము చూపి రెన్ని వల్కినఁ బ్రిజ సం
గ్రామమ్ము దెసకు వచ్చునె, యేమో యని కొంద ఱాడి రితవరు లగుచున్. ౧౮

ఆ. నెయ్య మింత లేదు నేఁబిల్చు ప్రిజలకు, దొరతనమ్ము వారి కరసిచూడ
మఱవరైరి తమ్ము నుఱిచియాడిన యధి, కృతులఁ గాఁపువార లింతదనుక. ౧౯

వ. ఔఁ గాక – నాపని యేను మొదలుపెట్టితి – వెన్వెంటన ప్రిజాహృదయమ్ము
తేటపడె – ఖేడాసత్యాగ్రహమునం దమబండ్లఁ దేరకుఁ దేర యొసంగినవారు నేఁడు
మాకు బాడిగ కేని బండి కట్టరైరి – కాని యింతమాత్రన మే మున్నరనక కాలి
నడక నాశ్రయించి యేమందురో యన్న శంకంజేసి యెవ్వరిం గూడు వేడక తిను
బండములమూటలు మోసికొనుచు యాత్ర సాగించితిమి – పోయినతావులందెల్ల
సభలు కూర్చితిమి – ప్రిజ లారచ్చలకు వచ్చెడివారు – కాని ౨౦

క. దండునఁ జేరుట కొకఁడో, రెండో పే ర్గొనఁగువా "రరిం దిట్టుటయున్
దుండగ మంటిరి కత్తులు, కొండని మా కిపుడు సెప్పఁ గొంకరు మీరల్. ౨౧

ఆ. ఇంగిలీసువార లీ దేశమున కేమి, యొఱఁగఁ బెట్టి రేమి గరువ మిచ్చి
రాదుకొం డటంచు నీదినమ్మన మమ్ముఁ, బొగడ వారి కెట్లు మొగముచెల్లు" ౨౨

వ. ఇట్టి యనుయోగశరంబులు మాపై వందలు వేలు పఱుపువారు – వారి కుచితో
క్తులు సెప్పుచు నొల్లంబోక మాపని మేము సేయంజేయఁ గొన్నాళ్ళకది పండఁ
బాఱెఁ – దొలిదశముం బంపినవెన్క మాబాట చక్కంబడునని యేను దలంచితి-
గడించిన మూఁకకుం దా వెచ్చట నని యధికారుల నడిగితి – వారు ౨౩

క. ఢిల్లీ సభకుం బ్రితిగా, నెల్లెడఁ గూర్చిరి సదస్సు లీదృశ మాపా
దిల్లె గుజరాతునం దొకఁ, డల్ల దొరల్ నన్నుఁ బిల్చి రాకొల్వునకున్. ౨౪

క. అనుయాయులతో సభకుం, జని చిత్తము చిత్తమను హసాదను రవళుల్
నినుపారిన తద్రంగము, గని ఢిల్లీగోష్ఠి మఱవఁగంటిని సరగన్. ౨౫

క. దిగమ్రింగితి నీబన్నము, తగుమాటలు వల్కితిని సదస్యులమ్రోలన్
మొగమోడక దొరలదెసన్, నెగయించితి నొండు రెండు నిశితతరోక్తుల్. ౨౬

క. దురమునఁ జేరందగు నను, కరపత్రము నచ్చువైచి గఱువల కిడితిన్
దొరలకుఁ దద్రచనంబున, దొరలినవాక్యములు కొన్ని దుష్టము లయ్యెన్. ౨౭

వ. వానిసారం బిచట వ్రాయం బోలు నని తలంతు. ౨౮

ఆ. "తెల్లవారు భారతీయులఁ గుదియించు, శాసనములు పెక్కు చేసినారు
సకల మొక్కమొత్తు జాతిచేతికటారి, ముక్కు లాఁగుచట్ట మొక్కమొత్తు. ౨౯

క. ఆయుధశాసనపీడం, ద్రోయింపఁగ శస్త్రశాస్త్రదోషజ్ఞతమై
శ్రేయఃపుంజము వడయఁగ, నీయది బంగారుగడియ హిందూమహికిన్. ౩౦

క. సామాన్యప్రజ లీపెను, బాముక దొరతనమువారిబాసట యైనన్
బ్రామెడుసందియము న్విడి, ప్రామిడిశరశాసనంబు పాతురు వారల్. ౩౧

వ. నాయీపల్కుల నధికారి ప్రేలుపెట్టి చూపి మన కభిప్రాయభేదమ్ము లిట్లున్నను మీ రీకొల్వున కేతెంచుటంజేసి యేను దనిసితి - ననుడు నానేర్చినయుచితోక్తుల నామాటలం దిరపఱుచుకొంటి - మఱియు ఢిల్లీశ్వరున కే నంపినకమ్మ తెఱఁగుసైత మిచటం బ్రకటింతు. ౩౨

క. "కదనసభం బొల్గొంటకు, మొదటం బుయిలోడితిని మిముం గని మీ ర
న్నది విన్నపదంపడి నా, మదిఁగలసందేహమెల్ల మఱుపడె నధిపా! ౩౩

గీ. ఆసభకు లోకమాన్యు మహాత్ము దాలి, నలబిసెంటును బిల్వమి నస్మదాత్మ
కలఁగె మెఱవడి యెంతేని గలరు వీరు, వీరిపల్కున కీనాఁట విలువ హెచ్చు. ౩౪

క. మీ రియ్యెడఁ బొరపడితిరి, దారిం దప్పితి రటంచుఁ దలఁచెద నైనన్
గూరినవిపత్తి లే దీ, తీరుసభల్ పెక్కుపుట్టు దేశాన నిఁకన్. ౩౫

ఆ. వారి నపుడు పిల్వవచ్చును దత్సహా, యతను బడయవచ్చు నాలమునకు
నెడఁదలందు నెంత యెడమడు గున్నఁ బో, నాడఁ జనదు మీర లట్టివారి. ౩౬

వ. పరిస్థితు లిట్లున్నకతన మున్ముందు కలనికిం దోడుపడ నొల్లనైతిఁ - గొలువునం దీర్మానము నగ్గించినవెన్కఁ దనివిగంటి - నిపుడు నాచాటిన తలఁపులకుం దామగు నందు రేని యావెంటన సమరకార్యంబు తలఁదాల్చి తిరుగుదు - మఱియు నాంగ్లరాజ్యంబున సమగ్రాధికారముగల పాలివారమై యుంట కే మాసపడి యుంటిమి - కానఁ దద్రాజ్య మిడుమలం బడినతఱి దాని కండయగుట మా ధర్మవు - నేఁ డాయేలుబడి నాదుకొన్నయెడ మాకోర్కులు వైళంబ యీడేఱునని తలంతుము - తాము మాకొసంగు సంస్కరణములు కాంగ్రెసు ముస్లింలీగులకుఁ దుష్టిం గూర్చునని ప్రజలు విశ్వసించిరి - యీనమ్మకంజేసియ నేఁ డీకొలువునం బ్రజానాయకులు పాల్గొని నిండుమనమ్మున మీవిజయమ్ము వలచిరి - కయ్యమున్నంతదనుక భారతీయులు స్వరాజ్యమను పల్కుసైతము వెలువరింపకుండున ట్లేను గష్టింతు - నోపికయున్నవారి నందఱ నాలమ్ము దెసకుం ద్రిప్పుదు - దీనంజేసి నాదేశీయులు సామ్రాజ్యమునం దుదాత్తపదము నందనేర్తురు - రంగువేర్మియు, దేశభేదంబును దీనం దెగటాఱు - వెండియు నీనాఁడు

క. పలువురు విద్యార్థికులీ, కలనికి విముఖులుగ నుంట కనఁబడు నగరం
బులఁ బల్లెలవా రాడిన, పలుకుం దలఁదాల్చుచుండ్రి ప్రజ లానతిగన్. ౩౮

క. ఏ నిచటికి వచ్చినకొలె, మానక పాలికులతోడి మైత్రిని గంటిన్
బానిసము దుస్సహం బను, పూనిక నున్నారు వారు బోధాన్వితులై. ౩౯

వ. దొరతనమువా రొకగడువు నిర్ణయించి యానాఁటి కీనాఁటికి స్వరాజ్యము నీవలయు
నని నిశ్చయించినకాంగ్రెసునం దేను బాల్గొంటి - నిది దుష్కర మ్మనియు
నెఱుంగుదుఁ - గాని ౪౦

గీ. భారతీయులు సంతృప్తిపడ రయా! స్వ, తంత్రభావమ్ము వెలయు పెత్తనము లేక
యెన్ని వెతలైన సైరింతు రెంత లేసి, త్యాగములకైన వా ర్వీనుదీయ రెందు. ౪౧

గీ. ఆంగ్లసామ్రాజ్యలక్ష్మికి నావహిల్లు, నార్తి వోకార్చుపొంటె నేఁ డంతలేసి
త్యాగముల కోహటిల్లనిజనులుసైత, మున్నవా రెందుఁగన్న హిందూర్వియందు.

క. కావునఁ గలనికి వలసిన, సేవకులం గూర్తుఁగాని సిరి నార్జింపన్
లావరిని గాను దొలుతన, యీవసుమతి యొసఁగె బలిమి కిందనిధనమున్. ౪౩

వ. ఏ నెట్టివిడుపున కేని దెగించుటం జేసి యీసమరసభానిర్ణయంబు నగ్గించితిఁ - గాని
నేఁడు మాకుంగల పెత్తన మెయ్యది? - మున్ముందు మాకోర్కు లీడేఱునన్న
నమ్మికం బట్టి యే మిపు డీసాయంబున కొగ్గవలసె - మాయాస లాఱడిపడ్డ
నాఁడు మాకు మీదేసంగల యాదరమెల్లం దొలఁగు - మీ రన్యోన్యకలహం
బులు వల దన్నమాట కధికారులదుండగము సైఁపుండని యర్థమయ్యెనయేని
మా కట్టితాల్మి వడయరానిది - మఱియు ౪౪

గీ. పట్టుపట్టి నిరంకుశప్రభుతఁ జూపు, నధికృతులదౌష్ట్య మోర్వ నా కలవియగునె
హెచ్చరింపుఁడు ప్రజలను రెచ్చఁగొట్టఁ, గాదు మన్నింపుఁడని యధికారిజనుల.

ఆ. చాంపరాను రైతుసంఘంబు తడవులఁ, బట్టి కుడుచునిడుమ నెట్టివైచి
దేశమునకుఁ దేటతెల్లఁ జేసితిఁ దెల్ల, వారివలచు ధర్మవైభవంబు. ౪౬

క. సత్యముకై దుఃఖంబుల, నత్యాయముల నోర్చుబల్మి యబ్బినచో భూ
పత్యధికార మసార మ, నిత్యంబని ప్రజలు పెద్ద నేర్చిరి ఖేడన్. ౪౭

వ. ప్రజ లింతకుమున్ను రాచటికి మన్ననుడిని విన్నంతన కినిసి తిట్టువారు - కాని నేఁ
డా కింక పీఱిమెడం గనఁజాల - సాత్త్వికనిరోధమున కేలుబడివా రాఁకవెట్టమిం జేసి
ప్రజాభిప్రాయం బిఁక ననాదృతంబుకా దనునమ్మిక పీఱికింబలిసె - నిట్టియనుభ
వములం బరికింపఁ జంపారణ్యాఘుటార్జరంబుల నాయొనర్చినచేత లనికిం దోడ్పడిన
వని చెప్పంజను - వెండియు ౪౮

క. వదలుమ ! యీసత్యాగ్రహ,కదనం బని మీరు నాకుఁ గట్టడసేయన్
మొదలిడుచో నది యూర్పక,బ్రతుకంగా వలయు నన్నప న్విడుట యగున్. ౪౯

ఆ. కత్తిబలిమి నూఁది కా కాత్మశక్తిచే,నహితు నోర్వవలయు నన్నపాడి
ప్రజకు నేర్ప నాతపస్సు పండిన జగ,త్త్రయము నెదిరి భారతము జయించు. ౫౦

ఆ. అగుట నెల్లయెడల నవమతి నాపత్తి,సైఁపవలయు నన్న సారనీతి
నరనరమ్మునందు నామేన జీర్ణింపఁ,జూచుచుంటి నాత్మ నాఁచుచుంటి. ౫౧

క. ఈనీతికి రండని ప్రజ,కే నపుడుం దెలుపుచుంటి నెది నెఱపిన ని
ద్దానిమహత్త్వము చాటుట,కే నెఱపుచునుంటి సత్య మిది యనుకొంటిన్. ౫౨

వ. ఇంక నొక్కవిషయముం బేర్కొని యీకమ్మను ముగింతు - మహమ్మదీయ రాజ్యంబుల కెట్టిచెట్టయుం గావింపమని మాటయిచ్చినట్లు మీ రాంగ్లమంత్రుల నొక్కవలయు - ముసల్మానుల కెల్లర కీవేదన కలదని మీకునుం దెలియు - నేను హిందువనై వారిమువ్వల నొప్పరికింపఁజాల - వారిదిగులు హిందువులకుం దిగుల - ముస్లిమురాజ్యములకుం గల చనవుల న్మనుచుటయు నచటి పుణ్యక్షేత్రముల గౌరవించుటయు, భారతీయులు వలచుస్వాతంత్ర్యము నొసంగుటయు సామ్రాజ్య శ్రేయమ్మున కత్యంతావశ్యకములు - నా కాంగ్ల జాతిపట్లం గల గౌరవము మిక్కుటం బగుట నీలేఖ మీ కనుపుచుంటి - నాంగ్లేయులయట్ల భారతీయులుం దమరాచతికమ్మునెడ విశ్వాస మూనునట్లు సేఁత నావాంఛ యని వక్కాణింతు". ౫౩

* * *

౭౮ మ ర ణ శ య్య

క. సైనికయత్నమునం దన, మేనంగల తిమ్మఁదనము మెల్లన జాఱెన్
హాని యెఱింగియు నెక్కడు, గా నమలితి నపుడు సెనగకాయలపప్పున్. ౧

క. అతిసారవ్యాధి సము, ద్గతమయ్యె నసడ్డతోడఁ గడపితిఁ గొన్నా
ళ్ళతిరిక్తమయ్యె రోగము, మతి సమ్మతిసేయ దపుడు మం దంటుకొనన్. ౨

క. ఈరుగ్ణస్థితి కగపడి, చేరితి నాశ్రమము; నుపవసించితి నొకనాఁ
డేరుపడఁ గొంతతిన్నన, వారక మఱిరెండు సేయ వలచితిఁ బస్తుల్. ౩

క. అట్టితఱిఁ బబ్బ మెదియో, పుట్టి 'నుపాసంబ కాని బోనము నేఁడుఁ
ముట్ట' నని సతికిఁ జెప్పితిఁ, గట్టా మఱపించె నన్నుఁ గస్తురి తుదకున్. ౪

వ. ఆకాలమం దేను బయస్సు నుజ్జనచేసి బ్రతుకుచుంటిఁ - బా లొకండ కాక తజ్జన్యంబులగు నాజ్య తక్రంబులు సైతము నా కపుడు నిషిద్ధంబులు - కాన

సర్పిస్సునకు మాఱుగాఁ దైలముం జేర్చి గోధూమభక్ష్య మొండు నాకై
యిల్లాలు సిద్ధపఱిచె - నా కింపితంబగు మినుపకట్టుం గాఁచె - నాపిపోర్కిం
దీర్చుటయు, నాల్కకుం దనివిగూర్చుటయు, నొడలిం గాచుకొంటయు నా కర్త
వ్యంబులని తలంచితిఁ - గాని దుర్విధి తఱివేచియుండె - నంత ౫

క. ఆపోవుదనుకఁ దింటి న, పూపమ్ములు; జమునికడకుఁ బోయెను లేఖం;
జేపారిన యతిసారము, వే పరువెత్తించె నన్ను వేమఱు వెలికిన్. ౬

క. ఈదుర్భరదశలో నడి, యాదునకుం జేరవలసె నరక్రోసెడు ద
వ్వైదామడగాఁ జని పెం, పేద సబర్మతిని రైలు నెక్కినవాఁడన్. ౭

ఆ. దారిలో నహమ్మదాబాదునం చెకు, వచ్చి నన్నుఁ గలిసె వల్లభుండు
కడుపునొవ్విఁ నన్నుఁ గవ్వించె నప్పుడా, యలఁత నప్పుడేలు తెలిసెఁగాని. ౮

ఆ. ప్రాణగొడ్డమైన యీనొప్పిచందమా, వల్లభునకు లాఁతివారలకును
జెప్పనొల్లనైతిఁ జేరితి నడియాదు, ఘట్టమునకుఁ దిగులు మిట్టిపడఁగ. ౯

వ. అచటి కే నున్నయనాథాశ్రమము పాదక్రోశముదవ్వునంద కలదు - కాని క్షణ
క్షణం బెసఁగేఁగు నోగులునం జేసి యసురుసురై బసం గదిసితి - నా కపుడు
మాటిమాటికిం బెరటి కేగవలయునన్న శంక వొడమసాగె - నిఁక నిగ్రహము
తగదని రోగమ్ము తెలఁ గెల్లరకుం దెలిపి మంచమెక్కితి - దొడ్డికిం జనలేక
పోయితి - నుల్ల మెంతసిగ్గిల్లుచున్నను గత్యంతరము గానక పురీషపాత్రంబు తెప్పిం
చితి - ఫూల్‌చందు మించువోలెం బేరెముదీసి దానిం గొని తెచ్చె - నెచ్చెలికా
త్తెల్ల రొల్లంబోయిన మొగంబుల నన్ను బలసిరి - వీరికి నాదెసంగల యర్మిలి
కొలందిపెట్టరానిది - కాని వీరు నావేదనం బోఁద్రోలఁగలరా? - పైపెచ్చు నా
నేమమ్ములు కడుంగడు బెట్టిదమ్ములు-వీరియుత్తలపాటుం దనపట్టుదల పెద్దసేయం
దొడఁగె - వెజ్జుం దెత్తుమని నెయ్యురు బతిమాల వలదని యే నంటి:-
జేసినదోసమ్మునకుం గుడుచుటయ మందని బోధించితి - నాచందముం గొందల
ముతో వారు సైరించిరి - తెల్లవాఱులోపల నాకు నలువదిమాఱులు శకృదార్తి
సంధిల్లె - నంత నోగిరంబు వదలితి - నది వలయునన్నయిచ్చయుం దొలఁగె. ౧౦

ఆ. ఇన్నినాళ్లఁ గోలె నినుపముక్కంబోని, దని తలంచుచున్న యస్మదంగ
మకట! మట్టికంటె నధరమై చూచుచుం, జూచుచుండ బల్మి సుడిఁగిపోయె. ౧౧

క. నావేదన విని సాయము, గావింపఁగ వెజ్జు 'కానుగా' చనుదెంచెన్
దాప్రవుఁడు మందిచ్చెద నని, వావిరిగా వేఁడెఁ గాని వలదని యంటిన్. ౧౨

వ. అతఁడు సూదిమందుం బ్రయోగింతు నీకొందురా? యనుడు నదియు వర్జనీయం
యంటి - నేదో రసికయని తప్ప నప్పటి కది మోహధీసార మగుటం గాన

నా యామెఱుంగమి పరిహాసపాత్రంబ యగు - నిట్లు చికిత్సపట్ల వైముఖ్యముం
బూనితిఁ గాని రోగమ్ము నాఁగనేరనైతి - నలయికం జేసి వేఁకిఁకిం జిక్కితి - నది
నన్ను సంధిలోని కీడ్చెఁ - బదంపడి ౧౩

క. తత్తరపడి మిత్రులు పరు, వెత్తిరి నల్గడకుఁ గీర్తి నెసలారు భిష
క్సత్తములం దెచ్చిరి వా, రెత్తెఱఁగునఁ జక్కఁబఱుతు రీ జగమొండిన్. ౧౪

క. ఏ నిట్లు మరణశయ్యా, దీనుఁడనై యున్నవార్త దెలిసినయంతన్
మానసిసంతాపముతో, మానినితో వచ్చె ధనికమణి యంబాలాల్. ౧౫

గీ. నన్నతఁ డహమ్మదాబాదునగరిఁ జేర్చి, రమణమునఁ దన యతిథిగేహమున నిల్పి
వేసరక పరిచర్య గావించె నాకుఁ, గాన నీదృశ మధుర నిష్కామసేవ. ౧౬

ఆ. అతఁడు తెప్పవాల్ప కస్మదారోగ్యమ్ము, వలచి యెంతయెంత నలఁగుచున్న
నాశ్రమోర్వి దెసకు నరిగె మద్దృష్టి కా, దనక పంపె సెట్టి యటకు నన్ను. ౧౭

క. అచ్చట మూల్గుచునుండఁగ, వచ్చెన్ జర్మని 'జితోస్మి' వల్కినవార్తల్
నిచ్చలు రణకార్యంబునఁ, జొచ్చిల్లుట వోక శాంతిచొప్పడె నెడకున్. ౧౮

గీ. తొట్టివైద్యమ్ముచేఁ దెగుల్ మట్టుపడియెఁ, గాని సత్తువరాదయ్యె మేని; కాప్త
లపుడు నీకుఁ బయస్సు వర్జ్యమ్ము గాన, మాంసరసమున కీకొంట మంచి దనిరి. ౧౯

ఆ. కోడిగుడ్లు మెక్కఁగూడదా యని మిత్రుఁ, డొక్కఁ డడిగె శాస్త్ర మొప్ప ననుచు
నెంద తెంద తెన్నిహితములు సెప్పిన, మెచ్చనైతి నెఱచి మ్రింగనైతి. ౨౦

వ. ఆయుర్వేదాదిశాస్త్రములంబట్టి యేను భోజ్యాభోజ్యనిశ్చయంబు గావింపనొల్ల -
నాతిండి నామనుగడవోలె నాయిచ్ఛ ననుసరించియుండు - నదియు నిదియుం దిని
జీవింపఁదగు నన్న దురాశ నా కెన్నఁడుం బొడమదాయె - నాయాలుబిడ్డల కే
నేర్పరించినపాడి నాపట్లం జెల్లదని యెట్లు తలంతు - నయ్యది యట్లుండె. ౨౧

గీ. ఇంత బెడిదంపుఁదెగులున కేను మున్ను, పట్టుపడనైతి నేఁటియాచెట్ట నాదు
ధర్మనిష్ఠఁ బరీక్షింపఁ దలఁచి వలచి, వచ్చిన యలభ్యయోగమ్ము వలెఁ బొసఁగె. ౨౨

క. ఈనొవ్వునందు నొకరే, యే నిల జీవించు టరిది యిఁక ననుకొంటిన్
నానాభయ దాకృతిమైఁ, గానంబడె మిత్తి నాదుకన్నులయెదుటన్. ౨౩

క. అనసూయను రావించితిఁ, జనుదెంచెఁ బటేలు వైద్యసత్తముఁ డేతెం
చెను బరికించెను వెలుపున, మునుఁగం బనిలేదు లేదు ముడుఁగకుఁ డనియెన్. ౨౪

క. అతఁ డెంతదిటము సెప్పిన, బ్రతికెదనని మన్మనమ్ము పల్కుట కోడెన్
గతియించె నిశ్శయాంతయు, శతపత్రహితుండు పూర్వశైలము నెక్కెన్. ౨౫

క. జీవింతునన్న నమ్మిక, మూవంతయు నాకు నొదవదయ్యెను గీతా
శ్రీవచనశ్రవణంబునఁ, దోవందగు గడియలన్న త్రోవం బడితిన్. ౨౬

క. కనుబల్మియు నను చేవయు, వినుశక్తియు జాఱె బ్రిదుకు వెగటుగఁ దోఁచెన్
దనమేనికొలఁకు నెయ్యురు, పెనువేసటపడుట నాధి పెరిఁగెను నాకున్. ౨౭

వ. ఏ నివ్విధంబునం జావురాకకై వేచియున్నతఱి భిషఙ్మణి 'తలవల్కరు' రొకవింత మానిసిం దోడితెచ్చె – నతఁడు కేల్కరు నాఁజను మహారాష్ట్రుఁడు – వైద్య కలాశాలయం దతఁడు చదువెల్ల నేర్చెఁ గాని పట్టముం బడయఁడయ్యె – నతని మంచుగడ్డవైద్యమున కే నియ్యకొంటిఁ – దచ్చికిత్స నన్ను మృత్యువునకు దవిష్ఠుఁ గావించె – దాన నామేనికి న్మదికి నించుక తేటవాటిల్లె – మఱియు ౨౮

క. ఆఁకలి రెపరెపలాడెను, నా కించుక నడువఁదగ్గ నలు వేర్పడియెన్
మీ కిపుడు గుడ్డు తోడ్పడుఁ, జేకొనుఁడని వెజ్జు హితముసెప్పఁ దొడంగెన్. ౨౯

ఆ. పాలవోలె గ్రుడ్డు పాపమ్ములేని ప, దార్థ; మండ మెఱచియగుట కల్ల
యెల్లకోశమునకుఁ బిల్లపుట్టదు సుఁడీ, బిడ్డరాని కోడిగ్రుడ్డు గొనుఁడు. ౩౦

వ. నిర్జీవంబులగు డింభములు విపణివీథిం బడయవచ్చు – వానిం దినుట నింద్యమ్ము కానేర – దని కేల్కరు లెస్సబోధించెఁ – గాని యతనిపల్కున కేను లోఁబడ నైతి – నిపు డున్నబల్మి నాపనులకుం జాలు ననుకొంటి. ౩౧

***

౨౯ రౌలటుచట్టము - నాధర్మసంకటము

క. ఆరోగ్య మందుటకు 'మా, థేరా' నుచితోర్వియని మదీయులు తెల్పన్
మాఱాడక యే నమ్మిహిఁ, జేరితి నొకవార మధివసించితి నచటన్. ౧

క. ఆనీరు మంద మగుటం, గానంబడదయ్యె లగ్గు కదలితి నంతన్
నానొవ్వు దవ్వు సేయం, బూనెను శంకరుఁడు మిత్రపుంగవుఁ డర్థిన్. ౨

వ. నాఁ డతిసారవేగమ్మున మత్పురీషద్వారంబు చేవచెడి గాయపడి మలోత్సర్జనవేళం బెల్లుబాధించుఁ – గాన బోనముం దిన జంకుచుంటి – శంకరలాలపుడు చికిత్సకు 'దలాలుం' బిలిచె – న వ్వెజ్జునకుం గల గ్రహణశక్తి కే నబ్బురంపడితి – నతఁడు పాలం గ్రోలకున్న మీమేను చక్కఁబడ దనియు లోహపాషాణములకుం జెందిన సూదిమందులుసైత మక్కఱపడు ననియుం బల్కఁ బయస్సు ముట్టంజాల నని యే నంటి – మీశాశపథస్వరూపం బేమని దలాలు ప్రశ్నించె – "గోమహిషులకు 'ఫూకా' ప్రయోగించి దుగ్ధంబు నొడిగించుట విని దానిం గాదని రోసితి –

వెండియుం బాలు మానిసికిం దిండికా దని నమ్మితి - నగుటం జేసి పోసనము నాకు వర్జనీయం బయ్యె"నని యేను వక్కాణించితి. ౩

ఆ. మేఁకపాలు ద్రావ మేకొనినం బాప, మేమిపుట్టు ననియె నింతి యపుడు
చాలుఁజాలు మీ కజాక్షీర మని దలా, లందుకొనియె నాపె యన్నమాట. ౪

క. ఏ నపుడు మెత్తఁబాఱితి, మానని సత్యాగ్రహాభిమానముకతనన్
మేనిపయిఁ దీపిఁగొంటిని, బూనినసమయంబు వీటిఁబుచ్చితి నంతన్. ౫

క. శపనాక్షరములు మనిచితి, శపథాత్మం జంపుకొంటి జనునకు దుగ్ధం
బెపుడును సహజాన్నము గా, దపనేయమ యన్నబుద్ధి యడఁగనినాకున్. ౬

ఆ. మేఁకపాలు సైత మేకరణింబాన, పాత్రమగును? ధర్మపథము నెల్ల
నెఱిఁగినట్టివాఁడనే యయ్యు నీనాఁడు, జాఱినాఁడ బాస మీఱినాఁడ. ౭

క. సత్యార్చకుఁ డిబ్భంగిని, సత్యాగ్రహసంగర ప్రచాలనదీక్షన్
మృత్యువును ద్రోయవలె నని,సత్యమునకు మచ్చదెచ్చుసాహస మూనెన్. ౮

క. ఈపుండు నింతదనుకన్, మాపుట కే నోపనైతి మాపుదు రేపున్
దాపమ్మునఁ బడి క్రోలుదుఁ, బాపం బనుకొంచు మేఁకపాలం గదరే! ౯

వ. ఐనను బ్రజకుం బరిచర్య గావింపవలయు నన్న మహాసూక్ష్మమగు వలపు నన్నుం బాయకున్నయది-యహింసాదృష్టిమైఁ గావించు ఖాద్యాఖాద్యపరీక్ష నా కామోద వినోదములం గూర్చు- నీచూపునం జూడ నజాక్షీరంబు నా కలమట నీఁజాలదు- కాని సత్యదృష్టిం దిలకింప నార్తి నాపాదించు-నహింసకంటె సత్యంబ నా కెక్కు-డెఱుకపడు నని త్రోఁచెడిని - సత్యముం బాసిననాఁ డహింసాబంధము నూడ్వ నేరఁ-గావించినబాసయందలి శబ్దార్థ భావార్థముల నాదరించుటయె సత్యవ్రతంబు నాఁజను-నిప్డేను భావార్థముం ద్రోసివైచితి - నిది సర్వదా మనశ్శల్యమై నన్నుఁ గాఱియపెట్టుచుండెడిని - మఱియు ౧౦

గీ. పాలుత్రావుట కే నిష్టపడినవెన్క, వైద్యుఁడు దలాలు మన్మలద్వారసీమఁ
జలిపె శస్త్రచికిత్స నవ్వాలనిపీన, యవ్వాలఁ దొలంగ నడయాడునలవు గంటి. ౧౧

సీ. పదపడి పత్రికల్ పఠియింపసాగిన, నాకంటఁ బడె నొకనాఁడు రౌల
టుపసంఘ మిచ్చినయపకృష్టనిర్ణయం;, బది భారతీయప్రజాళినోరు
గట్టి జన్మస్వామ్యఘాతుకమై ధర్మ, దూరమై ఘోరమై పౌరగార
వాపహమై యుంట నడలితిఁ బోరికై, యంతసాయము సేయ నింతపెద్ద

గీ. కష్టము నొసంగిరా యధికారు లనుచు, వెల్లఁబాఱితి శంకర వల్లభాదు
లేమికర్తవ్యమనుచుఁ దీర్చిది ప్రభుత్వ, శాసనమయ్యెన మాఱొడ్డఁజను నటంచి.

క. పదుగుం డ్రినుచరు లబ్బినఁ, గదనము సాగింత మేను గదలన్ మెదలన్
జదురుఁడను గామి నుల్లం, బదవదపడుచున్న దన్నలా! యని యంటిన్. ౧౩

వ. ఈ విచారఫలంబుగా నస్మన్మిత్రులం బిలిచి యొకగోష్ఠిఁ గూర్చితి – హార్నిమన్ సరోజినీదేవిమున్నగువా రిరువం డ్రసభకు వచ్చిరి – దానం బ్రమాణపత్రము రచితం బాయె – నం దెల్లవారు వ్రాలుగావించిరి – నాఁటి రాజకీయసంస్థలు సత్యాగ్రహముంబోని నూతనాస్త్రముం బూనిక దుర్లభంబని భావించి సత్యాగ్రహసభ నా నొకసమితి నెలకొల్పితి – బొంబాయివా రిం దెక్కు డగుటంజేసి దీనికార్యస్థానంబు నన్నగరంబునంద యునిచితిఁ – బలువు రీప్రతినపైఁ సంతకము చేయందొడఁగిరి – దీనిమనుగడ న్వాను వెంటన వెల్వరించుపత్రిక లవతరింపసాగె – నెల్ల తావులం దీసభ లావిర్భవించె – నిది ఖేడాసమరమున్ గుర్తునకుఁ దెచ్చె – నీసమితి కేన పెద్దనైతి – నిందలిసభ్యులు కొందఱందు గుజ్జరిబాస వల దనిరె – సత్యాహింసలు తగ వనిరి – కాని పెక్కండ్రు నా తెలుఁగు నీకొనుటంజేసి యే నాసమ్మెఁ బని కొగ్గినవాఁడ నైతి. ౧౪

* * *

౩౦ అద్భుతమగు హరతాళము

క. శౌలటుసమితి నివేదన, మాలరి యని యేము చాటునవసరమున భూ
పాలకవర్గమువా రిది, మేలిది యని పొగడ నుద్యమించిరి దెసలన్. ౧

గీ. దీని నొకశాసనంబుగాఁ దీర్చి వెల్ల, డించి రధికారు లిందలి మంచిచెడ్డ
లరయునాఁ డేను హాస్తిన కరిగి కేంద్ర, శాసనసమజ్యఁ గూర్చుంటి సాక్షివోలె.

క. ఈచట్టము నింద్యం బని, నీచం బని శాస్త్రి నిలిచి నిప్పులుచెరిగెన్
లోచనములు వాల్పక ధీ, వాచస్పతి యతనిధాటి వైస్రాయి కనెన్. ౩

గీ. అతని కావట్ట స్టోఁకి ధర్మానురక్తి, వాడము నను కొంటిఁ గాని నాపడినతలఁపు
రిత్తమైచనెఁ దెలిసి నిద్రించునాతఁ, డెన్నిబాకాలు మొరయుఁగా కెలలేచు. ౪

క. అంతయు ముగించి పైకీ, తంతున్ జరిపిరి దొరల్; కథాక్రమ మది యీ
వంతునఁ దిరపడఁగా ది, గ్దంతులు డీకొనియు నేమిగాంచు ఫలంబున్. ౫

క. ఏనును ఢిల్లీశుని గని, నానాధర్మములు వినిచినాఁడను మీ రీ
యానం బటిపిన నితఁ డెదు, శా నంటిని గాని సర్వ మాఱడివోయెన్. ౬

వ. ననువంటిద్రాబ యూఁదినబూర యీ రాజప్రతినిధిచెవి కెక్కునా? – కానిమ్ము చూతమని నాపని కే నొగ్గితి – నానాఁడు మేనిచేవయెల్లం దొలఁగి యేను బైనంబు సేయు, రచ్చలో నిలువ, నెలుఁగెత్తి పలుక న్వాలంతిని గాక మూలుగుచుంటి –

నిట్లయ్యుఁ జెన్నపురివారిపిలుపు పాటింపం డెగితి - నాఫ్రికాపొత్తునంజేసి తెలుఁగువారిపై నఱవలపై నాకు వలసినంతచనవు కలదు - కాన దక్షిణాపథము నా సొంతయిల్లుగాఁ దోఁచు - నీనమ్మిక కింతదనుక నవగ్రహమ్ము పుట్టదయ్యె - హిందూపత్రికాసంపాదకులు కస్తూరిరంగయ్యంగారు నేఁడు న న్నాకారణచేసిరి - వీరివెనుక రాజగోపాలాచార్యులుం గలరని యవ్వల నెఱింగితి - నాచార్యుల యెఱుకువ నా కపుడ మొదలయ్యె - నయ్యంగారుమున్నగు చెలికాండ్రకోర్కెపై వారు సేలముం బాసి పాడిపని సాగింప మద్రపురికి నేతెంచిరి - ప్రజాసేవ కది యనుకూలరంగ మని తలంచిరి - వారియిల్లు నావిడిదల యయ్యె - నది య్యాయంగారిది - కాన నేను గస్తూరివారి విందనని య తలంచితిఁ - గాని దేశాయి నాప్రమాదముఁ దప్పించె - నాచార్యు లావేళ నాకు దవ్వుల నుండువారు-కాని మహాదేవుఁడమ్మేటిం బరికించితత్పరిచితిం బడయఁదగు నని నా కెఱిఁగించె -నంత2

గీ. రాజగోపాలు నెఱుఁగ నారడముపడితి, మదినిగల శంక లీమేటియెదుట నిడితి
నెల్లి శాలటుచట్టంబు వెల్లివిరియ, శాంతిమై దాని నెట్లోర్వఁజను నటంటి. ౮

ఆ. త్రోసివేయఁదగిన శాసనముల్ మఱి, యేవి యేవియంటి నింతలోన
ర్ఘంగబుధునిపిల్పునం గూడి రాసీమఁ, బేరుగన్న పెద్దపెద్దలెల్ల. ౯

గీ. ఉత్తమజ్ఞానరాశి నా నొప్పు విజయ, రాఘవాచార్యు లాసభారంగమునకు
వన్నెదెచ్చిరి వాదంబు లెన్నియేని, నడిచినవి శేముషీపిశునమ్ము లందు. ౧౦

గీ. అన్న ! సత్యాగ్రహాసక్తవై ననీవు, దాని చిన పెద్ద నేమముల్ త్రిచ్చి త్రిచ్చి
విపులతరలక్షణంబు గావింపు మనుచు, రాఘవులు కోరి రత్యాదరమున నన్ను. ౧౧

వ. అది నాచదురునకు మించినపని కదా! యని యేను విన్నవించితి - మాచర్చ లిట్లుండ శాలటుశాసనము సమగ్రమై యేలుబడివారిపత్రికం బ్రకటిత మాయె - దానిం గన్నరేయి నుల్లంబు కలఁగి నా కరనిద్దురయ లభించె - నం దీచట్టముం బ్రతిఘటింప హరతాళముం బ్రకాశపఱుపవలయు నన్నకల వచ్చె - వఱువాత నీగాథ రాజగోపాలాచార్యుల కెఱిఁగించితి - వెండియు సత్యాగ్రహంబు నా ధర్మసమరంబు - దాని నాత్మనైర్మల్యంబుతో మొదలిడుట లగ్గు - హృదయశుద్ధికిం బస్తు మ్మూలంబు - కాన భారతీయు లందఱుం దమనిత్యకృత్యంబులఁ గట్టిపెట్టి యొకనాఁడుపవస్త్రముం బూనవలయు - నిందు దేశంబెల్ల నెట్లున్నను బొంబాయి మద్రాసు బిహారు సింధురాష్ట్రములు కామక పాల్గొను నని విశ్వసింతు - నన వుడు నాచార్యు లగు ననిరి - వారిమిత్రులుసైతము దీని కంగీకరించిరి - పదంపడి వేయితొమ్మనూఱ్ఱట పందొమ్మిదవయేఁటియేప్రియలునాఱవదినంబు హరతాళంబు నకు సేమించి లోకమ్మునకుం జాటితి - మొదట నిది మార్చిముప్పదియవనాఁటి కని ప్రకటించి కారణాంతరముల నవ్వలికి మార్చితి. ౧౨

క, ఓహో ! భారతమునయం, దీ హారతాళంబు వెలసె నింటింట నెవం
డూహింపఁగల్గె ము న్నీ, మోహర మిటు దర్శనీయముగ నగు నంచున్. ౧౩

***

౩౧ ఆ రో జు లు - ౧

క. ఇంచుక దక్షిణభారత, సంచారము నిర్వహించి శంకరలా ల
ర్ధించుట హారతాళము సా, గించుటకుం జనితి బెండగిలి బొంబయికిన్. ౧

వ. గడువుం దిద్దుట తెలియమిం జేసి మార్చిముప్పదియవనాఁటన కార్యక్రమం బిది ఢిల్లీనగరంబునఁ బూర్తియయ్యె - నచ్చట నజమల్‌ఖాను శ్రీద్ధానందులపల్కుం బ్రజలు పూలదండంబోలెఁ దల్దాల్తురు - వా రెన్నఁడే నిట్టిహారతాళ మొన రింపరైరి - మఱియు నప్పురమున ౨

క. హిందువులు ముసల్మానులు, నందఱు నేకీభవించి రప్పుడు శ్రీద్ధా
నందుని జుమామసీదున, కుం దోడ్కొని చని తురుష్కకోవిదవర్యుల్. ౩

క. ఆసంయమిచేత నుప, న్యాసము చేయించి రచటియధికారుల కీ
యాసత్తిని గనినంతన, యీ సేర్పడె ధర్మదృష్టియెల్ల నశించెన్. ౪

క. మెరవడివోయెడి ప్రజపైఁ, గఱకరులై పెక్కుగుండ్లు కాల్చిరి పౌరుల్
మరణించిరి కొందఱు కొం, దఱమేనులు గాయపడియె దయనీయముగన్. ౫

క. రావలయు న్వెనువెంటన, యీ వని యతిరాజు తంతినిచ్చెను దనకున్
మీవాఁడను బొంబయిపని, కావల నే తెంతు పైఁపుఁడని యే నంటిన్. ౬

వ. ఢిల్లీయల్లరివంటిద లాహోరునం దమృతసరమునం బొటమరించెఁ - గిచలూ సత్యపాలురు వేవేగ నమృతసరముం జేరుఁడని నాకు వార్త నంపిరి - హస్తినకు వచ్చినతఱి మిమ్ము దర్శింతునని వారి కెఱుకచేసితి - నింతలో సుముహూర్తంబు దాసె - నసంఖ్యాకులు బొంబాయిపౌరు లాదినంబున ౭

క. కేపాడి నిద్రమేల్కొని, చౌపాటికిఁ జేరి సింధుజలమున స్నాన
వ్యాపారము దీరిచి దీ, క్షావరశులై సవిత్రిగానోద్యతులై. ౮

గీ. వచ్చుచుండిరి ఠాకురుద్వారమునకు, నెల్లతలున్ ముస్లిములు నందుఁ గలరు పెక్కు
రొకమసీదున భాషింపుఁడో యటంచు, నను ముసల్మాను లర్థించినారు నాఁడు. ౯

వ. ఏనును సరోజినీదేవియు నందు మాటాడినవెన్క విఠలదాసజేరాజణి యీప్రజ యెల్ల మాతృసేవపట్ల హిందూమహమ్మదీయమైత్రిపట్ల బాస గావించునట్లు సేయుండని నన్నుఁ గోరె-నంత కక్కుఱితిపడి శపథంబు సేయింప నా కిచ్చ పొడమదయ్యెఁ - గావుటం జేసి ౧౦

గీ. లోఁతు తెలియంగక ప్రతినలు, సేఁతంగొఱయేమి భాసచేసినవారా
రీతిం దప్పక నిలవలె, నేటిఱమి యైన మిత్తి యెత్తి కసరినన్. ౧౧

క. ఈచందపు శపథమ్మును, సైఁచుట కీకొన్నవారు చాపాటికడన్
వేచి సిలందగు నెల్లి స, మీచీనాచారతర్కమేదురబుద్ధుల్. ౧౨

వ. అని జేరాజణికిం దెలిపితి – నంత నగరంబున హరతాళ మద్వితీయంబుగా సాగె – నపు డుప్పుచట్టమును ధిక్కరించితిమి – నిషిద్ధగ్రంథముల ముద్రించి విక్రయించితిమి – పీన హిందూస్వరాజ్యము సర్వోదయము నాఁ దనరు నారచనములుం గలవు – స్వయంసేవకు లీకృతుల నమ్మందొడఁగిరి – యేనును సరోజినీదేవియును సైత మిప్పనికిం బూనితిమి – వెనువెంటన ముద్రితగ్రంథములెల్ల విలువంబడె – వెల నాల్గణా లైనను బదులు పాతిక లిచ్చి ప్రజ లాపుస్తకముఁలం గొనిరి – వచ్చిన ధన మీసమరంబునకు వెచ్చింపడె – మఱియు ౧౩

క. ఈహొత్తములం గొనువా, రోపవలెన్ శేపు బంది నుంటకు నంటిన్
లోపించెను బ్రజ కాభయ, మూఁపది పోనాడె నెట్టియొప్పమి నైనన్. ౧౪

క. మఱునాఁడు ప్రతిజ్ఞలకై, జరిగినసభ కలఁటి యలఁతి జన మేతెంచెన్
బరమార్థ మెఱిఁగె విత్తలు, వెఱఁగున్ వెన్నుఁబాటు సంభవింపదు నాకున్. ౧౫

వ. ఉద్రేకజనకంబు లగు కేకలదెసం గాక లోకమున కుపకరించుపనులపట్లఁ బ్రజ కుత్సాహమ్ము లేమి యే నెన్నఁడో కంటిఁ – గాన నాఁ డరుదెంచిన పదిపండ్రెండుమందిని గని యుస్సురనక ప్రతినతెఱఁగెల్ల వారికి వివరించితి – నాఁటి నిశయంద నేను బాంచాలమునకు బెండగిల్లితి – నెనిమిదవ తేదినాఁడు మధురా ఘట్టంబున ధూమశకటంబు నిల్చె – నపుడు గిద్వాని నన్నుం గదిసి ౧౬

క. అన్నా! యేల్బడివారలు, నిన్నిపుడే నిల్వరింత నిశ్చిత మామెన్
నన్ను నియమింపుఁ డక్కఱ, యున్నపనుల్ నిర్వహింతు నోడక యనియెన్. ౧౭

క. ఆతనికిన్ దఱివచ్చిన, చూతము లెమ్మంటి ముందుచోటికి శకటం
బేతేరఁ దొడఁగె నస్మ, చ్చేతము భావ్యర్థచింతచే నలయంగన్. ౧౮

క. 'పలవల్'ఘట్టము దవుద, వ్వుల నుండఁగ నన్నుఁగదిసెఁ బోలిసువాఁడే
నలవడియె ముహూర్తం బని, యెలమిం గనుచుండ నాతఁ డిడె నుత్తరువున్. ౧౯

క. "పాంచాలమునకు మీ రే, తెంచుట కే మిపుడు సమ్మతింప మశాంతిం
బెంచును భవత్ప్రవేశము, సంచలితస్వాంత మచటిజన మీవేళన్." ౨౦

వ. ఇట్టియానతి నతం డొసఁగి డిగ్గుండన నమృతసరమ్మునకు కే నల్లరిం బెంప నేగువాఁడం గాను – దాని నడఁగింపన చనుచుంటి – నచటిప్రజానాయకు లిప్పనికి న న్నాకారణచేసిరి – కాన మీపనుపుం బాటింపఁజాల – నని యే నాడితి –

నింతలో నంచె సమీపించె - నావెంట వచ్చుమహాదేవునకు వలయుమాటలు చెప్పితి - నోరిమిం బాయఁజన దంటి - నంత నధికారులు పలవల్ ఘట్టమున నన్ను డింపి బొంబాయి దెసకు మరలించిరి - నావెంట నొకయుద్యోగి వచ్చి మెరీన్ లైన్సు కడ నన్ను విడిచి యిఁక మీకు విముక్తి యనియె - నేను రేవాశంకరునిల్లు చేరితి - నచ్చెలికాఁడు ౨౧

క. అన్నా! నినుఁ బట్టినకథ, విన్నంతన పీటఁ గినుక విజ్జెఁ బ్రజాసం
పన్నమగు పాయధుని కడఁ, బెన్నల్లరి సాగునన్న భీతి జనించున్. ౨౨

క. ఆగందరగోళము గని, సాగిరి పోలీసు లటకు సన్నలు పెద్దల్;
సాగరమువోలె నగరం, బీగడియన్ గుబ్బిటిల్లు నే మేర్పడునో. ౨౩

క. అని పల్కు-వేళ సోదరి, యనసూయాదేవి వచ్చె నత్తర మడరన్
జనతను నిల్పుట దుశ్శక, మనంత మది మిమ్ముఁ జూడ కాపో దనియెన్. ౨౪

క. తడ వోర్వరాని దని యే, వెడలితి నన్నన్నయంత వెల్లువపోలెన్
గడుకొనెఁ బౌరులసంతస, మడరె జయధ్వనులు భువియు నభ్రము నదురన్.

క. రాహుత్తు లపుడు రాఁ బ్రజ, లోహట మిసుమంత లేక యుగ్రోశిలాసం
దోహమున వారి ముంచిరి, నాహృదయక్షోణి త్రెస్సి నలినలి కాఁగన్. ౨౬

క. నిగ్రహము వలయుఁ జన దీ, యాగ్రహ మని చేతులెత్తి యర్థించితి నా
వాగ్రవ మాలింపక సా, ధాగ్రంబుల నిలిచి విసరి రక్కట! అప్పల్. ౨౭

వ. అంత మెఱవణిం గోటతట్టునకుఁ జననీక యాశ్వికులు దాని కభిముఖులై లెస్స పెనఁగంజాగిరి - వా రెంత యోలాకుపడిన నేమి? - కొలంది సెప్పరాని యాప్రజాప్రవాహము వారిం బాయవఱచి పురోగమింపం దొడఁగె - నపుడు నా కైనను మాటదక్కదని తోఁచెఁ - బదంపడి రక్షకభటాధికారి ౨౮

క. జనతతి నటునిటు రొప్పఁగఁ, దనవారలఁ బనిచె నంత దయవిడి సాదుల్
మనుజులపైఁ దమయెక్కిన, పెనుమావులఁబఱపి వెఱపుపెంచిరి మూఁకన్. ౨౯

క. శరవేగమున హయమాయులు, పరువెత్తుచునుండెఁ బ్రజకు బరిసెలు తగులన్
దురగఖురహతులపాలై, పరివిగ్నంబై జనమ్ము పఱచెన్ విరిసెన్. ౩౦

క. ఎటు వోవుటకుం దోఁపమిఁ, గటకటఁబడెఁ బ్రజయు నాశ్వికప్రకరంబున్
ద్రుటిలో బీభత్సరసా, ర్భటి రేఁగి పురంబు కదనరంగము నెనసెన్. ౩౧

వ. రాహుత్తులదుండగ మిట్లు పొంపిరివోవుటం గని యేను సైరింపనోడి దాని తెఱఁగెల్ల వెల్లడింప నున్నతాధికారికార్యాలయంబున కరిగితి. ౩౨

* * *

౩౨ ఆరోజులు - ౨

క. దొరమాలె నెక్కడోడఁగితిఁ, గరవాలము లూని సైనికగ్రామణు లా
తెరువునఁ బదపదమునఁ దోఁ, చిరి సమరచ్ఛాయ లెగసి చిందులుత్రొక్కన్. ౧

క. అధికారిం గని జరిగిన, కథనెల్ల వెలార్చి పాడిగా దిది యంటిన్
బ్రభమప్రయత్న మంతయు, వృథయై యిటు లయ్యెనని 'గ్రిఫి' త్రతఁ డనియెన్. ౨

క. ప్రజలు వెనుదీయలే దని, గిజగిజగొనఁ బెన్పటాణిగిట్టలతోడన్
గజిబిజిగాఁ ద్రొక్కింతురె, నిజ మారసి కనుఁ డటంచు నే నపుడంటిన్. ౩

వ. అంత నమ్మేటి 'మీ రిట్లు నాఁ జెల్లదు - మీయుపదేశంబునం జేసి ప్రజ లెట్టిచేత లకుం బాల్పడుదు రది మాక లెస్స తెలియు - నేము తోలుతో ల్తన మేల్కొన మేని కదుంగడుఁ జేటు వాటిల్లు-నవ్వ డీమూఁక మీ కేనిలోఁగదని యెఱుంగుఁడు - శాసనోల్లంఘనము ప్రజలకుం జేలికపని - కాని శాంతిం బాదుకొల్పుట వీరి కక్కజంబగు చేఁత - మీసిద్ధాంతము లుత్తమంబుల - యైనను లోకంబు వానిమర్మ మెఱుంగఁజాలదు - దాని ప్రకృతియ దానికి నొజ్జ యనవుడు ౪

క. మీకఱదల నే నిచ్చట, నీకొన; లోకమ్ము కోర దెన్నఁడు శమమున్
బ్రాకటశాంతియ నిరతము, నాకాంక్షయొనర్చు నోర్చు నదియని యంటిన్. ౫

ఆ. ప్రజలు మీపథమ్ము పాటింపరేని మీ, రపు డొనర్చు టేమి యనె గ్రిఫిత్తు
నాకు నెన్నఁ డట్టినమ్మిక వొడము నా, నాఁడ దురము నిల్పువాఁడ నంటి. ౬

వ. అంత నయ్యధికారిపుంగవుఁడు ౭

క. మీ రించుక శాంతించిన, భారతదేశంబు నేఁడు పాటించు దురా
చారమ్ములెల్లఁ దెలియును, మూరెన్ బెనువెట్టి యిపుడు మూల న్మాలన్. ౮

ఆ. అమృతసరమునం దహమ్మదాబాదున, నాఁగరానిసివము రేఁగె నేఁడు
తక్కుతావులందు నిక్కనయాగడ, మెంత కలదొ తెలియ నింతదనుక. ౯

క. తెగనతికి రచ్చ టచ్చట, నెగ పేర్వడఁదంతిఁతీఁగ లీపొద్దు పజల్
తగవునఁ బరికింపఁగ నీ, యగడెల్లను యుష్మదీయ మని వాక్రుచ్చెన్. ౧౦

వ. పదంపడి యేను "నాప్రతిభూత్వ మున్నయెడం బొడమినపాపంబు నాతలం దాల్పక మాన - నహమ్మదాబాదునం దవగడము రేఁగెనాఁ దనకు విస్మయ విషాదంబు లుదయించెడి - నమ్మృతసరమ్మున కేను బూఁటవడం జాలఁ - బాంచాల మున కే నెప్పుడుం జన్నవాఁడఁగాను - దత్రత్యులందఱు నా కపరిచితులు-కాని

క. ఏలుబడివారు న న్నా, నేలకుఁ జననిచ్చిరేని నిరుపమశాంతిం
బాలించియుందు నచ్చటఁ, బోలనిపని కొగ్గి దొరలు పొరపడి రిందున్. ౧౨

క. ననుఁ బట్టుకొన్నవార్తను, వినినంతన జనత రోషవివశం బయ్యెన్
జనునిది చనదిది యను తె, ల్విని గోల్పడి మెచ్చరానివిధమున రెచ్చెన్" ౧౩

క. అని పల్కుఁడు నతఁ డేవో, వినిపించె నడంగదాయె వేఱిమి మాకున్
జనులను గూర్చెదఁదీర్చెద, ననుమతి నిండని గ్రీషిత్తు నాడితిఁ జనితిన్. ౧౪

క. గొప్పసభ జరిగె వీటన్, జెప్పితిఁ బౌరులకు సత్యశీలురబాటన్
దప్పక శాంతి వహించుట, కొప్పనిచో నన్ను వదలు టొప్పని యంటిన్. ౧౫

ఆ. అపుడ వార్తవచ్చె ననసూయ కహమదా, బాదు తప్పుదారి పట్టె ననియు
నచటికూలివార లాగ్రహావిష్టులై, చెట్టచెట్టపనులు చేసి రనియు. ౧౬

క. అనసూయ చెఱంబడె నని, యనృతకథం జాటె నొక్కఁ డానగరమునన్
జను లీక రేఁగిరి మూఁగిరి, తునిమిరి రాహుత్తు నొకని దుష్టాశయులై. ౧౭

వ. ఈదుర్వార్త విన్నంతన నే నహమ్మదాబాదునకుఁ బయవెత్తితి - విశేషము
లెఱింగితి-నడియాదునం బొగబండినిబడగొట్టుజతనమ్ములు నడిచె-వీరమగామునం
దొకప్రభుత్వాధికారి చంపంబడె - సైనికశాసన మానగరంబునం బ్రయుక్త
మాయెఁ - బ్రజలు వెఱచఱచిరి - పాపఫలంబు వడ్డితోఁ బడసిరి - నే నధికారి
చెంతకుం జనితి - నతఁడు ౧౮

క. కస్సుమని బుస్సుమని య, ర్చిస్సులు వెలలింపఁ బ్రజలచేసిన యవమా
గస్సునకు నుస్సురని యే, లెస్స నిదానించి మూదలించితిఁ దగవున్. ౧౯

క. దారుణసైనికశాసన, మోరువ రీప్రజలు దాని నుడిఁగింపుఁడు నా
నేరిమి నియ్యెడ శాంతిం, గూరుతు నొకసభకు నియ్యకొనుఁడా యంటిన్. ౨౦

ఆ. అతఁడు సమ్మతింప నాశ్రమక్షోణికిఁ, బిలిచినాఁడఁ బిన్నపెద్దవాండ్ర
జంకులేక వారు సల్పినదోసమ్ము, లేర్పరించినాఁడ నోర్పుతోడ. ౨౧

క. ఇన్నాళ్ళఁగోలె నెవ్వరి, యున్నతి నర్థించి యలఁత నొందితి వారల్
మన్నింపరాని దారికిఁ, జన్నారని సిగ్గుపడితి జాలింబడితిన్. ౨౨

క. నావా రొనర్చుతప్పున, నావంతు గలదటన్న నాయము గంటిన్
భావించితి నీమైలకు, మోవందగు నిల్లివేఁగు మూనా ళ్ళనుచున్. ౨౩

వ. ఒక్కనాఁడు మీరుం బస్తు పాటింపుఁడని ప్రజలం గోరితిఁ - జేసినపాపంబు నంగీక
రింపుఁడని కర్తలకుం దెలిపితి - నేరముల మన్నింపుఁడని రాచఱికమువారి వేఁడితి-
నమ్మఱుసటినాఁడ సైనికశాసన ముపసంహృతం బాయె - నంతఁ బురప్రముఖులు
కొందఱు చేతెంచి సత్యాగ్రహము నాఁపందగునని నన్నర్థింప లోకమున కహింస
వసపోవనంతవట్టు దానిం బ్రయోగింపమి లగ్గని యేన తెల్పుకొంటి నంటి - నా
పల్కు వారి నలరించెఁ - గాని కొందఱు నెయ్యుర కసంతృప్తి గూర్చె - సత్యా

గ్రహమున కహింస యనివార్యంబగు నియమ మైననాఁడు సమష్టిశాసనోల్లం ఘనము కొనసాగనేరదని వీరివాదంబు – కాని నాయనుచరులై నన్ను నమ్మించినవారుసైత మహింస నాదరింపలేని సత్యాగ్రహము నెట్లు సాగింతు ? ౨౪

* * *

33 కొండంతతప్పు

గీ. అహమదాబాదుపని పూర్తియైనయంతఁ, జేరుకొన్నాఁడ నడియాదుసీమ కపుడు
కంటి నందందు సాగినకలకుఁజేఁత, లుల్ల ముడికిల్లి పఱియలై తల్లడిల్ల. ౧

ఆ. అదను రాకముంద మది పరిపక్వంబు, కాకముంద పసుత పోకముంద
యేలువారిముదల నెదరింపుమని ప్రజ, కానవెట్టి దోషి నైతి నేను. ౨

వ. నాయొనర్చిన యీదోషము సామాన్యము కాదనియు నది కొండంతతప్పనియు నిచట లెస్స యెఱింగితి – సభలో దాని నంగీకరించితి – నిట్లియ్యెడలు పరిహాస పాత్రంబ – కాని నాకిది పశ్చాత్తాపము గల్గింపదయ్యె – నేనికంబోని పెఱలదోస మావంతయనియు నావంబోని మననేరము కొండంత యనియుం గనఁగల్గిననాఁడ మనము సత్యాగ్రహులమని చెప్పనోర్తు – హిమాద్రివంటి యీనాప్రమాద మెట్టిదో పరికింతము – చట్టముఁద్రోయవలచువాఁడు దానిదెస హృదయపూర్వక వినయముఁ జూపఁదగు – నంగీకృతిం బ్రకటింపవలయుఁ – బ్రాయికంబుగా మనము దండమునకు వెఱచి శాసనము ననుసరింతు – మది ప్రధానముగా నీతికిం జెందియుండ – దెట్లందురేని చట్టముండుఁ గాక లేకపోవుఁగాక సజ్జనుం డెవఁడును బ్రముచ్చిమి కొగ్గఁడు – త్రోక్కుడుబండి కంధకారమ్మున దివ్వె వలయునన్న యాన నాతండ మీఱు – మీఱితిఁగదా యని వగవంబోఁడు – నీ వీనేమముం బాటింపుమని యెవఁడేని హితమ్ము వల్క నెంతసాధువేని తన్నియమంబు పాలింపఁడు – కాని యిట్టికట్టడ యేర్పడ్డ నాఁడు దాని నుల్లంఘించిన శిక్షయొదవు నన్న వెఱ తోఁచునేని వాఁ డాశిక్షం బడయమికి మాత్రమ బండికి దివియం గట్టు – నీ నియమానుసరణంబునకు శిక్షాభయంబ హేతువు – కాని సత్యాగ్రహి సమాజమునకుం జెందిన యెల్ల యాజ్ఞల నెఱింగి వాని మన్నించుట తన కృత్యంబని యిచ్ఛమై నాదరించు – నిట్టివానికిఁ జట్టములబాగోగు లెఱుంగునేర్పు చేకూరు – నప్పుడ వానికిం గొన్ని యెడల శాసనం బతిక్రమింపఁ దగుపెత్తనము లభించు – నీ చనవు రాకముంద చట్టముం దాఁటుఁడని యే నంటి – నిదియ నాయొనర్చినతప్పు – నాదృష్టి కిది కొండంతగాఁ గన్పట్టె – ఖేడామండలమునం దడుగువోపినంతన ముందటి సత్యాగ్రహమునం గలదోసమెల్ల నాబుద్ధికిం దగిలె – నింత తెల్లమైయున్న యాలోపంబు నెట్లువిస్మరించితినో యని వగచితిఁ – గావున 3

క. ఎల్లరుఁ దలపడి చట్టము, నుల్లంఘించుటకు మున్ను యుక్తపథంబుల్
తెల్లమొనరించి వారల, యుల్లము సవరించువర్గ మొక్కటివలయున్. ౪
క. సత్యాగ్రహలక్షణముల, నత్యర్థ మెఱింగి యుండనగు నిది;ప్రజకున్
నిత్యము సుగతిం జూపుచు, నుత్యంబగు సేవఁజేయ నూల్కొనవలయున్. ౫
గీ. అని తలంచుచు బొంబాయి కపుడుచేరి, చెచ్చెరం గూర్చితిని స్వయంసేవకులను
శాంతిరణధర్మమర్మముల్ చక్క నుడువ, బయలుపఱిచితిఁ జినచిన్నపత్రికలను. ౬
క. ఏ నిట్లు పెనఁగులాడితిఁ, గాని జనాసక్తి యిందుఁ గనఁబడదాయెన్
సైనికసంఖ్యయు నదిరా !, నానాఁటికిఁ దీసికట్టు నా సన్నగిలెన్. ౭

***

౩౮ నవజీవన్ - యంగిండియా

క. నాశక్తి ధారవోయుచు, దేశంబున శాంతినింపఁ దివిరెడితఱి వ
క్రాశయులై ప్రజలన్ ధర, ణీశులు దండింపసాగి రెగ పేర్వడఁగన్. ౧
క. బెడిదం బిది పంజాబునఁ, గుడియెడమల రేఁగె నాయకులు చెఱసాలం
బడి రిఁక సైనికశాసన, మడరెన్ సరిక్రొత్తకోర్టు లట నట వెలసెన్. ౨
క. నిందితునిపల్కుతో నతఁ, డందించినసాక్షి యిచ్చునాధారముతో
నిందుఁ బనిలేదు తీర్పరి, నంది యనన్ నంది పంది నాఁ బంది యగున్. ౩
క. పొట్టలతోఁ బ్రాఁకించిరి, కట్టిఁడిసైనికులు వెలఁదుకల మగవాండ్రన్
గట్టా! యమృతసరమ్మునఁ, బుట్టినదుండగము సెప్పఁబో లజ్జయగున్. ౪
క. జలియన్‌వాలాబాగునఁ, జెలరేఁగినహింస నెల్లసీమలు తెగడెన్
దులగా దది యాహింసకుఁ, దలఁగెఁ బ్రజామాన మిచట దైత్యులకతనన్. ౫
ఆ. మిన్ను మీఁదఁబడిన వెన్నిక రమ్మి పాం, చాలమునకు జంపు సలుపఁబోకు
మన్నవార్త నాకు నంద ఢిల్లీపతి, యాజ్ఞ కపుడ కమ్మి నంపినాఁడ. ౬
ఆ. రిత్తవోయె నాదునుత్తర మావెన్కఁ, దంతినిడితి నదియు నంతెయయ్యె
నేమిసేఁత వలయు నిపుడని యెంతేని, గలఁగినాఁడ బెద్ద నలఁగినాఁడ. ౭
వ. సరకారువారియానతి లేక పాంచాలమం దడుగుమోపుటంజేసి శాసనోల్లంఘన మొనర్చితినన్న తృప్తితక్క నా కొండుమే లెద్దియుం గూరదు - నేఁ డానేల శాంతికి మొగమువాచియుండె - నచటియధికారులకు నాదిక్షా నడవడి యొజ్జబంతి యయ్యె - నిట్టితఱి నేను జట్టముం ద్రోయుట చిచ్చులో నేయివోఁతయగుఁ - గాన ౮
క. చెలు లెంతవేఁడుకొన్నను, బాల మది చేరంగలేక పొక్కనఁ బడితిన్
బలుమఱు వినఁబడు నచ్చటి, కోల నారసి పండ్లు కొఱికికొనుచుంటి నిటన్. ౯
౧౦
వ. అయ్యవసరంబున

ఆ. ఏనిపల్కు చేవ క్రానికల్ పత్రిక, కద్వితీయగరిమ మావహిల్లె
నిచ్చసేయు నోర్మి నిచ్చలు నేఁడు స, త్యాగ్రహంబు నిల్పుమనియె నెతఁడు, ౧౧

క. ఆశాంతికాముకుని సుజ, నాశాస్యచరిత్రు మిత్రు హార్నిమనున్ బృ
ధ్వీశులు నిర్బంధించిరి, దేశాంతరమునకుఁ బంపఁ దెగఁబడి రకటా! ౧౨

క. ఆపిమ్మట నాతనిపని, నాపైఁ బడెఁ గాని యేను నలఁగకమున్నే
భూపాలురు తత్పత్రిక, నాఁపిరి చీఁకట్లుపెరిఁగె నవ్విషయమునన్. ౧౩

వ. క్రానికల్ సంచాలకు లగు నుమర్ సోబానీ శంకరలాల్ బాంకరులపాల యంగిండియా యను వారపత్రిక యొండు కలదు – దానిం బరిగ్రహించి ప్రకటింప నన్నా నెయ్యురర్థించిరి – క్రానికలు లేమింజేసి వారమునం దది రెండువిడుతలు వెడలించుట లెస్సయనిరి – వారితలఁపు నాకుం దృప్తి నొదవించె – యంగిండియాను జేకొంటి – నది యింగ్లీషునం బొడము – దానిం జదువుట గ్రామీణులకు నందనిపని – నాకుం బ్రధానమైన కార్యరంగము ఘూర్జరభూమి – యచటివారికి నాబాట లెక్కఁగింప గుజ్జరి వలయు – నిందులా లపు డీబాస నొకమాసపత్రికం బ్రచురించు – నదియ నవజీవను – నా కదియు నర్పితంబాయె – దానిని వారపత్రికం జేసితి – నింతలోఁ గ్రానిక లాఁకం బాసె – యంగిండియా మరల వారపత్రిక యయ్యె – నవజీవ నహమ్మదాబాదునుండి వెడలునది – కాన యంగిడియానుసైత మచటికి మార్చితి – నచ్చుఁగూటమును గొంటి – నిది లేనిపత్రికపెక్కుచిక్కు లం బడు – నీరెంటి నాదరువుగాఁ గొని యోపినంతవట్టు సత్యాగ్రహధర్మముం బ్రజకు నేర్పసాగితి.

క. పత్రిక లివి లోకాదర, పాత్రములై నడువ శాంతిఁ బడసితి; వీనన్
మాత్రలకుఁ బాత్రలకు నే, మాత్రయుఁ జో టీక మేలిమార్గము గొంటిన్. ౧౪

* * *

౩౪ పంజాబులో

క. నారాష్ట్రమునం దియ్యెడ, మూఁరినచెట్టలకు నీవ మూలం బని నన్
దూఱెను మైకేలొడయరు, నో రుండిన నెట్టులైన నుడువఁగవచ్చున్. ౧

క. సైనికశాసనమునఁ బడి, నానాహైన్యములు మోసి నలిఁగెడి మా యీ
దీనత నీ విడుభిక్షమ, నా నోడర యమృతసరమునం గల యువలున్. ౨

గీ. ఈవు సత్యాగ్రహము నాఁగవేని డయ్యు,రట్లు మముఁ గాల్చువాఁడుకాఁ డనిరి కొంద
ఱిపుడు పంజాబునకు వత్తువేని నిన్ను, హతుని గావింతు రని కొంద ఱనిరి కినుక. ౩

క. ఏసరణి నెవరు పదరిన, నాసల్పినచేత వోలినది యని ప్రజ్ఞా
భాసురులకు సందియ మొక, వీసము రానీని యోగ్యవిధి యని తోఁచెన్. ౪

గీ. ఎపుడు పాంచాలమున దూఁకు టెపుడటంచు, నురవణించుచు నుబ్బుఁగుచుంటి నేను
ఇపుడుగా దిప్పుగా దని యేలువారు, పలుమఱు న్నిల్వరించి రిప్పట్ల నన్ను. ౫

వ. ఇట్లుండ సైనికశాసనమునాఁ డధికృతులు పాంచాలము నేలిన తెఱఁగుం బరికింప రాచఱికమువా రుపసంఘ మొండు దేర్పఱిచిరి- హంటరు దీనికిం బెద్ద - కాన నిది హంటరువర్గము నా వెలయు - దీనిపని మొదలైనంతన దీనబంధు వాండ్రూసు పంజాబున కరిగె - నగ్గలువ పంపినకమ్మం జూడ నాయుల్లంబు వ్రయ్యలాయెఁ - బత్రికలం గన్నకంటె బెడిదంబులగుచేఁత లానేలన్ జాగిన ట్రిలేఖ సూచించెఁ - బాంచాలమునకు వెన్వెంటన రమ్మని యాండ్రూసు నన్నెచరించె - మదనమోహనుండు నట్లు వ్రాసెఁ - గాన ౬

క. అఁకం జెప్పక పైనము, నీకొండని వైసరాయి కిచ్చితిఁ దంతిన్
జేసుఱ నాతనియనుమతి, నాకుం బ్రాణములు వచ్చినవిధం బాయెన్. ౭

క. లాహోరుపురికిఁ జేరితి, నోహో! జనతాసముద్రి ముబికి జయ జయ
వ్యాహారమ్మున మధుర, స్నేహమ్మున నన్నుఁ బెద్దచేసెన్ మ్రోసెన్. ౮

క. రామభుజదత్తచౌదరి, ధామము నావిడిది యయ్యెఁ దత్కాంత గుణ
శ్రీమూర్తి సరళ యించుక, యేమఱక యొసంగె నాకు నించినవిందున్. ౯

క. ఏనిల్చుతావు నేఁటివి, ధానం బెనుసత్రి మగుట తప్పదు నాఁడున్
మానిని యందఱకును దగు, బోనము వడ్డించె నన్నపూర్ణమ్మ వలెన్. ౧౦

వ. ఆనాఁడు కిచలూ సత్యపాలు మున్నగు పాంచాలప్రజానేత లందఱు బందీ లగు టంజేసి శ్రద్ధానంద మోతీలాల్ మదనమోహనులు వారిభారంబు తలఁదాల్చిరి - మోతీలాలుం బెద్దయెఱుంగుట నా కపుడ మొదలాయె - నిమ్మహనీయుండును జెఱకేగనియచటిపెద్దలును నన్నుం దమవానిఁ గావించుకొనిరి- కాన నా కాతావు ప్రాయిల్లుంబలెఁ దోఁచె - నంత ౧౧

క. అందఱము దర్చిచ్చి హంటరు, బృందమ్మునమ్రోల సాక్ష్య మిడరా దను దా
రిం ద్రొక్కితి మిది సముచిత, మందును నేఁడైన శుద్ధమనియుం దలఁతున్. ౧౨

క. హంటరుపరిషత్తు నిటుల్, గెంటినతరువాతఁ బ్రజలకీడుం గోడుం
గంటకుఁ గాంగ్రెసు కొందఱు, దంటలతో సమితి యొండు తలకొనఁజేసెన్. ౧౩

ఆ. దాసు మోతిలాలు త్రైయబు జయకరు, మదనమోహనుండు మఱియుఁ దాను
సభ్యులైతి ముల్లసమితిని వెవ్వేఱు, కడలు గంటి మార్తగాథ లెఱుఁగ. ౧౪

ఆ. పూర్వరంగమెల్లఁ బూర్తిగావించుట, కేన వెడలువాఁడ నెల్లయెడల
కప్పటియును సాక్ష్య మార్జనచేసితిఁ, బెక్కుచోట్ల నలఁత లెక్కగొనక. ౧౫

క. నెంజలి యిది పరికించుచుఁ, బంజాబును లెస్సయెఱుఁగు భాగ్యమ్మును గం
టిం జెలియండ్రిరతోడను, మంజులమగు నెఱుక చిక్కె మన్మన మలరెన్. ౧౬

ఆ. యుగయుగాలనెయ్యి మొండొరులకుఁ బాదు, నిలిచి యున్నయట్ల పొలిచెఁ దృష్టి
చన్నచోటికెల్లఁ జానలు నన్నాద, రింపవచ్చి రపుడు గుంపు లగుచు. ౧౭

క. ఉడుగరగాఁ దమకదురున, వడికిన విచ్చుల సాసంగి వనితలు నన్నుం
గడు మెప్పించిరి వారల, పుడమిన్ ఖద్దరు పెరుంగుఁబో యనుకొంటిన్. ౧౮

క. పల్లి పత్తనముల సం, ధిల్లి నకడగండ్ల నరయఁ దివిరినకొలఁదిన్
దెల్లమియయ్యె దొరల్ పెను, వల్లడి పుట్టించి ప్రజల వాడ్చి రటంచున్. ౧౯

క. నాదిర్షాదొరతనమున, కీదొరతనమునకు వేర్మి యే మనుకొంటిన్
ఖేదించితి సిగ్గిల్లితి, నా దేశం బింతయడఁగెనా యనుకొంటిన్. ౨౦

క, పాంచాల మెల్లసీమల, మించెను బాలించువారిమే లెంచు నెడన్
గొంచక రణభూముల క, ర్పించె నసంఖ్యాత యోద్ధృవీరచ్ఛటలన్. ౨౧

క. ఏతాదృక్షము దేశము, నీ తెలుఁగునఁ బరిభవించి రేల్బడివారీ
చేతకు నాఁడున్ నేఁడును, హేతువు గనలేక విస్మయించెద మివులన్. ౨౨

క. అత్తఱి నేము గడించిన, వృత్తాంతము నెల్ల నుచితవిధిఁ దీర్చి నెఱా
పొత్తమొనర్చితి దబ్బఱ, పొత్తిసుమంతేని రాని పోకడతోడన్. ౨౩

ఆ. కాంచవలయు దానిఁ బాంచాలమునకుఁ జే, కుఱినహింస నెఱుఁగఁ గోరువార
లతిశయోక్తిలేని కృతి యిది యిందలి, మాటమాటకుం బ్రమాణ మిడితి. ౨౪

వ. సేకరించినవాఙ్మూలములు వానిభాగములుం గాక మాసొంతకైత యిందు లేదని చెప్పనోర్తు, సంశయాస్పదమగు సాక్ష్య మెద్దియు దీనం జేరదయ్యె - సత్యమ్మి ట్లెట్టయెదుటఁ జూచుచుం గూర్చినయీగ్రంథముఁ గన్నవా రాంగ్లేయులు తమ యేలుబడిం దిరపఱచుకొంట కెంతలేసి రాకాసితనంబులకే నోహాట్టిల్లరని తలంత్రు.

* * *

౩౬ బదులునకు బదులా?

క. డయ్యెరు పాంచాలంబును, డయ్యించిన తెలుఁగు నరయుటం దలనిడి యే
నయ్యాయి జనపదంబుల, కొయ్యం జనువేళ మిత్రు లూర్జస్వీమణుల్. ౧

వ. అసఫాలీప్రభృతులు హస్తినం గూడనున్న హిందూమహమ్మదీయ పరిషత్తునకు నన్నాకారణచేసిరి - ఖిలాఫత్తుబెడఁదయు, గోరక్షయు నందు విచార్యాంశంబులనియు, నది సౌరభేయీసమస్యం దీర్పఁదగిన యదననియు నప్పిలుపునం గలదు- సభకు రాఁజూతుఁ గాని ఖిలాపత్తును, ధేనురక్షణమును జతచేసి యొకదాని కొకటి మాఱుగాఁ జర్చించుట సముచితంబు కాదని యాహ్వానసంఘమువారికి మున్ముందు కమ్మ నంపి పదంపడి యేను

క. కరినగరంబున కేగిరి, గఱువలు పెక్కండ్రు సభకుఁగా వచ్చిరి స
చ్చరితులు శ్రద్ధానందులు, నరుదెంచిరి మాతృసేవ నాధీనమతుల్. ౩

ఆ. తొలుత నమ్మనీషితో గవీసంరక్ష, గుఱించి మనవిచేసికొన్నవాఁడ
నౌను సభకు దీని నవ్వలిదానిఁగాఁ, జేత లెస్సయనియె నాతపస్వి. ౪

గీ. కొలువునకుఁ దెచ్చి యిది పదుగుండ్ర చెవిని, వైవు మనియె;హాకీమ్‌సాహెబ్ నీవు సెప్పు
నుడువు నీకొందు నని నాకు నిడియె బల్మి, వేచితిం బరిష త్సమావేశమునకు. ౫

వ. గుణదోషములం బట్టి యీ రెండు సమస్యల వెవ్వేఱుగా నరయిక పాడి యని నా తలంపు – ఖిలాఫత్తువాదము ధర్మ్య మైననాఁడు రాచఱికంపువా రద్దానికె గ్గూనిననాఁడు హిందువులు ముస్లిముల కండయై నిల్వ వలయు – నాలంగోయమి దీని కంటింపఁజనదు – హిందువు లీమాఱు మేలు వలవంగాదు – మఱియు నీ నాఁడు ౬

క. హిందువులార!ఖిలాఫతు, కుందు నివారింపఁ బూనుకొందురయే నా
వుం దినుట విడుతునని ప, ల్కం దగదు మహమ్మదీయగణ మని తలఁతున్. ౭

ఆ. ఇరుగుపొరుగువారు హిందువులని వారి,తలఁపుఁ బెద్దసేఁత ధర్మ వనియు
నెఱిఁగి ముసలమాను లీతిండి నిచ్చతోఁ,ద్రోవవలయు మఱచిపోవవలయు. ౮

క. ఇది తన కాచర్యం బని,మదిఁ దోఁచెనయేని ముసలమాను ఖిలాఫ
త్తది చక్కఁబఱుప హైందవు, డొదవినఁ గాకున్న మొదవు నోముట వలయున్.

వ. కాన నీసంయుక్తసభవారికి ఖిలాఫత్తుం ద్రిచ్చు టొకండ యాచరితవ్య మని నమ్మితి – నాయాశయంబునకు సభాస్తారు లెల్లరు నురరీకృతిం జాటిరి– గోసమస్య సదస్సున కెక్కదయ్యెఁ – గాని మౌలానా యబ్దుల్‌బారీ తనప్రసంగంబున ముస్లిముల నుద్దేశించి యిట్లనియె. ౧౦

క. ఓయన్నలార ! హైందవు, లిమ్మెడ నెట్లున్న వారియిరుగున నుంటన్
ద్రోయవలె మనము గోవధ,మా యయ్యలచిత్తవృత్తి కనుకూలముగన్. ౧౧

క. ఇట్టిపరిణామ మేర్పడఁ, బట్టి ముసల్మాను లావుపలలముఁ గేలన్
ముట్టక పెన్నొట్టిడుకొ, న్నట్టుండి రొకప్పు డార్యు లభినందింపన్. ౧౨

వ. మఱియు నీఖిలాఫత్తు దుండగమునకుఁ బాంచాలదురంతముల జోడింపఁ దగునని సభాసదులు కొంద ఱాడ నద్దానికే నెదురైతిఁ – బంజాబుసమస్య స్థానిక మగుటం జేసి సమరశాంత్యుత్సవములం బాల్గొనఁదగునా యన్నపాడిం బరికించు తఱి నది మనదృష్టికి రాఁ గాదనియు రణసంధిసూత్రములంబట్టి యవతరించిన ఖిలాఫత్తునకు దానిం జతపఱిచిననాఁడీసభ్యులు బెడిదంబగు నెఱుంగమికిఁ బూఁట కాఁపు లౌట వలయు ననియు నే నంటి – నావాదమునకుం గొల్వువారిమైకోలు చుల్కం జేపడియె – వెండియు ౧౩

ఆ. హస్తినగరసభకు హాజరత్ మొహానియు, వచ్చె నతఁడు తీవ్రవాదనిరతి
నెల్లయెడల నాకు నెదురయ్యె; నిచ్చలు, నట్లె యుండె నతని యరుగుతోవ. ౧౪

క. హిందువులు ముసల్మానులు,నందఱుఁ బరదేశవస్త్ర మావృతిగావిం
పం దగ దనుచర్చ సభా,మందిరమున రా నతండు మాత్రై నిలిచెన్. ౧౫

ఆ. ఇంగిలీసువార లీఖిలాఫత్తున,కుచిత మైనతీర్పు నొసఁగ రేని
గడఁగి యెల్లవగలఁ గసితీర్చుకొనఁదగు,నన్నదృష్టి నాతఁ డున్నవాఁడు. ౧౬

ఆ. కాన సీమవలన నీనేలకుం డిగు,నెల్లవస్తులను బహిష్కరింప
వలయునంచుఁ బెద్దవా దొనరించి గ,గ్గోలుపఱిచె నపుడు కొల్వునెల్ల. ౧౭

క. వస్తువులనెల్ల మానుట,దుస్తరము నయుక్త; మేల తొందర వినుఁడీ
దుస్తుల వెలివేఁతయ కడు,శస్తంబని యేను లెస్సచాటితి రచ్చన్. ౧౮

వ. నా యహింసాధర్మముసైతము సభాసదుల కెఱుకువకావించితి - నపుడు మౌలానా హాజరత్ మొహానీధోరణి విన్నసభ్యు లామోదసూచకధ్వానంబుల నాక సంబగల్చిరి - కాన నాబూర యెవరిచెవి కెక్కునా యని జంకితిఁ - గాని నా కర్తవ్య మేను బాలింపవలయుఁ గదా యని నాతలఁపు లావిష్కరింపం దెగితి - నావాదంబు నోలగంబెల్ల శ్రద్ధధానమై వినియె - నంత ౧౯

క. పరిహాస్యక్రియ లేటికి, మఱవకుఁ డీగాంధి సెప్పుమాట లటంచున్
గఱువలు సభ్యులు నిలఁబడి, తిరపఱిచిరి పెక్కు రస్మదీయాశయముల్. ౨౦

ఆ. లేరు సీమసరకు లేనిసదస్యు లా, కొలువునాల్గుదెసలఁ గలయఁజూడ
గొడుగొ కలమొ గొలుసొ గడియారమో యెదో, కానవచ్చు నెల్లవానిపజ్జ. ౨౧

క. ఏలా ప్రతిపాదకులును, బాలింపని నిర్ణయం బపాత్రము; దీనన్
మే లేమివాఁడము నని ధీ, శాలులు సత్యంబు నెఱుఁగఁజాలిరి సభ్యుల్. ౨౨

క. అంత హాజరత్ మొహానీ, కొంత తెలిసి సీమదుస్తుకొండ విడిచి ని .
శ్చింత నిలఁజాల మింకొక, వింతపనిఁ మాకుఁ జూపవే యని నుడివెఁ. ౨౩

వ. అది తెల్లవారికి వెట్టపుట్టింపవలయు ననియుం బల్కు నతనికోర్కి సముచితంబని నాకుందోఁచె - విదేశవస్త్రములం ద్రోఁత వెన్వెంటన సాగదనియు నచ్చమగు ముదుకబట్టం దీర్చునేర్పు మన కెడయైనవిద్దె యనియు సీమదుస్తులం బాయ మరబట్ట నాశ్రయించుట నిరర్థకం బగుపని యనియు నప్పు డూహించితి - మౌలానా వలచిన క్రొత్తవస్తువుం బరికించితి - దానిపేరు హిందీపల్కునం గాని యురుదుబాసం గాని వెలువరింపలేమికి సిగ్గిల్లి తుట్టతుదకు 'నాన్-కో-ఆపరేష'నని యింగిలీసునం దెలిపితి - నీ పదంబు నీ యోలగంబునంద తొలుసారిగాఁ బ్రయోగించితి - రాచఱికమువా రొసంగిన బిరుదములు వీడుటయు వారికొలువుం బాయుటయు వారికి సాయంబు సేయకుంటయు నాయీసూత్రమున కర్థమని

సభవారి కెఱిఁగించితి–దౌరతనమ్ము నెదిరించి కత్తిగట్టుట నింద్యంబని చాటితిఁ–
బదంపడి కొన్నాళ్ళదనుక నీ క్రొత్తపల్కునకుఁ బ్రచారము రాదయ్యె – స్త్రీశబ్ద
మీ సభాకార్యక్రమమునఁ దాత్కాలిక విస్మృతిం బడసెఁ – గావుటం జేసియ
వెనువెంట నమృతసరమునం గూడిన కాంగ్రెసునం దే నేలుబడివారికి సాహాయ్య
మొనరింపవలయు నన్న నిర్ణయంబు నంగీకరించితి – వారు హిందూ ముస్లిము
సమస్యల నుచితరీతిఁ బరిష్కరింతు రనియు నట్టితఱి నిరోధ మనావశ్యకం బనియు
నమ్మి యట్లు గావించితి. ౨౪

***

౩౭ అమృతసరము కాంగ్రెసు

గీ. నామమాత్ర విచారణా నాటకంబు,జరిపి పాంచాల వీరసంచయముపాలి
మందిరముచేసి రధికృతుల్ బందిగమును,ఖడ్గరాజ్యంబు సాగించుకాలమందు.

క. ఇది ఘోరం బిది దుర్భర,మిది నింద్య మటంచు దేశ మెంతయు నార్వన్
బెదరి దొరల్ బందాలను,వదలిరి కాంగ్రెసుమహాస్సు వచ్చెడివేళన్. ౨

క. హరికృష్ణలాలు మున్నగు,బిరుదులు చెఱఁ బాసి మిత్రబృందము గనియన్
బరిషత్తుకంఠమునను తమ,ధరణికి వచ్చిరి జగద్ధితవ్రతనిఘ్నుల్. ౩

గీ. అమృతసరమున మాతృసేవానురక్త,లలితమై కాంగ్రెసిది సాగులగ్నమందు
బందిగము వీడి వచ్చి రస్పందశౌర్య,వాటు లాలీసగర్భ్య లిమ్మేటిసభకు. ౪

క. ఓహో ! జయ జయ పదకో,లాహలములు పొంగె నపు; డలభ్యానంద
శ్రీ హత్తి చటులవీచీ,వ్యూహోద్యజ్జలధి యయ్యె నోలగమెల్లన్. ౫

క. దినదినమును వేల్వెలుగ,ధనమును బండించు సభికతా వైభవమున్
దృణముంబలె విడి పంజా,బున నిల్చె నెవండు వీరపురుషాగ్రియుఁడై. ౬

క. ఆమోతిలాలునెహ్రూ, ధీమన్మణి నేఁటిసభ నతీవోపాయ
శ్రీ మీఱ నేలె భిక్షు,స్వాములు పిల్చిరి సదంబు శ్రద్ధానందుల్. ౭

క. ఇందనుక లాఁతిసీమల, కుం దరలినభారతీయ కుడిచెడివెత లే
హిందీపల్కునఁ గాంగ్రెసు, నం దెల్పెడివాఁడ వినయనమ్రుఁడ నగుచున్. ౮

క. ఆపని యొక్కఁడ నేఁడున్, నాపాలి దటంచు వచ్చినాఁడను సభకున్
మోపెను భగవానుఁడు నా, యోపికకున్ మించువ్రేఁగు నోడక తుదకున్. ౯

గీ. ఏలుబడివారు మనపాలి కీఁదలంచు, నవ్యసంస్కరణంబు లానాఁడ వెలసెఁ
బెదవి విఱిచిరి పిన్నలు పెద్ద లెల్ల, దాకృతిన్ నేతిబీఱతో నన్వయించి. ౧౦

ఆ. ప్రిజలకొల్వులోనఁ బండిన బాలగం, గాధరుండు వంగయోధ చిత్త
రంజనుఁడు 'ససేమిరా' యన్నదిక్కున, వక్కణింపఁ దగినవార లైరి. ౧౧

క. మాలవ్యా తాటస్థ్యము, పాలించెఁ గొంత లెన్నిపదు లుండును గా
కేలినవా రిడుచనవుల, నాలంబించుటయ కర్జమని యేఁ గంటిన్. ౧౨

వ. పూజనీయుండగు మదనమోహను కుఱంగట నాఁటిరాజకీయ పరిస్థితులం దడవితి_ నగ్రిజుంబలె నగ్గుఱువ నా కెల్లవర్గంబులవారి తలపోఁత లెఱుకువచేసె - మహాసభం బాడము సంస్కరణచర్చం బాలువడయం జెల్లు నని యే నప్డు దూహించితిఁ - బాంచాలమునఁ బ్రివర్తిల్లిన హింసం బరికించుదళముసం దే నొకండ నగుటంజేసియు ఖిలాఫత్తుం జక్కఁబఱుచునారటం బేచినవాఁడనై యుంటను దొరతనమువారితో నాఁడు నా కక్కఱయుండె - వెండియు మాంటేగు మన భూమికిఁ జెల్మికాఁ డనియు నతఁడు మనవారిం గికురింపఁ డనియు నానమ్మిక - యాలీసోదరు లత్తఱి బంధవిముక్తు లగుటయు నొక మేలిమార్పని యే నెంచితి_ నిట్టియెడఁ గొ్రిత్తచనవుల నీకో లుచితంబని నాకుఁదోఁచెఁ- గాని దాసుమున్నగు మహామహులు వీనిం ద్రోవఁ బూనుటంజేసి నెఱజోదులగు వీరి కొడ్డారింప జంకి

క. కటకటఁబడితి సభన్ విడి, యెటయేనిం బోక వోలదే యనుకొంటిన్
జిటచిటమను వ్యాత్రాపము, నట నేకాంతమున సంసదధ్యక్షునకున్. ౧౪

క. మాలవ్యాకుం దెల్పితిఁ, జాలుం జాలును బలారె ! సాహస మిచ్చో
నేలయ్య ! తప్పఁ గుంకుట, యేలిద మిది యనిరి పెద్ద లిద్దఱు నెమ్మిన్. ౧౫

గీ. హరికిషన్‌లాలుచెవి కెక్కె నస్మదీయ, వేదనాగాథ మెలమెల్ల వెడలి వెడలి
వలదు నీ వోలముంగోరవలదుమివుల, నడలుఁబాంచాలమీవార్త కనియెనతఁడు.

శా. దాసుం జూచితి లోకమాన్యునికడన్ దర్శించితిన్ వెన్క జి
న్నాసాహేబుతలం పెఱింగితిని బన్నం బెంతయున్ సైఁచితిన్
మాసిద్ధాంతము లెల్ల నేకముఖమా మార్గంబు కన్పట్ట కా
యాసంబందితి దారియేమి యని పెల్లారాటముం జెందితిన్. ౧౭

వ. అంత మదనమోహానునకు దాసి మాచిత్తంబు లేకీభవింపవయ్యె - నానిర్ణయంబు చర్చకు వచ్చునేని సభాసదులసమ్మతులం గొంట తప్పదు - ప్రేక్షకులం బ్రతిభువుల న్వెంగడించుట కడిందిచేఁత - యెల్లరుం జేతులెత్తిన నేమిపాడి ? - యని మొఱవెట్టుతఱి హరికిషన్‌లాలు నా పల్కునందుకొని ౧౮

గీ. పూఁటకాఁపుల నన్యుల నోటలేక, సంవిభాగింతు నీ కేల సంశయంబు
తద్భరంబెల్ల నాతలఁ దాల్చువాఁడ, నపసరిల్లక నిల్వు మీ వని వచించె. ౧౯

ఉ. గుండె కుదురుకొల్పుకొంటిఁ దీర్మానంబు, సంతరించి యడితి సభ్యులెదుట
నన్నుఁ దొడరి శపుడు జిన్నా జగద్ధిత, వ్యూహవేది మదనమోహనుండు. ౨౦

క. ప్రత్యర్థులకున్ మాకును, మత్యంతర మంతిమాణుమాత్రమ మైనన్
వాత్యవలె వార లేచిరి, యత్యంతము నలఁగి రోర్మియట్టడు గూఁగన్. ౨౧
క. ఒకవంక నుపన్యాసము, లొకయెడ నైక్యప్రయత్న ముడుగక నడువన్
రకరకముల కమ్మలు నా, యకులనడుమ సాగుచున్న వయ్యాదెసలన్. ౨౨
క. ఇరువాఁగుల సంధింపం, బోరిఁబోరిఁ గష్టించు మదనమోహనుఁ; డంతన్
జిఱువార్పున కీకొని యీ, యుఱవడిఁ దప్పింపు మని మృదూక్తిస్ఫూర్తిన్. ౨౩
క. నన్నాఁగెను జయరాముఁడు, తిన్ననిదని తోఁచె నతనితీరుపు నాకున్
మన్నింపఁదగిన సూచన, కన్నాఁడ నటంటి బాలగంగాధరుతోన్. ౨౪
క. ఆయయ్య చిత్తరంజనుఁ, డీయకొనక నిలువరింప నే నని వినిచెన్
దీయంజూపులజిగి దా, సాయెడఁ బఱఁగించె నెయ్యుఁడగు 'పాలు' పయిన్. ౨౫
వ. మాలవీయుం డపుడు దిటముం బడసి దేశబంధువునోట నొలె మ్మన్ననుడుగు వెలువడకమున్న కొలువుఁ గలయందిలకించి యయ్యలార! పొత్తుకుదిరె - నిఁక మీ రెలర్పవచ్చు - నని యెలుఁగెత్తి చాటెఁ - బదంపడి కరతాళరవంబు దివంబు నగల్చె - గంభీరవదనంబులు విరియంబాఱె - నీ తీఱుకతన నాపూఁట మిక్కుటంబాయె. ౨౬

***

౩౮ కాంగ్రెసుపొత్తు

వ. ఏ నమృతసరమునం జాగిన కాంగ్రెసుచర్చలం గోరు వడయుట తన్మహాసభ తోడి నిక్కపుంబొత్తు నాకు మొలతెంచుట యని తలంతు - నింతకుము న్నసమ్మదీయంబులు భక్తిగౌరవంబు లప్పనచేసికొనం గోరియ జాతీయమహాసభల కేగెడివాఁడ-నాఫ్రికాభారతీయసమస్యంబోని నాసొంతపని వినా కాంగ్రెస్సుపని యెద్దియు నాపాల లేదని తొల్లి భావించితి-నది వలయు. నన్ను వలపేనిం దన కొదవదాయెఁ - గాని యీనాఁడు ౧
క. నే నలయక పాంచాల,క్షోణికిఁ గావించుకొల్పుచొప్పది కాంగ్రెస్
లో నెఱసరు లగువారికి,మానితశీలురకు లోకమాన్యాదులకున్. ౨
ఆ. తనివి గూర్చె నన్నతత్త్వంబు గంటి న,గ్గఱువ లాంతరంగికప్రసక్తి-
పుట్టినపుడు నన్ను నెట్టన రావింపఁ,గడఁగి రాదరింపఁ దొడఁగి రిచ్చ. ౩
క. జాతీయ మహాసదమున,కా తఱిఁ గృత్యమ్ము లగ్రియమ్ములు రెం; డా
చేతల కేఁజాలుదుఁ దత్,ప్రీతియు మచ్చిత్తవీధిఁ బింపిసలాడున్. ౪
క. జలియన్వాలాబాగున,గొలకుం గనులైన సైనికులకాల్పులకున్
బలి యైనవారిచిన్నియ,నిలుపుట యుం దొకటి యంచు నిశ్చితమాయెన్. ౫

క. ఈపనికి నైదులక్షల,రూపాయలు వలయు; జాగరూకతమైఁ ద
ద్రూప్యమ్ముదిద్దు వేఁకము,నాపై సభవారు మోపినా రవ్వేళన్. ౬

ఆ. ప్రజల కుపకరించుపనులకై వలసిన, వసువు సంతరించువారిలోన
మదనమోహనుండు మొదటివాఁడైన నా, దిట్టకేను దీసికట్టు గాను. ౭

క. నేటాలుభారతీయుల, వేఁటాడువిపత్తి నెదిరి విదళించుతఱిఁ
బాటవ మిది నాసొమ్మని, తేటపడెం గాని యిందు తెలివెద నిచటన్. ౮

క. మాలవ్యాకై వడి భూ, పాలురలక్షలు గడించుపని కే నెపుడుం
జాలఁ జుఁడీ! యైనను బాం, చాలంబున కిట నరేంద్రసంపద యేలా? ౯

ఆ. అగుట నర్థ మొసఁగుఁ డయ్యా! యటంచుఁ బ్రా, ర్థన మొనర్చినాఁడఁ బ్రజలగుఱిచి
రూక లప్పుడ వచ్చి దూఁకెను వేల్వేలు, చాలుఁ జాలు నన్నమేలు గంటి. ౧౦

క. ఇత్తఱి బొంబయిపౌరుల, విత్తమ తద్దయు లభించె వితరణవిద్యా
వేత్తలు జగచ్ఛివంకర, వృత్తులు నగు వీరిపెంపు వినుతింపఁదగున్. ౧౧

వ. లోక మిట్లాదరించి పంచినధనంబు నేటికే నట్ల యున్నయది-దీనిని వెచ్చించు
పట్ల సంకట మొకం డేరుపడియె-హిందువులయు సిక్కులయు మహమ్మదీయు
లయు నసృక్పూరములం దోఁగి పరిపూతమైన జలియన్‌వాలాబాగుగడ్డపై
స్మృత్యంక మెట్టిది నిర్మింపఁదగు నన్ననిర్ణయము కడుంగడు గడ్డుసమస్య యాయె-
నేఁ డీముత్తెగలయం దేరెండుకోవలకేని పొత్తు సున్న-యిఁక నాకు వసపోయిన
రెండవ నేర్పు రచనాకౌశల మని విన్నవింతు-నిదియు భారతజాతీయమహాసభకు
నేఁ డొదవునని తలంచితి. ౧౨

క. మితశబ్దంబుల వినయ, చ్యుతి యించుక లేనిబాస నొసపరివ్రాఁతల్
జతపఱుపంగల నే నని, మతిమన్మండనులు లోకమాన్యప్రముఖుల్. ౧౩

క. మున్నె యెఱింగిరి నాకీ, విన్నాణము మెల్ల మెల్ల విరియంబాఱెన్
దిన్నన యిది లోకమునకు, నన్నాదరణీయుఁ జేసినది నా నోర్తున్. ౧౪

క. గోపాలకృష్ణుఁ డెపుడో, చూపినసూత్రములు కాంగ్రెసున కిందనుకన్
ద్రోపాడరాని విధులై, దీపించును దెరువుసూపుదివ్వెలవోలెన్. ౧౫

క. ఈనాఁ డేతన్మండలి,పూనినకర్జములు మూరిఁబోవుటకతనన్
గానంబడియెను గోకులుఁ,డానాఁడు రచించుచట్ట మసదై సభకున్. ౧౬

క. ఈసూత్రము వర్జం బని,యాసూత్రము నిట్లు మార్చు టగునని ప్రజ్ఞా
భాసురు లేఁటేట నుపన్యాసములు కురింప నొగ్గినా రీగోష్ఠిన్. ౧౭

గీ. ఆయుగాలంబు వలయుకార్యములు నడుచు, నేమ మదిలేదు వచ్చునొగాము లరయ
కట్టడలు లేవు సభయుఁ బెగ్గడలు మూఁవు,రుండెదరు గాని పరికింప నొకఁడె మంత్రి.

క. అతఁ డైన నెల్ల వేళలఁ, జతురతమైఁ బనులు దిద్దఁ జాలనివాఁ; డీ
గతి నుండునయ్యగారు స,మితికార్యాలయము నెట్టిమెయి సాగించున్. ౧౯

క. రానున్న చిక్కు లెవ్వియొఁ, గానంగలఁ డెన్నుకొన్నకార్యము నే చం
దాన నడిపించుఁ బ్రజ కీ,మానిసిచేఁ గీదృశంబు మంగళ మబ్బున్. ౨౦

గీ. నేల యీనినచందాన నాలుగైదు,లక్షలప్రజల్ మహాసభన్ వీక్షసేయ
నేగుదెంతురు ప్రతిభువు లింద అన్న,పద్ధతి హుళక్కి యిక నెల్లు బండి దొర్లు. ౨౧

ఆ. వచ్చి పీఁటవెట్టువా రెల్లఁ బ్రతినిధు, లగుట కడ్డు వోడమ దర్థ మిడిన;
మేర కానిపింప దీరాష్ట్రమున కింత, మంది పూఁటకాఁపు లుందు రనుచు. ౨౨

వ. కాంగ్రెస్ కార్యప్రణాళిక యిట్లుండుటంబట్టి దీనిసంస్కరణ మావశ్యకం బని మహారథుల కెల్ల రకుం దోఁచె - నపు డీవిషయ మన్నిటికిన్ ముంగలిదై నిల్చె - నానాఁడు లోకమాన్య దేశబంధువులు ప్రజానాయకులయం దగ్రిములు - వారి బాసట యుండు నేని మహాసభానియమమ్ములం దిద్దు నని యే నాడి పనిప్రవేఁగుం దలఁదాల్చితిఁ - గాని బాలగంగాధర చిత్తరంజను లీచేఁతలోఁ బాల్గొనఁదగ్గ విడుమర లేనివా రని యెఱుంగుదు - నగుటం జేసి మీనమ్మినవారి నిరుగురం బ్రడ నాకండగా నిం డని బలుమానుసుల వారి నర్థించితి - నేతదుపసంఘమువం దీముప్పురు త్రిక్కు లాఁతివా రుండం గాదని విన్నవించితి - వారు నాపల్కులం బెద్ద చేసి తమపక్షమునఁ గేల్కర్ సేన్ మహాశయుల నిర్ణయించిరి - కాని ౨౩

క. ఈ ముగ్గురు తీర్పరు లొక, ధామంబున నిల్చి పాడి తర్కింపర; లే
ఖామూలమునఁ బరస్పర, ధీమార్గము లెఱిఁగి యొఱిఁగి తేఱిరితుదకున్. ౨౪

క. ఎడమడుపు లేనినడవన్, వెడలెను మాతీర్పు; దీనివెనుకల దేశం
బడు గిడిననాఁడు దాస్యము, సుడివడి కూలున్ స్వరాజ్యశోభలు వాలున్. ౨౫

క. ఈకట్టడ నిర్మించుట, కీకొన్నదినంబు తొట్టి యే నల కాంగ్రెస్
లోకమ్ముతోడఁ బడుగుం, బేకయుబలె జడ్డువెంచి పెనఁగొన్నాఁడన్. ౨౬

* * *

౩౯. ఖాదీపుట్టువు

వ. వేయుఁ దొమ్మన్నూట యెన్మిదవయేఁటిదనుక రాట్నము మగ్గము నాయెఱుంగని కొఱమట్లు నాఁ జనుఁ - గాని రాటనమునం జేసి భారతీయులలేవడి మటుమాయం బగునని యేను 'హిందూస్వరాజ్యము'నం దడవితి - మనగడ్డం బెక్కు రాఁకటి చిచ్చు నార్పుకోఁజాలక జాలింబడి మడియుచుందు - రిట్టియిక్కట్టు నరికట్టు వెర వేయది కానంబడు నాయదియ బానిసమునుసైత మడఁగార్చు నని తద్గ్రంథ

మునఁ బలుకరించితి - వేయితొమ్మనూటపదునైదవయేఁట నే నాఫ్రికా నుజ్జన
చేసి మాతృభూమిం జేరితి - నపుడు సైత మీయంత్రము నీగడం గాన - సబర్మతీ
సత్యాగ్రహాశ్రమ నిర్మాణ మైనపదంపడి కొన్నిమగ్గముల నేర్పరించితిమి - కాని ౧

క. వాణీయంత్రము నార్చెడి, నాఁటెము మాపాల లేమి నలఁగితి; మేనాఁ
డే నిట్టిచేతిపనులం, గానముగద వ్రాఁత కూఁత కర్జము తక్కన్. ౨

ఆ. అగుట వాపకృత్య మలవఱుపన్ దంతు, వాయుఁ డొక్కరుండు వలసె నపుడు
వెదకి తెచ్చితిమి కువిందు; నతండు మా, కెఱుకపఱిచె నేఁతమఱుఁగు గొంత. ౩

క. ఎవ రెట్లొప్పరికించినఁ, దవు లూడ్వక మగనలాలు తంటాలువడెన్
సవరనిపనివాఁ డయ్యెను, జవ మేర్పడ వలువ లల్లఁ జాలెన్ గ్రాలెన్. ౪

గీ. అతఁడు చదు రొప్ప సత్యాగ్రహాశ్రమమున, నెల్లరన్ మగ్గరులఁ జేసె మెల్ల మెల్ల
నవల మాతాల్చుకోకల నాశ్రమమున, నేయఁదగు నన్నకోరిక నెగసె మాకు. ౫

గీ. అంత మరలోనఁ బొడమినయట్టిచీర, మాని మరనూలితోఁ జేతిమగ్గమందుఁ
దీర్చి నేసినవస్త్రంబ ధృతికి నర్హ, మని తలంచితి మేకాశయంబు వెలయ. ౬

వ. ఈనిర్ణయంబునంజేసి మా కెన్నెనివిషయము లవగతంబు లాయె - నేఁతరుల మన్న
డయు వారినిర్మించు నంబరములయు నూలిన్ విలుచుపట్లు వా రనుభవించు నవస్థ
లయు నప్పేరమునందలి రవళియు రాను రాను శాలికుల యధమర్ణతాది సంకట
ములయు రహస్యము లన్నియు మాకెఱుకకు నందె - నిట్టిదశలో మాకక్కఱ
యగు దుస్తు లన్నిటిం గ్రిన్నక్రిన్నన సంతరింప నేరము - కాన మున్ముందు మా
బట్టల సాలీండ్రచెంతం గ్రయింపఁ దలఁచితిమి - కాని సాలియలకడ నొండె వణి
క్కులకడ నొండె దేశీయమగు యాంత్రికతంతువుతో నేసిన జిలుఁగువల్వ
లుండవు - వానికి సీమనూ లాదరువు - మన మరలవలన సనసన్ననిపోఁగు
బయల్పడం జాలదు - రవంత ముదుగుగా నుండుఁగాక మనమరనూలి నాద
రింపం జనునని నిశ్చయించి తిరుగందిరుగ 'మానేసిన చీరలనెల్లం గొందురేని
నాఁటిమరదారమున బట్ట లల్లుదు' మని కొందఱు కువిందు లాడిరి - వల్లె యని
మే మంటిమి - నాఁ డిట్లు మరనూలిబట్టం బెద్దచేసి వాడుచు దాని నాద
రింపుఁ డని చెలికాండ్రకుం దెలుపుచుఁ దంతుయంత్రములవారి కేము యదృచ్ఛా
ప్రచారకుల మైతిమి - దీనంజేసి వారిపని తెఱంగులు బవంతములు దురాశలు
మాకుం దెల్లమియయ్యెఁ - దమదారముం గాక నేఁతనుసైతము ప్రజ లిచ్చగింప
వలయు నని వారితలంపు - చేనేఁతగాండ్రకు వారికావించుబాసట యిచ్చమైఁ
జేయునది కా దనినుడువంబోలు. ౭

క. ఇక్కథనెల్లఁ గనన్ మన, కక్కఱయగు నూలు మనమ యలయక వడుకం
జక్కఁబడుఁ జిక్కు లన్నియుఁ, దక్కుఁ బరాధీనజీవితం బని తోఁచెన్.

క. మన తంతుయంత్రములకున్, మన వాణీయంత్రములకు మన మాప్తులమై
మొనలేనిలేమి నల్లదురు, జనులకు ల గ్గేమిసేయఁజాలుదు మిచటన్. ౯

ఆ. అని తలంచి యచ్చటచ్చటఁ గంటిమి, కాని రాటనంబు గానమైతి
మొక్కెడేని మాకుఁ జిక్కెడ యానాఁడు, రహాటకృత్యభారవహనచణుఁడు. ౧౦

క. ఒకనాఁడు కాళిదా సను, వకీలు రాటమును జక్కఁ వడుకంగల నా
తుక నొర్తుఁదెచ్చి యీ వెలఁ, దికి నేరమి గలను పోఁగుకీ యుట ననియెన్. ౧౧

ఆ. ఆ కెశిక్షు వడయ నభినవజ్ఞానస, మార్జనాభియుక్తు నాశ్రమస్థు
నొకనిఁ బనిచినార మూరక చనుదెంచె, నతఁడు తద్వివేక మందలేక. ౧౨

క. కాల మిటు లుఱుకుచుండఁగ, నాలో నారటము దినదినర్ధం బయ్యెన్
మాలగ్గు నరయ వచ్చెడి, బాలురకున్ వృద్ధులకును బాయక దీనిన్. ౧౩

ఆ. వెల్లడించి గోలవెట్టఁ దొడంగితిఁ, గాని జాడ వినుచుఘనులు లేర
వడుకుచేత యాడువారిసా మ్మగుట న, వ్వార చెప్పవలయు వారకీలు. ౧౪

వ. ఇట్లుండ వేయితొమ్మన్నూట పదునేడవయేఁట ఘూర్జరులు నన్ను శిక్షాపరిష దధ్యక్షుఁ గావించి భరుకచ్ఛమునకుం గొనిచనిరి–నా కాపేట గంగాబాయి నాఁ బరఁగు నారీమణి కానంబడె–నాపెవిశ్వస్త– కొలంది నిడరాని తెగువ కామె పుట్టినిల్లు–చదువుసందెల కాయమ్మ దొదవ్వుల నుండెఁ–గాని విదుషీమతల్లిక లాకె సాహసముం గానరు–గంగమ్మ కంటరానితన మొంటదు–కడజాతిమానుసులం గూడిమాడి యాబిడ నిర్భికయై వారి కూడెముం జలుపు–వెండియు ౧౫

క. ఆవెలఁదిపాల రొక్కము, కావలసినయంత కలదు కాని సుఖంబుల్
భావింప దాకె యెపుడును, లా వెంతయుఁ దనరు నప్పాలంతుక మేనన్. ౧౬

క. ముక్కాఁకలుదీఱిన యీ, యక్క మదిన్ జంకుగొంకు లరయక యెటకే
నెక్కటియై చను వార్యము, నెక్కి సవారీలుకొట్టు నిగ్గనిచేవన్. ౧౭

గీ. గోధరా కేగినప్పుడు కుదిరె నాకుఁ, బరిచయం బీనెలంతతో బాధ మగుచుఁ
జెప్పికొన్నాఁడ నీసాధ్వి చెంత నాదు, నెడఁదఁ గారించు రాట్నంపుగొడవ నెల్ల. ౧౮

క. దమయంతి నిషధవసుధా, రమణుం గనఁ జన్నయట్లు రాట్నము నెమకన్
గమనింతు ననియె గంగమ, సమయించెన్ ననుఁ గలంపఁ జాగినవేగున్. ౧౯

* * *

౪౦ దొరకినది

క. గుజరీ నాలుగు దెసలం, దజరాభినివేశనిఘ్నయై గంగమ నా
గజిబిజి దీర్పం దిరిగెను, బ్రిజ లెపుడో త్రోసి మఱుఁగుపఱిచిన బిసరున్. ౧

క. ఆపె తుద కెట్లెటో బీ, జాపురమున రాట్నమున్నసవ్వడి పట్టెన్
నాపాలిటి పండువుగా, నాపుణ్యాచరిత్రి నాకు నాకథ నంపెన్. ౨

క. బీజాపురమునఁ బ్రాఁబడి, బూఁజునఁ బడి మచ్చు లెక్క పొలుపఱి దేశ
శ్రీజనకము లగురాట్నము, లేఁజెల్ల ! కృశించుచుండె నింటింటఁ గడున్. ౩

క. అచ్చటివా రేకుల నిడి, వచ్చినదారంబు విలుచువా రేర్పడినన్
ముచ్చటపడి నూల్దీయుట, కిచ్చం జూపిరి మదాత్మ యువతాళింపన్. ౪

వ. కాని దూదిం జక్కఁబఱిచి యేకులు గావించుట మాకుఁ గడిఁదికర్జం బాయె - స్వర్గీయున కుమర్ సోబాని కీయిడుమన్ దెలుప నమ్మేటి తనమరన్ వానిని దీర్చి పనుపం బూఁటవడియెఁ - బదంపడి ౫

క. ఏకులకట్టలు గంగ క, నేకంబులు సేర్చుచుంటి మిఁక నూల్వారల్
మాకడకు వారవారము, దూఁక మొదల్కొనియె వెండిదుత్తలపోలెన్. ౬

క. మగ్గములు సాఁచి నూలికి, నిగ్గులు సవరించి బట్ట నేసితి మంతన్
బగ్గకు నెంతపెనంగిన, నగ్గువమై మిగులు దార మాయైగదులన్. ౭

ఆ. రహాటలక్ష్మి దొరకె రమణీయతంతువు, చిక్కె నేఁత వెలసె నిక్కె వలువ
యింతవట్టు లెస్సయే కాని యూరక, సెట్టి యొసఁగు నేకు లెట్టుగొందు. ౮

క. సొమ్ముం గొని పంపుట కా, యుమ్మర్ సోబానియుల్ల మొల్లద యెన్నా
ళ్లిమ్మయిని దేరసొమ్మున, కుమ్మది నీకొల్ప నేర్తుఁ గుందినపాడిన్. ౯

క. ఐనను మరయేకుల కే, నానను టుచితంబె యట్టు లగుచో మరనూ
లేనెటి నింద్యం బగు మన, యూనేలన్ దొంటివారి కీయంత్రంబుల్. ౧౦

క. ఏకులను దీర్చి యిచ్చెనె, లేకున్న న వెట్లు సంధిలెన్ దాతలనాఁ;
డీకై వడి నాయెడలో, రేకెత్తిన దపుడు తర్కరీతి దళంబై. ౧౧

ఆ. తుదకు వ్రాసినాఁడ దూదేకువానికై, కడఁగు మనుచు గంగకడకుఁ గమ్మ
వెదకి వెదకి పట్టె వెలఁది తత్కార్మికు, దిక్కులేక వగచు బక్కవాని. ౧౨

క. ఆపేద నెలకు ముప్పది, రూపాయలజీత మడుగ రొక్కం బిది యా
క్షేపార్హము కా దంటిని, జాఁపెను విల్లతఁడు తీయసందడి విరియన్. ౧౩

ఆ. పింజ విరియ నేకి పుంజపుఁజమ్ముల, నేర్పరించె వాఁడు నేర్పు మెఱయఁ
బిన్నపిన్నవాండ్రఁ బిలిచి గంగాబాయి, చిట్టిచిట్టియేకు చుట్టఁజేసె. ౧౪

వ. అంత నేను బింజాభిక్షమున కయ్యాతాపులకుం బయనించితి – 'యశవంతప్రసాద
దేశాయి' మాకు వలయు కార్పాసము నంపం బూటవడియె – సత్తమశీల గంగా
బాయి చేపట్టిన యీమేలిచేత యిట్లు తామరతంపర యయ్యె – బీజాపురమునం
దీయుదారమును వలువఁగాఁ దీర్ప నయ్యమ్మ పెక్కండ్రు సాలెల రావించె –
నివ్విధంబున బీజాపురపుఖాదీ యావద్భారతమునం గీర్తి నార్జించె – నిట్లీ
కేంద్రమునం గద్దరుబట్ట వెల్లివిరియం జాగ న్నాశ్రమమునం బెక్కురాట్నములు
కుదురుకొనియె – మఱియు ౧౫

ఆ. మగనలాలు తనసమర్థత నొదవించి, మేటిమార్పు దెచ్చె రాటమునకుఁ
బెల్లు రాట్నములు కదుళ్ళను దకిలీలు, నాశ్రిమోర్వియంద యవతరించె. ౧౬

గీ. అపుడు మా నేయుఖాదీకి నైనవెచ్చ, మరయఁ బదునేడణాలఁ జేకుఱెగజంబు
ముదుకగా నున్న వెల యెంతమూరియున్న, విలిచిరిద్దానిఁజెలికాండ్రు వేడ్కమెఱసి.

క. ఏ నొకతఱి బొంబయినగ, రానం బడియుంటిఁ దేగులు రా వందురుచుఁ
మే నెటు లుండిన ఖద్దరు, పూనిక విడనైతి నిద్రపోవుచునున్నన్. ౧౮

క. ఇరువురు చిక్కిరి నా కా, పురమున రాట్నమ్ము నార్చుపొలఁతులు; వారల్
విరచించునూలు కొంటిని, ధరలోనిరహస్య మెఱుఁగఁ దత్కాలమునన్. ౧౯

క. ఆపిమ్మట గంగమ బీ, జాపురి నిడువిలువఁ దెలిసి చానలు వీరల్
టోపీ పెట్టిరి నా కని, వాపోయితి వారినూలు వల దనుకొంటిన్. ౨౦

వ. ఆయమ్మలు మాసా మ్మొంచుక నంజినను రమాబాయికి నవంతికకు శంకరలాల్
బాంకరుతల్లి వసుమతీదేవికి రాట్నపుంబని మప్పటంజేసి వీరివలని నష్టికంటె
లబ్ధిహెచ్చని తలంచితి–నానిల్చునోవరిలో నపుడీసాధ్వులాడించు రాటనములరవళి
మధురమధురంబుగా మొరయం దొడఁగె – న న్నలయించు తెగులుం బాఱఁ
ద్రోలుపట్ల నీరాటమునకుం బా లున్నది సవివక్షించుట యతిశయోక్తి యనం
జెల్లదు – రోగముం దొలఁప మానసిక పరిణామం బొకసాధనం బనుట నిజము – ౨౧
వెండియు

ఆ. మాకు వలయు చేతియేకులు బొంబాయి, పురినిసైత మపుడు పుట్టకుంట
దెసలుచూచు నాకు నసపడె సెజ్జల, దూది నేకి బ్రదుకు పేద యొకఁడు. ౨౨

క. ఏకులను దీర్ప నాతం, డీకొనుడున్ బేరమాడ కిచ్చితిఁ గూలిన్
మాకదురు లాడె నాడెము, పైకొనఁగ రమాదిసతులు వడికిరి నూలిన్. ౨౩

క. అపు డేర్పడుదారముతో, జపమాలలు కట్టి యమ్మ సాగితి మిత్రుల్
సుపవిత్రులై నవైష్ణవు, లుపక్రమించిరి కొనన్ మహోత్సాహమునన్. ౨౪

గీ. నడిపె రాట్నాలసాల నానడక మెచ్చి, బంబయిపురమ్మున శివాజభాయి నాడు
దేశభక్తు లుదారులై తెచ్చి యిచ్చు, విత్త మిప్పట్ల నెంతేని వెచ్చపడియె. ౨౫

ఆ. అది నిరర్థకవ్యయంబు కా దని జగంబునకు వెల్లడింతు వినయ మార
నెఱుకపడియె మాకు నిప్పనిలో రాట్నమగ్గపఱుచులగ్గు లగ్గలముగ. ౨౬

గీ. ఏను మరనూలిదోవతి నూని తిరుగు సమయ మయ్యెది; రాట్నపుంజాపు లపుడు
వెలసినవి గాని వైశాల్య మలఁతి యగుట, నట్టలుగ నుంట నొంటనివయ్యె నాకు.

క. కద్దరు కానిది యానాఁ, డెద్దియు నామేన నిల్వ నెద మాఱొడ్డెన్
దద్దయుఁ గలఁగితిఁ బన్నా, పెద్దఱికం బున్నవలువ బిఱబిఱఁ బడయన్. ౨౭

వ. అంత నొకచందులో నైదుజేనల విరిపడిగల పంచెలం బంపవేని చాల నోలాకు
పడుదు నని గంగాబాయికిం గమ్మ వ్రాసితి – నా సాధ్వి తొలుతన్ బెదరియు
దిటముం బాయక నాపెట్టినగడువు దాఁటకమున్న యిర్వదిరెండువీసముల పఱపు
గల యంతరీయముల నందించి నన్నేఁచులేవడిం దోసివైచె – నావెన్క సోద
రుఁడు లక్ష్మణదాసు లాఁటీ యనుపల్లెకుం జని వాపవృత్తిలో నడిసన్నయాలు
మగల గంగా రాముల నంత్యకులజుల నాశ్రమోర్వికిం జేర్చి వారిచే విస్తృతిసంప
న్నములగు వల్వల నేయించె – మఱియును ౨౮

క. ఖద్దరు మిక్కిల్లుట కీ, యిద్దఱు గావించుసేవ కెనలే; దదిరా!
నిద్దుర యెఱుఁగక మగ్గపు, విద్దెం బెక్కండ్రఁ దీర్చి వేర్చిరి వీరల్. ౩౧

ఆ. చదువు లేదు కాని సంస్కార మురవుగాఁ, గలదు రాముఁ డేలుగంగపాల
నేత నేయుపట్ల నీతల్లివీనులుం, గనులు నొందు వినుట కనుట మఱచు. ౩౧

***

౪౧ ఒ క సం వా ద ము

వ. 'స్వదేశీ' ప్రచారంబు నా రహాటవస్త్రవ్యాప్తి సాగుచున్న తొలునాళ్ళలో నేఁత
మరలవారిచూపేతదుద్యమము దెసకుం బఱిఁగె – వారిపరామరిస లెస రేఁగం
దొడఁగె – నవ్వణిజులయం దుమర్‌సోబాని దిట్ట నాఁ జను నతఁడు తన యనుభూతి
రహస్యములు నా కెఱిఁగించుటయ కాక తక్కు బేహారుల తలఁపులు సైత ముగ్గ
డించుచుండె – నెల్లబచ్చులం దొక్కొరునివాదం బితని నాకర్షించె – న స్నితఁ
డాసాహుకుఱంగటి కొకనాఁడు చేర్చుడు న ప్పుణ్యాజీవుఁడు నన్నుం గని ౧

సీ. వంగరాష్ట్రమ్మను వ్రచ్చుట కేల్పడి, వారు పూనిననాఁడు వాడవాడఁ
జెలరేఁగినది స్వదేశీనినాదము; నీవ, సృష్టవు కా వీప్రచారమునకు
నిది జనించినవేళ నీగడ్డఁ గల నేత, మరలనోములు పండి సిరులు నిండె
నపుడు వల్వలవిల్వ నాకసంబున కెత్తి, టక్కరిపన్నికల్ పెక్కు పన్ని

గీ. కోట్లు లార్జించినార; మీగుట్టు నీకుఁ, దెలియునే? ట్లన నే నౌను దిగులు వొడమ
వింటి నీవార్త ము న్నని యంటి నంత, నాతఁ డి ట్లాడె నావంత భీతి లేక. ౨

క. ఏలా వగచెద వన్నా!, యీలోకము నుద్ధరింతుమే వేరులమై?
మాలాభ మెంత చేపడు, వీ లుండునో యంత వడయ వెనుఁబడ మెప్పుడున్. ౩

క. కొనుబడి హెచ్చుకొలందిని, బెనుపగు వస్తుక్రియంబు; పెనఁగియు నెవ్వం
డణఁపంగలఁ డుత్పత్తిని, ఘనుఁ డెవ్వం డాఁకపెట్టఁగలఁ డమ్మకమున్. ౪

గీ. తమయొనర్చెడి గోలకతాన లాఁతి, వలువ లీనేలకున్ రాక నిలిచినప్పు
డిచటిమరబట్టవెల రెచ్చు హెచ్చుననుచు, వంగదేశీయు లూహింపవలదెసెప్రమ.

మ. అనుడున్ జెల్లరె! వంగసోదరులు నాయళ్లే మతిభ్రష్టులై
మనబేహారు లుదారబుద్ధు లని నమ్మం జూచిరే కాని వా
రనృతం బీకొని సీమవల్వ నిది దేశ్యం బంచు నిర్లజ్జులై
జనసంఘమ్ముల కమ్మనేర్తు రని యెంచంబోవ రెప్పట్టునన్. ౬

క. ఏ నిట్లు పల్క వర్తకుఁ, డౌ నీ వొకపిచ్చివాఁడ వని యెంచియు ని
న్నీనాఁడు హెచ్చరింపం, బూనిక నిట సేర్చినాఁడఁబో! దవ్వాయినన్. ౭

క. నీవును బోళాబంగా, ళీవలె నిత్తళిని బుత్తళిన్ దుల్యముగా
భావించి పప్పులోఁ గాల్, వైవకు నేరిమి గడింపవలయున్ బనులన్. ౮

వ. ఇట్లాడినపదంపడి తనయంత్రశాలం దీర్చువల్వల మచ్చుముక్కల నాముం దిడి యివి పనికిమాలినదారమునం బొడమెఁ - గావున నగ్గువగా నమ్మంబడు - నాసేతుశీతాచల మెల్లవీడుల కంపంబడు - మా కన్నితావులం బూఁటకాఁపులున్నారు - నీవును నీవారుం గనియెఱుంగనిభూముల నీపలుకురవళ్లిసైత మావేశింపనిసీమల మాకు బేహారపుంబొత్తు కలదు - దలారులం గ్రొత్తవాండ్ర నేమించునక్కఱ కానంబడదు - మఱియు మనప్రజలకున్ వలయుపాటిబట్ట మనగడ్డం బుట్టుట కల్ల యనియెఱుంగు - మగుటంజేసి నీకావించు స్వదేశీప్రచారమునం దొలుతొల్త వస్తూత్పత్తి పాటింపఁ దగ్గది - ఫ్రట్టుకయు మేల్మియు దళముకొన్ననాఁ డలవోకగా లాఁతినేలవలువలరాక నిలువంబడు - సరకు పొంగి పొర్లవలె నన్నఁ నేతమరలసంఖ్య పొంపిరివోవం దగు - నిప్పునికి నీ వంగవించుట సముచితంబు - మాప్రశంస లానాఁడు నీకు వలసినన్ని లభించు - నావుడు ౯

క. ఏ నిట్లాడితి నయ్యా!, యీనేలన్ వలువపుట్టు హేరాళంబై
జేనెండేనియు నన్య, క్షోణీవసనంబు మనవసుంధర డిగ్గన్. ౧౦

క. చన దని మీచెప్పినప, లుక్కను మెచ్చెదఁ గాని మరలకున్ బ్రతిభువనై
మనఁజాల వీనికతనన్, మనభూమికి నెగ్గుగాక మఱి లగ్గగునే. ౧౧

క. నే నెంతపెనఁగులాటకుఁ, బూనినఁ గొన్నాళ్ళు సాగుఁబో! మీయాటల్
మానని విశ్వాసం బీ, మానిసికిం గలదు రహాటమార్గముపట్లన్. ౧౨

క. అల్లెల యందురా వఱు, వట్లం బడి కుములు నాఁడువారల వెంజేఁ
కట్ల మొగంబుల వారల, పాట్లాఱుప నేతు ముఁదుకబట్టలచేఁతన్. ౧౩
క. పడఁతులచే దారంబును, వడికించెదఁ బేదసాలెవాండ్రచేతన్
నడిపించెద మగ్గంబులఁ, దొడిగించెద నెల్లవారితోడం గదరున్. ౧౪
ఆ. ఎంతవట్టు కోర్కి యీడేఱునో మును, ముంద చెప్పఁజాల; మొన్నమొన్న
రాట్నమునకు విఘ్నరాజార్చ నెఱపితి, నైన నిది ఫలించు నని తలంతు. ౧౫
వ. నా యీయుద్యమంబునంజేసి యీనేల కైగ్గేమియుం బాటిల్లదనుట నిర్వివాదాంశము-ఖద్దరువలువ యెంత వాడమిన నది మనయుత్పత్తికిం దోడ యగు-నుత్పత్తి ననుసరించి లబ్ధియు నుండుఁ-గావున రాట్నముం ద్రిప్పుట నిరర్థకం బని మీ రన్నమాట మన్నింపనేర-మీ తెరువున మీరు పయనింపుఁడు-రాటన మీ యాంత్రికయుగమునం దొదవునో యొదవదో యన్నవిషయము నవలం బరికింతు-నేది యెట్లున్న నేమి-యేను సర్వదా మీయభ్యుదయంబు వలతు. ౧౬

***

౪౨ అసహకారము

క. ఏచందంబున ఖాదీ, యేచినదో తద్విశేష మిం దనఁజాలన్
నాచేసినట్టిచేఁతల, సూచించుట తక్క నొండు చొప్పడ దిచటన్. ౧
క. ఆకథల నూఁచముట్టుగ, వాకొన నొక్కొకటి భాగవతమంత యగున్
నా కిట సత్యాన్వేషణ, మేకమ పాటింపఁదగిన కృత్యంబు కదా! ౨
వ. సత్యముం బరికించుపట్ల నొకపని వెన్క నింకొకచేఁత యెట్లలవోకగాఁ బొడతెంచె నద్దాని నుడువుటయ నాతలంపు - కావున నసహాకారంబునుగుఱిచి యించుక వివరించుట కిది యదనుగా నెంతు - నీనాఁ డలీసోదరులు ఖిలాఫత్తుదెసఁ దీవ్ర ప్రచార మొనరించువారైరి - మహమ్మదీయు లహింసాశాంతుల నెంతగనుకఁ బాటింప నోర్తు రని యే నబ్దుల్ బారీ మున్నగు నులేమాలకడఁ జర్చించితిఁ - దాత్కాలికమ్మగు నొదవుబడిహింసె నొకమేరవఱకు సీధర్మవులం బూన నిస్లాము ముస్లిముల కాఁక చెప్ప దనియు నవధరించిన యహింసావ్రతము నధఃకరింపఁ బోల దనియు నప్పండితులు తేల్చిరి- పదంపడి ప్రయాగమునంగూడిన ఖిలాఫత్తు మహాసభం దర్జనభర్జనము లైనపిదప నసహాకారనిర్ణయ మూరీకృతం బయ్యె - నసహాకారము శాంతిసంపన్నము దుశ్శకము నవి హకీంసాహెబు సందియంపడియెఁ -గాని కొన్నాళ్ళలోన య్యన్నసంశయము నివృత్తం బాయె - నవ్వల నమ్మేటి మన సార దేశమున కూడిగం బొనరించె - నీజతనంబున కిసాహెబొనరించినబాసట విలువకట్టరానిది - తదనంతరంబ

గీ. రాజకీయసదస్సు ఘూర్జరమునందుఁ, బొసఁగ నద్దానఁ జేర్చితి నసహకార
నిర్ణయం; బది పరిషత్తు నర్ణవంబు,వోలె ఘూర్ణిల్లఁజేసె గగ్గోలు రేపి. ౪

క. ఈతీర్మానము భారత,జాతీయసదస్సుముద్రి సాధింపనినాఁ
డేతాదృశసమజ్యల, కేతేరంజెల్ల దనిరి యెద్రిచినపెద్దల్. ౫

క. చెల్లునని రాష్ట్రసభ కిట,నిల్లిగ్గులఁ దోఁగుబెడఁద యే లని కాంగ్రెస్
తల్లికి మనముందడుగునఁ, బెల్లగునని యేను విన్నవించితి రచ్చన్. ౬

క. అంతట సభ్యులు బహుధా,చింతించిరి పూర్వపక్షసిద్ధాంతములన్
శాంతిమెయిం దీర్చిరి నా,వంతునకే పెక్కుమంది వచ్చిరి తుదకున్. ౭

క. వల్లభుఁడు రాష్ట్రపరిష, ద్వల్లభుఁ డబ్బాసు గాసివడి సహకారం
బొల్లని యీనిర్ణయమును, జెల్లించిరి సేవనప్రసిద్ధుల్ శుద్ధుల్. ౮

వ. ఏత న్నిశ్చయమునందలి మేలుగీళ్లు పరికింప వేయితొమ్మనూటయిర్వదియవ సెప్టెంబరునెలం గాళీఘట్టమున లాలా లజపతిరాయి పెద్దఱికమున భారతజాతీయ మహాసభా ప్రత్యేకసమావేశ మావహిల్లె - నిందుల కుదాత్తసౌకర్యము లనేక మేర్పడియె - బంబయివలన ఖిలాఫత్తువారియుఁ గాంగ్రెసువారియు వెవ్వేఱు పొగబండ్లు వెడలెఁ - బ్రతినిధులయు దిదృక్షువులయు నొత్తడి యేరాళమై కలకత్తానగర ముట్టూఁగఁజాగె -మౌలానా సౌకతాలీకోర్కెపై ధూమశకటమునం దేను సాహాయ్యనిరాకరణ నిర్ణయ ప్రథమాకృతిం దీర్చితి - నగ్గడియదనుక నావ్రాసిన చిత్తుతీర్మానముల శాంతిమ యేతి శబ్దప్రయోగ మొనరింపనైతి నని పల్కంజనుఁ - గాని నావెలువరించు నుపన్యాసములం బెక్కింట దీని సంధించితి - నీ నిరోధమునకుం జెందినపదజాల మస్మదీయాంతరంగమునం దింతవట్టు పాదుకొనకుండె -మహమ్మదీయులుమాత్రమ యిరవుపడ్డ రచ్చలం దీ శాంతిమయం బను సంస్కృతశబ్దమున కెనయగు నురుదూనుడిం బ్రకటింప నోడు చుంటి - నగుటంజేసి మౌలానా యజాదు నే నాశ్రయించుడు నమ్మనీషిమూర్ధన్యుఁడు 'బా-అమన్'అను నుడుగుం దనకుఁబ్రసాదించె - మఱియు నసహకారమునకుం బ్రతి 'తర్క - ఈ - మవాలత్'అని బోధించె - ని క్లేను సాహాయ్యనిరాకరణోద్యమమున కనుకూలించు పరిభాష నురుదూ హిందీ గుజ్జరిబాసలం బరిశీలించుతఱి జాతీయమహాసభ కసహకారనిర్ణయముం దీర్చుపని నాపాలి దాయె - దాని మొదటిచిత్తులో శాంత్యర్థవాచి యగుమాట చేరదయ్యె - నట్టివాయసము నాప్పట్టి నేతెంచు సౌకతాలీ కొసంగి శ్రేష్ఠోద్దునం బొరపాటు నెఱింగితిఁ - దీర్మాన మచ్చుపడకముంద యీతప్పుం దొలఁచి ప్రకటింపు మని యాలీకడకు దేశాయితో వర్తమాన మంపితిఁ - గాని తత్పూర్వమ సలోపముగా నది ముద్రిత మ్మాయె - నాఁటిమాపునంద విషయనిర్ణాయకసభ కూడంగలదు -

కాన నవ్వేళ రాకముందె ముద్రితపత్రములం దెల్ల నుల్ల శాంతిమయ శబ్దముం
జేర్చుట వలసె – సంస్కృతమైన చిత్తుతో మున్ముం దేను సిద్ధపడకున్నా౯
డెన్నని చిక్కులు నాపాలివై యుండెడివి – కాని ౯

మం. చిత్తు రచ్చను జయించిననాఁడు గాక, యగునో కో పండు వి ల్లలికినంతటన
నానిర్ణయము నభినందించువార, లీసభాసదులలో నెంద ఱున్నారో
యెదిరించి నిలుచువా రెంద ఱున్నారో, యధ్యక్షుఁ డేవారి కనుకూలుఁ డౌనో
యేమి కానున్నదో యెఱుఁగ నింతేని, విదుషీమణి బిసెంటు విద్వత్ప్రపంచ
మండనంబై వెల్గు మాలవీయుండు, దేశబాంధవుఁడు మోతీలాలు విజయ
రాఘవాచార్య పురస్సరుల్ వృద్ధ, వీరు లందఱు నేఁడు విడిసి యున్నారు
శూరు లందఱు నేఁడు చొచ్చి యున్నారు, ధీరు లందఱు నేఁడు తెరలుచున్నారు.

సీ. పాంచాలమునకు నేల్బడివా రొనర్చిన, పాపకృత్యము చక్కబడుటకొఱకె
ముస్లిముల్ వెట్టలో మునుఁగ ఖలీఫాకుఁ, గూర్చినబన్నముల్ కూలుకొఱకె
సహాకారవిముఖ మహా సరణి గమ్యం బని, యాడెడితీర్మాన మస్మదీయ
మాచార్యులకుఁ బేదదై చప్పచప్పని, దై యసంతృప్తికి నాలవాల

గీ. మగుట నద్దాని కిద్దాని కని వచింప, నేల ఘోరాపచార మీనేలకున్ స్వ
రాజ్య మీకుంట కానఁ దద్రాజ్యమునకె, వలయు నీయడ్డు భారతీయులకు ననిరి. ౧౧

క. మోతీలా లాచార్యుల, నీతిన్ గొనియాడె నంత నెఱజోదుల వా
గ్రీతిన్ స్వరాజ్యపద మిడి. నాతీర్మానమును మార్చినాఁడను సరగన్. ౧౨

ఆ. నిశిత దీర్ఘ చర్చ నిండినపిమ్మట, నస్మదీయనిర్ణయంబు నెగ్గ
మోతిలాలు మొట్టమొదటివాఁడై నిలం, బడియె నాఁటి తర్కపద్యలోన. ౧౩

క. తీర్మానము సముచిత మని, యోర్మిం బాయక సద స్సహో యన మాఁగం
దోర్ముంలు నటింప నబ్బుధుఁ, డర్మిలిఁ బల్కినవచస్సు లవి నే మఱవన్. ౧౪

గీ. అమ్మహామహుచిత్తంబు ననుసరించి, సవరణల్ కొన్ని వెలసె నిశ్చయమునందుఁ
జిత్తరంజనుమెప్పు లార్జించుపొంటె, మిగుల గాసిల్లె నమ్మేటిమగఁడు నాఁడు. ౧౫

క. దాసునకు నిరాకృతియెడ, నాసక్తి జనించెఁ గాని యద్దానిఁ బ్రిజల్
మోసెదరా భీరుత్వముఁ, ద్రోసెదరా యన్నశంక తొడరెన్ దడమై. ౧౬

క. లాలా లజపతిరాయలు, నీలోకార్చకుఁడు సంశయింపక తమ యీ
కోలుం జూపిరి నాదెస, మే లెంచిరి నాగపురసమీచీనసభన్. ౧౭

గీ. బాలగంగాధరుండు నాఁ డోలగమున, లేమిఁ గనినంత నాదుఃఖ మాముకొనియె
నుత్తమశ్లోకుఁ డాయొజ్జ యుండునేని, కొంకు విడి నాకు దీవనల్ కురియువాఁడు.

గీ. లోకమాన్యుఁడు నాబాట కాఁకసెప్పఁ, గాక నాపాల నది తుష్టికరము కరము
తన్మనీషి వెలార్చు వాదమునఁజేసి, నేర్చికొనువాఁడఁ బ్రిన్నని నేర్మి కొంత. ౧౯

క. మాకున్ మతభేదమ్ములు, రేకెత్తును గాని వానిరీతులు మనురల్
మాకూర్మి యుత్కటం బని, లోకస్తుతుఁ డతఁడు నిచ్చలుం దలఁపించున్. ౨౦

గీ. అకట! యీపల్కులను వ్రాయునపుడు నాదు, ముంగడందోఁచు గురుని కన్మూయుచాయ
వార్తయిది మిత్రుఁడా పటవర్ధనుండు, నాచెవిం జేర్చె వగగూర్చె నడికిరేయి.

క. నాకేడెము తెగి పడె నను, వాకప్పడ వెడలె నాదువాత నవశమై
నాకెలఁకులఁ గలసహచరు, లాకులతన్ మునిఁగి రుగ్రి మాపద యనుచున్. ౨౨

వ. సాహాయ్యనిరాకరణోద్యమం బపు డపుడ రూపుకట్టుటంజేసి దాని కోజస్తేజోదాయకం బగు నాశాసన మక్కర్మయోగీంద్రువలనం బొలుతెంచు నని యెదురుతెన్నులునూచు నేను దుదకిట్లైతి — బాలగంగాధరుఁడు సజీవుఁడై యుండునేనియీనిరోధముపట్ల నమ్మహామహునాశయం బెట్లుండు నయ్యది దైవంబ యెఱుఁగుఁ — గాని యానాఁడు కాళీఘట్టమునందలి యెల్లగుండియపైఁ గొండ వ్రాలె ననంజను — జాతీయచరితం దలయెత్తిన క్లిష్టదశ నమ్మేటియుపదేశంబు దేశమునకుం గఱవగుట యందఱకుం గుందు గూర్చె. ౨౩

* * *

౪౩. నాగపురమున

క. కోలఁది యిడరానిపజతో, వెలగల కాంగ్రెస్సు చిలువవీటన్ వెలసెన్
గలకత్తానిర్ణయ మది, బలపడు నీ నాగపురసభారంగమునన్. ౧

క. ప్రతిభూసంఖ్యకు నాఁడొక, మితి లేనికతాన మాతృమేదిన్యార్తి
క్షతిఁ గోరుచు విచ్చేసిరి, వితతాత్ములు పదియునాల్గువేల సదస్యుల్. ౨

క. లాలాలజపతిపల్కున, కౌలెమ్మని దాసుమాట కాదర మిడి వి
ద్యాలయములతీర్మానము, పోలన్ సవరించి రచ్చపొంగులు గంటిన్. ౩

వ. కొట్టకొసకు వాదప్రతివాదంబు లుడిగినవెన్క సహింసాబద్ధమగు సాహాయ్యనిరాకరణ నిర్ణయం బెల్లర యురరీకృతిం బడసె — నేతన్మహాసభకు విజయరాఘవాచార్యు లధ్యక్షపాదులై నిల్చిరి — నిరాకరణప్రస్తావమైనపదంపడి కాంగ్రెసునియమావళిం దిద్దుబెట్టనుచర్చ యారబ్ధమాయె — నిప్పట్ల నాకావించినచిత్తుఁ బరిషత్తుముం దునిచితి — మహాసభకుఁ బదునైదు వందల ప్రతిభువు లున్నం జాలునని యేను సూచింప నిర్ణేతృమండలి యాఱువేల

మంది వలయునని తేల్చె–నిది ముంజూపులేనిపని యని యానాఁ డేను భావించితి– నీతలంపు నేఁటికే నట్లయున్నయది–మంది హెచ్చుటంజేసి కార్యక్రమంబు చక్క సాగునని, ప్రజాస్వామ్య మపుడు సార్థకం బగుననియూహించుట భ్రాంతి యని పల్క [నోర్తు–స్వయంసృష్టులగు ప్రతినిధు లాఱువే లుంటకంటె నుదారాశయులు ప్రజాధికారధూర్వహులు, లక్ష్యభూతులు నగు వారు పదేనువంద లున్న నాఁడు ప్రజాతంత్ర మవిచ్ఛిన్నముగా సాగు–దానిం బూనుటకుఁ బ్రజలయం దారిమయు నాత్మగౌరవమును, స్వతంత్రతయు నేర్పాటు వలయు–నుత్తమాచారులు, సత్యారాధకు లగువార తమపూఁటకాఁపులుగా నుండునట్లు దేశీయులు కనుగల్గి యునికి వలయు – సంఖ్యావ్యామోహ మున్నదే నాఱువే లనుగ్రీతగీయం బనియేమి – యెన్నివేలకైనం దా వోసఁగవచ్చు – నయ్యది యట్లుండె. ౪

మ. జాతీయపరిషత్తు సాగించుపనుల, దేశంబునకు స్వేచ్ఛ దెచ్చుట యొకటి
పెత్తనం బబ్బినపిదప నిప్పుడమి, సామ్రాజ్యభాగమై సరితూఁగవచ్చు
వలయుచో వేర్పడవచ్చు నెడ్డేని, నేమ మీరీతి నిర్ణీతమై యుండ
మదనమోహనుడు ధీమన్మాళి నేఁడు, సర్వస్వతంత్రత చనదు నాఁ దొడఁగె
నతనికి జిన్నా సహాయుఁడై నిలిచె, నొక రిద్దఱే దీని కొప్పిరి గాని
ప్రతినిధుల్ పెక్కు రీబాట కాదనిరి, సత్యంబు వదలక శాంతి గోల్పోక
సాధింపఁదగు స్వరాజ్యము నన్నసూత్ర, మక్కఱలేదు పొమ్మని రంతఁ గొంద
ఱాధార మీధర్మ మనియె నోలగము, హిందువుల్ ముస్లిము లేకీభవింప
మాలమాదిగలపై మన్ననఁ జూప, రహాటలక్ష్మీ సమర్చాదీక్షఁబూనఁ
దగువిధుల్ వెడలె నత్తఱి మహాసభను, నిర్భరోత్సాహమ్ము నిండఁ గొల్వనను.

క. ఆగంటనుండి కాంగ్రెసు, లోఁ గలహిందువులు ధర్మలుబ్ధాశయులై
సాగిరి జనపదములకున్, మూఁగిరి యస్పృశ్యతాసముద్ధతి నార్పన్. ౬

క. ఆనాఁటినుండి రాటపు, గానంబులు పెంచి నించి కాంగ్రెసువారల్
దీనులకుం గొటగొటమను, ప్రాణంబులు నిల్పి రాప్తబంధువు లగుచున్. ౭

గీ. ఆగడియనుండి తోడుపాటూఁగి ప్రభుతఁ, గేరడింపఁగఁ దెగిరి కాంగ్రెస్సువారు
తిరుగుపాటిది తనకు నుద్దీప్తి నొసఁగ, ముమ్మరించె ఖిలాఫత్తు మొగ్గరంబు. ౮

క. హిందువులకు ముస్లిములకుఁ, బొందిక లానాఁడు మూరిఁబోయెను గాంగ్రెస్
సంధించినపనులం దభి, నందింపఁగఁదగిన దిది యనంగలవాఁడన్. ౯

* * *

స్వస్తి

గీ. ఏతదాత్మకథాసృష్టి కిపుడు నేను,స్వస్తి పల్కుముహూర్త మాసన్న మయ్యె
నస్మదీయను జీవనయాత్ర నింక,నన్యు లెఱుఁగనిగాథ కాసంత లేదు. ౧

వ. అదియుం గాక వేయితొమ్మన్నూట యిరువదియొండగు వత్సరముండొట్టి
కాంగ్రెసుపెద్దలతో నోతప్రోతమ్ముగాఁ బెనఁగంబడి యేను బ్రజాసేవ గావించిన
వాఁడ- నాఁటఁగోలె నాబ్రతుకువందలి దేలేశ మందుకొన్నఁ దన్మహారథులతోడి
పొత్తు వెలార్చుట తప్పనిపనియగు - దానిచేరిక లేనిశ్వాయసము యథార్థరచన
కాఁజాలదు - కాంగ్రెసునాయకులకుం దనకు నేర్పడ్డచుట్టఱికము లింతపట్టు
ప్రాఁబడవాయె - శ్రద్ధానందస్వామి చిత్తరంజనదాసు లాలాలజపతిరాయి
హాకీంసాహెబు మన కీనాఁడు దవ్వయినను భగవ దనుకంపకతనం బ్రజానేతలు
పెక్కండ్రు కలరు - జాతీయమహాసభా చరిత్రమునఁ బరిణామమ్ములు పెల్లు
వాటిల్లినమాట నిక్కంబ - కాని యవి యింతదనుకఁ దిరపడవయ్యె - నేడేండ్ల
నుండి నా కావించు ప్రధానప్రయోగము లన్నియు నేతన్మహాపరిష త్పక్షము
నన ప్రవర్తిల్లెఁ - గానఁ దద్విశేషములం దెలుపునెడ నాకును గఱువలకును గల
బాంధవముం బ్రకటింపఁదగు - నౌచిత్యమును బాటించి దీనిజోలి కిపు డే నేగ
నొల్ల - వెండియు నేఁడు కావించుప్రయోగము లస్మద్దృష్టిలో సిద్ధాంతములు
కాఁజాలవు - కావుటంజేసి ౨

క. ఈకృతి నీక విరమించుట, నాకృత్యం బని తలంచినాఁడను బయనం
బాఁకట్టఁదగుఁ జుమా యని, నాకల మెచరింప సాగినది పలుమాఱున్. ౩

క. ఇన్నాళ్ళనుండి మత్కథ, మన్నించి పఠించు బుద్ధిమంతులతో నేఁ
డన్నలు! సెలవిం డిఁక నను, చు న్నుడువుట కేను మిగుల సుఖ్రక్కంబడుదున్. ౪

క. వెలకట్టరాని దని నా, తలఁపునకున్ మత్ప్రయోగతతి కన్పట్టున్
దెలివిన్ వానియథార్థము, పలికితినో లేదొ యంతుపట్టదు నాకున్. ౫

క. తెరచాటునఁ బెట్టక నా, పరికించినగుట్టు బట్టబయ లగురీతిన్
విరచించినాఁడ నేత, చ్చరితం బని పల్కనోర్తు సవినయఫణితిన్. ౬

క. ఏ తెరువున నేరూపునఁ, జూతున్ సత్యమును దానిచొ ప్పంతయు నేఁ
డా తెరువున నారూపున, నేతత్కృతిఁ బల్క నుత్సహించితి సతమున్. ౭

గీ. సత్యమునకు సహింప కాసత్తు లగుదు, రన్నవిశ్వాస మొదవుట నస్మదీయ
మీప్రయోగచరిత్రంబునిడితి నాదు,చదువరులముందు మచ్చిత్తశాంతి వెరుఁగ.

వ. సత్యంబ కాక లోకంబు నేలువేల్పు వేఱొండు కలఁడని వక్కాణింప నాయను
భూతి సైఁపంజాలదు – దానిం గాన వలచువాని కహింసయ రాచబాట యని
యూహాత్తమునం దెల్ల పొరటయు నిర్ధరింప నేరనినాఁడు నాకావించినచేత యిది
రిత్తకురిత్త యని యెంతు – నాజతనం బెల్ల నాఱడియగుంగాక నానిర్ణయం బట్లు
కాఁబోవ – దింత చెప్పితిఁ గాని నాపరమవ్రతం బగునహింస నేఁటిదనుకఁ బరి
పాకముం బడయక సమగ్రింబు గాక యున్నయది – కాన ౯

క. ఇన్నాళ్ళంగొలె నెనోన్న, బన్నంబుల నుగ్రతరతపస్సుల నా క
న్గొన్నయది సత్యభాస్కరు, సన్నని వెల్గొకఁడ యనెద జగమున్బ్రోలన్. ౧౦

ఆ. ఏమి చెప్పవాఁడ నీసత్యఖద్యోతు, వెలువరించు వెలఁదివెలుఁగుఁగూర్చి
మనకు గోచరించుమార్తాండు లొకలక్ష, కూడుకొన్న దాని కీడు గారు. ౧౧

గీ. నరుఁ డహింసాతపశ్చర్య విరిసి పండి, నపుడె సంపూర్ణ సత్యంబు నంద నేర్చుఁ
బెద్దకాలంబు వెదకినపిదపసైత, మిట్లు వాకృత్తు నభిమాన మింత లేక. ౧౨

ఆ. ఎల్లయెడల నిండి యేపారు సత్యనా, రాయణుని గనంగ నాస్థ యున్నఁ
దన్ను గారవించుకొన్నట్లు ప్రేమింప, వలయు సర్వభూతముల జనుండు. ౧౩

మం. సత్యసందర్శ నాసక్తి పైకొన్న, మనుజుండు విశ్వంపుమనుగడలోని
యేరంగమునకైన నెడమొగం బిడఁడు, దవ్వులన్ నిలువఁ డేదారికైన
నగుటన రాజకీయక్షేత్రమునకు, నన్ను నాకర్షించినది సత్యభక్తి. ౧౪

క. మతమునకు రాజనీతికి, ఘృతికలియ దటంచుఁ గొందఱు వచించెద రా
గతిఁ బల్కువారికిన్ మత, మతి శూన్యం బనెదఁ గొంకుమానెద నిచటన్. ౧౫

ఆ. మదివెలందిలేని మనిసి తన్నుంబలె, నితరభూతముల సమీక్షఁ గోఁడు
నది కొఱంతపడ్డయతఁ డహింసాభరం, బూనలేఁడు ముక్తిఁ గానలేఁడు. ౧౬

వ. ఆత్మనైర్మల్యంబు నా జీవితరంగమునం దెల్ల దెసలుం బ్రసన్నము లగుట యని
వక్కాణింతు – నేవాని కీపావిత్ర్యము సమగ్రంబుగా నొదవు వానివెలుఁగునం
జేసి పరిసరము లన్నియుం గామక పరిశుద్ధమ్ములగుఁ – గాన నివ్వెలంది తెమ్మెర
పోలె సర్వవ్యాపి యనం జను – నీశుద్ధిమార్గ మేటవాలుగా లేక యేడూకమ్ముక
నట్లు నిట్టనిలువుగా నుంట నధిరోహణం బంతలంతల వసపడం జాలదు – నైర్మ
ల్యముం బడయవలె నన్న మనోవాక్కాయముల నిర్వికారత గుబాళింప వలయు –
రాగద్వేషాదిద్వంద్వముల కవ్వల నిలుపం గలనేర్పు చేపడ వలయు – నిన్నాళ్ళ
నుండి యెంతబెడిదంబుగా శ్రమించిన నేమి యిందనుక నాకుం ద్రికరణశుద్ధి
నిండారలే దని యెఱుంగుదు – నగుటం జేసియ లోకంబు న న్నభినందించుపట్ల
నుత్సాహముం బడవక నొగులుం గుడుతు – మఱియు ౧౭

క. కత్తులతోఁ బోరాడి జ, గత్తును లోఁగొనుటకంటెఁ గట్టరిది కదా
చిత్తమును మానిసి నిజా, యత్తముఁ గావించుకొంట యని భావింతున్. ౧౮.

క. మాతృమహీమండలమున, కేతెంచినవెన్కసైత మే సిగ్గిలుదున్
నా తెలియనివికృతులు మ, చ్చేతస్సున డాఁగియున్నచిన్నెలు కనుచున్. ౧౯


క. అగుఁగాక పిఱికితనమున, కగపడకున్నాఁడ సంతతాభ్యాసమునన్
దెగకుండునె విభ్రాంతులు, మగతన మంతంత హెచ్చి మల్లడిపెట్టన్. ౨౦

క. నిక్కంబు నోరయుపనిలో, నెక్కుడు తనిసనితిఁ గాని హేరాళాగ్నుల్
క్రిక్కిడితెరు వున్నది ముం, దక్కతనన్ శూన్యభావ మది హెచ్చవలెన్. ౨౧.

ఆ. ఎన్నిమెఱుఁగు లున్న నన్నిటికంటె నే, నల్లఁతివాఁడ నన్న తెలివి నరున
కబ్బ దెంతదాఁక నందాఁక వానికిఁ, జిక్కఁబోదు ముక్తి దక్కఁబోదు. ౨౨

క. ఈ వినయప్రాప్తికిఁ బర,మావధి నాఁ దగు నహింస; యవ్వినయము లే
కేవాఁడును ముక్తుఁడుగాఁ, డీవాకున కనుభవంబ హేతూద్ఘ మగున్. ౨౩

క. ఏతాదృగ్వినయమునకు, జోతలు చెల్లింతు నిట్టిసుగుణము నేలన్
జూతునుజగదాదృతి; నీ, చేఁత నిఁకన్ నిలిపి స్వస్తిసెప్పెద నెలమిన్. ౨౪



*   *   *   *

క. నీపల్కులు విశ్వతమో
దీపంబు లఖండసత్యధీ రూపంబుల్
నాపల్కుల నిడి నేఁటికి
బాపూజీ ! శాంతిపట్టభద్రుఁడ నైతిన్.

ఉ. ముప్పదియేండ్లనుండి తృణమో కణమో తినుచున్నవాఁడ నో
యప్ప ! భవద్వచోవిభవ; మన్యుఁ డెఱుంగకపోవుఁ గాక యీ
యప్పు భరింపరానిబరువై నిను నచ్చపుఁ దెల్గుబాస నీ
చొప్పునఁ దీర్చుకొందు ఋణశుద్ధి కిదే సరిపుచ్చుకొందువా ?

ఉ. కా దని పట్టుపట్టెదవుగాక మదిన్ నెఱనేర్పులేని యీ
పేద నిరంతరోగపరిపీడల డస్సి నలంతి ప్రాయపుం
బాదులు నైతమున్ గదలఁబాఱి నతం డెది సేయనోపుఁ దం
డ్రీ ! దయఁజూడు మిప్పటి కిదే పదివేలుగ; దోయిలించెదన్,

వికృతి పుష్య బ 3 శుక్రవారము
౧౯౫౧ జనవరి ౨౬

అభినవతిక్కన
తుమ్మల సీతారామమూర్తి చౌదరి

సవరణలు

పుట	పద్యము	తప్పు	ఒప్పు
౬	౩౩	స్రాజ	డ్రాజ్జ
,,	౩౫	బుత్తోకి	బుత్తోక్తి
౧౯	౩౯	దేయము	ద్దేయము
౨౦	౧౧	క్రాజబంతి	క్రాజ్జబంతి
౨౪	౩	నాకసాక్ష్యం	నాకసాధ్యంబ-
౨౭	౩౧	యేట	యేఁట (ఇట్లుసర్వత్ర)
౨౮	౪	న్రాజ	న్రాజ్జ
౩౦	౨౫	కన్య	కన్యఁ
౩౩	౧౭	మిచు	మించు
౩౯	౩	నావతి	నావంత
౪౧	౯	ఉప్రద	ఉప్పద
౪౨	౧౩	శుచి	శుచిత
౫౮	౧౪	నాలె	నాతని
౬౨	౫	కర్జమువ్న	కర్జమున్న
౬౪	౬	యదితి	యందితి
౬౭	౪	కార్మిక	కార్మ్యక
౬౯	౧౭	వక	వక్త
౭౪	౪	మోహానము	మోహాము
౯౨	౯	బ్రిమించె	భ్రమించె
,,	౧౩	సమ్మ్రదమగి	సమ్మ్రదమంది
౧౦౨	౧౧	కాఁపు	కాపు
౧౦౬	౧౯	యూరేయి	నారేయి
౧౩౩	౩౭	నిపటకి	నిచటికి
౧౩౪	౯	దోచినను	దోఁచినను
౧౩౮	౬	నాట	నాట్య
౧౪౬	౧౯	ప్రంగము	ప్రసంగము
౧౫౦	౧౩	నొసగ	నొసఁగ
,,	౧౪	రేగా	రేఁగా
౧౫౪	౧౦	తడబడి	తడఁబడి
౧౫౯	౨౪	చనుఁచు	చనుచు
౧౬౧	౧౯	నిల్పిఁ	నిల్పి
౧౭౬	౫	గంటిని	గంటివి
౧౮౧	౭	చన్న	జన్న
౧౮౩	౧౫	నాకొరితుఁడనె	నాకొరితుఁడనై
౧౯౩	౪౩	వావాకిధి	వాచాకిధి
౧౯౬	౮	యోగరోల	యోగమేల
౧౯౭	౨౪	బత్న్యయు	బ్రిత్న్యాయు
౨౦౨	౮	విచ్వ	విచ్వ

౨౦౭	౧౬	తోడగిన	తోఁడగిన
,,	౧౯	వినుడీ	వినుఁడీ
౨౧౧	౧౧	మెఱుగుటు	మెఱుఁగుట
౨౧౨	౨౮	గ్రుడ్వి	గ్రుడ్డి
౨౧౬	౧౯	నుఁగ్గడువు	నుగ్గడువు
౨౨౪	౧౨	వాఁకిలి	వాకిలి
౨౨౯	౧౫	నంచుఁ	నంచు
౨౩౪	౧౮	మేఁచి	మేచి
౨౪౨	౮	వానికోస	వానికోస
౨౫౦	౨౩	మానిసులకు	మానుసులకు
౨౫౨	౬	కుఱ	కుఱ్ఱ
౨౫౪	౧౭	నజూనజయి	నజ్జునజ్జయి
౨౫౭	౨౧	పవిత్రి	బవిత్రి
౨౫౯	౧౩	జారు	జాఱు
౨౬౯	౧	మెఱుగు	మెఱుఁగు
౨౭౦	౩	వ్రేగగు	వ్రేఁగగు
౨౭౨	౨	నాఁగాముల	నోగాముల
౨౯౩	౧౭	నాఁటి	నాటి
౨౯౮	౧౯	వానివియ	వానికవియ
౩౦౫	౨౬	కనక	జనక
౩౦౭	౭	సేవా	సేవా
౩౧౦	౩౩	లుఱ్ఱాత	లుఱ్ఱాఁత
౩౧౩	౨౧	సాగితి	సాగితిఁ
౩౧౮	౨౯	గోట్టువా	గోట్టువారి
౩౨౨	౨	సభికుఁడుఁ	సభికుఁడు
౩౩౫	౬	నాశ్రిమమునం	నాశ్రిమమునకుం
౩౫౨	౫౧	వరనర	నరనర
౩౫౮	౭	య్యాయం	యయ్యాం
౩౬౧	౨౩	గుబ్బి	గుబ్బ
౩౬౭	౧౬	మన్మవ	మన్మన
౩౭౩	౫	బాగున	బాగునఁ
౩౭౫	౨౧	యిక	యిఁక

మఱికొన్ని సామాన్యములు విడువంబడె.